
తాళ్ళపాక చిన్నన్న

# సాహిత్య సమీక్ష




డా॥ యస్.టి.వి.
రాజగోపాలాచార్యులు

# తాళ్ళపాక చిన్నన్న సాహిత్య సమీక్ష



This book is Published with the Financial Assistance of
Sri Tirumala Tirupathi Devasthanams
under their scheme Aid to
Publish Religious books

రచయిత :

డాక్టర్ శ్రీమత్తిరుమల వెంకట రాజగోపాలాచార్య
ఎం. ఏ., పి.హెచ్.డి.

తెలుగు ఉపన్యాసకులు; కె. బి. జె. (మూర్తిరాజు) కాలేజి
భీమవరం - 534 202; ప॥గో॥ జిల్లా. (ఆం॥ ప్ర॥)

# Tallapaka Chinnanna Sahitya Sameeksha

By Dr. S. T. V. Rajagopalacharyulu
Thesis approved for the Ph. D. Degree
by the Andhra University - Waltair.

ప్రథమ ముద్రణము : జూన్. 1992

ప్రతులు : 1000

సర్వ స్వామ్యములు రచయితవి

ముఖ చిత్రం : శ్రీ పట్నాల భాస్కర్-భీమవరం

మూల్యము : రూ॥ 75/-

A/c No. 50579

Date

TIRUPATI.

ప్రతులకు : **Mrs. S. T. RADHA**
H. No. 27-17-45; "SRINIVASA BHARATHI"
Nagendra Road. A. S. R. Nagar,
BHIMAVARAM - 534 202 [A. P.]

ముద్రణ :

ఫోన్ : 2934
ఆదర్శ ప్రింటర్స్ & పబ్లిషర్స్,
భీమవరం — 534 201.



పితృదేవులకు నమస్సుమాంజలి

శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్షా గ్రంథకర్త

## కీ॥ శే॥ శ్రీమత్తిరుమల వెంకట శ్రీనివాసా చార్యులుగారు

శ్లో॥ శ్రీమత్తిర్మల రాఘవార్య హృదయాంభోరాశి రాకా శశిమ్
ప్రజ్ఞానాంబర భాస్కరం శుభకరం వాత్సల్య వారాన్నిధిం
శ్రీమద్భారత గర్భతత్త్వ విలసద్విజ్ఞాన సంపత్కరం
సేవేఽస్మద్గురులోక రత్నమకుటం శ్రీ శ్రీనివాసం సదా॥

## అంకితం:



సీ॥ తొలి తెల్గు మిసిమికై తల దోచి తలయాప
జేయు ప్రసన్న సుమాయుధుండు
దేశ దేశాలలో తెల్గు తీయదనంబు
తెల్లంబొనర్చు జాతీయ గురుడు
స్వగృహంబునను సుధీజనులతో రసచర్చ
జరుపు సాహిత్య నిర్ఝర విభుండు
పరిశోధక ఛాత్ర వర కోటిదీర్చు
సాహిత్య పౌరోహిత్య కృత్యచణుడు
అందరకు మేలొనర్చు దయార్ద్ర గుణుడు
యస్వియే గాదు దివ్య మనస్వి యతడు
నిత్య హితుడు జోగారాయ నిర్మలునకు
అంకితం బిత్తు గ్రంథంబు నతుల భక్తి ॥

— రాజగోపాలాచార్యులు

**Prof S. V. JOGA RAO,**
(M.A., Ph.D; Hon. D. Litt A.U. & U.S.A.)
National Professor of Telugu,
U. G. C. Emeritus Fellow
Andhra University,
National Sahity Akademi Awardee.

VISAKHAPATNAM

Date : 1 5-1992

# సహృదయ భూమిక

ఇతడచ్చముగా నా ప్రియ శిష్యుడు. అంతర్వాణి వరేణ్యుడు. సహృదయుడు. ఇతని ఈ డాక్టరు పట్ట పరిశోధన నిబంధమునకు విషయ నిర్దేశకుడను, దేశికుడను అయిన నేను ఈ గ్రంథము అచ్చుపడుతున్నదంటే ముచ్చటపడుచున్నాను,

విషయమెంత విలువైనదంటే అన్నమాచార్యులవారి పౌత్రుడైన తాళ్ళపాక చిన్నన్న తెలుగులో సంతరించిన విశిష్ట సాహిత్యం ఆయన వ్రాసిన ఆ విషయాల గురించి అతఃపూర్వము తెలుగులో ఎవరూ వ్రాసినట్లు లేదు. ఆ భాష, ఆ రచన, ఆ శైలి, ఆంధ్ర వాగ్దేవికి వింజామరములు వీచినవి. ఆ రచనలో ఆనాటి అనేక సామాజిక పరిస్థితులను అపోశనము పట్టినాడు. అతని గ్రంథజాలము జాలమంతా అత్యమూల్యమైనది.

ఏతాదృశమైన మహా వాఙ్మయమునకు ఏతామెత్తినట్లు డా॥ చి॥ యస్. టి. వి. రాజగోపాలాచార్యులు క్షోదక్షమమైన పరిశ్రమము చేసి రూపొందించిన ప్రౌఢనిబంధ మీ గ్రంథము. ప్రణాళిక పటిష్ఠముగా నున్నది. రచన సర్వత్ర చతురస్రము. ఇతడిప్పటికే అమూల్యములైన అనేక గ్రంథములను సంతరించినాడు. వ్యాసంగ శీలి కావున ఇంకను అమూల్య రచనలనేకము సంతరింపగలడను నమ్మకము నాకున్నది.

తథాస్తు

ఇట్లు
ఉపాధ్యాయుడు,
(సం) యస్వీ జోగారావు

# ADJUDICATORS REPORTS ON THE Ph. D., THESIS

## "Tallapaka Chinnanna Sahithya Sameeksha"

The thesis gives a very detailed assessment on the works of Tallapaka Chinnanna.... each of the four works are very elaborate in assessing the value of the works. The critical review on all the four works goes on the lines of theme, Characterisation, treatment of Rasa. Narrational beauty, Language and Style and the application of Alankaras. Thus the works have been critically examined in the light of traditional school of Poetics and as a result, the aesthetic beauty has been systematically presented. This proves the scholarship and the research ability of the scholar It appears from the analysis on each work that the treatment of the following items are praise - worthy...

Examining the theme in 'Asthamahishi Kalyanam'. exhibiting the characterisation in 'Usha Kalyanam'. Presenting the Philosophical back ground in 'Paramayogivilasam'. Analysing the Combination of historical aspects and poetics in 'Annamacharay Charitra' The personality of Chinnanna and his place among poets are thoroughly discussed in the last two chapters and they are informative.

The appendixes are appropriate and they give extra relevant information about the poet. Lastly, the style of writing the thesis is conventional and chaste. On the whole the research is satisfactory....

I have gone through the thesis "Talapaka Chinnanna Sahitya Sameeksha" submitted for the

award of Ph. D. Degree of Andhra University. Tallapaka poets have a prominent role in Telugu'Literature. Several scholars are doing research on their works, and bringing out the significant literary and spiritual values contained therein. This thesis is one such research work — Tallapaka Chinnanna the grand son of the great saint poet Annamacharya has a unique place in Tallapaka poets, due to his scholarship and knowledge of various arts and sasthras. The candidate made a detailed analytical study of Chinnanna's literary works and this thesis forms a good contribution to the critical work on Tallapaka poets.

The Ist chapter deals with the place of Tallapaka poets in Telugu Literature and the prominent place of Chinnanna in the Tallapaka dynasty. The chronological order of his four works has been decided. Subsequently the researcher divided his thesis mainly into four parts, each part dealing with one of the works of the poet. The plot and theme of the work, characterisation, depiction and manifestation of Rasa, the imagery, style and language of the four works are studies in detail. At the end a list of the idioms and proverbs, names of various food preparations, names of places etc mentioned in these four works is given. This would be of great use, The style and language used in the thesis are on the whole satisfactory....

ప్రజా వాఙ్మయమునకు ప్రవాహికగా ప్రసిద్ధి కెక్కిన "ద్విపద" చిన్నన్న చేతిలో సిద్ధి చెందింది. ఆంధ్ర వాఙ్మయమునకు అనుపమాన సేవ చేసిన తాళ్ళపాక వంశమునకు చెందిన చిన్నన్న వ్యక్తిత్వము— అతనికి సాహిత్యములో గల స్థానము నిరూపించుచు శ్రీ రాజగోపాలాచార్యులు

వ్రాసిన సవిస్తర పరిశోధన వ్యాసంగము పండితులకు పామరుకు ఉప యుక్తము కాగలదు.

తాళ్ళపాక కవి కుటుంబము - అష్టమహిషీ కళ్యాణ సమీక్ష-ఉషా కళ్యాణ సమీక్ష - పరమ యోగి విలాస సమీక్ష-అన్నమాచార్య చరిత్ర సమీక్ష శీర్షికలు సాకల్యములు-సమగ్రములు, అట్లా- ఇతివృత్త నిర్వహణము-పాత్ర చిత్రణము-రసపోషణము-వర్ణనలు కల్పనలు-భాష శైలి-అలంకారములు చమత్కారములు ప్రౌఢ విశ్లేషణతో-హృదయంగమములు. ఈ పరిశోధనకు 'చిన్నన్న కృతులు-అనర్ఘరత్నములు, గ్రంథ పాతములు, జాతీయములు, సామెతలు, నానుడులు అను అనుబంధాలవన్నె చేహూర్చినవి.

శ్రీరాజగోపాలాచార్యులు చేసిన పరిశోధనలో సంప్రదాయ సరళి - ఆధునిక వైజ్ఞానిక దృక్పథము గంగా యమునలవలె సంగమించినవి.

తాళ్ళపాక వంశమును గూర్చి-చిన్నన్న సమకాలీన సమాజమును గూర్చి సమగ్ర విజ్ఞానముతో బాటు ద్విపద వాఙ్మయ క్రమ పరిణామ వికాసము ఇందు కాననగును.

ఈ రచనకు - ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారు డాక్టరేటు పట్టా ప్రదానము చేయుట సమంజసము.

డా॥ నండూరి రామకృష్ణమాచార్య
అధ్యక్షుడు : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం,
సచివాలయం, హైదరాబాద్.

S. T. V. RAGHAVACHARYA
M. A. M. Ed.
English Poet & Philosopher.

TANUKU
W. G. Dt. (A.P.)

# PLEASURE

Solution is not the disappearance of the self but its release from the limiting barriers. However high a man may rise, there will always be an almighty power without worshipping which none can escape from the state of Samsara. To-day the world is gloating over the fancies and irrational activities, ignorantly sinking deep into the Sea of Samsara. There is a highest need to detect the techniques preserved by the philosophers and saints in their theories to save humanity from utter anhillation and fall to the state of stone. Simple appreciation of philosophical theories is not enough, a critical understanding and following is a must.

One should realise first that the real can not be a bare identity but an identity in and through the difference. This identity and difference are well interwoven in the works of Tallapaka Chinnanna. But How? is a problem to be solved by an impartial critic. Else the greatmen of the past ever remain silent in their invisible tents and their views lie burrried in their works.

It is a 'pleasure' for the present Literary world to admire Dr. S. T. V Rajagopalacharyulu as a true critic for his effort in exposing the diversified talents of Chinnanna through his four works Astamahishi Kalyanam, Usha Kalyanam, Paramayogi Vilasam and Annamacharya Charitham.

Thus he proved a true devotee by analysing a Devotee as Devotee is greater than the people of the Three worlds or even God.

(Sd/.) S. T. V. Raghavacharyulu

శ్రీరామ

# చిన్న (న్న) మాట !

"కవిః కరోతి కావ్యాని లాలయన్త్యుత్తమా జనాః
తరుః ప్రసూతే పుష్పాణి మరుద్వహతి సౌరభమ్"

"ఎక్కడిదీధ్వని ? ఎవరువారు ? ఆఁ ! తాళ్ళపాక చిన్నన్న కవీంద్రులా ? పై శ్లోకాన్ని చదువుతూ వస్తున్నట్టున్నారే ? మీ ముఖంలో ఏదో ఆనందం తాండవం చేస్తోంది ! కారణం ఏమిటండీ ?"

"ఆఁ ! ఏమంటున్నారు ! మీ ద్విపదకృతులపై ఎన్నో సమీక్ష గ్రంథాలు వచ్చినందుకా ? ఇది విశిష్ట పరిశోధన గ్రంథంగా వెలువడుతున్నందుకా ?"

"అవునవును, నాదీ, పరిశోధన గ్రంథ రచయితదీ ఇద్దరిదీ 'శ్రీనివాస భారతే' నటగా !"

"బాగుందండీ ! శ్లేష. అంతేకాదు, వీరు ఏర్పరచిన సంస్థ కూడ 'శ్రీనివాస భారతే' ! ఎన్నో గ్రంథాల ప్రచురణలో, సాహిత్య సభల నిర్వహణలో ఇది నిజంగా భారతికెత్తిన అక్షరహారతే ! వీరి ప్రచురణ కార్యక్రమాల్లో మణిపూస వీరి నాన్నగారి రచన "శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష" కృతే !"

"అలాగా, నా కావ్యాల్లో ఉన్న 'రాజగోపాలుని' ఉన్నత తత్త్వాన్ని చక్కగా వ్యక్తీకరించి సార్థక నామధేయులైనట్లున్నారు!"

"నిజమే మీరన్నది ! వీరి తిరుమల వంశం కూడ మీ తాళ్ళపాక వంశంలాగానే 'ఆడిన మాటెల్ల అమృతకావ్యముగ, పాడిన పాటెల్ల పరమ గానంగా'నే సాగుతోంది సాహిత్య విషయంలో."

"ఓహో ! అలాగా, వీరి పరిశోధన ప్రబంధం చూశాగా ! నా కావ్య సమీక్ష లన్నింటిలోనూ దాదాపుగా వీరి రచనాప్రణాళిక ఒకటే అయినా, ఒక కావ్యసమీక్షలో చెప్పిన నిర్వచన వివరణను ఇంకో కావ్య సమీక్షలో సాధ్యమైనంతవరకు చెప్పకుండా జాగ్రత్తపడ్డారనుకుంటాను."

"నిజమే ! పింగళి సూరనగారన్నట్లుగా "పునరుక్తి దోషంబు పొంత పోక" అన్నట్లుగా వ్రాసారు."

"మరోమాట ! పరమయోగి విలాస సమీక్షలో ఇతివృత్త నిర్వహణంలో కేవలం ఆళ్వారుల కథలను చెప్పడం కాక వాటిని మూలంతో పోల్చి ఔచిత్య విచారం చేయడం ఎంతో ఉదాత్తంగా ఉంది."

"నేనోమాట చెప్పమంటారా ! మిమ్మల్ని పాలకురికి సోమన, గోన బుద్ధారెడ్డి,, గౌరనలతో పోల్చేటప్పుడు విషయానికే ప్రాధాన్యం ఇస్తూ ఎంత నిర్మమత్వాన్ని పాటించారో గమనించారా ?"

"ఆఁ ! ఆఁ ! 'అష్టమహిషీ కళ్యాణ' కృతి సమీక్షలో నన్ను పోతన మహాకవితో పోల్చడం నాకు చాల ఆనందం అనిపించింది సుమా ! భాగవత రుక్మిణి కున్నంత మాటకారితనం నా రుక్మిణికి లేదట ! నా హృదయాన్ని ఎంత చిక్కగా పట్టుకొన్నారీయన ? ఇదీ నిజమైన విమర్శ అంటే !"

"ఎవరో ఆధునిక కవి అన్నారులెండి 'విమర్శకుడు అత్తలాంటి వాడ'ని. ఈయన అటువంటివారంటారా !"

"చెప్పే విషయం తగిన ప్రమాణాలతో సమంజసంగా ఉంటే విమర్శకుడు అత్తలాంటివాడైనా నష్టంలేదు."

"మరే, మరే ! ఈయన పరిశీలనారీతి ఎంతటిదనుకుంటున్నారు ! మీ అష్టమహిషీ కళ్యాణ కృతిలో కృష్ణుడు పూతన పాలుత్రాగే ఘట్టంలోని "అమృతాంశు కులభవుండగు శౌరిరాత్రి...." అన్న ద్విపదలో పదప్రయోగ కౌశలాన్ని ఎంతో చక్కగా వివరించారు."

"ఇలా వివరించడమే కాదు ! ఈ పరిశోధన గ్రంథంలోని భాష మధ్యమధ్యలో 'హుంషారుగా గూడ సాగింది. ఉదాహరణకు :- పరమయోగి విలాసంలో నేను చేసిన వసంతవర్ణన వైవిధ్యాన్ని చెబుతూ 'వసంత కుసుమాకరం' అన్నారు. మరోచోట 'కవి కర్ణరసాయనం' అన్న పదాన్ని వాడారు. ఇంకోచోట మా సాహిత్యాన్ని దేవాలయంతో పోల్చారు."

"అవునండీ : ఇందులోని భాష గ్రాంథికమైనా, సరసమై పాఠకుల్ని చక్కగా చదివింపజేస్తోంది."

"అన్నట్టు 'సరసం' అంటే గుర్తువచ్చింది. వీరి పరిశోధన గ్రంథంలోని రసచర్చ చూశారూ ! ఎంత లోతుగా కమ్మగా ఉందో ! నా 'పరమయోగివిలాసం'లో శాంతం రసమవుతుందా ? అని చేసిన చర్చ అమోఘం. ఇది వీరి ఆధ్యాత్మిక తాత్త్విక ప్రియత్వాన్ని కూడ చాటుతోంది."

"ఔనౌను, ఈ విషయాన్ని ప్రత్యేక ప్రకరణంగా వివరించడమే కాకుండా ఎక్కడ ఏమాత్రం అవకాశం దొరికినాచాలు, ఆ ఆధ్యాత్మిక తాత్త్విక విషయాలను కొంచెమైనా స్పృశించకుండా ఉండలేదు. లోతులు ముట్టక ఉండనూలేదు. ఉదాహరణ :— చిత్రలేఖ తత్త్వజ్ఞతా వివరణమే ; ఇదంతా వీరి తండ్రిగారి నుండి సంక్రమించిన విద్యాబలమే ;

"బాగుంది, బాగుంది. అసలు నాదో కోరిక : వీరు మా శాళ్ళపాక కవుల అందరి రచనలనూ ఆధ్యాత్మిక తాత్త్విక దృక్పథాలతో విమర్శించే బృహత్తర కృషిచేస్తే మహత్తరానందంగా ఉంటుంది నాకు. 'అన్న' విజ్ఞానాన్ని లోకానికి అందించిన ఈయనకు మా 'అన్న'మయ్యవంటి కవుల సాహిత్యంలోని విజ్ఞానం అందకుండా ఉంటుందా ? అన్నమూ జ్ఞానప్రదమే : అన్నమయ్య సాహిత్యమూ జ్ఞానప్రదమే గదా ! "

"ఈ మహత్తర కృషి చేస్తే వీరికి 'డి.లిట్' డిగ్రీ తప్పక వస్తుంది. ఇంతకూ వీరి ఈ పరిశోధన గ్రంథం మీ రచనలు ఏమీ చదవనివారికి కూడ అర్థమయ్యేలా ఉంది. ఇది చదివిన తర్వాత మీ రచనలన్నీ తప్పక చదవాలన్న తహతహ ప్రతిపాఠకునిలోనూ కలిగితీరుతుంది. ఇదీ ఈ గ్రంథానికి ప్రయోజనం అనుకుంటున్నాను."

"అవునవును, ఇది నిజం. నాకెంతో ఆనందంగా ఉంది. ఈ పరిశోధన గ్రంథావిష్కరణోత్సవానికి తప్పక రావాలనుకుంటున్నాను."

"ఏమిటీ! గ్రంథావిష్కరణోత్సవానికి రావాలనుకుంటున్నారా ? తప్పక రండి స్వామీ !"

"ఏమండీ ; ఏమిటిది ? ఎవరిదీ, గ్రంథావిష్కరణోత్సవం అంటున్నారు ?" అన్న నా భార్యామణి పలుకులతో మెలకువ వచ్చింది నాకు. ఒళ్ళో ఉన్న పుస్తకం వైపు చూసాను. ఇంతకూ ఆ పుస్తకం "శాళ్ళపాక చిన్నన్న సాహిత్య సమీక్ష" అనే పరిశోధన ప్రబంధం. రచయిత ప్రియ సాహితీ మిత్రులు డా॥ శ్రీమాన్ యస్. టి. వి. రాజగోపాలాచార్యులుగారు.

డా॥ రామడుగు వెంకటేశ్వరశర్మ, తెలుగు లెక్చరర్,
ఓరియంటల్ సంస్కృత కళాశాల,
సూర్యనారాయణపురం, భీమవరం — 2

ఓమ్

శ్రీ వేంకటేశాయ నమః

# గ్రంథ రచనా సముద్దేశము

పద పద్యములకు నడిమి వారధిగ నడచునట్టిది ద్విపద. "పాఠ్యే గేయేచ మధురమ్" అను ఆదికవి వాల్మీకి అభాణకమునకు నికషోపలరేఖగా నిలువగలట్టిది ద్విపద. పండిత వాఙ్మయమునకు ఆద్య ప్రకృతి పద్యము కాగా పామర వాఙ్మయమునకు పద మట్టిది. ఆ రెండింటికిని మధురానుబంధమును సంఘటించునది ద్విపద. శైవ మతమును సామాన్య జన సన్నిహితము చేయు నుద్దేశముతో సాహిత్యమును ప్రధాన పరికరముగ స్వీకరించిన పాల్కురికి సోమనాథాది శివకవులు ఆ సాహిత్యమున కాకృతిని ద్విపదతో దిద్దినారు. నాటి నుంచి నేటి దనుక ద్విపద వాఙ్మయమెంతో వెలసి విలసిల్లినది.

సోమన గౌరన ప్రభృతుల కర్వాచీనుడైన శాశ్వపాక చిన్నన్న (చిన తిరువెంగళనాథ సూరి)- "చిన్నన్న ద్విపద కెఱుగును" అని ప్రశంసింపబడుటయే గాక తన జీవితారామమును ద్విపద సాహితీ సుమనోభిరామముగా తీర్చి దిద్దుకొన్నవాడు. ద్విపద రచనలో ద్విరద గతి గభీరతను ప్రదర్శించినవాడు చిన్నన్న. ద్విపద కవులలో అగ్రతప్పరుడు కాడుగాని ఆ కవుల కోవలో నడుమ నాయకమణి వలె రాణించువాడు చిన్నన్న. ఇతని ద్విపద సాహితిపై పరిశోధన చేయింపవలెనను తలంపు ఏనాడో అస్మద్గురువర్యులు ఆచార్య శ్రీ యస్వీ జోగారావు గారికి కలిగినది. అది నాపాలబడుట, నేనందు కృతార్థుడనగుట, అది ఇట్లు ముద్రణ భాగ్యమును పొందుట, దీనికి శ్రీ జోగారావుగారు కృతిభర్త యగుట — అంతయు భగవదనుగ్రహ విశేషము, నా అదృష్టము. నా శ్రేయోభిలాషులైన గురువుల కివే కృతజ్ఞతా సహకృతానేక సాధువాదములు.

గురుప్రేరణయే గాక పరమయోగిషిల్లాసమును పరమ రమణీయముగ సంతరించి చిన్నన్న తాదృశ మహాభక్తుడగుటయు, అలమేల్మంగ

తాయారును ఆరుపదుముగా చేసికొన్న పేరెన్నికగన్న అన్నమాచార్యాది మహానుభావు లుదయించిన తాళ్ళపాక కవి కుటుంబమునకు చెందుటయు (ఆతని కృతుల ఆ యమ్మకే అంకితము). అంతేకాక అన్నమయ్యగారికి సాక్షాత్తు పౌత్రుడగుటయు, ఆతని కృతులు విద్వద్విలసితములై ఆధ్యాత్మిక-కవితా భావ పరిమళములు వెదజల్లుటయు నా పరిశోధనకు కారణములు నుద్బోధకములు నయినవి.

అధ్యేతల పాఠకుల సౌలభ్యమునకై ఈ గ్రంథమున కోరి అరసున్నలు, శకటరేఫలను పాటింపనైతిని. అందులకే ఎడనెడ విసంధులను పాటించి, సుబోధకమైన సరళ గ్రాంథిక భాషనే వాడితిని. ఎంత శ్రద్ధగ చూచినను అచ్చటచ్చట మాత్రము తప్పనిసరిగ 'జారిపోయిన' అచ్చు తప్పులను సహృదయముతో సవరించుకొన ప్రార్థింతును. "ఎయ్యెడ మేలె చూతురు గణింపరు లోపలి జాలిపాటులన్"....అని కదా మన చేమకూర వెంకటకవి చెప్పినది.

ఈ రోజులలో గ్రంథముద్రణమొక మహాయజ్ఞము. వ్యక్తిగతముగ చేపట్టినవారికిది ఎంతటివ్యయ ప్రయాసలతో కూడినదో అనుభవమున తెలియును. మన దేశమున రచయితయే ప్రచురణకర్త, పుస్తక విక్రేత కావలసివచ్చిన దుర్భర పరిస్థితులలో 'శ్రీతిరుమల తిరుపతి దేవస్థానము' వారు ఈ గ్రంథ ప్రచురణమునకు పదివేల రూపాయలనిచ్చి, నా కృషిని ప్రోత్సహించి, తమ సంపూర్ణ సహాయ సహకారముల నందించిరి. వారికి నేను సర్వదా కృతజ్ఞుడను.

అసలు నాకీ పరిశోధన మహాభాగ్యమును ప్రసాదించిన ఆంధ్రవిశ్వకళా పరిషదధికారులకు, న్యాయ నిర్ణేతలకు, సదుపాయము నొసగి ప్రోత్సహించిన మా కళాశాధ్యక్షులు శ్రీ సాగి వాసుదేవరాజు తదితర సిబ్బందికి, నాకీ పరిశోధన వ్యాసంగమున అతిదుర్లభ గ్రంథప్రదానాద్యనేక మహోపకారము లొనగూర్చిన సర్వశ్రీ ములుగు రామానుజాచార్యస్వామి (మద్రాసు), డా॥ తుండూరి రామకృష్ణమాచార్య, గురువర్యులు డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు, కవి మిత్రులు డా॥ రామడుగు వెంకటేశ్వరశర్మ, శ్రీమాన్ N. V. L. N. రామానుజాచార్యులు (కార్యదర్శి — ఉభయ వేదాంత

సభ, పెంటపాడు, ప॥ గో॥ జిల్లా) కుడిసాలి మోహన్ (అనమాచార్య ప్రాజెక్టు ఆఫీసరు–తిరుపతి) కామిశెట్టి శ్రీనివాసులు, గొరిపెద్ది రామసుబ్బ శర్మ, బాలకృష్ణప్రసాద్, ఆచార్య డా॥ హరి పర్వోత్తమరావు (తెలుగు శాఖ, వెంకటేశ్వర యూనివర్సిటీ), డా॥ పి. బి. శ్రీనివాస్ (సినీ నేపథ్య గాయకులు-మద్రాసు), డా॥ ఆచార్య తిరుమల (హైదరాబాద్), బ్రహ్మశ్రీ మునగాల సేతుమాధవస్వామి, కవి శ్రీ తమ్మన వెంకటేశ్వరరావు ప్రభృతి సుకృతులకు; మదుపయుక్త గ్రంథకర్తలందరకు; అభివందనశేఖల నందించి నిండుమనసుతో నన్ను ఆశీర్వదించిన పెద్దలకు, సాహితీ మిత్రులకు నా హృదయపూర్వక కృతజ్ఞతా నీరాజనము.

కవి, తాత్త్వికుడు, ఆంగ్ల భాషా విశారదుడైన నా సోదరాగ్రజుడు శ్రీమాన్ యస్. టి. వి. రాఘవాచార్యులు నన్ను అభినందించి ఆంగ్లభాషలో **(Pleasure) అభిప్రాయము నందించి ఆశీర్వదించుట నాకు ఆనందదాయకము.** కృతజ్ఞుడను.

చిత్రలేఖన కళలో 'చిత్రలేఖ' అంతటి ప్రజ్ఞాశాలి, స్నేహశీలి మా పట్నాల భాస్కర్. తండ్రి తాతల ఛాయాచిత్రములనుబట్టి చిన్నన్న రూపమును ఊహించి రూపొందించిన ముఖచిత్రం చూసారుగా ! ఆ 'చిత్ర భాస్కరుని'కి; అంత అందముగ పుస్తకమును ముద్రించిన ఆదర్శ ప్రింటర్స్ అధినేత శ్రీ యస్. పాల్‌రాజుగారికి నా కృతజ్ఞతలు.

ఇక, ఈ జన్మకు నాకు ప్రథమాచార్యులు, అంతర్వాణి వరేణ్యులు, వేదవేదాంగాది విజ్ఞానవేత్త, శ్రీమహాభారత వైజ్ఞానిక సమీక్ష రచనా దక్షులు, మా ఇలువేల్పు మారు రూపు అయిన పూజ్యపాదుల స్మర్తవ్యపాదులు గురుశ్రీ శ్రీమాన్ శ్రీమత్తిరుమల వెంకట శ్రీనివాసాచార్య మహోదయులకు, నా చదువు సంస్కారములకు పాదిమొదవు బొదువు అస్మన్మాతృశ్రీ సుగుణావతీదేవి గారికి నా నిత్య నీరాజనము.

బుధజన విధేయుడు,

**శ్రీ॥ తి॥ వేం॥ రాజగోపాలాచార్యులు**

# విషయసూచిక


పుట సంఖ్య

1. తాళ్ళపాక కవి కుటుంబము - చిన్నన్న 1

2. *అష్టమహిషీ కళ్యాణము సమీక్ష :*

ఇతివృత్త నిర్వహణము 13

పాత్ర చిత్రణము (కృష్ణుడు, రుక్మిణి, దౌత్యము నెఱపిన బ్రాహ్మణుడు, అక్రూరుడు, గోపికలు). 20

రస పోషణము 33

వర్ణనలు - కల్పనలు 40

భాష - శైలి 53

అలంకారములు - చమత్కారములు 63

3. *ఉషా కళ్యాణము సమీక్ష :*

ఇతివృత్త నిర్వహణము 74

పాత్ర చిత్రణము (ఉష, చిత్రలేఖ, అనిరుద్ధుడు నారదుడు, బాణాసురుడు, కృష్ణుడు) 84

రసపోషణము 104

వర్ణనలు 112

అలంకారములు 123

భాష - శైలి 129

కళ్యాణ కావ్యముల భేద సాదృశ్యములు 137

4. *పరమ యోగి విలాసము సమీక్ష :* 140

ఆళ్వారులు - నాలాయిర దివ్య ప్రబంధము 142

మాతృక - మౌలికత్వము 144

ఇతివృత్త నిర్వహణము 147

శ్రీహరి శ్రీసతుల సంవాదము 152

| | | పుట సంఖ్య |
|---|---|---|
| | భక్తిసార యోగి చరిత్రము | 158 |
| | శఠగోప యోగి (నమ్మాళ్వారు) | 163 |
| | మధురకవి, కులశేఖరుల చరిత్రలు | 165 |
| | తిరుప్పాణి ఆళ్వారు చరిత్ర | 166 |
| | విప్రనారాయణ చరిత్ర | 170 |
| | విష్ణుచిత్తుల చరిత్ర | 177 |
| | గోదాదేవి వృత్తాంతము | 179 |
| | పరకాల యోగి చరిత్ర (తిరుమంగై ఆళ్వారు) | 184 |
| | నాథమునుల వృత్తాంతము | 189 |
| | యామునాచార్య చరిత్ర | 191 |
| | భగవద్రామానుజ వైభవము | 193 |
| | పాత్ర చిత్రణము : | |
| | కణి కృష్ణుడు | 199 |
| | విప్రనారాయణుడు | 201 |
| | దేవదేవి (వేశ్య) పాత్ర | 205 |
| | వేశ్యమాత విటకంటకి | 208 |
| | విష్ణుచిత్తుడు | 211 |
| | పరకాల యోగి | 216 |
| | రసపోషణము | 221 |
| | వర్ణనలు | 232 |
| | అలంకారములు - చమత్కారములు | 243 |
| | భాష - శైలి | 248 |
| 5. | **అన్నమాచార్య చరిత్ర సమీక్ష :** | 259 |
| | ఇతివృత్త పరిచయము | 262 |
| | [illegible] | 269 |
| | పాత్ర చిత్రణము (అన్నమయ, సాళువ నరసింహ రాయలు, ఇతర పాత్రలు) | 271 |

పుట సంఖ్య

| | | |
|---|---|---|
| | రసపోషణము | 282 |
| | వర్ణనలు | 285 |
| | అలంకారములు | 290 |
| | భాష - శైలి | 293 |
| 6. | చిన్నన్న మూర్తిమత్వము | 296 |
| 7. | చిన్నన్న ఆధ్యాత్మిక దృక్పథము; | 307 |
| | చిన్నన్న కావ్యములు - తాత్త్వికత | 313 |
| 8. | తెలుగు ద్విపద కవులలో చిన్నన్న స్థానము | 317 |
| 9. | **అనుబంధములు :** | |
| | చిన్నన్న తామ్రశాసనము ఛాయా చిత్రము-<br>దానపత్ర విషయము | 333 |
| | చిన్నన్న కృతులు - అనర్ఘ రత్నములు | 337 |
| | గ్రంథపాఠములు | 338 |
| | జాతీయములు, సామెతలు-పలుకుబడులు-<br>భక్ష్య విశేషములు వగైరా | 341 |
| | ఆధార గ్రంథములు (Bibliography) | 346 |
| | అభినందన లేఖామాలిక | 349 |


***సంకేతాక్షర సూచిక :***

పు .... పుట

అ. మ. క. .... అష్టమహిషీ కళ్యాణము

ఉ. క. .... ఉషా కళ్యాణము

ప. యో. వి. .... పరమ యోగి విలాసము

అ. చ. .... అన్నమాచార్య చరిత్రము.

ఓమ్
శ్రీ వెంకటేశాయ నమః

# 1. తాళ్ళపాక కవి కుటుంబము - చిన్నన్న

శ్రీ వేంకటేశ్వర దివ్యపాదారవింద ధ్యాన మరంద పానమత్త చిత్త భక్త భృంగములు తాళ్ళపాక కవులు. వీరు భక్తి శృంగార రసరాజ్య పాలకులై కంద గల కవిత్వముతో వేలాది సంకీర్తనములు, కృతులు రచించి తెలుగు సాహిత్యమునకు నిరుపమానమైన సేవ చేసిరి. అంతేకాదు తమ సంగీత సాహిత్య సంపదలు సర్వస్వమూ తిరుమలేశునకు సమర్పించి తరించిరి.

అదేమి చిత్రమో కాని తాళ్ళపాక కుటుంబములోని వారందరును కవులు, విద్వాంసులు, గాన కళా కోవిదులు, బహు భాషా విశారదులు, బహు గ్రంథ కర్తలు, భక్తులు, జ్ఞానులు, సుగుణ శీలురగుట మహాశ్చర్యము. అందరును రచన చేసి స్వరము కూర్చి గానము చేయగల ప్రతిభా వంతులే. ఆంధ్ర భారతిని ఒకటిన్నర శతాబ్దికి పైబడి వివిధ సాహిత్య ప్రక్రియలతో సేవించిన ఇట్టి కవి కుటుంబము లోకమున మరొకటి కానరాదు.

ముందుగ ఈ తాళ్ళపాక కవులను పరిచయము గావించు కొందము.

*1.* **అన్నమాచార్యులు :** పద కవితా పితామహుడు, ప్రముఖ వాగ్గేయ కారుడైన అన్నమాచార్యులు తాళ్ళపాక వారి సాహిత్య దేవాలయమున వెలసిన మూల విరాట్టు. కాలము క్రీ. శ. 1408–1503 ప్రాంతము. తిమ్మాంబ అక్కాంబ లితని భార్యలు. ఇతడు జన్మతః అద్వైతి అయినను

వైష్ణవ మతమును స్వీకరించి తన సర్వ సాహిత్యమునకు శ్రీ వైష్ణవ సిద్ధాంతమును మూలాధారము గావించుకొని పరమ విద్యా సింధు పారంగతుడై వేంకటేశ్వరస్వామి భక్తుడై విష్ణు సాహిత్యమును వెలయించి ప్రచారము చేసెను. ఈ కవి 32 వేల ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనములను, శృంగార మంజరి, శృంగార లక్షణము (సంస్కృతము), సంకీర్తన లక్షణము (సంస్కృతము), ద్విపద రామాయణము, వేంకటాచల మహాత్మ్యము, 12 శతకములు రచించినట్లు తెలియుచున్నది. అన్నమయ సాహిత్యము సగము పైబడియే కాలగర్భమున కలసి యుండునని పండితుల పరిగణనము. ఇప్పటికే లభించిన అన్నమయ సాహిత్యములో—

"అదివో అల్లదివో శ్రీహరి వాసము
పదివేల శేషుల పడగల మయము...."
"విన్నపాలు వినవలె వింత వింతలు
పన్నగపు దోమతెర పైకెత్త లేవయ్యా...."
"బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానే నీ పాదము...."

ఇత్యాది సుప్రసిద్ధ సంకీర్తనము లెన్నో నేటి తెలుగు జాతిని పూతము చేయు చున్న తారక మంత్ర రాజములు. 'ఆడిన మాటెల్ల అమృత కావ్యముగ, పాడిన పాటెల్ల పరమ గానముగ' సాగినది అన్నమయ సాహిత్యము. అన్నమయ కథావశేషులగుచు పుత్రులను పిలచి ప్రతిదినము వేంకటేశ్వర స్వామిపై కీర్తనలు చేయుచుండుడని ఆదేశించెనట. ఆ మహనీయుని ఆశీస్సుల ఫలితముగనే తాళ్ళపాక కవులు వేంకటేశ్వరస్వామి భక్తులై సత్కావ్య నిర్మాతలై తెలుగు సాహిత్యమును శ్రీమంతము గావించిరి.

***2. పెద తిరుమలాచార్యులు*** : ఇతడు అన్నమయ రెండవ భార్య అక్కాంబ సుతుడు. ఇతడు వెంకటేశ్వర భక్తుడై తిరుపతిలో వివ

సించి అనేక ధర్మ కార్యములు చేయుచు కొన్నివేల అధ్యాత్మ శృంగార సంకీర్తనములు, అనేక కావ్యములు రచించి తండ్రి యంతటివాడై ఖ్యాతిని గడించెను. ఇతడు దినమున కొక సంకీర్తనమును రచించి స్వామి సన్నిధిని గానము చేసెడివాడట. ఇంకను రేఫఱకార నిర్ణయమను లక్షణ గ్రంథ మును, శృంగార దండకము, చక్రవాళమంజరి, శృంగారవృత్త శతకము, వేంకటేశ్వరోదాహరణము, నీతి సీస శతకము, సుదర్శన రగడ, వైరాగ్య వచన మాలికాగీతములు, ఆంధ్ర వేదాంతము లేక భగవద్గీత, హరివంశాది గ్రంథములు రచించి వేంకటేశ్వరస్వామికి అంకితము చేసెను. ఈ కవి భాష, భావము సరళ సుందరము, కవిత్వము పాండిత్య స్ఫోరకము. తండ్రి చెప్పిన ప్రకారము వేంకటేశ్వరుని సంకీర్తన సుమములతో జీవితాంతము పూజించి త్రిపురుష పర్యంతముగ ప్రత్యక్షమును, సప్తపురుష పర్యంతముగ మోక్షమును వరముగ పొందిన పుణ్యశాలి పెద తిరుమలయ్య. ఇతడు తిరు పతి యందనేక మంటపములు కట్టించి ఉత్సవములు చేయించెను. తిరుమ లలో స్వామివారి ఉత్సవములు, పూజలు వంశపారంపర్యముగ తమ పేర జరుగుటకు వేలాది వరహములు, 13 గ్రామములు స్వామివారికి సమర్పించి శాసనములు వేయించెను. విజయనగర విఠలస్వామికి భూదానము చేసెను. తాళ్ళపాక సాహిత్యమును చాలవరకు రాగిరేకులపై చెక్కించి తిరుమలలో సంకీర్తన భండారమును కట్టించి అందు వానిని భద్రపరచి ముందు తరముల కందించిన మహనీయుడీ పెద తిరుమలాచార్యుడే.

***3. చిన తిరుమలాచార్యులు :*** ఇతడు అన్నమాచార్యుల మనుమడు, పెద తిరుమలయ్య పెద్ద కుమారుడు. ఇతడే రచించిన- "గురుడవు నీవే సుమ్మీ కుమతినైన నాకు సరవి బ్రహ్మోపదేశము నేసితివి" అను ఆధ్యాత్మిక సంకీర్తనము వలన అన్నమయ ఈ మనుమనికి బ్రహ్మోపదేశము చేసినట్లు తెలియుచున్నది. తాతగారి నితడు దైవముపలె పూజించెను. ఇతడు 16వ ఏటనే సాహిత్య వ్యాసంగమును ప్రారంభించి

అసంఖ్యాకముగ సంకీర్తనములు, మేలుకొలుపులు రచించెను. మరియు తాతగారు రచించిన సంస్కృత సంకీర్తన లక్షణమును 70 పద్యములలో తెనిగించి దానికి లక్ష్యముగ కీర్తనలు రచించి దానికి కావ్య గౌరవమును కలిగించెను. ఇతడు సంస్కృతాంధ్రములందు పిడుగు వంటి పండితుడు. సంస్కృత ప్రాకృత శౌరసేని మాగధి పైశాచి ప్రాచీ అవంతీ సార్వదేశ భాషలలో ధారాప్రవాహముగ 'అష్ట భాషా దండకము'ను చెప్పి పండితుల నాశ్చర్య సముద్రములో ముంచి "అష్ట భాషా కవి చక్రవర్తి" యను మహా బిరుదము పొందెను. తాళ్ళపాక కవులలో ఒకరిని మించిన కవి మరొకరను టకు ఈ చిన తిరుమలాచార్యుడే సాక్ష్యము.

*4. తిరు వెంగళప్ప :* ఇతడు అన్నమాచార్యుని ముని మనుమడు, చిన తిరుమలాచార్యుని పుత్రుడు. నివాసము తిరుపతి. ఇతడు సంస్కృతములోని అమరుకమను శృంగార శతకమునకు వ్యాఖ్యాన రూప మైన తెలుగు సేతగా 'బాల ప్రబోధిక'యను కావ్యమును; మమ్మటుని కావ్య ప్రకాశమను సంస్కృత లక్షణ గ్రంథమునకు వ్యాఖ్యగా 'సుధానిధి' యను గ్రంథమును రచించెను. ఇతడును తన తాతవలె దాతయై క్రీ. శ. 1554 ప్రాంతమున తిరుపతి గోవిందరాజస్వామి వైవాహికోత్సవములకు అంబత్తూరు తూప్పిలు అగ్రహారమున కొంత భాగమును, కంచి అరులాళ పెరుమాళ్ళకు పేరిచ్చంబాక మను గ్రామమును దానము చేసినట్లు శాసన ముల వలన దెలియుచున్నది.

*5 నరసింహయ్య :* ఇతడు అన్నమాచార్యుల మొదటి భార్య తిరుమాలాంబ సుతుడు. ఇతడే సుంకేశుల గ్రామమున స్థిరపడి సంకుసాల నృసింహకవిగ ప్రసిద్ధుడై కవికర్ణరసాయన కావ్యమును రచించెనని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అభిప్రాయము. (అ.చ. పీఠిక పు. 83) ఇతనిని గూర్చి—

"పాడఁజెప్పఁగ వర్ణపద్ధతి నీడుజోడు లేఁడవ సభఁజొచ్చి వాదించి పరగిన ధీశాలి ప్రతివాద దైత్య నరసింహుఁడనఁగల్గె నరసింహ గురుడు" అని అష్టమహిషీ కళ్యాణమున చిన్నన్న చెప్పెను.

*6. పెద తిరు వెంగళనాథుడు :* ఇతడు పెద తిరుమలాచార్యుని తృతీయ పుత్రుడు. ఇతడు సాత్విక శుభమూర్తి యని సంగీత సత్కవిత్వాధికుడని చిన్నన్న పేర్కొనెను. ఇతడు సంకీర్తనములు రచించి నాట్యమాడుచు గానము చేయుచుండ వేంకటేశ్వరుడు వచ్చి నాట్యము చేయుచుండెడివాడని రేవణూరి వెంకటాచార్యుడు తన శకుంతలా పరిణయమున దెలిపెను.

*7. కోనేటి తిరు వెంగళనాథుడు :* ఇతడు పెద తిరుమలాచార్యుని 5వ కుమారుడు. 'సదమల విద్యా విశారదుడు,' లోక విదితు'డైన ఇతడు అత్యంత వైభవముగ జీవించినట్లును, కడప జిల్లా పుష్పగిరి చెన్నకేశవునకు కొంత భూమిని సమర్పించినట్లును తెలియుచున్నది.

*8. రేవణూరి కొండయార్యుడు :* పూలతావి దారమున కబ్బినట్లు తాళ్ళపాక కవుల బంధువులకు సహితమూ కవితా వాసన అబ్బుట అబ్బురము. ఈ కొండయార్యుడు అన్నమాచార్యులవారి అల్లుడు. కర్నూలు జిల్లా కోయిల కుంట్ల తాలూకాలోని రేవణూరను గ్రామ నామమే ఇతని గృహనామమైనది. ఇతడు రామచంద్రోపాఖ్యానమను ప్రబంధమును రచించెను.

*9. రేవణూరి వెంకటాచార్యుడు :* ఇతడు అన్నమయ దౌహిత్రుడు తిరుమలాంబ కొండయార్యుల పుత్రుడు. ఈ కవి శకుంతలాపరిణయము, శ్రీపాదరేణు మహాత్మ్యము వంటి రసవత్ప్రబంధములు రచించి భక్తితో వెంకటేశ్వర స్వామికి అంకితము చేసెను.

*10. తాళ్ళపాక శ్రీనివాసుడు :* ఇతడు అన్నమయకు ఏ తరము మనుమడో తెలియదు. ఇతని సీసపద్యముల వేంకటేశ్వర శతక

అముద్రిత ప్రతి ఆంధ్ర సాహిత్య పరిషత్తులో గలదని పరిశీలకులు చెప్పుచున్నారు.

***11. తాళ్ళపాక తిమ్మక్క :*** తాళ్ళపాక కుటుంబమున స్త్రీలు సహితము కవిత్వము చెప్పి కావ్యములు నిర్మించిరనుటకు సాక్ష్యమీ తిమ్మక్కయే. ఈమె అన్నమాచార్యుల వారి పెద్ద భార్య. గద్య పద్యముల మిన్నంది మెరసిన నరసింగన్న కన్నతల్లి. గొప్ప విదుషీమణి. ఈమె మంజరీ ద్విపదలో 1160 పద్య పాదములతో సుభద్రా కళ్యాణమును కావ్యమును రచించెను. ఈ కృతి విజయ విలాస కర్త చేమకూర వేంకట కవికి మార్గదర్శకమైనదనినచో నీమె కవితా వైభవ మెట్టిదో గ్రహింప వచ్చును. తెలుగు సాహిత్యమున ఆదికవి నన్నయ వలె ఆది కవయిత్రి ఈ తాళ్ళపాక తిమ్మక్కయే.

ఇంకను తాళ్ళపాక కుటుంబ సభ్యులైన నారాయణ, అప్పలార్య, అన్నయార్య, అన్నయయలు సంగీత సాహిత్యము లందు మంచి పండితులట. "పండిత పుత్రః పరమ శుంఠః" అను లోకోక్తిని ఈ తాళ్ళపాక కవులు వమ్ము చేసి "అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ" అను పెద్దన వచనమును సార్థకము చేసిరి.

తమిళదేశము నందలి ఆళ్వారుల వంటి ఈ తాళ్ళపాక తెలుగు కవులు తమ భక్తి జ్ఞానములతో 'సుకవులెల్ల చేయెత్తి మ్రొక్క'నట్లు వేల కొలది రచనలు చేసి తెలుగు సాహిత్యమును సుసంపన్నము చేయుటయే గాక మత సంప్రదాయ పేటికలందణగియున్న ఆధ్యాత్మిక భావ రత్నములను తెలుగు సాహిత్య సౌధమున పొదిగి ప్రకాశింపజేసిరి.

నిజమునకు తాళ్ళపాక వారి సాహిత్యమొక మహా సముద్రము. అందొక్కొక కవి ఒక్కొక ఉద్ధృత తరంగము. ఆ మహా సముద్రమందొక

మహోద్ధృత తరంగమై "జలజాత వాసిని చనుబాల పుష్టితో" కవిత్వమును చెప్పి 'చరిత్రను' సృష్టించిన 'ద్విపద సుకవి' చిన్నన్న సాహిత్యమును ప్రత్యేకముగ పరిశీలించుటయే ఈ సమీక్షా లక్ష్యము.

## తాళ్ళపాక చిన్నన్న

"చిన్నన్న ద్విపద కెఱుగున్
పన్నుగ పెద తిరుమలయ్య పదమున కెఱుగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్య గద్య శ్రేణిన్॥

అని తెనాలి రామలింగ కవి వంటి పెంకి ఘటముల ప్రశంసలందుకొన్న చిన్నన్న ఈ తాళ్ళపాక చిన్నన్నయే. ఇతని అసలు పేరు చిన తిరువెంగళ నాథుడు. ఇది మరుగున పడి చిన్నన్న అను ప్రసిద్ధియే లోకమున స్థిరపడినది. ఇతనికి తిరువెంగళనాథ. చిన తిరువెంగళ. తిరువణేధర్. తిరువ నాథయ్యార్. తిరువెంగళనాథయ్యంగార్. తిరువెంకటనాథారు. వెంగళార్య అను నామాంతరములు గలవు.

చిన్నన్న అన్నమాచార్యుల మనుమడు. పెద తిరుమలాచార్యుని నాల్గవ కుమారుడు. విద్వద్వంశ కలశోదధి పూర్ణ శశాంకుడై పుట్టిన చిన్నన్నయు సహజ కవితాధురీణుడై గట్టి పండిత వీరుల కోవకు చెందిన కవియై బహుళ ద్విపద కావ్యకర్త అయినాడు. ఇతడు కావ్యము జెప్పి మొనలేవి శ్రీ వేంకటేశు మెప్పించి సకలంబు నెరుగ నసాధారణాంక మకర కుండలము లిమ్మహి గొన్నవాడు. దినములోననె వేయి ద్విపద లింపొంద వినుత వర్ణనలతో విరచింపగం ప్రతిభాశాలి. కవి శిరః కంప యోగ్య ప్రతి ద్విపద నవ బిరుదాంకుడు. సకల వైష్ణవ పాద సంసేవ కొజ్జసదనా వధూ

లబ్ద నరస కవిత్వ విదిత మానసుడు. విరవాది పొట్లము విడిచిన మాణిక్య కవులు బళి బళి యనునట్లు పరిమళవంతమైన కవిత చెప్పిన సులక్షణు డితడు. మీదు మిక్కిలి శ్రీ యలమేలు మంగా వేంకటేశ్వరుల పాద పద్మ వాసనా లోలుప స్వాంత షట్పదుడైన మహా భక్తుడు. వినుతశీలుడు. అయీ విశేషము లితవి కావ్యములు శాసనముల వలన దెలియుచున్నది.

**కాలము :** చిన్నన్న కాల నిర్ణయమున భిన్నాభిప్రాయములు పొడ సూపినవి. తాళికోట యుద్ధమును, విద్యానగర వినాశనమును జూచు దౌర్భాగ్యమునకు బాల్పడక 1565 పూర్వమే చిన్నన్నయు అతని సోదరు లును దివ్య ధామ మంది యుందురని వేటూరి ప్రభాకరశాస్త్రి గారి అభి ప్రాయము. (అ.చ. పీఠిక). కొందరితడు క్రీ. శ. 1600 ప్రాంతము వాడనిరి. చిన్నన్నకు మకర కుండలము లిచ్చి సత్కరించిన వేంకటాద్రి క్రీ. శ. 1560 ప్రాంతము వాడగుటచే చిన్నన్నయు అప్పటివాడే కాని 1600 ప్రాంతము వాడు కాడని మరికొందరు ఖండించిరి. చిన్నన్న 60 సం॥లు జీవించి యుండవచ్చుననియు; క్రీ. శ. 1478–1561 మధ్య ప్రాంతము వాడనియు శ్రీ చాగంటి శేషయ్యాది (ఆంధ్ర కవి తరంగిణి సం. 9. పు. 236) పలువురు పండితుల లంగీకరించిన అభిప్రాయము. కనుక చిన్నన్న కాలము క్రీ. శ. 1478–1561.

**శాసనములు :** చిన్నన్న శాసనములను గురించి శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తిరుమల తిరుపతి దేవస్థానము ఎపిగ్రాఫికల్ రిపోర్టు 298 నుండి 299 వరకు గల పుటలలో వివరించి యుండిరి. ఇతని కడపటి శాసనము క్రీ. శ. 1558న వేయించినట్లు నిర్ధారింపబడినది.

**తామ్ర శాసనము :** చిన్నన్నకు పద్మశాలీలు సమర్పించిన దానమును పురస్కరించుకొని క్రీ. శ. 1541లో వెలసిన తామ్ర శాసనమిది.

శాసనకర్త చిన్నన్నయే. దీనిని శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు పరిశోధించి ప్రకటించిరి. ఈ శాసనము రెండు రాగి రేకులపై చెక్కబడినది. శాసన విషయముతో పాటు ఆ రాగి రేకులపై వేంకటేశ హనుమదాది మూర్తులు, సూర్యచంద్రులు, శంఖ చక్రములు, ఊర్ధ్వ పుండ్రము చిత్రింప బడినవి. చిన్నన్న నుండి వంశ పారంపర్యముగ గురు శిష్య సంబంధమును కొనసాగింప గోరి పద్మ శాలీలు చేయించిన శాసనమిది. వీరి కోరికపైననే చిన్నన్న - చంద్రగిరికి తూర్పున తిరుమలకు పోవు దారిలో గల శ్రీనివాస మంగాపురమందు కళ్యాణ వేంకటేశ్వరుని దేవాలయము నిర్మించినట్లు తెలియుచున్నది.

**ధర్మ కైంకర్యములు :** కొండవీటికి సంబంధించిన చెందలూరు మల్లవరము గ్రామములను క్రీ. శ. 1546లో చిన్నన్న వేంకటేశ్వరస్వామి వారి శ్రీ భండారమునకు సమర్పించెను. ఆ గ్రామములపై వచ్చు 620 గట్టి వరహాల ఆదాయముతో తన తాత తండ్రి గారల జన్మదినోత్సవ కైంకర్యములు, తల్లి, పెద తండ్రి, అన్న తిరువెంగళప్పల శ్రాద్ధ దిన కైంకర్యము లొనరించునట్లు ఏర్పాటు గావించెను.

### చిన్నన్న జీవిత చరిత్రము - ప్రత్యక్షాభిప్రాయములు :

శాసనములందుగల ధార్మిక కైంకర్యములు, దానములు, తామ్ర శాసనములోని సాహిత్యాంశములోని గురు శిష్య సంబంధాదులు తప్ప చిన్నన్న వ్యక్తిగత జీవిత విశేషాదులంత లోతుగ తెలియవచ్చుట లేదు. చిన్నన్న పింగళి సూరనకు సమకాలికుడని కొందరంటిరి. తెనాలి రామలింగని ప్రశంస లోక విదితమే. కాని వీరెవ్వరును అతని జీవిత విశేషములను స్పృశింప లేదు. చిన్నన్న అన్నమాచార్య చరిత్రమును రచించెను గాని స్వీయ చరిత్రమును రచించినట్లు లేదు.

అన్నమాచార్య చరిత్ర వ్రాతప్రతిలో — "తాళ్ళపాక తిరువెంగళనాథుని జీవిత చరిత్రము కార్వేటి నగర సంస్థానములో ఉన్నది చూడవలెనని కలదు. అట్టిది కార్వేటి నగరమున గలదేమో !" అని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తమ (అ. చ.) పీఠికలో ప్రకటించిరి.

"నేనీ సంస్థానము వారికి సంబంధించిన వారితో నీ విషయమై ముచ్చటించి యుంటిని. అట్టి గ్రంథమేదియు నచట కానరాకున్నదని తెలియవచ్చినది" అని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు తాళ్ళపాక కవులు - వివిధ సాహిత్య ప్రక్రియలు గ్రంథమున పు. 113 లో స్పష్టము చేసిరి.

***సంతతి :*** చిన్నన్నకు వెంకటేశయ్య, అప్పయ్య అని ఇరువురు కుమారులు. వెంకటేశయ్య నుండి సూర్యనారాయణయ్య వరకు లభించిన 8 తరముల వారి పేర్లు క్రమముగా ఇవి—1. వెంకటేశయ్య 2. సోమయ్య. 3. బుచ్చన్న. 4. పెరుమాళ్ళయ్య. 5. రామయ్య. 6. పెరుమాళ్ళయ్య. 7. వెంకటరమణయ్య. 8. సూర్యనారాయణయ్య. చిన్నన్న కాలము నుండి సూర్యనారాయణయ్య వరకు 370 సం లు గడచినవి. వీరు చిన్నన్న సంతతి లోనివారమని గొప్పగ చెప్పుకొనుచుండెడివారట. సంగీత సాహిత్యములందు వీరెంతటి పండితులో తెలియదు. బహుశః తాళ్ళపాక వంశములో పేర్కొనదగిన చివరి సుప్రసిద్ధ విద్వత్కవి చిన్నన్నయే.

***చిన్నన్న గాయకుడా ? సంకీర్తన కర్తయా ? :*** చిన్నన్నను గొప్ప గాయకునిగ, సంకీర్తన కర్తగ, పదకవిగ కొందరు ప్రశంసించిరి. "తాళ్ళపాక చిన్నన్న దండె మీటులుగావు" అనియు; "అల తాళ్ళపాక చిన్నన్న రోమములైన తంబురా దండెకుఁ దంత్రులౌనె" అనియు చిన్నన్నను గాయకునిగ స్మరించిరి. చిన్నన్నకు సమకాలికుడు, బంధువైన రేవణూరి వెంకటాచార్యుడు తన శ్రీపాదరేణు ప్రభావ కావ్యమున "మా

తాళులపాక చిన్నన పదంబులు పాడిననాదె సర్వరాట్ శైల విభుండు...."
అని చెప్పుటచే చిన్నన్న గాయకుడనియే తోచును.

కాని తిరుపతిలో గల రాగిరేకులందు గాని, గ్రంథములలో గాని చిన్నన్న గాయకుడనుటకు ఆధారములు కానరావని వేటూరి ప్రభాకరశాస్త్రి గారును (అ. చ-పీఠిక. పు. 96); సంకీర్తన కర్త అయినట్లు సూచించు ఆధారములు లేవని బాలాంత్రపు రజనీకాంతరావు గారును (ఆంధ్ర వాగ్గేయ కార చరిత్ర. పు.104, అధ్యాయము. 7.) స్పష్టము చేసిరి. రాజలింగ కవి కూర్మ పురాణమున గాని, కాణాద పెద్దన ముకుంద విలాసమున గాని, తెనాలి రామలింగడు చాటు పద్యమున గాని చిన్నన్నను కవిగనే పేర్కొనిరి గాని సంగీతాచార్యునిగ, సంకీర్తన కర్తగ చెప్పలేదు. తోడై మంగళములోని కీర్తన పంచక కర్త చిన్నన్నయని కొందరి వాదన. కాని అవి ఏక కర్తృకములు కావు. వాని కర్త చిన్నన్న కాడు. భజన పద్ధతికై తోడయ మంగళములో ఐదు సంకీర్తనముల నొకచోట గుది గ్రుచ్చినవాడు చిన్నయ్య (చినతిరుమలయ్య) గాని చిన్నన్న కాడు. వీనిని బట్టి తేలినదే మనగా చిన్నన్న పదకవి కాడు ద్విపద కవియే. అయినను ఇతడు సంగీత శాస్త్ర మెరుగని వాడు కాదనుట నిర్వివాదము. అందుల కాతని ద్విపద కావ్యములే సాక్ష్యము. ఉదా :

"సరిగమ పదనిస సనిదప మగరిస....
మంకించి శుద్ధంబులలర మీటుచును."

— ఉషా కళ్యాణము. పు. 21.

***చిన్నన్న రచనలు — పౌర్వాపర్యము :*** చిన్నన్న నాలుగు ద్విపద కావ్యములు రచించెను. వీని పౌర్వాపర్య విషయమున పండితులలో భిన్నాభిప్రాయములున్నవి. నా అభిప్రాయమిది :- 1) కవి వంశ వర్ణన, సమగ్ర ద్విపద లక్షణ వివరణము, భాగవతాసక్తి, వర్ణనా ప్రియత్వములో

కవితావేశము అడుగడుగున తొంగిచూచు ప్రాథమిక దశ అష్టమహిషీ కళ్యాణమున కనిపించుటచే ఇది తొలి రచన. 2) తన కవితాధ్యేయమైన పరమయోగి విలాస కావ్యమును ద్రవిడ ప్రబంధమునకు స్వేచ్ఛానువాదముగా తీర్చిదిద్దు కృషికి సాధన భూతముగా వర్ణనావైదగ్ధ్యము గాని, రచనా సౌష్ఠవము గాని, అంతగా కానరాని ఉషాపరిణయము రెండవ రచనగ పేర్కొనవచ్చును. 3) మూడవది పరమయోగి విలాసమను బృహత్కావ్యము. 4) ఇక నాలుగవది తన తాతగారిపై గలభక్తి గౌరవములతో వ్రాసిన లఘు కృతి అన్నమాచార్య చరిత్ర. ఈ క్రమములోనే కావ్య సమీక్షలు గావింపబడును.

ముందుగా అష్టమహిషీ కళ్యాణము.



# 2. అష్టమహిషీ కళ్యాణము సమీక్ష

## ఇతివృత్త నిర్వహణము

చిన్నన్న అష్టమహిషీ కళ్యాణమును క్రీ. శ. 1515 ప్రాంతమున రచించినట్లు తెలియుచున్నది*. సామాన్యముగ కావ్య సౌందర్యము ఇతివృత్తముపై ఆధారపడి యుండును. ఇతివృత్త మనగా కథ. ఇది పురాణ చరిత్ర ప్రసిద్ధమైనచో ప్రఖ్యాత మనియు, కల్పితమైనచో ఉత్పాద్యమనియు, రెంటి సమ్మేళనము మిశ్రమ మనియు ఆలంకారికులు చెప్పుదురు. ఇందు కావ్యేతి వృత్తము ప్రఖ్యాతమై యుండవలెను.

> "ప్రఖ్యాతంబన మిశ్రబంధమన నుత్పాద్యంబనంగాఁద్రి ధా
> వ్యాఖ్యాతంబగు వస్తువందు మఱి యధ్యాహారముంచేయఁగాఁ
> బ్రఖ్యాతంబితివృత్తమైన కృతిఁ జెప్పన్ వక్తకున్ శ్రోతకున్
> విఖ్యాతింగలిగించుఁ బుణ్య మహిమన్ విశ్వంభరామండలిన్
> — పిల్లలమఱ్ఱి పినవీరన శృంగార శాకుంతలము.

**ఇతివృత్తము — తత్త్వార్థము :** ఇతి = ఇందు; వృత్తము = ఆవృత్తమైనది, చుట్టుకొనబడినది. ఏది చుట్టుకొనబడినది ? ఎందుకు చుట్టుకొనబడినది ? అనగా "ఐతదాత్మ్య మిదం సర్వమ్" అను శ్రుతి వచనానుసారము 'ఆత్మ' వస్తువు (శరీరము) నందు చుట్టుకొనబడినది. కావున ఆత్మ యొక్క కథయే ఇతివృత్తము. ఇది ఉత్తమమైనది, ఇది కలవారు ఉత్తమ శ్లోకులు. వారి చరిత్రము ఉత్తమ చరిత్రము. "ఉత్తమ శ్లోక చరిత ముదాహరణ మర్హసి" అని విద్యానాథుడు పేర్కొనినాడు.

---

* This Ashtamahishi Kalyanam written in about 1545 A. D. in Telugu language in Dvipada metre describing the glory of Lord Sri Krishna's marriage with the eight divine consorts. [Tirupati Devasthanam Epigraphical Report, Pages : 296-299].

దీనిని బట్టి ఆత్మ = 'అహం' కథయే కావ్యేతివృత్తమునకు అర్హ మైనది. ఆత్మాశ్రయ కవిత్వము గమనార్హము. అహం అనగా 'నేను' ఇది అందరకును వేర్వేర అనువర్తించు సర్వనామము. 'నేను'- ఉత్తమ పురుష. ఉత్తమ పురుషుని గురించి చెప్పు కవిత్వమే ఉత్తమ కవిత్వము. ఉత్తమ పురుషుడెవరు ? పురుషోత్తముడే. "ఉత్తమ పురుష స్త్వన్యః పరమాత్మేత్యు దాహృతః" అని భగవద్గీత. పరమాత్ముడైన శ్రీకృష్ణ భగవానుడే ఉత్తమ పురుషుడు.

భగవంతుని సృష్టియే విశ్వ కావ్యము. ఈ విశ్వ మీశ్వరునకు లోపలిది. జీవునకు బయటిది. ఆత్మ విశ్వము నందావృతమై విశ్వకావ్యము నకు ఇతివృత్తమగుచున్నది. "విశతియత్ర ఆత్మా తద్విశ్వం" అని విశ్వ నిర్వచనము. ఇట్లే జీవత్వమున ప్రాణమావృతమై జీవకావ్యమునకు ఇతి వృత్తమగుచున్నది. ఇట్లు ప్రఖ్యాతేతి వృత్తము దైవికమై దాని కనుకృతి యైన జీవత్వము ఉత్పాద్యమై, జీవేశ్వరుల కలయిక మిశ్రమమగుచున్నది. "నానృషిః కురుతే కావ్యమ్" అనుటవలన కవికి ఇట్టి ఆర్ష దృష్టి ఎంతైన అవసరము.

ప్రకృతము : పురుషోత్తముడైన శ్రీ కృష్ణభగవానుని దివ్య చరిత్రమే అష్ట మహిషీ కళ్యాణము. శ్రీ కృష్ణుడు- రుక్మిణీ, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, సత్యకీర్తి, భద్ర, లక్షణాదేవులను వివాహ మాడుట ఇందలి ప్రధానేతి వృత్తము. "ప్రకృతిః స్త్రీ"యనుట వలన కృష్ణుని అష్ట ప్రకృతులే యీ అష్ట మహిషులని తాత్త్వికముగ భావింప వలసి యున్నది. "భిన్నాః ప్రకృతి రష్టదా" అని గీత. కృష్ణుని కథ పురాణ ప్రసిద్ధము కనుక ఇతివృత్తము ప్రఖ్యాతము.

ఈ కావ్యమున 5 ఆశ్వాసములు కలవు. ఇందు మొదటి మూడా శ్వాసములలో కృష్ణుని బాల్య క్రీడలు, లీలలు; చతుర్థాశ్వాసమున రుక్మిణీ

కళ్యాణము, పంచమాశ్వాసమున తక్కిన ఏడుగురి కళ్యాణవృత్తాంతములను నిర్వహించినాడు కవి. ఈ కావ్యము నతడు అలమేలుమంగా దేవికి అంకితము చేసెను, "శ్రీ యలమేల్మంగ.... అనుచు శ్రీ కారముతో, శ్రీహరి దేవతా చార్య ప్రార్థనముతో, మంగళాచరణముతో, అలమేలు మంగాదేవి దివ్య వైభవ ప్రశంసతో కావ్యారంభము చేసెను. కథా ప్రారంభమునకు ముందు ఇష్ట దేవతా ప్రార్థనము, వ్యాసాది పూర్వకవి ప్రశంస, వైకుంఠనాథుని స్వరూప మహిమ వర్ణనము, శ్రీవారి దివ్యాయుధములు, ఆదిశేషువు, వైనతేయుడు, ఆళ్వారులు, రామానుజ సిద్ధాంత ప్రభావాదులను స్మరించి తన వైష్ణవాభిమానమును ప్రదర్శించినాడు చిన్నన్న. ఇంకను తన వంశ మహిమను. తన గోత్ర ప్రవర్తకుడైన భారద్వాజముని ప్రభావమును, వంశమూల పురుషుడైన అన్నమాచార్యుల వైభవమును, తన తలిదండ్రుల సోదరుల నామ ప్రభావాదులను ప్రస్తావించెను, ఈ సమాచారము తాళ్ళపాక కవుల చరిత్ర దెలియుటకు బీజప్రాయమైన ఆధారమైనది. ఈ కవి కావ్యాదిని ఇరువది ద్విపదలలో ద్విపద లక్షణములను నిర్దుష్టముగ నిర్వచించి గణలక్షణములను, సంధి, సమాస, శబ్దార్థ, రస, కవితా, స్వరూపములను దెలిపినాడు.

*కథాకథన విధానము :* 'శ్రీమన్నారాయణుడు యాదవ వంశమున జన్మించి లోకమున ఏమేమి కార్యములు చేసెను ? అష్టమహిషుల నేరీతి పెండ్లి యాడెను ? ఆ లచ్చి మగని కథామృతాంబోధి నోలలాడింపు' మని పరీక్షన్మహారాజు శుకయోగిని ప్రార్థించెను. ఆ శ్రీకృష్ణ పరమాత్ముని అద్భుత లీలలు, కథలు వినగోరు వారే పరమ పావనులని పలుకుచు శుక యోగి పరీక్షిత్తున కీవృత్తాంతము జెప్పుచున్నట్లుగ కథ నడచును.

జరుగుచున్న కథలో జరుగనున్న కథను సూచించుచు ఇతి వృత్త నిర్వహణమున శిల్పమును ప్రదర్శించుట ఈ కవి లక్షణము. ఉదాహరణమునకు 'సృష్టికి ప్రతి సృష్టి చేయగలదని యశోదతో చాడీలుగ చెప్పిన గోపి

కల మాటలందు కవి భావి కథా సూచనము చేసి తరువాతి కథలో విధాత గోపబాలతులను, గోవులను హరించినపుడు కృష్ణుడు వారిని ప్రతి సృష్టి చేసిన ఘట్టమును ప్రవేశ పెట్టును.

ఇందు ప్రథమాశ్వాసము చివర కవి భాగవత రామాయణమును ప్రస్తావించుట విశేషము. శ్రీరామ చరిత సంగ్రహము, రావణ వధ, విభీషణ పట్ట ధరణము, రాముడు భరద్వాజాశ్రమమున కేగి ఆతిథ్యమును స్వీకరించుట మొ. గు. అంశము లిందు గలవు. ఇట ప్రత్యేక సందర్భమును కల్పించి రామాయణ విషయము జెప్పినట్లు తోచును. ఇట్లు చెప్పుటలో పోతనవలె రామాయణ భాగవత కథానాయకుల కభేదము నంగీకరించుట చిన్నన్న తలంపు కాబోలు ! ఈ కవి ప్రతి ఆశ్వాసము చివర తన కృత్య ధీశ్వరి అలమేలుమంగాదేవి ప్రశంసయు, గ్రంథ సమర్పణము, కవి వంశ ప్రశంస, నిజకావ్య మహిమ వర్ణనము చేయుచుండును.

ద్వితీయాశ్వాసమున గజాసుర భంగము, కాళియనాగ గర్వ భంజనము, ప్రలంబాసుర మర్దనము, దేవేంద్ర గర్వాపహరణము, అరిష్టాసుర వధ, చాణూర మల్లునితో యుద్ధము, కేశినామకాసుర వధ, ఇత్యాది భంజన వృత్తాంతములు వివరింపబడినవి. ఇందలి ప్రతి వృత్తాంతము చిన్నన్న కవి ప్రతిభకు ప్రతిబింబమే. మచ్చునకు కాళియమర్దనమును పరికింపుడు.

**కాళియ మర్దనము :** గోపాలనము చేయుచు గోపాలుడు యమునా తీరమును చేరెను. అది మండు వేసవి. 'భండన గజదైత్య భండ నోద్దండ చండ తాండవ లసచ్ఛండికాధవుని'వలె అభ్రమున మార్తాండ మండలము మండుచున్నది. ఇట దైత్య భండన, చండ తాండవ పద ప్రయోగములచే జరుగనున్న కాళియతాండవమును సూచించుచున్నాడు కవి. ఆ మండుచున్న మార్తాండు డెవరోకాదు కృష్ణుడే యని వెంటనే స్పష్టము చేయబడినది.

ఆ మందు వేసవిలో పచ్చిక మేసి దప్పికతో మూతులు మీది కెత్తుచు అంబారవములతో బరువెత్తుచు కాళియ భుజగాస్య గహ్వరోదగ్ర హాలాహలాభీలమగు నొక మడువుగని ఆయుదకమును ద్రావి క్రేపుట్టి లావులు మూర్ఛల నొందెను. ఇది ఒక రూప చిత్రణము. ఆ హరి మడువు నకుమను దూకగనే కాలాహి సుధాకలశమును చుట్టినట్లు కాళియనాగు చక్రివి పొదివెను. తమఃపటలమును బాపిన సూర్యునివలె కృష్ణుడు ఆ భోగి భోగములు విడునట్లు తన్నెను, ఆ ఫణిశాయి పరసాధనమైన తన చరణ మును దాని ఫణాళిపై నుంచి, యాఫణాళియే రంగస్థలిగా కదలుచున్న కుండలములు గండ మండలమున తాండవ మాడుచుండ కాళీయుని పడగ లపై తాండవ మాడెను. ఆకసము నుండి నక్షత్రములు రాలినట్లు దాని పడగల నుండి మణులు రాలెను. ఆ భోగి శరీరము గుల్లల తిత్తియయ్యెను రక్తము దాని వాత దొట్టించి లీలతో కృష్ణుడు నవ్వెను.

ఇందు కృష్ణుడు సుధాకలశముతోను, తమస్సు బాపిన సూర్యునితోను పోల్చబడెను. కృష్ణుని దివ్యచరణమే పరసాధనమని కవి నిశ్చయాత్మక ముగ దెల్పెను. ఈ ధోరణి కవి తాత్త్విక చింతనకు నిదర్శనము. ఇది కాలము 'తమస్సు' అనగా చీకటి, అజ్ఞానము. కాల సంబంధమైనదే కాలి, కాళి. ఈ తమస్సును బాపు జ్ఞాన సూర్యుడే కృష్ణుడు. అతడొక సుధా కలశము. పొందదగిన జీవన పరమార్థము. ఆ పరాత్పరుని చరణమును శరణము వేడుటయే పరసాధనము. ఇదియే శరణాగతి. కాళిందిలోని విష జలములు భగవదీక్షణమున గాని అమృత రూపము నొందవు. ఇట్టి అమృత మయమైన భావములతో, అందమైన శైలితో, తెలుగు నుడికారపు సొంపుతో నిందలి కథలు సుందర బంధురము లైనవి.

ఈ యాఖ్యానమును చదువుచున్నపుడు కవి అసలు కృష్ణావతారము నకు కారణమైన కంసవృత్తాంతమును వదలి కృష్ణుని శృంగార లీలలు, ఇతర

రాక్షస సంహారములకు అధిక ప్రాధాన్యము నిచ్చి ఇతివృత్తమును సాగదీయుచున్నట్లనిపించును. కాని భావి కంసవధకు తక్కిన దుష్ట రాక్షస సంహారములు, అష్టమహిషీ కళ్యాణములకు కృష్ణుని శృంగార రసజ్ఞత్వ నిరూపణము బీజప్రాయములని గ్రహింపవలెను. అయినను ప్రలంబాసుర వధ తరువాత కవి వర్షర్తు వర్ణన చేయుచు - 'కంసవధోత్పాతమునకు ఉడు పంక్తి పడినట్లు నల్లడల వడగండ్లు పడె' నని వర్ణించి కంసవధ కథాసూత్రమును తెగనేయకయే రచన సాగించెను.

కొన్ని పట్టుల కవి చారిత్రక దృష్టితో కథను నడిపించెను. తృతీయాశ్వాసమున కృష్ణుడు మధురపై దండెత్తిన సందర్భమున - కృష్ణదేవరాయలు తురకలపై దండెత్తిన చారిత్రకాంశమును స్ఫురింపజేయుచున్నాడా యనునట్లు కృష్ణుడు తురక ఫౌజులను మట్టి గరపించెనని చెప్పెను. ఇట్లే 'కరవీరపుర' ప్రస్తావనము. ఇది కాళింది యవల గలదు. ఈ కరవీర పురమే నేటి కొల్‌హాపూర్.

ఇక, చతుర్థాశ్వాస మంతయు రుక్మిణీ కళ్యాణమే. అన్న వివాహము తరువాత తమ్ముని వివాహము జరుగుట హిందూ సంప్రదాయము. దీనిని పాటించియే చిన్నన్న అశ్వాసారంభమున రేవతీ బలరాముల వివాహమును క్లుప్తముగ జరిపించి ఔచిత్యమును పోషించెను. కృష్ణుడు రుక్మిణీ కళ్యాణమునకు బయలుదేరిన సన్నివేశమును బహుభాషా పాండిత్యముతో ఒక ప్రత్యేకత సంతరించుకొనునట్లు చిత్రించెను. అశేష సేనా నివహముతో చక్రాద్యాయుధములతో కృష్ణుడు రుక్మిణీ కళ్యాణమునకు బయలుదేరినట్లు చెప్పి కలుష గర్వాపహరణమును కృష్ణుని అవతార లక్ష్యమును కళ్యాణ సన్నాహమున సూచించి పోషించినాడు చిన్నన్న. పురాణములందు సహితము రుక్మిణికి తప్ప జాంబవత్యాది తదితర కృష్ణ మహిషుల ప్రాధాన్యమంతంత మాత్రముగుటచే కాబోలు పంచమాశ్వాసమును ఒకే పందిరి క్రింద ఏడు పెళ్లిళ్ళు ఒక్క పెట్టున వరుసగ నిర్వహించినాడు కవి. ఈ యాశ్వాస

మున వీరందరు కేవలము పెళ్లిళ్ళ కొరకై ప్రత్యక్షమైన తాత్కాలిక పాత్రలా అనిపింతురు. ఈ యాశ్వాసములో కథ వేగముగా పరుగెత్తినది.

ఈ కావ్యము 'అష్టమహిషీ కళ్యాణ'మైనను ఐదింట మూడా శ్వాసములు కృష్ణుని బాల్య క్రీడలు, యౌవన లీలలు చెప్పుటను బట్టి కవి—కళ్యాణముల వరకు గల కృష్ణుని చరిత్రమున కంతటికిని ప్రాధాన్యము నిచ్చి ఆ కృష్ణ పరమాత్ముని అనంతలీలా కళ్యాణ గాథలను రసాభివ్యక్త్యపేక్షతో వర్ణనా సుందరముగ కవితా గానము చేసినట్లు తోచును. ఫలశ్రుతి యందును "ఈ కృష్ణ చరితంబు నెవ్వరు విన్న, వ్రాకుచ్చి తలచిన వారి కెల్లపుడు చిరతరాయువులును జింతితార్థములు సిరియుఁ గృష్ణుని కృప జెందుదురనఘ" అని చెప్పుటను బట్టి కావ్య నామధేయము 'కృష్ణచరిత' మనుట లెస్స యనిపించును.

ఆద్యంతములు ఏకబిందు ప్రతిష్ఠితమగుట కావ్య లక్షణము. అష్ట మహిషీ కళ్యాణము నందు ఇతి వృత్తము దేవకీ వసుదేవుల 'వివాహముతో ప్రారంభమై' కృష్ణ లక్షణా 'వివాహముతో ముగిసినది.' 'మంగళాదీని మంగళ మధ్యాని మంగళాంతాని' అను శుభ పరంపర ఇందు పరిపూర్ణముగ విలసిల్లినది.

***మాతృక-మౌలికత్వము :*** అష్ట మహిషీ కళ్యాణమున కవి ఆధార గ్రంథమును పేర్కొనలేదు కాని బమ్మెర పోతన భాగవతమే దీనికి మూలమని భావింపవచ్చును. కథా కథనము, వర్ణనా విధానము, శబ్దాలంకార శోభితమైన శైలి, అనుప్రాసిక రచనా విన్యాసము, వైష్ణవభక్తి తత్త్వ ప్రతిపాదనాదృష్టియే కొన్నిచోట్ల యందు భాగవతమే చిన్నన్నకు మార్గదర్శకము. భాషా విషయమున జాను తెనుగుతో కథను దేశీయముగ తీర్చి దిద్దుట వలననే ఈ కావ్యమునకొక ప్రత్యేక ఆకర్షణము కలిగినదని చెప్పవచ్చును.

చిన్నన్న పోతన్న వలె పౌరాణిక పద్ధతిలోనే కథా ప్రారంభము చేసెను- "అలరి దేవకి యందు నతుల లగ్నమున శ్రావణ మేచ కాష్టమి విధితార నావిర్భవించె శ్రీహరి నడురేయి" అనుచు కృష్ణావతార సందర్భమున భాగవతమున లేని మేచకాష్టమిని ప్రవేశ పెట్టినాడు చిన్నన్న. ఇట్లే భాగవతమున లేని వివాహ సంప్రదాయములు కొన్ని చిన్నన్న కావ్య మున చోటు చేసికొన్నవి. ఇంకను గొల్ల సుద్దులు, చల్లలమ్ముట, ఏలపద ములు, గజ్జెలు, కటి సూత్రములు, పూసల పేర్లు, పులిగోరులు, రావి రేకులు ధరించుట వంటి సామాజిక వస్తు ప్రస్తావనము భాగవతమున కంటె అష్ట మహిషీ కళ్యాణమున అధికముగ కనిపించును. మొత్తము మీద చిన్నన్నకు పోతన భాగవతమే ఆధార గ్రంథము.

## పాత్ర చిత్రణము

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే"

అని ఆనందవర్ధనుని ధ్వన్యాలోకము. కవి తన కావ్య ప్రపంచమున గావిం చెడి సృజన నిర్మాణకార్యక్రమములో ప్రధానమైనది, ప్రతిభను చాటునది పాత్ర పోషణమే. రసపానమున కాధారమైనది పాత్ర. కావ్యములందును రసాస్వాదనమున కాధారములైనవి పాత్రలు. పాత్రల స్వరూప స్వభావ ముల కనుగుణముగ పాత్ర చిత్రణము గావించిననే రసస్ఫూర్తి కలుగును. పాత్ర వర్ణనము, పాత్ర చిత్రణము, పాత్ర పోషణమను సోపానక్రమము సజీవ పాత్ర చిత్రణమునకు అవస్థా భేదము.

కథను దెలుపుచు సందర్భానుసారముగ పాత్రల గుణగణములను కవి తానుగ వర్ణించినచో అది పాత్ర వర్ణనము. కొన్ని సన్నివేశములందు

పాత్ర చిత్రణము

ప్రతిభావంతుడైన కవి వ్యక్తి స్వరూపములకు తైలవర్ణ చిత్ర దర్పణము నిచ్చి తానొక అక్షర చిత్రకారుడనిపించుకొనును. పాత్రల గుణగణములను, మనస్తత్వమును విభిన్న సన్నివేశములందు సూక్ష్మాతి సూక్ష్మములైన వాని మానసికావస్థలను తానుగ చెప్పక సంఘర్షణాత్మక వాతావరణమును తగిన రీతిని కల్పించి పాత్రలను రంగస్థలము మీదికి విసరి కథను వేగముగ నడిపించుచు తానుకూడ ఒక ప్రేక్షకునివలె చూచుచు ఆయా పాత్రల సంభాషణముల ద్వారా వారి వారి గుణములను పాఠకులకు అవగతము చేయుటను పాత్ర చిత్రణమందురు. పాత్ర పోషణ మనగా మానవాతీత శక్తులను ప్రదర్శించు పాత్రల దివ్య శక్తికి గల కారణమును తొలుతనే బీజావాపముగ దెలుపుచు దాని పరిణితిని క్రమముగ ప్రతిపాదించుచు పాత్ర స్వభావమును పోషించుట.

ప్రకృతము అష్టమహిషీ కళ్యాణమున కవి తానుగ శ్రీకృష్ణ జాంబవతీ సత్యభామాది పాత్రల గుణరూప సౌందర్య విభవ వర్ణన చేయుట కలదు. కథను నడిపించుచు తానొక ప్రేక్షకుడై శ్రీకృష్ణ బ్రాహ్మణ సంభాషణము ద్వారా రుక్మిణీ పాత్ర గుణగణములను పాఠకుల కవగతము చేయునట్టి పాత్ర చిత్రణా ధోరణియు కలదు. ఇట్లే మానవాతీతమైన కృష్ణుని దివ్య శక్తికి గల కారణమును అవతార కాలమునందే తెలిపి కథా గమనమున దుర్జన భంజనాదులంను ఆ పాత్ర స్వభావమును పోషించు పరిణతియు కలదు. ఈ కావ్యమున శ్రీకృష్ణ బలరామాది 22 పురుష పాత్రలు, అష్టమహిషాది 15 స్త్రీ పాత్రలు, కంసాది 18 అసుర పాత్రలు మొత్తము 55 పాత్రలు కలవు, ఇందు కొన్ని ప్రధాన పాత్రలను పరిశీలింతము.

**శ్రీకృష్ణుడు :** "కర్షతి ఇతి కృష్ణః" అని కృష్ణ శబ్ద నిర్వచనము. అనగా ఆకర్షణము గలవాడని అర్థము. లీలామానుష విగ్రహుడైన కృష్ణుడు ధర్మ సంస్థాపనార్థమై అవతరించిన కారణ జన్ముడు. శ్రీకృష్ణుని

రూప వర్ణనము అష్టమహిషులతోడి వివాహ సమయములందే కాక వివిధ సన్ని వేశములలో విస్తృతముగ కనిపించును. "అలంకార ప్రియో విష్ణుః" అను ఆర్యోక్తిని దృష్టియందుంచుకొని కావోలు శబ్దార్థాలంకారములతో కృష్ణుని పలుతావుల రమ్యముగ అలంకరించినాడు చిన్నన్న. "వికసిత నయనారవిందంబులకును, చకచకల్గల చూపు చందమ్ములకును, తిలకంబుమై నెఱితేఁటి మూఁకలకు మొలక నవ్వుల తేనె ముసురు జోకలకు" అని వర్ణించి కృష్ణుని ప్రత్యవయవ సౌందర్యాధిక్యమును ఆవిష్కరించినాడు కవి.

రుక్మిణీ కళ్యాణ ఘట్టమున దూతగ ద్వారక కేగి వచ్చిన బ్రాహ్మణుడు తాను చూచిన కృష్ణుని వర్ణించుచు విలాసినీ మణులు రాజోచితోపచారములు చేయుచుండ సింహాసనాసీను తారేశు పగిది నుండి జగన్మోహనాకారుడై యొప్పుచున్నట్లు చెప్పెను. కళ్యాణ కృష్ణుని జగన్మోహనుడనుట సముచితము. తారేశునితోడి పోలికలో కృష్ణ సౌందర్యమే కాక, అతని బహు భార్యాత్వము, చంద్రవంశ సూచనము గూడ నిమిడి యున్నవి. రుక్మిణిని తేనున్న సందర్భమున కృష్ణుని రూప చిత్రణమిట్లు కలదు.

"చిఱు తేఁటి తెక్కలే జిగిదు వాడింపు
మెఱుఁగారు నూనూఁగు మీసలవాని
గ్రమ్మివీనులతోడఁ గదియుచు వాని....
పంచాస్త్రి కోటికిఁ బంచాస్త్రిఁదగుమఁ
బంచాయుధములఁ జొప్పడి యున్నవాని...." (పు. 205)

శ్రీకృష్ణవరుని రుక్మిణి వీక్షించినదట. ఇందు నూత్నయౌవనుడైన నూగు మీసాల కృష్ణుని రూపము అందముగ చిత్రింపబడినది.

ఈ కావ్యములో పూతన సంహారము నుండి కంసవధ వరకు కృష్ణుడు దుష్ట రాక్షస సంహార తత్పరుడుగ కనిపించును. కళ్యాణ నియమము లగు మత్స్య యంత్ర భేదన వృషభ సంహార సందర్భము లందును.

త్నన్ను ప్రతిఘటించిన రాజుల తోడి యుద్ధము లందును కృష్ణుడు యుద్ధ వీరుడుగ దర్శనమిచ్చును. మరి కొన్ని తావుల సరస చమత్కార సంభాషా ప్రియుడుగ కనిపించును. అతని సరస ప్రసంగమున కీ క్రింది పంక్తులు చూడుడు-

"మంజీర కుచయోర్తు మంజుల కుంజ
మంజరు లొసఁగ నమ్మాధవుం డలరి
విరిమొల్ల నొల్లను వెలఁది నీ చన్ను
విరిగుత్తులే నాకు వేడుక యవిన...." పు. 237.

అక్రూరుని ఆదరించుటలోను, రుక్మిణి నుండి వచ్చిన బ్రాహ్మణ పురోహితుని గౌరవించుటలోను శ్రీ కృష్ణుని అతిథి పూజ, భక్తానుగ్రహము నిరూపింపబడినవి. మృత్యుముఖము నుండి గురుపుత్రుని దెచ్చి సమర్పించి గురుఋణ విముక్తుడగుటలో గురుజన విధేయత అను ఉత్తమ పురుషుని ఆదర్శలక్షణము చెప్పబడినది. శ్యమంతక వృత్తాంతమున నిందను సహింపని కృష్ణుడు కనిపించును.

ఇక శ్రీకృష్ణుని మృద్భక్షణ విశ్వరూప ప్రదర్శనము, కాళియ మర్దనము, శకటాసుర భంజనాది బాల్య చేష్టలు అమానుష లీలలు కృష్ణుని ఐశ్వర్య (ఈశ్వర) భావ సూచకములు. గోపికలతో రాసక్రీడలు, శృంగార చేష్టలు అలౌకిక ప్రాణచర్యలకు సంబంధించిన అద్భుత లీలలగుటచే వానిని మానవ-మాత్రు లనుసరింపరాదు. కనుకనే శ్రీరాముని ప్రవర్తనము, శ్రీకృష్ణుని భగవద్గీత లోకాదర్శమని పెద్దల వచనము.

మొత్తము మీద ఈ కృతిలో చిన్నన్న బాల కృష్ణుని, లీలా కృష్ణుని, యౌవన కృష్ణుని, శృంగార కృష్ణుని, పట్టాభిషిక్తుడైన రాజకీయ కృష్ణుని, దుష్ట శిక్షణ చేసిన అవతార కృష్ణుని, శత్రురాజులను యుద్ధము

లందు జయించిన వీర పరాక్రమ కృష్ణుని- ఇట్లు బహుముఖీనముగ శ్రీ కృష్ణుని పాత్రను చిత్రించి తన పాత్ర చిత్రణా నైపుణ్యమును ప్రదర్శించెను.

*రుక్మిణి* : చిన్నన్న చతుర్థాశ్వాస మంతయు రుక్మిణీదేవికే కేటాయించుటకు కారణము నాటికే జనప్రసిద్ధమైన భాగవత రుక్మిణి కావచ్చును. భాగవతముపై చిన్నన్నకు గల ప్రీతియు కావచ్చును. కృష్ణున కీమె ప్రథమ పట్ట మహిషి. లక్ష్మీదేవి యవతారము. "రాఘవత్వే భవేత్ సీతా రుక్మిణీ కృష్ణ జన్మని" అను విషయమును చిన్నన్న–

"....హరి రాముఁడైన, ధరణిజయను పేర ధరణి జన్మించి
యా రాముఁడీ రాము ననుజన్ముఁడైన
నారామ రుక్మిణీ యనుపేరఁ బరఁగి
జనక సమాన భీష్మక మహీ పతికి
దనుభవా భావంబు దాల్చిన నాఁట" (పు. 173)

అని జనకుడే భీష్మకునిగా, సీతయే రుక్మిణిగా, రాముడే కృష్ణునిగా ప్రతి పాదించెను. పోతన భాగవతమున ఈ విషయ మంతయు చెప్పక రుక్మిణి భీష్మకుని కుమార్తె యని మాత్రమే చెప్పెను. చిన్నన్న వారి వారి పూర్వ జన్మలను గూడ పరిచయము చేయుట విశేషము.

కవి రుక్మిణి సౌందర్యమును పలు తావులలో వర్ణించెను. ఆమె రెండవ తరుణేందు రేఖయో యనువట్లు ఒకనాఁటఁ బెరుగుట యొకపూటఁ బెరిగినదట'. 'బాలయై యలకాప్త ఫాలయై బద్ధలీలయై శుభగుణశీలయై పొదలి బాల యయ్యును గుణప్రబలతఁ బ్రోడ యైనదట. (పు 17౧). "మగవారి వలపించు మగువలు కలరు మగువల వలపించు మగువలు గలరె" యను నొక్క మాటలో రుక్మిణి సౌందర్య విభవమంతయు కనుల యెదుట బెట్టినాడు కవి. రుక్మిణి కృష్ణునొద్దకు విప్రుని బంపుదు–

పరమ నిశ్చయముగా భావించియేను హరికిఁ గట్టితి మున్న నాత్మ కంకణము
రేఁపె లగ్నము సిరిరేఁడు రంజిలఁగ నీ పని యెఱిఁగింపు మీ ప్రొద్దుపోయి"
— పు. 181.

అని తన ఆత్మ నిశ్చయము నెరిగించినది. "లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాడు గోవిందుడు ద్విగ్నంబయ్యెడి మానసంబు" అని చింతించిన పోతన రుక్మిణి వలె నీమెయు మానసికాందోళన మందినది. "దిక్కెవ్వరును లేరు దేవరే కాని దిక్కు రుక్మిణి కని దెలియంగ ననుము" అని చిన్నన్న రుక్మిణి శరణాగతి నాశ్రయించినది. హరికి గట్టితి మున్న నాత్మ కంకణము అను నామె మాటలలో సర్వాత్మనా సమర్పణ భావము సువ్యక్తము. కనుక రుక్మిణి అనురాగము ఆత్మ సంబంధమైనదే కాని సామాన్యమైనది కాదు. అది 'యతికి — హరికి' గల సంబంధము వంటిది. ఈమె ధ్యానము కూడ అలౌకికమైనట్టిదే. ఈ రహస్యమును చిన్నన్న "నిరుపమ లావణ్య విధిమూర్తిఁ దలఁచి యతి దూరమున నుండి హరిఁగూడి యుండుగతి నుండె ధ్యాన సంగతి నంత" అను ద్విపద వాక్యములలో స్పష్టము చేసెను. ఈ రుక్మిణీ తత్త్వమును గ్రహింపలేని రుక్మి తన సోదరిని శిశుపాలునకు కట్ట దలచెను. అతడు తనకు అన్న అయినందులకు బాధ పడుచు "శౌరి నొల్లని వారు జగతి గల్గినను వారి నే నొల్ల మావారైన నేమి ?" యనుచు తన అనన్య కృష్ణ భక్తిని ప్రకటించినది.

"....నగరంబు వెలువడ నగజాతను మ్రొక్కఁ
బెండ్లికి షుమపదఁ బెండ్లి కూతుఁ
నెలమి మావారు పంపుదురేనట్లు
పురము వెలువడి యేతెంచి భూతనాధు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమునకు
వచ్చి కొని పొమ్ము నన్ను నవార్య చరిత."

అవిప్రౌఢ వలె పలికిన భాగవత రుక్మిణికి ఉన్నంత చొరవ, మాటకారి తనము చిన్నన్న రుక్మిణి యందంతగ కనిపించదు. కృష్ణునకు కబురంపుచు విప్రునకు చెప్పి పంపిన మాటలలో గూడ చిన్నన్న రుక్మిణిలో వినయ మౌగ్ధ్యమే కనిపించినది. అపన్న శరణ్యుడన్నమాట సత్యము సేయుమ నుచు వేయు బాగుల నాదు విధమెల్ల జెప్పి ప్రాధేయపడి హరివి తోడి తెమ్మని బ్రాహ్మణునకు చెప్పి సీత హనుమంతునకు ముద్రిక విచ్చినట్లు హోమ ముద్రిక నొక దానినిచ్చి యేకతమున హరికి నిమ్మని పంపినది. పోతన రుక్మిణి యిట్లు చేయలేదు. ఇట సీతా హనుమంతుల పోలికతో రుక్మిణి సీతాదేవి యొక్క అంశ యను సంగతి మరొకసారి ధృవపరచి నట్లయినది.

విప్రుని రాకకై యెదురు చూచిన భాగవత రుక్మిణి ఎంతయో ఆవే దన చెందినది. అసలా సన్నివేశమే చిన్నన్న కావ్యములో కానరాదు. మరియు శుభవార్త తెచ్చిన విప్రునకు రుక్మిణి కృతజ్ఞత చెప్పిన విషయ మిందులేదు. కాని కృష్ణుని ఎడబాటు సహింపలేని బేలతనము, అమాయక త్వము చిన్నన్న కృతి యందున్నంతగ భాగవతమున కనిపించదు. పరిశీ లింపగా చిన్నన్న కావ్యమున రుక్మిణి పాత్ర వర్ణనమే అధికము. పెళ్లి పీటలపై నున్న రుక్మిణి తలబ్రాలుపోయు సన్నివేశ వర్ణనము చూతుడు.

"పసగల గిరుతు గుబ్బల నానవైచి చిఱుఁగురు లొకపరి చెలువుగా దువ్వి, నెఱిఁగప్పుగల గొప్ప నెఱిగొప్పు దురిమి కుఱువేరు విరిదండ కూడంగఁ బెనఁచి, కన్నులంచులఁదేటగా జెన్ను మిగుల సన్నంబుఁగాఁ గజ్జల రేఖఁదీర్చి కౌనసియాడ చన్గవ ముద్దుగునియ తెప్పలనాన వలినాయ తాకి హరిమీద తలబ్రాలు పోసినదట. (పు. 207). ఇట్లు ప్రతి సన్నివే శము వర్ణనాత్మకముగనే రుక్మిణి పాత్ర చిత్రింపబడినది.

చిన్నన్న రుక్మిణి బాలయై బేలయై గుణప్రోఢయై, సౌందర్యరాశియై, యోగినియై పఠితల మనో మందిరముల నిలచియుండును.

**దౌత్యము నెఱపిన బ్రాహ్మణుడు : దూతలు మూడు జాతులు.** 1. నిసృష్టార్థుడు - పంపిన వారి యొక్కయు నెదిరి యొక్కయు అభిప్రాయము నెరిగి స్వయముగ తానందులకు తగినట్లుత్తరము పలికి కార్యమును సాధించువాడు. ఇతడుత్తముడు. 2. మితార్థకుడు - మితముగ మాటాడి కార్యసాధన చేయువాడు. ఇతడు మధ్యముడు. 3. సందేశహారకుడు—చెప్పినదె తిరిగి యెదిరికి చెప్పివచ్చువాడు. ఇతడధముడు.

అష్టమహిషీ కళ్యాణమున దూతయగు బ్రాహ్మణుడు వార్తాహరుడు మాత్రము కాదు. రుక్మిణీ కృష్ణుల హృదయము లెరిగిన ఇంగితజ్ఞుడు. తాను నిర్వహింపబోవు కార్యము సఫలమై తీరునను ఆత్మ విశ్వాసము కలవాడు. మరియు కార్య నిర్వహణమున చాకచక్యము గలవాడు. తనదైన చమత్కార భాషణముతో వైదర్భి గుణ సౌందర్యములను వర్ణించి కృష్ణుని మనసును మెప్పించి యాతనిని ఒప్పించి రుక్మిణికడకు రప్పించిన కార్యసాధకుడగుటచే నితడు నిసృష్టార్థుడు. ఇతని వాక్చాతుర్యము కృష్ణుని తోడి సంభాషణమున కనిపించును "దీన శరణ్య" ! యోదివిజారివైరి హరి నీవె యుంగని యది యొండు గలదె ధరలోన మము మాయ ద్రవ్వింప నేల ? యనుచు కృష్ణునితో సంభాషణ మారంభించెను. ఇట్టి స్తుతి ఎదుటివారిని తప్పక వశపరచు కొనగలదు. సంభాషణా ప్రారంభమున ఇట్టి తెలివిని ప్రదర్శించుట కార్యసాధకుడైన దూత మొదటి లక్షణము. 'దీన శరణ్య' ! అను సంబోధనములోనే రుక్మిణి స్థితిని, తాను వచ్చిన పనిని ధ్వనింప జేయుట ప్రౌఢము.

తరువాత రుక్మిణి వృత్తాంతమును, తను వచ్చిన పనిని వివరించుచు "వినుము కుండినపుర విభుడు భీష్మకుని పుత్రి వైదర్భి....మిమ్ము నట వేగఁ దోడి తెమ్మని నన్ను బనిచె' అని బ్రాహ్మణుడు పలికెను. ఇతడు కేవలము సందేశహారకుడైనచో అతని కర్తవ్యమీ మాటతో పూర్తి అయినది. కాని అతడంతటితో నూరకుండలేదు. ఆమె గుణరూప సౌందర్యమును

కృష్ణుని హృదయమునందు హత్తుకొనునట్లు వర్ణించి చెప్పెను. అంతేకాదు-
"పరతి రూపేమని పచరింతుఁ దుర్రిది నీవె శ్రీహరివి యా నీలాహివేణి
భావింప నాది మా పద్మా వధూటి" యని రుక్మిణీ కృష్ణులే లక్ష్మీ నారాయ
ణులుగ గుర్తించి స్తుతించినాడు. రుక్మిణిని చేపట్టుటకు నీవె తగుదువు కాని
శిశుపాలుడు తగడని చెప్పుచు-

"కామధేనువు పాలు ఘనుఁడైన యట్టి
సోమయాజికిఁగాక శునకార్హమగునె" (పు. 187)

యనుచు చైద్యుని కుక్కతో పోల్చుటయే గాక రుక్మిణి దైవత్వమును,
పావిత్ర్యమును సూచించెను. ఇతని మాటలకు కృష్ణుడు సంతసించి ప్రస
న్నుడైనాడు. రుక్మిణిని వివాహమాడుట కిచ్చగించి తనరాక నెరింగింపుమని
పలికి బ్రాహ్మణుని మన్నించినాడు. ఇతడును గొప్ప శ్రీహరి భక్తుడే.
ఇతని చిరకాల పురుషోత్తమ దర్శనాకాంక్ష ఇట్లు దౌత్యమిషమున నీడేరినది.
ఇతడీ దౌత్యము నొక పవిత్ర కార్యముగ భావించి నిర్వహించెను.
ఇందాతని పరోపకార పరాయణత్వము వెల్లడియగుచున్నది. రామా
యణమున హనుమంతున కెట్టి స్థానము గలదో, భాగవతమున
రుక్మిణీ కృష్ణులను కలిపిన నీ బ్రాహ్మణున కట్టి స్థానము గలదని నిర్ణ
యింప వచ్చును. ఇంత కీలకమైన దౌత్యమును నెరపిన ఈ బ్రాహ్మణుని
పేరెచటను లేదు. ఇప్పట్టున పోతన భాగవతము నందలి విప్రపరాయణారము
చిన్నన్నకు మార్గదర్శకమై యుండవచ్చును. చిన్న పాత్ర అయినను
చిన్నన్న ఈ బ్రాహ్మణుని సజీవ శిల్ప సుందరముగ మలచినాడనుట
నిస్సందేహము.

**అక్రూరుడు :** అక్రూరు డనవరతాక్రూరుడు. అనఘుడు, అను
పమ హరిభక్తుడు. కంసుని ఆజ్ఞ నొదల దాల్చువాడు. మధురలో జరుగు
ధనుర్యాగమునకు బలరామకృష్ణులను గొనిపోవుటకై వ్రజపురికి వచ్చు

సందర్భమున నితని పాత్ర ప్రవేశమైనది. 'ఏదాన ఫలమొ నాకీ దానవారి పాదారవిందముల్ భజియింప గలిగె.... నా మాధవుని గాంచునట్టి నాపుణ్య మేమని వర్ణింతు'నని తన పుణ్య విశేషమున కెంతయో సంబర పడిపోయి నాడు. "ఇందిరా కాంతు నరిబుద్ధినైనఁ దెమ్మని పంచె నాకుఁ బరుదె కంసుఁడు ప్రాణ బంధుండు గాక" అని అట్టి అవకాశము తన కిచ్చిన కంసుని ప్రాణబంధునిగ భావించి కృతజ్ఞత పలికిన సుహృదయుడు, మహా భక్తుడు. బలరామ గోవింద పాదార విందముల పొడ గాంచి అరదము దిగ్గి కడు పొంగి కన్నీరు గార్చినాడన్నచో ఇతని భక్తి పారవశ్యము అసామాన్యము.

శ్రీకృష్ణుడితని భక్తికి అలరి అక్రూర ! లెమ్ము లెమ్మని ఆదర ముతో గౌరవించి వాని వెంట బలరామునితో బయలుదేరెను. శ్రీకృష్ణు నితడు గొనిపోవునపుడు కృష్ణుని వియోగమును భరించలేని గోపికలు 'అక్రూరుడ క్రూరుడ యెద రందరు అక్రూరు నేతిబీరనెడి చందమున' అని ఇతనిని నిందించిరి. ఇట్లు వారు నిందించుటకు అక్రూరుని భక్తివైభవమే కారణము.అతనిలో కృష్ణుని వెంట గొనిపోవునంతటి భక్తి కలదు కావుననే అక్రూరుని గాంచి గోపిక లసూయపడిరి.

ఈ కృతిలో దాస్యభక్తి ఆకృతి వహించిన సుకృతియే అక్రూరుడు. చిన్నన్న ఇతని పాత్రలో విష్ణుభక్తికి ప్రాణము పోసెను.

***కంసుడు :*** ఇతడు శ్రీకృష్ణుని మేనమామ. ఇతడు స్వహస్తము లతో సోదరి దేవకి వివాహము చేసి ఆనందించినవాడే కాని 'ఈ నాతి యెనిమిదయవ పట్టి యిల నిన్ను బట్టి తునిమెడు' నని అశరీర వాణి పలు కగనే ప్రాణభయముతో వెంటనే చెల్లెలను చంపబూనిన మూర్ఖుడు. ఇంత లోనే 'ఈ తన్వి బిడ్డలనెల్ల నీ చేతి హేతి ఘాతికి నిత్తు'నని వసుదేవుడు పలుకగా మెత్తబడి అప్పటి కంగీకరించినాడు.

నారదుడు వచ్చి సరసిజాక్షుడు నిన్ను జంపబుట్టగలడని తెలిపిన వెంటనే భయకంపితుడై చెల్లెలను బావను చెరసాలలో బంధించి సోదరీ సుతుల నార్వురను సూనోపమాకృతులను నిర్దాక్షిణ్యముగ వధించిన కఠిన చిత్తుడితడు. కంసునకు తన ప్రాణరక్షణమే ప్రధానము. ధర్మాధర్మములు, తన పర విచక్షణా జ్ఞానము లేదు. సూతికాగారమున పసిబిడ్డ (యోగమాయను) చంపబోగా యోగమాయ మాయమగుచు అసలు విషయమ్ము తెల్పెను. వెంటనే చెల్లెలను బావను క్షమాపణ వేడి వారిపై కొంత దయ చూపించెను. తనను హరియింప బుట్టిన హరిని హరియించు ఉపాయమును మంత్రులతో ఆలోచించెను. ఆ మంత్రాంగ ఫలముగా పూతన, శకటాసురులను ప్రయోగించుట కంసుని కుటిల రాజనీతి కుదాహరణము.

అసలు కృష్ణావతార కారకులలో కంసుడొకడు. జననకాలమందే కృష్ణుడు దుష్ట కంసుని శిక్షింతునని పలికెను. కంసునకును తన ప్రాణాపాయకరుడైన కృష్ణునిపైననే శత్రుత్వము గాని దేవకీవసుదేవులపై గాదు. అక్రూరుని పంపి బలరామకృష్ణులను రప్పించి కువలయాపీడమను గజము చేతను, చాణూర ముష్టికులను మల్లయోధులచేతను చంపింప బూనుట కంసుని నయ వంచనమునకు నిదర్శనము. కృష్ణునితో ముష్టియుద్ధమునకు దిగినపుడు సింహమువలె పరాక్రమముతో నెదిరించినాడట. కృష్ణుడితనిని నారసింహుడు హిరణ్యకశిపుని పట్టుకొనినట్లు పట్టుకొని సంహరించెనట. ఈ ఉపమానమునందితని పూర్వ చరిత్ర సూచింపబడుట గమనార్హము. కృష్ణుడు కంసుని వధించి ముక్తి నొసగెను. శత్రువునకు ముక్తి నిచ్చుట ఏమి?

"అరి బుద్ధినైన శ్రీహరి నెంచెఁగాన
ధరణి గంసుండు నత్తఱి ముక్తుఁడయ్యె" (పు. 144)

**వీర రసము :** వీరమునకు స్థాయి ఉత్సాహము. దానదయ ధర్మ యుద్ధ భేదమున వీరము నాలుగు విధములు. ఈ కృతిలో యుద్ధ వీరము పోషింపబడినది. పూతన, శకటాసుర, ప్రలాంబాసుర, చాణూర ముష్టిక, కంసాది దుష్ట దానవ సంహారములందును, రుక్మి, శిశుపాలాది రాజన్యుల తోడి యుద్ధ సన్నివేశములందును వీరము పోషింపబడినది.

పూతన వధలో "అమృతాంశు కుల భవుండగు శౌరి రాత్రి కమలాగ్ర తటము భృంగంబును బోలి జెలగి తీయని నోటఁ జేదు మేయంగ బొలిచి తీయని పాలబుగ్గలుబ్బించి కలగి తీపైన యక్కరటి ప్రాణములు జలధి గ్రోలెడి కలశజు రీతి" గ్రోలినాడట. పూతన విగత చేతనమై కూలగా దానిపై 'కుంజరి మధ్య బాలసింహము' వలె బాలుడాడెనట. ఇందు రక్కసియైన పూతన మదము, చిన్ని కృష్ణుని ఉత్సాహము సూచితమై శౌరి సింహ పరాక్రమ మభివ్యక్తమై వీర రస పోషణమునకు దోహదమైనది. ఇట్లే కాళియ మర్దనమున 'పెంచి కుప్పించి గుప్పించి నొప్పించి' అనెడి వీరరసానుకూల రచనా విన్యాసము చిన్నన్న రసపోషణా నైపుణికి నిదర్శనము.

రసమును వాచ్యము చేయుట దోషమందురు. రుక్మిణీ కళ్యాణమున చిన్నన్నయు "వీరరసావేశ వివశుడై వాడు.... (పు. 195). అని వీర రసమును వాచ్యము చేసినాడు.

**హాస్యము :** దీనికి హాసము స్థాయి. ప్రాచీన కాలమున హాస్యరస ప్రధాన కావ్యము లంతగ కానరావు. హాస్యము పేర చమత్కారమే కవిపించును. తిక్కన భారతోత్తర గోగ్రహణ ఘట్టములో ఉత్తర కుమారుని ప్రగల్భ వచనములందు కొంత హాస్యము కలదు.

అష్టమహిషీ కళ్యాణమున - 'ఘన హస్య రసము శృంగార మధ్యమునఁ గొనకొన్నగతి' నుండవలెనని చిన్నన్న అభిప్రాయపడెను.

యేలరా కృష్ణ మమ్మేలరా చలము
చాలరా నీకును జాలరా యిదియే.... (పు. 81)

అని పలికిన మాటలలో వారి అమాయకపు ప్రేమ వ్యక్తమగుచున్నది.

శ్రీకృష్ణుడు సకల గోపికల కాంక్షలు దీర వేయి బాహుల కౌగిలించి, వేయి వాతెరలచే నా తరుణుల యధరముల్ తవివార గ్రోలి, చదురున నఖ సహస్రముల నొక్కుచును నుదుట గుబ్బె తల మైనొత్తు లొత్తుచును రతి కళా కేళలముతో వారి నెలయించి తిరోహితుడయ్యెనట. ఇది కవి పురుష సూక్తములోని పరమాత్ముని పరతత్త్వ ప్రతిపాదనము అత్యద్భుతముగ గావించెను. అంత గోపికలోపికలు కోల్పడి విరహ వేదనాదోదూయమాన రూపికలైరట. రత్యనంతరము వారు 'మొగములు వాడ క్రొమ్మొక్కెంతపీడ పగడంపువాతెఱల్పలుమాఱు నెండ జరణముల్ దొట్రిల్ల జఘనంబు లదర కరములు చెమరింప గౌనులల్లాడ' కృష్ణుని యెడ అనురాగ వల్లికలుగనుండిరట. ఇందలి అంత్య ప్రాసము వారి భావ సంతృప్తికి అనుకూల వేషము. ఇట్లని గోపికా శృంగారము లౌకిక కామ వాసనా వాసితము కాదు. జీవాత్మ పరమాత్మల ఐక్యానుసంధాన రూప మధుర భక్తిమయము. కవి యీ విషయమును 'పరమ యోగీంద్రుల భాతి గోవింద పరచింత చేయుచుఁ బరచింత లుడిగి సకల శరీరి యీశ్వరు నూహచేసి' అను వాక్యమున యౌగిక గోపికా హృదయమును బహిర్గతము చేసెను. ఈ గోపికా ప్రణయమున స్వచ్ఛమగు భాగవత వాతావరణము నెలకొవినది.

గోపికలు శ్రీకృష్ణునితో రాసక్రీడలో భాగస్వామ్యులైరి. వారిని చిన్నన్న- ప్రణవ సంపుట మంత్రరాజ బీజములవలె గణుతి కెక్కినట్లు వర్ణించి వారి నిజ తత్త్వమును నిరూపించెను. గోపికలు శ్రీకృష్ణుని పరాత్పరునిగ గుర్తించిన బ్రహ్మ వాదినులు.

ఈ కృతిలో చిన్నన్న శ్రీకృష్ణ పట్ట మహిషుల కన్న మిన్నగా గోపికలను తీర్చి దిద్ది పాఠకుల హృదయముల నాకర్షించెను.

చినన్న చిత్రించిన ఈ గోపికలు ఆధ్యాత్మిక-శృంగార రస భావ మిశ్రిత పాన పాత్రికలు.

ఈ కావ్యములో చిన్నన్నకు వర్ణనా వైవిధ్యముపైనున్నంత దృష్టి సంఘర్షణాత్మక సన్నివేశములలో, వ్యక్తుల మనస్తత్వములు వ్యక్తీకరించెడి రీతిలో, పాత్ర చిత్రణములో సైతము అంతగనున్నట్లు కాన రాదు. అందులకు శ్రీకృష్ణ రుక్మిణ్యాది కొన్ని పాత్రలు మాత్రమే జేగీయ మానములై తక్కినవి నామ మాత్రములగుటయే కారణము.

## రస పోషణము

రసము కావ్యమునకు జీవాతువు. రసము ఆనంద సంబంధి. "రసో వైసః" అని శ్రుతి. భరతముని, జగన్నాథ పండితరాయలు, రుద్రటుడు, ధనంజయుడు, రూపగోస్వామి, మధుసూదన సరస్వతి, మమ్మటుడు, భట్ట లోల్లటుడు, శ్రీశంకుకుడు, ఆనంద వర్ధనుడు, అభినవగుప్త పాదాది సంస్కృతాలంకారికు లెందరో రసచర్చ చేసి రసప్రాధాన్యముపై దృష్టి నిలిపిరి—

"విభావానుభావ వ్యభిచారీ సంయోగాద్రస నిష్పత్తిః" అని భరత ముని రస సూత్రము. "వాక్యమ్ రసాత్మకం కావ్యమ్" అని సాహిత్య దర్పణమున విశ్వనాథ కవిరాజు. "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అని రసగంగాధరమున జగన్నాథ పండితుడు. "తేన రసఏవ వస్తుతః ఆత్మా వస్త్వలంకార ధ్వనీతు సర్వదా రసం ప్రతిపర్య వస్యేత్" అని ఆనంద వర్ధనుడు. "సామాగ్ర్యారసప్రవృత్తిః" అని ఆంధ్ర శబ్ద చింతామణి కారుడు. 'రసమే కావ్యాత్మ' అని మన ప్రాచీనుల అభిప్రాయము.

"ఆత్మ సమ్మోదము బొందఁ గావ్యరసముం గ్రోలుచు నుండు దెప్పుడున్" అని భారత విరాట పర్వమున తిక్కన సోమయాజియు, "ప్రతి

పద్య రసాస్పదముగఁ గృతి రచియింపంగ వలయు గీర్తి చెలంగున్" అని సుద్యుమ్న రాజ చరితమున కొఱ్ఱపాటి గురవయ్య కవియు. 'ప్రతి పదమ్మున రసముట్టిపడవలె'నని లక్షణా పరిణయమున తిరుపతి వేంకట కవులును కావ్యరసమును కొనియాడిరి. అసలు కావ్యమున రసమెందులకు ? అని ప్రశ్నించి "కవి రసమును భిన్న భావములచే పోషించుచుండగా భావుకుడైన పాఠకుడు దాని వెంట ప్రయాణము చేసి ఒక అనిర్వచనీయమైన ఆనందమును పొందుటకు" అని కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఎమెస్కోవారి నైషధ పీఠికలో సమాధానము చెప్పిరి. కవిత్వము రసవంత మైనపుడు లభించు కావ్యానందమే రసానందము.

రసములు కావే ప్రాణము
లసమాన కవిత్వ కాంత కవనీస్థలిలో
రసహీనమైన కవితకుఁ
బొసగించు నలంకృతి శవమున కిడు తొడవౌ॥

అని సరస్వతీ నారద విలాపమున కందుకూరి వీరేశలింగం పంతులుగారు నిర్ధారించిరి. కావ్యములోని వస్త్వలంకార వర్ణనాదులు రసవృష్టికే దోహద పడవలె ననుటలో రసప్రాధాన్య మెట్టిదో గ్రహింపవచ్చును.

కావ్య రసములు తొమ్మిది. అవి శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానక భీభత్స అద్భుత శాంతములని కొందరు ఆలంకారికుల నిర్ణయము.

అసలు తత్త్వతః ఒకటియే అయిన విశ్వాతీత రసము తొమ్మిది లోకములందు విభక్తమై, వ్యాప్తమై నవరసములుగ భాసించు ననియు, వానిని గుర్తించి అవి ఏకరసభాగము లెట్లయినవో తెలిసికొని ఏకరసత్వ సిద్ధిని పొందుటయే భావనా గమ్యమైన బ్రహ్మానంద స్థితి యనియు బ్రహ్మతత్త్వజ్ఞుల భావన. వేద పదార్థము తెలియవిదే రసస్వరూ

పము తెలియదు. రసము నెరుగనిదే ఆనందమును పొందుట దుర్లభమని వారి అభిప్రాయము. ఇట్టి అలౌకిక బ్రహ్మానందానుభూతి నందించుటకే ఋషి తుల్యులైన కవులు కావ్యములందు రసపోషణమును గావించిరి. కావ్యానందము బ్రహ్మానంద సహోదరము.

అష్ట మహిషీ కళ్యాణమున చిన్నన్న "అలఘు శబ్దార్థ సారసరీతి రస ప్రభావముగ" రచన గావింతునని చెప్పెను. ఇందు కవి శృంగార వీరములు రెంటిని ప్రధాన రసములుగనే పోషించినాడనిపించును. అయినను, కృతి అష్టమహిషీ కళ్యాణమగుటచే శృంగారమే అంగిరసమని నిర్ధారణము.

*శృంగారము :* ఇది రస రాజము. సర్వప్రాణి సామాన్యము. "శృంగార ఏవ మధురః" అని సూక్తి. "శృంగారీచేత్ కవిః కావ్యే జాతం రసమయం జగత్" అని ఆనంద వర్ధనుడు. ప్రకృత కావ్యమున చిన్నన్న భక్తియుత శృంగారమును పోషించెను. ఇందు కృష్ణ సంబంధమైన భక్తి శృంగారముల భావ బాంధవ్యము గోపికా గతముగ నిరూపితమైనది. ఇందలి శృంగారము తత్త్వతః లౌకికము కాకపోయినను సంయోగ వియోగ రూపముననే పోషింపబడినది.

గోపికా కృష్ణుల సంభోగ శృంగారమును కవి విస్తృతముగనే వర్ణించెను. ఒక గోపిక జాంబూనద ప్రభ స్తన కుంభ ఘర్మజాంబు పూరంబులచే కృష్ణ నభిషిక్తు జేసినదట. కృష్ణుడు సకల గోపికల కాంక్షలు దీర వేయి బాహువుల కౌగిలించి, వేయి వాతెరలచే నా తరుణుల అధరములను దనివార గ్రోలి, నఖ సహస్రములచే నుదుటు గుబ్బెతల మైనొత్తి లొత్తుచు మకరాంక కేళి వారిని చొక్కించినట్లు తత్త్వగర్భితముగనే సంభోగ శృంగారమును వర్ణించెను. ఇట్లే గోపికల వియోగము :

కమల చిహ్నంబుల గలిగి యేర్పడిన
యడుగులఁ గాంచి కృష్ణాయంచు నతని
నుడువుచుఁ గదిసి కన్నులనొత్తి కొనుచు
చీఁకటి సరవాయు శిశిరాంశు కళల
నాఁకటి తమి గ్రోలి యల చకోరాళి
సడలించె ననఁగఁ గజ్జల జలధార.
లుడుగక కన్నుల నురుల నందంద, మొగములువాడ (పు. 98)

అని వర్ణించి కవి వియోగ శృంగారమును పోషించెను. అయినను ఇది దైహికమైన భౌతిక శృంగార సంబంధి కాదని సూచించుటకు కవి 'గోపికలు పరమయోగీంద్రుల వలె గోవింద పరచింత సేయుచు సకల శరీరి యీశ్వరు నూహ చేయుచుండెడి వారనియు, హరి పరాయత్త చిత్తాధీన లగుచు వారు పరమ మౌనుల వలె బాహ్యముల్మరచి రనియు చెప్పి, గోపికల శృంగార తత్త్వ రహస్యమును, వారి యౌగిక హృదయమును వెల్లడించెను.

అష్ట మహిషుల కళ్యాణానంతర సన్నివేశము లందును కవి సంయోగ వియోగ శృంగార రసములను పోషించెను. కాని ఔచిత్యమును మేర మీరలేదు.

రుక్మిణీ గత సంయోగ భావమును వర్ణించుచు కవి—

"జలరాశి కన్యకా సహితుఁడై యపుడు
జలరాశి మధ్య వాస మొనర్చు కరణి
నీలవర్ణుఁడు రుక్మిణీ దేవిఁ గూడి.... (పుట. 210)

అని మాత్రమే చెప్పి వదలివేసెను. శ్రుతి మించిన శృంగార మిందు కానరాదు—

*వీర రసము* : వీరమునకు స్థాయి ఉత్సాహము. దానదయ ధర్మ యుద్ధ భేదమున వీరము నాలుగు విధములు. ఈ కృతిలో యుద్ధ వీరము పోషింపబడినది. పూతన, శకటాసుర, ప్రలంబాసుర, చాణూర ముష్టిక, కంసాది దుష్ట దానవ సంహారములందును, రుక్మి, శిశుపాలాది రాజన్యుల తోడి యుద్ధ సన్నివేశములందును వీరము పోషింపబడినది.

పూతన వధలో "అమృతాంశు కుల భవుండగు శౌరి రాత్రి కమలాగ్ర తటము భృంగంబును బోలి జెలగి తీయని నోటఁ జేదు మేయంగ బొలిచి తీయని పాలబుగ్గలుబ్బించి కలగి తీపైన యక్కరటి ప్రాణములు జలధి గ్రోలెడి కలశజు రీతి" గ్రోలినాడట. పూతన విగత చేతనయై కూలగా దానిపై 'కుంజరి మధ్య బాలసింహము' వలె బాలుడాడెనట. ఇందు రక్కసియైన పూతన మదము, చిన్ని కృష్ణుని ఉత్సాహము సూచితమై శౌరి సింహ పరాక్రమ మభివ్యక్తమై వీర రస పోషణమునకు దోహదమైనది. ఇట్లే కాళియ మర్దనమున 'పెంచి కుప్పించి గుప్పించి నొప్పించి' అనెడి వీరరసానుకూల రచనా విన్యాసము చిన్నన్న రసపోషణా నైపుణికి నిదర్శనము.

రసమును వాచ్యము చేయుట దోషమందురు. రుక్మిణీ కళ్యాణమున చిన్నన్నయు "వీరరసావేశ వివశుడై వాడు.... (పు. 195). అని వీర రసమును వాచ్యము చేసినాడు.

*హాస్యము* : దీనికి హాసము స్థాయి. ప్రాచీన కాలమున హాస్యరస ప్రధాన కావ్యము లంతగ కానరావు. హాస్యము పేర చమత్కారమే కనిపించును. తిక్కన భారతోత్తర గోగ్రహణ ఘట్టములో ఉత్తర కుమారుని ప్రగల్భ వచనములందు కొంత హాస్యము కలదు.

అష్టమహిషీ కళ్యాణమున - 'ఘన హస్య రసము శృంగార మధ్యమునఁ గొనకొన్నగతి' నుండవలెనని చిన్నన్న అభిప్రాయపడెను.

దానికి తగినట్లే కవి రాసకేళి, జల క్రీడల శృంగార సన్నివేశములందు హాస్యమును కల్పించి గోపికలచే నవ్వించెను. శృంగార మధ్యమున హాస్య పోషణము ప్రౌఢ లక్షణము.

గోపికలు యశోదతో చిన్ని కృష్ణుని చిలిపి చేష్టల నిట్లు చెప్పు చున్నారు.

"నెఱపైన పెద్దలు నేఱనియట్టి కఱపులు కఱచె నీకతకారి బిడ్డ
గోడలు దుమికి నా కోడలిఁ గొడుకుఁ గూడియుండెడి వేళ గోవనార్చి
పాముపైఁబడ వైచి బాములుఁ బెట్టి, భామలందఱుఁ బఱువడిఁ జూడ"
(పుట. 32)

ఇందు బాలకృష్ణుని చిలిపి చేష్టలకు పెదవిపై చిరునగవు పొటమరింపక మానదు. పోతన భాగవతమున ప్రలంబాసుర వధ, రుక్మి పరాభవ సన్నివే శము లందు హాస్యము కలదు. చిన్నన్న కృతిలో ఇవే సన్నివేశములందు హాస్యరస స్ఫూర్తి లేదు.

***కరుణము :*** శోకము దీనికి స్థాయి. ఆప్తబంధుజన, ఇష్టవస్తు వియోగాదుల వలన నిది సంప్రాప్త మగును. తృతీయాశ్వాసమున కంస వధానంతరము, కంసుని భార్యలు 'కన్నీటఁ బెనగొన్న కన్నులింపొదవఁ దగు దమ్మి మొగ్గలు తరగలఁ బొరలు పగిది గుబ్బలు మీఁది పయ్యెద జాఱ హా నాథ ! హా నాథ ! యనుచుఁ బల్మాఱు దీనలై విలపించు' చున్నట్లు వర్ణించి కవి కరుణ రసమును పోషించెను.

***అద్భుతము :*** దీనికి స్థాయి విస్మయము. అపూర్వవస్తు సందర్శ నము వలన కలుగు భావమిది. నెలల ప్రాయమున నున్న బాల కృష్ణుడు పూతన శకటాసురలను సంహరించుట విస్మయము. ఇంద్రుడు గోకుల మాకులము పొందునట్లు భయావహముగ వర్షమును కురిపింప రక్షించుటకై

చెప్పి కృష్ణుడు అచటి ప్రజలకు నేకాత పత్రముగ కొండ నెత్తినాడట. ఇది అద్భుత చర్య. ఇది పఠితలకు విస్మయ కారకమై అద్భుత రస స్ఫూర్తిని కలిగించును.

*బీభత్సము* : జుగుప్స దీనికి స్థాయి. ఒడలు గగుర్పొడుచు భయంకర దృశ్యములు చూచినపుడు మనసున పొడము రసభావమిది. ఈ కావ్యమున రుక్మిణీ హరణానంతరము జరిగిన యుద్ధవర్ణనలో పీనుగు పెంటల చిత్రణము జుగుప్సను కలిగించి బీభత్స రసోత్పన్నముగ నున్నది.

ఇట్లే భయంకర వస్తువులను గాని, వ్యక్తులను గాని, జంతువులను గాని, సన్నివేశములను గాని హఠాత్తుగ చూచినపుడు జనించు రసము భయానకము. వృషభాసుర, చాణూర స్వరూప వర్ణనలందు తద్రస స్ఫూర్తి కలదు.

రౌద్రమునకు క్రోధము స్థాయి. అనిష్టకర వస్తు సందర్శన చేష్టాదులచే కలుగు మానసిక వికారమిది. క్రోధ భావమే రౌద్రముగ పరిణమించును. ఈ కావ్యమున ఇది అంతగ కానరాదు. తృతీయాశ్వాసమున కాలయవనుడు కృష్ణునిపై దండెత్తిన సందర్భమున రౌద్రరస స్ఫూర్తి కొలదిగ కాన్పించును.

అరసి యుగ్రతఁగాల యవనుఁ డవ్వేళఁ
గలితుల క్రాయ కాలోగ్రత దండ
తులితాంగ జగదరాతులఁ గిరాతులను
మూఁడు కోట్లను గూడి మూఁడు నేత్రముల
వాఁడును బోలెఁ దీవ్రత వచ్చి మధుర వలగొన్న.... (పు. 162)

ఇట కాలయవనుని శివునితో పోల్చుచు శివ శబ్దమును ప్రయోగింపక 'మూడు నేత్రముల వాడ'నుటలో రౌద్ర స్ఫూర్తి కలదు. మూడవ నేత్రము

తెరచినపుడే శివుడు రుద్రుడు. రౌద్ర రస పోషణమున ఇట్టి పద ప్రయోగము మెచ్చదగినది.

ఇక శాంతరసము-శమము దీనికి స్థాయి. చిత్తవృత్తి నిర్వేదాదుల ణగిపోవుట శాంతము. "అశాంతస్య కుతఃసుఖమ్" అని గీత. సర్వ రస గమ్యమీ శాంతమేనని ఆలంకారిక మతము. చిన్నన్న శాంతరసమును అక్రూర పాత్ర గతముగ పోషించెను. మహాభక్తుడైన అక్రూరునిలో శాంతము సంగమించినది. "అరి బుద్ధినైనఁ దెమ్మని పంచె నాకుఁ బరుఁడె కంసుఁడు ప్రాణబంధుండుగాక" అని పలికిన అక్రూరుని మాటలలో శిశు హంతకుడైన దుష్ట కంసునిలో గూడ సౌజన్యము నాపాదించుకొని కృతజ్ఞతా బద్ధుడగుచున్న అక్రూరుని సత్సంస్కారోపేత శాంత స్వభావము పఠిత లకు శాంతరస స్ఫూర్తిని కలిగించును.

ఈ విధముగ చిన్నన్న అష్టమహిషీ కళ్యాణమున శృంగారమును అంగిగను తక్కిన వానిని అంగరసములుగను సిద్ధ హస్తుడై పోషించి రస సిద్ధుడయ్యెను.

"జయంతితే సుకృతినో । రససిద్ధాః కవీశ్వరాః ।
నాస్తి యేషాం యశః కాయే । జరామరణజం భయమ్॥
— భర్తృహరి - నీ. శ. 21

## వర్ణనలు – కల్పనలు

"చతుర కవిత్వ తత్త్వపటు సంపద ఒక్కరి సొమ్ము కాదు భారతి దయ సౌధవార్థి, కవిరాజుల మానసముల్ ఘటంబు లాయాతము గొలంది లభ్యమగు" అనినాడు కనుపర్తి అబ్బయామాత్యుడు. ఇది ఎవరును కాదని రాని సత్యము. 'ముఖే ముఖే సరస్వతి' కదా ! అయిన ఏది నిజమైన కవిత్వ

మను ప్రశ్న ఏర్పడును. దీనికి విమర్శకు లనేకరీతుల సమాధానము చెప్పిరి.

"శ్రావ్యమైన శబ్దము ద్వారా రమ్యమైన అర్థమును దివ్యమైన అనుభూతిగ పరిణమింపజేయుట కవిత్వము" అని నిర్వచించినారు ఆచార్య డా॥ యస్వీ జోగారావుగారు తమ బాటసారి కావ్య సంపాదకీయములో.

అసలు కవి యనగా వర్ణించువాడని యర్థము. "కవయతే వర్ణయతీతి కవిః" అని ఆలంకారిక నిర్వచనము. కవి దేనిని వర్ణించును ? ప్రకృతిని. ఆ ప్రకృతి యెట్టిది ? మానవ మనస్సునకు, పరిసర వాతావరణమునకు సంబంధించినది. కథ చెప్పుట వర్ణనమే కదా మరల నీ వర్ణనలు దేనికి ? కావ్యగత పాత్రల జీవితములలో జరిగిన సంఘటనల అనుభూతి స్ఫూర్తికి, తత్పరామర్శకు ఆ కావ్యగత పాత్రల కవకాశమిచ్చుటకు, ఒక్కొకపుడు సందర్భమును బట్టి కావ్యపాత్రల మానసిక ఔత్కంఠ్యమును వ్యంగ్యముగ నావిష్కరించుటకు, కావ్యపాత్రల స్వరూప స్వభావాదులు పాఠకుని మనస్సులో భావనలో ముద్రితమై వారి ఊహాశాలితకు పదును పెట్టుటకు అని సమాధానము. మరియు పాఠకులకు కథాపఠన వ్యగ్రత నుండి కొంత విశ్రాంతి నిచ్చుటకును వర్ణన లవసరము. ఈ వర్ణన వర్ణన కొరకు గాక కథానుకూలముగ, కథాసూచకముగ, ఔచితీ సహముగ నుండవలెను. వర్ణనల వలన పాఠకుడు అసలు కథను మరచిపోవు స్థితి కలుగరాదు.

కవి ప్రతిభా వ్యుత్పత్తులకు వర్ణనలే నికషోపలములు. తాను దర్శించిన సౌందర్యమును, సత్యమును వర్ణించువాడే కవి యని లోకమున ప్రసిద్ధి. "దర్శనాద్వర్ణనాచ్చాద రూఢా లోకే కవి శ్రుతిః" అని భామహుడు. లోకము నందున్న వస్తువునే కవి తన వర్ణనా నైపుణిచే తిరిగి ప్రకాశింపజేయును. ఇట్టి శక్తిని ప్రతిభ అందురు. "నవ నవోన్మేష శాలిని ప్రజ్ఞా"

అవి దీనినే రాజశేఖరుడు ప్రజ్ఞగ పేర్కొనెను. ఈ ప్రతిభ కొందరికి జన్మ సిద్ధము, మరికొందరికి దైవదత్తము. కావ్యము లందు వర్ణనల రాణింపునకు ప్రతిభ ఎంత అవసరమో వ్యుత్పత్తి కూడ అంతే అవసరము. వ్యుత్పత్తి అనగా పాండిత్యము. "విద్వత్కవయః కవయః కేవల కవయస్తు కేవలమ్ కపయః" అని ఒక ఛలోక్తి.

దాస కవితా దర్శనమను పేరుతో బాటసారి కావ్యసంపాదకీయమున ప్రాచార్య శ్రీ యస్వీ జోగారావుగారు పేర్కొనినట్లు ఏ కవికైనను అతని సాహితీ సర్గమునకు ప్రధానమైన ఉపాధులు నాలుగు. 1. ఊహాశాలిత, 2. అనుశీలనము. 3. విషయజ్ఞత, 4. అనుభవము. ఇవి నాలుగును వర్ణనల నాశ్రయించి యున్నట్టివే. ఈ లక్షణములు గలవాడు మహాకవి, లేనివాడు సామాన్య కవి.

*వర్ణనలు ఎన్ని ? :* సంస్కృతాలంకారికులు 18 వర్ణనలు పేర్కొనిరి, అవి ఇవి :

"నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయ వర్ణనైః
ఉద్యాన సలిల క్రీడా మధుపాన రతోత్సవైః
విప్రలంభై ర్వివాహైశ్చ కుమారోదయ వర్ణనైః
మంత్ర ద్యూత ప్రయాణాజి నాయకాభ్యుదయైరపి
ఏతాని యత్ర వర్ణ్యంతే తన్మహా కావ్యముచ్యతే॥

— కావ్యాదర్శః — దండి

అప్పకవి 22 వర్ణనలు పేర్కొనెను. కావ్యమున అష్టాదశ వర్ణనలుండవలెనని మన పూర్వ కవులు భావించిరి.

ప్రకృతము అష్టమహిషీ కళ్యాణమున చిన్నన్న తన ప్రతిభను గూర్చి చాటుకొనుచు 'దినములోననె వేయి ద్విపద లింపొంద వినుత వర్ణన

లతో విరచించువాడ' నని చెప్పెను. ఇతని వినుత వర్ణనలెట్టివో పరిశీలింతము.

నగర వర్ణనము : ఈ కావ్యమున కవి మధుర ద్వారకా నగరములను మనోజ్ఞముగ వర్ణించెను. ద్వారకలోని భవంతులు నవరత్న శోభితములని వర్ణించి ద్వారక ఐశ్వర్య విభూతిని చాటి చెప్పెను. ద్వారకను వైకుంఠముతో పోల్చి—

"వారక యిహపర ద్వారక యగుట
ద్వారక యను పేరు తగుదీనికనుచు"

ద్వారక నామ రహస్యమును వెల్లడించెను. సముద్ర మధ్యమున విశ్వకర్మ నిర్మిత ద్వాతక 'కడలిలో ఘటదీపమువలె' నున్నదట. ఈ ద్వారకా నగర వర్ణనమే చతుర్థాశ్వాసములో మరల కనిపించును. రుక్మిణి పంపిన బ్రాహ్మణుడు ద్వారకను చూచుట సందర్భము—

"సార కస్తూరికా సహిత నీహార నీర కర్పూర వర్ణిత కాంతి జాల
హార కల్పిత గృహానేకాంశ విజిత తారక వేష్టితోదార సముద్ర
హారక కమలాకరాంచిత హంస కీర కదంబ సంకీర్ణ సౌధాగ్ర
చారక గగనాధ్వచారక వ్యూహ దారక నమ్మహాద్వారకఁ గాంచి"
(పు-183)

అని ఏక సమాసములో కవి ద్వారకను వర్ణించెను. ఇది నాతివిస్తృతమై కథాగతిని కుంటువడనీయలేదు. ఇట రచన సంస్కృత సమాస శైలీ బంధుర సుందరము. కథాగతిలో ఈ క్లుప్తవర్ణనము అందగించినది.

సముద్ర వర్ణనము కావ్యారంభమునందే కలదు. ఈ క్రింది అర్ణవ వర్ణనమును పరికింపుడు.

"శతకోటి-శతకోటి చకితాత్మగర్భగత పర్వతంబులు నాగంబులుగాగ
ఘన మీన వాలాగ్ర ఘట్టనాజస్ర జనిత శీకరతతుల్ సవరముల్గాఁగ
శ్రీకరోన్నతి వికసిత నూత్న పుండరీకముల్బహు పుండరీకముల్గాఁగ
నలఘుతరోగ్ర రావాంచిత వివిధ జలచరజాలముల్ సైన్యముల్గాఁగ
.......... పిక ధ్వనులు కరమొప్పవంది మాగధ నుతుల్గాఁగ
పరివృత భూజభంభర వికల్గాఁగ పట్టభద్రుని గతి భాసిల్లు కడలి"
(పు. 10, 11)

పై వర్ణనమునందు కవి సముద్రుని పట్టాభిషిక్తుడైన ఒక ప్రభువుతో పోల్చుట విశేషము. సముద్రస్థ పర్వతములు, జలశీకర పిక జలచరాదుల్ని రాజపరివారముతో పోల్చి వినూత్నరూపచిత్రణము గావించుట అపూర్వము. కవి ఊహా ప్రతిభలకు నిదర్శనము.

గోవర్ధన పర్వతోద్ధరణ ప్రసంగము వచ్చినను కవి శైల వర్ణనము చేయక శైల ప్రస్తావనమును మాత్రమే చేసి కథను నడిపించెను. అది గోపకుల ఆపత్సమయమగుటచే నిట కవి అసలు శైల వర్ణన చేయకుండుటయే కథనౌచిత్యము.

ఈ కావ్య ద్వితీయాశ్వాసమునందు వర్షా శరదృతు వర్ణనలు పాఠకులకు హర్షోత్కర్షమును కలిగించును. యాదవులకు ఆపదను కలిగింపనెంచిన ఇంద్రుడు గొల్లమూకలపొది విచ్చజేయుటకు జలదములను అజ్ఞాపించిన సందర్భమున కవి వర్ష వర్ణనము గావించెను.

వర్ణనము లందు కథా సూత్రమును విడిచిపెట్ట కుండుట ఈ కవి లక్షణము. 'ఉడు పంక్తి కంసవధోత్పాతంబునకు వడినట్లు వడగండ్లు వడియె' అను వర్ష వర్ణనమున జరుగ నున్న కంస వధను సూచించుట గమనార్హము. కనుక చిన్నన్న వర్ణనల పట్టున నేల విడిచి సాము చేయలేదు.

"నీల వర్ణుని మూర్తి నిఖిలంబు గప్పు పోలిక దట్టమై పొదలె మేఘములు" అని మేఘ వర్ణనము చేయుచు విష్ణుతత్త్వము నెరిగించిన ప్రతిభాశాలి చిన్నన్న. "విష్ణుర్వ్యాపన శీలః - విష్ణు ర్వ్యాప్తౌ" అని కదా ఆర్ష వచనము ! ఇట్టి రచనము భావుకుడైన తాత్త్విక కవికి మాత్రమే సాధ్యము.

ఇక శరత్కాల వర్ణనములో-'వచ్చుచున్న శరత్కాలము కవి దృష్టిలో మీలకు వేసిన గాలము వలె కనిపించుట' వినూత్నము. ఇది ఎవ్వరు చేయని ఊహ. ఇట్టి పట్టులనే కవి ప్రతిభ కనిపించును.

ద్వితీయాశ్వాసమున చిన్నన్న చేసిన సంధ్యాసమయ నక్షత్ర చంద్రోదయ వర్ణనలో సాంధ్యరాగమును గోపికానురాగముతోను నక్షత్రములను శ్రీహరి కీర్తి బీజములతోను, చంద్రుని మరుని ఖడ్గముతోను పోల్చి వర్ణించుట కథానుకూలము.

తృతీయాశ్వాసమున - జలజాక్షుని వీర రసము చందమున సూర్యుడుదయించినట్లు నాయకాభ్యుదయ సూచకముగ సూర్యోదయ వర్ణనము చేసెను. భానుడు 'కరగు బంగరు గుండు గతి' నుండెనని వర్ణించి అస్తమయ సూర్యుని గమన స్థితిని మనోజ్ఞముగ దెలిపినాడు చిన్నన్న

***వన వర్ణనము :*** ఈ కావ్యమున నాలుగు తావులందు ఉద్యానవన వర్ణనము గలదు. కృష్ణుడు గోపికలతో యమునాతీరమున కేగిన సందర్భమున కవి వన శోభ నిట్లు వర్ణించెను.

> "అలినాద సామగానాళితో బింబ ఫలరస వరసోమ పానంబు సేయు
> శుకపిక ఘనఋత్త్విజుల ఘోషములను సుకుమార సుమలతా
> స్ఫురిత యూపముల బ్రచుర మరంద ధారావార మిళిత రుచిర
> పరాగ పురోడాశ తతుల.... (పు. 93)

ఇందు — సామ గానము, సోమరసము, ఋత్విజుల ఘోష, యూపములు, పురోడాశములు, వేద మంత్రములు, హోమకుండములను ప్రవేశపెట్టి వన వాటిక నొక యజ్ఞ వేదికగ మలచి వర్ణించుటలో చిన్నన్న హృదయాంతర వైదిక ప్రవృత్తి ప్రస్ఫుటమగుచున్నది. ఇట్లే తక్కిన వన వర్ణనలును తనస్జ

పంచమాశ్వాసమున వర్ణితమైన సలిల క్రీడలో "సకవి నారాయణ శబ్దార్థమనిన నరులకు దెలుపు చందమున" (పు. 240) అను వాక్యమున నీరు నివాసముగా గలవాడను నర్థముగల నారాయణ శబ్ద ప్రయోగము సార్థకము. శ్రీకృష్ణుని పడతులు అనగా గోపికలు.

"ఒండొరుల్దమలోన నుద్దించుకొనుచు
జడియ కుంచలను గొంచలను గిట్టుచును
నడిచి మీనముల సేనములఁ బట్టుచును
దొడరి చెండొవల కందువుల పైచుచును
గడఁగి చక్రముల చక్రములఁ దోఁపుచును" (పు. 240)

సలిల క్రీడ సలిపిరట. ఇందలి వారి ఉత్సాహమున కనుగుణముగ నున్నది అను ప్రాస రచన. అపుడు యమునా నది శ్రీకృష్ణుని శృంగార రసాబ్ధివలె నొప్పినదట. శృంగార రసాధి దేవత విష్ణువే.

ఈ కావ్యమున గోపికా శ్రీకృష్ణ సంభాషణము లందటనట బింబా ధర మధుర మధుపాన ప్రస్తావనము దప్ప మధుపాన వర్ణనము లేదు.

***రతోత్సవము*** : కావ్యము శృంగార రస ప్రధానమైనది కాన రతి వర్ణన మధికముగ నుండగలదని ఆశించుట సహజమే కాని ఇందు విస్తృత రతి క్రీడా వర్ణనలు లేవు. కవి రతోత్సవ వాతావరణమును కల్పించి ఇత

రాంశమును పాఠకుల ఊహకు వదలి ఔచిత్యమును పాటించెను. కృష్ణుని రతికళా కౌశలమును కవి ఇట్లు వర్ణించెను.

"సకల గోపికల కాంక్షలు దీఱ మఱియు నొకపరివేయు
బాహులగా గిలించి
తెరలక వేయి వాతెరలచే నొకట దరుణుల యధరముల్ల నివార గ్రోలి
చదురున నఖ సహస్రముల నొక్కడను నుదుటు గుబ్బెతలపై
నొత్తులొత్తుచును" (— పు. 96)

ఈ రతి వర్ణనలో వేయి బహులు, వేయి వాతెరలు, నఖ సహస్రముల ప్రయోగముచే పురుష సూక్తములోని సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్...." అను పరమాత్మని పరతత్త్వమును శ్రీకృష్ణుని శృంగార కేళిలో ధ్వనింప జేయుట విశేషము.

*విప్రలంభ శృంగారము :* ఈ కావ్యమున గోపికల యొక్క, రుక్మిణీ సతి యొక్క విరహము వర్ణింపబడినది. గోపికలు కృష్ణుని శృంగార రూపమును దలపోయుచు — 'జారు కొప్పుల వెడజారు పయ్యె దలఁదోరంపు తుదలందుఁదొరఁగు కప్పీట హరిపరాయత్త చిత్తలై ప్రార్థించిరనిన కృష్ణ స్మరణ మాత్రమున వారు పొందిన విరహము పాఠకులూహింపవచ్చును. ఇట్లే కృష్ణుని యందు ప్రేమాయత్తచిత్తయయిన రుక్మిణిపై సమయము చూచి మరుడు తీపు వింటితో పూవు దేనె నలరు తూపులను సంధించి కందువ చూపు నిలిపి చెవిసోక దిగిచి యేసెనట. ఆ పూఁదూపులు రుక్మిణి బాహా మధ్యమున దాకి ఈవలావల దూరిపాఱి ఆమెకు పారవశ్యమును కలిగించెను. అపుడామెకు పల్కు కీర రవము కైరవము భైరవములై తోచెనట. తనకు తల్లి కాబోవు రుక్మిణికే మరుడు పగదాయి యయ్యెనట. ఈమెకు శైత్యోపచారములు చేయుచు చతుర వాక్య ప్రౌఢితో చెలు లొనర్చిన సంభాషణమును కవి విస్తృతముగ వర్ణించెను.

ఈ శైత్యోపచార వర్ణనము గోపికల విషయమున కానరాదు. వారిది మోక్ష కామనా సంబంధియగు అలౌకిక శృంగారమగుటయే కారణము కావచ్చును.

**వివాహ వర్ణన :** అష్టమహిషీ కళ్యాణమునందు ప్రధానమైనది ఈ వివాహ వర్ణనయే. సంప్రదాయానుగతమైన పెళ్లి పద్ధతులను అందముగ వర్ణించినాడు చిన్నన్న. అనంతర కాలమున రాజశేఖర చరిత్ర, విజయ విలాసాది కొన్ని కావ్యములలో మాత్రమే వివాహ వర్ణనలు కనిపించును. రుక్మిణీ కళ్యాణ సందర్భమున కవి విస్తృత వివాహ వర్ణనము గావించెను.

"నెలవంక కొక వంక నెఱసులు వెదకు చెలువంపు నొసల బాసికము గీలించి 'రుక్మిణికి వివాహోచిత వేషధారణము గావించిరట. పెండ్లి కుమార్తెకు నొసల బాసికమును ధరింపజేయు ఆచారము నేటికిని తెలుగు దేశమున కొన్ని ప్రాంతములందు గలదు. రేవతీ ధవుడు, ఉద్ధవుడు వధూ వరుల మధ్య తెరపట్టిరట. రత్నాకరుడు శ్రీకృష్ణునకు కాళ్ళు కడుగగా, వాణి ఇంద్రాణి శర్వాణ్యాది స్త్రీలు ధవళాక్షుని మీద ధవళములు పాడిరట. పెళ్లిలో ధవళములు పాడుట చిన్నన్న నాటి తెలుగు వారి ఆచారమై యుండవచ్చును. మునులు మంత్రములుచ్చరించుచుండ గర్గ్యుడు గడియా రము చూచి సుముహూర్త సమయము దెల్పి 'కుర్వంతు మంగళం' బనుచు మంగళాష్టకములను చదివెనట. ఇచట గర్గ్యుడు చూచిన 'గడియా రము' కూడ చిన్నన్న కాలము నాటిదై యుండును. నగుడ జీరకమును వధూవరులు పరస్పరము శిరస్సులందుంచుకొనుట, తలంబ్రాలు పోసికొ నుట, మంగళ సూత్రము గట్టుట, పెద్దల ఆశీస్సులు, కట్నముల చదివిం పులు ఇత్యాది సమస్త విషయములను వర్ణించి తెలుగుజాతి వివాహ విధా నమునకు సాంప్రదాయక హిందూ వివాహములకు అద్దము పట్టినాడు కవి.

కళ్యాణమునకు ఫలము సంతానము. ఈ కావ్యమున రుక్మిణీ కృష్ణుల వివాహానంతరము మన్మథకుమారోదయ వర్ణనము క్లుప్తముగ కలదు.

రాజు రాజ్యాంగపరమైన, రాజకీయమైన సమాలోచనలు సచివులతో చేయుటను మంత్రాంగ మందురు. ఈ కావ్యము నందిది అంతగలేదు కాని తన సోదరి సుతుడు తనను సంహరింప గలదన్న ఆకాశవాణి వాక్కులను విని కంసుడు తన సచివులతో మంతనము లాడినట్లు మాత్రము గలదు.

*దౌత్యము :* మంత్రాంగము పిదప రాజులు రాజకీయ వ్యవహార ములలో దూతను బంపి దౌత్యము నెఱపుట ప్రసిద్ధము. ఈ కృతియందు రాజకీయ దౌత్యము లేదు గాని రుక్మిణీ ప్రణయ దౌత్యము వర్ణింపబడినది. రుక్మిణి తన కుల పురోహిత సుతునకు "ముద్దుల తన కుచంబులనాను హరిని దిద్దినహోమ ముద్రిక యేకతమున హరికి నిమ్మని సీతహనుమంతున కల సిరము మానిక మంపు చెలువున' నొసగి పంపెనట. ఇది చిన్నన్న వినూత్న కల్పనము. భాగవతమున లేదు. ఈ పౌరాణికోపమను బట్టి రుక్మిణి దూత హనుమంతుని యంతటి వాడని గ్రహింపవలెను. దూత సంభాషణా చతురుడై నేర్పరియై కార్య సాధకుడు కావలెను. రుక్మిణి దూతకీ లక్షణములు కలవని నిరూపింపబడినది. ఇతని దౌత్యమును కవి విపులముగనే వర్ణించెను. రుక్మిణి సౌందర్యమును కృష్ణుని మదికి నచ్చునట్లు వర్ణించి "రుక్మిణీదేవి నీకె తగు గాని యెంతైన నందగదు చైద్యునకు అని నిర్ధారించి రుక్మిణీ పరిణయమునకు కృష్ణు నంగీకరింపజేసి దౌత్య నిర్వహణమున బ్రాహ్మణుడు కృతకృత్యుడయ్యెను.

*ప్రయాణము :* ఈ కావ్యమున ప్రథమ చతుర్థాశ్వాసములందు మనోజ్ఞమైన ప్రయాణ వర్ణనలు గలవు. వ్రేపల్లె ప్రజలు బృందావనము నకు బయలుదేరిన సందర్భమున వారి ప్రయాణ సంభారములు, పసుల మందలతో, పగ్గములతో, చల్ది జాడియలతో, చంటిపిల్లలతో వన శోభను తిలకించుచు వారు ప్రయాణము చేయురీతి మనోహరముగ వర్ణింపబడినది. వారు బృందావనము చేరి బండ్లు విప్పి విడిది చేసిరి. అపుడు 'పవియను విందు జవ్వని దాల్చు నామమన బండ్లు అర్థచంద్రాకృతి విడిసినవని' కవి

వర్ణించెను. ఇట బండ్లు విప్పెడు తీరు వర్ణించుటలో కవి విశిత పరిశీలనము గోచరించును. ఇట్లే శ్రీకృష్ణుడు చేసిన రుక్మిణీ నగర ప్రయాణ వర్ణనలో నాటి రాజుల ప్రయాణ సన్నాహరీతులు కళ్ళకు గట్టించినాడు చిన్నన్న.

అష్టమహిషీ కళ్యాణమున పలుతావుల యుద్ధ వర్ణనలు కలవు. కృష్ణచాణూరుల, ముష్టిక బలరాముల ముష్టియుద్ధములు, కంస శిశుపాల రుక్మి దంతవక్త్రాదులతో యుద్ధములు వీరరసోచితముగ వర్ణింపబడినవి.

"శిరమును శిరమును జేతులఁజేతులురము నురంబును నూరులూరులను
బెరయ బాహాబాహి బెనఁగులాడుచును దొరసి ముష్టాముష్టిఁదొడరిపోరుచును"

అని చాణూర మల్లుడు భుజము చరచి శౌరితో చేసిన మల్ల యుద్ధమును కనులకు కనబరచినాడు చిన్నన్న.

కృష్ణుడు అష్టమహిషులను వివాహమాడి దుష్ట శిక్షణార్థము గావించిన యుద్ధములతో విండిన ఈ కావ్యము కృష్ణనాయకాభ్యుదయమును చాటి చెప్పుచున్నది. ఇట అభ్యుదయ మనగా శృంగార, వీర, వంశాభ్యుదయములనుకొనినచో అది నాయక పరముగ మనమీ కావ్యమందంతటను కాంచవచ్చును.

ఈ విధముగ అష్టమహిషీ కళ్యాణమున అష్టాదశ వర్ణనలే కాక వస్తు వర్ణనలు, పూతన, బాల బాలరామకృష్ణులు, రుక్మిణ్యాది వ్యక్తి స్వరూప వర్ణనలు, కవిత్వాది లలిత కళావిషయ వర్ణనలు, వేటవర్ణన, గోపికా సౌందర్యము, గోగణ వేషధారణము, యమునానదీ స్వరూపము, గర్భవతియైన దేవకీదేవి వర్ణనము, కృష్ణావతారము, నందసతి దధి మథనము, గోపకుల చలుదులారగింపు, భోజన పదార్థములు మొదలగు పెక్కు అంశములను కవి రసవంతముగ వర్ణించెను.

వర్ణనలు—కల్పనలు.

శేషాహిని శ్రీహరిని ఒకే మారు వర్ణించుచు క[illegible] వజోర్వ కీర్తి వల్లి వేవగల ననలొత్తెనన నొప్పు నాగేంద్రుమీద, [illegible]ట్టపై బలి నీల మనగఁబటు ఫణాధర సీమ ఖాసిల్లువాని" అనుచు వర్ణనలో గూడ పొదుపు పాటించుట ప్రశంసార్హము.

శ్రీకృష్ణుని స్వరూప వర్ణనము: 'లలిత సౌరభ రసాలంబ తిలకమైన వైజయంతీ దామముతో వెడ విల్తుడు క్రొవ్విరి కలువతూపు దొడగిన లేవ కస్తూరి నామము ప్రకాశించు చుండ, వియత్తల వీధి దార పంక్తులవలె బాహా మధ్యమున హారజాలము లమర, సిరి పదాబ్జములకై చేరు భృంగము వరుస వత్సము శ్రీవత్సము చెలగ, గగన కోణాంగణ కంజాత మిత్రుని పగిది వక్షమున కౌస్తుభ రత్నము ప్రకాశించు చుండ, కనకాద్రి కూటసంకాశ కిరీట ఘన కాంతి దశదిశాంగములు వ్యాపింప, బాహుపాశములందు కోదండ పద్మ పాశాంకుశ చక్రగదా సూన శరములతో చరణంబుపై నొక్క చరణంబు నిలిపి మరుని నవ్వెడు భంగిమలగి త్రిభంగి నంగీకరించి మురళి చక్కగ మోవిజేర్చి' శ్రీకృష్ణుడు వేణుగానము చేసినట్లు కవి వర్ణించెను. (పు. 86, 87). ఈ వర్ణన ఒక అందమైన రూపవర్ణతైల చిత్రము.

సౌందర్య వర్ణన మెచట చేసినను అ అంగాగములే. అ పోలికలే. ఎంతటి క్రొత్త పదజాల ముపయోగించవలెననుకొన్నను అ యేబది యారు అక్షరములే. కాని చిన్నన్న వర్ణనలు నిత్య నూతనమువలె చవులూరించును. "నవ్యం గ్రథన కౌశలాత్" అని కదా! అ కూర్పు నేర్పు సుకవి సొత్తు.

అసలు వర్ణన మనగా రంగుల పూతయే. కనుక ఒక వ్యక్తి రూపము నకు గాని, వస్తు రూపమునకు గాని అక్షర తైలవర్ణముమ పూయు రచనా శిల్పమే వర్ణన. అష్ట మహిషీ కళ్యాణములోని వర్ణనలన్నియు విలువెత్తు తైలవర్ణ చిత్రములే. ఇందలి బహు వర్ణనలు చిన్నన్న వర్ణనా ప్రియత్వ మును, నైపుణ్యమును వేనోళ్ళ చాటుచున్నవి.

కావ్యాదిని కవి 'వినుత వర్ణనలతో విరచింతునని' పలికిన ప్రతిన ప్రత్యంశమున సార్థకమైనదని విస్పష్టగ చెప్పవచ్చును.

**కల్పనలు :** కల్పన వర్ణనము నందొక భాగమే. పైన చెప్పిన వర్ణనలందు కవి ఊహాశాలిత్వమును దెల్పు భాగమంతయు కల్పనయే. అట్టివి మరి కొన్నిటిని పరికింతము.

ద్వితీయాశ్వాసము నందలి వర్షర్తు వర్ణనలో 'ఇంద్రగోప కీటకములు (ఆరుద్ర పురుగులు) జలజాస్త్ర హతకామిజన మాంస ఖండకులములా అనునట్లుండెనని ఊహించి కవియొక సన్నివేశ కల్పనము చేసెను. ఇంచు మించు నిట్టి ఉత్ప్రేక్ష లన్నియు కల్పనాత్మకములని భావింపవలెను.

గోపికా వస్త్రాపహరణమున వివస్త్రలైన గోపికలు కృష్ణుని చూచిన పుడు ప్రదర్శించిన అవయవ చేష్టా విన్యాసములోగల సిగ్గును ప్రకృతి వస్తువులతో ముడిపెట్టి కవి చేసిన ఈ క్రింది కల్పనము చూడుడు–

"కౌనులు వంచి యంగములెల్ల ముంచి నాన వాటించి లేనగవుల తోడ
నుడు రాజు మతలిన యుదయాస్త గిరుల నడుమఁజీఁకటిపర్వునటన
సిగ్గులను
బెడ మరలగఁ జడల్ బిగి చన్నుగవల నడుమఁజూపట్ట నందఱు
నూరకుండ" (ద్వి ఆ. పు. 71)

ఇట్లు ప్రకృతి సంబంధితవస్తువులను ఉపమానములుగ గ్రహించి చేసిన కల్పన లీ కావ్యము నందనేకము కలవు. గోపికల జలవిహార వర్ణనలోగల ఒక మనోజ్ఞ కల్పన–

"యమున తత్కుచ కుంకుమాకుల యగుచు
నమరె రేసంజ కెంపారు మిన్ననఁగ" – (పు. 113)

యమునానది నల్లన. గోపికల కుచ కుంకుమలు ఎఱ్ఱన. గోపికల జలకేళి సమయమున ఈ రెండు రంగులు కలసిన అనదీ జలము 'రే నంజ కెంపారు మిన్ను'వలె నున్నదట. యమునలో సాంధ్య వాతావరణమును సందర్శించిన చిన్నన్న ప్రకృతి పరిశీలనమును ప్రశంసింపక తప్పదు.

ఇట్లు అష్టమహిషీ కళ్యాణమున గల వర్ణనలందలి కల్పనలే కాని కథా సన్నివేశములందు కానవచ్చు ప్రత్యేక కల్పనలు లేవు.

## భాష – శైలి

ఏ మానవునకైనను భావప్రకటనమునకు భాషయే ముఖ్య సాధనము. **"Language is the medium of expression of feelings and thought"** అనియు **Literature is the immortality of human speech** అనియు ఆంగ్ల పండితుల అభిప్రాయము.

కవి కూడ మానవులలో ఒకడు కనుక అతని భావ ప్రకటనమునకును భాషయే ముఖ్య సాధనము. కాని సామాన్య మానవుడు వాడెడు భాషకును, కవి వాడెడు భాషకును కళాత్మకమైన భేదముండును. సామాన్య మానవుల భాషకు భావ ప్రకటనమే ప్రధాన లక్షణము కాగా కవి భాషకు కళాత్మక భావ ప్రకటన లక్షణముండును. కనుకనే సామాన్యుని భాషలో వీనుల విందైన పలుకుల పొందికలు కవిపించవు. అవి కవి భాషలో నుండును.

మానవ మనోగత భావ ప్రకటన కళకు కవి ఒక ప్రతినిధి కనుక ప్రతి పాఠకుడును కావ్యమున స్వీయానుభూతులను చూచుకొనవలెనను దృష్టితో అందరిని ఆకర్షించు భాషలో భావ ప్రకటనము చేయును. శబ్ద తత్త్వము బాగుగ తెలిసిన కవికి సామాన్య మానవుని కన్న ఏ శబ్దము నెచట రసోచితముగ ప్రయోగింపవలెనో తెలియును. సామాన్యుని వ్యవహారములో భాష క్షణ క్షణము మారుచుండును. అవసరమును కొలినచో కవి

అట్టి వ్యావహారికపు పలుకుబడులను గూడ స్వీకరించును. ఇవియే నానుడులు, లోకోక్తులు, జాతీయములుగ భాషా జగతిలో కనిపించును.

భావ ప్రకటనము నకై ప్రపంచమున అనేక భాషలు వెలసినవి. ఎవరి భాషా సంప్రదాయములు వారి కున్నవి. 'జనని సంస్కృతంబు సకల భాషలకును' అని లోకోక్తి. దేశమున ప్రాంతీయ భాష లనేకము. ఇట్టి 'దేశభాషలందు తెలుగులెస్స' అని అభియుక్తి.

తెలుగు సాహిత్యము నందు తమ రచనలలో అచ్చమైన, దేశీయమైన తెలుగునకు పట్టము కట్టిన వారిలో ప్రముఖులు తాళ్ళపాక కవులు. వారిలో ఎన్నదగిన కవి చిన్నన్న. అసలీ కవి తన కావ్యములకై ఎన్నుకొనిన ఛందమే దేశీయ ఛందము.

అష్టమహిషీ కళ్యాణమును పరికించినచో ఇతివృత్తము పౌరాణికమే యైనను ఆ కళ్యాణ గాథలను కవితా రూపమున కథనము చేయుటకు కవి దేశీయమైన తెలుగును, తెలుగు లోకోక్తులను, పలుకుబడులను సందర్భోచితముగ ప్రయోగించెను. తన కాలము నందు వాడుకలోనున్న దేశీయ పదములను, సాంకేతిక పదజాలమును స్వేచ్ఛగ వాడెను. తాళ్ళపాక కవులందరివి గాక ఒక్క చిన్నన్న కృతులలోని తెలుగు పలుబడుల నెవరైన వ్యక్తులు గాని, సంస్థలు గాని ఒకచోట కూర్చినచో అదియొక పెద్ద పద ప్రయోగ కోశమే కాగలదు.

వసుదేవుడు తనకు దేవకీదేవి వలన కలిగిన బిడ్డలను కంసుని హేతి ఘాతికి ఇత్తునని పలికినపుడు కంసుడాతని వదలి వేయగా, వసుదేవు డాపద నుండి తప్పించుకొనిన రీతిని కవి-

పులివాత బడి తప్పిపోవు చందమున
నెల నాగతోఁ దాంటి యింటి కేతెంచె (1-380).

అని చెప్పెను. పులివాత పడి తప్పిపోవు చంద మనుటలో వసుదేవుని మానసిక స్థితి రూపు కట్టినది. పులిని మించిన క్రూరజంతువు లేదు కనుక కంసుని క్రౌర్యము వ్యక్తమైనది. నేటికిని ఇది తెలుగునాట ప్రసిద్ధమైన పోలిక.

కృష్ణుని సంహరించుటకు గోపిక రూపమున వచ్చిన పూతన కృష్ణుని వీక్షించినపుడతడెట్లుండెనో తెల్పుచు కవి—

"నివురు గప్పినయట్టి నిప్పుక పోల్కిఁ
బవళించి యున్న యబ్బాలుఁజేకొనుచు" (1-814)

అని చెప్పెను. ఇచట నివురు గప్పిన నిప్పువలె బాలకృష్ణుడే కాక పూతన కూడ ఉన్నట్లుగ భావింపవచ్చును. 'నివురు గప్పిన నిప్పు' అనునది తెలుగు పలుకుబడి.

గోపికా వస్త్రాపహరణము నందలి మరియొక ఉదాహరణము.

"అదఁబోయిన తీర్థమది యెదురైన
జాదఁ గృష్ణుని గని సంతసించుచును." - (2-1841)

హరి భక్తియుక్తలై గోపికలు హరిని తమ భర్తగ కోరి నోముచు కొలకులందు నీరాడ కోరగా కృష్ణుడు వారికి కనిపించెను. మనము ఎవరి కొంకై ప్రయత్నము చేయబూనుకొందుమో ఆ వ్యక్తియే ఎదురైనచో ఇక ఆ ప్రయత్నము చేయనవసరము లేదను అర్థమున పై లోకోక్తిని వాడుచుందుము. గోపికలు కృష్ణుని కొరకై వ్రతము చేయబోగా అది పూర్తి కాకుండగనే కృష్ణుడగుపించెను. సహజార్థమిట సరిపోయినది. గోపికలు కృష్ణుని భర్తగ కోరి వ్రత మొనర్చుచు ముందుగ కొలనిలో దిగి స్నానము చేయబోగా ఆ కొలనే ఎదురుగ వచ్చినట్లు కృష్ణుడు ప్రత్యక్షమయ్యెనట. ఇట్లు రెండర్థము లందును ఈ లోకోక్తి ప్రయుక్తము.

"కడుపులోపలి చల్ల గదలక యుండ" (పు. 86); "ముక్కు మోమెఱుగక మోమోట పడక" అనురీతిని శరీరావయవ పద సంబంధ జాతీయములు, 'దంతి మెసంగు వెలగ కాయలగతి' (ఏనుగు తిన్న వెలగ పండు) 'పిలువక వచ్చిన పేరంటమునకు' ఇత్యాది లోకోక్తులు ఈ కృతిలో సహజ సుందరములై సిసలైన తెలుగు భాషా పలుకుబడికి అద్దము పట్టుచున్నవి.

ద్వితీయాశ్వాసమున వ్రేపల్లె వాతావరణమును తెలియజేయుచు కవి— "చెలగి వీనులఁ గేలుపేర్చి గొబ్బిళ్ళఁ బలు తెఱంగులఁ గూడి పాడెడు వారు" అనియు, 'కుతుకంబుతోఁ దోడి గొల్లలు వేల్పుకత సెప్ప విని శిరః కంపంబు సేయుచు గొబిళ్ళ పాడుకొనెడివారు' అని చెప్పెను. చెవులకు చేయి చేర్చి పాడుట, కథ విని శిరఃకంపము చేయుట, తల ఊపుచు 'కథ వినుట అనురీతి పల్లె ప్రజల గ్రామీణ ధోరణి. తెలుగుదనము, తెలుగు సంప్రదాయములను తెలుగుపద ప్రయోగముచే ప్రదర్శించినాడు చిన్నన్న. ఇదే సందర్భమున 'ఈ జాతి వేలపదము' అను శీర్షికతో—

"దండ నేమముగాదు దయ బొల్లిమేర
కొండ వేలుపు కథే కోడె వోరాజ" — (పు. 79)

అను రీతిలో కొన్ని ద్విపద పంక్తులు కలవు. బహుశః ఇది 'ఏల' పద కవితా సంబంధి కావచ్చును. ఇందు పాత్రోచిత భాష ప్రయోగింపబడినది.

"అనవల్ల పీవల్లవాదులుం బండ్లు గొనకొన కుందెనల్ గొమ్మ కుందెనలు
చిట్టులు నుట్టులు చిక్కము ల్వెన్న చిట్టులఁ దొట్టుల చల్ది జాడియలు
తరిత్రాళ్ళు వల్లియ త్రాళ్ళు జల్లెడలు మరిత్రాళ్ళుపగ్గంబులుగ్గంబులురులు"
[ప్ర. ఆ.—పు. 42]

అను ద్విపదలో అచ్చ తెనుగు పలుకుబడితో గొల్లపల్లె వాతావరణమును, గొల్లల వస్తు జాలమును కనుల ముందు బెట్టినాడు, ఇట్లే కృష్ణచాణూరుల మల్లయుద్ధమున కవి తత్సంబంధిత పద ప్రయోగము చేసెను. ఉదా:

'శాణమై యప్పుడద్దము దూరి శౌరి-కనలుచుఁబొడిచి వేగంబ దొక్కరము గొనుచు.' దొక్కరమొక మల్లబంధ విశేషము. "కళవరానకుఁ జొచ్చి దొక్కరము హత్తి" అని ఉత్తర హరివంశ (ఆ. 3) ప్రయోగము

పదాది ఢ కారము కలిగిన తెనుగు పదమును కవి భాగవత రామాయణ ప్రస్తావనమున— "ఢంకఁ బట్టుచుఁ బండ్లు దుల్లంగ గొట్టి" అని ప్రయోగించెను. అచ్చ తెనుగున అనుప్రాస రచనము 'కొవ్వులు జబురు జంగులు పిరంగులును బుస కోవులును గసాబులు తుపాకులును' (3-4191) అను వాక్యములందు కాననగును. ఇందలి పిరంగులు, తుపాకులు అన్య దేశ్యములు. "వింతయే నీ వింత వేండ నేమిటికి?" (పు. 131) అను వాక్యమున దీర్ఘము మీద సాధ్య పూర్ణము వాడబడిన తెలుగు పదము కలదు. ఇంకను ఈ కవి ప్రయోగించిన కొన్ని దేశీయములైన తెలుగు పదములు :

పూదియ — ఇది పూదె యొక్క రూపాంతరము. పూదె అనగా (బంగారు) పూస.

> చరమాశా నికషోపలాంచలములన్ సంధ్యా ప్రకాశోదయం
> బొరగావించి విరించి చేకొనిన సూర్యుండన్ పదార్వన్నె బం
> గరపుం 'బూదియ'కై వియద్విపణి వేడ్కన్ గాలమన్‌బచ్చు చె
> చ్చెరఁ జల్లించిన గవ్వచౌకమన మించెందారకా చక్రముల్ ॥
>
> — నైషధము. ౭ఆ.

చుల్లర వెట్టు : చుల్లి అనగా ప్రొయి. పొయి పెట్టుట కావచ్చును.

తుంపిళ్ళు : తూరవాన, తుంపర యొక్క రూపాంతరము తూర. వానతుంపర లని అర్థము,

ఓడులు : ఓటి కుండలని, ఓడి పోవుటలని అర్థము.

**కుందెనలు** : కుందియన యొక్క రూపాంతరము. కుంది, ధాన్యాదులు దంచు రోలగుంట.

**చిట్టుములు** : చిట్టి + ఉములు=గర్భిణీ స్త్రీకి కలిగెడు ఒకానొక లక్షణము. 'చిట్టుములు బెట్టుయ్యె' అని చిన్నన్న ప్రయోగము.

**పంపర కవ్వము** : పంపర పనస వృక్షము యొక్క కఱ్ఱచే చేయబడిన కవ్వము. ఇది పెరుగును చిలికెడు సాధనము.

**లిక్కులు** : గడ్డి మొదలగు వానిని కోసెడి చిన్ని కొడవళ్ళు.

**సగ్గెడలు** : చెంబులు; చౌకట్లు=నాలుగు ముత్యములు చేర్చి కట్టిన పోగులు. మనికితము = దుఃఖము; కాసియ = కాసె సంబంధి. మల్లబంధ విశేషము కావచ్చును; వెన్నెల సొగడాలు : సొగడాలు సొగటాలు రూపాంతరమేమో; ఇది వెన్నెలలో ఆడుకొను క్రీడా విశేషము కావచ్చును.

ఇంకను ఉద్దులగు ముద్దులు, చీరు మూరాడు, తామరగద్దె, దిట్టకూళ, వేల్పుల గమికాని చెంగటికి, మున్నీటి మొలనూలి ముదిత, వేయికన్నుల మేటి, తేరు, తేటిచాలు, కతకారి, గురికొండ్లు, దవలు కొత్తు, దుంకబట్టు, బొరియలు, కసవు, తలకోలలు, ఒడిసెండ్లు, పాటిమాడలు, చలప మంచములు, తామెనలు, గూటము, గుడిసెలు, చిలుప, పెంకి, గొల్లమిందెతలు, పండు దుల్లగొట్టు, ప్రతిన, మురువు, మొగులు, చిట్టకము, గచ్చిమాటలు, గురిగింజ పేషు, చక్కెర బొమ్మ వంటి కోకొల్లలైన అచ్చ తెనుగు భాషా పదజాల ప్రయోగమును బట్టి చిన్నన్న భాషాభి రుచిని, పాండిత్యమును గ్రహింపవచ్చును.

శైలి : శైలి అనగా శీలము యొక్క భావము. ఆంగ్లమున దీనిని 'STYLE' అందురు. ఇది రచయితను, కవిని గుర్తింపజేయు. గుర్తింపు కొఱ్ఱు

వంటిది. "Style is the man" అని ఆంగ్ల నిర్వచనము. శరీరము నందు అవయవ సౌష్ఠవము కంటె భిన్నమై, అతీతమైన ఒకానొక లావణ్యము వంటిది శైలి. ఇది కవి వ్యక్తిత్వమును పట్టి యిచ్చును. పదముల కూర్పు శైలి కాదు. ఇరువురు కవులు ఒకే భావమును చెప్పుచున్నపుడు భాషలోని ఆ 56 అక్షరములే ఇరువురు వాడుకొనినను భావ వ్యక్తీకరణము భిన్నమై రచనమున ఒకరి ఎత్తుగడ వలె మరొకరి ఎత్తుగడ ఉండని ధోరణి ఏది కలదో దానిని శైలి అనవచ్చును. అది ఎట్టి పరిస్థితి యందును మారదు.

ఆఖ్యాన శైలి (Narrative Style), నాటకీయ శైలి (Dramatic style), వర్ణనాత్మక శైలి (Descriptive style) అని శైలి మూడు విధములు. సామాన్యముగ కావ్యము లన్నియు వర్ణనాత్మకములే. ఈ త్రివిధ శైలీ భేదములను కవి తన కావ్యమున పాటించును. కాని ఇందొకటి అంగియైనచో తక్కినవి అంగములుగ నుండును. అంగిని బట్టి కవి శైలిని విర్ణయింతురు.

కవిత్వమున రాసానుగుణమైన భావము, భావానుగుణమైన వృత్తము, వృత్తానుగుణమైన శైలి, శైలికి అనుగుణమైన శబ్దముండవలె ననియు, వీటి అన్నిటి మొత్తమే కవితా శిల్పమనియు కవితాకళ గ్రంథమున శ్రీ ఆచార్య తిరుమల వివరణము. (పు. 109). మొత్తము మీద కావ్యశోభ శైలిపై ఆధారపడి యుండుననుట సత్యము. "ఒక గ్రంథమును సాహిత్యముగా పరిగణింపజేయునది రమణీయమైన శైలియే" అని పింగళి వారు గౌతమ వ్యాసములందు శైలీ ప్రాముఖ్యమును వక్కాణించిరి.

అష్టమహిషీ కళ్యాణము నందు చిన్నన్న కవితాశైలి ఎట్టిదో పరిశీలింతము ఇతని రచనలో అనుప్రాసికమైన, సంస్కృత సమాస భూయిష్టమైన, అచ్చ తెనుగు పద బంధమైన, రసోచితమైన, భావానుగుణమైన శైలీ భేదములు కవిపించును. ఇతని శైలి ద్రాక్షాపాక మధురము.

వర్ణనాంశములను బట్టి పరిశీలింప ప్రధానముగ చిన్నన్న శైలి వర్ణనాత్మక శైలియే.

అనుప్రాస శైలి : నందుని బృందావన ప్రయాణ వర్ణన—

"ననుచు కందముల కందముల కుందముల
ఘన లవంగముల లుంగములఁ దుంగముల....
సరస కుంజములఁ గంజముల పుంజముల
లలిత సాలములఁ గోలముల.... ప్ర. ఆ. పు. 43

ఇందలి అనుప్రాస ఆహ్లాద జనకమైనది. "కంద మాకంద ముకుందార వింద చందన స్యందన తాల తక్కోల బృదమై యొప్పారు బృంద సొత్తెంచి" అవి కృష్ణునన్వేషించు గోపికలను గూర్చి చెప్పిన సందర్భమునను, తృతీయాశ్వాసములో ద్వారకా నగర వర్ణనమున "సాంద్ర చందన పారిజాత నీహార చంద్ర చంద్రోజ్జ్వల చంద్రశాలలును.... దర్పిత పారావత ప్రాంశునాద దర్పక వేద మంత్రముల సంపుల్ల మంజరీ బహు పుంజ మంజు నికుంజ రంజిత శాలల రత్న వహ్నులను" అను రీతిని సాగిన రచనమున సంస్కృత సమాస శైలి అగుపించును. తాండవ కృష్ణుడు కాళియు మర్దన మెంత గట్టి పట్టున సాగించెనో తెల్పుటకు అర్థవంతమైన. ద్విరుక్తటకార ప్రయోగముతో తెలుగుపద శైలి ఎంత అందగించినదో చూడుడు :

"గుల్లల తిత్తియై కుల్లబింకంబు
పెంచి గుప్పించి గుప్పించి నొప్పించి
దంచి యదంచి వాటముగ గాటముగఁ
బట్టి గిట్టియుఁ జలపట్టి మైపట్టి
కొట్టి వాలంబు మార్కొని చుట్టి పట్టి
దట్టించి గట్టించి దర్పంబు బలము
వట్టించి రక్తంబు వాఁతఁదొట్టించి...." పు. 63

ఇట్లే మరొక సందర్భమున— "పట్టు మీ పట్టు చూపట్టు నీ పట్టు కట్టు చీరెల తలకట్టు చౌకట్టు. తెమ్మ ముత్యమ్మ పుత్తెమ్మ. పోతెమ్మ కమ్మ పూఁబోదరిల్లు కలికి నీ సొమ్మ. కొమ్మ గంధము పూసికొమ్మ నీ వంది కొమ్మ పూవులు జాతి కొమ్మ నామమ్మ అనుచు వృత్త్యనుప్రాసముతో తెలుగు పద జాలము నెంతయు అందముగ పోహళించినాడు చిన్నన్న.

గజాసుర భంజనమున వీర రసోచితముగ సంస్కృత సమాస శైలి ప్రదర్శించెను. ఉదా :

"భండన గజదైత్య ఖండనోద్దండ
చండ తాండవ లసచ్చండికాధవుని." - పు. 61.

'కడునొప్పునెతిఁ గప్పుగల కొప్పువాని' ఇత్యాది వాక్యములందలి చిన్నన్న శైలిలో ప్రబంధ ధోరణి కనిపించును. కొన్ని తావుల వసుచరిత్రయందిట్టి శైలి గమనించగలము.

బకాసురుడు బక రూపమున కృష్ణుని పైకి వచ్చు సన్నివేశమున కవి భావానుగుణమైన శైలీ విన్యాసమును ప్రదర్శించెను.

"చంచు వాడించి పక్షములు జాడించి
పంచి గోడించి తీవ్రత దువాడించి." పు. 47

బకము జలజాక్షుని కబళింప వచ్చినదట. పాద మధ్యమున బిందు పూర్వక చకారముతో పదమును త్రుంచి సగమిటు సగమటు ఊగుచున్నటుల విచిత్ర శైలి ననుసరించి బకాగమనమును రూపు కట్టించినాడు కవి. కొంగ ఏ చేపనైన మ్రింగుటకు వెళ్ళునపుడు ముందు అటు విటు మెల్లగ కదలుచు బయలుదేరి పిదప పక్షములు జాడించి చెంచు వాడించి తీవ్రముగ వెళ్ళును. ఇది కవి విశిత పరిశీలనమునకు విదర్శనము. ఆడించి, జాడించి, గోడించి

వంటి అనుప్రాస రచనచే హరిని కబళింపబోవు బకుని తీవ్రత వ్యక్తమగు చున్నది.

"కమలేశ నరహరి ఖగరాజగమన.... కరుణా కటాక్ష శ్రీకలితోరు వక్ష పరమ యోగీశ హృత్పద్మ దినేశ యపరాధి నపరాధి నని పొక్కి- స్రుక్కి-" అను ద్విపద పంక్తులందు 'గోమూత్రికాబంధము'న కనుగుణమైన శైలీవిన్యాసము పాటింపబడినది. జాంబవతిని వర్ణించు సందర్భమున-

"తమ్మలై మెఱుఁగు ముత్యమ్ములై శోభితమ్ములై బెళికెడు
తళుకుఁగన్నులును
దామరై కళల కాదామరై శీతధామరై కాంతి నెంతయు నొప్పుమోము
గొప్పలై యొప్పుల కుప్పలై పసిఁడి తిప్పలై నిగ్గులు దేఱు పాలిండ్లు
(పు. 223)

అను రీతిని సాగిన రచనమున 'ఐ' కార ప్రయోగము, గొప్పలు, ఒప్పులు, కుప్పలు, తిప్పలు మొ॥గు వృత్యను ప్రాసాలంకార పద ప్రయోగము ద్విపద శైలికొక గొప్పతన మేర్పరచినది.

ద్వితీయాశ్వాసమున ఒక గోపిక ఎఱుకత వలె బెత్తము చేతబూని సోది చెప్పుచున్న సందర్భమున "దండ నేమముగాదు దయ బొల్లి మేర కొండ వేలుపు కదే కోదె వో రాజ" అను రచనలో కవి శైలీ భేదమును ప్రయోగించి సోదె చెప్పెడు ఎఱుక స్త్రీ రూపమును ప్రత్యక్ష పరచినాడు.

చిన్నన్న రచన శబ్దాలంకార సురభిళ శోభితమై, కమనీయ శైలీ సుందరమై పఠితల నాకర్షించు నొక ప్రత్యేక లక్షణము కలిగియున్నది.

# అలంకారములు - చమత్కారములు

"అలం కరోతీత్యలంకారః"- అలంకరించునది అలంకారమని నిర్వచనము. దేనిని అలంకరించునది? కావ్యమును. కనుక కావ్యలక్ష్మికి శోభను కూర్చునవి ఈ అలంకారములే. "పొసఁగ ముత్తెపు సరుల్ పోహళించిన లీలఁ దమలోన దొరయు శబ్దములఁ గూర్చి" అను పద్యమున పింగళి సూరన శబ్దార్థ రసరీతు లెట్లుండవలెనో దెల్పుచు—

"అమర నుపమాదులును యమ కాదులనగు
నట్టి యర్థ శబ్దాలం క్రియలు ఘటించి
కవితఁ జెప్పంగ నేర్చు సత్కవి వరునకు
వాంఛితార్థంబు లొసఁగని వారు గలరె॥

— కళా పూర్ణోదయము

అనుచు అలంకార ప్రాధాన్యమును, ప్రస్తావించెను. అధునిక కవుల కన్న పూర్వాంధ్ర సంస్కృత కవులు కావ్యములందు అలంకారములకు తగిన ప్రాముఖ్యము నొసగిరి. ప్రాచీన కవులలో ఒక్కొక్కరు ఒక్కొక అలంకారముపై ప్రత్యేక దృష్టిని నిలిపిరి. ఉపమకు కాళిదాసు, శ్లేషకు భట్టుమూర్తి, శబ్దాలంకార రచనకు బమ్మెర పోతనలను నేటికిని పేర్కొను చున్నారు. రస పోషణమున కీయలంకారములను వారు సముచిత రీతిని ప్రయోగించిరి.

అలంకారములు శబ్దార్థ భేదముచే ద్వివిధము. వృత్తి ఛేక యమక ముక్తపద గ్రస్త లాటాంత్య ప్రాసములు శబ్దాలంకారములు. అర్థాలంకారములు శతాధికము.

ద్వితీయాశ్వాసములో చిన్నన్న పేర్కొనినట్లు అష్టమహిషీ కళ్యాణము 'చమత్కృతి అలంకృతియునైన భవ్యకృతిగ' భావింప

వచ్చును. ఇందు శబ్దార్థాలంకారముల కలంకారీ పని తనము రసజ్ఞ మనోజ్ఞ ముగ కనిపించును. సోదాహరణముగ పరిశీలింతము.

అనుప్రాస రచనము చిన్నన్నకు అప్రయత్న సిద్ధము. అలవోకగ పిలిచిన అనుప్రాసము పలుకును. ఈ కావ్యము నందెచట తడిమినను గుప్పిళ్ళ కొలది అనుప్రాసములు పాఠకుల చేతికి తగులును. ఇట్టి రచనము ప్రధానముగ వర్ణ్యవస్తు స్వరూప వ్యక్తీకరణము నందును, అటనట సంభాషణాంశము లందును కలదు.

అంత్యాను ప్రాసము : ఆశ్వాసాంతములందలి ఈ క్రింది పంక్తులు-

"కనక గాత్రికిని ప్రకామ ధాత్రికిని....
సారస గేహకుఁ జారు బాహకును
స్ఫార లావణ్యకు సకల గణ్యకును
పరమ కళ్యాణికి భ్రమర వేణికిని— (2—3881).

ఇందంత్యాను ప్రాసాలంకారము గలదు. ఈ కావ్యమునందిది ఎక్కువగ కనిపించును. 'గురు సమానీత మార్గుండు గర్గుండు'— 'గురు వేణు శర చాపకుల గోపకుల'— 'కుచములు గీటాడ గొనబులూటాడఁగచము లల్లాడ ముంగఱలు మల్లాడ'— 'కరమెత్తి చేగుత్తి కవలచే ఘత్తి హరి నొత్తి పైచి ర్యాయత్తి వలుయెత్తి' ఇత్యాది పంక్తు లనేక మిందుల కుదాహరణముగ చూపవచ్చును.

వృత్త్యను ప్రాసము : ఒక హల్లు అనేక పర్యాయము లావృత్తి యగుట. ఉదా : 'బాహాలతల గొల్లెతల ఫాలతలములుంచి' (2-2950) ఇందు లకార తకారములు పెక్కుమార్లు అవృత్తి యయినది.

యమకము : పద వ్యవధానముతో అర్థ భేదము కలుగువట్లు సమానాక్షరములు వాడుట.

"లలిత ప్రబంధముల లో
పల యమకము దూర్చి రసము పాదొనరింపన్
వలయునె పెరుగును వడ్లును
గలబోసిన ముచ్చటగునె కవివరులారా॥

అని లక్షణా పరిణయ కావ్యమున తిరుపతి వెంకట కవులు లలిత ప్రబంధములలో యమకమును విరసించిరి. కాని అష్టమహిషీ కళ్యాణమున చిన్నన్న అంత్యాను ప్రాసము తరువాత యమక గమకములనే ఎక్కువగ ప్రయోగించి కవితా సౌందర్యమును సాధించెను. ఉదా :

అగ్గళంబగు దాని యగ్గళంబవుడు (1-1261)
నగమూర్తినైన పన్నగమూర్తి నేను.... (2-2047)
యమున సౌరభ నికాయమున.... (2-2620)

ఛేకాను ప్రాసము : అర్థ భేదము కలిగిన సమానాక్షరములను అవ్యవధానముగ ప్రయోగించుట. యమక గమకము తరువాత ఈ కావ్యమున ఛేకము పాకమున బడినది. ఉదా :

"సలలిత వాద్య ఘోషమున ఘోషమున.... (2-2027)
'తళుకొత్తు కుటిల కుంతల తలంబుల.... (2-2647)
'లలితేంద్ర నీల జాలముల జాలముల.... (3-4267).

ముక్త పద గ్రస్త లాటాను ప్రాసాలంకారము లీ కావ్యము నందంతగ కనిపించవు. శబ్దాలంకార రచన మింతగ కుదురుకొన్న ఈ కావ్యమున అలంకారములను బలవంతముగ చొప్పించి నట్లుండ కుండుట విశేషము. శబ్దాలంకార రచన కవితకు అక్షర రమ్యతను చేకూర్చి పఠితల నాకర్షించి ఆహ్లాదపరచును. వర్ణనలందిట్టి రచనము విసువు పుట్టింపక ఉత్సాహపరచును. ఈ కావ్యమునందిట్టి రచన యుద్ధ వన వర్ణనములలో గమనింపవచ్చును.

"మును శిరంబులు నరంబులు కరంబులును పెనునరంబులు విజృంభించి మోదుచు దొనల సూతులును గౌతులను రౌతులను ఘన హేతులను బంది గాఁగఁ జదుపుచును, మొగిఁ జర్మములు, వర్మములు మర్మములును దెగి ధర్మముల తోఁడ ద్రెళ్ళఁ గొట్టుచును" (4-5223). ఇత్యాదులందు కవి శబ్దములచే కవాతు చేయించినాడు. శబ్దములు ద్వంద్వ యుద్ధము చేయు చున్నవా అనుస్ఫూర్తి పాఠకులకు కలుగును.

**అర్థాలంకారములు :** ఈ అలంకారములందు 'ఉపమ' గరీయసి. 'ఉపమైకా శైలూషీ' అని అప్పయ దీక్షితులవారి అభిప్రాయము. కాళిదాసు వలె చిన్నన్నకు ఉపమతో సంబంధమధికమే. కావ్యాదిని కవిత్వమెట్లుండ వలెనో చెప్పుచు—

> "ఉలికి కస్తురి వీణెఁ గోసిన కరణిఁ
> దెలి కప్పురపు గ్రోవి దెఱచిన సరణి
> విరవాది పొట్లంబు విడిచిన మాడ్కి"...."

కవిత చెప్పిన సులక్షణుని కవీంద్రుడందురని పరిమళ వస్తువులను ఉప మానములుగ గ్రహించి ఉపమాలంకారమును ప్రయోగించెను. ఇట కవిత్వ ముపై కవిత్వము చెప్పినాడు చిన్నన్న.

ప్రాచీన కావ్యము లందీ ఉపమాలంకారము అనేక రీతులలో కని పించును. ప్రాణ్య ప్రాణ, మూర్తా మూర్త వస్తువులతో పరస్పరముగ గాని, వ్యత్యస్తముగ గాని అనేక పద్ధతులలో పోలికలు కనిపించును. ఇందు పౌరాణిక కథా భాగములతో పోలికలు, ఆధ్యాత్మికపరమైన ఉపమాన ములు, కథా సూచకమైన పోలికలు గమనింప గలము.

ప్రథమాశ్వాసమున బాలకృష్ణుని రూపవర్ణనమున— 'మెరుపులు చుట్టిన మేఘ పోతముల మురువున గటి సూత్రములు దేజరిలుచు' అని కలదు. ఇందు కటి సూత్రములు కృష్ణరూప పర మూర్త స్ఫూర్తమైన ఉపమేయ వస్తువు. మెరుపులు చుట్టిన మేఘ పోతములు ప్రకృతిగతమైన

మూ_ర్త వంతమైన ఉపమాన వస్తువు. ఇట్టి ప్రకృతి సంబంధమైన ఉపమ లిందు హృద్యమై అలరారుచున్నవి.

ప్రాణి వస్తువులకు ప్రాణి వస్తువులతోడనే పోలిక– బహుకరేణుల తోడ భద్రకుంజరము విహరించు గతి శౌరి విహరింపఁదొడఁగె" (5-8226). "హరియును మానవహరి హేమ కశిపు కరముగ్రముగఁ బట్టుగతి వాని బట్టి తల్లడిల్లఁగఁదన్ని" (3–3751). అని కంస వధ ఘట్టములోని కథా పరమైన ఉపమానము ప్రహ్లాద కథా సంబంధమైనది. ఈ కావ్యము నందు కవి శ్రీకృష్ణుని ప్రణవ స్వరూపముతోను, గోపికలను ప్రణవ సంపుట మంత్రరాజ బీజములతోనుపోల్చి ఉపమతో ఆధ్యాత్మికదృష్టిని ప్రదర్శించెను. 'పరమ యోగీంద్రుల భాతి గోవింద పరచింత సేయుచుఁ బరచింతలుడిగి' అని గోపికలు పరమ యోగీంద్రులతో పోల్చబడిరి. 'అనుపమ జీవరత్నము చలించిన మాడ్కి_' బాలకృష్ణుడు తొట్టెలో నూగుచుండెనట. శ్రీమన్నారాయణుడు జీవత్వము నంగీకరించి బాలకృష్ణుడగుటచే కృష్ణుని జీవరత్నముతో పోల్చి ఉపమకు రత్న కాంతిని ప్రసాదించినాడు చిన్నన్న. 'జలజాక్షువీర రసంబు చందమున జలజాప్తుడుదయించె' (పు. 134). ఇది సూర్యోదయ వర్ణనమున కథా సూచకముగ కృష్ణుని పరాక్రమమును దెలుపు ఉపమ. చాణూర ముష్టికులతో కృష్ణ బలరాములకు యుద్ధము జరుగనున్న సందర్భమిది. కృష్ణుని వీరరసము వలె సూర్యుడుదయించెననుట కథానుకూలము. మరియు క్షీరమును వర్షించు ఆవుల పొదుగులను వర్షించు పయోదములతో పోల్చి (పు. 123) అందమైన విసూత్నమైన ఉపమాలంకారమును ప్రయోగించెను.

"ఉరగంబు నుమియు మయూరంబు పోలె
నరజాఱు పూదండ నలవడు కొప్పు అల్లాడ"– (1-911)

ఈ ఉపమలో కవి ఊహా శాలిత్వము అనుపమానము. అరజారు పూదండతో నున్న కొప్పు ఉరగము నుమియు మయూరమువలెనున్నదట. ఇట ఉమియు

అను క్రియా పదము వలన అలంకార వ్యక్తీకరణమున సౌందర్యము సాధింపబడినది.

పూతన విష పయోధరయై వచ్చి కుచము నొకదానిని కృష్ణుని వాత నిడగా— 'అమృతాంశు కులభవుండగు శౌరి రాత్రి కమలాగ్ర తలమున భృంగము వలె చెలగి తీయని నోటితో చేదును మేసినాడట. ఇచట రాత్రి పూతన. ఆమె కుచాగ్రమును కమలాగ్రముతోను, శౌరిని భృంగముతోను పోల్చి శౌరి తన తీయని నోటితో చేదును (విషము) మేసినట్లు చెప్పెను. శౌరి నోరు తియ్యన ఎట్లు? కారణమతడు అమృతాంశు కులభవుండని కవి సమర్థనము. అమృత మూర్తిని విషమేమీ చేయును? కనుకనే కృష్ణుని శౌరి అని పేర్కొనెను. ఇందలి పద ప్రయోగము, సన్నివేశ కల్పనము కవి ప్రతిభకు నిదర్శనము.

**ఉత్ప్రేక్ష :** ఉపమ తరువాత ఈ కావ్యమున ఉత్ప్రేక్షాలంకార మధికము. ధనుర్యాగమునకు వచ్చిన బలరామకృష్ణులు ఏనుగును సంహ రించు సందర్భమున "సిరువరు జయలక్ష్మి నేసఁబ్రాలనగ వర కుంభ మౌక్తిక వ్రాతంబు రాల" (పు. 137) అని కవి ఉత్ప్రేక్షించెను. ఏనుగు కుంభస్థలి నుండి రాలి పడుచున్న ముత్యములు జయ సూచకముగ కురియు సేస బ్రాలా అనునట్లున్నవట. ఇట ఉత్ప్రేక్ష కృష్ణుని విజయ పరంపరకు సూచకమగుట విశేషము.

"కడలిపైఁ బొరలెడు కరడులో యనఁగ
నుడువీధి బక పంక్తు లురుగతి నడచె" — (పు. 66).

ఇందలి ఉత్ప్రేక్ష మనోజ్ఞము. ఆకసమున ఎగురుచున్న కొంగల వరుసలు సముద్రముపై పొరలుచున్న అలలవలె ఊహించిన కవి ప్రకృతి పరిశీలనము ప్రశంసనీయము.

**రూపకము** : 'ఉడు' వీధి యనెడు పయోరాశి నొప్పు బడ బానలంబనఁ బ్రబలు చూపట్టె' (పు. 134). ఇందు ఉపమానోపమేయము లగు సముద్రాకాశములకు అభేదము చెప్పబడినది. ఇది చాణూర కృష్ణుల యుద్ధమునకు ముందు గావింపబడిన సూర్యోదయ వర్ణనము. కనుక బడ బానలోపమ విలయ సూచకము.

**అతిశయోక్తి** : గోపసతులు కృష్ణుని చూచి మోదమున చేసిన చేష్టలను వర్ణించుచు—

> "పొడివి పాలిండ్లు వీఁపున వెడలంగ
> నదిమె కృష్ణుని మోవి నానె నొక్కర్తు ...." (పు. 103)

అని కవి అతిశయముగ చెప్పెను. ఒక గోపసతి కృష్ణుని కౌగిలింపగా ఆమె పాలిండ్లు కృష్ణుని వీపు నుండి దూసుకొని పోయినవట. ఇచట సంబంధము లేని వస్తువులకు సంబంధము కల్పింపబడి గోపసతి యౌవన పటుత్వమును, కౌగిలి బిగువు అతియముగ తెల్పబడినవి. కనుక ఇది సంబం ధాతిశయోక్తి అలంకారము.

**వ్యతిరేకము** : "ఉపమానాదుపమేయస్య గుణ విశేష వత్త్వే నోత్కర్షో వ్యతిరేకః" అని రసగంగాధరము. ఉపమానోప మేయములందు ఉపమేయ గుణ విశేషములను వాని ఆధిక్యమును చెప్పుట వ్యతిరేకా లంకారము. ఉదా :

> "విగుడు నన్నపు వంక నెలవంకఁ జూచి
> నగుచుందు నొయ్యారి నామంబు వాని" (2-2606).

ఇందు నామము ఉపమేయము. నెలవంక ఉపమానము. నగుచుండుననె క్రియాపదముచే ఉపమేయ వస్తువు యొక్క ఆధిక్యము చెప్పబడినది.

**దృష్టాంతము :** ఉపమానాదులకును, సాధారణ ధర్మమునకును బింబ ప్రతిబింబ భావము దృష్టాంతము. "తరగల తనకు ముందరగల జనవి సరముల నఖిల వాసరముల నెన్న గణన మీరవు మౌవిగణ నుత నీదు గుణములు గణనకుఁ గొలఁదులే కావు" అని కృష్ణుని దేవేంద్రుడు తన అపరాధము మన్నింపుమని వేడు తరిని దృష్టాంతముగ "కడుపులోపలి బిడ్డ కాలఁదన్నినను జిడిముడి తల్లికిఁ జెల్లునే తండ్రి" అని చెప్పుటలో దృష్టాంతాలంకారము గలదు.

ఇంకను ఈ కావ్యమున యథాసంఖ్య అర్థాంతర న్యాసాద్యలంకార ములు ప్రయోగింపబడినవి.

**చమత్కారములు :** "నహి చమత్కార విరహితస్య కవేః కవిత్వం కావస్య వాకాద్యత్వమ్" అని క్షేమేంద్రుడును; "స్వవిశిష్ట జనకా వచ్ఛేదక ప్రతిపాదకతా సంసర్గేణ చమత్కారత్వవత్వం కావ్యత్వం" అని జగన్నాథ పండితరాయలు చమత్కారమే కావ్య లక్షణమనియు, చాల చమత్కారముగ కావ్య ప్రపంచ మంతయు లక్షితమైనదని పేర్కొనిరి.

చమత్కారము శబ్దగతము. అర్థగతము, శబ్దార్థగతము, శ్లేషగతము. సంభాషణాత్మకము, వర్ణనాత్మకము ఇత్యాదిగ అనేకరీతులలో కనిపించును. రస పోషణమునకు చమత్కారము దోహదకారి. చమత్కారము పఠితలకు ఉత్సాహమును, ఉత్తేజమును కలిగించి కావ్యపఠనాసక్తిని పెంచును. పఠితలకు జాణతనమును కలిగించును. చమత్కారముగాని, హాస్యముగాని ఉదాత్త గంభీరముగ నుండవలెను. హృదయావర్జకమైన అర్థముతో మేఘములోని మెరుపువలె శబ్ద మెచట ప్రకాశించునో అచట చమత్కారము కలదని గ్రహింపవలెను. మెరపు మెరిసినట్లే శబ్దము మెరయును. చమత్కారము వేరు, హాస్యోక్తి వేరు. చమత్కారము నందు హృదయము స్పందించును. హాస్యోక్తి యందు సంపూర్ణ హృదయ వికాసము కనిపించును.

ప్రాచీన సంస్కృతాలంకారికులలో చమత్కారమును ప్రధానముగ ప్రస్తావించిన వాడు విశ్వేశ్వర దేశికుడు. ఈయన రచించిన గ్రంథము చమత్కార చంద్రిక. "ప్రతిపద్యము చోద్యముగా కృతి చెప్పిన నొప్పుగాక" అని విక్రమార్క చరిత్రమున జక్కనయు. "ప్రతి పద్యము నందు చమత్కృతి గలుగం జెప్పనేర్తు" అని విజయవిలాసమున చేమకూర వెంకట కవియు చమత్కారముపై ఎక్కువ మక్కువ చూపిరి.

చిన్నన్నయు అష్టమహిషీ కళ్యాణమున "కృతి యొనర్చెద చమత్కృతి సంఘటింప" (పు. 7) అనియు, "నీదు భవ్యకృతియు నాకృతియు. చమత్కృతి, నలంకృతియు" (పు. 101) అని తన కృతి చమత్కార భరితమనియే చెప్పెను. పరిశీలింతము.

"ఈ కొడుకు బనులు వేయింతురే జగతి
మనుజుగా నాత్మ నమ్మకుమమ్మ నీకు
తనయుఁడె మాపాలిదయ్యంబుగాగ" (పు. 33)

అని గోపికలు యశోదకు బాలకృష్ణుని దుడుకు చేష్టలు వివరించిరి. 'మా పాలిదయ్యము' అను పదములో వారి విసుగు వేసటలు వ్యక్తమగుచున్నవి. కాని అందే చమత్కారము కలదు. పీడించు వారివి దయ్యమందుము. ఇది దైవ పదమునకు వికృతే కనుక కృష్ణుడు మనుజుడు కాడు దైవస్వరూపు డను పరమార్థము స్ఫురించుటచే నిట నిబ్దగత చమత్కారము కలదు.

శ్రీ కృష్ణ గోపికల శృంగార చేష్టలను వర్ణించుచు కవి—

"కొనగేలఁ గొండ గైకొన కెత్తువాఁడు
తనివి యెత్తగఁ జూచెఁ దత్కుచద్వయము" - (పు. 94)

అని చమత్కరించెను.' ఇదివరలో కృష్ణుడు గోవర్ధన పర్వతమును కొనగేలనే ఎత్తెను. అందతనికి సంతృప్తి లేదు. కనుకనే నేడు తనియుటకై గోపికా

కుచపర్వత ద్వయము నెత్త జూచెనట. ఈ శృంగార సన్నివేశమును గోవర్ధన పర్వతోద్ధరణముతో ముడిపెట్టి చమత్కరించుటలో అర్థగత చమత్కారము అందగించినది.

పంచమాశ్వాసమున కృష్ణుడు ఉద్యానవనములో అష్టమహిషులతో శృంగారపరమైన చమత్కార సంభాషణము చేసెను. ఒక సతి కృష్ణునకు విరిగుత్తులీయబోగా తనకు చన్నులు విరిగుత్తులే వేడుకయని కృష్ణుడు చమత్కరించెను. చన్నులను విరిగుత్తులతో పోల్చుట కవి సమయము. ఇది శృంగార రస పోషణమునకు ప్రయోగించిన చమత్కారము. గోపికల సౌందర్య వర్ణనములోని ఈ క్రింది పంక్తులు చూడుడు.

"అతివ నెమ్మొగము సోయగ మెన్నఁగుముద
పతి బింబమిది పూర్వ పక్షమే తలఁప
నలవి మీఱిన ముత్తియంబుల నొక్క
కొలికికిఁ దెచ్చు నీ కొమ్మ పల్వరుస....    (పు. 97)

ఈ గోపిక ముఖ సౌందర్యమునకు చంద్ర బింబము సాటిరాదు. ఇది మామూలు వాక్యమే. కవులందరు సామాన్యముగ ఉపయోగించు పోలికయే. కాని అతివ నెమ్మొగము సోయగమెన్నుటలో చంద్ర బింబము పూర్వపక్ష మనుటలోనే చమత్కారము కలదు. చంద్రువకు శుక్ల కృష్ణ పక్షములు ప్రసిద్ధములు. శుక్ల పక్షమున చంద్ర బింబము సంపూర్ణ కాంతితో ప్రకాశించును. కృష్ణ పక్షమున కాంతి హీనమగును. ఆమె ముఖ సౌందర్యము నెన్ను విషయములో పూర్వపక్ష చంద్ర బింబమునే గ్రహింపవలెనవియు, కృష్ణపక్షము (బహుళ పక్షము) నాటి చంద్ర బింబము పనికి రాదని కవి చమత్కారముగ చెప్పెను. మరియు, శాస్త్రవాదము లందు పూర్వ పక్షము చేయు పద్ధతి ఒకటి కలదు. ఆ గోపిక ముఖ సౌందర్యము నెన్ను విషయములో చంద్ర బింబము పూర్వపక్ష సిద్ధాంత రూపమే కాని సంపూర్ణ

సమాధాన రూపము కాదని శాస్త్ర సంబంధమైన అర్థము కూడ పాఠకుని హృదయమున చటుక్కున మెరసి చమత్కారమును స్ఫురింపజేయును.

ఇక ముత్యముల కన్న కొమ్మ పల్వరుసయే మిన్నయను భావమును వ్యతిరేకాలంకారమున 'ముత్తియంబుల నొక్కకొలికికిఁ దెచ్చు నీ కొమ్మ పల్వరుస' అని చమత్కారముగ చెప్పబడినది. ముత్యముల మాలలో 'కొలికి పూస' యుండును. ఆ మాలలోని ముత్యములన్నియు కొలికి పూస కడకు చేరవలెను. అపుడు మాత్రమే అది మాల యగును. ఆమె పలు వరుసకు ముత్యములోడి చెదిరినవి. ఆమె పలువరుస ముత్యముల నొక కొలికికి దెచ్చెనట. కొలికి పద ప్రయోగమిట సార్థకము. 'కొలికి' అను పదమును 'తెచ్చు' అను క్రియా పదముతో కలిపి చెప్పుట వలన భాష సజీవమై చమత్కారము నందించుచున్నది. ఆ గోపిక ముత్యముల వంటి పలువరుస గలదియను భావము వింత చమత్కారముగ దెల్పుట విశేషము.

ఈ విధముగ తాళ్ళపాక చిన్నన్న అష్టమహిషీ కళ్యాణమున-చమత్కృతి సంఘటింప జేయుచు చతుర శృంగార వాచాప్రౌఢిమతో, అలఘు శబ్దార్థ సారసరీతి రస ప్రభావముతో, వినుత వర్ణనలతో, చిక్కని శైలితో, దేశీయ పదజాలముతో, చక్కని పాత్ర చిత్రణములతో శ్రీకృష్ణ చరితమును 'విరిపొట్లము విప్పిన గతి' పరిమళింప జేయుచు సమర్థవంతముగ నిర్వహించెను.

తరువాత ఉషా కళ్యాణ కావ్య పరిశీలనము-

—౦—

# 3. ఉషా కళ్యాణము సమీక్ష

## ఇతి వృత్త నిర్వహణము

తాళ్ళపాక తిరువేంగళనాథ సూరి (చిన్నన్న) విరచిత ఉషా కళ్యాణము పౌరాణికేతి వృత్తమునకు సంబంధించినది. దీనికి ఉషా పరిణయ మనియు నామాంతరము. దీని నతడు క్రీ. శ. 1547 ప్రాంతమున రచించి నట్లు తెలియుచున్నది*. బాణాసురుని కుమార్తె ఉషాకన్య శ్రీకృష్ణుని మనుమడగు అనిరుద్ధుని పరిణయ మాడుట ఈ కావ్యము నందలి ప్రధానేతి వృత్తము.

శోణిత పురమును పాలించు బాణాసురుడు శివుని మెప్పించి గిరిసుతతో గూడి శివుడు తన పుర ద్వారమున కావలి యుండునట్లు వరమును పొందెను. ఫాలాక్షుడట్లుండ సహస్ర బహుడైన బాణుడు తనకీ లోకమున నెవ్వడీడు లేడనుచు గర్వించి నరసుర కిన్నెర భూసురులను పీడించి అపార ధన సంపదలతో తన భుజముల తీట తీరు సమరమునకై యెదుదు చూచు చుండెను. ఇట్లుండ శివ పార్వతుల వనకేళి చూచిన బాణుసుత ఉష 'మగని మదిని మరుకేళిలో నానందింప జేయు మగువ ఎంత తపము చేసినదో' అనుకొనినది. ఆమె భావమును గ్రహించి ఆమె కోరిక సిద్ధించునట్లు పార్వతి వర మొసగెను. ఒకనాటి రేయి నిద్రలో మన్మథాకారుడొకడు వచ్చి ఉషాకన్య కళలంటి కలసి పైకొన మేలుగాంచి కలవరపడినది. ఆమెను కలలో కలసినవాడు అనిరుద్ధుడని గుర్తించి ఉషాసఖి చిత్రలేఖ

---

* This "Usha-Kalyanamu" written about 1547 A. D. in Telugn language in the Dvipada metre describing the glory of Anirudha's marriage with Usha Kanya, the daughter of Banrsura...is said to be the composition of Tiruvengaḷanatha alias Chinnanna. - Note 1; పుట1; ఉషా కళ్యాణము-చిన్నన్న

అనిరుద్ధుని ప్రాసాదమున కేగి అచట నారదుడొసగిన తామసీ విద్యా ప్రభావముచే అనిరుద్ధుని మాయా మోహితుని గావించి అతిరహస్యముగ దెచ్చి ఉషాంతఃపురమున నిలిపెను. ఉషానిరుద్ధుల పొత్తును కింకరుల వలన బాణు డెరిగి ఉగ్రుడై వారిని చెరలో వేయించెను. ఈ విషయమును నారదుడు ద్వారకలో బలరామకృష్ణులకు చెప్పి కలహ బీజమును నాటెను.

ఇట్లు మనుమని గొనిపోయి బంధించినందులకు మాధవుడలిగి బాణునిపై యుద్ధమును ప్రకటించెను. ఒక చిన్న కారణముచే అనగా ఉషానిరుద్ధుల ప్రేమ వ్యవహార కారణముచే బాణాసురుడు, అతని సంరక్షకుడైన శివుడు, గణపత్యాది శివ పరివారమొక ప్రక్కన; శ్రీకృష్ణుడు తదితర బలరామ గరుడాది వైష్ణవ పరివారమొక ప్రక్కన నిలచి చిత్ర విచిత్రమైన, భయంకరమైన యుద్ధమును సాగించిరి. ఈ దేవతల యుద్ధమున శివజ్వర విష్ణుజ్వరముల యుద్ధమొక అద్భుత సన్నివేశము. కృష్ణుని సుదర్శన చక్రము బాణుని సహస్ర బాహువులను ఖండించి శిరము ద్రుంప బోవ బాణుని రక్షింపుమని శివపార్వతులు కృష్ణుని ప్రార్థించిరి. శ్రీ విభుడు కరుణించెను. పరమేశుడు వానికి కరయుగ్మము నిచ్చెను. పిమ్మట కృష్ణుడు ఉషానిరుద్ధులను కారాగార విముక్తులను చేసి కొనిపోవనుండ బాణుడు ప్రణమిల్లి—

"..........నన్ను మన్నించి నీదు
మనుమని కీయుషామానిని కిప్పు
డనుకూల దాంపత్య మగుచు వర్ధిల్ల
కరమర్థి పెండిలి గావింపవలయు (ద్వి. భా. 1794-1798)

నని ప్రార్థింప కృష్ణుడంగీకరించెను. ఉషానిరుద్ధుల కళ్యాణము శాస్త్రోక్తముగ, సంప్రదాయబద్ధముగ, వైభవోపేతముగ జరిగెను. ఇది ఉషా కళ్యాణము నందలి కథ.

ఈ కథ రసిక జనమనోరంజకము. విష్ణు పారమ్య ప్రబోధక మగుటచే చిన్నన్న ఆకర్షితుడై అష్టమహిషీ కళ్యాణమును వ్రాసియు మరల ఈ ఉషా కళ్యాణ రచనకు పూనుకొనియుండును.

ఈ కావ్యమునం దాశ్వాస విభజనము లేదు. రెండు భాగములుగ కథ వింగడింపబడినది.

"అలమేలు మంగ కృపాజిరాపాంగ
నలక నిర్జిత భృంగ నమితాగమాంగ...."

అనుచు చిన్నన్న తాళ్ళపాక వారి ఇంటి ఆడుపడుచుగ ప్రసిద్ధికెక్కిన శ్రీ అలమేల్మంగ నామక వేంకటేశ దివ్య మహిషీ వైభవ ప్రశంసతో కావ్యమును ప్రారంభించెను.

ప్రథమ భాగమున ద్వారకానగర వర్ణనము, బాణాసుర వంశక్రమ కథనము, పార్వతీదేవి ఉషా కన్య నాశీర్వదించుట, ఉషా విరహతాపము, ఉషా స్వప్న పురుష రతికేళి, చిత్రలేఖ త్రైలోక్య యువ పురుష చిత్ర పట రచన గావించి ఉషకు చూపించుట, అనిరుద్ధ వర నిశ్చయము, చిత్ర లేఖ అనిరుద్ధుని గొనితేర నరగుట, నారద దర్శనము, నారదుడు చిత్రలేఖకు తామసీ విద్య నుపదేశించుట, దాని మహిమచే నామె అనిరుద్ధుని తెచ్చి ఉష మందిరమున నిలుపుట, ఇది చూచి కింకరులు బాణున కెరిగించుట, బాణా నిరుద్ధుల యుద్ధము, ఉషానిరుద్ధుల కారాగారా ప్రవేశము, ద్వారకలో బల రామకృష్ణులు అనిరుద్ధునికై వెదకించుట, నారదుడు వచ్చి ఉషా రచిత ప్రేమ ప్రకారము, అనిరుద్ధుని కారాగృహ ప్రవేశములను శ్రీకృష్ణున కెరిగించుట అను కథాంశములు కలవు.

బాణాసుర ఖండనార్థక యాదవ సేనా ప్రేషణము, బాణాసుర కృష్ణ సేనా బల పరస్పర యుద్ధాది వర్ణనము, శంకరజ్వర- కృష్ణ జ్వరాది

సంమర్దనము, శంకర సేనా పరాజయము, బాణాసుర సహస్రభుజఖండనము, సుదర్శన వైభవ ప్రశంస, ఉషాకన్య వివాహ ప్రస్తావనము, ఉషానిరుద్ధుల కళ్యాణము, శ్రీకృష్ణ ద్వారకా నగర ప్రత్యాగమనము, శ్రీకృష్ణరాజ్య పరిపాలన క్రమ వర్ణనము, కవి కావ్య సమర్పణాది క్రమము, మంగళా శాసనములతో ద్వితీయ భాగము సమాప్తమయినది.

"వినుతి కెక్కిన తిరు వేంగళనాథ
ఘనుడు చెప్పిన యుషా కళ్యాణ మనెడి
కృతి యందిరా దేవి కీర్తి యెన్నాళ్లు
క్షితి నుండు నన్నాళ్లుచెలువొందు గాక"

అని మంగళాశాసనము చేసి చిన్నన్న కావ్యమును ముగించెను. ఈ కావ్యము నందతడు—"శ్రీ వధూవరలబ్ధ సిద్ధవాక్ ప్రౌఢి మావిర్భవన్మతి స్వాంతుడ" వని చెప్పికొనినాడు. ఈ సిద్ధవాక్ ప్రౌఢిమ చిన్నన్నకు గల అర్హత. హరి బాణుని గెలచిన తెరగు చెప్పుమని జనమేజయుడు వైశంపాయన మునిని కోరగా ఆ ముని చెప్పుచున్నట్లు కథ నడచును.

ఈ ఉషా కళ్యాణమును చిన్నన్న తన ఇష్టదైవతమైన అలమేలు మంగాదేవికి అంకితము చేసెను. సర్వ చేతన కోటి జనయిత్రి అయిన ఆ తల్లిని ప్రశంసించునపుడు చిన్నన్న అమ్మ ఒడిలోని పసిపాపనివలె పరవశించినట్లు తోచును. ఏ రాజులకో గాక చిన్నన్న తన కావ్యములను అలమేలు మంగాదేవి శ్రీవెంకటేశ్వరులకు అంకితము చేసి కృతి సమర్పణమున పోతనవలె పవిత్రుడయ్యెను.

కవులు గ్రంథాతమున ఫలశ్రుతిని చెప్పుట పరిపాటి. మూలమైన సంస్కృత హరివంశము నందట్లే చెప్పబడినది. కాని ఈ ఉషా కళ్యాణ మున కథా మధ్యమున జ్వర యుద్ధానంతరము శ్రీకృష్ణుడు శంకర జ్వర మును చూచి—

"జ్వర ! నీవు మత్కృత జ్వరమును గూడి
చరియింపు మెపుడు ముజ్జగముల యందు
సరవిమై నిట్టి మజ్జ్వర మెవ్వరేని
కరమర్థి కావ్యంబు గావించువారి
నా రూఢి వినువారి నాత్మలో దలచు
వారిని పఠియించు వారిని వ్రాయు
వారిని బాధింప వలదు...." (ద్వి. భా. 1380).

అని ఆజ్ఞాపించినట్లు కలదు. కావ్యాంతమున ఫలశ్రుతి లేదు కనుక దీనినే ఫలశ్రుతిగ భావింపవచ్చును. కావ్య మధ్యమున కథాగతి యందొదిగిపోవున టుల ఆజ్ఞా రూపమున నిట్లు ఫల శ్రుతిని చెప్పుట ఇతివృత్త నిర్వహణము నందొక క్రొత్త పద్ధతిగ తోచును.

కావ్య ప్రారంభమున భావి కథా సూచనము చేయుట కావ్య లక్షణము. కథా ప్రారంభమున కవి ఈ లక్షణము నిందు పాటించెను. 'దురముగావలెను ధూర్జటీ' అని భుజ దర్పముతో పలికిన బాణాసురునకు ప్రత్యుత్తరము నిచ్చుచు—

"కనుపట్టు నీ నీలకంఠ కేతనము
తనుఁదాన తెగి వసుంధర గూలునాడు
నిను గెల్చు నను గెల్చు నిఖిలంబు గెల్చు
ఘనుతోడ కయ్యంబు కలుగు'' — (ప్ర. భా. 145)

అని ముక్కంటి పలికె నా మూఢాత్ము జూచి అను మాటలో భావి కథా సూచనము గలదు. నీలకంఠ కేతనము తనుదాన తెగి కూలు నమాటలో 'నీలకంఠ' శబ్ద ప్రయోగముచే శివకేశవ యుద్ధమున శివుని ఓటమి సూచితము. ముక్కంటి పద ప్రయోగముచే రౌద్రమూర్తియైన రుద్రుని స్ఫురింప

జేసి 'తను దాన కూఁడనసుటలో అట్టి రౌద్రమైన శివశక్తి తనకు తాను విష్ణు శక్తికి వశము కాగలదని సూచితమై వైష్ణవాధిక్యము నిరూపితమైనది. ఇది చిన్నన్న సిద్ధవాక్ ప్రౌఢిమకు నిదర్శనము.

ఉషా నిరుద్ధుల ఏకాంత సమావేశమున శృంగార సంయమనము ప్రదర్శితమైనది. కథాగతి యందు చిన్నన్న కొన్ని తావుల సంగీత, చిత్ర లేఖన కళా, నాట్య. శాస్త్ర విశేషములను చొప్పించి శాస్త్ర పాండిత్యముతో రచన సాగించెను. ఉషానిరుద్ధుల కళ్యాణ నిర్వహణమున తెలుగు ప్రజల వివాహ సంప్రదాయములను కనులకు గట్టించెను. ఈ కావ్యమున చిన్నన్న విష్ణుభక్తి, వైష్ణవ మత ప్రీతి శంకరకృత కృష్ణ స్తోత్రమున ప్రతిబింబించినది. యుద్ధ భూమిలో శ్రీకృష్ణుని పరాక్రమమును ప్రశంసించుకొనుచు రక్తమాంసము లారగించుచున్న ఢాకినీ పిశాచములు హరినామ సత్కృతి కతన హీనరూపములు విడిచి ముక్తిని పొందినట్లు చెప్పుటలో చిన్నన్న హరినామ మహాత్మ్యమును చమత్కారముగ నిరూపించెను. మూలమునందీ సన్నివేశమున నిట్టి చమత్కృతి లేదు.

**మాతృక - మౌలికత్వము :** ఆంధ్ర సాహిత్యమున అనువాద రూప గ్రంథములే అధికము. అనువాదములే అయినను సరస మృదు మధుర వచో నిగుంభితములై రసజ్ఞమనోజ్ఞములై స్వతంత్ర కావ్యముల కెంత మాత్రమును తీసిపోక రాణించినవి కొన్ని కలవు. అట్టికావ్యములలో చిన్నన్న ఉషా కళ్యాణమును గూడ పేర్కొనవచ్చును.

కథ సుప్రసిద్ధమై, సరస శృంగార మధుర సుధా కథా సందర్భములు కలిగి యుండుటచే పఠితలకు ఆకర్షణీయముగ నుండునని తలచి కాబోలు చాల మంది తెలుగు కవులు ఆకర్షితులై ఉషా కళ్యాణ కథను ప్రధాన వస్తువుగ స్వీకరించి అనేక రచనలు చేసియుండిరి. 'ఉషా పరిణయము' అను పేరుతో రంగాజమ్మ, దామెర్ల అంక భూపాలుడును; 'అనిరుద్ధ చరిత్ర'

నామముతో కనుపర్తి అబ్బయామాత్యుడును అయిదాశ్వాసములతో కూడిన ప్రబంధములుగ రచించిరి. ఇంకను విరిపారి నృసింహరాజు, చెన్నయ లీ ఉషాపరిణయమును యక్షగాన రూపమున సంతరించిరి ఈ కథనే నడిమింటి రామజోగికవి సీసవికారమనగగు పద రూపమున రచించినట్లు తెలియుచు న్నది. ఇక చిన్నన్న కృతమైన ఈ ద్విపద ఉషా కళ్యాణము సుప్రసి ద్ధమే. పైన పేర్కొనిన ఈ కవుల గ్రంథములు కొన్ని నేడ లభ్యములు. లభించిన రంగాజమ్మ ఉషా పరిణయము నందు పంచమాశ్వాసము లేదు. చిన్నన్న కావ్యము నందును అటనట గ్రంథపాతము లేకపోలేదు. ఈ ఉషా కళ్యాణ కవులలో కొందరు భారతము నుండి మరి కొందరు భాగవతము నుంచి కథను సంగ్రహించిన వారు కలరు.

తాళ్ళపాక చిన్నన్న తన కావ్యావతారికలో స్వయముగ—

"హరివంశ మార్గోక్తమగు నుషాకన్య
కరమొప్పఁ బరిణయ క్రమమెట్టిదనిన" (ప్ర. భా. 46)

అని స్పష్టముగ చెప్పియుండుటచే. సంస్కృతమున సుప్రసిద్ధమైన వ్యాస కృత హరివంశ కథ చిన్నన్న కృతికి మాతృక యనుటలో సందేహము లేదు. తిరుమల తిరుపతి దేవస్థానము వారు 1938 సం॥లో చిన్నన్న ఉషా కళ్యాణమును సంస్కృత హరివంశము నందలి ఉషా కళ్యాణ ప్రకరణ శ్లోకములతో మూలమును కూడ కలిపి ముద్రించిరి. అందు 15 అధ్యాయ ములు, 1357 శ్లోకములు కలవు. ఈ హరివంశోక్తమైన ఉషా కథనే ఆంధ్రీకరించిన సుప్రసిద్ధ తెలుగు మహాకవులిరువురు కలరు. వారు ఎఱ్ఱా ప్రెగడ, నాచన సోమనలు. వీరిలో చిన్నన్న రచనా ప్రణాళిక మూలము కంటెను భిన్నము. ఇతివృత్తము నంతను రెండు భాగములుగ వింగడించి మొత్తము 990 ద్విపదలలో నితడు ఒక చిన్న ప్రబంధము వలె రచించెను.

చిన్నన్న - రంగాజమ్మల కావ్యములందు కథా సన్నివేశములలో చిన్న చిన్న భేదములు కలవు. రంగాజమ్మ ఉషా పరిణయమున శివకేశవ యుద్ధమును బ్రహ్మదేవుడు కల్పించుకొని నివారించినట్లు కలదు. చిన్నన్న కృతిలో బ్రహ్మదేవుని జోక్యము లేదు. శివుడు బాణుని రక్షింపుమని కోరగా బాణుకు ప్రహ్లాదుని వంశముకోవివాదగుటచే కృష్ణుడతని ప్రాణములు తీయక హస్తములు మాత్రమే ఖండింతునని పలుక, బాణుడు తన జీవిత ధ్యేయమైన శివపూజకు రెండు చేతులుంచుమని అర్థించినట్లును, కృష్ణుడు 998 చేతులు ఖండించినట్లును రంగాజమ్మ రచించెను. కృష్ణుడు బాణుని సహస్రబాహువులు ఖండించి శిరము ఖండింపబోగా శివప్రార్థనముచే బాణుని కరుణించినట్లును, శివుడే బాణునకు కరయుగ్మ మిచ్చినట్లును చిన్నన్న. ఇట్లు సమానేతివృత్తమును స్వీకరించినను ఈ కవులు కొలది మార్పులు చేసికొనిరి.

చిన్నన్న మూలమును కొన్ని తావుల వదలివేసి అనువాదమున స్వతంత్రించెను. నిజమునకు 'హరివంశ మార్గోక్త' మని చెప్పెనే కాని అది నామ మాత్రమేనని కొందరి అభిప్రాయము. మూలమునందు నాగపాశ బంధ విమోచనార్థము అనిరుద్ధ కృత కోటవతీదేవి స్తుతి, కోటవతీదేవి వైభవ వర్ణనము, అనిరుద్ధ ప్రార్థనా ప్రకారము, కోటవతీ దేవీ కృతానిరుద్ధాశీర్వాద ప్రకారము, పునరపి అనిరుద్ధకృత దేవీ ప్రణామము ఏతత్ స్తోత్ర పఠనాది ఫల కథనములు అతి విస్తృతముగ కలవు. చిన్నన్న ఈ కోటవతీదేవి వృత్తాంతము నంతను పరిహరించెను. ఇట్లే మూలమున గల లంబాదేవిని కూడ ప్రస్తావించలేదు. ఈ దేవతలకంత జన ప్రాచుర్యము లేదనియు, వీరు శివ సేనకు సంబంధించిన క్షుద్ర దేవతలయి యుండునని భావించి కాబోలు చిన్నన్న వదలి యుండును.

అనువాద విధానమున చిన్నన్నకు నాచన సోమనయే మార్గదర్శకుడనిపించును. ఎఱ్ఱన అనువాదము మూలమునకు వ్యాఖ్యానము వంటిది. సోమన మార్గము స్వతంత్రమైనది. 'హరివంశ మార్గోక్త' మని చిన్న

న్నయు, 'హరివంశ ప్రథమ కథాంతరమున' అని నాచన సోమనయు తమ మాతృకను స్పష్టముగనే పేర్కొన్నను నేడు లభ్యమగుచున్న సంస్కృత హరివంశ ప్రతి వీరి రచన కాధారమనునట్లు లేదనియు, అట్లు ఆధార మనదగిన మరియొక సంస్కృత హరివంశ ప్రతి ఏమైన కలదేమో (అను అనుమానమును డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారు తమ తాళ్ళపాక కవులు — వివిధ సాహితీ ప్రక్రియలను గ్రంథమున (పు. 198) వ్యక్తపరచిరి.

కొన్ని ఘట్టములందు చిన్నన ఎఱ్ఱన సోమనలు ఒకే విధముగ ఇతివృత్తమును నిర్వహించిరి. ఈ క్రింది ఉదాహరణము చూడుడు.

"సిత పక్షగమున భాసిల్లు వైశాఖ
సిత పక్షమున ద్వాదశ దినాంతమున
భద్ర సౌధాగ్రంబుపై పువ్వు సెజ్జ
నిద్రబోయెడు వేళ నీ కలలోన
రతికేళి నిను గూడి రమియించువాడు
పతియగునమ్మ శ్రీపతి యాన...." (ఉ. క; ప్ర . భా.)

అని ఉషాకన్యకు పార్వతి వరమిచ్చినట్లు చిన్నన్న రచనము. ఇట పార్వతి 'శ్రీపతి యాన' అనుటలో చిన్నన్న వైష్ణవత్వము తొంగి చూచుచున్నది. ఈ భావమును ఎఱ్ఱాప్రెగడ ఇట్లు చెప్పెను.

"బాలా ! నీ తలఁపొప్పఁ గన్నియలకున్ భావంబు నిత్యంబుగా
లోలంబై పతిలాభ లోభమను కల్లోలంబులం దేలుటల్
రేలెల్లన్ హరుఁగూడి యేనెటులు నిర్నిద్రప్రమోదక్రియా
లీలన్ సోలెద నట్ల నీకును బ్రియాశ్లేషంబులే చేకుఱున్॥
— హరివంశము.

ఈ సన్నివేశమును నాచన సోమన ఇట్లు నిర్వహించెను. గౌరీ శంకరుల పొందు చూచి 'ప్రథమ జన్మంబు నందెంత భాగ్యవతులో మగలు మన్నింప బెంపారు మానవతులు' అని ఉషాకన్య సఖీజనంబుతో పలుక పార్వతి విని యద్దనుజ తనూజతో—

"కడగి వైశాఖ శుక్ల పక్షంబునందు
ద్వాదశి దినాంత వేళ సౌధంబు మీద
మదన కేళికిఁ గలలోనఁ గదియు విన్ను
నెవ్వఁడాతండు మగఁడు నీ కిందువదన"

— ఉత్తర హరివంశము.

ఇట్లు సోమనయు దీనిని శృంగార మనోజ్ఞముగనే రచించెను. ఈ సన్నివేశము మూలము నందిట్లు కలదు.

"ఉషాభావం తదా చక్రే భర్తారం సన్యేకదా సహ
తథా హైమవతీ వాక్యం సంప్రహస్యేద మబ్రవీత్॥
ఉషే ః శృణుష్వ వాక్యం మే యదా సంయోగ మేష్యసి
వైశాఖే మాసి హర్మ్యస్థాం ద్వాదశ్యాం త్వాం దినక్షయే॥
రమయిష్యతి యః స్వప్నే సతే భర్తా భవిష్యతి."

— హరివంశము, శ్లోక సంఖ్య : 107, 108, 109.

దీనిని బట్టి పార్వతి వరదాన సన్నివేశమును పై ముప్వురు కవులును మూల విధేయముగనే రచించినట్లు తెలియుచున్నది. ఇట్టి పట్టుల చిన్నన్న అనువాదము మూలము నతిక్రమింప కున్నను, అతనిది యథానువాదము మాత్రము కాదనియే చెప్పవచ్చును. చిత్రపటములు తిలకించుచున్న ఉషా కన్య తన ప్రియుని గుర్తించుట యందు పొందిన మానసికావస్థ యొక్క పరిణామ క్రమమును చిన్నన్న నిర్వహించిన తీరు మూలమును మరపించును.

మరియు భాగవత దశమస్కంధ ఉత్తర భాగము నందు ఉషా పరిణయ వృత్తాంతము కలదు. చిన్నన్న సోమన్నలు హరివంశోక్త కథను తెనిగింతుమని చెప్పికొన్నను ఆ మూలమును వారు విడిచిరనియు, చెప్పకున్నను వారి కూర్పులోని యుచితములగు మార్పులకు బాగవత పురాణ కథయే మూలమనియు, పద్మ పురాణాంతర్గతమగు నుషాపరిణయ గాథ వారి రచనకు చాల సన్నిహితముగ నున్నదనియు డా॥ వేటూరి ఆనందమూర్తి గారు అభిప్రాయపడిరి. (తాళ్ళపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు. పు. 198). వారి సోదాహరణ వివరణమును బట్టి చూచినచో – బహుశః చిన్నన్న, భాగవతము, హరివంశము, సోమన ఉత్తర హరివంశములను, పద్మ పురాణాంతర్గతమైన కథను గూడ పరిశీలించిన పిదపనే స్వతంత్రమైన కొన్ని మార్పులతో వైష్ణవ మత వైశిష్ట్య ప్రచార ధ్యేయముతో స్వేచ్ఛానువాద విధానమున ఈ ఉషా కళ్యాణమును రచించి యుండునని తోచును.

## పాత్ర చిత్రణము

ఉషా కళ్యాణము నందు ముఖ్యమైన పాత్రలు ఇవి. ఉషాదేవి, చిత్రలేఖ, అనిరుద్ధుడు, నారదుడు, బాణాసురుడు, శ్రీకృష్ణుడు, బలరాముడు, మరికొన్ని ఇతర పాత్రలు. పరిశీలింతము.

**ఉష :** శోణిత పురాధీశ్వరుడైన బాణాసురుని కుమార్తె ఉష. ఈమె అతిలోక సౌందర్య రాశి. చక్కదనమున చందురుని మించినది. తళుకు కన్నులు, కుందనపు చెక్కులు, మొలక నూగారు, మురువు పీనులు, చిగురు కెమ్మోవి, క్రొమ్మించు నవ్వులు కలిగి వెమలి నడకలు నేర్చిన శృంగారవతి. ఈమె లావణ్యమును చిన్నన్న కడు సొగసుగ వర్ణించినాడు.

ఉషా కళ్యాణము నందీమెయే కథానాయిక. ఈమె పాత్ర ఎక్కువగ ప్రథమ భాగము నందే కలదు. కళ్యాణమునకై పెళ్లి కుమార్తెగ ద్వితీయ భాగము చివరన మాత్రమే మరొకమారు కనిపించును. ఈ కావ్యము నందీమె యొక మరపురాని మధురమైన పాత్ర.

తన తండ్రి పురద్వారమున కావలి యున్న శివుడు పార్వతితో క్రీడించుట గాంచి ఉషాకన్య—

"ఒకటియు నొకటియు నొరసి లోలోన
తుక తుకలాడు బంధుర కుచద్వయము
ప్రియుని వక్షము గాఢ బిగియించి పట్టి
చవి గొను సతులెంత సౌభాగ్యవతులొ
చివురు విల్తుని కేళి చిత్తంబు గరగి
కళలంటి విభుని చొక్కగ చేయు మగువ
తలపోయ మున్నెంత తపము నేసినదొ"

అని తన చెలికత్తెలతో పలికినది. కన్య యైన ఉష జగన్మాతా పితలైన గిరిసుతా ధవుల ప్రేమములను, క్రీడలను వీక్షించి యిట్టి భావమును ప్రకటించుటలో ఆమె యౌవన వివశత్వము వెల్లడి యగుచున్నదే కాని ఔచిత్య చర్చకిట తావులేదు. కావుననే - "బాలా నీ తలపొప్పు కన్నియలకున్...." అని పార్వతి చేతనే పలికించి ఎఱ్ఱాప్రెగడ తన హరివంశమున సమర్థించెను. చిన్నన్న కృతి యందును 'కలలో తనను రతికేళి గూడి రమియించు చక్కనివాడు పతి యగునట్లు' శర్వాణిచే వరము పొంది ఉషాకన్య అదృష్టవంతురాలయ్యెను.

స్వప్న సమయాగత మనోహర పురుష రతిక్రీడలో దేలిన ఉష బేలయై తన మనఃఖేదమును చెలి చిత్రలేఖకు దెల్పి తనకా వరుడు లభించు నట్లు చూడుమని అబలయై కోరినది. చిత్రలేఖ చిత్రపటములు చిత్రించి

తెచ్చునంతలోనే విరహిణియై 'పీడిన నెరిగొప్పు వేడి విట్టూర్పు వాడిన కెమ్మోవి వదలిన నీవి చెదరిన నునుగురుల్ చిటిలు మైపూత'తో వెన్నెలలో చంద్రకాంత శిలపై కూర్చుండి చంద్రోపాలంభనము గావించినది. ఈమె విరహమును, విరహమునందామె రూపమును చిన్నన్న అద్భుతముగ వర్ణించినాడు.

అనిరుద్ధుని చిత్రపటమును తిలకించి ఉషాకన్య పొందిన మానసిక స్థితిని ముగ్ధ మనోహరముగ చిత్రించినాడు కవి—

"అచ్చెలి మదిలోన హర్షించి వెన్న
ముచ్చు మన్మధుడు మునిముచ్చు పీడనుచు
నా రూపు చనుదోయి నంటి నొత్తుచును
పారవశ్యము నొంది పలికె ప్రేమమున
నిందీవరేక్షణ ! యితఁడెవ్వఁడీత
డెందుండె నీ నామమెయ్యది యనుచు"

మోహ పరవశయై చిత్రలేఖను ప్రశ్నించినది. ఇందామె హర్షము, మోహము, పారవశ్యము, ప్రేమ, ఆతురత, అమాయకత్వము వంటి వివిధ మానసికావస్థలు ఏకత్ర చిత్రింపబడినవి.

చిత్రలేఖ తనకు చెలికత్తెయైనను, 'నీవనియెడి విమలాంజనమున ననిరుద్ధు వీక్షింప గలిగితి' నని పేమారు పారవశ్యముతో వినతులొనర్చిన సహృదయ కృతజ్ఞతా వినయ సంపన్నురాలు ఉష.

చిన్నన్న చిత్రించిన ఉష వీణావాదన నిపుణ. వీణ పట్టుటలో సొగసులు దెలిసిన విదుషీమణి. వీణావాదనము, రాగ సమ్మేళనము లెరిగిన సంగీతజ్ఞురాలు. ఇట్లనుటకీ క్రింది పంక్తు లుదాహరణము—

"వలకేల గీలించి వలుద జక్కవల
బలుమారు దెగడు గుబ్బలమీఁద మోపి
మొనవ్రేళ్ళ శ్రుతి తంత్రి ముట్టి జీవాళి
పనుపడ జీఱన బలుకంగ బెట్టి
సరిగమ పదనిస సనిదప మగరి
సరిగమ రిగమప సనిదప మనుచు
బహు విధాలంకృతుల్వాదు కొనంగ
రహిమించి వాయించి గ్రామ సంతతుల
మేళము ల్సేసి సమ్మేళ ముల్గాగ...."

సంకీర్తనము చిందు జక్కిణిగీత మంకించి శుద్ధంబు లలర మీటుచు ఉష వీణ వాయించినదట. ఇందామె సంగీత శాస్త్ర వైదుష్యము, వీణావాదన నైపుణ్యము వ్యక్తమగుచున్నవి.

బాణుడు అనిరుద్ధునితో బాటు ఉషా కన్యను గూడ చెఱసాలలో బంధింపుడని ఆజ్ఞాపింపగా భయము చెందక రతిపుత్రునితో బాటు కారాగృహమున కేగిన సాహసవంతురాలుగ ఉష కన్పించును. ఆమె సుకుమార దేహమును గాంచి అచటి అంగనలు పలికిన మాటలలో ఉషా సౌందర్యమును ప్రతిబింబింప జేసినాడు కవి.

చిన్నన్న ఉషాదేవి పాత్రను మూలమునకే మెరుగుపెట్టునట్లు చిత్రించెను. ఉషకు పార్వతీదేవి సుఖ దాంపత్య వరమును ప్రసాదించిన పిదప ఉష అనిరుద్ధుని చూడక పూర్వమే తన ప్రియుని చింతించుచు విరహ వేదన పొందినట్లు, చెలులు ఉపచారములు చేసినట్లు మూలమున కలదు. ఉషాకన్య వద్దకు రాకపూర్వమే అనిరుద్ధునికి భార్యలున్నటుల మూలమున గలదు. ఔచిత్యమున కిది భంగమని తలచి కాబోలు చిన్నన్న వీనిని పరిహరించి స్వప్నానిరుద్ధుని సాక్షాత్కారము పిదపనే ఉష విరహ తాపము నొంది

నట్లు చెప్పెను. మూలమున లేని చంద్రోపాలంభనమును చిన్నన్న ఉష పాత్రచే చేయించెను. మూలమున నున్న ఉషానిరుద్ధుల అధికమగు సురత కేళీ వర్ణనమును చిన్నన్న పరిహరించెను.

అయినను చిన్నన్న ఉషయు కొంత కామ మోహితగనే కనిపించును. ఈ క్రింది పంక్తులు చూడుడు—

"బలిపుత్ర పుత్రి యా పాన్పుపై నున్న
వలవరాజు పట్టిని వలకేలఁ బట్టి
కలిత వజ్రముల ముక్కలు సేయ జాలి
మలియ గొడ్డళ్ళకు మారుమలియు చన్దోయి
గదిమించి ప్రియుని వక్షము గౌగలించి
నుదుటైన చనుమొన లొత్తిన నులికి
యులికి మేల్కాంచి ప్రద్యుమ్న సూనుండు...."

ఇందు ఉషాకన్యకు గల కామ తీవ్రత స్పష్టముగ కనిపించుచున్నది. ఈ కావ్యమున ఉష స్వీయ, ప్రగల్భ అయిన నాయిక. "తత్ర స్వామిన్యేవాను రక్తా స్వీయా" అనియు, "పతిమాత్ర విషయ కేళీ కలాప కలా కోవిదా ప్రగల్భా" అనియు రసమంజరి లక్షణము. "ఉష పతియందు మాత్రమే అనురక్తి గల పతివ్రత కావున ఆమె స్వీయ అనియు, నిండు జవ్వనము నందున్న ఉష కామాతురత కలిగి లజ్జనించక విడనాడి ప్రియుని తన కడకు రప్పించుకొనిన చతుర కావున ప్రగల్భ" అనియు డా॥ ఎ. విద్యా వతిగారు 'తాళ్ళపాక కవుల సాహిత్య సేవ' అను గ్రంథమున చెప్పిరి.

"వనితలు చాపల్య వర్తనల్వారి
నిలువెల్ల గపటంబు నిజమింతలేదు
పలుకులు మృదువులు భావము ల్కొలది
ఇట్టి భామలలోన నెట్టి రట్టిడియొ...."

తన పౌత్రుని కొనిపోయి యుండునని శ్రీకృష్ణుడు చెప్పినట్లే ఉష యౌవన చాపల్యము చేతనే కామ మోహితయై అనిరుద్ధుని తన మందిరమునకు రప్పించు కొనినది. ఉషలో చాపల్యము, మృదు భాషణము కలవు గాని కృష్ణుడు చెప్పినట్లు 'విలువెల్ల కపటము' 'శిలాసదృశ భావములు' కానరావు. ఈ లక్షణములు గల స్త్రీ కావ్య నాయిక యగుటకు అనర్హురాలు. కనుకనే కవి, లోకమున పలువురు స్త్రీలలో కానవచ్చు సాధారణ స్వభావమును కృష్ణుని నోట చెప్పించెనే కాని కపట లక్షణములు, కఠిన భావములు ఉషాదేవి పాత్ర యందు పోషింపలేదు. ఉషను ఒక శృంగార రస రమ్యమూర్తి గనే చిత్రించెను.

మొత్తము మీద ఉష వలన బాణాసురునకు అనిరుద్ధ తత్త్వ మవ గతమైనది. తద్వారా లోకమునకు విష్ణు వైశిష్ట్యము వెల్లడియైనది. ఇది ఉషాదేవి పాత్ర వలన కలిగిన పరమ ప్రయోజనము.

*చిత్రలేఖ* : బాణాసురుని మంత్రియైన కుంభాండుని కుమార్తె. ఉషకు చెలికత్తె. ఉషవలెనే యీమె సౌందర్యవతి. ఉషకు అనిరుద్ధుని సమ కూర్చు విషయమున శక్తి వంచన లేకుండ కృషి చేసిన స్నేహ సద్గుణ శీలి. కలలో కదిసిన పురుష రతి కేళికి బెదరిన ఉషను ఓదార్చి ధైర్యము చెప్పిన జాణ. తన చెలి సౌఖ్యమును నిరంతరము ఆశించిన సౌజన్యవతి. మీదు మిక్కిలి కార్య సాధకురాలు. చిత్రలేఖన కళ యందపార నైపుణ్యము కలిగిన చిత్రలేఖ సార్థక నామధేయ. ఈమె ప్రదర్శించిన త్రైలోక్య యువ పురుష చిత్ర రచనా కలన యుక్తి అద్భుతము. ఉషకు చిత్రపట గత రాజ వృత్తాంతములు పరిచయము చేయుటలో ఈమె లోకజ్ఞత వ్యక్తమగును. చలాకీ తనముతో గూడిన ఈమె పాత్ర ఉషా కళ్యాణమున ప్రథమ భాగము నందు మాత్రమే కలదు. కాని పాఠకుల హృదయములలో చెరగని ముద్ర వేసినది.

"లీల వన్నువ లిడ లేమ కేలెత్తి
చూపులు మెయి కాంతి సొంపులే నవ్వు
ప్రాపైన కెమ్మోవి పవడంపు చాయ
మరకత తాటంక మహనీయ రుచియు
వరుస నచ్చటి పంచవర్ణంబులగుచు...." (ప్ర.బా. 581-585)

భాసిల్ల చిత్రలేఖ చిత్రపటములు రచించెనట. చిత్రలేఖ సౌందర్య సామగ్రికిని చిత్రలేఖన సామగ్రికిని అభేదము చెప్పి చిత్రలేఖన కళయే మూర్తి దాల్చిన పాత్ర చిత్రలేఖ యని ఆమె జీవలక్షణమును చిన్నన్న చక్కగ సూచించెను. అనిరుద్ధుని తెచ్చుటకు ప్రయాణమైనపుడు కవి ఈమె వేష ధారణమును సౌందర్య భరితముగ వర్ణించెను—

"తోరంపు నునుబొట్టు తోరపు తురుము భారంబుగా విడిపడకుండ జుట్టి
బిగువుగా నడుము నుబ్బిన విడకుండ జిగి నలఁబట్టు కానెయు పొందు పఱచి
జిలుగు పయ్యెద కావి జిగువ....చలువ వారిన పట్టు చను కట్టమర్చి
మంచి నీలముల కమ్మల రావిరేక ముంచ గస్తురి యుంట ముంగర వెట్టి"

కలహంస గమనముతో చిత్రలేఖ బయలుదేరి ఉషానిరుద్ధుల సంగమ విషయమున కృతకృత్యురాలైనది. కలవచ్చి బెదరిన ఉషకు "పాతాళ భూస్వర్గ బహువీర వరుల మీ తండ్రి యని గెల్చి మెరసె నెంతయును అట్టి విక్రమ శాలి యాత్మజ నిన్ను పట్టంగ శక్తుండె పరుఁడిట్లు నేఁడు" అని బాణుని పరాక్రమమును పొగడి ధైర్యము చెప్పి, 'కలలోన నెవ్వండు కరమర్థి నిన్ను కలయు నాతఁడె నీకు కాంతుఁడయ్యెడిని అను మాట మరచితె' అని పార్వతి వరమును ఉషకు గుర్తు చేసి తన చెలి నెవ్వగను మాన్పిన మాటకారి చిత్రలేఖ.

విరహాగ్ని వొదవి వంత గుందుచున్న ఉషతో 'కలలోన నిన్ను వేడ్కల శయ్యమీద గలసి యీ రీతులఁ గాతుల నేయు వాని దెచ్చెద

నెంతవాఁడైన నిపుడు, యోగ సామగ్రి దెచ్చెదను నా నేర్పు జూడుమని ప్రతిజ్ఞ చేసి పలుకుటలో తన శక్తి సామర్థ్యములపై చిత్రలేఖకు గల ఆత్మ విశ్వాసము, ఆమె యోగ విషయజ్ఞత వ్యక్తమగుచున్నవి. అనిరుద్ధుని వరించితినని చిత్రపటములు చూచి ఉష పలికినపుడు వెంటనే చిత్రలేఖ-

"కామించ తగును నొక్కటియె సందియము
బాణుఁడాసురుఁడు శ్రీపతి దైత్యమర్ది
ఏణాంకముఖి ! మైత్రి యేరీతి దొరయు !"

అని ఆలోచించుటలో చిత్రలేఖ దూరదృష్టి అవగతమగుచున్నది. దైవాసురములకు మైత్రి పొసగించుట కష్టసాధ్యము. ఇవి రెండును ఒకదాని కొకటి వ్యతిరేకము. రెండు వ్యతిరేక బిందువులు ఏకత్ర ప్రతిష్ఠిత మగుచుండుట వేద ప్రతిపాదిత విషయము. దైవాసురముల కలయిక ఇట్టిదే. ఇట్టి గురుతర కార్యమును సాధించుటకు స్వప్రజ్ఞ ఎంత ఉన్నను దైవ సహాయమవసరము. కనుకనే చిత్రలేఖ "శ్రీహరి యాజ్ఞ బోయి వాని దెచ్చెద" నని చెప్పి బయలుదేరెను. ఇది యామె తత్త్వజ్ఞతకు నిదర్శనము. ద్వారకలో నారదుని దర్శించి వాని నుండి తెలివిగా అనిరుద్ధుని తెచ్చు ఉపాయమును, 'తామసీ' అను మాయా విద్యను సంపాదించిన ఉపాయజ్ఞురాలు చిత్రలేఖ. నారద మంత్రోపదేశమీమె కార్యసాధనకు దోడ్పడినది.

అనిరుద్ధుని తెచ్చుటకు పోవునపుడు 'చిన్నారి నెలగొల చిప్ప చేయమ్ము తిలకంపు నిసుము కత్తెర సొక్కుమందు ఒలపంపు బలముఖ్య బంతి కొంకియును మొదలగు సాధనములు గైకొని బయలుదేరుటలో చిత్రలేఖ ముందు జాగరూకత తెలియుచున్నది. నారదుడిచ్చిన తామసీ విద్యతో ఘనతర మాయచే గప్పి యుప్పొంగి అనిరుద్ధుని గైకొని అంబరాధ్వమున నతిరహస్యముగ ముహూర్త త్రయ కాలముననే ఉష వద్దకు చేర్చి యామెచే వినతులు పొందిన నిపుణురాలు చిత్రలేఖ.

ఇక చిత్రలేఖ చిత్రకళా నైపుణ్య మీ కావ్యమున ప్రత్యేకించి ప్రశంసింప దగియున్నది. అసలీమె చిత్రలేఖన రచన కుపక్రమించుటలోనే ఒక ప్రత్యేకత కనిపించును. పరికింపుడు—

"కొలదిగా వన్నియల్ గూర్చి బంగారు చిప్పలలో నుంచి చెలువొందుచున్న
కొప్పున ముంగురుల్గూడ దువ్వుచును డాకేలు వజ్రపట్టంబుపై నూఁది
తూకొని వలకేల దూలిక దాల్చి వంచి ముఖ్యము దోయ వలనొప్పు చిప్ప
యంచున దీఁడి చయ్యన దిట్ట వెట్టి రూపరేఖలు వ్రాసి రుచిరభావములు
దీపింప నొరపులు దీర్చె.... (ప్ర. భా. 670–579)

ఇందు 'కొప్పున ముంగురుల్ గూడ దువ్వుచును' అనుటనే ఒక చిత్రముగ వేయవచ్చును. పై చిత్రలేఖ వర్ణనలో కవియు ఒక అక్షర చిత్రకారుడయ్యెను. చిత్రలేఖ ఎంతయు నేర్పుతో అతి వేగముగ ఇంద్ర శివ కుబేర వరుణ గంధర్వ కిన్నర కింపురుష గౌళ పాంచాళ బంగాళ ద్వారకాధిపతులను, మన్మథానిరుద్ధులను, చరాచరమును ప్రచురముగ చిత్రపటముపై వ్రాసి తన అసాధారణ ప్రజ్ఞను ప్రదర్శించి సార్థక నామధేయమైనది చిత్రలేఖ. ఉషకు చిత్రపట గత దేవ మానవ రాజవృత్తాంతములను, వారి రాజ్యములను, వారి వారి వైభవ ప్రాభవములను కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పుటలో ఆమెకు గల నేర్పు, అపార లోకానుభవము విదితము. ఈ కావ్యమున చిత్రితమైన చిత్రలేఖ అసాధ్యురాలు. ఉషా చెలికత్తె లందరిలో జాణ.

చిత్రలేఖ ఉషానిరుద్ధుల కళ్యాణమునకు సూత్రకారిణి. వారి శృంగారాభ్యుదయ విషయమున తోడు నీడ. అనంతర కాలమున వచ్చిన వసుచరిత్ర, ప్రభావతీ ప్రద్యుమ్నాది ప్రబంధములలోని మంజువాణి, శుచిముఖి పాత్రలకు రూప కల్పన చేసిన మార్గదర్శకురాలని భావింప వచ్చును.

**అనిరుద్ధుడు :** ఇతడు శ్రీకృష్ణుని మనుమడు, ప్రద్యుమ్నుని పుత్రుడు, ఉషకు ప్రియుడు, కథానాయకుడు. ఉషా కళ్యాణమునందితడు ఉషారమణ, కామ మోహన సాయక, పంచశరాత్మజ, కోటి కందర్ప లావణ్య, రతిపుత్ర, స్వప్నరతికార ఇత్యాది నామాంతరములతో పేర్కొన బడినాడు. దీనిని బట్టి ఇతడు సౌందర్యవంతుడు, కోమలుడు, వలచి వల పింప జేయగలవాడు, భోగాసక్తుడని తెలియుచున్నది. ఇట్టి లక్షణములు గల నాయకుని ధీరలలితుడని అందురు. ఇతడు లలితుడే కాదు గొప్ప యుద్ధ వీరుడు, పరాక్రమ శాలి అనియు ఈ కావ్యమును బట్టి గ్రహింప గలము.

బాణాసుర గర్వ భంగమునకు, కేశవ తత్త్వాధిక్యము లోక మెరుం గుటకు కారణభూతుడైనవాడు అనిరుద్ధుడు. ఇతని పాత్ర ద్వారా లోకము నకు రుద్ధము కాని శ్రీకృష్ణ తత్త్వము వెల్లడియైనది. ఉషా కళ్యాణము నందితడు ప్రథమ భాగమున మాత్రమే కనిపించి ద్వితీయ భాగాంతమున పెండ్లి కొడుకుగ మరల దర్శనమిచ్చును. మొదట తనకు కలలో కనిపిం చిన అనిరుద్ధుని రూప సౌందర్యమును ఉష చిత్రలేఖకు ఇట్లు వివరించు చున్నది—

"కరి మొయిల్ చాయమై కలవాఁడు మించు
కురకుర నవ్వుచేఁ గొమరైనవాఁడు
కడు చేరలంతేసి కన్నులవాఁడు
పొడవులై కనుపట్టు భుజముల వాఁడు
నవచంప కోల్లాస నాసిక వాఁడు
చివురుల జిగిబోలు చెక్కుల వాఁడు
కాయజు మించు చక్కనివాఁడు...." (ప్ర. భా—458—464)

అనిరుద్ధుడింతటి రూపవంతుడే గాక సౌందర్య ప్రియుడును. నిద్ర నుండి మేల్గాంచి ఉషాకాంతను చూచి, 'నెరి గలిగిన భృంగ నికరమో కాక తర

లదు సంపంగి తావికి, మొగులోపల పల గాదు చూపట్టు నాసికమో కలకంఠి వేనలి కరణి యేకరణి బెనసు చన్నవి మీల పెద్దలో కాక....కుంభీంద్రు కుంభములొ మదవతి చన్నుల మాడ్కి యేమాడ్కి యని కామినీ గతి యవయవసమితి ముసుకొని వీక్షించి' మోహితుడై వర్ణించుటలో అనిరుద్ధుని శృంగార ప్రియత్వము, భోగాసక్తత వెల్లడి యగుచున్నది. ఉషకు కలలో కనిపించి యేమేమొ చేసి వలపింప జేసిన శృంగార విగ్రహుండితడు. ఇతడు ఘనసార కస్తూరికా లిప్త బాణతనయ మనోహర స్తన యుగ్మ ఘటిత ఘన వక్షుడైనను, అవసరమగుచో బాహుబల పరాక్రమమును ప్రదర్శించి వివిధాయుధములతో యుద్ధము చేయగల వీరవరేణ్యునిగ నితని పాత్ర ఉషా కళ్యాణమున రూపొందించబడినది. కృష్ణుడితని స్వభావము దెలిసిన వాడగుటచేతనే వనితలలో నెవరైన తప్ప నరసుర యక్షకిన్నర దైత్యవరులితని కొనిపోవ నశక్తులని ముందుగనే చెప్పెను.

బాణు కింకరుల నితడు పరిఘముతో 'కరుల ఢీకొను హరి కరణి' గర్జించి శిరములు పగులంగ నేసెనట. రాక్షసచరులెల్ల నడరంట భుజమున హరిగ దాటించి ముప్పది రెండు గతి విశేషముల దండ బెట్టుచు మడి తాళముల్ జూపి మండలాగ్రమున దుర్మదుల గర్వములు చించి గద్దించి హసించి నిర్జించి, బలవంతులగు ఇరువది నాల్గు వేవుర వీరభటుల కిన్నరుల చట్టలు చెలరేగి చీరి వైచెనట. ఇతని పరాక్రమ ధాటికి నిలువలేక బాణుడు తుదకు గాంధర్వమాయా యుక్తుడై పన్నగాస్త్రమును ప్రయోగింపగా ఒకానొక మహామాయా తత్త్వ విశేష కారణముచే బంధితుడైనాడు. ఇక ఆ బంధనము నుండి ఇతనిని విడిపింపగల సమర్థుడు శ్రీకృష్ణుడు మాత్రమే.

చిన్నన్న అనిరుద్ధుని పాత్రను సర్వాంగ సుందరముగ, సర్వస్వతంత్రముగ తీర్చి దిద్దెను. ద్వారక నుండి అనిరుద్ధుని చిత్రలేఖ గొని వచ్చిన తీరు అమూలకము. ఉష తనను ఆలింగనము చేసికొనినపుడు నిద్ర

నుండి మేల్కొని ఆమె అంద చందముల కబ్బురమంది మోహితుడై యుండియు సంయమనమును ప్రదర్శించినాడు. మూలము నందు అనిరుద్ధుడు స్త్రీ లోలుడు, మధుపాన మత్తుడు, భోగలాలసుడని కథా గతియందు వాచ్యము చేయబడినది. సంస్కృత హరివంశమునందు చిత్రలేఖానిరుద్ధుల సంభాషణము కలదు. చిన్నన్న కృతియందు లేదు. మూలమున తానే ఉషా కన్య కొరకు కలగుచున్నట్లును, తనను గొనిపోయిన వత్తువని దూతగ వచ్చిన స్త్రీని (చిత్రలేఖను) వేడుకొనినట్లును కలదు. నాయక లక్షణములకు మచ్చ దెచ్చు నిట్టి విషయములను వదలి మూలమునకు మెరుగుపెట్టు రీతిని చిన్నన్న అనిరుద్ధ పాత్రను చిత్రించెను.

*నారదుడు :* ఇతడు దేవర్షి. కలహ భోజనుడు. కలహముని, కలహాశన, యుద్ధలోలుప, సమరానందముని, ముని నాథ, బ్రహ్మ తనయ ఇత్యాది నామములచే ఉషా కళ్యాణము నందితడు పేర్కొనబడెను. ద్వారకలో చిత్రలేఖ చూచిన నారద రూపమిట్లున్నది.

"ఉరుతరాంచ ద్వాదశోర్ధ్వ పుండ్రాది
వరచిహ్న సహితు శ్రీవర పదధ్యాను
శారదా హిత చంద్రు శర శరత్కాల
నీరద రుచి మించు నారదు గాంచి" (ప్ర. ఖా. 752)

ఇందు నారదుడు ద్వాదశోర్ధ్వ పుండ్రాదులతో, మూర్తీభవించిన వైష్ణవత్వముతో విష్ణు స్వరూపునిగ కవిపించును. చిత్రలేఖ అనిరుద్ధుని గొనిపోవుటలో నారదుని సహాయ మర్థించుచు 'మనుమని గొనిపోవ మాధవుండలిగి దనుజేంద్రు మర్దింప దండెత్తి వచ్చు విందులకిపుడు నాకెయ్యది బుద్ధి సందేహ ముడుపుము సర్వజ్ఞ' అని పలికినప్పుడు 'కలహ మౌనను వార్త కర్ణామృతముగ బలికితిగా నేడు' అనుచు గొప్ప సంతోషమును వ్యక్తము చేసినాడు. ఇది యాతని కలహ ప్రియత్వమునకు విదర్శనము.

ఇందు నారదుడు 'సర్వజ్ఞ' అని సంబోధింపబడినాడు. సర్వము తెలిసియు తెలియనివానివలె శ్రీకృష్ణాదులు నిర్వహించు జగన్నాటకములందు ప్రధాన భూమిక నిర్వహించువాడు నారదుడు. ఎంత శత్రుత్వమున్నను దేవదానవు లిరువురకు నితడాదర పాత్రుడై హితుడగుచుండుట గమనింప దగిన విశేషము. ఇది నారదుని స్వభావములో గల వైలక్షణ్యము. ఇతడీ కావ్యమున "తామసీ విద్య యే తరుణి ! యిచ్చెదను" అని సమంత్రకముగ నావిద్యను వనిత కర్ణములో నుపదేశ మొసగి అనిరుద్ధుని చిత్రలేఖ గొని పోవుటకు దోహదము చేసినాడు.

నారదుడు తామసీ విద్యను బోధింపనిచో చిత్రలేఖ అనిరుద్ధుని తేగలిగెడిది కాదు. అనిరుద్ధుని తేకున్నచో కృష్ణ బాణుల యుద్ధము, ఉషా కళ్యాణము జరిగెడిది కాదు కావున నారద పాత్ర ఈ కావ్యమునందింత కీలకమైనది.

మరల నారదుడేమియు తెలియని వానివలె యాదవరాజ సభను ప్రవేశించి శ్రీపతి మోము చూచి జలజాక్ష ! యేమి విచారించె దిపుడు కార్య మంతయు నాకు దెలియజెప్పగదయ్య అని కోరగా — ముని నాథ ! వింత యీ రేయి మన యనిరుద్ధుఁడీ మహిత సౌధమున నిద్రింపగా నేమరించి యెవ్వరే గొనిపోయి రెరుగ నేనని' కృష్ణుడు బదులు చెప్పెను. కృష్ణు డెరుగని విషయమా యిది ? కనుకనే నారదుడును నవ్వు మోముతో అని రుద్ధుని బాణుడు కారాగృహమున వేయించుట చూచి వచ్చితినని పలికి కలహ బీజమును నాటినాడు. నారాయణ తత్త్వము నారదునకు గాక మరెవరికి తెలియును ? కనుక ఇది యొక జగన్నాటకము.

నారదుడు ఉషా కళ్యాణమున ఉషానిరుద్ధుల సమాగమమునకు, వారి కళ్యాణమునకు పరోక్షముగను, శ్రీకృష్ణ బాణుల యుద్ధమునకు ప్రత్య క్షముగను కారణ భూతుడై ప్రధాన భూమికను నిర్వహించినాడు. పురా

ణములందు నారద పాత్ర ప్రాముఖ్యము అందరెరిగినదే. భగవంతుడెచట దుష్ట శిక్షణము శిష్ట రక్షణము గావింప వలసి యుండునో అచట నారదుని పాత్ర ఉంచుట గమనార్హము. ఉషా కళ్యాణము నందును నారద పాత్ర అట్టి ప్రయోజనమునే సాధించినది.

*బాణాసురుడు :* బలి తనూజుడు బాణుడు, శోణిత పురాధీశుడు, రాక్షసేశ్వరుడు, ఈశ్వర భక్తుడు. పరాక్రమశాలి, మదమత్తుడు, మూఢుడు, విశేషించి నాట్య కళా ప్రవీణుడు. ఈ కావ్యమునందితడు ప్రతి నాయకుడు. అసుర నాయక, సహస్ర బాహు, బర్హి కేతన, శంకర మిత్ర మొదలగు నామములచే నిందు వ్యవవహరింపబడినాడు. అనిరుద్ధునితో బాటు కన్న కుమార్తెను సహితము కారాగారమున బంధించిన నిర్దయుడు. ఇతని ఉద్ధత రూపము ఉషా కళ్యాణమున ప్రథమ ద్వితీయ భాగములు రెండింటి యందును కనిపించును. అధికముగ ద్వితీయ భాగమున గలదు.

ఇందేందు ధరుడొకనాడు వేడ్కతో తాండవమాడుచుండ బాణుడు తన వజ్ర సమాన బాహుదండ మండలితో నేర్పు మెరయ వింతగ నావ జము వాయించి కైలాస వాసుని మెప్పించినాడు. అతని కళానురక్తికి, శివ భక్తికి మెచ్చి శివుడు పార్వతితో బాటు అతని పురము వాకిలి కావలి కాయుచు బాణుని కోరికను మన్నించెను. ఈ విధమైన ఫాలాక్షుని అండ చూచుకొని లోకమున తన కెవ్వడీడు లేడని గర్వించి నరుల సురల భూసు రుల నోడించి పీడించి ముజ్జగము గెలిచియు సమర కాంక్ష తీరక ధూర్జటిని దురము కావలెనని కోరుటలో బాణుని దుర్మదము, దర్పము, మూర్ఖత్వము వెల్లడియగుచున్నవి. కనుకనే ముక్కంటి వాని భావమును గ్రహించి ఫక్కున నగి 'నిను గెల్చు నను గెల్చు నిఖిలంబు గెల్చు ఘనుతోడనే కయ్యంబు గలుగు' పొమ్మనెను. ఇంత స్పష్టముగ ఓటమిని శివుడు నొక్కి చెప్పినను గ్రహింపక సంగరమగునను సంబరముతో సభకేగి శివుడిచ్చిన

యుద్ధవరమును తెల్పి తన మూర్ఖత్వమును ప్రదర్శించుకొనినాడు బాణుడు. అతని చేష్టలకు మంత్రి కుంభాండుడు మనోవ్యధ పొందెను.

బాణున కింతటి మూర్ఖత్వ మెట్లు వచ్చినది ? సహస్ర బాహుబల పరాక్రమ గర్వమొక కారణము; ఆపై పరమేశ్వరుని అండ మరొక కారణము. అతని సంగర ప్రియత్వము చూడుడు:—

"వేదండ తుండముల్విదళింపలేని చేతులు బీగంబు చేతులు గావె
తురగ సాదుల మెడల్ తునుమంగ లేని కరములు తను బాధకరములు గావె
వీర వైర కఠోర వివిధాంగ రక్తధారల భూతాళి దనిపిన గాని యింకదు
భుజ ఘర్మమింక నా కోర్కి పంకజరిపు మౌళి ! పాలింపుమనిన...."

(ప్ర. భా. 132—149)

యుద్ధము లేనిచో జీవితము వ్యర్థమని భావించినాడు బాణుడు. ఇతని యుద్ధ పరాక్రమము అనిరుద్ధుని బంధించుటలో ప్రదర్శితమైనది. పై చిన్నన్న రచనలో - "కమలాక్షు నర్చించు కరములు కరములు...." అను పోతన భాగవత శైలి స్ఫురించుచున్నది. "వేరొక్క రథ మెక్కి విను వీధి కెగసి యతుల గాంధర్వ మాయా యుక్తుడగుచు ప్రతి లేనిపన్నగ బాణంబు లేయ అనిరుద్ధుడు కుండలి బద్ధుడై భూమి నొరగెనట. దీనిని బట్టి బాణుడు మాయా యుద్ధ నిపుణుడనియు తెలియుచున్నది. కృష్ణునితో యుద్ధము చేసిన గాని ఇతని భుజముల తీట తీరలేదు. కృష్ణుడు చక్రాయుధముతో నితని సహస్ర బాహువులు ఖండించిన పిదపనే జ్ఞానోదయమైనది. గురుతైన జేవురు కొండవలె, పక్షములు పోయిన పతగమువలె నవశుడై పుడమి పడి యున్న బాణునితో నంది- "వెరవకు మింక శ్రీ విభుడు మన్నించె కర కంపు ముంగలి ఖచరులు మెచ్చ కతమొప్ప నృత్యంబు గావింపుమని" సలహా నిచ్చెను. బాణుడిట్లు నృత్యము చేయదొడగెను—

"పలుమరు వంది సంభ్రమము రెట్టింప
తత తత్త జకి కిణాతతికు దిద్దిమికు
తత తోంగి ణమచు గౌతంబుగ్గళింప....
దిందిమ్మ వంగ మద్దెళలు వాయింప
నాలాప మొనరింప నశ్వరథుండు
కాల మానమునకు గానంబు వేయ
అమరారి యిట్లు నృత్యంబు గావింప" (ద్వి. భా. 1762-1873)

ఇది బాణుని నృత్య కళా ప్రావీణ్యమును నిరూపించు సన్నివేశము. ఇతని నృత్యమునకు ఈశ్వరుడు మెచ్చి కరయుగ్మ మిచ్చి కరుణించెను. బాణుని నాట్య కళ ఈశ్వరానుగ్రహమునకు పాత్రమైనది. తుదకతని శివ భక్తియే అతనిని రక్షించినది.

ఈ హర భక్తుడు యుద్ధానంతరము హరి భక్తుడై తన అపరాధము నంగీకరించి తన కుమార్తె ఉషను అనిరుద్ధునకిచ్చి అతి వైభవముగ వివాహము జరిపించి శ్రీకృష్ణునితో వియ్యమందినాడు. ఉష కారణముగ ఇది యితనికి పట్టిన అదృష్టము.

**శ్రీకృష్ణుడు :** జగన్నాటక సూత్రధారి. సర్వశక్తిమంతుడు. ఉషా కళ్యాణమున కృష్ణుడు దుష్ట శిక్షణ నేయు యుద్ధ వీరునిగ కనిపించును. బాణాసుర సైన్య వినాశ కారిగ, శివజ్వర గర్వ నిర్వాపకునిగ, వైష్ణవ శక్తి బరపి పరమేశ్వర తత్త్వమును లోబరచుకొని ఆత్మీయుడైన అనిరుద్ధుని (అనిరుద్ధమైన ఆత్మ తత్త్వమును) రక్షించిన ప్రభువుగ శ్రీకృష్ణుడిందు దర్శనమిచ్చును.

చిత్రరేఖ చిత్రించి ఉషకు చూపిన చిత్రపటములోని కృష్ణుని రూపమును చిన్నన్న ఇట్లు వర్ణించెను.

"శ్రీవత్స కౌస్తుభ శ్రిత వక్షఁడాది దేవుండు హరి వసుదేవ నందనుఁడు
జలజ కంధరుఁడు చంచత్కటాక్షుండు జలజ పత్రాక్షఁడాజానుబాహుండు
మకర కుండల వనమాలికా భరణు డకలంక శంఖ చక్రాయుధ ధరుఁడు
శంకరార్చిత దివ్య చరణుఁడనేక పంకజోద్భూతాండ భాండ గర్భుండు
గీత లోలుడు పూర్వగీర్వాణ హరుఁడు పీతాంబరుఁడు నవ్యబింబాధరుండు
వీడు కృష్ణుఁడు చూడు వీఁడె వాఁడవునో...." (ప్ర. భా. 676-686)

"అలంకార ప్రియో విష్ణుః" అను సూక్తి కనుగుణముగనే కృష్ణుని రూప వైభవమును అక్షర రూపమున చిత్రించినాడు చిన్నన్న. అనిరుద్ధుని గొనిపోయిన వారెవరో తెలిసిన జ్ఞానియైనను నారదునితో 'ఎవ్వరే గొని పోయి రెరుగనేనని' పలికి బాణు గర్వభంగమునకై నాటక మాడింప దల చెను. నారదుడీవార్త విని ఆశ్చర్యముగాని, విచారముగాని పొందక నవ్వుచు, అన్ని విషయము లెరిగిన కృష్ణ పరమాత్మ విషయము తనచే చెప్పింప దలచెనని గ్రహించి బాణుకు అనిరుద్ధుని బంధించిన విధము చెప్పెను. అది విని 'బలిమర్ది' ఆగ్రహము పొందెనట. బాణుడు బలి తనూజుడే కనుక బలిమర్దియే బాణుమర్ది కానున్నట్లు కవి సూచనము.

కృష్ణుడు శృంగార ప్రియుడైనను ఉషా కళ్యాణమున యుద్ధ వీరు డయ్యెననుటకు క్రింది పంక్తు లుదాహరణము.

"ఆ వేళ కృష్ణుడు నాహవకేళి గావింపదొడగె రాక్షసులపై కురికి
చించు బొట్టలు ఖడ్గ శిఖిచేత మిగుల నొంచు దానవుల మేనులుగదా హతిని
కట్టు బాణంబుల కంఠముల్వెసరి పట్టిసంబున గొట్టు పటు మస్తకములు
నరకు చక్రంబుచే నరములు దునియ...." (ద్వి. భా. 1296)

ఇది కృష్ణుని ఆహవ కేళి వర్ణనము. యుద్ధము బాణునకు వేడుక, కృష్ణునకు కేళి. ఇందు కృష్ణ జ్వర - శివ జ్వర యుద్ధమున కృష్ణ జ్వర విజయము కృష్ణుని పరమాద్భుత శక్తికి నిదర్శనము.

"హరియు నుపేంద్రుంగి పురారాతి మీద శరపంక్తులదరింప జాల కోపించి హరుడద్రి శరము శ్రీహరి మీద వేసె. మురవైరి యైంద్రాస్త్రమున దాని ద్రుంచె. గిరిశుండు వేసె నాగ్నేయ మార్గణము వరుణాస్త్రమున దాని వారించె శౌరి" (ద్వి. భా. 1481-1490) ఇత్యాది హరి హర యుద్ధ వర్ణనములో కృష్ణుని అస్త్ర విద్యా వైశారద్యమును విశదపరచినాడు కవి. 'అంభోజభవ ముఖ్యులతి భీతి నొంద జృంభ సముత్పాత జృంభ దారంభ కుంభదంభోదరస్తోక నినాద జృంభణ శరము' కృష్ణుడు హరునిపై ప్రయోగింప శివుడు దస్సి కన్నులు మోడ్చి పారవశ్యము నొందెను. వేయి చేతులు నాకు పెరవు లేదని గర్వించు బాణుని చేతులను తన వేయి అంచుల వాలుతో కూలి చూచుచుండగనే కృష్ణుడు ఖండించెను. శ్రీకృష్ణుని సుదర్శన శక్తి ఇందు నిరూపింపబడినది. బాణుని శిరస్సును ఖండింపదలచియు శివస్తుతిని మన్నించి బాణుని కరుణించెను. ఇందాతని కరుణాస్వభావము ప్రతిపాదించబడినది. వైష్ణవ జ్వరమునకు ఓడిన శివ జ్వరమును చంపక కరుణించి మన్నించుటలో కృష్ణుని దయాళునిగ కవి చిత్రించెను.

కృష్ణ తత్త్వ ప్రశంస : ఈ కావ్యమున కృష్ణుని దివ్య స్వరూపాద్భుత శక్త్యాదులు శంకరకృత కృష్ణ స్తోత్ర రూపమున చిన్నన్న యిట్లు నిరూపించెను-

"ఇందిరా నాథ ! సంహృత దైత్య యూధ !
బృందారకాధార ! పృథు గుణాధార !....
జగముల యందు వాసవ ముఖ్యులందు
నగములయందు కాననముల యందు

నిత్యంబులందు అనిత్యంబులందు
సత్యంబులందును సజ్జనులందు
నజునందు నా యందు నద్రిజ యందు

నజడ రూపములందు నఖిలంబు నందు
జ్ఞాన రూపకుఁడవై సత్వ స్వభావ :
నానంద మయుఁడవు యమిత తేజమున'' (ద్వి. భా. 1691-1701)

ఇందు శ్రీకృష్ణ పరమాత్మని విశ్వాత్మకమైన సర్వవ్యాపక తత్త్వము నిరూపింపబడినది. ఇందు కృష్ణుడు విమలుడు, నిత్య విభవుడు, వేద వేదాంత వేద్యుడు, సర్వమయుడు, సగుణుడు, నిర్గుణుడు, నిర్వికారుడు ఇత్యాది భగవల్లక్షణములతో మహా మహిమోపేతునిగ చిత్రింపబడినాడు. మానుష కృష్ణునిలో అమానుష తత్త్వమును ప్రతిపాదించి శ్రీకృష్ణ పాత్రను అనిరుద్ధుని తాతయగు నొక సామాన్య మానవునిగనే కాక శ్రీమన్నారాయణుని దివ్యావతార స్వరూపునిగ నిరూపించినాడు. శివ జ్వరము శ్రీకృష్ణుని స్తుతించు సందర్భమున, చిన్నన్న - దశావతారములకు శ్రీకృష్ణునకు అభేదము చెప్పుట దీనికి ప్రోద్బలకము.

**బలరాముడు :** ఇతడు శ్రీకృష్ణాగ్రజుడు. కృష్ణునివంటి మనోహర రూప సంపద కలవాడు. చిత్రలేఖ మాటలలో చిన్నన్న బలరాముని రూపము నిట్లు వర్ణించెను.

"శ్రీకరాననము భాసిల్లు కిరీట మాకర్ణ విశ్రాంతమగు కన్నుదోయి
హారపటీర నీహార కర్పూర హీర డిండీర కుందేందుల మించు
తనుకాంతి యమృతసంతతి నించుమోవి ఘనజల స్ఫూర్తి విగ్రహ పరిపూర్తి
దివ్య కస్తూరికా తిలకంబు నిత్య నవ్య యౌవనము నున్నత భుజంబులు
కలిగి నీలాంబక కలితుఁడై పట్టి బలభద్రు వీక్షింపు భద్రేభగమన."
( ప్ర. భా. 662-671 )

బలరాముడు వయసున కృష్ణుని కంటె పెద్దవాడైనను, బుద్ధి కుశలతలో, సూక్ష్మజ్ఞానములో తమ్మునికంటె చిన్నయని తోచును. శోణితపుర

కాంతిని చూచి భ్రాంతుడై దాని నిజస్వరూపమును గ్రహింపలేక ఇది యేమని తమ్మునిని అడుగగా కృష్ణుడది ఆహవనీయాగ్ని తేజమున కలుగు దీప్తులని వివరించి అన్నగారి సంశయమును బాపెను. బలరాముడీ కావ్యమున దుష్ట శిక్షణము నందు తమ్మునకు కుడి భుజము వలె సహకరించి - 'తమ్ముడా ! యీ వచ్చు దనుజుల నెల్ల గ్రుమ్మెద' అని ముసలమును విసరి దైత్యులను చెండాడెను. ఇతని యుద్ధ పరాక్రమమెట్టిదో చూడుడు-

"దంతి దంతముల కుంతముల బంతముల నింత లింతలుగాగ నీగతి గొట్లు మెడలెల్ల చిదుపలై మేదిని గలయ బెడిదంబుగా మోదు పృధుగదాగ్రమున పాతాళము గలంగ బట్టి నాగేట భేతాళ భూతాళి పీచంబు లణచి...."

బలరాముడు బవరమును చేసినాడట. ఇట్లు బాణాసుర సేనా భంగము చేసి శివ జ్వరమును సహితము విసరివేసినాడనగా బలరాముని యుద్ధ తీవ్రతను గ్రహింపవచ్చును.

బలరాముడు గణపతితో యుద్ధము చేయుటను ఈ కావ్యమునందు ఆకర్షణీయముగ వర్ణించినాడు చిన్నన్న-

"లంబోదరుండు ప్రలంబారి తోడ యంబుద ధ్వని మీఱనపుడు గర్జించి తలకొని నడువ నాతని మస్తకమ్ము హలముచే దవిలించి యవని రాదివియ బలరాము గోపించి పార్వతీ సుతుడు నెలసి దంతాగ్రంబుచే బట్టి పొడిచె పొడిచిన రోహిణీ పుత్రుఁడా పోటు తొడిబడ రెండు చేతులఁ జెంది యతని పటు కుంభతలములు పగులంగ ముసల చటుల ఘాత మొనర్చి సమరోర్వి నార్చి"

గణపతిని జయించెను. షణ్ముఖుని తోడి యుద్ధమున బలరాముని దివ్యాస్త్ర ప్రయోగ నైపుణ్యము ప్రస్తావించబడినది. ఈ కావ్యమున రజోగుణాధి క్యము కలిగిన పరాక్రమౌద్ధత్యము బలరాముని పాత్రలో పోషింపబడినది. ఈ పరాక్రమము ఉషా కళ్యాణమునకు సహకారియై శిష్ట రక్షణమున కుప

కారియై ప్రయోజనము సాధించినది. మొత్తము మీద బలరాముని పాత్ర కృష్ణునకు సహకారియే కాని ప్రత్యేక వ్యక్తిత్వము గల స్వతంత్ర పాత్ర కాదు.

ఇతర పాత్రలు : కుంభాండుడు - ఇతడు బాణాసురునకు మంత్రి. శివుని నుండి సంగర వరమును బడసి సంబరపడు బాణుని మూర్ఖత్వమును చూచి విచారించి హితవు చెప్పిన సచివుడు. క్షణికావేశముతో అనిరుద్ధుని చంప నాజ్ఞాపించిన బాణునకు ఉష ప్రేమించినది కాన నిదానింపుమని సలహా నిచ్చిన దూరాలోచనుడు. ఉషా కన్యకు ప్రాణసఖియైన చిత్రలేఖ ఇతని కుమార్తెయే.

ఈ కావ్యమున యుద్ధ పరాక్రమమును ప్రదర్శించిన మరొక ప్రాణి గరుత్మంతుడు. ఇంకను నంది, ఈశ్వరుడు, గణపతి, పార్వతి, రుక్మిణి మొదలగు పాత్రలు యథోచితముగ చిత్రింపబడినవి.

## రస పోషణము

కావ్య లక్ష్మికి శబ్దార్థములే శరీరము. ధ్వని జీవము. అలంక్రియా వితానయే అలంకారములు. గుణములే గుణములు. వృత్తులే వృత్తులు. అయినచో కావ్య కాంత సౌందర్యమును స్పష్టపరచు రసమే జీవితముగ భావింపవచ్చును. కావ్యము రసభరితముగ నుండవలెననుట సామాన్య సూత్రము. పెక్కు తెలుగు ప్రబంధములు శృంగార రస ప్రధానములు. పారిజాతాపహరణ, ప్రభావతీ ప్రద్యుమ్నాది కొన్ని కావ్యములు శృంగార వీరములకు సమ ప్రాధాన్యము నిచ్చినవి కలవు. హాస్య కరుణ రౌద్ర వీర భయనక బీభత్సాది రసములు కావ్యము లందు అంగరసములుగ పోషింప బడుచున్నవి. తెలుగు సాహిత్యమున శాంతరస ప్రధాన కావ్యములు

మిక్కిలి తక్కువ. నంది మల్లయ-ఘంట సింగన కవుల ప్రబోధ చంద్రోదయము, తాళ్ళపాక చిన్నన్న పరమ యోగి విలాసము వంటివి కొన్ని మాత్రమే.

ఉషా కళ్యాణము శృంగార రస ప్రధానమైన కావ్యమని డా॥ ఏ. విద్యావతిగారును (తాళ్ళపాక కవుల సాహిత్య సేవ. పు. 165); ఇందంగి రసము శృంగారము వీరాదులంగ రసములని డా॥ టి. సుశీల గారును (ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. పు. 241) చిన్నన్న కృత ఉషా కళ్యాణ రస విషయమును నిర్ధారించిరి. పరిశీలింప చిన్నన్న శృంగార వీరములకు సమ ప్రాధాన్యము నిచ్చినట్లు తోచును. కాని కావ్య నామమును బట్టియు, ప్రథమ భాగమున శృంగారము విజృంభించి ద్వితీయ భాగమున అది ఉషా నిరుద్ధుల కళ్యాణమునకు దారి తీయుటను బట్టి చూడ ఉషా కళ్యాణము శృంగార రస ప్రధానమైన కావ్యమనియే భావింప వలసి యున్నది.

ఈ కావ్యమున నాయికా నాయకులగు ఉషానిరుద్ధులు ఆలంబన విభావము. శైత్యోపచార చంద్రోపాలంభనాదులు ఉద్దీపనములు. నాయికా పరముగ విప్రలంబ శృంగార మెట్లు వర్ణింపబడినదో చూడుడు–

"వాఁడని బింబంబు వంటి కెమ్మోవి వాఁడిన తలిరాకువలె వసివాడె
భాసిల్లు చంద్ర బింబము చాయ మొకము మాసిన యందంబు మాడ్కినుండంగ
కనుగొని విరహాగ్ని కాకచే మిగుల వనజాక్షి మైదీఁగె వాఁడె నెట్టంచు
కన్నులపై బచ్చ కప్పురం బలది పన్నీరు గుబ్బలపై జల్లి చల్లి
యందంద కరముల యడుగుల నిండ చందన పంకంబు చల్లఁగా మెత్తి"

(ప్ర. భా. 537-550)

ఇట్లు విరహాగ్ని కాకకు గురియైన ఉషా కన్యకు చెలులు పచ్చకప్పురము, పన్నీరు, చందనములతో శైత్యోపచారములు చేసిరి. విరహార్తి కోర్వలేక

వెన్నెలలో విద్దపు మెరుగుల నెలచట్టు రాతి గద్దియ మీద కూర్చుండి ఉష చంద్రోపాలంభనము గావించెను. ఉషా కన్యకు సంభోగ సౌఖ్య మెప్పుడు కలిగినది ? స్వప్నమున కలిగినది.

"నిదుర కన్నులు దేర నీల కుంతలలు
పదిలమై యొయ్యన పాదంబులొత్త
పొలతుక సుఖనిద్ర పోవుచు నుండ
కలలోన మన్మథాకారుఁ డొక్కరుఁడు
కలికి లాగుల తన కళలంటి యంటి
కలసి పై కొన మేలు కాంచి బిట్టులికి" (పు. 21)

ఇట్లు స్వప్నగత సంభోగ వర్ణనము గావించి కవి శృంగార రసమును పోషించెను. ఇంకను ఇందు మన్మథ పూజలు, శృంగార లీలావర్ణనలు, దాంపత్య కేళీ ప్రశంసలు, ఉషా కన్యా రతి కేళీ ప్రాప్తి సమయ నిర్దేశాదులు శృంగార రస పోషణకై కవికి ఉపకరించిన సాధనములు. ఇట్లే ఉషా సఖి చిత్రలేఖయు అనిరుద్ధుని ద్వారక నుండి తెచ్చి ఉషకు అప్పగించి శృంగార రస సంధానమునకు సహకరించినది.

ఈ కావ్యమున కవి, స్వప్న సంయోగానంతరము నాయికా విరహ వర్ణనము గావించుట విశేషము. ఇట్టి విచిత్ర సన్నివేశ మితర శృంగార కావ్యములందంతగ కానరాదు. ఉషకు స్వప్న సమాగమ మేర్పడుటకు కారణము పార్వతి వరము. శివ పార్వతుల ప్రణయ కేళీ స్వేచ్ఛా విహారములను తిలకించిన ఉష తన కట్టి సౌఖ్య స్థితిని ఆశించినది. పార్వతి వరమిచ్చినది. ఈ కావ్యేతివృత్త మట్టిది. పార్వతీ పరమేశ్వరుల ప్రణయ కేళీ స్వేచ్ఛా విహార వర్ణనము అనుషంగికమై ఉషానిరుద్ధుల సంభోగ శృంగార ప్రాప్తికి తోడ్పడినది. ఈ కావ్యమునందిట్లు కార్య కారణ సంబంధముండుట ఒక విశేషము. ఇందు సంభోగ శృంగారము ప్రత్యక్షము కాదు, స్వప్నగతము. అసలు శృంగారమునకు రతి కదాస్థాయి భావము ;

"తరుణీ మణులకుఁ బురుషుల
కరయగ సంభోగ విషయమగు నభిలాష
స్ఫురణము మనముల బొడమిన
ధరలోనడి రతి యనంగ దగు నెట్లన్నన్"
(కావ్యాలంకార సంగ్రహము. తృ. ఆ. ప. 9)

అని రతి లక్షణము. ఇట్టి సంభోగాభిలాష ఈ కావ్యమున నాయికా నాయకు లందు పోషింపబడి శృంగారము నిర్వహింపబడినది.

***వీర రసము :*** వీరమునకు స్థాయి ఉత్సాహము.

"అత్యున్నత లోకోత్తర
కృత్యములు నేయవేడి కృత కృత్యు లిలన్
నిత్యము దలచు ప్రయత్నం
బత్యం తోత్సాహమయ్యె...."

అని ఉత్సాహమునకు ఆలంకారిక లక్షణము (కావ్యాలంకార సంగ్రహము. తృ. ఆ. ప. 9) దాన ధర్మదయా యుద్ధ భేదమున వీరము చతుర్విధ మయ్యెను. ఉషా కళ్యాణము నందు యుద్ధ వీరమే ప్రధానముగ వర్ణితము : బాణునితో కృష్ణానిరుద్ధులు గావించిన యుద్ధము ఈ రస పోషణమునకు రంగ స్థలము.

శ్రీకృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, గరుత్మంతుడు, వైష్ణవ జ్వరము మున్నగు వారు కృష్ణపక్ష వీరులు. బాణాసురుడు, ఈశ్వరుడు, గణపతి, నంది, కుమారస్వామి, శివ జ్వరము, తదితర చతురంగ బలములు ప్రతిపక్ష వీరులు. రణ రంగమున కృష్ణుడు యుద్ధోత్సాహముతో ముమ్మారు పాంచజన్యమును పూరించెను. సుదర్శన చక్రాది వివిధాయుధములు, ఆగ్నేయ వాయ వ్యాద్యనేకాస్త్రములు ప్రయోగింప బడినవి. ముష్టి యుద్ధ

ములు, మల్ల యుద్ధములు ప్రత్యక్షమైనవి. ఈ యుద్ధ వర్ణనలందే కవి చాక చక్యముతో వీర రస పోషణము గావించెను. సమాన బల పరాక్రమ ములు కలిగిన ఇద్దరు వీరుల యుద్ధమును వర్ణించుచు ఉన్నట్టుండి వారి యుద్ధ సన్నివేశమును అదృశ్యమొనర్చి సమాన బలపరాక్రమములు కలి గిన మరొక ఇద్దరు యుద్ధ వీరుల యుద్ధమును వర్ణించుట ప్రారంభించును. ఇది ఒక రచనా విశేషము. ఉదాహరణమునకు-

"భయద భేరీచండ భాంకార తూర్య
చయ ఘోర ఘోషముల్ జగమెల్ల నిండ
చయ్యన చనుదెంచి శౌరితో హరుఁడు
కయ్యంబు ధీరత గావింప దొడఁగె" (ద్వి. భా. 1461)

అని హరిహరుల యుద్ధమును గూర్చి చెప్పుచు ఆ సన్నివేశమును కక్కున మాని-

"లంబోదరుండు ప్రలంబారి తోడ
యంబుద ధ్వని మీఱనపుడు గర్జించి....
బలరాము గోపించి పార్వతీ సుతుఁడు
నెలసి దంతాగ్రంబుచే బట్టి పొడిచె" (ద్వి. భా. 1471)

అని కవి గణపతి బలరాముల యుద్ధమును వర్ణించుట ప్రారంభించెను. ఈ కావ్యము నందలి మరొక విశేషము శైవ వైష్ణవ జ్వరముల ముష్టి యుద్ధము.

"కెరలి యవ్వేళ శ్రీకృష్ణ జ్వరంబు గరళ కంఠ జ్వరాగ్రణి జుట్టి పట్టి
శిరము లొండొంటితో జించి తాటించి యురుతరార్భాటముచే హుంకరింపుచును
మెడలపై నొక్కుచు మేను ద్రొక్కుచును తొడలు నొక్కుచు భూమి
దొల్లంగ వైచి

యెమ్ములు నొగలంగ మేపెల్ల నడఁగ గ్రుమ్మచు చేతుల....దిరువ్వగుచు
యాపినాకి జ్వరం బవనిపై బొదలి వాపోవ నత్తఱి వైష్ణవ జ్వరము"
(ద్వి. భా. 1348–1357)

ఇట్టి జ్వర యుద్ధము వంటి విచిత్ర యుద్ధము మరే యితర కావ్యము నందును కానరాదు. ఇది ఉషా కళ్యాణము నందద్భుత రీతిని పాఠకుల నాకర్షించును.

అస్త్ర యుద్ధము : ఈ కావ్యము నందు అద్రిశరము, ఐంద్రాస్త్రము, ఆగ్నేయ మార్గణము, వారుణాస్త్రము, వాయవ్య సావిత్ర వాసవ మోహ సాయకాది ప్రశస్తతమ అస్త్రములు, వైష్ణవాస్త్రము, మంత్రపూర్వకమైన బ్రహ్మాస్త్ర ప్రయోగాదులు, వర్ణింపబడి పాఠకులకు ఆశ్చర్యోత్సాహములు కలిగించును. ఇంకను ఖగనాథుని యుద్ధమిందు వర్ణితము.

ఇంతగా ఈ కావ్యమునందలి యుద్ధ సందర్భములలో వీర రసము విజృంభించినను, అది ఉషానిరుద్ధుల వివాహమను ఫలితాంశము నందు గతార్థమై ఉభయ పక్షముల కయ్యము వియ్యముగ మారుటచే వీర రసమిందు ఆనుషంగికముగ మాత్రమే నిర్వహింపబడినట్లు నిర్ణయింపవలెను. కావున ఈ కావ్యమున సగభాగము యుద్ధ వీరమే ప్రదర్శితమైనను శృంగారమే అంగిరసమగుచున్నది.

**హాస్యము** : తాను నవ్వకుండ ఇతరులకు నవ్వు పుట్టించెడి ఆకార వికార సంబంధమైన చేష్టలు వర్ణితములై ఆహ్లాదమును, మనో వికాసమును కలిగించినచో 'హాస' మగును. ఆ హాసమే స్థాయిగ హాస్యరసము జనించును. పార్వతీ పరమేశ్వరుల ప్రణయ కేళీ స్వేచ్ఛా విహార ప్రసంగ సందర్భమున–

"అచ్చట చిత్రలేఖాహ్వాయయైన
యచ్చర నగపుత్రి యాకృతి నపుడు
ధరియించి హరుని ముందర నిల్వ నతఁడు
పరమ సంతుష్టుఁడై పార్వతి యనుచు
కామించ వీక్షించి గౌరియుం జెలులు
వేమారు నవ్విన.... (ప్ర. ఖా. 271_279)

ఇచట చిత్రలేఖ యను అప్సర పార్వతి వేషమును ధరించి హరుని భ్రమింపజేసినది. శివుడామెను పార్వతి యనుకొని కామించుటకు వీక్షించు చుండ శివుని హావభావములు చూచి గౌరియు, అచటి చెలులును నవ్విరట. భ్రాంతి మూలకమైన ఈ సన్నివేశము హాసమునకు స్థాయియై హాస్యముగ పరిణమించినది.

*బీభత్సరసము* : సామాన్యముగ యుద్ధ భూములు పలలాస్థి శోణితాదులతో నిండి యుండును. వాని వర్ణనము ద్వారా కావ్యములందు బీభత్స రసము పోషింపబడును. బీభత్స రసమునకు స్థాయి భావము జుగుప్స.

"పలలాస్థి శోణితాదులఁ
బలుమాఱును జూడ వరుచి భావము లోనం
దళుకొత్త నిగర్హణ మది
తలపోయ జుగుప్స యనదగు...."

అని జుగుప్స లక్షణము (కావ్యాలంకార సంగ్రహము. తృ. ఆ. ప. 19.) ఉషా కల్యాణములో కవి యుద్ధ భూమి నిట్లు వర్ణించెను.

"పడిన యేనుంగుల బరువెల్ల వలసి
పుడమి గ్రుంగిన హయంబులు ఎగ్గులగుచు....
నెత్తురు గాలువల్ నెరసి యంతటను
మొత్తంబులై యున్న మొండెములిగ్గుల

చెదరిన మెదడు గిజ్జడియైన తొడలు
చిడిసిన కాయములిందు వందైన
గుండియల్ ప్రేవులు గుములైన యెదలు
కండలు దుములైన కైదువుల్ సోలి
దుల్లెడు తలలు...." (ద్వి. భా. 1721-1734)

ఇత్యాదిగ వర్ణితమైన ప్రేత భూమిలో పలలాస్థి శోణితాదులు వర్ణితములై జుగుప్సను కలిగించి అది స్థాయిగ బీభత్స రసము పోషింపబడినది.

*భయానకము :* 'క్రూరాకారములు చూచినపుడు జనులు హృదయమందు అనర్థాంకూరాశంకన మగుటను భయ' మన వచ్చునని ఆలంకారిక లక్షణము. భయమే భయానక రసమునకు స్థాయి భావము. ఈ కావ్యమున రామ రామానుజ ప్రద్యుమ్న ప్రేరిత నానావిధాస్త్ర వైభవ వర్ణన సందర్భమునందు—

"రామానుజుని బోలె రాముఁడు జూడ చక్రాయుధాగ్నికి జడిసి భీతిల్లి
శుక్ర శిష్యులు నిజ స్ఫురణముల్ దక్కి పోటులబడి పారిపోలేక జిక్కి
పలుదిక్కులకు భంగపడి యేగువారు పరియలై యున్న కపాల భాగముల
దొరగు రక్తంబులతో మ్రగ్గువారు నగుచు నీభంగి భయార్తులై చనగ"
— (ద్వి. భా. 1409-1418)

అను రీతిగల యుద్ధ వర్ణనమున శుక్ర శిష్యులు చక్రాయుధాగ్నికి జడిసి భయపడి పారిపోయిన తెరగులో భయానకము పోషింపబడినది. ఇందు కవి 'భయార్తులై' అను పదమున స్థాయి భావమైన భయమును వాచ్యము చేసినాడు. రస విషయమున ఇట్లు వాచ్యము చేయరాదని లక్షణకారులందురు.

ఉషా కళ్యాణము నందు రస పోషణమున మరొక విశేషము. విరహము నందున్న ఉషా కన్యను మన్మథుడు బాధించు తీరును చెప్పును కవి. మదనుని ఒక యుద్ధ వీరునిగ చిత్రించి శృంగార రస పోషణమున వీర రసస్ఫూర్తిని కలిగించెను. పరికింపుడు—

"తలిరాకు టడిదంబు తమ్మి బాదకము
చిలుక వారువము మించిన మొల్ల గొలుక
చెఱకు సింగిణి మీను సిడెము తుమ్మెదల
గఱుల తూపుల నల్లఁగలువ జోద నటి
పొటికర తరకసంబులును నేవంతి
బటువు కైవడమును భాసిల్లు మరుఁడు
అళులెల్ల దండిబారై మున్ను నడువ
చిలుకల గమివాని చెంతకే యరుగ
కోక వాహినులు చకోరకంబులును
కోకిల సైన్యంబు గొలిచి యేతేర" — (ప్ర. భా. 516-526)

ఆ ఉషా కన్య మీదకు మరుడు యుద్ధమునకై దండెత్తెనట. ఒక ప్రభువు సర్వ సైన్యముతో యుద్ధమున కేతెంచు రీతి యిట వర్ణితము. అందమైన ఉష శరీరావయవములు కొంతవరకు మన్మథుని ఎదిరించినను తుదకు మదనుని చేతిలో ఉషయే ఓడిపోయి తీవ్రమైన మదన వేదనకు వశమైనట్లు చెప్పుట అపూర్వ భావన.

## వర్ణనలు

ఉషా కళ్యాణము నందు ప్రబంధోచితములైన అష్టాదశ వర్ణనలన్నియు వరుసగ లేకపోయినను సందర్భోచితములై కథానుకూలముగ

సమకూర్చబడినవి. ఈ కావ్యము నందు వ్యక్తి స్వరూప వర్ణనలు ఎక్కువ. ఉషానిరుద్ధ చిత్రలేఖ బాణాసుర శ్రీకృష్ణ బలరామాది వ్యక్తుల స్వరూప వర్ణన లిందుల కుదాహరణములు. అచటచట ప్రకృతి వర్ణనలు గలవు. అనగా సూర్య చంద్రర్తు నగరోద్యాన సరోవరాది వర్ణనలు. కొన్ని వర్ణన లందు కథాసూచన విధానము కనిపించును. మరికొన్ని వర్ణనలు పరతత్త్వము నభివ్యక్తీకరించును. కొన్ని వర్ణనలలో కవి పాండిత్య ప్రకర్ష స్ఫురించును. కొన్ని వర్ణనలు అనల్ప కల్పనా శిల్ప మహితములై మూలమునకే మెరుగు పెట్టునవిగ నుండును.

**వ్యక్తి స్వరూప వర్ణనలు :** ఈ వర్ణనలలో సుదీర్ఘముగ కొన సాగినది ఉషా కన్య స్వరూప వర్ణనము. తన కృతులలో చిన్నన్న ముఖ్య ముగ స్త్రీ వర్ణనము నందెంతయో వైవిధ్యమును సాధించినాడు. నిద్రాము ద్రితుడైన అనిరుద్ధుని చిత్రలేఖ ఉషాంతఃపురమునకు గొనితేగా కనులు తెరచి ఉషా శరీర సౌందర్యమును గాంచి అచ్చెరువు నొంది యామె అంద మును శిఖ నఖ పర్యంతము తిలకించి పరవశుడైనాడు అనిరుద్ధుడు. అతని చూపులలో ఉషాకన్య అవయవములిట్లు ప్రకాశించినవి-

"కురువిందముల కాంతిగులుకు దంతములు నరవిందములబోలు హస్త
యుగంబు
గండు తుమ్మెద కప్పుగల్గిన కొప్పు ఖండేందు కైవడి గనుపట్టు నొసలు
సోగలై మొనజూపు చూపుల వలపు మీగడ గట్టించు మెఱుగుజెక్కులును
నినుమంత నగవుతో నెనయు నెమ్మొగము పసిఁడి విగ్గులు దేరుబటువు
చన్గవయు
జెలువైన జంఘలు చిన్నిమీఁగాళు గలిగి యొప్పెడు యుషాకాంత
గన్గొనుచు"

- (ప్ర. భా. 830-839).

ఇందు ఉషా కన్య అవయవములు కురువిందములతోను, అరవింద ములతోను, గండు తుమ్మెద దలతోను, ఖండేందునితోను పోల్చబడినవి. ఇది సామాన్యమే. కాని ఉపమాన వస్తువులన్నియు ప్రకృతికి సంబంధించిన వగుట విశేషము. "ప్రకృతిః స్త్రీ" అను దానిని బట్టి స్త్రీ ప్రకృతి స్వరూపిణి కనుక స్త్రీ అవయవ సమితిని ప్రకృతి గతోపమాన వస్తువులతో పోల్చి వర్ణించుట ప్రకృతి-స్త్రీల అవినాభావ సూచకముగ నున్నది. ఇంకను ఉషా దివ్య సౌందర్య గుణాది వర్ణనల్లో గూడ ఈ కావ్యము నందిట్టి పోలికలనే గమనింపగలము. అనిరుద్ధుడు నిద్ర నుండి మేల్గాంచి కలకల యన నేత్ర కమలములు దెరచి చూచినాడట. ఇట 'కలకల' యన నేత్రములు తెరచె నపుటలో రెప్పలల్లార్చుచు నిద్ర మేల్గాంచుట దృశ్యమాన మగునట్లు నాట కోచితముగ వర్ణించినాడు కవి.

ఉషానిరుద్ధుల వివాహానంతరము ద్వారకాపుర కాంతలు గావించిన ఉషా సౌందర్య వర్ణన గలదు. స్త్రీని ఎన్నిమారులు వర్ణించినను అవే అవయవములు, అవే పోలికలు. కాని చెప్పెడు తీరులో కలదు ఎంతైన వైవిధ్యము, కౌశలము. ఉష పాత్రను ప్రవేశ పెట్టుచునే కవి ఆమె చక్క దనమును కావ్యాదియందెట్లు వర్ణించుచున్నాడో చూడుడు—

"బాణపుత్రిక యుషా బాలిక యనఁగ
యేణాంక బింబాస్య హేమాంగి గలదు
తళుకు గన్నులది కుందనపు చెక్కులది
మొలక నూగారుది మురువు పీనులది
పొగరు గుబ్బలది యబ్బురపు లీలలది
చిగురు కెమ్మోవిది జక్కులపు చూపులది
మెరుగు వన్నెలది క్రొమ్మించు నవ్వులది
మొరపు బాగులది మయూరంపు నడది"

— (ప్ర. భా. 206-213)

ఇందు 'కలది కలది' అను పదము పలుమార్లు వచ్చునట్లు చెప్పి స్త్రీ వర్ణనమున రచనా రీతిలో క్రొత్తదనమును కనబరచినాడు చిన్నన్న. ఉష రూప మిట్లు సుందరముగ వర్ణితము కాగా చిత్రలేఖలో సాహసము, చలాకీతనములు కనుపట్టునట్లు ఆమె రూప వర్ణనము గావించి ద్వారకలో కలహంస గమనముతో తిరుగుచున్నట్లు చెప్పి స్త్రీ వర్ణనమున వైవిధ్యమును ప్రదర్శించినాడు కవి.

*నాయక వర్ణనము :* సామాన్యముగ తెలుగు కావ్యము లందు నాయక వర్ణనము తక్కువ. నాయికా వర్ణనమధికము. కాని చిన్నన్న కావ్యములలో దాదాపు నాయికావర్ణనముతో సమానముగ నాయక వర్ణనము గూడ కవిపించును. ఇందులకు అష్టమహిషీ కళ్యాణమున శ్రీకృష్ణ వర్ణనము, ఉషా కళ్యాణములో అనిరుద్ధ వర్ణనము, పరమ యోగి విలాసమున పన్నిద్ద రాళ్వారుల వర్ణనలు, అన్నమాచార్య చరిత్రమున అన్నమయ వర్ణనలు చూడవచ్చును.

ఉషా కళ్యాణమున నాయకుడైన అనిరుద్ధుని రూప వర్ణనను బట్టి అతడు కరిమొయిలు చాయగల శరీరమువాడని, చేరలంతేసి కన్నులవాడని, పొడవులై కనుపట్టు భుజముల వాడని, నవచంపకోల్లాస నాసికవాడని, చివురుల జిగిపోలు చెక్కులవాడని, కాయజు మించు చక్కని వాడని తెలియుచున్నది. అతడు కురకుర నవ్వుచే గొమరైనవాడట. ఇందు 'కుర కుర' అను ధ్వన్యను కరణ పదముచే నాయకుని నవ్వులోని వింత సోయగ మును స్ఫురింపజేసినాడు కవి. చేరలంతేసి కన్నులనుటలో తెలుగు పలుకు బడి మూర్తి కట్టినది.

*ప్రతి నాయక వర్ణనము :* ఉషానిరుద్ధ చిత్రలేఖా స్వరూపాళి వర్ణనలలో శృంగారోచితమైన సౌందర్య ధోరణి ఉట్టి పడగా, ప్రతి నాయకు డైన బాణుని వర్ణనలో వీర రసోచిత రూప స్ఫూర్తి గమ్యమగుచున్నది.

అనిరుద్ధుడు ఉషాంతఃపురమున ప్రవేశించిన వార్త వినిన బాణుని మానసిక స్థితికి అనుగుణమైన శరీర వర్ణన మెట్లున్నదో చూడుడు—

"బొమముడి గదురఁ దనువున దుఃఖదగుచు గమగించి విస్ఫులింగములు నేత్రముల
నులుకు నూర్పులు మించి హుంకరింపుచును వలకేల మీసాలు వడి పెట్టుకొనుచు
బలభేది ముఖ్య దిక్పతుల నాలముల గెలిచితి నాడు....

(ప్ర. భా. 882-887).

ఇందు మీసాలు వడిపెట్టుకొనుట బాణాసురుని స్వభావమునకు సహజమైన, వీరోచితమైన చేష్ట. ఇందాతని దుఃఖము, ఆశ్చర్యము, కోపము, పౌరుషము ఇత్యాది భావములు ప్రతిబింబించి బాణుని మానసికమైన కలవరపాటు శారీరక స్థితిగతులపై ప్రసరించిన తీరు—పై వర్ణనమున నిరూపింపబడినది.

***శ్రీకృష్ణ స్వరూప వర్ణనము :*** ఈ కావ్యము నందొక ప్రధాన పాత్ర అయిన శ్రీకృష్ణుని వర్ణనము దశావతార మహిమాను గుణయుక్తమై యుండుట విశేషము. శివజ్వరకృత ప్రార్థనమున కృష్ణ వైభవ కథన మిట్లు గావింపబడెను—

"మలసి బ్రహ్మను గావ మత్స్యంబవైతి
వలనాడు, కృష్ణుండవైతివి నేఁడు
జలధి గట్టగ రామచంద్రుఁడవైతి
వలనాడు, కృష్ణుఁడవైతివి నేఁడు"— (ద్వి. భా. 1370).

అలనాడు మత్స్య పరశురామాది అవతారములను దాల్చితివి, నేడు కృష్ణుడవైతివి అనుచు పర్యాయోక్తముగ చెప్పుటలో కృష్ణావతార ప్రాశస్త్యము

వక్కాణింపబడినది. "కృష్ణస్తు భగవాన్ స్వయం" అని వ్యాసమహర్షి చెప్పినట్లు శ్రీకృష్ణుడు భగవానుడు కనుక ఆయనను దశావతారమూర్తిగ వర్ణించి చెప్పుట సమంజసము. పునరుక్తి దోషము లేదు.

ఈ కావ్యము నందు చిన్నపాత్రలైన నారద విఘ్నేశ్వరుల రూప వర్ణనలు కూడ కలవు. ఇందు నారదునకు ఊర్ధ్వ పుండ్రము లేర్పరచి కవి తన వైష్ణవాభిమానమును చాటుకొనెను.

*గణపతి వర్ణనము :* సందర్భము గణపతి బలరాముల యుద్ధము—." మీసాలు నివురుచు మిడిగ్రుడ్లు ద్రిప్పినాప యాడించి కర్ణములు నిక్కించి కడు జవంబున మూషికంబేగు దేర నిడుద తొండము సారె నిక్కించు కొనుచు లంబోదరుండు ప్రలంబారితోడ యంబుద ధ్వని మీఱ నపుడు గర్జించి తలకొవి నడువ" (1467–1473). ఈ వర్ణన మున కవి విఘ్నేశ్వరునకు మీసాలు పెట్టుట వింతగ కనిపించును. సందర్భము యుద్ధము కనుక నిది ఔచిత్యము. గజమునకు సహజ లక్షణ మైన తుండమును కదిలించుట, కర్ణములు నిక్కించుట స్వభావోక్తి సుందర ముగ వర్ణింపబడినది. ఈ వీర గణపతి వర్ణన మిందు మనకు విచిత్రానంద మును కలిగించును.

వ్యక్తి స్వరూప వర్ణనలలో ప్రత్యేకముగ పేర్కొన దగినది చిత్ర లేఖ. దేవ మానవ మూర్తులను చిత్రించి ఉషకు వర్ణించి చెప్పిన ఘట్టము. ఇందు ఇంద్ర శివ కుబేర వరుణ వాయు గంధర్వ కిన్నర కింపురుష గౌళ పాంచాళ బంగాళాది భూలోక రాజకుమారులు, బలరామ, శ్రీకృష్ణ ప్రద్యుమ్నానిరుద్ధుల రూప వర్ణనలు కలవు. ఈ ఘట్టము మూలము నందతి స్వల్పము. నాలుగైదు శ్లోకములలో మాత్రమే కలదు. కాని చిన్నన్న ఆయా దేవతల రూప సౌశీల్యములు, వైభవ ప్రాభవములు, ఇంకను ఇతర విశేషము లనేకము సముచిత రీతిలో వర్ణించినాడు.

**ప్రకృతి వర్ణనలు :** ఇందు ఉదయ సాంధ్య సూర్యోదయ చంద్రోపాలంభన సరోవరోద్యాన వనవిహార వర్ణనలను పేర్కొనవచ్చును అనిరుద్ధుని కానక చారులు కృష్ణున కాసంగతి నివేదించు సందర్భమున గల ప్రాత స్సంధ్యా వర్ణనము -

"వనరాశి పూర్వదిగ్వామాక్షిచేత
ననుపు ముంగర ముత్తియంబన మిగుల
గనుపట్టె తూర్పు చక్కటి వేగుజుక్క-
వనజాస్త్రినకు పద్మ వర్గంబు మీఁద
నెలకొన్న యనురక్తి నెరసి యుప్పొంగి
యలరెనో యనమున్న యరుణుండు పొడిచె
కలువల వైరి చుక్కల మూక విప్ప
జలజబాంధవుఁడు క్రొంజాయతో బొడమె".
(ఉ. క. 1091-1098).

ఇందలి ఉత్ప్రేక్షలు చిన్నన్న అనల్ప కల్పనాశక్తికి దర్పణములు. పై వర్ణనమున వేగుచుక్కలో ముత్తియపు ముంగరను దర్శించిన కవి సౌందర్య దిదృక్ష ఎట్టిదో గ్రహింపవచ్చును.

**చంద్రోపాలంభనము :** ఇది ఉషా కృతము. అనిరుద్ధుని వలన విరహమును పొందిన ఉష చంద్రుని వేడిమిని భరింపలేక-

"వేషంబు సాత్త్విక వేషంబు గాని
దోషాకరుఁడు గురు ద్రోహి రేగాము
కుడిచి కక్కిన కక్కు గుణవిహీనుండు
ముడిచిన పువ్వు తమ్ముల పగదాయ...." (ఉ.క. 562)

అనుచు చంద్రుని దూషించినది. ఇందు దోషాకరుడు, గురుద్రోహి అను విశేషణములు చంద్రుని గత చరిత్రకు సంబంధించినవి. దేవతల

కాహారమైన అమృతమను ఉదాత్త పదార్థమును 'ఉడిచి కక్కిన కస్కు' అనుచు అల్పార్థ స్ఫూర్తి కలుగునట్లు అన్య తెనుగు మాటలతో స్ఫురింప జేయుట విశేషము. మరియు రాహుకేతువుల చంద్రగ్రహణోదంతమును గూడ స్పృశించినట్లయినది. ఈ చిన్నన్న కృత చంద్రోపాలంభనము అమూలకము.

***ఉద్యానవన వర్ణనము :*** "చాంపేయ చందన సార రసాల చంపక జంబీర సరళ పాటీర కరవీర ఖర్జూర ఖదిర కదంబ కర కరాలవ కౌశిక క్రముకములు నలరిన యట్టి యుద్యానవనము" (ప్ర.భా. 242-246) ఇది చిన్నన్న గావించిన మనోజ్ఞమైన ఉద్యాన వన వర్ణన. ఇందు ఖదిర మనగా చంద్ర వృక్షము. కౌశికమనగా గుగ్గిలపు చెట్టు, క్రముకమనగా పోకచెట్టు. ఇట్లు నానావృక్ష నామ కథన మీ వర్ణనము నందు కలదు. ఇందలి రచనలో సమాస గ్రథన సాంద్రత వనస్థ వృక్ష సాంద్రతను సూచించుచున్నది. ఇది ఒక రచనా శిల్పము.

*సరోవర వర్ణనము :* హర పార్వతీ వసంత లీలా చరణాది వర్ణన సందర్భమున నిది క్లుప్తముగ కలదు.

"కరమర్థినా జలాకరము రాయంచ
కవలతో మేటి జక్కవలతో మించు
తొవలతో తావి చెందొవలతోదేటి
గములతో తరళ భంగములతో సార
సములతో నవ సారసములతో నలర. (ప్ర.భా. 326).

ఈ వర్ణన వృత్త్యను ప్రాసాలంకార శోభితమై శబ్ద సంచయము సరోవర సౌందర్యా తిశయమును చాటెడు అక్షరాలంకారమే యగుచున్నది.

***పుర వర్ణన :*** కావ్యాదిని ద్వారకానగరము వర్ణితము. అందలి సౌధములు, పరిఘలు, చతుర్వర్ణములు, నగర స్త్రీజన సౌందర్య విశేషములు

అతిశయోక్త్యాద్యలంకారములతో అందముగ వర్ణింపబడినవి. ఈ క్రింది ద్వారకా వర్ణనము చూడుడు-

"సకల విశ్వంభరా చక్రంబు నడుమ
నకలంకమై మేరు వమరు చందమున
ధారుణీ దోష విదారణంబైన
ద్వారకా నగరంబు ధరణి చెన్నొందు....
అది కచ్ఛప సద్విహార యోగ్యములు
పాదైన యప్పురి పరిఖ లన్నియును
ముదితలా పురి సౌధముల మీది నుండి
చదలేటిలో దిగ్గి జలక మాడుదురు...."(ఉ.క. 51-61).

ఇది సుందరమైన భావన. ఆకాశము నంటుచున్న ద్వారకా సౌధముల మీది నుండి దిగి స్త్రీలు చదలేటిలో జలకమాడుదురట.

ఈ కావ్యము నందింకను— "చటులాగ్ని హేటమై జాజ్వల్యమాన మాణిక్య ఖచిత హర్మ్యంబుల నమరు" శోణితపుర వర్ణనము కూడ కలదు.

ఉషా కళ్యాము నందు కొన్ని వర్ణనలు కథా సూచకములు. ఉదాహరణమునకు 'గరుడుడు మోదించి నిజపక్షముల చదలేటి జలములు గొనివచ్చి బలిదైత్య దనుజ దివ్యప్రతాపాగ్ని చల్లార్చుకై వడి ఆహవనీయాగ్నిని చల్లార్చె'నట. ఇందు సమీప భవిష్యత్తున గల బాణుని పరాజయము సూచింపబడినది. మరికొన్ని వర్ణనలందు పరతత్త్వము ప్రదర్శితము. అనిరుద్ధునికై విచారించుచున్న శ్రీకృష్ణునితో వృషదుడిట్లను చున్నాడు.

"హరి! సర్వలోకేశ! యమరేంద్రవంద్య! గరుడవాహన పూర్ణకరుణా
కటాక్ష
నరుని సంగతి నిట్లు నటియింపనేల?. పరమయోగీశ్వరుల్పలుమరు నిన్ను
చింతించి తక్కిన చింత బాయుదురు. చింత నీకేటికి శ్రీనాథ! యనిన....
(ఉ. క 1034- 040)

పై వృషదుని మాటలలో కృష్ణ తత్త్వము వర్ణింపబడుచున్నది. కృష్ణుడు నరునివలె నటించుచున్న నారాయణుడని చెప్పబడినది.

**వివాహ వర్ణనము :** చిన్నన్న వర్ణన లందెన్నదగినది వివాహ వర్ణనము. ఉషా కళ్యాణ శుభలగ్న నిరీక్షణాది వర్ణనము. పెండ్లి పందిరి నిర్మాణము. వరపూజ. మధుపర్క ప్రదాన క్రమము. ఉషా కన్యా వివాహాలంకార ప్రకారవర్ణనము. బాసికము. మహాసంకల్పము. మంగళాష్టకములు చదువుట. కన్యాదాన ధారా విసర్జనము. శుభముహూర్త ముఖావలోకనాది వర్ణనము. తలంబ్రాలు పోసికొనుట. ముత్తైదువలు ధవళములు పాడుట. బ్రాహ్మణులారగించిన వివాహ భోజనము ఇత్యాది పెళ్ళి తతంగ మంతయు ఈ కృతిలో ఆకర్షణీయముగ వర్ణింపబడినది. ఉష అనిరుద్ధునిపై ముత్తి యముల తలంబ్రాలు పోయుట ఇట్లు వర్ణింపబడినది—

"మొలక పై సిగ్గును మురిపెంబు గదుర
పొలతుక మౌక్తికంబులు దోయిలించి
క్రొత్త యాకలబోలు కొదమ సిబ్బెంపు
గుత్తంపు గుబ్బల కొమరు దీపింప
కరము లొయ్యన నెత్తి కాంతుపై విప్ర
తరుణులు దీవింప తలంబ్రాలు వోసె." (ద్వి. భా. 1832).

**యుద్ధ వర్ణనము :** బాణానిరుద్ధుల యుద్ధమున అనిరుద్ధ రచిత యుద్ధ ప్రకారము కడిమి ముప్పది రెండు గతి విశేషముల దండ బెట్టుచు మడి తాళముల్ జూపి దుష్ట రాక్షస గణములను పరిభవించినదట. యుద్ధ భూమిలో చెదరిన మొండెములు. దొర్లిపడు తలలు. గుండెలు ప్రేవులు రక్త మాంసములను తిని త్రేన్చు భూతములు. కరికుంభ మౌక్తికములు రాలునట్లు పాడుచు గృధ్రములు. ఘూకములు మొదలగు వానివి కవి కనులకు కట్టునట్లు వర్ణించినాడు. ఈ కావ్యమున యుద్ధ వర్ణనమే అధిక

ముగ కలదు ఈ కావ్యము నందింకను చిన్నన్న అనేక వర్ణనలను పొందు పరచెను. చిత్రలేఖ చిత్రరచనా నైపుణ్య వర్ణనము. శయ్యా వర్ణనము. స్త్రీల అలంకరణములు, ఖగపతి గమన వర్ణనము. బ్రాహ్మణ భోజనములు. ఉషా కన్యకు స్వప్నమున కలిగిన రతికేళీ ప్రాప్తి వర్ణనము రసజ్ఞ మనోజ్ఞములై చిన్నన్న వర్ణనా ప్రియత్వమును వేనోళ్ళ చాటు చుండెను.

"చిన్నన్న ఈ ద్విపద ప్రబంధ రచనలో తన స్వాతంత్ర్యము. వాక్చమత్కారమును. వర్ణనా వైవిధ్యమును పలు విధముల పోషించు కొనెను. ముఖ్యముగా స్త్రీ వర్ణనమున చిన్నన్న పోయిన పోకడలకు మితి లేదు" అని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు తా॥ కవులు - వివిధ సాహితీ ప్రక్రియలు (పు. 212) గ్రంథమున చిన్నన్న వర్ణనా నైపుణ్యమును ప్రశంసించిరి.

వర్ణనా నిర్వహణమున చిన్నన్న మూల విధేయుడు కాడు. స్వతంత్రుడు. మూలమున లేని చంద్రోపాలంభన వర్ణనమును చిన్నన్న చేర్చెను. మూలమున విస్తారముగ నున్న ఉషానిరుద్ధుల సురత కేళీ వర్ణనమును అనువాదమున విడిచెను. ద్వారకాపుర ప్రజలు పూర్ణకుంభముతో నెదురేగి శ్రీకృష్ణునకు స్వాగతము చెప్పిన వర్ణనము మూలమునందతి విస్తృతము. ఈ కావ్యమున కృష్ణుడు కథానాయకుడు కాకుండుటచే కాబోలు చిన్నన్న ఈ స్వాగత వర్ణనమును విడిచెను. చిన్నన్న వర్ణనలు విసువు పుట్టింపవు సరికదా ఆకర్షణీయముగ నుండి ఆహ్లాదమును కలుగజేయును.

"వర్ణనా నిపుణః కవిః" అను నాభాణకము చిన్నన్న కవి యందు సార్థకము.

# అలంకారములు

అలంకారములు కావ్య లక్ష్మికి నిజమైన అలంకారములు. వర్ణనలకు అలంకారములకు దగ్గర సంబంధము కలదు. అలంకార మయము గాని వర్ణనము మనకు ప్రాచీన కావ్యములలో కానరాదు. రసపోషణమునకు గూడ అలంకారములు తోడ్పడును. ఈ యలంకార రచనము అయత్న సిద్ధమైనచో కావ్యము రాణించును.

ఉషా కళ్యాణము నందలి సరోవర వర్ణనలో అయత్న సిద్ధముగ యమక గమక మిట్లు తొణికిసలాడినది.

"తొవలతో తావి చెందొవలతో దేంటి
గములతో తరళ భంగములతో సార
సములతో నవ సారసములతో నలర (ప్ర. భా. 322)

ఇందలి యమకము సరోవర ప్రవాహపు తూగును స్ఫురింపజేయుచున్నది. "యమకః పౌనరుక్త్యేతు స్వర వ్యంజన యుగ్మయోః" అని ప్రతాపరుద్రీయ లక్షణము. స్వర వ్యంజనముల జంట పునరావృతమైనచో అది యమకము. పై ఉదాహరణమున తొవలు, గములు, సారసములు పునరావృతమైనవి. ఇట్టిదే "పద్మాకరంబైన పద్మాకరంబు" అనునది. (ఉ. క. 750.)

బలరామ కృత బాణాసుర సేనా భంగ క్రమ కథనమున "చెండి వైచె దంతి దంతముల కుంతముల బంతముల నింత లింతలు గాగ" (ఉ.క. 1280) అను వాక్యమున వృత్త్యాను ప్రాసమను శబ్దాలంకారము గలదు. బిందు పూర్వక 'త' కార మిందు పలుమార్లు అవృతమైనది. "ఏక, ద్వి, ప్రభృతీనాంతు వ్యంజనానాం యథాభవేత్ పునరుక్తి రసౌ నామ వృత్త్యను ప్రాస ఇష్యతే" అని లక్షణము (ప్ర. రు.)

"మించి మదించి కామించి భావించి
కాంచి శంకరుడని కదియ నూహించి — (ఉ. క. 363)

ఇందు బిందు పూర్వక 'చ' కారము అనేక పర్యాయము లావృతమై వృత్యను ప్రాసాలంకారమైనది.

కావ్యాదిని గల శ్రీ యలమేలు మంగాదేవి స్తుతిలో- "అలమేలు మంగ కృపాజిరాపాంగ నలక నిర్జిత భృంగ నమితాగ మాంగ" అని చిన్నన్న అంత్యాను ప్రాసాలంకార యుక్తముగ అలమేలు మంగమ్మను వర్ణించెను. ఇట కృపా + అజిర + అపాంగ=కృపాజిరాపాంగ అనగా దయ ముంగిట గల క్రీగన్నులు కలది అని యర్థము. ఇక ఉషా కళ్యాణము నందలి అర్థాలంకారములను పరిశీలింతము. అర్థాలంకార రహితమైన కావ్య సరస్వతి విధవ వంటిదని పురాణ వచనము -

అలంకరణ మర్థానామర్థాలంకార ఇష్యతే
తం వినా శబ్ద సౌందర్య మపి నాస్తి మనోహరం
అర్థాలంకార రహితా విధవేవ సరస్వతీ".

— అగ్ని పురాణము.

దీనిని బట్టి అర్థాలంకారముల ప్రాముఖ్య మెట్టిదో గ్రహింపవచ్చును. అర్థాలంకారములలో ఉపమకే అగ్ర తాంబూలము. కారణము అదియే కొలది మార్పులతో తదితర ఉత్ప్రేక్ష నన్వయ రూప కాద్య లంకారములుగ పరిణమించుటయే.

**ఉపమాలంకారము :** ఉపమ తక్కిన అలంకారములకు బీజమని వామనుని అభిప్రాయము. అతిశయోక్తి సర్వాలంకారములకు బీజమని మమ్మటుని సిద్ధాంతము. అలంకారికులు పెక్కురు వామనుని అభిప్రాయమునే అంగీకరించిరి. దండి ఉపమా భేదము లనేకము పేర్కొనెను.

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్ర భూమికా
భేదాన్ రంజయతి కావ్యరంగే నృత్యంతి తద్విదాం చేతః"

అని అప్పయ్య దీక్షితులు ఉపమ వైశిష్ట్యము నుగ్గడించెను. ఉపమకు ప్రాచుర్యము కలిగించినవాడు కాళిదాసు.

చిన్నన్నయు ఉషా కళ్యాణము నందీ యలంకారమును హృదయావర్జకముగ నుపయోగించెను. కృష్ణుడు బాణుని సహస్ర కరములు ఖండించిన పిదప బాహువులు తెగిపడియున్న బాణుడెట్లుండెనో చిన్నన్న ఇట్లు తెల్పుచున్నాడు.

"గురుతైన జేవురు కొండ చందమున
నరకిన కొమ్ముల నగము రూపమున
పక్షము ల్వోయిన పతగంబుమాడ్కి...."  (ద్వి. భా. 1753)

ఇందు బాణుని స్థితిని వర్ణించుటకు కవికి ఒక ఉపమ చాలలేదు. మాలోపమ కావలసి వచ్చినది. ఇట్టి మాలికను కూర్చుటచే చెప్పదలచిన విషయము బలీయముగ మనస్సునకు హత్తుకొనును. అలంకార ప్రయోగమునందిది యొక రచనా విన్యాసము.

**ఉత్ప్రేక్ష** : చిన్నన్న ఊహా వైభవమంతయు ఉత్ప్రేక్షాలంకారమునందే కాననగును. "సంభావనాస్యాదుత్ప్రేక్షా వస్తు హేతు ఫలాత్మనా ఉక్తా నుక్తాస్పదా ద్యాత్ర సిద్ధా సిద్ధా స్పదే పరే" అనిచన్ద్రాలోక లక్షణము.

ఉషా కళ్యాణమున పార్వతీ దేవి సఖీజనులతో సరోవర క్రీడ ఒనర్చు సందర్భము నందలి యీక్రింది ద్విపద పంక్తులు పరికింపుడు.

"సరసీ జలంబుల చనుగవల్మంప
బలపైరి హేతికి బరచి శైలములు
జలధిలో దాగిన చందంబు దోప".  (ప్ర. భా. 350)

సరోవర జలములలో మునిగిన చెలికత్తెల చనుగవలు, ఇంద్రుని ఖడ్గము (వజ్రాయుధము)నకు భయపడి పారిపోయి సముద్రమున దాగిన శైలములా అనునట్లుండెనట. ఈ భావము పౌరాణికము. ఊహ అమూలకము.

*రూపకాను ప్రాణిత ఉత్ప్రేక్ష* : ఉద్యాన వనము నందు ఉషా చెలికత్తెల తారుణ్య దాశాను గుణ మనోహర లీలాచరణాదుల నభివర్ణించు సందర్భమున ఈ యలంకారములు ప్రయోగింపబడినవి.

"కాయజుండను వేఁట కాఁడు నిచ్చలును
పాయని కుచ చక్ర పక్షులం బట్ట
చివురు గండియలు మై జిమ్మెనో యనఁగ
పవమాన చలిత పుష్ప రసార్ద్రలతలు
పలుమారు తళుకు గుబ్బల మీఁద నొరయ
ఫలములు గోయంగ బరికించు వారు" —(ప. భా. 252)

పై వర్ణనమున మన్మధునకు వేటగానికి, కుచములకు చక్రవాక పక్షులకు అభేద ప్రతిపత్తి చెప్పి రూపకీకరించుట అమూలక మైన మనోజ్ఞ భావన.

ఉషాచెలికత్తెల అందమైన శరీరములనెడి ఉద్యాన వనము నందు పాయని కుచ చక్ర పక్షులను పట్టుటకు ఎరగా మన్మథుడను వేటకాడు చిమ్మిన చివురు గండియలా అనునట్లు పవమాన చలిత పుష్పరసార్ద్రలతలు వారి తళుకు గుబ్బల మీద నొరసినట్లు ఊహించుటలో ఉత్ప్రేక్ష అందగించినది. ఇది చిన్నన్న ఊహాపాటవమునకు, ప్రతిభా విశేషమునకు నిదర్శనము.

ఇంకను కారాగృహమున ప్రవేశించుచున్న ఉషానిరుద్ధులతో అచటి స్త్రీలు పలికిన పలుకులలో రాజషట్పదము, రాజపికము, రాజశుకము ఇత్యాది

ప్రయోగములలో రూపకాలంకారము కలదు. 'లలన నీ ముఖ కమలమునకై వచ్చి బలిమివి రాజషట్పద మెట్లు జిక్కె' అనుటలో రాజశబ్దము సాభిప్రాయమై అనిరుద్ధుడు ఉషాకన్య వలలో ఎట్లు చిక్కు కొనెనో రసోచితశైలిలో రూపకమున వ్యక్తము చేయబడినది.

**అనన్వయము** : ద్వారకా నగర పాలకులైన బలరామ కృష్ణుల సఖా వైభవ కథన సందర్భమున బలరామ కృష్ణులను గూర్చి చెప్పుచు—

"వలనొప్ప శ్రీరమా వక్షుడు హలియు
తము బోల్ప నన్యులు తగరటు గాన
తము తామె బోలి యాద్వారకాపురిని
బలవంతులై సర్వ బంధువుల్ గొల్వ...." (ఉ. క. 105)

ఉన్నారని అనన్వయాలంకారమున చెప్పబడినది. "ఉపమానోపమేయత్వం యదేకస్యైవ వస్తునః ఇందురిందురివ శ్రీమాన్ ఇత్యాదౌతత్ అనన్వయః" అని లక్షణము. ఒక పదార్థమునకే ఉపమానోపమేయములు చెప్పుట అనన్వయము. బలరామ కృష్ణులను పోల్చుటకు ఉపమానముగ అన్యులు తగరు కాన వారిని వారితోనే పోల్చి వారి పరాక్రమమును దెల్పుటకు అనన్వయాలంకారమును ప్రయోగించుట సందర్భోచితము.

**అపహ్నుత్యలంకారము** : ద్వారకా నగర సుందరీ జన సౌందర్య విశేషములను వర్ణించుచు పర్యస్తాపహ్నుత్యలంకారమున కవి యిట్లు రచించెను.

ఫాలంబులా యివి పంచసాయకుని
వ్రాలెడు హేమ పత్రంబులు గాక
కన్నులా యివి రతి కాంతుని చేతి
నన్నుత మోహనాస్త్రంబులుగాక

వీనులా యివి మరు వివిధాగమముల
గానంగ శ్రీకార వర్ణముల్ గాక
నాసలా యివి యనన్యజు వనవీధి
భాసిల్లు హేమ చంపకములు గాక" (ఉ. క. 76-101)

పై వర్ణనమున ఫాలములందు హేమపత్రత్వము. కన్నులయందు మన్మథుని మోహనాస్త్రత్వము, వీనులయందు శ్రీకారత్వము. నాసల యందు హేమ చంపకత్వమును ఆరోపించి కవి ఆయా వస్తువుల యందలి స్వధర్మ ములను మనోజ్ఞముగ అపహ్నవించెను. మరియు స్త్రీ సర్వావయవ వర్ణనము నందు తత్సర్వావయవములను మన్మథ సంబంధులుగా నిందు వర్ణించుట విశేషము. "అన్యత్ర తస్యారోపార్థః పర్యస్తాపహ్నుతిస్తుసః" అని చన్ద్రాలోక లక్షణము. "నాయం సుధాంశుః, కింతర్హి సుధాంశుః ప్రేయసీ ముఖం" అని ఉదాహరణము. ఇతడు సుధాంశుడు కాడు, నా ప్రియురాలి ముఖము సుధాంశుడు అని భావము. చిన్నన్న రచించిన పై ఉదాహరణమున ఫాలంబులా యివి, కన్నులాయివి, వీనులాయివి, నాసలా యివి అని ప్రశ్నించి కావను సమాధానమును స్ఫురింపజేసి వాని యందు హేమ పత్రత్వాదులను ఆరోపించి అలంకారమును అందగింపజేసినాడు కవి.

***అతిశయోక్తి*** : ఉషా కళ్యాణము నందు ద్వారకాపుర వర్ణనముతో నగర శోభను కవి అతిశయోక్తముగ తెల్పెను.

"ద్వారకా నగరంబు ధరణి చెన్నొందు
ముదితలాపురి సౌధముల మీది నుండి
చదలేటిలోడిగ్గి జలక మాడుదురు." (వం. 60)

ద్వారకా సౌధములపై నుండి స్త్రీలు సరాసరి ఆకాశగంగలో దిగి జలక మాడుదురట. ద్వారక సౌధౌన్నత్యము దెల్పుటకు ఎంత అందమైన అతిశయోక్తి యిది!

చమత్కారములు : కావ్యమున చమత్కారము పాయసమున జీడిపప్పు వలె మనస్సునకు తుష్టిని సమకూర్చును. ఉషా కళ్యాణము నందలి ఈ క్రింది ఉదాహరణము చూడుడు.

"పదిసూర్లు పెట్టి యేఁబదుల గుణింప
తుది యెంతయగు నన్ని తురగ రత్నములు
పదివేలు నూరింట బట్టి గుణింప
నది యెంతయగు చూడ నన్నియేనుగులు (ద్వి. భా. 1419)

ఇట్లు సాహిత్యమున అంకెల గారడీని ప్రవేశపెట్టుట చమత్కారము. పది వందల సంఖ్యను ఏబదితో గుణింపగా ఎంత సంఖ్య వచ్చునో అన్ని తురగమ్ములట. అట్లు గుణింపగా వచ్చిన సంఖ్యను కవి చెప్పడు. ఇట్లే పది వేల సంఖ్యను నూటితో గుణించమనెనే కాని ఆ గొప్ప సంఖ్యను చెప్ప లేదు. పాఠకుల తెలివికే వదలెను.

## భాష – శైలి

భావ ప్రవాహము నందించు భాషా విషయమున కవులకు ఎవరి సంప్రదాయము వారి కుండును. అట్లే ఎవరి శైలి వారిది. ఈ శైలీ విన్యాసమున తెలుగు కవులు కొందరు ప్రత్యేక ధోరణులను సాధించి భాషా ప్రపంచమున ప్రత్యేక స్థానములను సంపాదించుకొనిరి. ఇది నన్నయ భాష, ఇది తిక్కన భాష; ఇది నన్నయ శైలి, ఇది తిక్కన శైలి, ఈ శైలి ఎఱ్ఱనది, ఇది శ్రీనాథుని శైలి, ఇది పోతన శైలి ఇత్యాదిగ భాష - శైలి విషయము లందాయా కవులకు లోకమున గుర్తింపు లభించినది.

తాళ్ళపాక కవులు చాల వరకు దేశీయపద జాలముతో అచ్చతెనుగు భాషనే వాడిరి. అట్లని సంస్కృత భాషను విస్మరించినవారు కాదు. వారు బహు భాషాకోవిదులగుటచే అన్యదేశ్యములు, అన్య భాషా పదములు

వారి సాహిత్యము నందు చోటు చేసికొనినవి. చిన్నన్నయు సంస్కృతాంధ్రముల యందే కాక అనేక ఇతర భాషలందును పండితుడగుటచే ఈ లక్షణ మాతని కవిత్వము నందును కనిపించును.

"అలఘు శబ్దార్థ సారసరీతి రస ప్రభావముగ" (అ.మ.క పు.8) శబ్ద ప్రయోగముండ వలెనని చిన్నన్న అభిప్రాయము. అనగా రసోచిత పద ప్రయోగము అలఘు శబ్దార్థములతో అలరారవలెనని కవి ఆశయము. ఈ శబ్దార్థములకు పార్వతీ పరమేశ్వరులవలె అవినాభావ సంబంధము.

"దేవాపై బ్రాహ్మణోరూపే శబ్ద బ్రహ్మ పరంచయేత్
శాబ్దే బ్రహ్మణి విష్ణాతః పరంబ్రహ్మాధిగచ్ఛతి"

అని బ్రహ్మ బిందూపనిషత్. శబ్ద బ్రహ్మము అర్థబ్రహ్మము నెరిగించును. కనుకనే కవులు ముందు శబ్దబ్రహ్మోపాసనము చేసి శబ్ద ప్రయోగ దక్షతను సాధింపవలెను.

శబ్ద ప్రయోగమును గూర్చి తిక్కన 'అలతి అలతి తునియల కాహల సంధించిన తీరున నమరగ వలయు'నని తెల్పెను. అందులకు తన భారతమును లక్ష్యము చేసెను. ఒక్కొక్క భాషకు ఒక్కొక్క విధమైన పడికట్టు ఉండును. అదియే ఆ భాషకు గల జాతీయత. పలుకుబడిగ గుర్తింపబడును. ఇట్టిది తెలుగు భాషకును గలదు.

తాళ్ళపాక చిన్నన్నయు తన వంశీయులవలెనే తన కావ్యము లందు తెలుగు పలుకుబడికి తగిన రీతి దేశీయ పద బంధముగనే రచనను సాగించెను. ఈ క్రింది సమర భూమి వర్ణనము నందలి పదముల పొందికను చూడుడు.

"ఎడనెడ నిలదిండి యెగయు గాకములు
కరముల తరులు ముద్గరముల తతులు
పురకదంబములు నూపురకదంబములు
సిత సాయకములు భాసిత సాయకములు...."

ఇట్లే కృష్ణుని ముందు బాణుడు నాట్యము చేసిన సందర్భమున చిన్నన్న వాడిన నాట్య శాస్త్రోచిత భాషను పరికింపుడు -

"పలుమరు వంది సంభ్రమము రెట్టింప
తత తత్త జకిటజాతతికు దిద్ధిమికు
తతతోంగిణనుచు గౌతంబుగ్గళింప....
దింధిమ్మసంగ మద్దెళలు వాయింప (పు. 85)

ఇట్టి భావావేశ రచనము, తదనుగుణమైన భాషా ప్రయోగములచే సుందర తరమైనది.

ధ్వన్యనుకరణ పదబంధమైన భాషా ప్రయోగము : యుద్ధమునకు బాణుడెట్లు బయలుదేరెనో కవి ఇట్లు వర్ణించెను-

"ఘుమ ఘుమ యని వార్థి ఘూర్ణిలి కలఁగ
ధమ ధమ యని మ్రోయ ఢమరువు ద్రిప్పి
పెట పెట యని శైల బృందముల్ పగుల
గిట గిట యని పండ్లు గీఁటుచుగవలి"- (పు. 76)

ఇందలి ఘుమఘుమ, ధమధమ, పెటపెట, గిటగిట యను ధ్వన్యనుకరణ పదముల ద్వారా బాణాసురుని కోపమును, భావ తీవ్రతను ప్రదర్శించినాడు కవి. నాయకుడు 'కురకుర' నవ్వుచే కొమరైన వాడట. చిత్రలేఖ 'కవకవ' నవ్వినదట. ఉషా కన్య కుచద్వయము 'తుకతుక' లాడెనట. అనిరుద్ధుడు 'కలకల'యన నేత్ర కమలము లదిరరచెనట. ఉషా చెలికత్తెలు, ఎదలు 'తటతట' మన భయము నొందిరట. భావ స్థితిని దెల్పుటకై చిన్నన్న వాడిన ఇట్టి ధ్వన్యను కరణ భాష పాఠకుల పఠనోత్సాహమును ద్విగుణితము చేయును.

ఉషా కళ్యాణము వంటి చిన్నన్న భాషలో కఠారము, పరిఘ, పలక, వాలుకరము, పరశువు, తోమరము, శూలము, పక్కెర, కుంతము, పాశము, పట్టిసము, గద, ఖడ్గము, కార్ముకము, పాంచజన్యము, చక్రము, డమరుకము, ముద్గరము, చంద్రహాసము వంటి ఆయుధ సామగ్రిని దెలుపు పదజాలము, మద్దెల, వీణ, భేరి, కాహళము, ఆనకము వంటి వాద్య విశేష సంబంధిత పదజాలము; పతకము, కంకణము, కాలపెండియము, పావలు, అందెలు, మెట్టియలు, కమ్మలు, ఘుంగరు, వంటి ఆభరణాద్యలంకార సంబంధితపదములు; పుల్లెలు, పప్పు, బూరెలు, పాయసము, నేయి, చల్లపడితము, అల్లపు పచ్చళ్ళు వంటి భోజన పదార్థ సంబంధిత పదజాలము తెలుగుదనముతో గూడిన దేశీయ వాతావరణమును వాటి సమాజమును ప్రతిబింబించినవి.

చిన్నన్న భాషలో ఇతర భాషా పదము లనేకము చోటు చేసికొని నవి. "జముకాళ యొయ్యన సవరగా దరచి" (ఉ.క. 284) అను పదానిలో గల 'జముకాళ' యే జముకాణ. జంబుఖాన కావచ్చునని శ్రీ వేటూరి ఆనందమూర్తి గారభిప్రాయపడిరి. "చేతులే బీగంబు చేతులు కావె" (137) ఇందు బీగము (తాళము చెవి) అన్య భాషాపదము.

మరియు, సరసిజాప్తుతు చంద్రు 'సదిపొలిగాయ'; 'లేవెంద' కాల గండపెండెరము ధరించి; 'తురగసాదుల' (గుఱ్ఱపు రౌతు) మెదల్ తుష్టమంగళేవి; 'గిజ్జడి'యైన తొడలు వంటి కొన్ని విశిష్ట పద ప్రయోగ ములు ఉషా కళ్యాణమునందు కన్పట్టుచున్నవి. "వంట యింటిలో మెలగు కుండేటి కరణి" వంటి తెలుగింటి సామెత లీ కావ్యమున అటనట కని పించును. "కాలొకదు కేలొకదుగా బట్టి కొనిపోయిరి" అనుటలో చిన్నన్న తెలుగు పలుకుబడి తొంగి చూచెను. "కనలి నిప్పులు కన్నుగవరాల" (ఉ.క. 344) వంటి చిన్నన్న తెలుగు జాతీయ పద ప్రయోగమున 'కనలిన కోప వేగమున కన్నుల నిప్పులు రాల' అన్న భారత తిక్కన్న

చటుక్కున స్ఫురింపక మానదు. ఈ కావ్యమున చిన్నన్న ప్రయోగించిన కొన్ని పదములకు అర్థస్ఫూర్తి వెంటనే కలుగదు. కొన్నింటి అర్థములు నిఘంటువు లందు కూడ కానరాదు. ఉదా -

"పొటికర తరకసంబులును సేవంతి
బటువు కైవడమును భాసిల్లు మరుడు" (ఉ.క. 520)

ఇందలి 'పొటికర' అనగానేమి? బహుశః ఇది పొటకఱ-పొట్టకఱ్ఱ=కమల గన్నము కావచ్చును. తరకసమనగా అమ్ములపొది; వడము అనగా దండ-కైవడమనగా చేతి దండ కావచ్చును. ఈ కావ్యములోని చిన్నన్న భాషలో అచ్చతెనుగు పద ప్రయోగ మధికము. కొత్త ముత్తియపు గొండ్లెము, తలిరాకు టడిదము, పయ్యెదకొంగు, పులితోలు పచ్చడము, దొక్కలు, దొక్కారము, బాసికము వంటివి ఇందుల కుదాహరణముగా చూడవచ్చును.

ఇది యిట్లుండ ఈ కావ్యమునందు చిన్నన్న ప్రయోగించిన భాషలో కొన్ని వ్యాకరణ దోషములు, అటనట కొన్ని యతి దోషములు కానవచ్చు చున్నవి. ఈ క్రింది వానిని పరికింపుడు.

1. మోహనగాత్రి కంభోజనేత్రికివి (32)- ఇందు 'అంభోజనేత్ర' అనుట సలక్షణము.
2. దరిజేర్చు పల్లవాధరి! ననుననిన (493)- 'పల్లవాధర' అని యుండ వలెను.
3. ఈ రీతి నెచ్చెలు లేణ నేత్రికిని (ద్వి. 550) 'ఏణనేత్ర' అనుట ఒప్పు
4. కీర తుండాధరి! కేలుగిలించి (448)- 'కీరతుండాధర' అనుట ఒప్పు.
5. ఉవిదోర్తు కిన్నర యొసంగ నా వేళ (ద్వి. 414) ఇందు 'ఉవిద + ఓర్తు' అనుచోట సంధి నిషిద్ధము. స్త్రీ వాచక తత్సమ సంబోధనాంతము

లఘు సంధి లేదని వ్యాకరణ నిషేధము. ఇది ఇట నుల్లంఘింపబడినది. అయినను 'నైలంతిచ్చెను' వంటి ఇట్టి ప్రయోగములు భాషలో ఇతరత్రా చూడవచ్చును.

6. "సందొక్క వడిమన్న నైసాఖి కావి
పూండిగె లేజిగి బొల్పు హస్తములు"– (ద్వి. పం. 1930)

ఇందు దీర్ఘము మీద సాధ్యపూర్ణము వాడబడినది. అట్లు వాడరాదని వ్యాకరణము. కాని చిన్నన్న ఇందు ప్రాసస్థానమున దీనిని ప్రయోగించెను. జన వ్యవహారములో పూంచు, క్రేంచు మొ.గు. పదములలో పూర్ణ బిందు వగుపించుచున్నది. చిత్తూరు మండల ప్రాంతమున నేటికిని అరసున్నలున్న చోట పూర్ణ బిందువు నుపయోగించుట కలదు. 'వాండు' 'మేంక' వంటి పదము లిందు కుదాహరణములు.

ఇవిగాక నిందు "కనుగొని విరహాగ్ని కాకచే మిగుల వనజాక్షి మై డీఁగెవాఁడె"(ప్ర. భా. 541) అనుదావిలోగల 'విరహాగ్నికాక' వంటి సమాసములు దర్శనమిచ్చును.

**యతి దోషములు :** ఈ కృతి యందగుపించుచున్న కొన్ని యతి దోషములను చిత్తగింపుడు-

1. బంగారు పావలు పొందుగా మెట్టి (ద్వి. పం. 235)
2. దనుజాత ; మూఢ ! ప్రల్లదము లేమిటికి ? (ద్వి. పం. 1586)
3. శంకర ధృత నీల కంఠంబు ద్రుంచె (ది. పం. 1626)
4. వెదరిన మెదడు గిజ్జడియైన తొడలు (ద్వి. పం. 1727) ఇందు 'గిజ్జిడి' అనినచో యతి సరిపోవును.
5. గెలిచియు సమర కాంక్షత మగ్గవింప (ద్వి. 130) 'కాంక్షిత' మనుట సలక్షణము. కాంక్షత మనుటచే యతి భంగమగును.

మతాలి నివేశము గల శివకవుల వలె శాస్త్రపాక కవులును భక్త్యా వేశములో నిట్టి దోషములకు పాల్పడి యుండవచ్చును. "అపి మాషం మషం కుర్యాత్ ఛందోభంగంన కారయేత్" అని ఒక సూక్తి. చిన్న చిన్న కవులు కూడ చేయని వ్యాకరణ యతి దోషములకు అంతటి కవితా పాండిత్య సంపన్నుడైన చిన్నన్న పాల్పడినాడన్న ఆశ్చర్యమే కలుగు చున్నది. (కొన్ని దోషములు ప్రాచీన ప్రతులందు సరిగ అగుపించని కారణమున గాని, లేఖకుల దోషము వలనగాని, పరిష్కర్తల పొరపాటు వలనగాని సంభవించి యుండవచ్చునేమో!) ఏది ఏమైనను భక్త్యావేశమున కానిండు, తొందరపాటుచే కానిండు ఈ కావ్యము నందిట్టి దోషములగు పించుటచే రచనా సౌష్ఠవము దెబ్బతిని కొందరకు ఇదియే చిన్నన్న మొదటి రచన కావచ్చునన్న అనుమానమునకు తావిచ్చు చున్నది. కాని ఇది చిన్నన్న రెండవ రచనము. అయినను ఎందులకో కొంత హడావుడిగ అతడీ కావ్యమును రచించి యుండునని నాకనిపించుచున్నది.

శైలి : చిన్నన్న శైలి సెలయేటి గలగల వలె మనోహరమై ధారాశుద్ధి కలిగి శబ్దాలంకార శోభితమై లలిత పదభూయిష్ఠమై యలరారు చుండును. ఇతనిది ప్రధానముగా వర్ణనాత్మక శైలియే (Descriptive Style). ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర గ్రంథము నందు చిన్నన్న రచనలలో అష్టమహిషీ కళ్యాణమును గూర్చి చెప్పుచు శ్రీమతి డా॥ టి. సుశీలగారు "ఈ పొత్తము నందు కంటె పీఠిని శైలి ఉషా కళ్యాణ, పరమయోగి విలాసము లందు విగ్గులు దేరి ప్రౌఢమై యొప్పారు చున్నదని" (పు. 237) స్పష్టముగ చెప్పిరి. అష్టమహిషీ కళ్యాణ ఉషా కళ్యాణము లందలి సమాన సన్నివేశమైన ఈ క్రింది ద్వారకా నగర వర్ణనలోని శైలీ ప్రౌఢతను పరికింపుడు.

"సకల విశ్వంభరా చక్రంబు నడుమ
నకలంకమై మేరు వమరు చందమున

ధారుణీ దోష విదారణంబైన
ద్వారకా నగరంబు ధరణి చెన్నొందు...."
(ఉ.క. ప్ర.భా 52-62)

ఇది ఉషా కళ్యాణము నందలి ద్వారకా నగర వర్ణనము. ఇక అష్టమహిషీ కళ్యాణము నందలి ద్వారక-

"సార కస్తూరికా సహిత నీహార నీర కర్పూర పర్ణిత కాంతి జాల
హార కల్పిత గృహానేకాంశ విజిత తారక వేష్టితోదార సముద్ర
హారక కమలాకరాంచిత హంస కీర కదంబ సంకీర్ణ సౌధాగ్ర
చారక గగనాధ్వ చారక వ్యూహ దారక నమ్మహాద్వారకఁగాంచి...."
అ.మ.క. అశ్వా. 4., పు. 183

ఇట్టి సంస్కృత సమాస భూయిష్టమైన శైలిని ఉషా కళ్యాణము నందును చిన్నన్న అటనట అలవోకగ గుప్పించెను. "అతులాయుధోజ్వలాయత బాహుదండ శిత సహస్రార భాసిత విస్ఫులింగ రక్తాబ్జ వికచ పత్ర త్రయోదగ్ర నక్తంచరాంత కాన్వయ రక్తదళన చక్రంబు సంధించి" (ద్వి.భా. 1653) యుద్ధ సన్నివేశమున వీరరస పోషణమునకై ప్రయుక్తమైన శైలి యిది. ఇట్లు చిన్నన్న ఒక్కొకచో రసోచిత శైలిని ప్రదర్శించెను. గజగణదంత ఖండన భంగ వధాది సందర్భమున -

"తండ తండముగ వేదండ తుండముల
తుండించు తనవాడి తుండంబు చేత" (ఉ. క. 1270)

అనురీతి బిందు పూర్వక దకారముతో వీరరసోచిత శైలి విజృంభించినది.

అచ్చ తెనుగు భాషా పద జాలముతో అల్లిన అందమైన శైలికి ఉదాహరణముగ ఈ క్రింది ద్విపద పంక్తులు చూడుడు.

"తలిరాకు టడిదంబు తమ్మిబాదకము
చిలుక వారువము మించిన మొల్లగోలిక
చెఱకు సింగిణి మీను సిడెము తుమ్మెదల
గఱుల తూపుల నల్లగలువ జోద నటి
పాటికర తరకనంబులును సేవంతి
బటువు కైవడమును.... (ఉ. క. 520)

ఇందలి శైలి మనోజ్ఞమయ్యు శబ్దముల కూర్పు సాంకేతిక పదయుక్తము. ఇట్టి సంస్కృతాంధ్ర పద శైలీ విన్యాసము ఉషా కళ్యాణము నందు రస వంతమై కన్పట్టుచున్నది.

***కళ్యాణ కావ్యముల భేద సాదృశ్యములు :*** ఇతివృత్త నిర్వహణము నందు అష్టమహిషీ కళ్యాణమున ఆఖ్యాన విభజనము కలదు. ఉషా కళ్యాణ కథ రెండు భాగములుగ విభక్తమై ప్రథమ ద్వితీయ భాగములలో నిర్వహింపబడినది. కావ్యాదిని భావి కథా సూచనము గావించి రచించుట రెంటను సమానమే. పాత్ర చిత్రణములో పాత్ర వర్ణనా ధోరణి ఉషాకళ్యాణము నందధికముగ కాన్పించును. శ్రీకృష్ణుని పాత్ర అష్టమహిషీ కళ్యాణము నందు శృంగార రస ప్రధానముగ. ఉషా కళ్యాణమున వీరరస ప్రధానముగ చిత్రించుటలో కవి గొప్ప ప్రతిభను ప్రదర్శించెను. అష్ట మహిషీ కళ్యాణమున కళ్యాణ కృష్ణునిగ చిత్రించిన చిన్నన్న ఉషా కళ్యాణమున దుష్టశిక్షణచేయు అవతారమూర్తిగ తీర్చిదిద్దెను. కృష్ణుని స్వరూపభావ వర్ణనము అష్టమహిషీ కళ్యాణమున సర్వత్ర కనిపించును. అది కృష్ణ నాయక కావ్యము గాన కవి అందట్లు విశదముగ వర్ణించి ఉషా కళ్యాణమున కృష్ణుని వర్ణనము క్లుప్తము చేసి ఔచిత్యమును పాటించెను. వస్తుతః కృష్ణుడు శృంగార ప్రియుడైనను ఉషా కళ్యాణమున యుద్ధవీరుడయ్యెను కృష్ణుని యుద్ధోద్ధత్యము అష్టమహిషీ కళ్యాణము నందును లేకపోలేదు.

శ్రీనాథ- శ్రీకృష్ణదేవరాయల యుగములందు వెలసిన తెలుగు సాహిత్యము సామాన్యముగ శృంగార రస ప్రధానము కాగా ఇంచుమించు అదే కాలమునకు చెందిన తాళ్ళపాక కవుల కావ్యములు సంకీర్తన పరికీర్తితములై భక్తి శృంగారములు రంగరించిన మూర్తిత్వము కలిగియుండగా తాళ్ళపాక చిన్నన్న కృతులు విశేషించి కళ్యాణ కథా కావ్యములు కొంత భక్తి ఆనుషంగికముగ శృంగార రస ప్రధానములై విరాజిల్లినవి. అష్టమహిషీ కళ్యాణమునందీ లక్షణము స్పష్టము. ఉషా కళ్యాణము నందు శృంగార వీరములు సమప్రాధాన్యము నొందినట్లనిపించును గాని అదియు శృంగార రస ప్రధానమైన కావ్యమే. వీరాదులంగ రసములుగ శృంగారమునకు పరిపోషకములై విరాజిల్లినవి.

చిన్నన్న రచించిన ఈ కళ్యాణ కావ్యములలో అష్టమహిషీ కళ్యాణమువలె ఉషా కళ్యాణము అతి విస్తృతము కాదు. అష్టమహిషీ కళ్యాణము నందు వలె అష్టాదశ వర్ణనలు ఉషా కళ్యాణమున లేవుకాని ఉన్నవి మాత్రము సందర్భోచితములు, కథానుకూలములు. వీనిలో వ్యక్తి స్వరూప వర్ణనలే ఎక్కువ. ఈ రెంటు కావ్యము లందును గల ద్వారకా నగర వర్ణనమున— "ధారుణీ దోష విదారణంబైన ద్వారకా నగరంబు ధరణి నొప్పొందు"నని ఉషా కళ్యాణమున చెప్పెను. కాని అది యెట్లో తెలుపలేదు. 'ఇహ పర ద్వారక యగుటచే నిది ద్వారక' మైనట్లు చెప్పిన అష్టమహిషీ కళ్యాణ వాక్యార్థమిట అను సంధేయము. అష్టమహిషీ కళ్యాణము నందింకను చిన్నన్న రెండు మూడు తావుల ద్వారకను వర్ణించెను. అవి సుదీర్ఘములుగ నున్నను ఉషా కళ్యాణము నందున్న భావపటుత్వమందు కానరాదు.

ఉషా కళ్యాణమున ఉషానిరుద్ధుల వివాహము, అష్టమహిషీ కళ్యాణమున కృష్ణాష్టమహిషుల కళ్యాణము సమాన సన్నివేశములు. అష్టమహిషీ కళ్యాణమున రుక్మిణీ కృష్ణుల వివాహ వర్ణనము ఉదాత్త రమణీయము, అతి విస్తృతము ఉషానిరుద్ధుల వివాహ వర్ణనము

ఉదాత్త రమణీయమైనదే కావి అనతి విస్తృతము. ఉషా విరుద్ధుల వివాహ వర్ణనలో లగ్న నిశ్చయము, పెండ్లి పందిరి నిర్మాణము, వరపూజ, మధుపర్క ప్రదానము, బాసికము, మహాసంకల్పము, మంగళాష్టక పఠనము, కన్యాదానము, వధూవరులు పరస్పర ముఖావలోకనము, తలంబ్రాలు పోసి కొనుట, ముత్తైదువలు ధవళములు పాడుట, బ్రాహ్మణులారగించిన భోజనములు ఇత్యాదులనేకము రమణీయముగ వర్ణింపబడినవి. అష్ట మహిషీ కళ్యాణము నందు పై విషయము లన్నింటితోపాటు గర్గ్యుడు గడియారము చూచి సుముహూర్తమును తెలుపుట, 'కుర్వంతు మంగళం' అని పలుకుట, జేగంట వాయించుట, బ్రేలిమి మొదలైన విధులను వధూ వరులచే ఆచరింపజేయుట మున్నగు అంశము లధికముగ వర్ణితములైనవి. ఇట్టి కళ్యాణ కావ్యములందు సమాన సన్నివేశములలో సహితము వైవిధ్యము ప్రదర్శితమైనది, వన పుర విరహ వివాహ యుద్ధాది వర్ణనలలో ఈ రెండు కావ్యములు ఒకదానితో ఒకటి పోటీపడుచున్నట్లు గోచరించును. అష్టమహిషీ కళ్యాణములో రుక్మిణీ స్వరూప వర్ణనము, గోపికా విరహ వర్ణనము; ఉషా కళ్యాణమున ఉషా వర్ణనము, ఉషా విరహ వర్ణనము లందు గల వైవిధ్యము కవి ప్రతిభకు నికషోపల నిదర్శనము.

భాషా విషయముగ శబ్దపరమైన రచనా సౌష్ఠవము అష్టమహిషీ కళ్యాణమున కంటె ఉషా కళ్యాణమున తగ్గినది. శ్రీకృష్ణ స్వరూప ద్వారకా నగర వర్ణనాది కొన్ని సందర్భములలో చిన్నన్న శైలి ఉషా కళ్యాణము నందు కంటె అష్ట మహిషీ కళ్యాణము నందే ప్రౌఢమై నిగ్గులుదేరి యొప్పారినది. రెంటను అచ్చ తెనుగు పద ప్రయోగమధికమనియే చెప్ప వలెను. రెండు కావ్యము లందును ఆలంకారికమైన రచనా సౌందర్య మధికమైనను చమత్కారములు అష్టమహిషీ కళ్యాణము నందు కంటె ఉషా కళ్యాణము నందు తక్కువ.

ఇక అనంతర ప్రకరణము లో పరమ యోగి విలాస కావ్య సమీక్ష—

# 4. పరమ యోగి విలాసము సమీక్ష

చిన్నన్న కృతులలో మూడవది, ఉత్కృష్టమైనది పరమ యోగి విలాసము. దీని నతడు క్రీ.శ. 1546 సంవత్సరమున రచించినట్లు తెలియు చున్నది. ఇది వైష్ణవ భక్తి నిధి. వైష్ణవ మతౌన్నత్యమును ప్రదర్శించు 12, 764 ద్విపదలతో గూడిన విస్తృత బృహద్గ్రంథరాజము. ఇంత విస్తృతమైనను విసుగు పుట్టించని మృదు మధుర కవితారస పరిపుష్టితో రాణించిన పరమ ద్విపద కావ్యము. ఈ కావ్యము వైష్ణవ మతాభిలాషులకు 'స్త్రైడు' వలె ఉపకరించునని శ్రీ పెనుమాదు వెంకట శేషయ్యగారు 'తాళ్ళ పాక కవులు' గ్రంథమున పేర్కొనిరి. ఈ కావ్యమును చిన్నన్న శ్రీ వెంకటేశ్వరస్వామి అలమేలుమంగలకు అంకితము చేసెను.

***సామ్యభేద ప్రదర్శనము :*** తెలుగు సాహిత్యమున విజయ విలాసము, చంద్రరేఖా విలాసము, వైజయంతీ విలాసము వంటి కావ్య ములు శృంగార రస ప్రధానములై ప్రణయ విలాసమును దెల్పుచుండ భక్తులగు ఆళ్వారుల చరిత్రకు చిన్నన్న పరమయోగి విలాసమని పేరు పెట్టుటలో గల విశిష్టత ఏమో పరిశీలింతము.

పరమ యోగి విలాసములోని పరమ శబ్దము విశిష్టతా సూచకము. విశిష్టమైన యోగము కలవారు పరమ యోగులు. బహుశః ఈ వైష్ణవ యోగులు శైవ యోగులు కన్న విశిష్టులని సూచించుటకు కొరకు కవి ఈ పేరు పెట్టి యుండవచ్చును. శివుడు యోగేశ్వరుడు. విష్ణువు యోగే శ్వరుడు. "యత్ర యోగేశ్వర కృష్ణః" అని గీత. శంకరుల మతమున జీవ బ్రహ్మలు ఒక్కటే. "జీవో బ్రహ్మైవ" అని వారి మతము. జీవుడు భగ వంతుని అంశ మాత్రమే అని వైష్ణవ మత సిద్ధాంతము. అంశో నానావ్యప దేశాత్" (బ్రహ్మ సూత్రములు) "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనా తనః" (గీత) అను వాక్యము లిందుకు ప్రమాణమందురు. శాంకరమతాను సారము జీవ బ్రహ్మ లొకటియే కనుక శివుడు, శివభక్తులును యోగీశ్వర

శబ్ద వాచ్యులే. కాని విష్ణువు యోగమునకే అధీశ్వరుడగుటచే అతని భక్తులు పరమ యోగులుగనే యుండిరి. ఈ విశిష్టార్థమును పరమ యోగి శబ్దము సూచించుచున్నది. అద్వైతము భావనా మాత్ర గమ్యము కనుక ఆళ్వారులు పరమ భక్తులుగనే యుండిపోయిరి. వీరి భక్తి విలాసమునకు సంబంధించిన దగుటచే ఈ కావ్యము పరమయోగివిలాసమైనది. విలాసమనగా క్రీడ. ఇది స్త్రీ పురుషుల శృంగారమునకు మాత్రమే రూఢమైనను అట్టి చేష్టను వీరు భగవదర్పితము గావించుటచే వీరిది భక్తివిలాస మనవచ్చును. శృంగార విలాసము ప్రేయోభావము. భక్తివిలాసము శ్రియఃపతి సంబంధి యగుటచే శ్రేయోభావము. మొదటిది భౌతికానందము. రెండవది ఆత్మా నందము. కావున విజయవిలాసాది శృంగార కావ్యములు సాధించు ఫలితము వేరు, పరమ యోగి విలాసము వంటి భక్తి కావ్యము సాధించు ఫలితము వేరు.

**ఆళ్వారులు** : 'ఆళ్వారు' పదమును శ్రీ ఆర్. ఎస్. దేశికన్ పండితుడిట్లు నిర్వచించెను.

**"The word 'Alwar' has pienliar significence of its own. It means one who has surk into the depths of his existence or one who is lost in repturous devotion to the Lord. It is a word quite descriptive of ell God - intoxicated man".**

**- Greins of Gord - R. S. Desiken - పు. 6.**

భగవదనుభవము నందు లోతు చూచిన వారు ఆళ్వారులని అర్థము. వీరు భగవద్గుణానుభవము నందు నిమగ్నులు. నిత్యము భగవత్సాక్షాత్కార ముతో బ్రహ్మానందము ననుభవించుచు నిరంతర భగవదారాధనమున ఒడలు మరచి యుందురు. శ్రీమన్నారాయణుని అంతరంగ కైంకర్య నిర్వాహకు లైన నిత్య సూరులు వీరు. "తద్విష్ణోః పరమం పదం సదా పశ్యంతి సూరయః" అని వైదిక సూక్తమీ నిత్య సూరులను నిర్వచించినది. సమస్త

చేతనోజ్జీవనార్థము వారు భగవన్నియతిచే భూలోకమున దక్షిణ భారతదేశము నందవతరించిరి. వీరు మహర్షులవలె అరణ్య వాసము చేయనవసరము లేకుండగనే, సన్యాసులవలె సంసార పరిత్యాగము చేయకుండగనే సంసారము నందేయుండి, సంసారులతో సావాసము చేయుచు యముని తలపై నాట్య మాడుదుమనునంతటి ఆత్మ స్థైర్యముతో ప్రవర్తించుటకు కారణము వీరు భగవన్నిర్హేతుక జాయమాన కటాక్షలబ్ధ దివ్య జ్ఞాన సంపన్నులగుటయే. తమ దివ్య జ్ఞానముతో భగవానుని ఆత్మభూతులందగ్రేసరులై పరమమైన స్థితికి చేరుకొన్న వీరు పన్నిద్దరాళ్వారులుగ, ద్వాదశ సూరులుగ ప్రసిద్ధి పొందిరి.

ఈ ఆళ్వారుల యొక్కయు, నాథముని యామున రామానుజుల యొక్కయు దివ్య చరిత్రల వైభవ కవితా గానమే చిన్నన్న పరమయోగి విలాసము. ఈ కావ్యమున ఆళ్వారులు యోగులుగ సంభావింపబడిరి. వీరి నామ ధేయములివి.

1. పొయ్గై ఆళ్వారు-కాసారయోగి, 2. భూతత్తాళ్వారు-భూతయోగి, 3. పేయాళ్వారు-మహదాహ్వయయోగి, 4. తిరుమళిశై ఆళ్వారు-భక్తసార యోగి, 5. నమ్మాళ్వారు-శఠగోపయోగి, 6. మధురకవి ఆళ్వారు-మధుర కవియోగి, 7. కులశేఖరాళ్వారు-కులశేఖరయోగి, 8. తిరుప్పాణి ఆళ్వారు-ముని వాహనయోగి, 9. తొండర డిప్పొడి ఆళ్వారు-విప్రనారాయణయోగి, 10. పెరియాళ్వారు-విష్ణుచిత్త యోగి, 11. అండాళ్-గోదాదేవి (యోగిని), 12. తిరుమంగై యాళ్వారు-పరకాల యోగి.

*ఆళ్వారులు-నాలాయిర దివ్య ప్రబంధము* : శ్రీ వైష్ణవ ధర్మమును శ్రీ మహావిష్ణువు శ్రీదేవికి ఉపదేశింపగా నామె దానివి. విష్వక్సేనునకు చెప్పెను. గురు పరంపరాగతముగ అది శ్రీరామానుజులకు సంక్రమించి వారి ద్వారా లోకమున వ్యాపించెను. భగవద్రామానుజులు

స్థాపించిన విశిష్టాద్వైత శ్రీ వైష్ణవ ధర్మ సంప్రదాయమునకు ఆళ్వారుల శ్రీ సూక్తులే మూలము. పై పన్నిద్దఱాళ్వారులు సాయించిన నాలాయిర దివ్య ప్రబంధమునకే 'ద్రావిడ వేద'మని పేరు. నాలాయిరమునందు 4000 పాశురములు కలవు. ఇది 4 భాగములు.

మొదటి వేయి-ముదలాయిరము : ఈ భాగము తిరుప్పల్లాండుతో ప్రారంభమగును. ఇందు పెరియాళ్వార్ తిరుమొழి. తిరుప్పావై. నాచ్చియార్ తిరుమొழి, పెరుమాళ్ తిరుమొழి, తిరుచ్చంద విరుత్తమ్, తిరుమాలై, తిరుప్పళ్ళి యెళుచ్చి, అమలనాదిపిరాన్, కణ్ణినున్ శిరుత్తాంబు అను దివ్య ప్రబంధములు కలవు. వీని యందలి మొత్తము పాశురముల సంఖ్య 940. పెరియాళ్వారు, ఆండాళ్, కులశేఖర, తిరుమழிశై, తొండర డిప్పొడి తిరుప్పాణి మధుర కవి ఆళ్వారులు ఈ మొదటి భాగమునకు కర్తలు.

రెండవ ఆయిరము-పెరియ తిరుమొழి : ఇందు పెరియ తిరుమొழி, తిరుక్కుఱుందాండగమ్, తిరునెడున్దాండగమ్ అను ప్రబంధములు గలవు. పాశురముల మొత్తము సంఖ్య 1134. ఈ భాగమంతయు తిరుమంగై ఆళ్వారు లొక్కరే రచించిరి.

మూడవ ఆయిరము - ఇయఱ్పా : ఇందు ముతల్ తిరువన్దాది, ఇరణ్డాన్తిరువన్దాది, మూన్ఱాన్తిరువన్దాది, నాన్ముగన్ తిరువన్దాది. తిరువిరుత్తమ్, తిరువాశిరియమ్, పెరియ తిరువన్దాది, తిరువెழுక్కూత్తిరుక్కై, శిరియ తిరుమడల్, పెరియ తిరుమడల్, ఇరామానుశనూత్తన్దాది అను దివ్యప్రబంధములు కలవు. ఈ భాగము నందలి పాశురముల సంఖ్య 825. వీనిని పొయిగై పూదత్తపేయాళ్వారు తిరుమழிశై తిరుమంగై నమ్మాళ్వారులు వెలయించిరి. ఈ భాగమునకు 'ఇయఱ్పా' అని పేరు.

నాల్గవ ఆయిరము - తిరువాయిమొழி ; ఇందు 1102 పాశురములు కలవు. ఈ భాగమంతయు నమ్మాళ్వారులే రచించిరి. ఇట్లు మొత్తము

4,101 పాశురములతో అరవ భాషలో నాలాయిర దివ్య ప్రబంధము వెలసినది.

ఇందు నమ్మాళ్వారులు గానము చేసిన తిరువిరుత్తమ్. తిరువాశిరియము, పెరియ తిరువందాది, తిరువాయి మొళి అను నాలుగు ప్రబంధములు వరుసగా ఋగ్వేద యజుర్వేద అధర్వణవేద సామవేద సారములుగ పరిగణింపబడినవి. తిరుమంగై ఆళ్వారు రచించిన పెరియ తిరుమొళి, తిరుక్కురుందాండగమ్, తిరునెడున్దాణ్డగమ్, పెరియ తిరుమడల్, శిరియ తిరుమడల్, తిరువెళుక్కూత్తిరుక్కై అను ఆరు ప్రబంధములు వేదాంగములు (శిక్ష వ్యాకరణ చ్ఛందోనిరుక్త జ్యోతిష కల్పకములు) అనబరగినవి, తక్కిన ఆళ్వారుల కీర్తనలు ఉప వేదములుగ కీర్తింపబడినవి. ఇదంతయు ద్రావిడ వేదమై 'ద్రవిడ ప్రబంధము'గ పరిగణింపబడనది.

తాళ్ళపాక చిన్నన్న పరమ యోగి విలాసమును ద్రవిడ ప్రబంధము చూచి తెనుగున రచించినట్లు కావ్యావతారికలో చెప్పుకొనెను.

> పనుపడ ద్రవిడ ప్రబంధంబు చూచి
> తెనుగున రచియింపు ద్విపద రూపమున" — (పు 4)

అని చిన్నన్నకు స్వప్నమున వేంకటేశ్వరస్వామి అనతిచ్చెనట. ఆ ద్రవిడ ప్రబంధ నిర్మాతలైన ఆళ్వారుల చరిత్రలే ఈ పరమ యోగి విలాసము.

**మాతృక - మౌలికత్వము :** చిన్నన్నకు పూర్వమే ఆళ్వారుల చరిత్ర ఇతర భాషలలో కావ్యరూపము నందియున్నది. చరిత్ర కందినంత వరకు గరుడవాహన పండితుడు సంస్కృతమున రచించిన 'దివ్యసూరి చరితము' మొదటిది. ఇతడు క్రీ. శ. 11వ శతాబ్దమువాడు, భగవద్రామానుజులకు సమకాలికుడు. పెన్నళగియ పెరుమాళ్ జీయర్ ద్రవిడ సంస్కృత భాషామయముగ రచించిన 'గురుపరంపరా ప్రభావము' రెండవది. ఇతడు క్రీ. శ. 14వ శతాబ్దము వాడు. మూడవది అనంతాచార్య పండితుడు

సంస్కృతమున రచించిన 'ప్రపన్నామృతము'. ఇది 16 వ శతాబ్దాంత మున రచింపబడెను. నాల్గవది ఆచార్య సూక్తిముక్తావళి. దీనిని తెలుగు సీస పద్యములలో ప్రతివాది భయంకరం అణ్ణన్ శిష్యుడగు నంబూరి కేశవాచార్యుడు 17వ శతాబ్దమున రచించెను. గ్రంథ రచనాకాలమును బట్టి ఆచార్య సూక్తిముక్తావళి ప్రపన్నామృతములు చిన్నన్నకు ఆధారము కాజాలవు. పై కావ్యములందే గాక దివ్య ప్రబంధముల కేర్పడిన వ్యాఖ్యలలో గూడ ఆళ్వారుల చరిత్రలు పర్ణితములైనవి. విశదనాచ్ఛిఖా మణి యని పేరు పొందిన పెరియ వాచ్చాంబిళ్లై (కృష్ణసూరి) దివ్య ప్రబం ధములకు వెలయించిన వ్యాఖ్య యిందుల కుదాహరణము. ఇట్లే బ్రహ్మ తంత్రస్వామి మణి ప్రవాళ భాషలో రచించిన 'మువ్వాయిరప్పడి' యను వడగలై గురుపరంపరా ప్రభావము నందును ఆళ్వారుల చరిత్ర కలదు.

చిన్నన్నయే గ్రంథాదిని ద్రవిడ ప్రబంధమును చూచి తెనుగున రచియింపుమని వేంకటేశ్వరుడానతిచ్చినట్లు చెప్పుకొనినను ఆ ద్రవిడ ప్రబం ధము నాలాయిరము గాక పెన్నళిగియ పెరుమాళ్ జీయర్ ద్రావిడమున మణి ప్రవాళములో రచించిన గురుపరంపరా ప్రభావమని నిర్ధారింపవచ్చును. ఇందులకు ప్రమాణముగ మచ్చునకీ క్రింది ఉదాహరణలు పరికింపుడు-

"కణి కణ్ణన్ పోకిన్డాన్ కామరుపూమ్ కచ్చి
మణివణ్ణా నీకిడక్క-వేణ్డా, తుణివుడైయ
శెన్నాప్పులవనుమ్ పోకిన్రేన్, నీయుమున్నన్
పైన్నాకప్పాయ్ శురుట్టిక్కొళ్."

— గురుపరంపరా ప్రభావము పు. 55

మణివర్ణుడా ! కణికృష్ణుడు కంచి వీడిపోవుచున్నాడు. నీవు సుండ వలదు. నీ శేష శయనమును చంకన పెట్టుకొని బయలుదేరుము అను భావము గల పై పాశురమును చిన్నన్న యిట్లు అనుదించెను.

"ఫణిశాయి నీ భక్త భక్తుడై నట్టి
కణి కృష్ణుడిచటి భూకాంతుతో నలిగి
అరుగెడు నిబవాసి యతనితో నేను
నరిగెద నింక నీ యహి శయనంబు
మడచి బహోదండ మధ్యంబు నందు
నిడికొని నీవు నీ యేలనాగ కూడి
నా వెంట వేంచేయు నన్ను మన్నించి"

— ప. యో. వి. ద్వి. అ. పు. 114.

కణి కృష్ణుడు రాజు తప్పులు మన్నించి నిజావాసమునకు మరలి పోవ నిచ్చగించి తన గురుదేవుని ప్రార్థింప భక్తిసారులు నారాయణునితో విన్న వించిన తీరు మూలము నందిటు కలదు.

"కణికణ్ణన్ పోక్కొ-శిన్దాన్ కామరుపూమ్ కచ్చి।
మణివణ్ణా నీ కిడక్క-వేణ్డుమ్, తుణివుడై య।
శెన్నాప్పుల వనుమ్ పోక్కొ-శిన్దేన్ నీయున్నన్।
పైన్నాకప్పాయ్ పడుత్తుక్కొ-ళ్...."

— గురుపరంపరా ప్రభావము. పు. 57

కణికృష్ణుడు కంచికి తిరిగి వచ్చుచున్నాడు. మణివర్ణుడా ! నీవు వేంచేసియే యుండుము. నీ శేషతల్పమున పవళింపుము అను నర్థముతో గూడిన ఈ పాశురమునకు చిన్నన్న అనువాద మిది :

"ఫణిశాయి కాంచికా పట్టణాధీశ
కణికృష్ణు డిచటికి గ్రమ్మర వచ్చె
నీవును నింక మున్నట్టి చందమున
శ్రీపద్మామణిఁ గూడి శేషతల్పమునఁ
బవళింపుమని యొక్క పద్య మొనర్చె

— ప. యో. వి. ద్వి.అ.పు. 119

పై అనువాదములు చాలవరకు గురుపరంపరా విధేయములు. తన కాలము నాటికే వెలువడిన ఇతర గ్రంథములను కూడ చిన్నన్న చూచి యుండవచ్చును. ఆళ్వారుల శ్రీ సూక్తులతో నొప్పారిన నాలాయిర దివ్య ప్రబంధమును సహితము చిన్నన్న సందర్భోచితముగ కొన్నిచోట్ల ఆంధ్రీకరించెను.

**ఇతివృత్త నిర్వహణము :** పరమ యోగి విలాసము నందు పన్నిద్దరాళ్వారుల చరిత్ర ప్రధానేతి వృత్తమని తెలిసికొంటిమి. అంతేగాక దివ్యముని త్రయమనబడు నాథముని, యామున, రామానుజాచార్యుల చరిత్రలు గూడ రచింపబడినవి. ఇంత విస్తృతమైన ఇతి వృత్తమును చిన్నన్న 8 ఆశ్వాసములలో రచించెను. అసలు మొదటి ఏడాశ్వాసము లలో పరమ యోగుల (ఆళ్వారుల) చరిత్ర పూర్తి అయినది. కాని శ్రీవైష్ణవ మత సిద్ధాంత ప్రవర్తకులయిన నాథముని యామున రామానుజా చార్యుల గురించి చెప్పనిచో ఈ విశిష్టాద్వైత సంప్రదాయ గ్రంథమునకు పరిపూర్ణత చేకూరదు కావున వారి చరిత్రలను గూడ అష్టమాశ్వాసమున నిర్వహించి కావ్యమును ముగించినాడు చిన్నన్న. వీరును పరమ యోగి కోటిలోని వారే కనుక ఈ కావ్యమున వీరికి సముచిత స్థానము నిచుట ఔచిత్యమే. నిజమునకు పై పుణ్యమూర్తులలో ఒక్కొక్కరి చరిత్ర ఒక్కొక ప్రత్యేక కావ్యము. కనుకనే చిన్నన్న ఇందలి కథలకు ఎక్కడి కక్కడే ఫలశ్రుతిని చెప్పెను. పలుచరిత్రల కలయికతో కూడిన కావ్య మగుటచే పరమ యోగి విలాసమున రామాయణ భారతాదులలోవలె ప్రధాన కథ ఒకటి లేదు. భారతాదులందు ఉపాఖ్యానములున్నను మూలకథ సూత్రము వలె సాగును. కాని పరమ యోగి విలాసము వివిధ ప్రాంతము లకు జెందిన ఆళ్వారుల చరిత్రయగుటచే దేనికదే స్వతంత్రమై వస్త్వైక్యము, ఏకసూత్రత లోపించినట్లు భాసించును. కాని ఆయోగివరులందరి చరిత్రలలో దైవీ సంబంధమైన భక్తి సూత్రము సమానముగ నుండుటచే ఆలోపము పూరింపబడినట్లే భావింపవలెను.

ఇక ఆళ్వాశానుక్రమముగ చిన్నన్న నిర్వహించిన ఇతివృత్తములను **అనువాద విధానమును పరిశీలింతము.**

***ప్రథమాశ్వాసము :*** ఇందు ప్రబంధావతరణము, వైకుంఠ వర్ణనము, దివ్య ప్రబంధములు ద్రావిడ భాషామయమగుటకు కారణములు, భూత కాసార మహదాహ్వయ యోగుల చరిత్రములు వర్ణితము. శ్రీ వైష్ణవ సంప్రదాయమున లక్ష్మీదేవి యొక్క పురుషకారమును పొంది భగవంతుని ఆశ్రయింపవలెను. ఈ సంప్రదాయము ననుసరించియే కవి మంగళాచరణ ముతో కావ్యము నారంభించి మొదట లక్ష్మీదేవిని, పిదప వేంకటేశ్వరుని, పిమ్మట గురుపరంపరను, నిత్యసూరులు మున్నగు భక్తవర్గమును కీర్తించినాడు.

గురుపరంపరాను సంధానము రెండు విధములు. తన గురువు నుండి సర్వేశ్వరుని వరకును ఒక పద్ధతి, సర్వేశ్వరుని నుండి తన ఆచార్యుని వరకు మరియొక పద్ధతి. పరమ యోగి విలాసమున చిన్నన్న మొదటి పద్ధతినే అనుస రించి గురుపరంపరను ధ్యానించినాడు. ఇందు వరుసగా తిరుమలాచార్యుని, వాధూలపతి నప్పగారిని, రామానుజాచార్యులను, మహాపూర్ణులను, ఆళవం దారులను, శ్రీరామ మిశ్రాఖ్యులను, పుండరీకాక్షుని, నాథమునిని, పరాంకుశాది ఆళ్వారులను స్తుతించి నిత్యులను, ముక్తులను,* అఖిల భాగవతులను కీర్తించి నాడు చిన్నన్న. ఇంకను కురువనంబిని, తొండమాన్ చక్రవర్తిని, దాశరథిని.

---

* జీవులు నిత్యులు, ముక్తులు, బద్ధులు అని త్రివిధము. నిత్యులు వైకుంఠ మున పరమాత్మకు నిత్య కైంకర్యము చేయు ఆదిశేష, వైనతేయ, సనకసనందనాదులు. సంసారులై యుండి పునరావృత్తి రహితమైన వైకుంఠమును పొందినట్టివారు ముక్తులు, బద్ధులు సంసారమున దరిగాన లేక భగవంతుని ప్రార్థించువారు.

భట్టరాచార్యులను, అనంతాళ్వారులను, ఆదివణ్ శఠగోపయతి (వడగలై సంప్రదాయమునకు చెందిన అహోబిల మఠాధిపతి), కృష్ణమాచార్యుల వారిని (సింహాద్రి నారసింహ గద్యల నిర్మాత) తలచి, తాతగారైన తాళ్ళపాక అన్నమాచార్యులకు నమస్కరించి పెదతిరుమలాచార్యుని పుత్రుడైన తిరువెంగళనాథుడు (చిన్నన్న) కావ్యమును రచింపబూనినట్లు చెప్పుకొనెను.

ఇందు "అస్మద్గురుభ్యోనమః, అస్మత్పరమ గురుభ్యోనమః, అస్మత్సర్వగురుభ్యోనమః, శ్రీమతే రామానుజాయనమః, శ్రీ పరాంకుశదాసాయ నమః, శ్రీమద్యామున మునయేనమః, శ్రీరామ మిశ్రాయనమః, శ్రీ పుండరీకాక్షాయ నమః, శ్రీమన్నాథమునయే నమః, శ్రీమతే శఠగోపాయనమః" అను వైష్ణవ సంప్రదాయ రీతినే కవి గురు పరంపరను పేర్కొనెను.

చిన్నన్నకు వెంకటేశ్వరస్వామి కలలో కవిపించి పరమ యోగి విలాస మనగ కాసార యోగీంద్రాది ఆళ్వారుల దివ్య చరిత్రను ద్రవిడ ప్రబంధము చూచి తెలుగులో ద్విపద రూపమున రచించి తనకు అంకితము చేయుమని ఆనతిచ్చెనట. ఇందు స్వామి కవికి కావ్య నామధేయము, ఇతివృత్తము, మాతృక, భాష, ఛందములను గూడ నిర్దేశించుట గమనార్హము. ఏనుగు నడచిన త్రోవను చీమల బారు వలె వేదములను ద్రవిడము చేసిన పరాంకుశాది యోగివర్యుల చరితమును కావ్యముగ రచించిన పూర్వాచార్యుల యెదుట కావ్యము నెట్లు చెప్పగలనని సంకోచించియు, వారి పాదసేవకుడను గాన వారి మార్గముననే అనుసరించి రచింతునని దాసభావమున వినయముతో పలికి కావ్యమును ప్రారంభించెను.

ఆళ్వారుల అవతారము : కావ్యావతారిక యందు చిన్నన్న యిట్లు చెప్పెను.

1. మొదించి నారదముని చెప్పినట్టి
యాదవశైల మాహాత్మ్యంబు నందు
2. గారవంబునఁ "గలౌ ఖలు భవిష్యంతి
నారాయణ పరాయణా" యని పలుకు
కలిహరంబైన భాగవతంబునందు....
3. మఱియును వృద్ధపాద్మంబునఁ బద్మ
తెఱఁ గొప్ప సూత్రవతికిఁ జెప్పినదియు"

— ప. యో. వి. పు. 6

కావున తత్కథాక్రమ మొప్ప నేనును కృతి కావింతునని పలికి చిన్నన్న కథను ప్రారంభించెను. పైవానిలో 1. యాదవ శైల మాహాత్మ్యము నారద పురాణము లోనిది. "అనంతః ప్రథమం రూపం త్రేతాయా లక్ష్మణస్తథా ద్వాపరే బల భద్రస్తు కలౌ కశ్చిత్ భవిష్యతి" అని యదుగిరి మాహాత్మ్య మున ఆదిశేషుడు మొదట అనంతుడుగను, త్రేతాయుగమున లక్ష్మణుడు గను, ద్వాపరమున బలభద్రునిగను, కలియుగమున ఒకానొకడుగను అవతరించునని చెప్పబడెను. ఆ ఒకానొకరే భగవద్రామానుజులు. 2. ద్రావిడ దేశములోని తామ్రపర్ణి, కృతమాల, పయస్విని, కావేరి, ప్రతీచీ మహానదీ మొ॥గు నదీతీరములలో మహాభాగులైన నారాయణ భక్తులు కలియుగము నందవతరింతురని - "కలౌ ఖలు భవిష్యంతి నారాయణ పరాయణాః క్వచిత్ క్వచిత్ మహాభాగాః ద్రావిడేషుచ తామ్రపర్ణీ నదీ యత్ర కృతమాలా పయస్వినీ కావేరీచ మహాభాగా ప్రతీచీచ మహా నదీ" అని వ్యాసకృత శ్రీ మహాభాగవతము ఏకాదశస్కంధమున చెప్పబడినది. 3. వృద్ధ పాద్మమున కురుకామహాత్మ్యమున సూత్రవతీ దేవిని గూర్చి శ్రీదేవి యిట్లు చెప్పెను.

"తత: కలియుగస్యాదే వైశాఖ్యాం విశ్వభావనః
విష్ణుభక్తి ప్రతిష్ఠార్థం సేనేశోఽవ తరిష్యతి

తతః కాలేన మహతా వినష్టాం భవితత్కృతిః
నాథ నామా మునివరో యోగ జ్ఞానా దవాప్స్యతి
తతః కాలే బహుతిథే వినష్టా విష్ణువర్ధినీమ్
త్రిదండ మండితో దేవోమునిః ప్రవక్త్రయిష్యతి."
— వృద్ధపాద్మము, కురుకామాహాత్మ్యము.

ఇందు కలియుగారంభమున విష్వక్సేనులు, నాథమునులు, భగవద్రామానుజు లవతరింతురని గలదు. కావ్యాదిని పై అంశముల నుదహరించుటచే చిన్నన్న ఆయా గ్రంథములను పరిశీలించి రచన సాగించినట్లు స్పష్టము.

*కథా ప్రారంభము :* చిన్నన్న వైకుంఠపుర వర్ణనముతో కథను ప్రారంభించెను. వైకుంఠమున శ్రీమన్నారాయణుడు—

"మూడు కాలంబుల మునుముట్ట నెఱిగి, మూడగు నక్షరముల యర్థమగుచు
మూడు ధామంబుల మొనసినిల్చుచును. మూడు గుణంబుల మునుమిడిదాఁటి
మూడు వర్గంబుల ముదమార నొసఁగి మూడుతాపంబుల మూరియఁగొట్టుచును
మూడు లోకముల కిమ్ములనేలికగుచు, మూడుమూర్తులకును మొదలి
వాడగుచు...."
- ప. యో. వి. పు. 20

తన కరుణా కటాక్ష వీక్షణ సుధా ధారచే శరణాగతుల యెదచల్లజేయు చుండెనట. ఇట చిన్నన్న అద్భుతమైన రచనము చేసెను. మూడు కాలము లనగా భూత భవిష్యద్వర్తమానములు : మూడక్షరములు- అ.ఉ.మ=ఓమ్, మూడు ధామములు=శ్రీవైకుంఠము, పాల కడలి, భువి; మూడు గుణములు=సత్వరజస్తమస్సులు; మూడు వర్గములు=ధర్మార్థకామములు; మూడు తాపములు- అధి భౌతిక అధ్యాత్మిక అధి దైవికములు; మూడు లోకములు- ఊర్ధ్వమధ్య అధోలోకములు; మూడు మూర్తులు- బ్రహ్మ విష్ణు మహేశ్వరులు (సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధులు). ఇంతటి

వ్యాఖ్యానమును కవి మూడు శబ్దము నందుంచి చక్కని శైలిలో కథను నడిపించెను.

***శ్రీహరి శ్రీనతుల సంవాదము :*** లక్ష్మీదేవి శ్రీహరిని ఓ కరుణామయా! వేదశాస్త్రాదులందు నిన్ను తెలిసికొను మార్గమును చూపించి నను కానక నీ సేవకై ప్రసాదింపబడిన కరచరణాద్యవయవములను అన్య శేషత్వ ప్రయోజనమునకో, స్వలాభమునకో వినియోగించుచు ఆత్మా పహార మొనర్చిన యీ పాపులను సత్క్రమ మార్గమున నడిపించుటకు రామ కృష్ణాద్యవతారములు ధరించి కొన్ని ఆత్మలను కటాక్షించితివి. ఈ సమస్త జీవకోటి నీ శేషభూతులే కదా! అఖిల జీవులకు నీవే నియామకుడవు. అట్టితరి కొందరిని విగత దుఃఖులుగను, మరికొందరిని విహిత దుఃఖులుగను చేయ తగునా? అని ప్రశ్నింప శ్రీహరి చిరునగవుతో నిట్లనెను. అజ్ఞాన జలధిలో మునిగి విషయాసక్తులై, అసుర ప్రకృతులై అనాది వాసనా మూఢులై, కర్మపరతంత్రులగుచు జన్మ పరంపరలెత్తి నరక జన్మముల మ్రగ్గుచున్న యీ జీవులను నేను మాత్రమేమి చేయగలను ? ఒక ఉపాయమాలోచించి సకల జీవకోటికిని అంతర్యామినై యుంటిని. అది గ్రహింపనేరరని శ్రీరంగాది దివ్య దేశములలో అర్చావతారములు ధరించి అర్చకపరాధీను డనై యుంటిని. అయినను ప్రయోజనము వ్యర్థము.

ఇక వేటకాడు సజాతి జంతువును చూపి వేటాడునట్లు, సజాతీయు లగు జీవకోటిని పంపి వారిని వశీకరించుకొందును. నీవు, భూదేవి, నీళాదేవి, చక్ర శార్ఙ్గనందకగదా నాగవరపైన తేయ విష్వక్సేన ప్రముఖులు, శ్రీవత్స కౌస్తుభాంచిత నిత్యవరులు, చండ కుముదాది ఘనులు తక్కుంగల నిత్యులు భూమి యందు పెక్కు వర్ణములలో అవతరించి అనేక దివ్య దేశములను సేవించుచు, అనేక భాషలు నేర్చి, కావ్యములు రచించి సకల వేద వేదాంత రహస్యములను ద్రావిడ భాషయందు గేయములుగ రసవంతముగ రచించి వానిచే వేద బాహ్యుల నిర్జించి సంసారమను కానలో దిరుగు ఏనుగులవలె

నున్న వానిని కట్టు కంబమునకు జేర్చి భక్తి ప్రపత్తి మార్గములు బోధించి పరమార్థమగు పరాత్పరుడను నేనే యని బోధింపుడు అని నియోగింప శ్రీదేవి ద్రావిడ భాషలోనే దివ్య ప్రబంధములు రచియనేల అని ప్రశ్నింప శ్రీనాథుడిట్లు చెప్పెను.

ద్రావిడ భాషలో దివ్య ప్రబంధావతరణ కారణము : దేవతలందరు పార్వతీ కళ్యాణమును చూచుటకై ఉత్తర దిక్కును చేరగా ఆదిక్కుగల భూమి క్రుంగ సాగెను. అగస్త్య మహర్షి దక్షిణ దిక్కున కేగినచో అది సరియగునని విశ్వకర్మ దేవతలకు చెప్పెను. అగస్త్యుడు కోపించి శుభకర మగు పార్వతీ కళ్యాణమును నేను చూడకుండ చేసితివి గాన నీ వంశస్థులకు భువిలో "పని యధికము కూలి స్వల్పము" అగుగాక యని శపించెను. అందుకు విశ్వకర్మయు కోపించి 'నీవు నేర్చిన వేదములు ద్రావిడ రూపములు దాల్చుగాక' యని ప్రతి శాప మిచ్చెను. దేవతల ప్రార్థనపై అగస్త్యుడు దక్షిణ దేశమున కేతెంచి మలయ పర్వతముపై పెక్కు సంవత్సరములు తపము చేయ ప్రసన్నుడనై ద్రావిడత్వము నందిన శ్రుతులే సర్వోన్నతంబు లగు నా భక్తులు వానిని వెలయింతురని వరమొసగితిని. కావుననే మిమ్ము ద్రవిడ దేశమునందవతరింపుమని కోరితిని అని శ్రియఃపతి లక్ష్మీదేవితో చెప్పి తాను శ్రీరంగాది దివ్య దేశములలో అర్చావతారములను దాల్చి యుండెను.

ఈ అగస్త్య వృత్తాంతము గురుపరంపరా ప్రభావమున ఉపోద్ఘాత రూపమున గలదు. దానిని చిన్నన్న శ్రీహరి శ్రీనతుల సంవాదమున నిబద్ధించెను. అనాది సంస్కృత భాష శిష్ట లెక్కిన పర్నియు అపై దిక ములే. అట్టి సంస్కృతముతో సమానముగ ద్రావిడ భాష ఆళ్వారులచే సమాదరింపబడెను. తమిళ భాషనే ద్రవిడ భాషయని వ్యవహరించిరి. ద్రావిడ శబ్దము సంస్కృత భాషాజన్యమనియు తమిళ శబ్దమే ద్రావిడ శబ్దమునకు వికృతి రూపమనియు పండితుల అభిప్రాయము.

**"On the other hand 'Tamil' is the original word or name On the analogy of which the word 'Dravida' has been coined by Sanskritists".**

**– J. S. V. O. I; Vol 14, Pt, i P. 9-Author–K. Ramakrishnaiah.**

ఈ ఆళ్వారులు గానము చేసిన తమిళ దివ్య ప్రబంధ పారాయణము గల దేవాలయములే దివ్య స్థలములనియు, అది లేనివి ప్రాకృతములనియు ప్రసిద్ధి. దివ్య ప్రబంధము వేదము కంటెను అధిక్యమును పొందుట చేతనే దేవాలయములలో ఉత్సవ సమయములందు వేదపారాయణము భగవంతునకు వెనుక భాగమునను, దివ్య ప్రబంధ పారాయణము ముందు భాగమునను జరుగుచున్నది.

ద్రావిడ ప్రబంధావతరణ గాథ పిమ్మట కవి సరో భూత, మహ దాహ్వయ యోగుల అవతారములను, వారికి సంబంధించిన కథను వివరించెను.

1. సరోయోగి అవతారము : కాంచీపురములో వరదరాజస్వామి ఆలయమునకు ముందు భాగమున గల కమలాకరమున–" హరినాభి నుద యించు నజుని చందమున హరి తార నాశ్వయు జాఖ్య మాసమునఁ గాంచన పంకజ గర్భంబునందుఁ బాంచజన్యాంశమున" ఒక యోగి ఉద్భవమయినట్లు చిన్నన్న తెల్పెను. ఇది ఈ క్రింది దివ్యసూరిచరిత శ్లోకమునకు అనువాదము–

"హేమాబ్జినీ హేమ సరోజ గర్భాత్। శ్రీపాఞ్చజన్యోఽజని దివ్యయోగీ
తారే హరే రాశ్వయుజాఖ్యమాసే సమస్త జీవావన కర్మహేతోః"

ఈ సందర్భమున చిన్నన్న ప్రబంధోచితమైన కల్పన ఒకటి చేసెను. ఎట్లన, హేమాబ్జము నందవతరించి వేద నాదము చేయు బాలుని గని శ్రీహరి సంతసించి శ్రీదేవి చేతికీయగా ఆమె స్తన్యము నిచ్చి శిరము మూర్కొనెను. ఆ మహాదేవీ స్తన్య పానము వలన ఆ బాలుడు కోటి మన్మథాకారుడై శ్రీ శ్రియఃపతుల పాదములపై వ్రాలి స్తోత్రము చేసెను.

అతనికి సరోయోగి అని పేరిడి, అజ్ఞానాంధకార మగ్నులైన జీవుల నుద్ధరించి వేదమును త్రోవకు తెమ్మని ఆజ్ఞాపించిరి. అతడు నానా దివ్య దేశములు సేవించు చుండెను.

2. భూత యోగి అవతారము : 'మల్లాపురంబను మహనీయపురిని ముక్తి పోషుండు కౌమోదకీ దివ్య శక్తిమయుండైన సన్మౌని వరుఁడు మనువచించిన మాసమున వసుతార ననుపమ నీలోత్పలాంతంబు నందు జనించె'నని చిన్నన్న పేర్కొనెను. మల్లాపురమనగా మహాబలిపురము.

"తులా ధనిష్ఠా సంభూతం భూతం కల్లోల మాలినమ్
తీరే పుల్లోత్పలే మల్లాపుర్యామీడే గదాంశజమ్."

అవి బ్రహ్మతంత్రస్వామి రచనము. ఇచట కూడ చిన్నన్న కావ్యోచిత ధోరణిలో నిట్లు చెప్పెను. లక్ష్మిదేవి – 'కుతుకంబుతో ఆ బాలుని హృదయమునకు హత్తుకొని సత్త్వగుణమను పాలు హరిభక్తి యను స్నేహముతో కలిపి' పట్టెనట. భూతతతిని సంసార సముద్రము నుండి దాటింప గలవాడగుటచే లక్ష్మినారాయణులతనికి భూతయోగి యని పేరిడిరి.

3. మహదాహ్వయ యోగి : అశ్వయుజమాసమున శతభిషా నక్షత్రమున మయూర పురియందలి యొక బావిలో కైరవాంతమున నందకాంశముతో ఈ యోగి అవతరించెను, వానిని లక్ష్మినారాయణు లాదరించి మహదాహ్వయులని పేరు పెట్టి 'పెద్దల కెల్ల నీవ పెద్దవై జగతి దీపించెదు తనయ !' అని దీవించిరి. ఈ మువ్వురను ముదలాళ్వారు లందురు. వీరికి భగవంతుడొక పరీక్ష పెట్టెను.

భక్త పరీక్ష : బ్రహ్మ విన్యస్తభరులై అవతరించిన ఈ యోగులు తమవంటి వారిని వెదకుచు నానాదేశములు, తీర్థములు తిరుగుచుండిరి. నారాయణుడు వారిని వామన క్షేత్రమనబడు దేవనగరికి (తిరుక్కోయిలూరు)

చేర్చి అర్ధరాత్రమున వడగండ్లతో వాన కురిపించెను. ఆ యంధకారమున భూతయోగి ఒకరు మాత్రమే శయనించుటకు తగిన ఒక చిన్న గేహళిని (పూరిగుడిసె) చూచి అచ్చోటకేగి శయనించెను. అటకు రెండవ యోగి రాగా — "వైష్ణవో వైష్ణవం దృష్ట్వాదణ్డవత్ ప్రణమేద్భువి" అని పాద్మ మున చెప్పబడినట్లు నమస్కరించి వానిని పిలిచి యిరువురును కూర్చుండిరి. అంత మహదాహ్వయులు రాగా వారిని కూడ లోనికాహ్వానించి ముగ్గురును ఒదిగి నిలచుండిరి. ఈ సందర్భముననే పొయిహై ఆళ్వారు ఇట్లు చెప్పిరి. "ఒరువర్ పడుక్కలామ్ ఇరువర్ ఇరుక్కలామ్ మువ్వర్ నిరు క్కలాం" (ఒకరు పరుండవచ్చు ఇద్దరు కూర్చుండవచ్చు ముగ్గురు నిలబడ వచ్చును). అంత నారాయణుడు వారల హృదయములందు ప్రవేశించి సందడి చేయ మొదలిడెను. ఇట భగవంతుని పరముగ 'తపసి దెందపు సందడీడు' అని చిన్నన్న చక్కని పద ప్రయోగము చేసెను. "వసన్తి వైష్ణవా యత్రతత్ర సన్నిహితో హరిః" అను నట్లు నారాయణుడాయోగుల మధ్య తిరుగుచుండ—

'చనుదెంచి తన రూపు చందంబు డాచి
ఇరికెడు నడుమ నీడెవ్వడో నీవి
తెలుగు తెల్లంబుగా తెలియుదమని.'

వారు అనుకొను నంతలో భూతయోగి—

"ధరిణి పాత్రియ సముద్రంబులు నేయి
అరుణు దీపము జేసి యరుణాంశు తతుల
గారాబు చక్రంబుతై బూన్చి నట్టి
నీరజాక్షున కిచ్చె నీరాజనంబు" (పు. 45)

అంత సరోయోగి "ప్రేమ పంక్తియ మితిలేని భక్తియే చమురు ఆనంద రతిని హృద్బజంబె వత్తిగా నొనరించి వికాసమ్మె ఆత్మ దీపమ్మౌయ జ్ఞానంబు దీపంబు జేసి పేరిమె నారాయణార్పితము గావించె" నట. ఇట్టి బంధుర జ్ఞాన దీప ప్రకాశమున కనుల యెదుట నిలచిన శ్రీహరిని గాంచి మూడవ యోగి—

"సిరిగంటిఁ జెన్నుమించిన మేనుగంటి గరమొప్పువదన వికాసంబుగంటి
పల్లలితావనీ స్తనకుంభ కుంభ పల్లవంబులవోలు పాదముల్గంటిఁ
సరసిజ హల శంఖ చక్రాంకుశాంక చరణముల్ జగదేక శరణముల్గంటి
దరిణీ బింబము చాయఁ దరళించు కనకసురుచిరాంశుకమునంశుకముఁ
గన్గొంటి
భ్రామించు కటికట శ్రీ సతీవరణ దామముల్ మేఖలా దామముల్ గంటి
మకరకుండల బాలమార్తాండరుచుల వికసించు వదనారవిందంబు గంటి"
— ప. యో. వి. పు. 45, 46.

అనుచు భక్తి పారవశ్యముతో స్వామిని స్తుతించుచు గంతులు వేయ దొడగెను. అంత నారాయణుడు వారికి విశ్వరూపముజూప ఆనంద పరవశులై అంతాదులను పేర (ముదల్ తిరువన్దాది, ఇరణ్డాం తిరువన్దాది మూన్ఱాం తిరువన్దాది) మూడు ప్రబంధములు రచించిరి. అవి 'ముక్తికి చేర్పు నిచ్చెన' లని చిన్నన్న కవి ఉవాచ.

*అనువాదము నిర్వహణ రీతి :* చిన్నన్న నాలాయిర దివ్య ప్రబంధమును కొన్నిచోట్ల సందర్భోచితముగ అనువదించెననుటకు నిదర్శనముగ ఈ క్రింది వానిని చూడుడు.

"వైయమ్ తకళియా వార్ కడలే నెయ్యాక
వెయ్యక తిరోన్ విళక్కాక - శెయ్య
శుడరాశియా నడిక్కే శూట్టినాన్ శొన్మాలై
ఇడరాశి నీఙ్గుకవే యెన్ఱు...."
— ఇయఱ్పా-ముతల్ తిరువన్దాది, 1వ పాశురం

భూమి ప్రమిదగా, ప్రవహించుచున్న సముద్రము నెయ్యిగా, ఉష్ణ కిరణుడగు సూర్యుడు దీపముగా ఉంచి ఎఱ్ఱని కాంతిగల చక్రాయుధమును ధరించిన శ్రియఃపతి యొక్క పాదములందే దుఃఖ సముద్రమును వివర్తింపవలెనను

భావముగల పై పాశురమును చిన్నన్న భూత యోగి చేష్టలో- "ధరణి పంక్తియ సముద్రంబులు నేయి.... (ప యో. వి. పు. 45) అను ద్విపద పంక్తులలో అందముగ ఆంధ్రీకరించెను. ఇట్లే భక్తియే ప్రమిదగా, అభివేశమే నెయ్యిగా, ఆనందముచే కరగిన మనస్సే వత్తిగా చేసి జ్ఞానప్రదమైన ద్రావిడ భాషా ప్రబంధముతో శ్రీమన్నారాయణునకు పరభక్తి యనెడి ప్రకాశవంతమైన దీపముపెట్టితిని అను భావముతో భూతత్తాళ్వారు సాయించిన

"అన్పేతగళియా ఆర్వమే నెయ్యాగ
ఇన్పురుకు శిన్దైయిడు తిరియానన్పురికి
జ్ఞానచ్చుడర్ విళక్కేత్తినేన్ నారణర్కు
జ్ఞాన త్తమిళ్ పురిన్దనాన్...."

— ఇయఱ్పా-ఇరణ్డ తిరువన్దాది - 1వ పాశురం

అను పాశురమును చిన్నన్న "....ప్రేమ పంక్తియ మితిలేని భక్తియే చమురు.... (పు. 35). అనుచు అనువాదమనిపించనంతటి సహజ ధోరణిలో ఒదిగించి రచన సాగించెను.

*ద్వితీయాశ్వాసము : భక్తిసారయోగి చరిత్రము :* కంచికి తూర్పున గల మహీసార క్షేత్రమున భార్గవ మహర్షి ఘోర తపము చేయుచుండ దేవేంద్రు డతని తపోభంగము చేయుటకు కనకాంగి యను అప్సరసను పంపెను. ఆమె తన సౌందర్యమును ప్రదర్శించి అతని చిత్తమును లోగొనెను. శ్రీహరి సంకల్పమున వారికి సుదర్శనాంశజుడైన కుమారుడు జన్మించెను. గాధిసుతుని వలె విరక్తుడై భార్గవుడు తీర్థయాత్రలకు పోయెను. ఆ బాలుని వెదురు పొద యందుంచి తావచ్చిన పని ముగిసెనని మేనక వలె కనకాంగి స్వర్గమునకు పోయెను. ఆ బాలుడే యీ భక్తిసారుడు. ఒక వేణులావకుడు (మేదరి) ఆ బాలుని తెచ్చి తన భార్య కుముదవల్లి కిచ్చెను. కృష్ణుని పొందిన యశోదవలె ఆమె మాతృభావమున పరవ

శించుచుండ స్తన్యము స్రవించెను. కాని నారాయణుదెదుట నిలువగా సంతృప్తుడగుటచే నా బాలుడు చనుగ్రోలడు. ఉగ్గు మ్రింగడు. ఏడువడు. ఆకొనడు. వేరు దిక్కు చూడడు. ఈ వార్త విని జను లాశ్చర్యముతో వచ్చి ఆ బాలుని చూచి పోవుచుండిరి. ఈ యోగి నిరాహార తత్త్వ రహస్యమును నా విరచిత అన్నవిజ్ఞాన గ్రంథమున (పు. 44) చూడ నగును.

*భక్తిసారుని మహిమలు :* పుత్ర హీనుడగు వృద్ధుడొకడు సంతాన కాముడై పాలు తెచ్చి భక్తిసారులకు సమర్పించగా సగము త్రావెను. తక్కినవి త్రావిన వృద్ధ దంపతులకు చక్రపరిచారకాంశమున కణికృష్ణుడను బాలుడుదయించెను.

ఒకనాడు శివుడు ఉమాసహితుడై గగన మార్గమున సంచరింపుచు భక్తిసారులను చేరి వరము కోరుకొమ్మనెను. ఆ యోగి నవ్వుచు బొంతలో నున్న సూదిని చూపి ఈ సూది వెంబడే అవిచ్ఛిన్నముగ దారముండునట్లు వరమిమ్మని కోరెను శివుడు కోపించి ఫాలనేత్రము దెరచి అగ్నిని పుట్టించెను. 'ఖద్యోత కాంతు లొక్కట లెక్క గొనని ఖద్యోత బింబంబు కరణి' ఆ మౌని హర నేత్రాగ్నికి అడ్డముగ తన చరణము చూపుటయు, అతని చరణ లోచనము నుండి మంటలు వెలువడుచుండ శర్వుడు శర్వాణిని చూచి 'ఆ మంటలను జూచితే నా కంటి మంటలను ఆహుతి గొనుట జూచితే ? శ్రీహరి భక్తులను గెలువగలమా ? హరిదాసుల కంటె నధికులు లేరు' అని ఆ యోగి మహిమలను ప్రశంసించి కైలాసమున కేగెను. అక్షము పాదమందుండుటచే భక్తిసారుడు అక్షపాదాహ్వయు డయ్యెను.

*కొంకణ సిద్ధుడు :* ఒకనాడు బొంతలు కుట్టుకొనుచున్న భక్తిసార యోగికడకు కొంకణ సిద్ధుడొకడు (భక్తిహార సిద్ధుడు) వచ్చి మీవంటి వారి కిట్టి బొంత ధరించుట తగునా? అనుచు ఒక మానికపు బొంతను, అనేక రసములతో చేసిన పరుసవేదిని అర్పింప ఆయోగి తన శరీరము నందే ఒక

అద్భుత మణికవచమును ప్రదర్శించి తన పాదముల చెంతగల మట్టిని తీసి నీ పరుసవేది చేయు పనిని ఇది చేయునని చెప్పి యిచ్చెను. అతడా మట్టిని చిత్ర కూట పర్వతముపై పడవేయ అది రెండవ కనకాద్రి వలె భాసిల్లెను. సిద్ధుడు భక్తిసారుని పాదములపై వ్రాలెను. ఇట్లుండ కణికృష్ణుడు భక్తి సారయోగి శిష్యుడై తిరుమంత్రమును బడసి యోగవిద్య నభ్యసించు చుండెను.

***వృద్ధనారి సపర్యలు :*** గురు శిష్యులొక గుహలో యోగాభ్యాసము చేయుచుండ ఒక వృద్ధ వనిత ఆ గుహాప్రాంగణమును అలికి, ముగ్గులు పెట్టి పరిచర్య చేయుచుండెను. భక్తిసారులు సంతసించి ఆమె కోరికపై యౌవనమును ప్రసాదించెను. ఆమె సౌందర్యమునకు మరులుగొని ఆ దేశపు రాజైన పల్లవరాయడామెను వివాహమాడెను. ఒకనాడు రాజు తన వృద్ధాప్యమును తరుగని తన భార్య యౌవనమును చూచి కారణమేమని భార్య నడుగ ఆమె భక్తిసార కణి కృష్ణులను గూర్చి తెలిపెను.

***కణికృష్ణుని దేశ బహిష్కారము :*** పల్లవరాయడు కణి కృష్ణుని పిలిపించి తనపై కవిత్వము చెప్పుమనియు, నీ గురువును రప్పింపు మనియు కోరెను. అతడు తిరస్కరించెను. రాజు కోపించి యతనికి దేశ బహిష్కార శిక్ష విధించెను. ఆ శిష్యునితో గురువు, గురువు వెంట నారాయణుడు, అఖిల దేవతలు కాంచీపురమును విడిచి చనిరి. ఉపద్రవము లేర్పడి పట్టణము పాడువడెను. పశ్చాత్తాపముతో రాజు భక్తిసారుని పాదములపై వ్రాలెను, ఆయోగి కణికృష్ణుని ప్రార్థింపుమనెను కణికృష్ణు డతని తప్పును మన్నించి గురుదేవుని ప్రార్థించెను. గురువు నారాయణుని ప్రార్థించెను. శ్రీహరి తిరిగి కాంచీపురమునకు వచ్చి వ్యత్యస్తముగ శయనించెను. భక్తిసారయోగి చెప్పినట్లు చేయుటచే నిచటి శ్రీమన్నారాయణు నకు 'యథోక్తకారి' అని పేరు. అందుకు సంతుష్టులై భక్తిసారులు ద్రావిడ భాషలో ఒక ప్రబంధమును రచించెను.

శార్దూల పురమున (పెరుంపులియూర్) భక్తిసారులు పేటలమ్మువాని వలె వీధులవెంట తిరుగుచుండ, శిష్యులకు వేదాధ్యయనము గఱపు కొందరు బ్రాహ్మణ పండితులతనిని హేయునిగ దలచి వేదముచెప్పుట మాని పరిహసించిరి. అది గ్రహించిన యోగి ఆ వీధి దాటి చనిరి. అంత వారికి వేద భాగము స్ఫురింపదయ్యె. వారు హరిభక్తు నవమానించితిమని గ్రహించి క్షమాపణము వేడ ఆ యోగి వారితో మాటలాడక నల్లవరిగింజ నొకదానిని చీల్చి పడవేయగా విరమించిన వేదభాగము వారికి స్ఫురించినదట. ఇట్లే తనకు అగ్రతాంబూల మొసగ బూనిన హరిపాదుడను విష్ణు భక్తుని దూషించిన ఋత్విక్కులకు తన అగ్ర భాగమున నారాయణ మూర్తిని ప్రకాశింప జేసి వారి గర్వములను ద్రుంచెను. ఇది ద్వితీయాశ్వాసమున చిన్నన్న నిర్వహించిన భక్తిసారయోగి చరిత్రము. అశ్వాసాంతమున కవి ఫలశ్రుతి నిట్లు చెప్పెను.

"ఇరవొందు భక్తిమై నీ భక్తిసారు చరితల నీధరాస్థలి నెవ్వఁడేని
గృతి యొనర్చిన యట్టి కృతకృత్యమతికి హితబుద్ధి, బ్రతిదినంబెన్ను వారలకు
వినిన వ్రాసినఁ జదివిన వారికెపుడు ననుపమ దీర్ఘాయురైశ్వర్య తతులు
నకలంక శుభములు నభిమతార్థములు సకల సిద్ధులుఁ గరస్థలి నుండునెపుడు"
— ప.యో. వి. పు. 142.

**అనువాదము :** కణికృష్ణుని దేశ బహిష్కార సందర్భమున గురు శిష్యులు కాంచీపురము విడచుట, మరల తిరిగి వచ్చుటలను దెలుపు మూలానువాదములను 145, 146 పుటలలో చూడుడు. చిన్నన్న ఈ రచనములో పౌరాణిక చరిత్రలకు సంబంధించిన పోలిక లనేకము గుప్పించెను. ఉదా : మేనకా విశ్వామిత్రులు. శిశుపాల చరితము, అంబరీష చరిత్రములు మొదలగునవి.

**చిన్నన్న గావించిన మార్పులు — చేర్పులు :** 1. మూలమున భార్గవ మహర్షి యొక్క పత్నికే భక్తిసారులు జన్మించినట్లు—"భార్గ

వరుడై యపత్ని గర్భిణియామ్....పన్నిరణ్డు మా సత్తు త్క్కప్పిన్నుకై మాసత్తిల్ (పుష్యమాసమున) మఖా నక్షత్రత్తిల్, పిణ్డాకృతి యాకప్రస విక్కి సుదర్శనాంశేన తిరుమళిశై ప్పిరానవతరిత్తార్" అని చెప్పబడినది. దివ్య సూరి చరితము నందును "సాగర్భమాధ త్తమునేశ్చ పత్నీ" అనియే కలదు. కాని చిన్నన్న కనకాంగి యను అప్సరస యందు భక్తిసారులు జన్మించినట్లు చెప్పెను. 'పిణ్డాకృతి యాక ప్రసవిక్క' అని మూలము నందుండ చిన్నన్న శిశువుగ జన్మించినట్లు మార్చెను. పిండాకృతిని జన్మించిన శిశువునకు జననాంతర మవయవ పుష్టి కలుగుట లోకవిరుద్ధమని భావించి కాటోలు చిన్నన్న శిశువుగ జన్మించినట్లే పేర్కొని ఔచిత్యమును పాటించెను.

2. భక్తిసారులు శాక్య ఉలూక్య అక్షపాదాది మతములు శోధించి శ్రీ వైష్ణవ మతమున ప్రవేశించినట్లు మూలానువాదముల రెంటను కలదు. ఇందుకు విరుద్ధముగ శైవసిద్ధాంతమున ప్రవేశించినట్లును మహదాహ్వయులు విష్ణు పరత్వమును నిరూపించి కటాక్షించినట్లు ప్రపన్నామృతమున గలదు. చిన్నన్న శైవమత ప్రసంగము చేయలేదు.

3. మూలము నందు ముక్తిహారుడను సిద్ధునికథ, కొంకణుడను రస సిద్ధుని కథ వేరు వేరుగ చెప్పబడెను. చిన్నన్న ఈ రెంటిని జోడించి ఒకే కథగ రచించెను. వారి గర్వమును నశింపజేయుటయే ప్రయోజనము కనుక చిన్నన్న ఆ రెండు కథలను జోడించుట సమంజసము.

**ఔచిత్య పోషణము :** పరమ శివుడు ప్రత్యక్షమైనపుడు భక్తిసార యోగి మూడు ప్రశ్నలడిగినట్లు పూర్వాచార్య కథనము. మొదటిది మోక్ష మిమ్మనుట. ఆ యధికారము నారాయణునకే యని శర్వుని సమాధానము. "మోక్షం తరవల్లైయాకిల్ తా", "ఎన్న, అతుఎన్నాల్ తరక్కడవదు ఎన్ఱి శ్రీమన్నారాయణ నాలే" అని మూలము. 'నేడు చనిపోవు వానిని

రేపు చంపుము' అని రెండవ ప్రశ్న. అది కర్మానుగుణము అని శిష్యని సమాధానము. "అనాల్ ఇన్దు శావాతై నాశై శాకుంబడి పణ్ణ వల్లయో 'ఎన్న' అతువుం కర్మానుగుణ మన్ట్రో" అని మూలము. 'ఈ సూది నుండి దార మును అవిచ్ఛిన్నముగ పోవునట్లు అనుగ్రహింపుము' అని మూడవ ప్రశ్న. ఆనాల్ ఇవ్వూసి యిన్ పిన్నె నూల్‌వరుంబడి వరప్రదానం పణ్ణాయ్" అని దీనికి మూలము. ఈ మూడు ప్రశ్నలు పలికించిన అధిక ప్రసంగమగు ననియు. తన గుణానుభవమునకు కాలయాపనమగుననియు తలచి మూడవ ప్రశ్నతో మాత్రమే భక్తిసారులు సరిపెట్టినట్లు రచించి చిన్నన్న ఔచిత్య మును పోషించినాడు. ఇట్లు చిన్నన్న ఔచిత్యవంతముగ దివ్యప్రబంధము నచ్చటచ్చట యథామూలముగ ననువదించుచు. వన్నెతెచ్చు మార్పులు చేయుచు ఒక స్వతంత్ర ప్రబంధమువలె ద్వితీయాశ్వాసమును రచించెను.

"శక్తిపంచమయ విగ్రహాత్మనే శక్తి హారజయ చిత్తహారిణే
ముక్తిదాయక మురారి పాదయోర్భక్తిసారమునయే నమోనమః"

**తృతీయాశ్వాసము :** ఇందు నమ్మాళ్వారు (శఠకోపయోగి), మధుర కవి ఆళ్వారు, కులశేఖరాళ్వారు, తిరుప్పాణి (మునివాహన యోగి) అను నలుగురు యోగివరుల వృత్తాంతములు వివరింపబడినవి.

**నమ్మాళ్వారు :** పాండ్య మండలమున గల పుండరీకపురమును కురువను రాజు పాలించుటచే దానికి కురుకాపురి అని పేరు వచ్చెను. దానికి సమీపమున తామ్రపర్ణి అను నది కలదు. ఆ నగరమున వళిధి నాధేంద్రు డను భాగవతోత్తమునకు ధర్మధరుడు, ఆయనకు చక్రపాణి, ఆయనకు రక్తధారాహ్వయుడు, ఆయనకు పాటల మోచనుడు. ఆయనకు భోక్తాళి, ఆయనకు కారి యను పుత్రుడు జన్మించిరి. కారి నాథనాయకి యను కన్యను వివాహమాడెను. ఆమె నారాయణుని సేవించి యొక కుమారుని ప్రసాదింపు మని ప్రార్థింప ఆ స్వామి నేనే నీకు పుత్త్రుడ నయ్యెదనని వరమొసగెను.

కొంతకాలమునకు నారాయణాంశోద్భవుడగు విష్వక్సేను డామె గర్భమున ప్రవేశింప ఆమెకు—

"కలియుగం బిలమీఁదఁ గలిగిన మీఁదఁ
దెలియఁ దొంబది రెండు దినములు చనఁగ,
నవరని వేళ వైశాఖ విశాఖఁ
గవి వాసరమునఁ గర్కాటక లగ్నమున (ప.యో.వి.పు. 148)

ఒక బాలుడుదయించెను. హరి స్వయముగ సూతికాగృహము ప్రవేశించి కారి సూనునకు జ్ఞానోపదేశము చేసెనట. ఈ బాలుడును చను నోరబెట్టక, కనువిప్పి చూడక, ఎలుగెత్తి యేడ్వక యున్న తలిదండ్రులు వగచి ఆ యూరి దేవాలయమున గల తింత్రిణీ వృక్షము క్రింద పసిడితొట్టెలో పరుండబెట్టిరి. ఇట "శేషుండు నిర్నిద్ర చించామహీజవేషుఁడై" విలసిల్లు చుండెనని చింతచెట్టును కవి అందముగ వర్ణించెను. పర్వతగుహకు లంఘించు సింహము వలె ఆ యోగి చింతచెట్టు తొఱ్ఱను జేరి కూర్చుండి శ్రీమన్నారాయణుని ధ్యానించి, దర్శించి తదనుభవముతో సకల వేదములను ద్రావిడ భాష యందనుగ్రహించెను. ఆ క్షణమున అఖిల శాస్త్రములు వచ్చి ఆయన లాలాజలంబులై తనరెనట.

"కారి సూనుని కావ్య కన్యకామణికి ధారుణి నర్చావతార రూపములఁ
జెలువొందు విష్ణుని శ్రీమూర్తులెల్ల వలచి వేగమె వచ్చి వలచుట్టు కొనుచు
నతుల చించాకోటరావాస యోగిపతిని సత్కవి సార్వభౌము నీక్షించి
మనము లోపల మమ్ము మరువకుము.... (ప. యో. వి. 165, 166)

అనుచు కోరెనట, ఇట చిన్నన్న సంభాషణాత్మక ధోరణిలో రచన రస వంతముగ సాగించెను. ఆ అర్చామూర్తులు 'తమ తమ దివ్య నామములు తలపించి 'తముఁబాడు తముఁబాడు మనుచుఁ దోదోపులాడుచు' పలికి తొలగినవట. ఆ యోగి అట్లే ఆయా మూర్తులను తన ప్రబంధములలో.

కొనియాడెను. శ్రీరంగాధీశుడా స్తోత్రములకు మెచ్చి పొగడ దండను మెడను వైచెను. నాటి నుండి ఆ యోగి వకుళాభరణులని, వకుళ భూషణు లని పేరుపొందెను.

***మధుర కవి ఆళ్వారు :*** పాండ్య మండలము నందలి 'తిరు క్కోళూర్' అను గ్రామమున వాడి కేసరి, ఊర్ధ్వశిఖుడు, సామవేదియు నైన ఒక బ్రాహ్మణోత్తమునకు కుముద గణేశుని అంశమున నొక బాలుడుదయించెను. అతడు సద్వృత్తుడై, అష్టాక్షరీ మంత్రోపాసకుడై, కవి సార్వభౌముడై 'మధురకవి' యని పేరొందెను. అతడనేక పుణ్యక్షేత్రములు సేవించుచు దక్షిణ దిక్కున తాను దర్శించిన ఒక కాంతి ననుసరించి ప్రయా ణించి తిరునగరి చేరి తింత్రిణీ విటప మధ్యమున వేంచేసియున్న శఠగోప యోగిని చూచి నమస్కరించి యోగీంద్రా ! మీరు ద్రావిడ భాషలో రచిం చిన వేదములను నాకు తెలియజెప్పుమని ప్రార్థించెను. తను వెలయించిన ప్రబంధములను, అందలి దివ్య రహస్యములను, శ్రుతి గర్భితములుగ నారా యణుని పొగడు స్తోత్రములను శఠగోపయోగి వివరించెను. మధురకవి ఆనందపరవశులై ఆ యోగిపై స్తోత్రప్రాయమైన 'కణ్ణినిన్ శిరుత్తాంబు' అను దివ్య ప్రబంధమును రచించెను. గురు శిష్యులగు నీ శఠకోప మధుర కవి యోగుల చరిత్రలు వినిన వారికి "కరతలామలకంబు కైవల్య పదము, ధనధాన్య సంగతి తంగేటి జున్ను, గొనబైన ప్రాయంబు కొంగు పసిండి, యెదపక యొక్క మాటెన్న, జాలు జడునకైనను కల్గు సారస్వతంబు" అని ఫలితార్థమును ప్రశంసించుచు చిన్నన్న వీరి చరిత్రలను ముగించెను.

***కులశేఖరుల చరిత్ర :*** కేరళ దేశమున గల కొల్లి పట్టణమును పాలించు అపర రుక్మాందుడని పేరొందిన చేరవంశపు రాజైన ధృఢవ్రతు నకు మాఘమాసమున పునర్వసు నక్షత్రమున శ్రీహరి కౌస్తుభాంశమున నొక పుత్రుడుదయించెను. అతడు చిన్ననాటి నుండియు రామభక్తి పరాయ ణుడు. అతడరివీరభయంకరుడై దిక్కుల జయస్తంభములు నిలిపి ధరణిని

ఏకాత పత్రముగ పాలించెను. ఆ నరపతియే యీ కులశేఖర యోగి. భగవంతుని కంటెను భాగవతులే యధికులని ఇతడు భావించెను. తన కొరకై వచ్చిన శ్రీవైష్ణవులను అడ్డగించిన ద్వారపాలకులపై కోపించి వైష్ణవుల నెన్నడు అడ్డుపెట్టకుడని ఆజ్ఞాపించి వారిని పూజించి పంపెను. మంత్రులు శ్రీవైష్ణవులను వేరుచేయదలచి వారిపై చౌర్యారోపణము చేయ కులశేఖరు డాగ్రహించి వైష్ణవులు పరవధూ పరధన పర నిందలకు పాల్పడరని శపథము చేసి సర్పము గల కుంభమున చేయి పెట్టి ప్రమాణము చేసెను. శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమై వరము వేడుమన నీ పదభక్తి యందు నిరతులైనవారి యందు నాకు భక్తి యుండునట్లు వరమొసగుమని ప్రార్థించెను.

ఒకనాడు కులశేఖరులు శ్రీమద్రామాయణమును వినుచుండ సీతాపహరణ ఘట్టమును పౌరాణికుడు రసావేశమున చెప్పుచుండ నిజమని భ్రమించి సింహాసనముపై నుండి దుమికి రావణుని శిక్షించి సీతాదేవిని గొనితెత్తునని లంకాభిముఖుడై బయలుదేరెను. అట్టి భక్తిరసావతారుడైన కులశేఖరయోగి చరిత్రలను చిన్నన్న పరమ రమణీయముగా నిందు వర్ణించెను. కులశేఖరులు 30 పాశురములతో శ్రీరంగనాథుని, 70 పాశురములలో వేంకటేశ్వర శ్రీరామచంద్రులను స్తోత్రము చేయుచు 'నూరుపాటల కృతి' పెరుమాళ్ తిరుమొళిని రచించెను. ఈయన సంస్కృతమున ముకుందమాలను రచించినట్లు ప్రసిద్ధి. కాని చిన్నన్న పేర్కొనలేదు. ద్రావిడ ప్రబంధమగుటచే నూరుపాటల కృతిని మాత్రమే ప్రశంసించెను.

"దివ్యం యత్తదనుత్తమాద్భుత తరం శ్రోతృశ్రవానందదం
విఖ్యాతం కులశేఖరాఖ్య చరితం భక్తాబ్జ సూర్యోదయం"

అని కులశేఖరుల చరిత్రకు గల లోక ప్రశంస.

**తిరుప్పాణి ఆళ్వారు చరిత్ర :** నిచుళాపురమున శ్రీమన్నారాయణుని శ్రీవత్సాంశమున తిరుప్పాణుడను కవియోగి అవతరించెను. ఇత

నికి శ్రీరంగనాథుని యందలి భక్తియే ధారక పోషకములు. ఇతడు రంగ భూమిని శ్రీరంగనాథుని మూర్తిగా భావించి ఆవీడు త్రొక్కరాదని యెంచి కావేరి అవల ఒడ్డున నిలచి ఆలయము వెలుపలనే వీణ మీటుచు మధుర ముగ స్తోత్రగానము చేయుచుండెను. ఒకనాడు శ్రీరంగనాథుడు శ్రీదేవిని చూచి అమృతము కంటె మధురమైన ఆ గానము వింటివా ? అని ప్రశ్నింప మీకింత ప్రీతిపాత్రుడైన ఆ భక్తుని దూరముగ నుంచవచ్చునా ? లోనికి రప్పింపరాదా ? అని ప్రశ్నించెను. అంత నారాయణుడు నిత్యము తనకు తీర్థము నర్పించు లోకసారంగమునివి చూచి గాయక సార్వభౌముడైన తన భక్తుడు తిరుప్పాణుని తన చెంతకు అంసమున నిడికొని తీసుకు రమ్మని ఆజ్ఞాపించెను. లోకసారంగముని యట్లే తిరుప్పాణయోగిని తన భుజము లపై నెక్కించుకొని రంగని సన్నిధికి చేర్చెను. నాటి నుండి తిరుప్పాణ యోగి మునివాహనుడని పిలువబడెను. ఈ యోగి శ్రీరంగనాథుని పాదాది కేశపర్యంతము సేవించి 'అమలనాదిపిరాన్' అను నొక దివ్య ప్రబంధ మును కటాక్షించి రంగనాథుని సేవించిన కనులు వేరొకదానిని చూడవని తలచి ఆ సర్వేశ్వరునిలో లీనమయ్యెను.

ఇంకను చిన్నన్న తృతీయాశ్వాసమునందీ నలుగురు యోగుల చరి త్రములనే గాక నిచుళాపురవల్లియగు పద్మినీ శ్రీరంగనాధుల పరిణయ వృత్తాంతమును గూడ వివరించెను. ఇందు రంగనాథుని రాజస రూప చాతు ర్యములను గూర్చి పరాంకుశాది దివ్య సూరుల దివ్య ప్రబంధముల వలన పద్మిని తెలిసికొనినట్లు చెప్పబడినది.

**మార్పులు :** మూలమునందు శఠకోపయోగి చరిత్రలో మధురకవి శఠకోపయోగిని వెదకుచు వచ్చి "ఇవర్కుచైతన్యముణ్డో, శెవికేట్కుమో" వీరికి చైతన్యము కలదా ? చెవి వినబడునా ? అని పరీక్షింప దలచి ఒక రాయిని ఎత్తి వారిముందు పడవేయగా శఠకోపులు కనులు తెరచిరి. మధుర కవి "ఇవర్కువాక్కు ఉణ్డో" — వీరికి మాట కలదా ? యని చింతించి —

"శెత్తత్తిన్ వైత్తిలే శిరియదు పిఱన్దాల్, ఎత్తైత్తిన్ఱు ఎజ్గే కిడక్కుమ్" - చచిపోయిన దానినుండి సూక్ష్మము పుట్టి ఏమి తినును ? ఎక్కడ ఉండును? (అనగా ఈ ప్రకృతి యందు జనించిన జీవుడు దేనిని అనుభవించుచు ఎక్కడ ఉండును) అని ప్రశ్నింప - "అత్తైత్తిన్ఱు అజ్గే కిడక్కుమ్'' దానినే తిని అక్కడే యుండును (అనగా శరీరగతమైన సుఖ దుఃఖముల ననుభవించుచు శరీరమునే ఆశ్రయించుకొని యుండును) అని సమాధానము చెప్పెను.

చిన్నన్న ఈ అంశములను ప్రకటింపక ఏ విధమైన ప్రశ్న లేకయే మధురకవి పరాంకుశుని తన పరమాచార్యునిగ ఎన్నుకొనినట్లు వ్రాసెను. మరియు మూలమున లేని వేదాంత తత్త్వమును మధుర కవికి ఉపదేశించినట్లు రచించెను.

కులశేఖరుల చరిత్రలో - "ఘుష్యతే యస్య నగరే రంగ యాత్రా దినేదినే తమహం శిరసావన్దే రాజానాం కులశేఖరమ్" అను సుప్రసిద్ధ శ్లోకము నందలి రంగయాత్ర సన్నివేశమును చిన్నన్న స్పృశింపలేదు. కులశేఖరుల కుమార్తెను శ్రీరంగ నాథున కర్పించుట గురుపరంపరా ప్రభావము నందు లేదు. చిన్నన్న చేర్చెను.

తిరుప్పాణి ఆళ్వారు చరిత్రలో - "కులంతాజ్గుశాది కళ్ నాలిలుం కీళిళిన్ద" (తిరువాయిమొళి 3-7-9) సకల కులములకు నాధారమైన బ్రాహ్మణాది చతుర్వర్గములందు పతనము చెంది తిరుప్పాణి పంచమ వర్ణమున అవతరించినట్లు తెలియుచున్నది. దివ్యసూరి చరితము నందును ఇట్లే చెప్పబడినది కాని తిరుప్పాణి అయోనిజులుగా వరివెన్ను నుండి జన్మించి పంచమ వర్ణమున పెరిగిరని చెప్పబడెను. ఈ యోగి అవతారమును గూర్చి చిన్నన్న ఎట్టి చర్చలకు తావీయక - "ప్రచుర వైష్ణవ కుల పాదోధి శీత రుచినాగ కార్తిక రోహిణీతార జనియించె" అని చెప్పి ముగించెను. తిరుప్పాణి పంచములగుటచే ఆలయమున ప్రవేశింప నీయలేదని కొందరు విమ

ర్శకులు ఘోషించిరి. కాని "నిచ్చలు నా రంగ భూమి హరి దివ్యమూర్తి గా నాత్మ భావించి యా వీడు ద్రొక్కరావని" తలపోసి ఆలయమున ప్రవేశింప లేదని చెప్పి చిన్నన్న కుల ప్రస్తావనము చేయక చప్పుడు కావీయక ఔచి త్యమును పోషించెను.

**అనువాదము :** పూర్వాచార్య స్తోత్రములను చిన్నన్న ఆయా పదములతోనే సందర్భానుగుణముగ అనువదించెను. "అపగతమదమానైః అన్తిమోపాయ నిష్ఠైః అధిగత పరమార్థైః అర్థకామానపేక్షైః" అను ఉత్తర దినచర్య శ్లోకమును "అధిగత పరమార్థు లర్థకామాన పేక్షులు గత దోషమతులు....అపగత మదమాను లచ్యుత ధ్యాను" లనుచు (పు. 202). చిన్నన్న అవే పదజాలముతో యథాతథముగ కులశేఖరుల చరిత్ర యందను వదించెను.

తిరుప్పాణి ఆళ్వారు చరిత్రలో పాణయోగి రచించిన 'అమలనాది పిరాన్' అను దివ్య ప్రబంధములోని 10 పాశురముల భావానువాదమును చిన్నన్న స్వతంత్రమనిపించు రీతి చక్కగ నిర్వహించెను. ఉదా :

"శదుర మామదిళ్ శూళ్ ఇలఙ్గైక్కిఱైవన్ తలై పత్తు
ఉదిర వోట్టి, ఓర్ వెఙ్గణైయు య్త్తవన్ ఓదవణ్ణన్
మదుర మావణ్డు పాడ మామయిలాడ రఙ్గత్తమ్మాన్, తిరువయిత్తు
ఉదర బన్దం ఎన్నుళ్ళత్తుళ్ నిన్ఱు ఉలాగిన్ఱదే...."

— అమలనాది పిరాన్.

గొప్ప ప్రాకారములు గల లంకానగరమునకు ప్రభువగు రావణుని తొలి నాటి యుద్ధమున విడచి మరునాటి యుద్ధమున వాని పదితలలను తాటిపండ్లు వలె బ్రహ్మాస్త్రముచే పడగొట్టినవాడును, సముద్రమువలె చల్లని దివ్య మంగళ విగ్రహము గలవాడును తుమ్మెదలు పాడుచుండగా, నెమళ్ళు

అడుచుండగా అందమైన శ్రీరంగమున వేంచేసియున్న శ్రీరంగనాథుని ఉరముపై గల ఉదర బంధము నా మనస్సున స్థిరముగా నున్నది అని పై పాఠము యొక్క భావము. దీనిని చిన్నన్న ఇట్లనువదించెను.

"బవనాన లంకాధిపతి పదితలలు తివుట నొక్కుమ్మడిఁ ద్రెళ్ళంగనేసి
మధుహన మధుమత్త మధుకరజాల మధుర నాదంబుల మానగ్గలించి
మొనసిన పెనుదేఁటి మూఁకల మొగలులని యాదు నమ్మల యలరంగభూమి
నుల్లసించిన దేవు నుదర బంధంబు నుల్లంబులోన నాకుల్లసిల్లెడిని"

— ప. యో. వి. పు. 257

ఈ కవితానువాదము మూలభావమున కతిచేరువయై యలరారినది. ఈ యాశ్వాసమున "పరమ భాగవత సంభాషణరుచులు మరగినవాఁడేల మరగు నన్యంబు...." (పు. 200) అనురీతి రచనలో పోతన భాగవత ఛాయ గోచరించును. "ధరఁ దపస్వి వాగ్విదాం వరభక్తి పర నారదం పరి ప్రపచ్ఛ భవ్య వాల్మీకి ముని పుంగవువా యని నుడివి .... అనిశంబు శ్రీరామ యని మధురముగ దనరుచుండెడు కవితాశాఖ యెక్కి పలుకుచుండెడు నాకు భవ కోకిలంబు దలచి యంజలిఁజేసి" - (పు. 226) ఈ రీతి సాగిన రచనములో "తపస్వీవాగ్విదాం .... ఆరూఢ కవితాశాఖాం .... ఇత్యాది శ్లోకములు, వాని భావములు అలవోకగ ద్విపదలలో ఒదిగిపోయినవి. చిన్నన్న ఈ యాశ్వాసమున ఏ కథకా కథ చివరనే ఫలశ్రుతులను చెప్పుచు రచన సాగించెను.

***చతుర్థాశ్వాసము : విప్రనారాయణ చరిత్ర :*** సుప్రసిద్ధమైన విప్రనారాయణుల చరిత్రను తెలుగు సాహిత్యమున ఎందరెందరో కవులు ప్రత్యేక ప్రబంధములుగ వెలయించిరి. క్రీ. శ. 1564 లో తిమ్మభూపాలుడు, 1585 లో చెదలువాడ మల్లన కవి, 1600 ప్రాంతమున

సారంగు తమ్మయ ఈ కథను కావ్యములుగ సంతరించిరి. 1633–73 కాలమున తంజావూరు నేలిన విజయ రాఘవ నాయకుడు విప్రనారాయణ చరిత్రను యక్షగాన రూపమున రచించెను. వీరందరి కంటె ముందు తాళ్ళపాక చిన్నన్న పరమ యోగి విలాసము నాల్గవ ఆశ్వాసమంతయు విప్రనారాయణ చరిత్రకు కేటాయించి రచించెను. 'ఆంధ్ర సాహిత్యములో చిన్నన్న కథనమే ప్రమాణమని' పేరు గాంచెను. ప్రాచీన సంస్కృత గ్రంథములైన దివ్య సూరి చరిత్రము, ప్రపన్నామృతములను గాక చిన్నన్న ద్రావిడ ప్రబంధము చూచి దీనిని రచించెను. ఇతని రచనయే యితర కవులకు మార్గదర్శకమయ్యెను.

విప్రనారాయణులనే తొండరడిప్పొడి ఆళ్వారు (భక్తాంఘ్రిరేణువు) అందురు. "భక్తులకుఁ దొండ, రంఘ్రి శబ్దమున కడియు, రేణువకుఁ బొడి యనియు నీరీతి ద్రవిడ భాషఁ బరఁగుటఁ జేసి, తద్భాష జనములతనిఁ దొండరడిప్పొడి యంద్రు బుధుని" అని వైజయంతీ విలాసమున తమ్మయ కవి వివరణము. విప్రనారాయణుడు క్రీ. శ. 7వ శతాబ్దివాడని ఐతిహాసికుల నిర్ణయము.

కావేరి నది సమీపమున చోళదేశమున మండంగుడి యను బ్రాహ్మణాగ్రహారములో నొక విప్రునకు శ్రీహరి వనమాలికాంశమున విప్రనారాయణులు జన్మించెను. ఈ యోగి నిగమాంతముల నధిగమించి సంసారమసారమని యెంచి శ్రీరంగనాథుని సేవలో కాలము గడుపుచుండెను. మండంగుడి పుర వర్ణనముతో కథను ప్రారంభించినాడు చిన్నన్న. ఆయోగి సుందరోద్యాన వనమును నిర్మించెను. అతడు మాలికాంశమున జన్మించుటచే కాబోలు భగవంతునకు మాలికలర్పింపవలెనను బుద్ధి కలుగ పూవులను తులసిని మాలికలుగ కట్టి శ్రీరంగధామునకు పుష్పకైంకర్యము చేయుచుండెను.

ఇట్లుండ దేవ దేవి యను నొక వేశ్య శృంగారాలంకృతయై నాట్య మున విచుళేంద్రుని మెప్పించి శ్రీరంగము మీదుగా తిరిగి వచ్చుచు నేద దేరుటకు విప్రనారాయణుని ఉద్యానవనము చేరెను. ఆతడామెను కనుగొన కొన్న చూచి తన అక్కతో 'ఈతడు మందుడో జడుడో సోమరియో' అని పలుక ఆమె అక్క కోపించి' కమల సంగము కోరు తేటి ఉమ్మెత్తను ఆశించ నట్లు రంగేశుకైంకర్యరతుడైన వితడు అంగనారతి కోరునా ? అని పలుక స్త్రీలకు వశులు కానివారెవరు ? వీనివి వశపరచుకొని ఆ గోచి బాపనిని కొనల నెక్కించెదను చూడుమని ప్రతిజ్ఞ చేసెను. నీవట్లు చేసిన నీకు తొత్త నయ్యెదనని దేవదేవి అక్క పందెము వైచెను. పై కథా సందర్భముల చిన్నన్న దేవదేవి సౌందర్యమును, గ్రీష్మ ఋతువును మనోహరముగ వర్ణించెను.

ఇట్లు పందెము వేసి దేవదేవి పరమ వైష్ణవముట్టిపడునట్లు వేషము మార్చినది. ఎట్లు ? —

"గన్నేరు పూచాయ గల నీరు కావి వన్నియ పుట్టంబు వదులుగాఁ గట్టి....
బిగి చన్నుఁగవ మీఁదఁ బెరయఁ బయ్యెదయు దిగిచి నెన్నడుమున
చిందుగాఁ జుట్టి
నడిముక్కు నొరయంగ నామంబు వెట్టి నడుమ హారిద్రచూర్ణపు రేఖఁ దీర్చి"
— ప. యో. వి. పు. 284.

చిన్నన్న ప్రభావమనంతర కవులపై గలదనుటకు సారంగు తమ్మయ కావించిన ఈ క్రింది దేవదేవి వర్ణనము చూడుడు—

"నడిముక్కు మీఁద సన్నపు నొభి నామంబు
నడిమి మంజిడి కావి నిడుదరేఖ....
చనుదోయి నిఱియఁ గట్టిన చుట్టు పయ్యెద
క్రొత్త దోమిన ంత కోరకములు"
- వైజయంతీ విలాసము ద్వి. ఆ. ప. 54

వైరాగ్యము రూపు దాల్చినదో యనగ దేవదేవి విప్రనారాయణుని చేరి పాదములపై బడి ఏడ్చుచు ఓ ముని నాథా ! నేను నర్తకిని. వేశ్యను.

"ఇలపుట్టు పుట్టువులందు ఆడుపుట్టువు హీన మందు లోపలను
కంజనందనుడతి కష్టమైనట్టి లంజపుట్టువున నీలాగున నన్ను పుట్టించె"

నన్ను రక్షింపుము. నా ధనమును విప్రులకు దానము చేయని నా తల్లిపై కోపించి కామగుణ కవాటమును మూసి మీ పాదముల శరణు జొచ్చితిని. అనాథను. ఏదైన ఊడిగమును కల్పించి పని గొనుమ"ని వెక్కి వెక్కి ఏడ్వసాగెను. ఆ మాయలాడి మాటలు నమ్మి ఆమెను సధర్మిణిగా బావించి విప్రనారాయణుడామెను చేరదీసి రంగని కైంకర్యమునకు తోడు కలిగెను కదా యని సంతసించెను. రాత్రులందు విప్రనారాయణుడు తన పూరింటను, దేవదేవి ఒక పొదరింటను విద్రించు చుండిరి. సంవత్సరము గడిచినది. తన ప్రతిజ్ఞ వమ్మగుచున్నదని విచారించుచున్న దేవ దేవికి స్వప్నమున రంగవిభుడు సాక్షాత్కరించి 'రేపు నీ మనసు చల్ల చేసెద'నని పలికెను.

మఱునాడు రాత్రి ఝంఝూ మారుతముతో కుంభవృష్టి కురిసెను. చిన్నన్న ఇట వార్షుక వర్ణనము చేసెను. ఆ వానకు వణకుచున్న దేవదేవిని విప్రనారాయణుడు తన గృహములోనికి రాబిలిచెను. ఆమె లోనికేగి తన అందములను కనబరచి ఓ ముని చంద్రా ! ఇంతవరకు వనములో అలసిన మీ పాదముల నొత్తుదునా' అని మృదువుగ పలికి అతని ఊరులంటుచు పాదములొత్త సాగెను. అంతరంగమును రంగభోగి ప్రేరేపింప ఆమె చేయి తగులుటచే నిలువెల్ల పులకించి విప్రనారాయణుడు దేవదేవిని కూడెను. ఈ సన్నివేశమున చిన్నన్న శృంగార రసపోషణమును అత్యంత ఆకర్షణీయముగ నిర్వహించెను.

"ఘృతకుంభ సమానారీ తప్తాంగార సమః పుమాన్
తస్మాత్ ఘృతంచ వహ్నించ నైకత్ర సాపయేత్ బుధః"

అను రీతి అయినది విప్రనారాయణుని పరిస్థితి. ఈ సందర్భమున ఆ యోగి నిశ్చల సద్భావము క్రమముగ సడలి యెట్లు పతనమైనదో వర్ణించు కవి లోక ప్రసిద్ధమైన ఈ క్రింది పద్యమును చూడుడు.

"ఆ విప్రోత్తము వజ్ర పంజర నిభంబైన నిశ్చలంబైన స
ద్భావంబంగన సాహచర్య గుణ సంపర్కంబునన్ లోహమై
గ్రావంబై, దృఢదారువై తరుణ వృక్షంబై ఫలప్రాయమై
పూవై తన్మకరందమై కరగెఁ బోఁ బోసిళ్ళకుం బల్చనై"
— సారంగు తమ్మయ: వైజయంతీ విలాసము.

ఇట్లు వైష్ణవ మాయచే కరగిన మనసుతో నున్న విప్రనారాయణుని దేవదేవి తన యింటికి తోడ్కొనిపోయి అక్కడ చూపించెను. ఆ యోగి విషయ సుఖానంద భోగియై ఆ యింట కాలము గడుపుచుండ విటులు రాకుండిరి. దేవదేవి తల్లి కుమార్తెను మందలించి విప్రనారాయణుని ఇలు వెడల గొట్టెను. విప్రనారాయణుడు ఖిన్నుడై దేవుడాయని తలక్రింద చేయి పెట్టి పంచపై పరుండి ఆ దేవదేవినే చింతించు చుండ అట శ్రీరంగనాథుడు చిరునవ్వు నవ్వెను. ఆ నవ్వునకు కారణమడుగ శ్రీదేవితో రంగనాథుడు జరిగిన వృత్తాంతమును చెప్పి అంతటి నిష్ఠాగరిష్ఠుడు వెలయాలి పంచ నిట్లయ్యె కదా యని నవ్వితినని చెప్పెను. "రవిదీప్తి అంధకారము సోకు టెట్లు....తనయుని సిగ్గెంబు తండ్రిది గాదె" అనుచు ఆ లోకమాత తల్లడిల్ల రంగనాథుడిట్లనెను. అతడు నా లీలచే వశుడై యున్నాడు. అతనికి దుష్టరతిరక్తి లేదు. అతడు మహాయోగి. మోక్షమైన ఈయగలదు. అని పలికి వానికి సంతోషము కలిగింతునని చెప్పి మాయావటునిగ మారి యొక హేమపాత్రను దేవదేవి తల్లి కిచ్చి దేవదేవి ఆహ్వానమును విప్రనారాయణున కెరిగించి అదృశ్యుడయ్యెను. ఇది రంగని కరుణయని భావించి నాటి రాత్రి దేవదేవిని కూడి విప్రనారాయణుడానందించెను. మరునాడు శ్రీరంగ దేవాలయ రక్షక భటులు హేమపాత్ర చౌర్యమును దేవదేవి విప్రనారాయణు

లపై మోపి రాజు సన్నిధికి గొనిపోయిరి. రాజు విచారణ జరిపి విప్రనారాయణుని దొంగయని నిర్ధారించి దేవదేవిని విడచి యతనిని బంధించెను. శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై లీలార్థమై తానే ఆ గిన్నెను దేవదేవి కిచ్చితిన నియు, విప్రనారాయణుడు నిర్దోషి అనియు పలికి - "ఇతడు నా బిడ్డడు ఏనుకూర్చిన ధనంబితనిది గాదె చేకొని లంజ కిచ్చిన యట్టి సొమ్ముకై కొందునే అని చెప్పి అంతర్థానమయ్యెను.

విప్రనారాయణుడు రంగని సన్నిధికేగి తన దోషములను భోగ్యము లుగ స్వీకరించిన నారాయణుని కృపను కొనియాడుచు శ్రీమాలిక (తిరుమాలై) అను కృతియు, 'ప్రాభోధకి' (తిరుప్పళ్ళియెళుచ్చి) అను దివ్య ప్రబంధమును కటాక్షించెను. 45 పద్యములలో ప్రాచీన తమిళ భాషలో నితడు రచించిన తిరుమాలై స్తోత్రములందు తన చరిత్ర సూక్ష్మముగ సూచించెను. పది గీతికలు కల తిరుప్పళ్ళి యెళుచ్చిలోని సుప్రభాత గీతిక లను నేటికిని శ్రీవైష్ణ క్షేత్రములలో గర్భాలయ ద్వారము తెరవక పూర్వము పాడుదురు.

ఇతివృత్త పరమార్థము : 'సాధకుడు గాని, భక్తుడు గాని జీవితములో మలుపు తిరగని పక్షమున మరింత భ్రష్టుడగును....కనుక ఏదొక మిషచే పారమేశ్వరిక ప్రభావము జైవ మాంద్యమును ఛిన్నాభిన్నము గావించి వ్యక్తి నుద్ధరించును. ఉద్ధరణా త్పూర్వము జీవికి ఆవేదన, ఆక్రోశము, భగవద్గుణాను సంధానము మొదలగు క్రియలు రేకెత్తును. అనంతరము ఆత్మోద్ధరణము జరుగును. ఈ సత్యమును వివరించుటకే కావ్యము కల్పింపబడినట్లు తోచును' అని శ్రీ స్వామి శివ శంకరస్వామి వైజయంతీ విలాస ప్రవేశికయందు చెప్పిరి. దీనిని బట్టి విప్రనారాయణుల చరిత్రకు గల పారమార్థిక ప్రయోజనమెట్టిదో విశదమగుచున్నది.

చిన్నన్న ఈ కథను కథోపక్రమణమున కుద్దీపకములగునట్లు హాస్యాద్భుతాది రస సమ్మిశ్రితముగ, నాటకీయ ధోరణిలో సంభాషణాత్మకముగ

చక్కని తెలుగు పదబంధముతో రసజ్ఞమనోజ్ఞముగ తీర్చిదిద్దినాడు. మూల గ్రంథమున లేకుండుటచే చిన్నన్న వసంతవర్ణనము చేయలేదు. వేసవి వర్ణనము గావించెను. చిన్నన్న మార్పులు చేయక యథామూలము గనే అనువదించినట్లు తెలియనగును. చిన్నన్న గ్రంథమునే ఆధారముగ చేసికొని పద్య కావ్యముగ రచించిన సారంగు తమ్మయ అచ్చటచ్చట కొన్ని మార్పులు చేసికొనెను. చిన్నన్న వదలిన వసంత వర్ణన తమ్మయ కావించెను. నారాయణుడు తమ్మి చూడనే లేదని దేవదేవి పంతము వేసినట్లు చిన్నన్న. తాము మ్రొక్కినను చూడలేదని తమ్మయ. నారాయణ దేవ దేవులు వేరువేరు కుటీరములలో నున్నట్లు చిన్నన్న. ఏక కుటీరములో నివసించినట్లు తమ్మయ. చిన్నన్న నారాయణుడు దేవదేవీ సమాగమమున ధీర నాయకుడు. తమ్మయ నారాయణు డధీరనాయకుడు. శ్రీరంగనాథుడు బ్రహ్మచారిగ వచ్చి తన పేరు కాంతోపయంతుడని చెప్పినట్లు చిన్నన్న. తన పేరు రంగడని చెప్పినట్లు తమ్మయ. చిన్నన్న నారాయణుని భక్తి, సహజ వైరాగ్యములను వర్ణించి ప్రాబోధకి స్తుతి శ్రీ మాలికా రచనలను పేర్కొనెను. తమ్మన విశేష శృంగార వర్ణన గావించి అతని రచనలను ప్రస్తావించలేదు.

ప్రధాన కథ ఒకటే అయినను ఆయా కవులిట్లు కొలదిగ మార్పులతో కావ్య రచనలు చేసిరి. వానిని పరిశీలించినచో దేనికదే సముచితమనిపించును.

చిన్నన్న సంభాషణలలో చాతుర్యమును ప్రదర్శించినాడు. విప్రనారాయణు, దేవదేవి, విటకంటకి, వేశ్యల శరీర వర్ణనలను మనోజ్ఞముగ రచించినాడు. పాత్ర చౌర్యమునకు సంబంధించిన న్యాయ విచారణము, శిక్షల నిర్ణయములో నాటి న్యాయ వ్యవస్థను ప్రతిబింబింపజేసినాడు. సామెతలు, జాతీయములు, ద్రావిడ శబ్దములను సముచిత రీతిని ప్రయోగించి సహృదయ హృదయాహ్లాదముగ ద్విపద రచన సాగించి యింత వరకు లభ్యమైన

కావ్యములలో తన విప్రనారాయణ చరిత్ర నిర్వహణమే తలమానికమై విరాజిల్లునట్లు సర్వజన సమ్మోదముగ రచించినాడు చిన్నన్న.

**పంచమా శ్వాసము :** విష్ణుచిత్త యోగి, గోదాదేవి చరిత్రలిందు వర్ణితములు. ఈ యితివృత్తమును స్వీకరించియే శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రమున ఆముక్త మాల్యద యను ప్రౌఢ ప్రబంధమును నిర్మించెను. 'రెండును భావౌన్నత్యము గలవేయయినను పోల్చినచో చిన్నన్న రచనము లోని కొన్ని అంశములు ఆముక్తమాల్యదలో కానరావనియు, రాయల ప్రబంధములోని ప్రౌఢత్వముతో చిన్నన్న సరళత్వములోని తీపి పోటీ పడుచున్నదనియు' పండితుల అభిప్రాయము. (తాళ్ళపాక కవులు — వెసు మామవెం కట శేషయ్య పు. 147) చిన్నన్న రచనమును పరిశీలింతము.

**విష్ణుచిత్తుల అవతారము :** పాండ్య మండలములోని శ్రీవిల్లి పుత్తూరు నగరమున శ్రీమన్నారాయణుడు వటపత్రశాయియై వేంచేసి యుండెను. ఆ నగరము నందొక బ్రాహ్మణ వంశములో గరుడని అంశ మున భట్టనాథుడను పేర విష్ణుచిత్తులుదయించెను. "సిరిమించు కళలతో జ్యేష్ఠమాసమున వరలగ్నమున గంధవహతారయందు నక్షీణ వేదమయాంగు డైనట్టి పక్షీంద్రు వంశంబు ప్రభవించి"నట్లు చిన్నన్న కథనము. వైష్ణవ పూజా వివర్ధనుడగుటచే నీయన విష్ణుచిత్తుడన విఖ్యాతి నందెను. హరికి విరుల పూజ యిష్టమని భావించి యొక పుష్పవనము నేర్పరచి 'చందన చాంపేయ శారద వకుళ కుంద మాకంద ముకుంద మందారము'లతో అను నిత్యము శ్రీహరికి సుమదామ కైంకర్యము చేయుచుండెను.

ఒకనాటి రాత్రి పాండ్య ప్రభువైన వల్లభ దేవుడు 'గొంగడి ముసు గిడికొని' మారువేసమున పట్టణమంతయు తిరుగుచు ఒక వీధిలో నొక యరుగుపై పరున్న విప్రుని లేపి మీరెవరు ? మీరు చదివి వచ్చిన విశే షము లేవి ? అని ప్రశ్నించెను.

"క్షదు నేర్పుమై వానకాలంబు కొఱకు గడమ యెన్మిదినెల లడియింపవలయు
నగపడు రాత్రికై యాత్మ( జింతించి పగలె వస్తువుల సంపాదింపవలయు
మును వచ్చు వార్ధకమునకునై నరుడు తన యౌవనమున యత్నము
పేయవలయు
భావినీయంబై న పరకారణంబు నీ జననమునందె యెఱుంగవలయు."

— ప. యో. వి. పు. 355.

నను భావ మావిప్రుడు చెప్పిన శ్లోకసారాంశమని రాజు గ్రహించి వెంటనే నగరికి వచ్చి మోక్షమార్గమును తెలిసికొనదలచి కనక శుల్కమును సభా స్తంభ మధ్యమున గట్టించి పరతత్త్వ నిర్ణయము చేసిన వారికా శుల్కము నిచ్చునట్లు ప్రకటించెను. అది విని 'కపిలాక్షపాద భట్టాది ఘనశాస్త్ర విదులై న ఘనులేగుదెంచి అదిమృష ఇది మృష యనుచు పరమతదూషణము చేయుచు ఏ సంగతియును తేల్చక పరతత్త్వ నిర్ణయము చేయక 'పెరుగు వడ్లును కలిసిన రీతి' నుండిరట. అంత వటపత్రశాయి విష్ణుచిత్తునితో 'పాండ్య భూకాంతుని సభను గనుపట్టు కనక శుల్కంబు గై కొను'మని శలవిచ్చెను. అతడు సంశయించుచుండ శ్రీహరి 'నిగమాంత నిశ్చితార్థము నీ హృదయమున నేనుండి పలికించువాడను, పలికెడువాడ'నని అభయ మిచ్చి పంపెను. విష్ణుచిత్తుడు వేగవతి నదిని దాటి మధుర ప్రవేశించి రాజ సభను ప్రవేశింప వల్లభ దేవుడు సింగపు గద్దియ దిగి యెదురేగి అర్ఘ్య పాద్యాదుల పూజించిన — "పట్టె నామంబులు ఫాల భాగమున( బెట్టిన వచ్చునే పెద్దతీకంబు ? .... ఎక్కడ దీర్చని యీ బిఢకాయ చిక్కు దా నిత నిచే( దీరుట యెట్లని" ప్రతివాదు లసూయచే అవహేళనము చేసిరి.

శ్రీహరి కటాక్షముచే విష్ణుచిత్తులు శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని సహేతుకముగ నిర్ణయము చేయ శుల్కము తెగి నేలపై బడెను. రాజు విష్ణుచిత్తులను పట్టపుటేనుగుపై ఊరేగింపుచుండ శ్రీమహా విష్ణువు తన భక్తుని చూచుటకై యేతెంచెను. అట్లు ప్రత్యక్షమైన సౌందర్య నిధియగు

నారాయణునకు దృష్టిదోషము తగులునని విష్ణుచిత్తులు 'కుంజరమునకు గల పసిడి గంటలే తాళము కాగ మంగళాశాసనము గావించి'నట్లు చిన్నన్న వర్ణించెను. పాండ్యరాజు సభలో పొందిన విజయ శుల్కమును శ్రీవిల్లి పుత్తూరు నందలి వటపత్రశాయికి సమర్పించి పరమ విరక్తితో రెండు ప్రబంధములు రచించి యథాప్రకారము తోటపని చేయుచు కాలము గడుపుచుండెను.

*గోదాదేవి వృత్తాంతము :* ఒకనాడు విష్ణుచిత్తుడు తులసి వనమునకు గుద్దలితో పాదులు చేయుచుండ తన్మధ్యమున 'రుచిర గారుత్మతరుచి రేఖ' వంటి బాలిక కనిపించెను. 'తెల్లతామర కొలని చెంత గల తులసి తోటలో పాలగచ్చు తిన్నె మీద అంఘ్రికరోదరాధరన్, ఒక బాలను కనుగొనినట్లు' రాయలు ఆముక్తమాల్యద యందు చెప్పెను. అతడాపాప నెత్తుకొని ముద్దాడుచుండ అశరీరవాణి యిట్లు చెప్పెను. 'తొల్లి వరహావతారమున ధరణిని కొమ్మున కాచిన పిదప హరికి ఇష్టులు, ఇష్టమగు పూజ ఏది యని భూదేవి అడుగగా, 'నను గూర్మి పొగడెడువారు, అలరుదామము లర్పించువారు' తన కిష్టులని శ్రీహరి తెల్పెను, అట్టి పూజనము చేయగోరి నీవు మహాయోగివరుడ వని అవ్విపులావధూటి నేడిట్లు నీకు నందనయైనది. జనకుడు సీతాదేవిని వలె గొనిపోయి పోషింపుమన విష్ణుచిత్తుడా బాలికను గొనిపోయి తన భార్య చేతికిచ్చి జాతకర్మములు దీర్చి - " ఈ దేవి హరి నెన్ను నిట మీద నను చు గోదాభిధాన మా కొమరితె కొసగి" పెంచు చుండెను.

గోదాదేవి చిన్నతనమున నుండియు శ్రీహరి యందే వలపు గలదై ఆటలందు మాటవరుసకై - "చిక్కిలి పతి పేరు చెప్పుమటన్న, జక్కని వటపత్రశాయి నా మగడు" అని చెప్పుచుండెడిది. ఇట్లు శ్రీపతి పతి యని తలచి తన తండ్రి స్వామికై కట్టిన మాలలను ముందుగ తన కొప్పున నొప్పుగ ముడిచి బావి నీటిలో నీడను చూచుకొని సంతసించి యెప్పటివలె

ఆ మాల్యములను బుట్ట యందుంచెడిది. వానిని స్వామి ముదముతో స్వీకరించుచుండెను. ఒకనాడది తండ్రి చూచి అపచారమని విచారించి మరికొన్ని మాల్యములు కట్టి సమర్పింప, ఆయన స్వీకరింపక గోదాదేవి ధరించిన పూలమాలలే తన కిష్టమనియు, తానామెను పెండ్లి యాడగలననియు చెప్పెను. నాటి నుండి ఆమెను 'శూడిక్కొడుత్త నాచ్చియార్' (ముడిచిన పూలనిచ్చిన ముగుద) అని పేరు వచ్చెను. క్రమముగ గోదాదేవి యౌవనవతి యయ్యెను. తండ్రి చెంత కూర్చొండి అర్చావతార రూపమున వేంచేసి యున్న శ్రీమన్నారాయణుని వైభవమును చెప్పుమని కోరెను. భట్టనాథులు 108 దివ్య దేశములందలి అర్చామూర్తుల వైభవమను వర్ణించి చెప్పెను. ఇచట చిన్నన్న దక్షిణ భారతమున గల వైష్ణవాలయములను అందలి దైవములను, వారి మహిమలను మనోహరముగ వర్ణించెను. అది చిన్నన్న క్షేత్ర దర్శన సంబంధిత స్వానుభవము కావచ్చును. ఇందే—

"భూలోక వైకుంఠమున వేంకటాద్రి నీ లోకముల నీడేర్చు కొఱకు
నలమేలుమంగ బాహాంతర సీమ నెలకొల్పి నిఖిలావనీ స్థలిలోనె
శరణని వచ్చిన జనులకు నిష్ట వరములిచ్చుచు గారవమున....

అనుచు వేంకటేశ్వరస్వామి వైభవమును కవి 20 ద్విపదలలో వర్ణించెను. అట్లు తండ్రి చెప్పుచుండ గోదాదేవి 'పరమ మౌనివలె పరచింతలుడిగి' వినుచుండెడిదట రంగేశుని వైభవము వినినప్పుడామె పులకించి ఆయన చరిత్రను పరిపూర్ణముగ చెప్పించుకొని పరవశించెను.

"కనుగొన్న మదియెల్లఁ గావేరి యనుచుఁ గనుగొలనబ్జి పుష్కరిణి యటంచు
గనక చేలాంశు విగ్రహముల వేనిఁగనుగొన్న శ్రీరంగ కాంతుడ యనుచు"

ఆమెకు జగమంతా రంగమయమై రంగని యందామె ప్రేమ విశ్వరూపము దాల్చెను.

*మార్గశీర్షమాస వ్రతము :* శ్రీపతిని పతిగా పొందు మార్గమేది యని గోదాదేవి తండ్రిని అడిగెను. విష్ణుచిత్తుడు మార్గశీర్ష మాస వ్రతమాచ

రింపుమని చెప్పెను. గోదాదేవి గోపికా భావమును పొంది 30 రోజులు వ్రతమాచరించెను. ఆ ముప్పది దినములలో 30 పాశురములు పాడి 'తిరుప్పావై' అను ప్రబంధమును రచించెను. ఇంకను శ్రీరంగనాథునిపై గల ప్రేమాతిశయముచే నామె 140 పాశురములు గల 'నాచ్చియార్ తిరుమొళి' అను మరియొక ప్రబంధమును గూడ రచించెను.

ఒకనాడు గోదాదేవి-"రంగనాథుడు హత్తినా జవ్వనమను నిధానంబు రిత్తపుచ్చక తనరించి కైకొనునె" అని తలంచి అలరుల సెజ్జపై నిద్రింప "శ్రీరంగపతి కృపాసింధుడేతెంచి సారంగనయన ముచ్చట వాయఁగడిసి సరస కళావిలాసములఁ బెంపెసఁగ మరుకేళిఁ దేల్చ ...." మేల్కాంచి యది కలగా నెరింగి విరహతాపము నొందెను. చిన్నన్న ఇట గోదాదేవి విరహమును వర్ణించెను. గోదాదేవి తన తండ్రితో శ్రీరంగమున కేగుచు పల్లకి యందు మాయమై రంగనాథుని వామ భాగమున నిలచెను. ఈ శ్రీరంగయాత్ర సందర్భములో చిన్నన్న" పసనైన తమమించు పాలిండ్లఁ బోలు పసిడి కుండలు పట్టి పరతెంచు చున్న ద్రావిడాంగనల" శృంగార సౌందర్యమును హృదయంగమముగ వర్ణించెను. అట్లే పల్లకియందు కుమార్తెను గానని విష్ణుచిత్తుని దుఃఖావేశమును సహజముగ, కరుణరస స్ఫోరకముగ నాటకీయత ఉట్టిపడునట్లు అద్భుత కవితాశక్తితో చిన్నన్న రచించెను. శ్రీరంగనాథుడు విష్ణుచిత్తునితో గోదాదేవిని తోడ్కొని పొమ్మనియు, శ్రీవిల్లిపుత్తూరు వచ్చి వివాహమాడుదుననియు చెప్పగా విష్ణుచిత్తుడు తిరిగి వచ్చి పెండ్లి ఏర్పాట్లు చేసెను. కళ్యాణమునకు పాండ్యరాజు సంభారములు సమకూర్చగా శ్రీరంగనాథుడు నిత్యసూరులతో నేతెంచి గోదాదేవిని చేపట్టెను. గోదా కళ్యాణమును చిన్నన్న శాస్త్రోక్తముగ సంప్రదాయ బద్ధముగ, అత్యంత వైభవముగ జరిపించెను.

**మార్పులు :** విష్ణుచిత్తుని చరిత్రము నందు మార్పులేదు. గోదాదేవి చరిత్రలో గోదాదేవి వివాహానంతరము శ్రీరంగనాథునితో ఐక్యమైనట్లు

ఆధార గ్రంథములందుండ చిన్నన్న మొదట ఒకసారి శ్రీరంగనాథుని చెంతకు చేరినట్లు మరల వివాహమునకై శ్రీవిల్లిపుత్తూరు వచ్చి వివాహానంతరము శ్రీరంగనాథుని సాన్నిధ్యమును పొందినట్లును చెప్పెను. బహుశః వివాహ సంప్రదాయమును స్థాపించుటకే చిన్నన్న యీ మార్పు చేసియుండవచ్చును. రాయలవారి ఆముక్తమాల్యదయందు 'తండ్రితో గూడి తన పాదములకు నమస్కరించిన గోదా కన్య రూపు చూచి ఉవ్విళులూరి తమక మాపుకొనలేక ఆత్మదివ్య శుద్ధాంతసీమ కన్నెలత దార్చి మాయావధూటిని పల్లకిలో నిలిపినట్లు విడిదికి పోయి పడతి లేమికి విష్ణుచిత్తుడు విచారించినట్లును చెప్పబడినది. ఆ బ్రాహ్మణుడు దుఃఖావేశముతో తన కూతును దేవుడు తార్చినట్లు అందరకు చెప్పి అల్లరిపాలగుటకన్న కడుపు చీల్చుకొన్న కాళ్ళమీదపడునన్నట్లు ఆ రంగనికే ఆవేశముతో తన ఆవేదనను వెళ్లబోసికొనినట్లు గావించిన చిన్నన్న రచన ఔచిత్యవంతము సమంజసమని' విమర్శకుల అభిప్రాయము (తాళ్ళపాక కవులు - పెనుమదు వెంకట శేషయ్య).

**అనువాదము** : చిన్నన్న ఈ యాశ్వాసమునందు 'తిరుప్పల్లాండు' అనబడు భట్టనాథుని సూక్తులను, భక్తాంఘ్రిరేణువు పాడిన తిరుప్పళ్ళియెళుచ్చి'లోని పది పాశురములను సందర్భోచితముగ అనువదించెను. ఈ క్రింది వానిని పరికింపుడు.

"పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయి రత్తాణ్డు పలకోడి నూరాయిరం
మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణాఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు....
"ఆడియో మోడుం నిన్నోడుం పిరివిన్ఱి యాయిరం పల్లాణ్డు
వడివాయ్ నిన్ వలమార్ పినిల్ వాళ్గిన్ఱ మజ్గైయుం పల్లాణ్డు"

— తిరుప్పల్లాండు, పెరియాళ్వారు; 1, 2 పాశురములు

చాణూర ముష్టికులను మల్లురను జయించిన బాహువులుగల ఓ మణివర్ణుడా! పలు వత్సరములు, బ్రహ్మ కల్పాంతములు, కాల తత్త్వమున్నంతవరకు మీ

పాదపద్మములకు మంగళము. దాసులమగు మాకును సర్వశేషివగు నీకును గల యీ సంబంధమునకు సంవత్సరములుండుగాక ! మీ వక్షస్థలమున నిత్య నివాసము చేయు శ్రీమహాలక్ష్మికి మంగళము. సౌందర్య ధుర్యము తేజో వంతము శత్రుభయంకరము నగు మీచేత గల సుదర్శన చక్రమునకు మంగళము. యుద్ధమున శత్రువుల గుండెలను చీల్చునట్లు ఘోషించు మీ పాంచజన్యమునకు (శంఖమునకు) మంగళము' అని పై పాశురముల భావము. దీనికి చిన్నన్న ద్విపదానువాదమిట్లు సాగినది :—

"శ్రీ మాల్యకారునిచే దివ్య పుష్పదామముల్ తాల్చి యుద్ధత రంగ సీమ
జాణూర మల్లుని సమయించి మిగుల రాణించు శౌరి దోర్దండంబులకును
వలపల రవికోటి వడఁకించు కాంతిఁ దలుకొత్తుచుండు సుదర్శనంబునకు
నలచెంత నరిదైత్యులగలు నాదములు సలుపుచుండెడు పాంచజన్యమునకును
సపరంజి బొమ్మయో యననొప్పు మేన నుపమింపఁదగి, యెద నున్న యిందిరకుఁ
గెందామరల పసగిలుబాడు పసల యందంబు గలుగు నీ యడుగుఁదమ్ములకుఁ
బూనికతోడ నెప్పుడు బంటనైన యేనును నీవును నెరవింత లేక
యొనఁ గూడియుండెడి యునికి కెంతయును
నెనసి యుండంగఁ బెక్కేండ్లు మంగళము...." (ప.యో.వి. పు. 367)

కొంచెము క్రిందు మీదుగ మూలభావమంతయు సులభ సుందరముగ పై ద్విపదలలో అనువదింపబడినది.

ఇక్లే - సూర్యుడుదయ శిఖరము నధిరోహించి యున్నాడు. దట్ట మగు చీకటి వరించినది, సుప్రభాతమైనది అను నర్థము గల - "కదిరవన్ కుణ దిశైచ్చిగరంవన్దనైన్దావ్ కన్నై యిరుళగన్దదు కాలై యమ్బోళుదాయ్" అనుచు సాయించిన భక్తాంఘ్రిరేణుల తిరుప్పళ్లి యెళుచ్చి (ప్రాబోధకీ స్తుతి) పాశురములను చిన్నన్న గోదాదేవి చరిత్రలో —

"అరుణ బింబంబుదయాద్రిపై నిలిచెఁ
బలపల వేగి పిడ్వద మబ్బులడఁగె
నలరుచుఁబూదేనియల సోన గురిసెఁ
జాలించి కరుణ చొప్పడ యోగ నిద్రఁ
జాలించి శ్రీరంగశాయి ! మేల్కొనవె...."

— (ప. యో. వి. పు. 434 నుండి 437)

అనుచు చివర రెండు పాదములను పునరుక్తము చేయుచు పరమ రమణీయముగను, ధారాప్రవాహముగను, 33 ద్విపదలలో తెలిగించెను.

రాయలవారి కన్నా శ్రద్ధగా విష్ణుచిత్తుల కథ, గోదాదేవి చరిత్ర వ్రాసాడు చిన్నన్న" అని సమగ్రాంధ్ర సాహిత్యమున (Vol - 7) ఆరుద్ర తాళ్ళపాక చిన్నన్న నిర్వహణమును, సామర్థ్యమును ప్రశంసించినాడు.

***షష్ఠాశ్వాసము : పరకాల యోగి చరిత్ర :*** చోళ మండలమున పరిరంభపుర పట్టణ సమీపమున గల కమాలాపూర్ణమను నగరములో కార్తీకమాసము కృత్తికా నక్షత్రమున హరి కార్ముకాంశమున నొక యోగి అవతరించెను. అతడు శత్రువులకు కాలుడగుటచే పరకాలుడని పేరొందెను. ఇతడే తిరుమంగై ఆళ్వారు. చతుర్విధ కవిత్వములు చెప్పగలిగిన దిట్టయతడు. అతని కరవాలవల్లి వీర రక్త తోయములచే వర్ధిల్లి సత్కీర్తి పుష్పములను ప్రసవించినట్లు చిన్నన్న అభివర్ణనము. అతడు చోళరాజునకు మంత్రి మరియు మండలాధీశ్వరుడు.

పరిరంభ పుర సమీపమున గల నాగపట్టణ ప్రాంతమున ధవళ పుష్కరమను కమలాకరము నందొక దివ్యకుముదమున జన్మించిన వేలుపు చెలువను అమృతహస్తియను వైద్యుడొకడు చూచి 'కుముదవల్లి' యని పేరిడి పోషించుచుండెను, కుముదవల్లి యౌవనవతి కాగా పరకాలు డామె యందు వలపు గలవాడై ఆమెను పెండ్లాడెదనవి అమృతహస్తితో చెప్పెను.

ప్రతిదినము వేయిమంది వైష్ణవులకు భోజనమిడు వానివి తప్ప అన్యులను వివాహమాడనని కుముదవల్లి చేసిన ప్రతిజ్ఞను తండ్రి పరకాలునకు చెప్పెను. అతడంగీకరించి యామెను పెండ్లాడెను. నాటి నుండి సతతవైష్ణవ తదీయారాధమున మునిగి ధనమంతయు వెచ్చించుచున్న పర కాలునిపై చోళరాజు కోపించి పరకాలునితో యుద్ధము చేసి నిలువజాలక తుదకు వంచనతో పరకాలుని బంధించి ధనమును స్వాధీనము చేసికొనుడని మంత్రుల నాజ్ఞాపించెను. కమలాపూర్ణ నగరము నందలి ఆదికేశవుడు పరకాలుని కలలో కనిపించి కంచికి సమీపమున ధనము కలదని చెప్పెను. మంత్రులు ధనము కొరకై పరకాలునితో కాంచీపురము చేరిరి. వేగవతినది చెంత ఆ స్వామి పెద్దసెట్టి వలె హాలిక వేషమున వచ్చేసి తన మాయచే నుద్భవమైన ధనమును వారికిచ్చి వారినుండి చెల్లు చీటి పరకాలున కిప్పించెను. అనంతరము వారిపద్ద ఆ మాయా ధనము మాయమగుటచే పరకాలుని ఇంద్రజాలమునకు, మోసమునకు వారచ్చెరువంది పరకాలుని కొరకు అన్వేషింపసాగిరి.

చౌర్య నిర్ణయము : దోషమును కలిగించు రాజధనము కంటె వైష్ణవార్థమై దొంగిలించుట మంచిదనియు, తన భార్య చేయు వ్రతమునకీ ఉపాయము తప్ప వేరకటి లేదనియు, 'తనను గూర్చి చేయు పాపము ధర్మమే యగునని' శ్రీహరి ఆనతిచ్చినట్లు పరకాలుడు దొంగతనములకు పూనుకొని వేయిమంది అనుచరులతో త్రోవలు కొట్టి, దోపిడీలు చేసి ఆ ధనముతో వైష్ణవారాధన గావించు చుండెను. ఒకనాటి రాత్రి జడివానలో పరకాలుడొక వైష్ణవుని ఇంటి అరుగు క్రీనీడలో కూర్చొనియుండెను. ఆ యిల్లాలు పతి భోజనానంతరము బంగారు పళ్లెరమును ముంగిటనే నిలచి కడుగుచుండ పరకాలుడాపాత్రను చటుక్కున దొంగిలించి పోబోవ ఆ యిల్లాలు భయముతో 'అస్మద్గురుభ్యోనమః' అని పలుకుటచే, అది వైష్ణవుల సొమ్మని గ్రహించి పరకాలుడు పశ్చాత్తప్తుడై వెంటనే ఆ పాత్రను తిరిగి వారి వాకిట బెట్టి పొంచియుండెను. ఆ పాత్రను చూచి ఆశ్చర్యపడు

చున్న భార్యతో 'నీవు అస్మద్గురుభ్యోనమః' అని పలుకుటచేతనే మహాత్ము డగు పరకాలుడీ పాత్రను వదలివేసెను. నీవక్లేల పలికితివి ? భాగవత కైంకర్య విరోధమొనరించితివి. వైష్ణవాపచారము మాయింప నెవరి తరము కాదని పలుకుచు ఆ వైష్ణవుడు భార్యను కోపింపసాగెను. ఆ మాటలు విని పరాంతకుడేతెంచి దోషము మన్నింపుమని ఆ దంపతుల పాదములకు నమస్కరించి తన పురమున కేగి యథావిధి వైష్ణవ పూజ గావించుచుండెను.

ఈ హేమ పాత్ర చౌర్య గాథతో చిన్నన్న షష్ఠాశ్వాసమును ముగించెను. ఈ యాశ్వాసమున చిన్నన్న అనేక వర్ణనలు చేసెను. కుముదవల్లి జనన సందర్భమున కొలని వర్ణనము, ఆమె తండ్రి అమృత హస్తిని ప్రవేశపెట్టునపుడు వైద్యుని వేష వర్ణనము, కుముదవల్లి సౌందర్య వర్ణనము, పరకాలుని పరాక్రమ వర్ణనము, చోళ సేనలతో పర కాలుడు చేసిన యుద్ధ వర్ణన, ఆయుధములు, రెడ్ల వర్ణన, అరణ్య వర్ణన, పరదేశ సెట్లు, (వ్యాపారస్థులు) ఓడలలో దొంగతనములు, రాత్రి వర్ణన ఇత్యాది అనేక వర్ణనలతో కథ నడిపించెను. శ్రీవైష్ణవార్చనకు గల ప్రాముఖ్య మిందు అడుగడుగున ప్రతిపాదింపబడినది. చక్కని జాతీయ ములతోను, సామెతలతోను, ఉపమ, ఉత్ప్రేక్ష, ఉల్లేఖాద్యలంకారములతోను రచన రసవంతమై సాగినది. ఇందలి వైద్యులు, రెడ్లు, కరణాలు, వ్యాపార స్థుల వర్ణన లందు నాటి సమాజము ముమ్మూర్తుల ప్రతిబింబించినది.

సప్తమాశ్వాసము : ఈ యాశ్వాసమునందు కూడ చిన్నన్న పరకాలయోగి చరిత్రమునే కొనసాగించినాడు. పరకాలుని వైష్ణవార్చనకు సంతసించిన శ్రీమన్నారాయణుడు తెరువరులు రాక ఖిన్నుడై యున్న పర కాలుని కోరిక నీడేర్ప లక్ష్మియు తానును నూతన వధూవరులవలెను బ్రహ్మాది దేవతలు మనుజ భావములతో తమ్మనుసరింప ఒక పెళ్లి బృందమువలె బయలుదేరి పరకాలుడు కాచిన త్రోవమీదుగా ప్రయాణము చేయుచు వచ్చుచుండెను.

పరకాలుడు సేనలతో నారాయణు నెదుర్కొని భూషణములన్నియు దోపిడీ చేసి శ్రీహరి వ్రేలి ఉంగరమును ఒక భాగవతుని అర్చనకైన పనికి వచ్చుననుకొనుచు దానిని లాగబోవ అది రాకుండిన నోటితో కరచి పెకలించెను. "కలుచి రాదిగిచిన కలియనో" అని శ్రీహరి ఆనతిచ్చుట వలన నాటి నుండి అతనికి 'కలియన్' అని పేరు వచ్చెను. వాడు సొమ్ము పెట్టెను పైకెత్తబోవ అది లేవలేదు. మంత్రము పెట్టితివని పరకాలుడు కోపింప ఆ మంత్రము చెప్పెదను రమ్మని వానిని చేరబిలిచి శ్రీమన్నారాయణుడు స్వయముగ అష్టాక్షరీ మంత్రము నుపదేశించి తన దివ్య రూపమును ప్రదర్శించెను. పరకాలుడు సంతుష్టాంతరంగుడై 'మహా శ్రీవచనము' (తిరుమొళి) పేర 10 పద్యములలో భగవంతుని స్తుతించెను. అతని భాగవత పూజకు శ్రీహరి మెచ్చి 'మిమ్ము కొలవనివాడు నా భక్తుడు కాడని' వరమిచ్చెను. ఇట్లే కంచి అష్ట భుజనృసింహస్వామి, తిరుమల వెంకటేశ్వర స్వామి పరకాలునకు ప్రత్యక్షమై అనుగ్రహించి, వానికి తమతమ ఆశీస్సులందించిరి పరకాలుడా దైవములను స్తుతించి శ్రీరంగము చేరెను.

*శ్రీరంగ దేవాలయ ప్రాకార నిర్మాణము :* పరకాలుడు శ్రీరంగ దేవాలయ ప్రాకారములను, మహానసమును (వంటశాలను) కట్టింపదలచెను. మూడవ ప్రాకారము ప్రారంభింప ధనము చాలలేదు. పరకాలుడు తన అనుచరులైన దొంగలతో నాగపట్టణమున కేగి అచటి బౌద్ధాలయ శిఖర సూత్ర రహస్యమును తెలివిగ తెలిసికొని బౌద్ధగురు హేమ బింబమును దొంగిలించెను. ఇట చోరుల చౌర్య కళాప్రతిభలను, చౌర్య వృత్తాంతమును కవి విపులముగను, ఆసక్తిదాయకముగను వర్ణించెను. కథా కథనమిట ప్రవాహ వేగముగ పరుగెత్తినది. పరకాలుడు శ్రీరంగము చేరి ఆ విగ్రహపు చిటికెనవ్రేలు తప్ప తక్కిన భాగమంతయు కరగించి మూడవ ప్రాకారము, గోపురము, రెండవ మహానసములను పూర్తి చేసెను. ప్రాకార నిర్మాణ శిల్పులకు, పనివారలకు ముక్తి నిప్పింతునని చెప్పి వారిని చంద్ర పుష్కరిణిలో ముంచి పరమపద ప్రాప్తి కలిగించెను.

అట నాగపురిలో బౌద్ధులు స్వర్ణ ప్రతిమ గానక శ్రీరంగము వచ్చి పరకాలునిపై నింద మోపిరి. పరకాలుడు తానెరుగననియు, తాను కోరిన ధనమిచ్చినచో సౌగత బింబము వ్రేలుపోకుండ నప్పగింతునని చెప్పెను. ఉభయులట్లంగీకరించి పత్రములు వ్రాసికొనిరి. బౌద్ధులు ధనమిచ్చిరి. పరకాలుడు తాను దాచి యుంచిన స్వర్ణ ప్రతిమ వ్రేలు మాత్రము బౌద్ధుల కప్పగించి వారిని ఆశ్చర్య పరచెను. వారు కోపించి మోసము చేయుచున్నాడని రాజువద్ద పిర్యాదు చేసిరి. పత్రములో చిటికెనవ్రేలు పోకుండ అప్పగింతునని యుండుటచే రాజేమియు చేయజాలడయ్యె. పరకాలుడా బౌద్ధ జైన పండితులతో వాదించి వేదఖడ్గముచే వారి మతములను ఖండించి వారిని ఓడించెను. అతని కైంకర్యమునకు శ్రీరంగనాథుడానందించెను. చివరకు పరకాలుడు విరక్తుడై తన పత్నితో తిరుక్కురంగుడి యందు గల భద్రాశ్రమము చేరి యోగ నిష్ఠులై యుండెను.

రచనలు : "మీఱిలోకము లెల్ల మెచ్చ, జేసినవి
యాఱుకైంకర్యంబు లాఱు కబ్బములు" — (పు 560)

అవి చిన్నన్న పేర్కొన్నట్లు పరకాలయోగి ఆరు కృతులు రచించెను. అవి తిరుమొళి, తిరుక్కురున్దాండగమ్, తిరునెడున్దాణ్డగమ్, తిరువెళుక్కూత్తిరుక్కై శిరియ తిరుమడల్, పెరియ తిరుమడల్ అనునవి.

ఈ పరకాల యోగి చరిత్రము పావనమైనదని, భక్తితో చదువదగినదని ఫలశ్రుతి యందు చిన్నన్న చెప్పెను. ఈ యాశ్వాసమున వృద్ధ వైష్ణవుని రూపవర్ణనము, వెంకటేశ్వరస్వామి వర్ణనము, ఆలయ నిర్మాణ చిత్రణములను, చౌర్య రసిక శేఖరుల ప్రతిభలను మనోజ్ఞముగ రచించెను. అనేక వాద్య విశేషములు పేర్కొనబడినవి. ఉపమాద్యనేకాలంకారములిందు ప్రయుక్తమైనవి. ఇందు హరిపూజ కంటెను భాగవత పూజ అధికమని నిరూపింపబడినది.

ఈ కావ్యములో ఒకే ఆశ్వాసమునందు నలుగురాళ్వారుల చరిత్రలను రచించిన చిన్నన్న ఈ పరకాలయోగి చరిత్రకు రెండాశ్వాసములు కేటాయించినాడనిన ఈ యాళ్వారు చరిత్రపై చిన్నన్నకు గల మక్కువ విశదమగుచున్నది. కనుకనే పెద్ద మార్పులు కూడ చేసి యుండలేదు. ఒకటి రెండున్నన్న అవి పాత్ర చిత్రణము నందెకీభవించినవి.

**ఔచిత్య పోషణము** : సప్తమాశ్వాసమునందు ప్రధానమైన స్వర్ణ ప్రతిమా చౌర్యమున చిన్నన్న ఔచిత్యమును పోషించెను. పరకాలుని బావమఱది బౌద్ధాలయమున ప్రవేశించి విగ్రహమును దొంగిలించిన పిదప ఆనందముతో ఆతని శరీరము పొంగి కంతనుండి వెలుపలకు రాలేదు. అతనిచే ప్రార్థితుడై పరకాలుడు వాని శిరమును ఛేదించిపోయెను. తన కైంకర్యమునకై తపించిన భక్తునకిట్టి దుస్థితి కలిగించుట భగవంతుడు సహింపగలడా ? అని సందేహించిన చిన్నన్న గరుత్మంతుని పంపి వానిని పునరుజ్జీవింపజేసి తన సన్నిధికి రప్పించుకొనినట్లు మార్పు చేసి ఔచిత్యమును పోషించి భగవానుని దయార్ద్ర హృదయము నావిష్కరించినాడు.

**అష్టమాశ్వాసము** : ఇందు నాథమునుల వృత్తాంతము, యామునాచార్య చరిత్ర, భగవద్రామానుజ వైభవములు వివరింపబడినవి.

***నాథమునుల వృత్తాంతము*** : కావేరీనదీ తీరమున గల వీరనారాయణపురాగ్రహారమున శౌరి వీరనారాయణుడను పేర వెలసి యుండెను. ఆ అగ్రహారమున 'శొట్టై' వంశమున ఈశ్వరభట్టునకు గజాస్యుని అంశమున నాథముని అవతరించెను. వీరు యోగవిద్యా ప్రభావమున శ్రీహరిని ప్రత్యక్షముగ దర్శించు చుండెడివారు. ఈయనకు పృశ్ని గర్భాంశమున ఈశ్వర మునియను పుత్రుడుదయించెను. పుత్రునితో గలసి నాథమునులు దివ్య దేశములు సేవించి వచ్చిరి.

ఒకనాడు కొందరు వైష్ణవులు వీరనారాయణపురమునకు వచ్చి పరాంకుశ యోగి రచించిన దివ్య ప్రబంధములోని పదిపాటలు (పాశురములు) వినిపింప నాథమును లోకోత్తరపావనోత్కృష్టమైన యా కావ్యమంతయు తెలియజేయుడని వారిని కోరెను. వారిట్లు చెప్పిరి. 'శఠగోపయోగీంద్రుడీ కావ్యమును రచించి చాల కాలమయ్యెను. ఈ ప్రబంధము ముక్తికరమగుటచే దాని పఠనానంతరము చదివినవారు ముక్తికి పోవుటం జేసి యీ గ్రంథము శిలమయ్యెను. కావున కడమ వృత్తములు రావని' చెప్పగా నాథమునులు తిరునగరి కేగి మధురకవి పలికిన దివ్య ప్రబంధమంతయు (కణ్ణినుణ్ శిరుత్తాంబు) పదిరెండు వేల సార్లు జపించి శఠగోపయోగిని సాక్షాత్కరింపజేసికొని మరల దివ్య ప్రబంధములను పొందెను. అంతే గాక వీరనారాయణస్వామితో గలసి ఆ ప్రబంధములను ఆవృత్తి జేసెను.

"దివిజ గానములఁ దద్దివ్య ప్రబంధ నివహంబు తాళమానితముగాఁ బాడి
తన శిష్యవరుల కందఱకు నా కృతులు నొనర నవ్విధమున నుపదేశమొసఁగె
నటుగాన నీ ద్రావిడాగమాంతములు పటుగతిఁ దద్వంశ పాలురచేత
వినుచుండు నెపుడు శ్రీవేంకటేశ్వరుఁడు...." (ప. యో. వి. పు. 568)

అని చిన్నన్న నాథముని వంశీయులచేతనే తిరుమలలో దివ్య ప్రబంధ గానము జరుగునని తెల్పెను. నేటికిని ఇట్లే జరుగుచున్నది.

భోజరాజు ఆస్థానమున జరిగిన గానవిద్యా పరీక్షకు నాథమునులు అధ్యక్షులై దేవగానమును ప్రశంసించి,

"యీయెడ పంచలోహంబైన యట్టి వేయు తాళములు వేవేగఁ దెప్పించి
యాయెడ నొక్క చోటన్ని తాళములు వాయించు మనుచు నావాద్యమాలించి
తలకొని యొక్కొక్క తాళమిన్నేసి పలములటంచుఁ జొప్పడఁగ జెప్పె"
(పు. 570)

తమ సంగీత పాండిత్యమును ప్రదర్శించి గాయక సార్వభౌములనిపించుకొనెను. ఇట చిన్నన్నయ ద్విపదలో తన సంగీత శాస్త్ర పరిజ్ఞానమును ప్రదర్శించెను. తన కుమారుని గర్భమున జన్మించబోవు యామునాచార్యునకు సకల రహస్యార్థముల నుపదేశింపుమని ప్రియ శిష్యుడైన పుండరీకాక్షునకు నాథమునులానతిచ్చి పరమపదమున కేగెను. ఆశ్రయించినవారికి సదుపదేశము నొసగుచు పుండరీకాక్షులు దర్శన స్థాపకులైరి. వీరి శిష్యులే శ్రీరామ మిశ్రులు (మణక్కాల్ నంబి.)

***యామునాచార్య చరిత్ర :*** ఈశ్వరమునులకు శ్రీహరి సింహాసనాంశమున యామునాచార్యులు జన్మించెను. ఒకనాడు వేదపాఠమునకు పోకుండిన కుమారుని చూచి తండ్రి కోపింపగా "నిన్నఁ జెప్పినయదే నేఁడుఁ జెప్పెదిని యన్న ! నేనటఁబోవ నన్న నా తండ్రి అట్లైన నిన్న నీ కాతండు చెప్పినట్టి వేదము వచ్చునా చెప్పుమనిన...." అతడంతకు ముందు చెప్పిన వేదమంతయు వప్పజెప్పి తండ్రిని ఆశ్చర్యపరచెను. ఆ తండ్రి ఇతనిని శాస్త్రాధ్యాసమునకై మహాభాష్యభట్టరు వద్దకు పంపెను.

సూరి ధృతితో వాదము : చోళరాజు ఆస్థానమున సూరిధృతి (అక్కి-యళ్వాన్) అను పండితుడు తనతో వాదింపలేని విద్వాంసుల నుండి పన్ను (కప్పము) గైకొనుచుండెడివాడు. అతడు తన బిరుద పత్రిక నిచ్చి మహా భాష్య దేశికునిపై పన్ను తెమ్మని భటులను పంపెను. తన గురుడు ఖిన్నుడై యుండ చూచి యామునుడు కోపించి – 'ఆసేతు శీతాచలము వరకుగల విద్వాంసు లెవ్వరును తనను గెల్వలేరని' వ్రాసి పంపిన సూరిధృతి బిరుదు పత్రమును చించి మరల తన బిరుదు పత్రము నొకదానిని వ్రాసి పంపెను. తన పురోహితునితో వాదించి గెలువమని చోళరాజు సభ నేర్పరచి యామునిని రప్పించెను.

ఇరువురును వాదమునకు నిలచిరి. యామునుడు పలికిన వాక్యములు ఖండింతునని సూరిధృతి ప్రతిజ్ఞ. ఓడినవారు గెలిచినవారి పాదుకలు

నోట పెట్టుకొనవలెనని నిర్ణయము. యాముమడు గెలువనిచో తాను స్వయముగ నగరి కుక్కలకు వంది పెట్టుదునని రాజుతో రాణిగారి పందెము. పురోహితుడు గెలువనిచో అర్ధరాజ్యమిత్తునని రాజుగారి పందెము. తర్క పరీక్ష ప్రారంభమైనది.

"అగపడి నీవు గావన్నవి యెల్ల నగునవి విలిపెద వదియునుంగాక
యావల నీవగునన్నవి యెల్ల కావని నిలుపంగఁ గలవాఁడ విపుడు"

(పు. 579)

అని సూరిధృతి పల్కుక యామునుడంగీకరించి మూడు లౌకిక వాక్యములు పలికెను. అవి యివి.

"నిన్నును గన్న యంబ యవంధ్య (నిన్ను కన్న తల్లి గొడ్రాలు కాదు).
యెన్నఁబతివ్రత యీ పట్ట మహిషి (ఈ రాణి పతివ్రత)
పన్ని చూచిన సార్వభౌముఁ డీరాజు'' (ఈ రాజు సార్వభౌముడు)

వీనిని సూరిధృతుడెట్లు ఖండింపగలడు ? మొగము వెలవెలబోయి నోరు మూతపడెను. పిమ్మట శాస్త్రవాదము నందును యామునుడా పండితుని ఓడించెను. మహారాణి ఆనందముతో 'నన్నేల వచ్చితో తండ్రి ! ' యని పలికెను. అట్లనుట కారణమున యామునులకు 'ఆళవందారు'లను పేరు కలిగెను. రాణి పందెములో తాను గెలిచిన అర్ధరాజ్యమును ఆళవందారున కొసగెను. అతడు రాజయ్యెను. సూరిధృతి శిష్యుడయ్యెను. శ్రీరామ మిశ్రులు యామునులను దర్శించి దివ్య ప్రబంధమును, దాని అర్థమును ఉపదేశించెను. శ్రీరామ మిశ్రుల వలన ప్రపత్తి మార్గము నెరిగి యామునులు శ్రీరంగము చేరి "రంగకాంతుని హృదయం గతుని గావించిన సిద్ధార్థుడై జ్ఞాన సిద్ధియు, నాత్మ సిద్ధియు, నీశ్వరసిద్ధియు నవఁగఁ జెలువారు కృతులను శ్రీహరి స్తోత్రములను, శ్రీ గీతార్థముల సంగ్రహంబు మొదలగు

మతమైన పురుష నిర్ణయము. నాగమ ప్రమతియనను ప్రబంధములు" వివరించెను. శ్రీరామ మిశ్రుల ఆదేశానుసారము యామునులు యోగవిద్య నభ్యసించుటకై గంగాహర నగరి (గంగైకొండ - చోళపురము) లో కురుకయోగి సన్నిధికేగ ఆ యోగి తన చరమ కాలమున నేర్పుదునని సమయ నిర్దేశము చేసెను. కాని ఆ సమయమునకు యామునులు రాలేక పోవుటచే యోగవిద్య లభింపలేదు.

ఇది చిన్నన్న వివరించిన యామునాచార్య చరిత్రము. అలతి అలతి పదములతో సులభ శైలిలో నాథముని యామునుల వృత్తాంతము లిందు వేగముగ సాగిపోయినవి. ఇందు వర్ణనలు తక్కువ కథాకథనమునకు ప్రాధాన్యమెక్కువ.

*భగవద్రామానుజ వైభవము :* చిన్నన్న భగవద్రామానుజుల చరిత్ర నిందు సంక్షిప్తముగ వివరించెను. రామానుజుల అవతారమును గూర్చి కవి "ఆసురి కేశవాహ్వయ వైష్ణవునకు సలలిత చిత్రమానంబున నార్ద్రి జలజాప్తకోటి తేజము నగ్గలించి జనియించి రామానుజఖ్యాతి దాల్చె" నని చెప్పెను. తాను మహాశాస్త్ర విద్యల నెరిగియు 'దేవకీ సుతుడు సాందీపుని యొద్ద చదివిన రీతి' అద్వైత వేదాంతియైన యాదవ సంయమీశ్వరుని వద్ద రామానుజులు విద్యాభ్యాసము చేయుచుండెను.

బ్రహ్మరాక్షసుని పోగొట్టుట : చోళరాజు సుతుని బ్రహ్మరాక్షసు డావహింప ఎన్ని ప్రయత్నములు చేసినను ప్రయోజనము శూన్యమయ్యెను. యాదవ ప్రకాశులు మహా మాంత్రికులని విని రాజు పిలిపించెను. యాదవ ప్రకాశులుగ్ర మంత్రము జపింప ఆ రాక్షసుడు లెక్కచేయక తన రెండు కాళ్ళు యాదవు దిక్కు చూచి తన యొక్క, యాదవుల యొక్క పూర్వ జన్మ వృత్తాంతముల నేకరువు పెట్టెను. శ్రీ పెరుంబుదూరునకు 20 మైళ్ళ దూరమున గల మధురాంతరాగ్రహారంబున ఒక తటాకము కట్ట మీదగల

పుట్టితో ఉదుముగ నుండ "శ్రీ వేంకటేశ్వరు సేవింపవచ్చు శ్రీవైష్ణవాళి భుజింప వచ్చోపుఁ జిందిన మెదుకులు చెలువార మొసఁగి తందుల కళవ సీవందితి యిట్టి జననంబు" అని యాదవ ప్రకాశుల పూర్వ జన్మమును చెప్పి, తాను పూర్వ జన్మలో క్రతువు చేయబూని మంత్ర తంత్ర లోపము నేయుటచే తనకు ఉక్కసి పుట్టువు కలిగెనని చెప్పి శేషావతారుడైన రామానుజాచార్యుడు తను నేగు మనినచో ధరణీశసుతుని విడబి ముక్తికి వడచెద నని తాను పోవు చందము గూడ తెల్పెను. అట్లు రామానుజార్యుల అనుజ్ఞ పొంది తాను చనుచున్నదాని గుర్తుగ నొక అశ్వత్థవృక్ష శాఖను విఱిచి యరిగెను.

అపార్థోల్లంఘనము : యాదవ ప్రకాశులు రామానుజులతో తిరిగి కంచికి వచ్చి శిష్యులకు యథాప్రకారము వేదపాఠములు చెప్పుచుండెను—

"యాదవుండుప్పొంగి యఖిల శిష్యులకు నాదట వేదవాక్యం బెప్పి యొకటి
జలజ నికాశలోచన యుగళంబు గలిగిన యట్టి శ్రీ కామినీ విభుని
వనచరాసన వర్ణ వలితాక్షయుక్తుఁడనుచు నీరీతి నపార్థంబుఁ జెప్ప"
(పు. 596)

"తస్యయథాకప్యాసం పుణ్డరీక మేవ అక్షిణీ" అను ఛాందోగ్య శ్రుతికి శ్రీరామానుజులు చెప్పినట్లు "గమ్భీరామ్భస్సముద్భూత సుమృష్టనాళ రవికర వికసిత పుండరీక దళాయతేక్షణుడని" అర్థము చెప్పక కోతి పిఱ్ఱలవలె నెఱ్ఱనైన పద్మదళములవంటి కన్నులు కలవాడని (కపిగుద వర్ణ నేత్రుడని) యర్థము చెప్పి, పైగా ఈర్ష్యతో రామానుజులను కోపించి తన యొద్ద చదువుటకు రావద్దని ఆజ్ఞాపించెను.

రామానుజులు కంచికేగి తిరుక్కచ్చినంబి ద్వారా వరదరాజస్వామికి తన సందేహములు విన్నవింప మహాపూర్ణులను ఆశ్రయింపుమనియు, ప్రపత్తియే ఉపాయము, అంతిమ స్మృతి యవసరము లేదు, శ్రీమన్నారా

యతుఁడే పరతత్త్వమని వరదరాజస్వామి ఆనతిచ్చెను. రామానుజులు మహాపూర్ణుల నాశ్రయించి సమాశ్రయణులై కంచిలో ఆరుమాసములు సంప్రదాయార్థముల నెరిగెను. దాని యొద్ద నీళ్ళు చేదుకొను విషయమున మహాపూర్ణుల సతీమణితో తన భార్య వివాద పడుట ఎరింగి జరిగిన దానికి వగచి "ఇరయంగఁ బ్రతికూలయగు భార్య విడుచు టెరవొందఁగా శాస్త్రహితమే తలంప" అని భార్యను బంధువులను త్యజించి రామానుజులు సన్న్యాసమును స్వీకరించెను.

మహాపూర్ణుల ఆజ్ఞానుసారము రామానుజులు తిరుక్కోటియూర్ పోయి శ్రీగోష్ఠిపూర్ణుల వద్దకు పదియేడు వారములు తిరిగి ద్వయమంత్రము నెఱింగి రహస్యార్థమెవరికి ఎరింగింపకుమని గోష్ఠిపూర్ణు లాజ్ఞాపించినను లెక్క చేయక శ్రీవరుతిరునాళ్ల సేవించు కొరకు శ్రీ వైష్ణవాళి వేంచేసి యుండఁగ వందలు వినుచుండ నాచరమార్థము సర్వులకు ఉపదేశించెను.

"క్షితిగురుతోడ బొంకినవాని కరయగతియెద్ది తుది నరకమె కాకయనిన
వనియెరామానుజుండా గోష్ఠిపూర్ణుఁగని యొక్కరుఁడు నరకముఁబొంద
నేమి
యిందఱు మీ కృప నీడేరి శౌరి జెందుదురని యేను జెప్పితిని....
(పు. 620)

అని గురువుతో రామానుజులు పలికెను. ఇది రామానుజుల విశాల హృదయమునకు, జగత్కల్యాణ కాంక్షకు నిదర్శనము. పిమ్మట శ్రీమాలికాధరులగు తిరువరఙ్గప్పెరుమాళ్ అరయర్ అను వారి వలన రామానుజులు ద్రవిడ దివ్య ప్రబంధముల నధిగమించెను. ఇంకను తనతో వాదింప వచ్చిన యజ్ఞమూర్తియను ఏకదండి (అద్వైతి) సన్యాసిని జయించెను. వేదాంత దీపము, వేదాంత సంగ్రహము విశ్వగ్రంథము, గద్యత్రయము, గీతా భాష్యములను రచించి రామానుజులు శిష్యవర్గముతో దిగ్విజయ యాత్రలు

చేయుచు కాశ్మీర దేశమున కేగి శారదా పీఠమును దర్శించి శారదా దేవిచే బోధాయన స్మృతిని బడసి ఉత్తరదేశ యాత్రలు చేసెను. వెంకటాచలపతిని సేవించి అచట శ్రీశైలపూర్ణుల (తిరుమలనంబి) నుండి రామాయణ రహస్యముల నధిగమించెను. పిమ్మట సేతువు వరకు వెంచేసి శ్రీరంగము చేరి బోధాయనవృత్తి ఆధారమున శ్రుతుల వాక్యముల కైక్యముగ శ్రీభాష్య రచనము గావించెను.

క్రిమికంఠుని వృత్తాంతము : చోళరాజు అచ్యుతద్వేషియై హరుడే పరబ్రహ్మమను భ్రాంతితో బలిమిని విద్వాంసులచే "శివాత్పరతరం నాస్తి" యని వ్రాలు పెట్టించుచుండ ఆందు చతుర్గ్రామియను వైష్ణవుడు 'రామానుజార్యుండు నీరీతి జేయునే? యిందిరా విభుడె నారయబరతత్త్వమని విల్పుగాఁక' యని పలికెను. చోళుడు శ్రీరంగమునకు భటులను పంపి రామానుజాచార్యుని బంధించి తెండని ఆజ్ఞాపించెను. కూరనాథుడు రామానుజుల వేషముతో చోళరాజు వద్ద కేగెను. రాజు "శివాత్పరతరంనాస్తి" అని వ్రాలిడుమని యాతుగంట మొసగిన కూరనాథుడు జంకు లేక "ద్రోణమస్తి తతఃపరం" అనుచు వ్రాలు పెట్టెను. రాజు హితులితడు రామానుజుడు కాడని తెల్ప శ్రీరంగ పట్టణమునకు మరల భటులను పంపెను. వారు తన పైకి వచ్చుట తెలిసి రామానుజులు విష్ణుచిత్తయోగి వేంకటేశ్వరుని పై జెప్పిన పద్యమొకటి చదివి ఇసుకను అభిమంత్రించి చల్ల అది పర్వతాకారమై రాజభటులకు అడ్డముగ నిలచినది. తనవద్దకు కపట సన్యాసియై వచ్చెనని కోపించి చోళుడు కూరనాథుని నేత్రములు తీయుడని ఆజ్ఞాపింప విష్ణుద్రోహి వగు నిన్ను చూచిన నేత్రములేమిటి కని కూరనాథుడే తన గోళ్ళతో కళ్ళు పెకలించుకొనెను. ప్రహ్లాద విద్వేషిని చీల్చిన నరసింహుని వలె—

"శ్రీ వేంకటేశుండు శితఖడ్గధార నావేళ కలలోన నరుదెంచివాని
గళనాళ పార్శ్వంబు ఖండింప నందు విలవిలమనుచు బర్వినకంపుతోడ

బెడిదిదంపుఁబురుపుల భేదించి పుచ్చి వెడలంగఁ జోడుంచు విడిచె ప్రాణమ్ము లది మొదల్ క్రిమికంఠుడను పేర వాడు విదితుఁడై యుండె.... (పు 639)

అని చిన్నన్న చోళరాజు క్రిమికంఠుడైన వృత్తాంతము నెరిగించెను. రామానుజులు శిష్యులతో శ్రీరంగ పట్టణమునకు వేంచేసి కూరనాథుని కౌగలించి ఆయన కప్రాకృతాక్షి లిప్పించెను. ఇంతటితో శ్రీ భగవద్రా మానుజుల చరిత్ర ముగిసినది. పరమయోగి విలాస కావ్యము పరిసమాప్త మైనది.

"ఉరుభక్తితోడ నియ్యోగీంద్రవరుల చరిత మొక్కొకమాఱు జనులెవ్వరేని వినిన వ్రాసినఁ జదివినఁ బేరుకొనిన నెనలేని యిష్టంబు లెసగించు నసుచు" ఫలశ్రుతిని పలికి కావ్యమును ముగించినాడు చిన్నన్న. చివరి ఆశ్వాసములో రామానుజుల రూప వర్ణన, తిరుమలగిరి, కోవెల దాని పరిసరములు స్వామి పుష్కరిణి, స్వామి వర్ణనలు మనోజ్ఞములు. (పు. 588, 629, 631). రామానుజుల చరిత్రలో బ్రహ్మరాక్షసుని వదలించు సన్నివేశమున చోళ రాజు కుమార్తె అని ఆధార గ్రంథము లందుండ, 'చోళవిభు సుతుడని' చిన్నన్న పేర్కొనెను. తన పాదస్పర్శచే బ్రహ్మరాక్షసిని పారద్రోలిన ట్లుండ రామానుజుల అనుజ్ఞ పొంది రాక్షసుడు వెడలినట్లు చిన్నన్న మార్పు చేసి రామానుజుల వాగ్వైభవమును వెల్లడి చేసెను. ఒండు రెండు మార్పు లున్నను సముద్రము వంటి రామానుజుల జీవిత చరిత్ర యందలి ప్రతిచిన్న విషయమును క్లుప్తముగనైన చిన్నన్న తడివినాడే కాని విడిచిపెట్టలేదు.

'దివ్య ప్రబంధమునకు పరాంకుశులు తల్లి కాగా, రామానుజులు పెంచిన తల్లి' యని ప్రసిద్ధి. భగవద్రామానుజులను గూర్చి చెప్పనిదే ఆళ్వారుల చరిత్ర పూర్తి ఆయినట్లు కాదు. పన్నిద్దరాళ్వారులలో కొందరు గోదాదేవి స్థానమున భగవద్రామానుజులను చెప్పుదురు. చిన్నన్న రామాను జుల చరిత్రతో బాటు, ఖిలమైన ద్రవిడ ప్రబంధమును ప్రకాశింపజేసి

శ్రీవైష్ణవ ధర్మము నుద్ధరించిన నాథమునుల యొక్కయు, రామానుజులకు పరమాచార్యులైన యామునుల యొక్కయు చరిత్రలకు గూడ వివరించి పరమయోగి విలాసమునకు పరిపూర్ణతను సమకూర్చెను. ఇప్పటికే విస్తృతముగ పెరిగిన కావ్యము నిక ముగింపవలెనను కవి తొందర చివరి ఆశ్వాసమునందు కనిపించును. కాని విసుగు జనించకుండ కథలనే పరుగెత్తించి కథాకథనమున కవి చాకచక్యమును ప్రదర్శించెను. ఇతివృత్తము గంభీరమైనను ద్విపద రచన పేలవము కాదు. ఒకే విధమైన సన్నివేశములలో వర్ణనాత్మకముగ చెప్పెడి పద్ధతిలో ఆకర్షణము కలదు. ఇది చిన్నన్న ఇతివృత్త నిర్వహణమున పేర్కొనదగిన శిల్పము.

ఇక అనువాద విషయమున-చిన్నన్న నాలాయిర దివ్య ప్రబంధము నెక్కడెక్కడ ఆంధ్రీకరించినదీ డా॥ చల్లా రాధాకృష్ణశర్మగారు 'The Tamil Element in Telugu Literature' (P-113-168) అను గ్రంథమున గుర్తించి యుండిరి. 'తెలుగు తమిళ సాహిత్యాల సంబంధాలు' అను వ్యాసమున వారిట్లు చెప్పిరి.

"అన్నమయ్య మనుమడు చిన్నన్న (తిరువెంగళనాథుడు) ద్రవిడ ప్రబంధం చూసి పరమయోగి విలాసం రచించాడు .... ఆయా సందర్భాలకు అనుగుణంగా చిన్నన్న మూలంలోని కొన్ని పాశురాలను తెలుగు చేసాడు. అనువాదమనే భావం రానియ్యక చిన్నన్న చేసిన యీ తెలుగు సేతలు మధుర మోహనము లనడం చర్విత చర్వణం .... తమిళంతో గాఢమైన పరిచయము, తెలుగులో చక్కని కవితాశక్తి కలిగిన చిన్నన్న కనుక యథాతథంగానే అనువదించి వుంటే, తెలుగులో ద్రావిడ వేదం వెలిసి ఉండేది. ఆయన తనకు నచ్చిన భాగాలనో, ఆయా సందర్భాలకు అనుగుణంగానో మూలాన్ని అనువదించాడు. మూలంలోని సౌందర్యాన్ని ఆస్వాదించే అనుభూతిని పాఠకుడికి కలగజేసాడు" — తమిళవింద. పు. 34

దీనినిబట్టి చిన్నన్న అనువాద విధానము స్వతంత్రమైనదే కాని యథామూలము కాదని తెలియుచున్నది. అతడు ద్రవిడ వేదమునే కాక తనకు నచ్చిన వాని నెన్నింటినో అనువాదమున పొందుపరచెను. ఉదా :-

"వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్ । నిశార్ధమర్థం దివసం యతేత
వార్థక్య హేతోర్వయసా నవేన । పరత్ర హేతో రిహ జన్మనాచ"

అను హితోపదేశ శ్లోకమును యథాతథముగ విష్ణుచిత్తుని చరిత్రలో – "కడు నేర్పుమై వానకాలంబు కొరకు గడమ యెన్మిది నెలల్గడియింప వలయు .... భాజనీయంబైన పరకారణంబు నీ జననము నందె యెఱుంగ వలయు" (ప. యో. వి. పు. 355) అనుచు అందముగ అనువదించెను.

## పాత్ర చిత్రణము

పరమ యోగి విలాసమున దాదాపు 33 పాత్రలు కలవు. కొన్నిటిని పరిశీలింతము.

*కణికృష్ణుడు :* భక్తిసారయోగి అనుగ్రహముతో చక్రాయుధ పరిచరాంశమున వృద్ధ దంపతులకు జన్మించిన పుత్రుడు కణికృష్ణుడు. ఇతడు భక్తిసారయోగి ప్రియశిష్యుడు, గురుభక్తియుతుడు, కవిసార్వభౌముడు. పల్లవరాజు తన భార్య వలన భక్తిసార కణికృష్ణుల మహిమలు విని సేవకుల నంపి కణికృష్ణుని రమ్మని అహంకారముతో కబురు చేసెను. గుర్వాజ్ఞ బడసి యతడు రాజసభ కేగి రాజును దర్శించెను. కణికృష్ణుడు కవి యగుటచే ఆరాజు– "వర రసరీతి భావ వ్యంగ్య ముఖ్య పరిపూర్ణ శుభ శబ్ద బంధంబు గాగ నవయంబు నీ నేరుపంతయు మెరసి తన మీద నొక్క-పద్యము చెప్పు" మని కోరెను. అంతేగాక "భవద్గురుని దర్శింప వేడుకయ్యె దివి వేవేగ బోయి తోడి తెమ్మని'' ఆజ్ఞాపించెను. ఇట చిన్నన్న పద్య రచనకు సంబంధించిన కవితా లక్షణమును సందర్భోచితముగ దెల్పెను.

పద్య రచనము నేర్పుతో గూడి రసరీతి భావ వ్యంగ్య ముఖ్యమై శుభ శబ్ద బంధురముగ నుండవలెనని చిన్నన్న సూచనము.

కణికృష్ణుడు రాజసభలో "గురుం ప్రకాశయేత్ ధీమాన్" అనునట్లు తన ఆచార్యుల వైభవమును "కొణ్డాడి వాయ్కొణ్డుమానిడం పాదవస్త కవియే నల్లేన్" అని తిరువాయ్మొళి (3-9-9) యందు చెప్పబడినట్లు— "శౌరి నెన్నెదు నాదు నాలుక నిను మెచ్చునా దుర్మదాంధ ; నీవు లక్ష్యమే నాకు? నీవిచ్చునట్టి యీవి లక్ష్యమే? తుది నిచ్చితివేని యలవి ననిత్యంబు లసుఖంబులైన శిలలు లోహంబు లిచ్చెద వింతె కాని వేరేమియగలవు?" అని తిరుగబడి ఐహిక సుఖము లనిత్యములని, ఉభయ విభూతి నాయకు డగు నారాయణుని కైంకర్యమే నిత్యమని ఘంటా పథముగ చాటి చెప్పెను. ఇది కణికృష్ణుని వైరాగ్య సంపదకు నిదర్శనము. రాజు కణికృష్ణునకు దేశ బహిష్కార శిక్ష విధించినపుడు— "నీవేలు ధరణినున్నఁ బాపము చెందు నోరి పాపాత్మ" అని రాజును సభా ముఖమున ధిక్కరించి, నిందించి వెడలి పోయిన ధైర్యశాలి కణికృష్ణుడు. ఇతనికి తన గురువు ముందు రాజులు, రాజ్యములు ఆనలేదు. సర్వము తృణప్రాయమైనది.

కణికృష్ణుని గురుభక్తి : పల్లవరాజు సభలో తన గురువు గొప్పతనమును గూర్చి చెప్పుచు కణికృష్ణుడు— "శ్రీమనోహర పదాశ్రిత చక్రవర్తి మామక గురుఁడు సామాన్యుఁడే! తోయజ భవ శివాదుల లెక్కగొనఁడు నీయున్న చోటికి నేదేల వచ్చు" అని పలుకుటలో కణికృష్ణుని గురుభక్తి నిరూపింప బడినది. 'మామక గురుడు' అనుటలో గురువుపైగల మమకారము, 'చక్రవర్తి' పద ప్రయోగముచే నీవు కేవలము రాజువు. నా గురువు చక్రవర్తి అని సగర్వముగ చేయు హెచ్చరికయు కలవు. ఇందే కణికృష్ణుని గురు స్థానమును నిరూపించుటతో బాటు, తోయజభవ శివాదులను లెక్క చేయని విష్ణు వైశిష్ట్యమును గూడ కవి వెల్లడి చేసినాడు. కణికృష్ణు డంతటి గురుభక్తి యుతుడు కనుకనే భక్తిసార యోగి, దేశ బహిష్కరణ

శిక్ష పొందిన శిష్యునితో పట్టణము వీడి పోవుటకు బయలు దేరి శిష్యుని మాటపై తిరిగివచ్చి శిష్య పరతంత్రుడై అతని మాటకు కట్టుబడిపోయెను. కణికృష్ణుని వెంట భక్తిసారులు. ఆయన వెంట శ్రీమన్నారాయణుడు. నారాయణుని వెంట అఖిల దేవతలు నడచిరన కణికృష్ణుడెంతటి దైవ పరివారమును తన గురు సేవచే సాధింప గలిగినాడో అర్థమగుచున్నది.

చిన్నన్న కణికృష్ణుని మహాభక్తుడైన అంబరీషునితో పోల్చెను. గురుభక్తి గల ఉత్తమ శిష్యునకు ప్రతినిధిగ ఈ కావ్యము నందు కణికృష్ణుని పాత్ర ప్రకాశించినది. ఇది చిన్న పాత్రయే అయినను దాని చిత్రణమున చిన్నన్న వహించిన శ్రద్ధకు దర్పణమై నిలచినది.

**విప్రనారాయణుడు :** ఇతడు వనమాలికాంశమున అవతరించిన బ్రాహ్మణ శ్రేష్ఠుడు. బాల్యము నందే షట్ఛాస్త్రములు చదివిన పండితుడు. "జనని గర్భములోనె సకలంబు నెఱిఁగి జనసుతుండగు పరాశరమౌనివోలె" అనుచు విప్రనారాయణుని చిన్నన్న పరాశరమౌనితో పోల్చి పరిచయము చేసెను. శ్రీరంగనాథుని కైంకర్యము నందు తప్ప మరి దేని యందును ఆసక్తిలేని మహాభక్తుడైన విప్రనారాయణుడు— "మాదరార్ కయ ఱ్కణెన్నుమ్ వలై యుట్పట్టళున్దువేనై" అని తానే తిరుమాలై 16వ పాశురము నందు చెప్పినట్లు స్త్రీల యొక్క చేపల వంటి నేత్రము లనెడి వలలో చిక్కి అణగిపడియున్న వానివలె దేవదేవి వలలో చిక్కెను. దానికి కారణము శ్రీమన్నారాయణుడు తన లీలా వినోదము చూపుటకై విప్రనారాయణుని తనకు సాధనముగ నెన్నుకొనుటయే. కనుకనే చిన్నన్న విప్రనారాయణుని పరాశరునితో పోల్చి, పరాశరుడు మత్స్యగంధిని కూడినట్లు విప్రనారాయణుడు వేశ్యయగు దేవదేవిని కూడినను ఆయన ఋషిత్వమునకు భంగము రాదని సూచించెను.

విప్రనారాయణుడు తన ఉద్యాన వనములో మన్మథునకు సైతము మోహమును పుట్టించు దేవదేవిని చూచియు తొణుకని వైకల్యమును పొంది

యుండలేదు. శాండిల్య పరాశర కౌశికాది మహర్షులను మించిన వైరాగ్యము గలవాడగుటచే ఆమె విన్నపమును ఆలకించి ఆ మాయలాడి మాటలు నిజములనుకొని చిన్నన్న చెప్పినట్లు ఆమెను 'సధర్మిణిగ' భావించెనే గాని సహధర్మచారిణిగ భావించలేదు. రంగ విభుని కైంకర్యమునకు తోడు లభించెనని తలచెనే కాని ఆమెను వేరుగ భావింపలేదు. సంవత్సరము గడచినను దేవదేవిని కన్నెత్తియైన చూడని స్థిరచిత్తుడు విప్రనారాయణుడు.

అట్టివాడు 'ఈశ్వర ప్రేరితాత్ముడై' వానలో వణకుచున్న దేవదేవిని పర్ణశాలలోపలకు రమ్మనెను. అతని అంతరంగమును రంగభోగి ప్రేరేప ఆమౌనివరుడు-

"అలమోహనాంగి చేయంటుట వలన నిలువెల్ల (బులకింప నెనరామతింప
హరి కుబ్జమున్న నైయ్యంబునంగలయు కరణి నాలేమ నంగజకేళిఁదేల్చె"
— పు. 295

ఇందలి హరి కుబ్జోపమానముచే చిన్నన్న దేవదేవి విప్రనారాయణుల పూర్వ జన్మ వృత్తాంతములను గూడ సూచించెను. ఇట భోగి, వర శబ్ద ప్రయో గములు గమనింపదగినవి. ఇది చిన్నన్న కథన శిల్పమునకు నిదర్శనము. సౌందర్యవతియైన దేవదేవిని కురూపియైన కుబ్జతో పోల్చుట ఈ ప్రయోజ నము సాధించుటకే. విప్రనారాయణుడు నారాయణుని వంటివాడే. అతని వలన వేశ్యయైన దేవదేవి ఉద్ధరింపబడెను గాని అతని యోగత్వమునకు భంగము లేదని కవి చెప్పదలచెను. ఈ విషయమునే-

"అతడు మహాయోగి యతనికి దుష్టరతిశక్తి గలదె యారసి చూచితేని
అతఁడు మల్లీలార్థమై రాగవశుని గతిఁ జెందియున్నాఁడు గాని యా మౌని
తలప నేఁ గృష్ణావతారంబునందు నలరు బోటులఁ గూడి యట్ల యుండితివి
దుద నాకు రాగ మందుల నింత కలదె.? ...." (పు. 307)

అనుచు శ్రీరంగనాథుడు శ్రీదేవితో పలుకు సందర్భమున స్పష్టము చేసినాడు. రంగని లీలచే నరాగియైన విప్రనారాయణుకు కాసులు లేవని విటకంటకి మెడబెట్టి బయటకు గెంటినపుడు కూడ "పొలతి పొందులు డించిపోవంగ లేక వకరకలై ఇంత వ్రతము దక్కినను సుఖము దక్కకపోయె" నని ఖిన్నుడై వచ్చి పంచ్చతిన్నెపై పరుండెనే గాని రంగని స్మరింపలేదు. మాయా వటువు దేవదేవి ఆహ్వానము నెరిగింప - "నీవు నాపాలి దైవం బవగు రంగధారుణీ పతివా, కాకున్న నొరులకీ కరుణ నా మీద చేకూరు నెట్లు ?" అని తలచెనే కాని దేవదేవిని తన చిత్తము నుండి పారద్రోలి రంగని స్థిరపరచుకొనలేదు.

పసిడి పాత్ర చౌర్యమును మోపి రాజభటులు తనను బంధించి-

"గరుడ ! నీకెటువంటి కనుమాయగలదొ ! జడియక పద్మజ శంకరాదులకుఁ దలచూపరాని శ్రీధరు నగరంబు నలవోకఁ జొచ్చితి వౌరౌర దొంగ
నీ మేన నిండార నెనయునామములు నామము ల్గావు కన్నపుఁ గత్తులరయ
నన విని" నీ లీలలా ? రంగ ! యనుచు.... (పు. 329)

తలచెనే కాని అతనికి రంగని యందు రక్షకత్వ బుద్ధి స్థిరపడలేదు. రాజ సభలో సైతము కైతవ బ్రహ్మచారి చెప్పిన తరువాత మాత్రమే దేవదేవి ఇంటికి వెళ్లితి ననియు, దానికి రంగేశుడే సాక్ష్యమని వితర్కించి దేవదేవితో వాదునకు సిద్ధమయ్యెనే కాని రంగనాథుని ప్రార్థింపలేదు. అయినను రంగడు ప్రత్యక్షము కాగానే గరుత్మంతుని రాకతో అనిరుద్ధుని బంధములు వీడినట్లు విప్రనారాయణుని బంధములు తెగెను. "భక్తి మోక్షంబున భవరోగపాశ ముక్తుని లాలించు మురవైరి" అతనిని రంగడు గారవించెనట.

విప్రనారాయణుడు లోకమునకు దూరముగ నుండి అమాయకుడై దేవదేవిచే మోసగింపబడి కామవాంఛకు లోనగుట, ఆమె పర భార్యకాక సామాన్య వనితకావ అతని జారుపాటునకు కారణమగుట సహజమేసని

కొందరందురు. కాని ఇట్లు జారుటకు విప్రనారాయణునకు సంవత్సర కాలము పట్టనవసరము లేదు. ఆమె సధర్మిణి యని భావించిన విప్రనారాయణున కట్టి కామదృష్టియే లేదు. చిన్నన్న చిత్రణములో నితడిట్లు పతనమగుటకు కారణము ప్రపంచ జ్ఞానము లేక కాదు కేవలము రంగని లీల. భగవల్లీల కెంతటి వాడును వశుడు కాక తప్పదు. కనుకనే దానిని గుర్తించి "నీలీలలా రంగ !" అనుకొనినాడు విప్రనారాయణుడు.

ఇచట శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యమొకటి నిక్షిప్తము చేసినాడు చిన్నన్న. మోక్ష ప్రాప్తికై భగవానుడు కర్మ జ్ఞాన భక్తి యోగములను ప్రతిపాదించెను. కాని అవి ఆయా అధికారులకు మాత్రమే తగినట్టివి. వీని కంటెను సులభోపాయమొకటి కలదు. అదియే శరణాగతి. సర్వేశ్వరుని ఆశ్రయించి ఆయనయే ఉపాయనముగ భావించి 'శరణాగతి' చేయుట విలక్షణమైన మార్గము. దీనినే శ్రీకృష్ణభగవానుడు గీతలో - "సర్వ ధర్మాన్ పరిత్యజ్య....., సకృదేవ ప్రపన్నాయ...." అను శ్లోకములందు స్థాపించి యుండెను. ఇట్టి శరణాగతి చేయుటకు దేశకాల పాత్రాదులు లేవు. అంతే కాదు ఒకసారి శరణాగతి చేసిన పిమ్మట మరల మరల శరణాగతి చేయ నవసరము లేదు. అట్టిది శరణాగతి వైభవము. భగవచ్ఛరణాగతిని చేసిన వారిని 'ప్రపన్ను' లందురు. అట్టివారిని "అహంత్వాసర్వపాపేభ్యో మోక్షయిష్యామి" అను గీతావచనానుసారమా భగవంతుడే దిద్దుబాటు చేసుకొనును.

విప్రనారాయణుడావిధమైన శరణాగతి చేసినవాడగుట చేతనే తన దుస్థితికి చింతించి పశ్చాత్తాపముతో పునశ్శరణాగతి చేయలేదు. భగవత్కృప వలన తనపై బడిన అపవాదు తొలగిపోగా విప్రనారాయణుడు శ్రీరంగనాథుని వాత్సల్య జలధిగా కొనియాడెను. ఆ వాత్సల్య మెట్టిదనిన - "తన నేయునట్టి కృత్యము నీచమైన ఘనతర భోగ్యంబు గాగొ జేకొనుటయే అని చిన్నన్న వివరణము. కావున వాత్సల్యమనగా దోష భోగ్యత్వము.

"వత్సలాయాః భావం వాత్సల్యం" అని నిర్వచనము. అప్పుడే యీనిన దూడ ఒడలిపై గల మలినములను తన నాలుకచే తుడిచి శుభ్రపరచు గోవు వలె మనము చేసిన దోషములను భోగ్యములుగ నెంచుటయే వాత్సల్యము. ఇట్టి వాత్సల్యము తమ పిల్లలపట్ల తలిదండ్రుల కుండుట లోకమున గమనింపగలము. ఇట్టి వాత్సల్యమే భగవంతునకు భక్తులయందుండును. ఇట్టి భగవంతుని వాత్సల్యమును కొనియాడి విప్రనారాయణుడు భక్తాంఘ్రిరేణువని ప్రసిద్ధి పొందుటయే కాక వేదసారమును పొదిగి శ్రీమాలిక (తిరుమాలై) అను శ్రీరంగనాథుని సుప్రభాతమును రచించి పరిపూర్ణముగ రంగని గుణానుభవమున ఓలలాడెను.

చిన్నన్న విప్రనారాయణు పాత్రలో విరుద్ధములైన వైరాగ్య శృంగారములు పోషించి, వాటికి కారణమైన శ్రీరంగనాథుని అద్భుత లీలా వినోద విజయమును స్థాపించెను.

*దేవదేవి (వేశ్య) పాత్ర* : దేవదేవి శ్రీహరి లీలావినోదార్థమై జన్మించిన అప్సరస. 'ఈమె రతికళాప్రౌఢి భారతి కళా ప్రౌఢి నతిశయించు' యౌవనారూఢ. పాట తుంబురుని, శాస్త్రప్రౌఢిమ వాణి నాట రంభాదుల నణకించు నేర్పరి. ఈమెను చిన్నన్న యిట్లు వర్ణించెను.

"నొసలపైన జడ విరహులవెన్నుతరటు కొలనవ్వు వరభుజంగుల గుండెదిగులు
కరములు పల్లవ కంతపాశములు గురుకుచంబులు కాముకుల రొమ్ము వసులు
కదతొడల్ పాంథుల కట్టు కంబంబు లడుగులు విట హృదయముల
శల్యములు....
మరుఁదేర్చి పట్టిన మార్గణంబవగఁ దనదు వర్ణాశ్రమ ధర్మముల్ చూపి
మునుల వర్ణాశ్రమములు చూఱగొనె" నట. — (పు. 270)

ఈమె అందమును చూచినచో 'తామరచూలి యైన, గౌరీనాథుడైన చిక్కి తేనెలో బడిన ఈగల చందాన వెడదాయలేరని' చిన్నన్న వర్ణన. ఇట కవి

శివుని పరముగ గౌరీనాథ శబ్దము కంటె స్మరాంతక శబ్దము వంటి ఏ యితర పదమునైన ప్రయోగించిన మరింత పటిష్టముగ నుండెడిది. దేవదేవి తన నాట్య గాన కళా కౌశలముతో గౌళ నేపాళ బంగాళ పాంచాల చోళరాజేంద్రులను మెప్పించి లోగొనిన జాణ. అట్టి తనను విప్రనారాయణుడు కన్నెత్తియైన చూడలేదని శత్రు లక్షణము కలదై కోపించినది.

"నలిన శరుండైన నను జూచెనేని
విలువున కరగడే నీరు చందమున"

అని గద్దించి పలుకుటలో నీమెకు గల సౌందర్య గర్వము, పురుషాకర్షణ శక్తిగల తన అందముపై నామెకు గల విశ్వాసము ప్రస్ఫుటమగుచున్నవి. తనను చూడలేదని 'మందుఁడో జడుఁడో సోమరియో' అని యా విప్రుని నిందించినది. శాండిల్య పరాశర కౌశికాదులు స్త్రీలకు చిక్కలేదా? కొనల కెక్కించెద గోచి బాపనిని' చూడుమని సోదరితో పంతమాడి, తిరుమణి ధరించి వైష్ణవీ వేషమున వైరాగ్యమును నటించి విప్రనారాయణుని వంచించిన మాయావి యీమె. సంవత్సరము గడచినను తన నాతడు తేరి చూడలేదని వగచి ప్రతిన నేల చేసితినా యని బేలయైనది. ఇంతలో – "కాముక హృదయ పుష్కరము నిండార కామాంధకారంబు గప్పిన పగిది గగన మొక్కింతయు కానరాకుండ" నల్లని ముసురు పట్టినది. ఈ ఉపమానముచే కవి దేవదేవిని 'కాముకి'గా ధ్వనింపజేసినాడు. ఆమె ప్రతిజ్ఞ నెరవేరుటకు వార్షుక వాతావరణమనుకూలించినది. ఆ ముసురు పెను వానగా మారగా, పూలగుత్తుల బరువానలేక అసియాడు లతవలె స్తనభారమును సైరింపలేని కౌతీగ జవ్వాడుచుండ దేవదేవి ఆ యోగి వాకిట నిలచినది. విప్రనారాయణునిచే అనుజ్ఞాతయై లోనికేతెంచి – 'తల తడి యార్చు చందమున మునివి సోకునట్లు క్రొమ్ముడి విదలించి కొప్పు గీలించినది. మరియు 'పాలిండ్లు అఱగానుపడ నొకవింత లీలఁ బయ్యెద కొంగు జారవిడిచి'నది. ఇచట చిన్నన్న వేశ్యల వగలాడితనమును స్వాభావికముగ చిత్రించెను.

ఇంతటి జాణ కనుకనే దేవదేవి అతని హృచ్చంద్ర కాంతము కరగుట గమనించి యిదియె సందని ఆ మౌని పాదములను తన యూరువుల మీదకు రావించి దెందమునకు హత్తుకొని మత్తుగా మెత్తగా వాని పాదము లొత్త సాగినది. విప్రనారాయణుని మనసును కరగించి యికనైన ఆనతిమ్మని ప్రార్థించి ఆంతటి యోగిని భోగిగా మార్చి తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనినది.

దేవదేవి పాత్రను ప్రవేశపెట్టునపుడే చిన్నన్న — 'ఆమె తనదు వర్ణాశ్రమ ధర్మముల్ జూపి మునుల వర్ణాశ్రమములు చూఱగొనునని' బీజప్రాయముగ సూచించి దేవదేవి చేష్టల యందా వేశ్య లక్షణములను పోషించుచు విప్రనారాయణుని సంగమముతో తాను నాటిన బీజమునకు ఫలావాప్తి గావించెను. ఇది కవి పాత్ర పోషణ సామర్థ్యమునకు నిదర్శనము.

దేవదేవి విప్రనారాయణుని వశవర్తినిగ నుండుటచే విటులు రారైరి. తుదకు వెచ్చ సచ్చాలకు లోటు కలుగగా ఆమె తల్లికి విసుగు జనించెను. "వారవనిత వలపు పసిడి తోడిద కదా" అని మందలించిన ఆమె తల్లి మాటలలో చిన్నన్న వేశ్యల స్వభావమును వెల్లడి చేసెను. మాయా వటుడు బంగారు పాత్రను దెచ్చి పిలిచినపుడు, 'బంగారమను మాట చెవుల విని బత్తి గలదాని విధమున దేవదేవి తల్లి వలదన్న వినక కవాటంబుఁ దెఱచి'నది. బంగారు పాత్ర లభింపగానే మునుపటి కంటె మించిన ప్రేమతో విప్రనారాయణుని కూడినది. ఇది ఆమె ధనాశకు, వేశ్యాప్రవృత్తికి నిదర్శనము. ఈమె వలపు పసిడి తోడిద యని నిరూపితమైనది.

రాజభటులీమెపై నేరము మోపి జడపట్టి నేలపై కీడ్చిరి. నేరారోపణము చేయబడినవారి గతి హీనమే కదా! అపుడు కూడ దేవదేవి 'మదసుని బిరుద వారువమువలె ఉన్నదట. రాజ సమ్ముఖమున దేవదేవి — "చుక్కలతో నొప్పు సోము చందమున పిక్కటిల్లెడు బాష్ప బిందు పూరములతో" అననంబెత్తి జరిగినది విన్నవింప రాజు సైతము 'కామినీ మద

దృష్టి చలిత చిత్తుడై' దేవదేవి నిరపరాధియని నిర్ధారించి విడిచి పుచ్చెను. ఇచట కూడ దేవదేవి అందము చాలవరకు పనిచేసినదన్నమాట. ఆమె రాజునకు కృతజ్ఞత దెలుపుచు 'దొంగని నంతనే కట్టుడు కొట్టుడు అనక నిజము నేర్పరచితివి' అనుచు ఒయ్యారముగ స్తుతించెను.

చివరకు విప్రనారాయణుని దయవలన శ్రీరంగనాథుడు తన జాతిని నీతిని గమనింపక దూతయై తన యింటి కేతెంచి, తనను అనుగ్రహించెనని దేవదేవి పరమానందభరితయై, పరమ విరక్తయై తన సర్వ సంపదలు రంగని కర్పించి త్యాగియై శేష జీవితమును పవిత్రముగ గడిపినది.

ఈ కావ్యమున చిన్నన్న దేవదేవి పాత్రను శృంగార రసపాన పాత్రికగ తీర్చి దిద్దెను. ఇందు వేశ్య నాయిక యగుటచే వేశ్యమాతను, వేశ్యా ప్రవృత్తులను, వర్ణించినాడే కాని, దేవదేవి విప్రనారాయణు లిరువురు శ్రీరంగనాథుని లీలా ప్రదర్శనములో స్వేచ్ఛా రహితముగ ప్రయోగింపబడిన పాత్రలుగనే చిన్నన్న మలచినాడు. విప్రనారాయణునిపై దేవదేవి గెలుపు ఆమెది కాదు, రంగనిదే. దేవదేవిని విప్రనారాయణుడు కూడుట అతని ఇచ్ఛ కాదు రంగభోగి ప్రేరణయే. రంగనాథుడు దేవదేవి కలలో కనిపించి రేపు నీ మనసు చల్ల చేసెదనని పలుకుట, విప్రనారాయణుని అంతరంగమును ప్రేరేపించుట లిందుకు తార్కాణము. చిన్నన్న దృష్టిలో ఇదంతయు శ్రీరంగనాథుని లీలావినోదమే.

***వేశ్యమాత విటకంటకి :*** దేవదేవి తల్లి విటకంటకి సార్థక నామధేయ. మటుమాయల పంది విటులను బాధించుట వలన వారి పాలిటి కంటకిగా నీమెకు విటకంటకి యనుఖ్యాతి కలిగినది. ఈమె పాత్రను ప్రవేశ పెట్టుచునే కవి ఆమె రూపమును హాస్యరస స్ఫోరకముగ ఎట్లు వర్ణించుచున్నాడో చూడుడు.

"వెలి తుటికిన పండ్లు వ్రేలాడు చండ్లు
కుఱుప పట్టిన మేను కోఁతి మొగంబు
తప్ప కన్నును బట్టతల గూని వీఁపు
పుప్పిగోళ్లను సీసవోయిన కాళ్ళు
చీమ కండ్లు మొండి చెవి బుఱ్ఱముక్కు"— (పు. 298, 299)

ఇదీ విటకంటకి రూప సౌందర్యము. ఇక మాటలలో గూడ అంతటి సౌందర్యవతియే. ఆమె మాట వినబడినంతనే పొరుగిండ్ల కుక్కలు బోయిన మొరుగునట, ఆమె నోటి కంపునకు దయ్యాలు బెదరును. ఆమె ఆయుధము రోకలి. దానిని తన మూపు మీద మోపి దుడి దుడి నేతెంచి విప్రనారాయణుని వలచిన తన కూతును చూచి వేశ్యాయుక్తమగు నీతులిట్లు చెప్పినది.

ఓ వెఱ్ఱిబిడ్డా! నీ వంటి వేశ్యలను నీవు చూడలేదా? ఈ గొంగడాపనికి మరులేల కొంటివి? వయసునందున్నపుడే గడింపవలెయును. బోయిన వయస్సు మరలి వచ్చునా? ముదిసినఁగొరయౌనె ముంజ లంజెయును? ఈతడు పులిపోతులా తినుటయే కాని నొక కాసైన ఇచ్చినాడా? ఇంట సొమ్ము విటులకు పెట్టు లంజలెందైన గలరా? 'గాలి గలనాడె తూర్పెత్తగా దగు.' ఎలయించి ప్రియులకు నింపు పుట్టించి చేతగల కాసులెల్ల వలపించి వెరజుకోవలయును గాని ఎదురు పెట్టుదురా? అని హితోక్తులు చెప్పినది. ఇందు విటకంటకి లోకానుభవము, ముందు జాగ్రత్త, జాణతనము విరూపితములైనవి. అంతటిలో విటకంటకి ఊరుకొనలేదు. 'ఇన్నినాళ్ళోర్చితివి. ఇక వానిని వదలి నా మాట విననిచో వానిని విన్నను అంటగట్టి చావగొట్టి కొంప నుండి వెడలగొట్టుదును' అని కూతును ఆదలించినది.

ఐనను దేవదేవి శాంతముతో నుండుట చూచి విప్రనారాయణునిపై తిరుగబడినది. 'కోటికి పడగలెత్తు బంగారు కుండ యగు నా పట్టికి మందు పెట్టితివా గామిడి తొండ' (ముదుసలి తొండ) యని తొందర డిప్పొడిచి

మెడవట్టి బయటికి గెంటి తలుపు బిగ్గన వేసి గడియ వైచినది విటకంటకి క్రౌర్యము, కఠిన హృదయము లిట విశదీకరింపబడినవి. ఈ సందర్భమున చిన్నన్న – 'కాసులు లేని విటుల పాలిటి వేశ్యమాత కాలాహి' యను నొక్క మాటతో వేశ్యమాత పాత్ర స్వభావమును మూర్తి కట్టించినాడు.

రంగనాథుడు బంగారు పాత్రను తీసుకొని వచ్చి దేవదేవి వాకిట కవాటము మీటి గడియ తీయు మనగా తలుపుకొట్టినవాడు విప్రనారాయణు డని భావించి విటకంటకి బ్రహ్మరాక్షసి వలె మీద పడినది. 'వలదన్న నేటికి వచ్చెదవింక ? అని ప్రారంభించి తెల్లవారు సరికి ఎందైన పోకున్న రోకలిపెట్టు లెల్ల నీ సొమ్మె' యని తీవ్రముగ గద్దించినది. ఇది సొమ్ముల కొరకైన వేశ్యమాత క్రూరస్వభావము.

బంగారు పాత్ర చేతబడగానే మారిపోయి విటకంటకి మెఱమెచ్చు మాటలు ప్రారంభించినది. ఈ మార్పును చిన్నన్న సహజ సుందరముగ చిత్రించినాడు. చూడుడు:-

'ఇప్పుడు పంపనిచో నింతలో నేమి మునిగిపోయెను ? అతడు మాలో నొక్కడే కదా' అని ప్రారంభించి వేసరి యాడిన మాటల నింతగా పట్టించు కొనవలెనా ? 'తల్లి బిడ్డలకు నైతము రాదె వాదు' అని తన చర్యను కప్పి బుచ్చి సమర్థించుకొనినది. అంతే కాదు 'చనవున నొక కొన్ని చచ్చన మాటలని సరసములాడినంతలోపలనే అది సందుగ గొని మీ గురువు పోయినాడు.' అని నెపమంతయు విప్రనారాయణునిపై తోసినది. పదివేలు వచ్చెననుటచే కాదు అతనితోడిదే లోకమని నా బిడ్డ కూడు నీళ్ళు మాని నేలపై పడుకొన్నది. కనకము చూచి టక్కరి మాటలాడితినని తలవకుమీ: ఈ పైడిగిన్నె పుచ్చుకొనుట చూచిన లోకులు పసిడికై యీమె ఎంత బాధించెనురా ! అని యనుకొనరా ? అట్లని తీసికొనకున్నచో మీ గురువు తప్పు పట్టడా ? ఎవరేమనుకొన్ననేమి నీ గురువు మనసునకు నచ్చిన చాలును' అని కనక పాత్రను చేతగొని – నా బిడ్డ ప్రాణము కాపాడ

దలచినచో నిప్పుడే ఆతనిని తీసుకొని రమ్మని పదిమాప్లు ఆ మాయా వటువు కాళ్ళపై బడి చెప్పసాగెను.

రాజ భటులు చౌర్యనేరముపై తన కూతుసు బంధించి తీసుకొని పోవునపుడు మరల మారిపోయి మాతృవేదనతో కన్నీరు వరదలై పార కూతును కౌగిట చేర్చి దుఃఖించుచు ఇట్లు పలికినది-

'అమ్మా! వీడు దొంగని చెప్పితినే నా మాట చెవిబెట్టవైతివే. 'తాము చంపను తాడు చంపెను' అనునట్లు ప్రవర్తించు వీరిని నమ్మెదురా? అని ప్రారంభించి మహారాజ సభలకు సగౌరవముగ గొనిపోబడు నీవు దొంగతనమును భరించి యెట్లు పోయెదవమ్మ' అని దుఃఖించినది. రాజ భటులు 'ఇప్పుడు చెప్పెదు బుద్ధులప్పుడేమయ్యేనని' తలా ఒక పెట్టు పెట్టి కుక్కను కొట్టినట్లు కొట్టి ఛీ కొట్టి నేలపై బడగొట్టి నవ్వుచు పోయిరి. విప్రనారాయణుని మెడపట్టి బయటకు నెట్టి ఇలు వెడలగొట్టి వేశ్యమాత పూర్వము అవమానించిన రీతినే రాజభటులచే నేడు అవమానింపబడినది.

చిన్నన్న విటకంటకి స్వరూప స్వభావములను, ఆమె విచిత్ర మన స్తత్వమును, కాసుగలనాడు లేని నాడు వేశ్యమాతలు ప్రదర్శించు ఆదర కాఠిన్యములను, మాయ మాటలను అద్భుతముగ చిత్రించి అనంతర కవుల కావ్యములలోని వేశ్యమాతలకు ఆదర్శముగ నిలచు రీతి విటకంటకి పాత్రకు జీవము పోసినాడు.

**విష్ణుచిత్తుడు :** విష్ణుచిత్తులను తమిళమున పెరియాళ్వార్ అందురు, అనగా పెద్ద ఆళ్వారని యర్థము. వయసునగాని, పాండిత్యమున గాని తక్కిన ఆళ్వారుల కంటె అధికులు కాని పెరియాళ్వారుల పెద్దరికమేమి అని ప్రశ్నించినచో మణవాళ మహాముని లిట్లు చెప్పిరి.

"మంగళా శాసనత్తిల్ మత్తుళ్ళవాళ్వార్‌గళ్
తజ్గళాద్వత్తళవు దానన్ఱిప్పొజ్గమ్

పరివాళే విల్లిపుత్తూర్ పట్టర్ పిరాన్ పెత్తాన్
పెరియాళ్వారెన్నుం పెయర్...."

- ఉపదేశ రత్నమాల 8వ పాశురం

'భగవంతునకు మంగళాశాసనము చేయుటయందు మిగిలిన అళ్వార్లకు పరిమితి కలదు. కానీ శ్రీవిల్లిపుత్తూరులో వేంచేసియున్న అళ్వారుకు మాత్రము పరిమితి లేదు. కావుననే వారు పెరియాళ్వారులైరి' అని పై పాశుర భావము. భగవంతుని సర్వ శక్త్యాదులను మరచి వానికి తాను రక్షకునిగా భావించుకొని ప్రేమ వలన ఏర్పడిన భయముతో మంగళాశాసనము చేసిన కారణమున విష్ణుచిత్తులను పెరియాళ్వారనవచ్చును.

చిన్నన్న తన కావ్యమున వీరిని పెరియాళ్వారని కాక భట్టనాథుడు, హరిచిత్తుడు, విష్ణుచిత్తుడనియే పేర్కొనెను. ఈయన"అక్షీణ వేదమయాంగుడైనట్టి పక్షీంద్రు వంశమున ప్రభవించినట్లు" చిన్నన్న పేర్కొనెను. కావుననే "గురుముఖ మనధీత్య ప్రాహవేదానశేషాన్" అనునట్లు గురుముఖత విద్యాభ్యాసము చేయకుండగనే సకల వేద వేదాంత సారముల నధిగమించెను. పక్షీంద్రుడు (గరుత్మంతుడు) - "వేదాత్మా విహగేశ్వరో" అనియు "తార్క్ష్యః శ్రుతీనామ్ నిధిః" అను చొప్పున వేదములకు ప్రతినిధి యైనవాడు. ఈ విషయమును చిన్నన్న 'వేదమయాంగుడను' విశేషణముచే ధ్వనింపజేసినాడు. కనుకనే విష్ణుచిత్తుడు భగవంతుని ప్రతినిధిగ పాండ్యరాజు సభ కేగి వేద ప్రమాణ వచనములతో పరతత్త్వ నిర్ణయము చేసెను. విష్ణుచిత్తులు శ్రీవిల్లిపుత్తూరునందు వటపత్రశాయికి పుష్ప కైంకర్యమును చేయుచు అర్చించెడివారు. ఈయనకు ధారకపోషక భోగ్యము లన్నియు శ్రీమన్నారాయణుడే.

"సరవి ధారకము పోషకము భోగ్యంబు
కరిరాజ వరదు కైంకర్యంబుగాఁగ".... (పు. 252)

దలపుము నితరచింతలు మాని యుండెకి వారని విష్ణుచిత్తుని పాత్రయొక్క జీవ లక్షణమును చిన్నన్న ఒక్క వాక్యములో చెప్పెను. ఇచట ధారక మనగా శరీరము ధరించి యుండుటకు కనీసావసరమైన నీరు శరీరమువృద్ధి హొందుటకు కావలసినది పోషకము. అనగా ఆహారము. అట్టి శరీరమునందు భోగ్యతాబుద్ధిని కలిగించునది తాంబూల సుగంధ లేపనాదులు. ఈ మూడును వేరు వేరు స్వభావములు కలిగి శరీర స్థితివృద్ధి భోగ్యతాదులను కలిగించు చున్నను వాని అన్నింటి కంటె విశిష్టుడైన శ్రీమన్నారాయణుడే యీ ఆత్మకు ధారకపోషక భోగ్యములని—"ఉణ్ణుం సోరుం పరుకు నీర్ తిణ్ణుం వెత్తలైయుం ఎల్లాం కణ్ణన్", తినే ఆహారము. త్రాగునీరు. భోగార్థమైన తాంబూలము అన్నియు శ్రీకృష్ణుడే అని శఠగోప యోగీంద్రులానతిచ్చినట్లు విష్ణు చిత్తులనుష్టించు చుండెను. ఈ భావమునే చిన్నన్న 'సరవి ధారకము పోషకము భోగ్యంబు' అను పై వాక్యమున స్పష్టము చేసెను. పాండ్యరాజు సభను గనుపట్టు కనక శుల్కము గైకొనుము. పరతత్త్వ నిర్ణయము చేయుమని వటపత్రశాయి ఆనతిచ్చినపుడు—

"వేదమో శాస్త్రమో వివరించి చూడ వేదార్థ సాధ్యమై వెలయుశుల్కంబు
పాయక గుద్దలిఁబట్టిన కేలి కాయలజూపి యేఁగైకొను బెట్టు
లితర విచారంబు లెవ్వియు నెఱుఁగమతి నీదు పాదపద్మము
లెఱుంగుదును." — ప.యో.వి.పు. 359

అని విన్నవించెను. శరణాగతి చేసిన మహాభక్తున కుండవలసిన 'ఆకిం చిన్య'మను లక్షణమును విష్ణుచిత్తుని పాత్ర యందు కవి వ్యక్తము చేసెను. ఇదే సన్నివేశమున శ్రీకృష్ణదేవ రాయలు విష్ణుచిత్తుడిట్లు చెప్పెను.

"స్వామీః వన్ను వితఃపురా పఠిత శాస్త్రగ్రంథ జాత్యంధు, నా
రామ క్ష్మా ఖనన క్రియా ఖరఖనిత్ర గ్రాహితోద్యత్కిణ
స్తోమా స్నిగ్ధ కరు నృవద్భవన దాసున్వాదిఁగాఁబంపుచో
భూమీ భృత్సభ నోటమైన వయశంబుల్మీకుఁ గాకుండునే?
— ఆముక్తమాల్యద; ఆ.౨;ప. 90

పై వానిలో చిన్నన్న విష్ణుచిత్తుల విన్నపము సరళము. సులభ గ్రాహ్యము రాయలు-చిన్నన్నలు చిత్రించిన విష్ణుచిత్తుని మన స్తత్వము, దృక్పథము లొక్కటిగనే యున్నవి. శ్రీరంగమున కేగుచున్నపుడు మాయమైన గోదా దేవిని కానక విష్ణుచిత్తుడు తన ఆవేదనను రంగనాథునకు విన్నవించుకొను తీరు కరుణరస ప్రధానముగ చిత్రించుటలోను, రంగని నిలదీసి ప్రశ్నించుట లోను పై కవులొకే మార్గమున పయనించిరి.

"అకలంక నిజకీర్తి వై నీతిదొరఁగి యకట! నీకిటు తగునయ్య రంగేశ!
యీ రీతిఁదొంగిల నీకొమ్మ గోపనీరజాక్షుల నవనీతమే తలప?....
వనజాక్షి వలసిన వాఁడవై తేని ఘనతమై మాయింటికడ కేగుదెంచి
యడగి చుట్టరికమే పారంగసేసయిడి నీవు గొనిబోవుటింతియగాక
జగదేక సాక్షివై సర్వనాయకుఁడ వగునట్టినీవ యన్యాయంబు సేయ
మితిలేని మున్నీరు మేరమీరంగ నితరులు వారింప నెట్టులోపుదురు ?
- ప.యో.వి. పు. 424

శా॥ అంతే వేడుకయైనఁ బెండ్లగుటకేనా, దేహము న్ప్రాణమున్
సంతానంబు విశాంతము స్ధనము సస్యంబు ల్పశుశ్రేణులే
కొంత స్వస్వజనార్చనంబునం కాదా కూర్చుటే మీకయో
వింతే యీ బుడుతెంత నన్నుఱచఁగావింపం దనుస్మెత్తురే?
- ఆముక్తమాల్యద - పు. 689

పై యిరువురి ఆవేదనలోని పరమార్థ మొక్కటియే. రంగడు సంప్రదాయ బద్ధముగ వచ్చి గోదాదేవిని అడిగి వివాహము చేసికొనవలెననుటయే. రాయలవారి కంటె చిన్నన్న విష్ణుచిత్తునిలోని ఆవేదన కట్టలు త్రెంచుకొని ప్రవహించినది.

విష్ణుచిత్తుని పాండిత్యము : పాండ్య భూపతి సభలో శ్రీహరి కృపచే విష్ణుచిత్తుడు పరతత్త్వ నిర్ణయము నిట్లు ప్రకటించెను.

"ప్రకృతి జీవులకు లోపల వెల్పలను సకల శాస్త్రముల విశ్వలత దీపింప
నాది యంత్యము లేక యధికుండు సముఁడు నేదెసలేక
సర్వేశ్వరుండగుచు
సర్వనియంతయై సర్వజ్ఞుడగుచు సర్వంబుఁదనకు శేషంబుగా మెలఁగు
కాంతిఁబాయని మణికరణి నాదివన కాంతుఁబాయని రుచిగతిఁబద్మగూడి
మిగుల వేదములాడి మిథునంబటంచుఁదొగడఁబెంపొందు
శ్రీ పురుషోత్తముండు పరతత్త్వము....

- (వ.యో.వి. పు. 363)

ఇందు విష్ణుచిత్తుని వేదవేదాంగాది సకల శాస్త్ర పాండిత్యమును దీపింపజేసి నాడు చిన్నన్న. పురుషోత్తము డొక్కఁడే 'శేషి' అనియు తక్కిన సర్వం బాయనకు శేషంబుగా మెలగుననియు విశిష్టాద్వైతము నందలి 'శేష శేషి' సంబంధమును నిరూపించినాడే కాని అన్యమత దూషణము గావింపలేదు. ఇది చిన్నన్న విష్ణుచిత్తుని పాత్రకు గల్పించిన ఉదాత్తత. పై శేషశేషి సంబంధమును నిరూపించు ప్రమాణ వచనము లనేకము శాస్త్ర గ్రంథము లందు గలవు. ఉదా :

"ప్రధాన పురుషత్వాచ్చ శేషిత్వం పరమాత్మనః
తదధీనతయా శశ్వజ్జీవే శేషత్వముచ్యతే" - హారిత స్మృతిః.

ఇంతటి ప్రామాణిక బలముతో శ్రీమన్నారాయణుడే పరతత్త్వమనియు, ఆయన ఆద్యంతములు లేనివాడనియు, ఆయన కంటె అధికులు గాని, సముడు గాని లేరనియు ప్రతిపాదించిన విష్ణుచిత్తుని పాత్రలో చిన్నన్న భగవత్కృపకు పాత్రుడైన ఒక మహా భక్తుని చిత్రించినాడు. 'భక్తికి ప్రేమయే ఫలమని' నారద భక్తి సూత్రము. భగవంతునకు దృష్టి దోషము తగులునని భయపడి మంగళాశాసనము సవరించుటలో విష్ణుచిత్తుని భగవ ద్విషమైక ప్రేమ, పాండ్యరాజు తనకిచ్చిన ధనాదులు వటపత్రశాయికి

సమర్పించుటలో సర్వ సమర్పణ త్యాగ భావములను వ్యక్తము చేసినాడు చిన్నన్న. తులసి వనములో దొరకిన గోదాదేవిని జనకమహారాజు వలె పుత్రికా వాత్సల్యముతో పెంచి పెద్ద చేసి, ఆమె కోరుకొన్న శ్రీరంగనాథు నకే యిచ్చి సంప్రదాయ బద్ధముగ వివాహము జరిపించుటలో విష్ణుచిత్తుని పితృభావము, లోకాదర్శ ప్రవర్తనము సంపూర్ణముగ పోషింపబడినవి.

విష్ణుచిత్తులు రచించిన తిరుప్పల్లాండు వేదమునకు ప్రణవము వలె దివ్య ప్రబంధమునకు ఓంకారస్థానీయమైనట్టిది. దివ్య ప్రబంధ పఠనము తిరుప్పల్లాండుతో ప్రారంభమగును. ఈయన రెండవ ప్రబంధము 'తిరుమొళి' శ్రీకృష్ణావతార గాథలకు సంబంధించినట్టిది.

పరతత్త్వమగు దైవము నందు గల ప్రేమను భక్తియందురు. "అనురక్తిః పరే తత్త్వే భక్తిరిత్యభిధీయతే" అని భక్తిమతాచార్యుల నిర్వచనము. 'తైలధారావ దనవచ్ఛిన్నమైన ఆ భక్తియే ప్రపత్తి' యని రామానుజ శ్రీభాష్య నిర్వచనము. ఇట్టి భక్తి ప్రపత్తుల సంగమ పాత్రయే పరమ యోగి విలాసమున చిన్నన్న పోషించిన విష్ణుచిత్తుని పాత్ర.

**పరకాల యోగి** : పరమ యోగి విలాసమున షష్ఠసప్తమా శ్వాసముల కథలోని ప్రధాన పాత్ర పరకాలుడు. ఈయనకు నీలన్, కలియన్, తిరుమంగై అళ్వారులని పేర్లు.

"వృశ్చికే కృత్తికాజాతం చతుష్కవి శిఖామణిమ్
షట్ప్రబంధకృతం శార్ఙ్గమూర్తిం కలిహమాశ్రయే"

అని చెప్పబడిన రీతి హరి కార్ముకాంశతో చతుర్థ వర్ణమున కృత్తికానక్షత్రమున పరకాలుడవతరించెను. ఇతనిని గూర్చి చెప్పుచు చిన్నన్న-

"కామినీ మణులకుఁగందర్పుఁదర్థ కామలోకమునకుఁ గల్ప భూజంబు
పరులకుఁ గాలుండు పరమయోగులకుఁబరతత్త్వ మఖిలభూప్రజలకు రాజు
వివరింపఁగాఁ జతుర్విధ కవిత్వములఁ గవివరేణ్యులకెల్ల గర్తయునగుచు"

అని వర్ణించెను. ఇతని 'గుణరూప సరసోదారత'లను జనులు మెచ్చెడి వారట. ఇతడు పరులకు=శత్రువులకు, పరవాదులకు కాలుడగుటచే పరకాలు డయ్యెను. చోళరాజున కితడు మంత్రి ఇతడు ప్రకటమైన హరభక్తుడగు కవీశ్వరు నోడించి ఆశుమధుర విస్తార చిత్ర కవిత్వముల పారము చూచి 'చతుర్విధ కవిత్వస్వామి' అను బిరుదమును పొందిన కవి శ్రేష్ఠుడు. వైష్ణవ సంప్రదాయము నందేకాక తమిళ సాహిత్యమున గూడ పరకాలుని ప్రబంధములకు గల స్థానము మరిదేనికిని లేదు.

కుముదవల్లి ని వలచి అనునిత్యము వైష్ణవ సహస్రము నారాధింతు నని ఆమె కిచ్చిన మాటను పోషించుకొనుటకు అహోరాత్రములు శ్రమించి తుదకు తన ప్రతిజ్ఞను నెగ్గించుకొనిన స్థిర సంకల్పుడు పరకాలుడు. ప్రతి దినము వేయిమంది వైష్ణవులకు షడ్రసోపేతముగ భోజనములు పెట్టిన పిదప మాత్రమే తానారగించెడివాడు ఇది యాతని వైష్ణవారాధన నిష్ఠకు నిదర్శ నము. శ్రీవైష్ణవ నిత్య సంతర్పణమునకై చోళరాజునకు కట్టవలసిన కప్పము యావత్తును వెచ్చించినాడు. చోళరాజు సైన్యముతో దండెత్తి పరా జితుడై రాయబార నెపమున పరకాలుని రప్పించి మోసముచే బంధించి కప్ప మును రాబట్టుమని మంత్రులకప్పగించినాడు. "అరయ ధనాతురుడగు మానవునకు గురువు బంధువులు నెక్కుడువారు గలరె" అని కవి చెప్పినట్లు ధనమునకై చోళమంత్రులు పరకాలుని దూషింపసాగిరి. ఈ కథా సందర్భ మున చిన్నన్న పరకాలుని యుద్ధపరాక్రమమును, చోళరాజు కాపట్యమును నిరూపించెను.

తన ఆరాధనము కంటెను తన భక్తుల ఆరాధనమే భగవంతునకు ప్రియము. "మత్పూజనాత్ప్రియతమం మద్భక్తానాం నివేదనమ్" అని భగవద్వచనము. "కనుగొన మత్పూజ కంటె మద్భక్త జనులకుఁజేయు పూజనలే ప్రియంబు" (పు. 496) అని దీనికి చిన్నన్న అనువాదము. తన భక్తులకు సంతర్పణ చేయలేని స్థితిలో తానుపవాసమున్నాడు పరకాలుడు.

భగవంతుని హృదయము కరగినది. కంచిలో చోళమంత్రులకు ధనమొసగి పరకాలునకు చెల్లు చీటీ విప్పించినాడు ఆస్వామి.

పరకాలుని చౌర్యము దోషము కాదా ? :- రాజ విత్తము దోష యుక్తమని భావించి వైష్ణవార్చనకు వలయు ధనమునకై చౌర్యమునకు దిగినాడు పరకాలుడు. ఇది పాపము కాదా ? అనినచో కాదనియే సమాధానము. "మన్నిమిత్త కృతం పాపమపి పుణ్యాయ కల్పతే" అనీ భగవాను డానతిచ్చెను.

> "తను గూర్చి చేయు నధర్మంబు ధర్మ
> మని కాదె మున్ను శ్రీహరి యానతిచ్చె" (పు. 484)

అని చిన్నన్న కవి సమర్థనము. ఈ ధర్మ సూక్ష్మము ననుసరించియే పరకాలుడు చౌర్యమునకు డిగెను. చౌర్యమునందు తిరుమణి ధారులైన వైష్ణవుల జోలికి పోయెడివాడు కాదు. వైష్ణవుని గృహమున దొంగిలించిన బంగారు భోజన పాత్రను తిరిగి వారికి అప్పగించుటయే యిందుకు తార్కాణము. అంతేకాదు-

> "బ్రహ్మాది శాపముల్ నాపంగవచ్చు బ్రహ్మహత్యాదుల బాపంగవచ్చు
> నారయ శ్రీవైష్ణవాపచారంబు నేరీతినైన మాయింపగా వశమె ?"

అని వాపోవుచు ఆ గృహస్థులను క్షమాపణ వేడుటలో పరకాలుని వైష్ణవ భక్తిని నిరూపించినాడు కవి. ఏరీతినైన భాగవతార్చన చేయవలెనను పరకాలుని భావము పవిత్రమైనది కనుకనే శ్రీమన్నారాయణుడే స్వయముగ విచ్చేసి పరకాలు ననుగ్రహించి అష్టాక్షరీ మంత్రము నుపదేశించినాడు. అతని ఆరాధన విధానము భగవంతునకు ప్రీతిపాత్రమైనది కావుననే నిన్ను కొలువనివాడు నా భక్తుడే కాదని పలికినాడు నారాయణుడు. కావున పరకాలుని చౌర్య ప్రవృత్తి భావప్రాధాన్యముచే భగవత్ప్రశంసా పాత్రమైనదని గ్రహింపనగును.

పరకాలుని చౌర్య వృత్తాంతము నేటికిని ప్రత్యక్షముగ దివ్యస్థలము లైన విష్ణ్వాలయములలో ఉత్సవములందు చివరి రోజునకు ముందు రాత్రి 'చోరసంవాద' మను పేర ప్రదర్శించుచుండుట కాననగును. ఇది పరకాలుని పాత్రకు గల ప్రత్యేకత. పరకాలుడు కంచిలోని అష్టభుజ నృసింహస్వామి, వెంకటాచలపతి, శ్రీరంగనాథుల పరిపూర్ణానుగ్రహమును పొందిన భక్తుడుగ, యోగిగ ఈ కావ్యము నందు కనిపించును. శ్రీరంగ దేవాలయ ప్రాకార నిర్మాణమునకై బౌద్ధ దేవాలయమును దోపిడీ చేయుటకైన వెను దీయని కార్యదీక్షలో పరకాలుని వైష్ణవ మతాభినివేశము వెల్లడియగు చున్నది. బౌద్ధగురు స్వర్ణబింబము చేజిక్కిన పిదప తన బావమఱది తలతీయవలసి వచ్చినది. తీసినాడు. ఈ హత్య పరకాల యోగి పాత్రకు మచ్చ కాదా అనినచో అది తన బావమఱది కోరికపై గావించిన కృత్యము గనుక కాదనియే చెప్పవచ్చును. ఇట్లే శ్రీరంగము చేరి స్వర్ణ విగ్రహము చిటికెన వ్రేలు దాచి దానిని మాత్రమే బౌద్ధుల కప్పగించి యుక్తివాదమును ప్రదర్శించుట పరకాలుని తెలివి తేటలకు నిదర్శనము. అంతేగాక రాజు సమక్షమున బౌద్ధజైన మతస్థులను వాదమున నోడించి వేద మత వైశిష్ట్యమును స్థాపించి రాజుచే గౌరవింపబడినాడు. చిన్నన్న పేర్కొని నట్లు "చతుర్విధ కవిత్వములఁగవి వరేణ్యులకెల్లఁగర్తయు నగుచు" ద్రవిడ మున షట్ప్రబంధములు నిర్మించినాడనిన పరకాలుని కవితా పాండిత్యము రెట్టిదో గ్రహింపవచ్చును.

రంగ దేవాలయ ప్రాకార నిర్మాణమునకు భక్తాంఘ్రిరేణుల మందిరము అడ్డువచ్చినపుడు— "కమలలోచనుని కైంకర్యంబు కంటెఁ గమ లేశు భక్త కైంకర్యంబు ఘనము" అనుకొనుచు—

"షష్ఠిర్వర్ష సహస్రాన్తం విష్ణోరారాధనాత్ఫలం
సకృద్వైష్ణవ పూజాయాం ఫలేన నసమంభవేత్"

అని పద్మ పురాణమున చెప్పబడినట్లు—

వేసర కఱువది వేలేండ్లు భక్తి
సేసేత హరిపూజ సేయుట కంటె
నొక భాగవతునకు నొకమాఱు పూజ
యకలంక మతిఁజేయ నదియ మిక్కుటము (ప యో.వి.పు. 537)

అని భావించి భక్తాంఘ్రిరేణుల సన్నిధిని చుట్టి ప్రాకారమును నిర్మించుటలో పరకాలుని భాగవత పూజాభిమానములు వెల్లడి చేసినాడు కవి. ఇతని భాగవత పూజ కనుగొని "ఈ వైష్ణవాగ్రణి నిత్యమిటు సేయు పూజకు నేను మెచ్చితిని" అని శ్రీమన్నారాయణుడే పలికినాడు.

*పరకాల–శ్రీకృష్ణ పాత్రల సామ్యము :* పరకాల యోగి చరిత్రను పరిశీలింప నతనికి శ్రీకృష్ణుని పాత్రతో సామ్యమున్నట్లు వెల్లడి యగుచున్నది. "మును రంగమున నొప్పు మురవైరి కరణి" (పు. 449) "వరవైభవంబుల వైదర్భి శౌరి వరియించు తెఱఁగున...." (పు. 456) అని చిన్నన్న పరకాలుని శ్రీకృష్ణునితో పోల్చినాడు. శ్రీకృష్ణ పరకాలు రిరువురి అవతారములు ముందుగనే సూచింపబడినవి. కృష్ణుడు నవనీత్యాది చౌర్యమునకు పూనుకొనెను. పరకాలుడు భాగవత తదీయారాధనకై చౌర్యము నవలభించెను. శ్రీకృష్ణుడు గోకులము నుద్ధరించెను. గోశబ్దమునకు జీవులను అర్థము ననుసరించి బద్ధులగు నీ చేతనులు ముముక్షువు లగునట్లు పరకాలు డుద్ధరించెను. తల్లి చే రోటికి కట్టబడినాడు కృష్ణుడు. రాజుచే బంధింపబడినాడు పరకాలుడు. ఇందు సామ్యము బంధనము. కృష్ణుడు గీతాశాస్త్రమును ప్రసాదించెను. పరకాలుడు వేదాంగ స్థానీయములైన షట్ప్రబంధముల ననుగ్రహించెను. 'గోపాల బాలక శతైరను గమ్యమానం' అనునట్లు కృష్ణుడు గోపాలురతో కూడి యుండెడివాడు. పరకాలునకును వేయిమంది సహచరులు గలరు. కమలవాసిని యగు లక్ష్మి అంశోద్భవురాలైన రుక్మిణిని వివాహమాడినాడు కృష్ణుడు. కుముదము నుండి ఉద్భవించిన కుముదవల్లిని పరిణయ మాడినాడు పరకాలుడు. ఈమెను చిన్నన్న

'వైదర్భి'తో పోల్చుట గమనార్హము. కృష్ణుడు నీలమేఘ శ్యాముడు. పరకాలుడును నల్లనివాడై 'నీలన్' అని పేరొందెను. ధర్మ సంస్థాపనార్థము కొన్ని యెడల నీతి మార్గమును వదలినట్లు కనుపించ నటించినాడు కృష్ణుడు. పరకాలుడును భగవద్భాగవత కైంకర్యార్థమై కొంత మందిని వంచించినట్లు కనిపించును. భగవ దవతారములలో నిప్పటికి కృష్ణావతారము చివరిది. ఆళ్వారుల అవతారములలో పరకాలుని అవతారము చివరిది.

ఇంతటి విశిష్టమైన చరిత్ర గలదు కనుకనే పరకాలుని అవతారమునకు శ్రీవైష్ణవసంప్రదాయముతో, విష్ణ్వాలయములతో ముడిపడినది. ఈ యోగి చరిత్రను నిర్వహించుటకు చిన్నన్నకు రెండాశ్వాసములు చాలినవి కావు. గ్రంథ విస్తర భీతిచే ముగింపవలసియే వచ్చినట్లు కనిపించును. చిన్నన్నలోగల భగవద్భాగవతాభిమానము, వైష్ణవ పూజ - పరకాలుని చరిత్రలో విశేషముగ నుండుటచే చిన్నన్న కాతని పాత్రపై అంతటి మమకారము, ప్రత్యేకాభిమానమేర్పడి యుండునని భావింపనగును.

పరమ యోగి విలాసము నందెంతటి చిన్న పాత్రయైనను పఠితల మనస్సులపై ముద్రవేయుననుటలో సందియము లేదు. ఒకొక్క పాత్ర యందొకొక్క విలక్షణ భావ చిత్రణము. పాత్రల రూపగుణ సౌందర్య వర్ణనలందు వైవిధ్యము. కణికృష్ణుని పాత్రలో గురుభక్తి, కులశేఖర యోగి పాత్రలో రామభక్తి, గోదాదేవి పాత్రలో రంగనాథుని భక్తి తత్త్వములను చిన్నన్న సమర్థవంతముగ పోషించెను. శ్రీవైష్ణవ మతతత్త్వ ప్రవర్తకులైన నాథముని, యామున, రామానుజాచార్యుల స్వరూప స్వభావములను తదను గుణముగ రూపొందించి తీర్చి దిద్దుటలో చిన్నన్న కృతకృత్యుడయ్యెను.

## రస పోషణము

ఆంధ్ర సాహిత్యమున శాంత రస ప్రధానములైన కావ్యములు చాల తక్కువ. అందు ఎన్నదగిన కావ్యము చిన్నన్న రచించిన పరమయోగి

విలాసము. ఇందు క్వాచిత్కముగ శృంగారాదు లును అంగరసములుగ పోషింపబడినవి.

**శాంతము రసమగునా ?** : భరతుడు శాంత రసమును పేర్కొనలేదు. అతని మతమున శృంగార హాస్య కరుణ రౌద్రవీర భయానక బీభత్సాద్భుతములు ఎనిమిది మాత్రమే రసములు. వాసుకి, కోలాహలు డనువారు శాంతరస స్థాపకులని కొందరు చెప్పుదురు. శాంత రసమునుగూర్చి నిర్ధారణ చేసినవాడు భట్టోద్భటుడు. అతడు నాట్య శాస్త్రమునకు వ్యాఖ్య వ్రాయుచు—

"శృంగార హాస్యకరుణా రౌద్రవీరభయానకాః
బీభత్సాద్భుత శాంతాశ్చ నవనాట్యేరసాః స్మృతాః"

అని మార్చి శాంతమును రసముగ చేర్చి దానికి "శమము" స్థాయిభావమని చెప్పెను. కాని భరతముని కూడ శాంత రసమును పరోక్షముగ నంగీకరించె ననియే విమర్శకులు చెప్పుదురు. దానికి వారు చెప్పు ప్రధాన కారణము నాట్యము త్రైలోక్యాను కరణమని చెప్పుటయే. దశరూపక కర్త ధనం జయుడు శాంతమును దృశ్యకావ్యము నందే అంగీకరించెను. ఆనందవర్ధన అభినవ గుప్త పాదులందరు శాంతమును రసముగ అంగీకరించినట్టివారే. సమ్యక్ జ్ఞానము, నిర్వేదము, ఉత్సాహము, ధృతి, తృష్ణాక్షయము ఇత్యాదులు శాంత రసమునకు స్థాయి భావమని కొందరు నుడివిడిరి గాని తుదకు అవి యన్నియు పరాస్తములై శాంతమునకు 'శమమే' స్థాయి భావమని నిర్ధారింపబడినది. 'వైరాగ్యాదులచే చిత్తము నిర్వికారమై యుండు టయే' శమ లక్షణము.

శాంతము ఉత్తమ నాయక నిష్ఠము. హీన నిష్ఠమగుచో ఆభాస మగును. శాంతరసాధి దేవత శ్రీమన్నారాయణుడే. "పరీక్ష్యలోకాన్ కర్మ చితాన్ బ్రాహ్మణో నిర్వేద మాయాత్" అనుదానిని బట్టి లౌకిక సుఖములు

అనిత్యములు, అభాస సుఖములని తలచి నిర్వేదము పొంది "సర్వం ఖల్విదం బ్రహ్మ"— "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"— "ఏకోహవై నారాయణో ఆసీత్, నద్వితీయస్థే" ఇత్యాదిగ శ్రుతులయందు చెప్పబడిన పరమాత్మ స్వరూపమును భావన చేయుచుండుటయే శాంతరసము ననుభవించుట.

ఈ రసమూర్తియైన శ్రీమన్నారాయణుని పొందుటకు- 'కదాహ క్కావేరీ తట పరిసరే రంగనగరే' యనునట్లు పుణ్యనదీ. పుణ్యక్షేత్ర వాసాదులు ఉద్దీపన విభావములు. 'ఆహ్లాద శీత నేత్రాంబుః పులకీకృత గాత్రవాన్' అనునట్లు రోమాంచ సంతోష భూతదయాదులు అనుభావములు. నిర్వేదాదులు వ్యభిచారి భావములు.

చిన్నన్న రచించిన పరమయోగి విలాసము నందు ప్రధానమైన శాంత రసమునకు లక్ష్యభూతులైన పరమ యోగులు అళ్వారులు. వారు భగవన్నిర్హేతుక జాయమాన దివ్యజ్ఞాన సంపన్నులు. 'బంధువులు భార్యా పుత్రాదులు ధనమున్నంత వరకే ప్రేమ చూపుదురు కాని ధనముపోయి నపుడు వారికేమాత్రము ప్రేమ యుండదు' అనెడి భావముతో గూడిన— "కొణ్డపెణ్డిర్ మక్కళుత్తార్ శుత్తత్తవర్ పిఱఱుం కణ్డ దోడు పట్టిదిల్లార్ కాదల్ మత్తియాదు మిత్తై" అని ద్రవిడ వేదమున (తిరువాయి మొళి 9-1-1) చెప్పబడినట్లు సంసార సుఖము లాభాసములని తలచి పరమ యోగులు నిర్వేదమును పొందిరి. అట్టి నిర్వేదము కలిగినపు డుపాస్యమగు దైవమేది? ఇందుకు భక్తిసార యోగి—

"....ఏడు నూటేడు నూటేండ్లు పేర్వేఱ వసియించి వివుతంబులైన
సర్వ సిద్ధాంతముల్ చర్చించి చూచి కాణాద గురుభట్ట కపిలాక్షపాద
పాణిని మిథ్యాప్రపంచశాస్త్రముల లక్షించి చూచి యల్పములని పూర్వ
పక్షము ల్చేసి యభంగ విస్ఫూర్తి శుద్ధాంతరంగుఁడై విష్ణు
సిద్ధాంత మూర్ధాభిషిక్తుడై పొలిచి...." నారట. (పు. 74, 75)

మరియు పంచమాశ్వాసమున పాండ్యరాజు నగరశోధన గావించుచు విప్రుని వలన 'వర్షార్థమష్టౌ' అను శ్లోకమును విని నిర్వేదమును చెంది "కోరక కర్మానుగుణముగా నెపుడు వారక సంపదల్వచ్చుచున్నవియ గలదె యదృష్టంబు గలిగించు వెరవు వెలియంగ వలయు నింతియ యాత్మ కనుచు" బావించి తన పురోహితునితో అంతిమ పురుషార్థసిద్ధి యేలీల దెలియుదు నెఱిగింపుమని అడిగినాడు.

ఇట్లు ఇచ్ఛ కలిగినపుడు తెలిసికొనవలసిన పరతత్త్వము పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుడే యని విష్ణుచిత్తయోగి సిద్ధాంతీకరించెను. ఇది విభవము. ఇట్లు చెప్పిన విష్ణుచిత్తులు 'సరవి ధారకము పోషకము భోగ్యంబు, కరిరాజవరదు కైంకర్యముగా' దలచినట్టివారు కనుక ఉత్తములు. ఈ ఆళ్వార యోగులు ఉత్తములనుటకు మరియొక కారణము గలదు.

అనాది కర్మవశ్యులై సంసారచక్రమున బడి "సంసార వాగురాన్తస్థలూన పక్ష ఇవాండజః" అనునట్లు తెక్కలు తెగిన పక్షులవలె బాధల నొందుచు నిర్వేదము పొందక తాపత్రయాతురులై క్షణికమగు సుఖప్రాప్తికై ధార్యాపుత్రాదులనెడి మృగతృష్ణల వెంటబడి తిరుగువారు సంసారులు. వీరికిని మహర్షులకును పరమాణువునకును పర్వతమునకును గలట్టి భేదము కలదు. మహర్షులు 'పరీక్ష్యలోకాన్' అనునట్లు లోకమును పరీక్షించి అనిత్యములగు లౌకిక సుఖములను నిరసించి నిత్యము, నిర్మలము, ఆనంద కారణమగు పరబ్రహ్మ సాక్షాత్కారమునకై "తద్విజ్ఞానార్థం సగురు మేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" అని ప్రశ్నోపనిషత్తునందు చెప్పబడినట్లు తత్త్వదర్శి బ్రహ్మజ్ఞాని యగువాని నాశ్రయించి "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" (గీత; 4వ అధ్యాయము) అనునట్లు ప్రణిపాతాదులచే వారి ననువర్తించి స్వస్వరూప, పరస్వరూప జ్ఞానమును పొంది ఆ భగవత్సాక్షాత్కారమునకై ప్రయత్నించినవారు మహర్షులు.

అట్టి మహర్షులకును ఆళ్వారులైన ఈ పరమ యోగులకును గూడ భేదము గలదు. భగవత్సాక్షాత్కారమునకై ఋషులు తపోయజ్ఞాదులు చేయుచుండ, 'జ్ఞానీతు ఆత్మైవమే మతమ్' అనునట్లు తనకు ఆత్మభూతులుగ నున్న ఆళ్వారులను "అహం స్మరామి మద్భక్తమ్" అను రీతిని భగవానుడు తానే వరించి యున్నాడు.

పరమయోగి విలాసము నందలి ఈ క్రింది ద్విపద పంక్తులు పరికింపుడు.

"వారలనిజ మహత్త్వంబు నియ్యేడల వారని తన పరత్వంబు మోకముల
నెగడించి యజ్ఞాన నికర మోహంబు లగలింతునని యెన్ని యాయోగివరుల"
(పు. 42)

"అల పరమాత్రంబునందుండి వచ్చి భానుకోటి ప్రభఁ బ్రత్యక్షమయ్యె..
శ్రుత్యంతదృష్టి కగోచరుఁడై యుండి శ్రుత్యంత దృష్టికిఁ జూపట్టెవనుచు"
(పు. 163)

"వలపలి కరపంట వలఁతి నెచ్చెలి వలనొప్ప తమ్ముఁ దవ్వలనొప్ప
దెసల
దళుకెత్తనపుడు సీతాప్రాణ నాథుఁ దల భూమిపతికిఁ బ్రత్యక్షమై
నిలిచి" - - (పు. 218)

"నీకడ నందియం బేటికి వలదు నీ కేమి భార మిన్నిటికి నేనుండఁ
దలఁప నీ హృదయ పద్మములోన నేన నెలకొని నిగమాంత నిశ్చి
తార్థంబు పలికించువాఁడను బలికెదు వాఁడ"- (పు. 359)

ఇట్లీ కావ్యము నందు చిన్నన్న వర్ణించిన రీతిగ పరమ యోగులు సాక్షాత్కారములు పొందిరి భగవన్నిర్హేతుకమైన కృపచే దివ్యజ్ఞానమును పొందిన వారు. కారణము లేని కార్యము పుట్టదు. మరి భగవంతుని కృప కలుగుట యను కార్యమునకు కారణమేదేని యుండవలయును గదా యనినచో అది

యిచట కుదరదు. ఏల యన భగవానునిది నిర్హేతుకమైన కృప యగుటయే. అట్టి పురుషోత్తముని కృపా పాత్రులయిన ఆళ్వారులు (పరమ యోగులు) ఉత్తమోత్తములనుట నిర్వివాదము. కావున పరమయోగి విలాసము నందు అంగియైన శాంత రసము ఉత్తముల యందు ప్రవర్తిల్లినట్లయినది.

"శ్రీరంగ ముఖ్య విశేష దేశముల ధారుణి నర్చావతార రూపములు
ధరియించి.... (పు. 30)

"కాంచన రత్నప్రకాశజాల — కాంచియను పేర బరగి- (పు. 30)

"ధరణి తలంబెల్ల దానితోగూడ - మహీసార నామమునఁజెన్నొందు
(పు. 49)

"కావేరి సరి యెన్న కావేరి యనఁగ.....నలరుమండంగుడియను
పేరు గలిగి - (పు. 261)

"అవిరళశ్రీలచే....శ్రీవిల్లి పుత్తూరునాగ నగరమొక్కటి యొప్పు
నవ్యవైఖరుల- (పు. 349)

"హరి గూర్చితపము సేయఁగ శౌరి వచ్చి వరమిచ్చి ప్రేమ నివ్వ
టిలంగ మెచ్చి పరిరంభణము సేసి పాలించుకతనఁ
బరిరంభపురి నాఁగఁబరఁగు నప్పురము (పు. 447)

అను రీతిని పరమయోగి విలాసమునందు శ్రీమన్నారాయణుని నివాసస్థలము లగు దివ్యదేశములు పేర్కొనబడినవి. మరియు పంచమాశ్వాసమునందు గోదాదేవి చరిత్రలో 108 దివ్యక్షేత్రములు, వానియందలి శ్రీమన్నారాయణుని అర్చామూర్తుల మహిమలు స్తోత్రము చేయబడినవి. ఇవి అన్నియు శాంతరస పోషణమునకు ఉద్దీపన విభావము లగుచున్నవి.

భక్తిసార సరోయోగీంద్రు లొకరి నొకరు కలసినపుడు ఎట్లుండెనో చిన్నన్న ఈ క్రింది విధముగ చెప్పుచున్నాడు-

.... .... .... .... .... ఆత్మ బంధువులఁ
గనుగొన్నగతి వేడ్కకడలి నోలాడి యానవేంధు ప్రభలడరు చందమున
నానంద బాష్పంబులందంద దొఱఁగ....నాలింగన క్రియలాచరింపుచును..
యత్తపోధను లంత హరిపదాయత్త చిత్తులై విగళిత చిత్తులై కూడి
హత్తి పాయని యట్టి యానందలహరి మత్తులై విరతాప్రమత్తులై"

యుండిరట. మరియు- - పు. 91)

"ప్రణమిల్లి ప్రణమిల్లి భక్తిసారుందు ప్రణుతించి యానందబాష్పముల్నించి యక్కున నిఱియంగ నలమి యమ్మౌని నక్కడనుండి పాయని కూర్మితోడ మరలి చూచుచు మంద మందయానమున...." - (పు. 93)

వీడి చనెనట. పై వర్ణనము నందు-

"ఆహ్లాద శీత నేత్రాంబుః పులకీకృత గాత్రవాన్
సదా పరగుణావిష్టః ద్రష్టవ్యః సర్వ దేహిభిః"

అని పేర్కొనబడిన రీతి భగవత్సందర్శనానంద విహ్వలురై ఆనంద బాష్పములు జాలువార పులకించిన మేనితో సర్వకాల సర్వావస్థలయందు శ్రీమన్నారాయణుని గుణానుభవముచే తృప్తులైన భగవద్భక్తులను చూడ వచ్చును. ఒకరి నొకరు చూచుకొనుట, ఆలింగన క్రియలాచరించుట, అందువలన కలుగు రోమాంచాదులు, ఆనంద బాష్పములు రసస్థాయిని సూచించు అనుభావములు.

శ్రీవైష్ణవ సంప్రదాయమున 'భాగవతాభిమానమే' అంతిమోపాయము. ఈ విషయమునే కులశేఖరులు ముకుందమాలలో "త్వద్భృత్యభృత్య పరిచారక భృత్య భృత్య భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోకనాథ" అనియు "అడియార్ కళ్ కుళా గరుడన్ కుడూవది ఎన్నుకొవా" - "అడియార్ అడియార్ తమక్కడియార్ అడియార్ తమ్మడియార్ అడియో

జ్ఞశే" 'నీ భక్తుల సంఘములో కూడియుండునది ఎన్నడో కదా ; నీ భక్తుల భక్తుల భక్తుల వారి భక్తుల భక్తుల వారి భక్తుల దాసునిగా నెన్నుము' అనుచు తిరువాయ్ మొళి యందు శఠగోప యోగీంద్రులును అంతిమ నిష్ఠను గూర్చి చెప్పియున్నారు.

అట్టి అంతిమోపాయ నిష్ఠులగువారే చిన్న కావ్యము నందలి పరమ యోగులు. వీరందరును భగవత్ప్రేమైక తత్పరులు. ధారకపోషక భోగ్యములు మూడును భగవత్కైంకర్యముగ భావించినట్టివారు. భగవద్రామామజులు గూడ శ్రీమన్నారాయణుని పాదపద్మముల వ్యామోహమున తదితరము లన్నింటిని తృణప్రాయముగ చూచెనట.

పరమ యోగి విలాసమునందు పేర్కొనబడిన ఈ యోగి పుంగవులు శాంతిరసాధి దేవతయైన శ్రీమన్నారాయణుని యందే లగ్న చిత్తులై, శాంత స్వభావులై, నిర్వికారులై దివ్య దేశావాసము కలిగి, దివ్య యోగి జనసాంగత్యము కలిగి, దివ్య పురుషుడైన నారాయణుని గుణానుభవమున శమింపబడుటచే వీరి చరిత్రలకు సంబంధించిన ఈ పరమయోగి విలాస కావ్యము నందు 'శాంతము' అంగిరసమని నిర్ధారింపవచ్చును. ఈ కావ్యమున-ప్రతిపత్తి మార్గము నెరిగి పరమ విరక్తుడైన యామునాచార్యుల జీవిత వృత్తాంత నిర్వహణమునందును శాంతరసమే పోషింపబడినది.

చతుర్థాశ్వాసము నందు విప్రనారాయణుని చరిత్రలో కవి శృంగార రస పోషణము చేయుచున్నట్లు కనిపించును. కాని విప్రనారాయణుడు పరమ యోగి కావున ఆయీ శృంగారము లౌకికమే యగుచో మలినమై ఆ యోగి జీవితమునకు దోషమంటి కళంకితమగును. దీనిని శ్రీరంగనాథుని పాత్ర ముఖమున కవి ఎట్లు సమర్థించుచున్నాడో చూడుడు.

"అతడు మహాయోగి యువతికి దుష్టరతిరక్తి గలదె యారసి చూచితేని అతడు మల్లీలార్థమై రాగవశునిగతిఁ జెంది యున్నాడు గాని యా మౌని

తలఁపనేఁ గృష్ణావతారంబునందు నలరుబోణులఁ గూడి యట్లయుండితిని
దుద నాకు రాగమందుల వింత కలదె ? యది నీ వెఱుంగవె యాత్మ
భావింప
నలినాస్య వివరింప నాకెంత శక్తి గలదంత శక్తియుఁ గలదు నిత్యులకు
నతడు మద్వనమాలికాంశంబు గాన నతనికి దోషమింతైనను గలదె"
— (ప. మో. వి. పు. 307)

పై వివరణము నందు విప్రనారాయణుని దోషరహితుని చేసి యతని శృంగారమును ఆభాస చేసి, యోగి సంబంధమగుటచే దానికి అలౌకిక స్థాయిని కల్పించి తుదకు శాంతరసమున పర్యవసింప జేసినాడు. అంతే గాక, ముక్తి ప్రదమైన వేదాంతాంతర్వాహినీ భూత పవిత్ర శృంగార రస ప్రధాన మగు శ్రీవైష్ణవ సంప్రదాయమును రసజ్ఞుల కందించుటలో కృతకృత్యు డైనాడు. ఇది చిన్నన్న రసపోషణా నిర్వహణ చాతుర్యమునకు నిదర్శనము.

*శృంగారము :* చతుర్థాశ్వాసమున దేవదేవీ విప్రనారాయణుల సంభోగ శృంగారము వర్ణితము. సంభోగ సన్నివేశమునకు ముందు ఉద్దీపనముగ వర్షావర్ణనము కలదు. ఆ వర్ణనలో - నిర్మలమైన ఆకాశమును నల్లని మబ్బు కామాంధకారమువలె కప్పినదట. ఇట మేఘాకాశములు దేవదేవీ విప్రనారాయణులే. చన్నుగొండల ప్రేగు పైరింపలేక ఆమె చిన్నారి కొధీగ జివ్వాడుట, వానలో తడిసి, యీదగాలికి వణకుచు, నులి వచ్చి పయ్యెదకొంగు మొనల నానిన కుచములతో నొప్పు దేవదేవి పర్ణశాలలో ప్రవేశించి తల తడి యార్చు వంకన ఆ మునివి పోకునట్లు క్రొమ్ముడి విడిచి, నగుము పాలిండ్లు కనిపించునటుల పయ్యెద జార్చి, బొమలు నిక్కగ నోరపుల చూపుతో వయ్యారమును ప్రదర్శించుట విప్రనారాయణుని మనసు కరగుటకు వలసిన ఉద్దీపక సామగ్రి. అతని పాదములను ఊరువులపై నిడుకొని మత్తిల్ల తన కరపల్లవములతో నొత్తి యికనైన ఆనతిమ్మని తన సమ్మతి నతి వినయముగ తెల్పుటతో అప్పటికే కరగిన ఆ ముని హృద

యము ఆ మోహనాంగి చేయి తగులుటచే పులకించి సంభోగేచ్ఛ పతాక స్థాయికి చేరుకొన్నది. ఇది రంగని లీల కనుక ఈ సన్నివేశమునకు రంగభోగి ప్రేరణ ప్రధాన కారణమైనది. ఇక చిన్నన్న ఇంతకన్న లోతు నకు దిగి అనౌచిత్యమునకు పాల్పడక-

"హరి కుబ్జ మున్ను నెయ్యంబునం గలయు
కరణి నాలేమ నంగజ కేళిఁదేల్చె"

అను నొక్క వాక్యములో వారి సంభోగమును చటుక్కున తేల్చివైచినాడు. తుదకీ శృంగారమును శాంతరసమున సంగమింపజేసినాడు.

**కరుణము :** ఆకాశ మార్గమున రంగనాథుని చేరిన కుమార్తె గోదాదేవిని పల్లకిలో గానక విష్ణుచిత్తుడు దుఃఖించు సందర్భమున కవి కరుణ రసమును పోషించెను.

"ధ్యానంబుఁగనుఁగొని హాయంచు మూర్ఛనూని తెప్పిరి మరియును
విచారించి
మదిలోన రంగేశు మాయగా నెఱిఁగి గుదిగొన్న నెవ్వగం
గ్రుమ్మరిల్లుచును
పాయని కూర్మిచే బాష్పంబు లురుల దోయజోదరు నాత్మదూరి
యిట్లనియె....
అనుచు శ్రీరంగనాయకుని సన్నిధికి జనుదెంచి పాదాంబుజములమైవ్రాలి
తొరఁగెడి కన్నుల తోయపూరములు చరణాంబుజముల మజ్జనమాచరింప
- పం. ఆ. పు. 423

ఇట్లు దుఃఖించుచున్న విష్ణుచిత్తుని ఆవేదనలో-హాయని మూర్ఛపోవుట. తెప్పరిల్లుట. మరల విచారించుట. నెవ్వగతో కన్నీరు కార్చుటలు శోక స్థాయిగ కరుణరసము పోషింపబడినది.

*వీరరసము :* పరకాల చోళరాజుల యుద్ధ కథా సందర్భము. ఇరు సైన్యములు యుద్ధమునకెట్లు తలబడుచున్నవో చూడుడు-

"కరియంత కరియంత కరియునుం గరియు
హరిసాది హరిసాది హరియును హరియు
రథియును రథియు సారథియు సారథి
రథమును రథమును రాజును రాజు
భటుఁడు భటుండు నుద్భటవృత్తి దిశలు
పెటపెలంగ మెఱసి యభేద్యమైపోర" - (ష. ఆ. పు. 467)

ఈ పోరుపో తలబడుటకు ఉరకలు వేయుచున్న సైన్యమువలె శబ్దములచే కవాతు చేయించి, పదాతి దళమును పరుగెత్తించి, ఉత్సాహము స్థాయిగ కవి వీరరసోత్పత్తిని కావించెను.

*బీభత్సము :* పలలాస్థి శోణితాదులతో నిండిన యుద్ధభూములు బీభత్స రసపోషణమున కనువైన రంగస్థలములు. సందర్భము యుద్ధమున పరకాలుని విజృంభణము-

"శిరములు డెందముల్ చెవులుఁ జెక్కులును
గరములు కంఠముల్ కౌనులుబరులుఁ
దొడలు జానువులు లేదొడలుఁబాదములుఁ
దొడవులు శిరలుఁ గైదువులు నొక్కటను
దుత్తునియలు సేసి దుర్దాంత వృత్తిఁ
గత్తి కొక్కొక్క కండగాఁజెండి వైచి....
మెత్తని మాసంబు మెదడు నంజుచును
నెత్తురు పునుక గిన్నెల ముంచి త్రావి
పూని యాపరకాలుఁ బొగడుచుఁ బ్రేమ
నానంద మాడుచు నలరె భూతములు" - (ష. ఆ. పు. 469)

ఇందు తెగిపడిన అవయవములు, మాంసము, మెదడు, నెత్తురు, పుత్తెల వర్ణనముతో జనించిన జుగుప్స బీభత్స రసముగ పర్యవసించుచున్నది. భూతములు భయానకమునకు దోహదము చేయుచున్నవి.

**హాస్యము :** విప్రనారాయణుని చరిత్రలో - "వెలికురికిన పండ్లు వ్రేలాడు చండ్లు....మొండి చెవి బుట్ట ముక్కు" (పు. 298) అనుచు గావించిన వేశ్యమాత రూప వర్ణనలో కవి హాస్య రసమును పోషించెను.

## వర్ణనలు

పరమ యోగి విలాసము ఆళ్వారుల చరిత్ర యగుటచే సంప్రదాయ బద్ధమైనది. కవికి స్వాతంత్ర్య మంతగ నుండదు. చరిత్రను మీర రాదు, సంప్రదాయము నతిక్రమించరాదు, కావ్య మర్యాదను పాటింపవలెను. వర్ణన లున్ననే కదా అది కావ్యమనిపించుకొనును ; ఈ కావ్యమున చిన్నన్న అష్టాదశ వర్ణనలు గావించినాడు.

ప్రథమ తృతీయ చతుర్థ షష్ఠాశ్వాసములలో వైకుంఠపుర, కాంచీ పుర, కురుకాపుర, కోడిపట్టణ, మండంగుడి, పరిరంభపుర వర్ణనలు గలవు. ప్రథమాశ్వాసమున హస్తిశైల, కమలాకర వర్ణనలు. ద్వితీయాశ్వాసమున భార్గవముని ఆశ్రమము, చతుర్థాశ్వాసమున విప్రనారాయణుని ఉద్యాన వనములు వర్ణింపబడినవి. తృతీయాశ్వాసమున వసంత వర్ణన, శఠగోప మునీంద్రుల అవతార ప్రసంగమున పుత్రోదయ వర్ణనము గావింపబడెను. నిచుళాపుర నాయకి మరియు గోదాదేవి విరహములు, శ్రీరంగనాథునితో వారి వివాహములు తృతీయ పంచమాశ్వాసములందు వర్ణితములు. దేవదేవి విప్రనారాయణుల సంభోగమున రతిప్రసంగ వర్ణనము, చోళరాజు పరకాలుని లోగొనుటలో నయవిరచనము, చోళరాజు యుద్ధ సన్నాహములందు దండ యాత్ర వర్ణనము, పరకాలుని యుద్ధ వర్ణనము. మంత్రులు పరకాలునితో నెరపిన రాయబారములందు దౌత్య వర్ణనము షష్ఠాశ్వాసమున నిర్వహింపబ

డెను. శ్రీరంగనాథుని వేట వర్ణనము తృతీయాశ్వాసమున గలదు. ఇంకను గోదాదేవి. దేవదేవి రూప సౌందర్యములు, నిచుళాపురనాయకి, గోదాదేవులకు చెలులు గావించిన శైత్యోపచార మన్మథోపచారములు మనోజ్ఞముగ వర్ణింప బడినవి. ఇవి గాక అటనట వ్యక్తి స్వరూప వర్ణన లనేక మీ కావ్యము నందు సుందర మందిరములై ప్రత్యక్షమగు చుండును. ఇంతటి వర్ణనా ప్రధానమైన ఈ కావ్యము నందలి కొన్ని వర్ణనలు పరిశీలింతము.

*వైకుంఠపుర వర్ణనము :* దీనితో కథారంభము గావించినాడు చిన్నన్న.

"అల చతుర్దశ భువనాత్మకంబైన కమలజాండంబును గడచి యా మీఁదఁ
గమల తేజోవాయు గగన భూతాది తతమహదవ్యక్త తత్త్వరూపముల
నతిశయంబొందు సప్తావరణముల డాసిన ప్రకృతి మండలమున కవల
భాసిల్లుచుం బరాత్పర వాసమగుచుఁ గుటిల తార్కిక ఘూకకుల
క (త)ర్క నేత్ర
పటలంబునకుఁజండ భానుమండలము చతురాననేశ వాసవ ముఖ్యులకును
మతినెన్నఁగా నవాఙ్మనస గోచరము ననయంబు హృతపునరావృత్తి
పదము....
అంబుజోదరముకుందాహ్వాయ కారణంబు విద్యా నిధానంబు సేవ్యంబు
నగుచుఁ బరవ్యోమ మని సంతతంబు నిగమముల్ పొగడ నెన్నిక
కెక్కి తనరి
లుంఠిత సంసారలోల శోకంబు కుంఠితాఘంబు వైకుంఠంబునాఁగ...."
(పు. 7)

చిన్నన్న కావించిన ఈ వైకుంఠ వర్ణనము భగవద్రామానుజ విర చితమైన 'శ్రీవైకుంఠ గద్య'కు స్వేచ్ఛానువాదము '— "చతుర్దశభువ నాత్మకం అండం। దశగుణితోత్తరం చావరణ సప్తకం। తతః కార్య కారణ జాత మతీత్య వర్తమానే పరమ వ్యోమ శబ్దాభిధేయే బ్రహ్మాదీనాం వాఙ్మ

నసాఽగోచరే శ్రీమత్ వైకుంఠే దివ్యలోకే...." అని శ్రీమద్రామానుజుల వారు. కావ్యములలోని పురవర్ణనములందు సామాన్యముగ దుర్గములను, అగడ్తను, భవనములను, చాతుర్వర్ణ్యముల వారిని వర్ణించుట కలదు. కాని చిన్నన్న ద్రవిడ వేద సదృశమైన ఈ కావ్యమున వైకుంఠపురమును తత్త్వ ప్రధానముగ వర్ణించుట విశేషము. శ్రీవైకుంఠమున వేద విదితమగు సహస్ర స్తంభమంటపమున శ్రీమన్నారాయణుండెనని వర్ణించి, కావ్యారంభము నందే శ్రీవైకుంఠమును సాక్షాత్కరింపజేసినాడు చిన్నన్న.

*గ్రీష్మర్తు వర్ణనము* : చతుర్థాశ్వాసమున దేవదేవి శ్రీరంగము మీదుగా తిరుగు ప్రయాణము సాగించుచున్న సందర్భమున కవి గ్రీష్మము వర్ణించెను-

"....చైత్ర వైశాఖంబులందు మినుకైన రోహిణీ మృగ శీర్షములను
మిక్కిలి వేండ్రమై మెకముల తలలు వ్రక్కలౌఁ బొమ్మను వడి
నెండగాయ
వడదల్లు నెరయెండ వాతెఱలెండ నిడుసోగ కన్నుల నెరికెంపు చూప
విరిదేనియలు కమ్మవిరిమీఁదఁ బొదలు కరణి లేఁజెమట మొగంబుపైఁ
బొదమ - పు. 275

ఇందు వేసవి ఎండకు వాతెఱలెండుట, కన్నులలో కెంపు, చెమట పొడముట ఇత్యాది అనుభూతిని సహజ సిద్ధముగ చిత్రించినాడు.

*వర్షర్తువు* : విప్రనారాయణుని వశవర్తిని గావించుకొందునని ప్రతిజ్ఞ చేసిన దేవదేవి తన ప్రతిన వీగిపోవుచున్నదని భావించి చింతిలుచు నిద్రించిన నాటి రాత్రి ఆకాశము మేఘావృతమై వర్షము కురిసినది. ఆ వర్ష వర్ణన మిట్లున్నది.

"కాముక హృదయ పుష్కరము నిండార కామాంధకారంబు గప్పినపగిది
గగనమెక్కింతయుఁగానరాకుండ మొగులు గార్క్రమ్ముచు ముంచె
నల్గడల

ముంచి నల్లడ నల్ల మొసురుగాఁబట్టి మించులతోఁగూడ మేఘమై పొదలి
విటపాగ్రములు వెడవెడఁగ నల్లాడఁ జటిపొటి చినుకులు చినుకు....
(పు. 230)

ఇందు విప్రనారాయణుని లోబరచుకొన ప్రయత్నించుచున్న వేశ్యయైన దేవదేవి కాముకి. కామాంధకార మామె హృదయాకాశమును నావరించినట్లు నల్లని మబ్బు వ్యాపించి ఆనందము పంచు మించులతో కాముక హృదయ పుష్కరము నిండారునట్లు జటిపొటి చినుకులతో వర్షము కురిసినదని వర్ణించుటలో కవి వర్షా వర్ణనమును కథాగతి యందొదిగించి కాముకుల మనస్తత్వమును వివరించుట విశేషము. ఇందలి 'విటపాగ్రము'లను పదప్రయోగమున 'విటుల' స్ఫూర్తి కలదు.

*వసంత వర్ణన :* "వృద్ధ భావము మాన్పి వృక్షాళిఁగాయ
సిద్ధిఁబొందఁగఁజేయు సిద్ధముఖ్యుండు
కంతు నెచ్చెలి వేల్పుగముల విందులకు
సంతసంబొదవ వసంతుఁడే తేర" (పు. 240)

ఇందు వసంతుడు సిద్ధునితో పోల్చబడినాడు. వృక్షాళికి వృద్ధ భావము తొలగించి యౌవనము చిగురింప జేయు దివ్యౌషధ సిద్ధుడు వసంతుడనుటలో ప్రకృతి సౌందర్యముతో బాటు 'వసంతకుసుమాకరము'ను ధ్వనింపజేసినాడు కవి.

*వన వర్ణనము* ఈ కావ్యమున విప్రనారాయణుని ఉద్యాన వనము, భార్గవముని ఆశ్రమ వనములు రమ్యముగ వర్ణింపబడినవి. (పు. 277) ఈ వర్ణనములందు పేర్కొన్న ఫల పుష్పజాతుల నామములు పరికింప చిన్నన్నకు వానితో గల పరిచయము ఆశ్చర్యమును కలిగింపక మానదు. ఇందు నానాజాతి పుష్పములను పేర్కొనుటయేకాదు వానిని విప్రనారాయణుడు మాలలు కట్టు తీరును గూడ కవి మనోజ్ఞముగ వర్ణించినాడు.

"నార చెన్నార సన్నంబుగాఁ జేరి చేరువఁ దాసుఖా సీనుఁడై యుండి
బొట వ్రేల దర్జనిం బూవులు రెండు నటన గీలించి లోనార సంధించి
తొడిమతోఁ దొడిమ పొందు పడఁగఁ జుట్టి మిడి వ్రేళ్ళసందు
మైమెణకుగా వైచి
యెడనెడం దులసి నయ్యెడ నరవిరులు గడు పొంపు మీఱంగఁ గట్టి
మాలికలు" (పు. 267)

ఈ వర్ణనలో చిన్నన్న మాలికలు కట్టుచున్న వాని రూప చిత్రమును నాటకీయ ధోరణిలో చిత్రించి కనులముందు నిలిసినాడు.

*రతి ప్రసంగము* : దేవదేవి విప్రనారాయణుల సంభోగ సన్నివేశము.

"అల మోహనాంగి చేయుంటుట వలన విలువెల్లఁ బులకింప
నెనరామతింప
హరి కబ్జ మున్ను నెయ్యంబునంగలయు కరణి నాలేమ నంగజకేలిఁదేల్చి
రతివేద శిక్షకు రతిరాజు తరటుగతివేణి యొప్పు నక్కల కంఠ కంఠి
వనముల గాఢభావజకేలిఁ గొన్ని దినములచ్చోట వర్తించి...."
(పు. 295)

ఇందు 'రతి' ఒక వేదముగ వర్ణింపబడినది. జనని గర్భములోనె సకలంబు నెఱిఁగి'యు యీ రతి వేద విద్యయందు మాత్ర మేమాత్రము ప్రవేశము లేని విప్రనారాయణునకు శిక్షగఱపు గురువు రతిరాజు మన్మథుడే. ఆ మన్మథ గురుని చేతి యందలి 'కళ' వలె దేవదేవి జడ యొప్పు చున్నదని చిన్నన్న ఒక చక్కని ఊహా కల్పనముచేసి రతి ప్రసంగమును మనోజ్ఞముగావించెను.

ఇట్లే విరహ — పరిణయ వర్ణనలు పంచమాశ్వాసమున గోదాదేవీ శ్రీరంగనాథుల వృత్తాంతములందు సంప్రదాయ రమణీయముగ నిర్వహించినాడు చిన్నన్న (పు. 410, 411, 431, 432).

**యుద్ధ వర్ణనము :** షష్ఠాశ్వాసమున పలనాటి చోళుల యుద్ధ సందర్భమున శతచోళ సైన్యము నొక వనజాకరముతో పోల్చుచు చిన్నన్న గావించిన యుద్ధ వర్ణనము నందలి ఈ క్రింది మనోజ్ఞ కల్పనమును పరికింపుడు.

"దొఱగు రక్తంబులు తోయపూరములు
శరము లండజములాస్యములు తామరలు
కనుగవల్ తొగలు మీగాళ్ళు తాబేళ్ళు
మినుకారు నెరికురుల్ మింద తుమ్మెదలు
కరటి తుండములు నక్రములు కంఠములు
దరములు చామరల్ తరచైన నాచు
ఘన రథాంగములు వక్రములు చక్రములు
పునుకలు వరహంసములు గాఁగ నొప్పు
వడఁ జోళ విభు సైన్య వనజాకరంబు.... (పు. 468)

భీతావహమైన యుద్ధభూమిని సుకుమార సుందర సరోవము నందగుపింపఁ జేసిన చిన్నన్న వర్ణనా నైపుణి వినుతింపదగినది. బహుళః చిన్నన్నకు భారతమున తిక్కన కావించిన యుద్ధ వర్ణనము ప్రేరణమై యుండవచ్చును. భారతమున ద్రోణపర్వములో "కరి కళేబరములు ధరణీధరములు, దురంగ గాత్రమ్ములు గ్రాహసమితి....అంబు రాశికరణి సంగ్రామ భూభాగమొప్పు" (ద్వి. ఆ. పు. 134)) అనునది చూడుడు.

**సూర్యోదయ వర్ణనము :**

"అలఘు ప్రభాత చైత్రాగమ వేళఁ
దొలుత నాకసపు మోదుగపూఁ జెననఁగ
విమలనభోద్యానవీధి చిగిర్చె
రమణీయ సాంధ్యానురాగంబు లెసఁగె

శ్రుతిలతాంతంబునఁ జూపట్టు ఫలము గతి
నంధకారద్విషన్మూర్తు డాష్కరుఁడు
నైనయు కెంజాయల నెలమించు ప్రొద్దవఁ
గనుపట్టుఁదొలుదాయఁ గరు సొంపుమీఱ
కాలమృగేంద్రంబు గనలి యపూర్వ
శైలేభకుంభముల్ జదియఁ గొట్టటయు
నెనయురక్తమున బిట్టగయు మౌక్తికము
ననువున నుదయించె నంబుజాప్తుండు. (పు. 317)

వేద లతాంతమున చూపట్టు ఫలమువలె చీకట్లను హరించు సూర్యు డొప్పుచుండెనట. ఇట చిన్నన్న కావించిన కల్పనమొకటి అద్భుతము. ఏనుగు కుంభస్థలమున మౌక్తికములుండు నందురు. కాలమనెడి సింహము తూర్పు దిగ్గజకుంభమును చదియగొట్టుటచే నెనయు రక్తమున (సూర్యోదయ సమయమున వ్యాపించు ఎఱ్ఱని కాంతి) బిట్టగయు ముత్యమువలెనున్నాడట సూర్యుడు. ఇది అపూర్వ భావనము. ఈ నెపమువేశమున చిన్నన్న కల్పనా చాతుర్యము, భావనా బలము వెల్లడియగుచున్నది.

**సూర్యాస్తమయ వర్ణనము :** "చిలుక ముక్కులచాయ జేవు ట్రింపంగ ఫలితాననగ్గ చూత పరివక్వ ఫలమ్ము ఇలవ్రాలెనోయన నినుడస్తమించె... హరి పద ధ్యానామృతాహారలహరి నెరగన్నులిడిన సోయగము దీపింప విరిదామరలు వెడవెడఁ గన్ను మొగిచె". (పు. 303). ఇది చిన్నన్న చేసిన సూర్యాస్తమయ వర్ణనము. ఈ వర్ణనలలో గూడ హరి పద ధ్యానామృతాహార లహరిని, కథాగతిని, విడువని చిన్నన్న వర్ణనలు నేల విడిచిన సాము కావని గ్రహింప నగును.

ఇంతవరకు ప్రబంధోచిత వర్ణనలు వివరింపబడినవి. ఇక చిన్నన్న కాలము నాటి సమాజమునకు దర్పణముగ నున్నట్టి కొన్ని వ్యక్తి స్వరూప వర్ణనలు పరికింతము. ఇందు వివిధ వర్ణములు, వివిధ వృత్తులు చేయు

వ్యక్తుల స్వరూప స్వభావములు, వేష భాషలు సహజ సుందరముగ వర్ణింప బడినవి.

**1. రెడ్ల వేషము :** (పు. 478)

"పసుపు చుంగుల తలపాగ నెట్టంబు కసిబిసిమెసఁగు బాగాల వీడియము
మిన్న దేరెడు దొడ్డ మెడనూలు మిగులవన్నెయగల మాదవళి పచ్చడంబు
దళసరియగు దేవదారు గంధంబు వలకేలఁగనుపట్టు వెంకటుంగరము
దొల్లుబోఁగుల్లను గాటుక కప్పుదేరు పిల్లిగడ్డము వడిబెట్టు మీసలును
నలవడ నాందోళికారూఢుడగుచు నలనాఁటి పూర్వీకుఁడగు పెద్దిరెడ్డి"

**2 వైద్య వేషము :** (పు. 350)

"చింతమందుల సంచి జగజంపు వలువ పొంకమై నిజకర్ణముల
నొప్పుదూది
కువివడుఁజుట్టిన కులుమాపుపాగ యనువంద పంచలోహంపు టుంగరము
మరుతరం బైవట్టి యూర్ధ్వపుండ్రంబు క్షురమొప్పుకేళి కరకకాయలును
బెరయఁబచ్చడముతోఁ బెనువడ నందెనరగనుపట్టు బాహాట పుస్తకము....
నెన్న ధన్వంతరికెనయైన వైద్యుఁడన్నగరన యుండు....

**3. మేళం వాని రూప వర్ణన :** (పు. 65)

"మలయంగ నెడదుప్పిమై నోరగాఁగ మొలత్రాటఁ జెక్కినమోట
కత్తియును
గొనసిగతోఁగూడి కురులొక యంతగనుపట్టఁ జెరివిగ గన్నెరాకమ్మఁ
గొవలవెల్వరు పుట్టగోఁచియు నైరుల్లు బెవఁగొప్పనును దట్టపేఁచుదాకేల
వెడవెడ జివ్వాడు వెదురు సలాక యొడమచే బొటఁబ్రేలి యమవ
యుంగరము...."

*4 భోగము స్త్రీవేషము :* (పు. 273).

"వలిపె చెంగాలి పావడరంగొకింత వెలిమించునెరివట్టు వెలివట్టు గట్టి
జవ్వాది పచ విచ్చి చంద్రకాంతంపు దువ్వెనఁ గొమరార దువ్వి
వెన్నడుమఁ
దాపట యొసపరి బాగుగాఁదీర్చి చూపట్టు కొప్పొకించుక జాఱఁదురిమి
విటుల మన్మథుఁడేయు విరిమొగ్గ తూపు నటన గుమ్మడిగింజ నామంబు
దీర్చి
పుంజాల దండదాపున నేవళంబు రంజిల్ల బణ్ణసరంబు గీలించి
తిరుగుటుంగరము పూదియలాన వామ కరమున ముద్దుటుంగరము
గీలించి....
మొరయు కుచ్చిలమీద నొకయింత జాఱుమురువైన బిల్లల
మొలనూలమర్చి"

*5 దాసి వేషము :* (పు. 323) చిన్నన్న దాసివి 'ద్రిమ్మరి గబ్బి తొత్తు' అని పేర్కొనెను.

"నల్లపూసల పేరు నలఁగిన కోక వెల్లనై గుదిగొన్న విచ్చుటాకులును
గొప్పున కందని కుఱుచవెంట్రుకలు కప్పారు రావాకి కప్పు బల్వరుస....
పిత్తడి కడియముల్ పికిలి పూదండ మొత్తంబులగు నల్లముదుక
గాజులును
లక్క తాయెతులు తెల్లని తగరంపు ముక్కరే సీసపు ముద్దుటుంగరము
కాకి బేగడ బొట్టు కంచు మట్టియలు కైకడ సంకు టుంగరమునుం గలిగి"

*6. వృద్ధ వైష్ణవుని రూప వర్ణన :* (పు.

"నరప గడ్డంబును నరముల మెడయు కరము వ్రేలెడు పిడికెడు
జన్నిదములు

వర్ణనలు

నొలయు వెన్నెల వన్నె నూర్ధ్వపుండ్రంబు మెఱయు బిగ్గుల తిరుమణి
వడంబులును
వ్రాలిన బొమలు లోవంగిన వీఁపు వ్రేలాడు తోళ్లతో వెలయు నెమ్మేను

ఈ విధమైన వర్ణనల ద్వారా ఆయా వ్యక్తుల రూపములను నాటి సమాజమును ప్రత్యక్ష పరచుటలో సిద్ధహస్తుడు చిన్నన్న. ఇంకను ఈ కావ్యమున 'వైష్ణవులు నుదుటను పెట్టుకొను నామము'లను పలుతావుల కథానుకూలముగ వర్ణించుటలో కవి కనబరచిన వైవిధ్యమును పరికింపుడు.

"తిరముగా విడు పట్టె తిరునామములును దిరుమణి వడములుఁ
దిరు చూర్ణములును...
నెలపొల్పు పస నవనీతంబు చాయ గలిగి వెన్నెల సోగకణికలో యనఁగ
దెలివొందు విడువాలు తిరుమణుల్ మిగుల బొలుపొంద... (పు. 188)
"ఏ మేన సెందూర సేసలు నామములు నామముల్గా వృత్తి కన్నపుఁ
గత్తులరయ (విప్రనారాయణుని తొంగయని నిందించు సందర్భములో)
"హరి విహరించు దేహము మేన యందు సిరిమించి జేర్చు విచ్చైనలన
నొప్పు నుపుతరాయత ధవళోర్ధ్వపుండ్రంబు కరమొప్పు
(రామానుజుల రూపవర్ణన) (పు. 602)

మరియు భగవద్రామానుజుల స్వరూపమును తత్త్వప్రధానముగ వర్ణించు తీరు చూడుడు—

"యమదండ దండనంబైన త్రిదండ
మమల వేదత్రయంబన నొప్పు మిగుల
మలయక యుభయ మీమాంసాను రాగ
ములు తమ్ము మిగులఁ బ్రేమఁదో జుట్టివట్లు
మలయుచు భూషాయమాన కాషాయ
ములు కటితటి శిరముల జెన్ను మీఱ
గాత్రంబు మీఁద సంకలిత సద్బ్రహ్మ
సూత్రమౌ నల బ్రహ్మసూత్రము మెఱయ
ఉరుతరాయత ధవళోర్ధ్వ పుండ్రములు
కరము శోభిలఁగ లక్ష్మణ మౌని వరుడు— (- పు. 642)

ఇది యిట్లుండ శ్రీరంగ ప్రాంతము నందలి ద్రావిడాంగనల వర్ణనలో శృంగారమెట్లు తొణికిసలాడినదో గమనింపుడు-

"వల వెలువడు జక్కవలరీతిఁ బయ్యెదలఁ బాసికుచ పర్వతములు
గీఁటాడ
నాలోల కర్ణభూషావళుల్ గండపాలికాతటములఁ బంజళ్ళ ద్రొక్కఁ
తరణి బింబము లద్రతలముల నొప్పుకరణి గ్రొమ్ముళ్ల బంగరు
బొట్టులమరఁ
బసనైన తమమించు పాలిండ్ల బోలు పసిఁడి కుండలు వట్టిపర
తెంచుచున్న ద్రావిడాంగనల నెంతయు నొప్ప.... (పు. 422)

ఇట్లు చిన్నన్న యతిని వర్ణించినా, విటుని వర్ణించినా, దాసిని వర్ణించినా, వేశ్యను వర్ణించినా, రాజును వర్ణించినా రాణిని వర్ణించినా ఆయా వర్ణనల యందెంతయో వైవిధ్యము, సహజత్వముట్టిపడుచు 'కవి కర్ణ రసాయనము'లే యగును. వర్ణనలందు కొన్నితావుల చిన్నన్న గావించిన పోలికలు నావ్యతో దర్శనీయము. ఇట్లనుటకు తృతీయాశ్వాసమున శఠగోప యోగికి నీడనిచ్చిన చింతచెట్టును ఆదిశేషువితో పోల్చి వర్ణించుచు-

"పరపైన కొమ్మలు పణములుగాఁగ
సిరిమించు లతికలు జిహ్వలుగాఁగ
మొగడ గుత్తులు ఫణముల మణుల్ గాఁగ
దగిన శలాటువుల్ దంష్ట్రలుగాఁగఁ
బొదిగల్గు మూలంబు భోగంబుగాఁగఁ
బదినూఱు శిరముల ఫణిరాజు కరణిఁ
దీటయి యొప్పు నత్తింత్రిణీ తరువు" (పు. 162)

"శేషుండు నిర్ణిద్ర చించామ హీజ
వేషుఁడై యెంతయు విలసిల్లుచుండె" (పు. 150)

అనుటయే తార్కాణము.

కథాపరమైన కల్పనలీ కావ్యమున నందంతగ లేకున్నను కవితాపరమైన అపూర్వ కల్పనలు, వర్ణనలలో కానవచ్చుట గమనింపగలము.

# అలంకారములు - చమత్కారములు

చిన్నన్న వర్ణనా ప్రియుడే కాదు అలంకార ప్రియుడు కూడ. ఇతడీ కావ్యమున శబ్దార్థాలంకారములు చాల వరకు ప్రయోగించెను.

*శబ్దాలంకారములు* : వృత్యను ప్రాసము - "అరవింద భవ సపర్యాప్త గోవింద చరణారవింద నిష్యంద మరంద వారి ధారాకారవర వారి పూజ పూరిత గంభీర భూరి నిర్ఘోష రంగ దభంగ సంభ్రమ భరోత్తుంగ గంగా తరంగ వైఖరులు దీపింప" (పు. 165) ఇందు బిందు పూర్వక దకార గకార ములు, రేఫము పలుమారు లావృత్తియగుటచే వృత్యను ప్రాసాలంకారమైనది.

లాటానుప్రాసము : "మునివంటి వాని కాముని వంటివాని, ముని వంటివాని సోముని వంటివాని, ముని వంటివాని రాముని వంటివాని" (పు. 159) అనుటలో ముని శబ్దము పునరుక్తమైనను తాత్పర్య భేదముండు టచే లాటాను ప్రాసము. ఇట్లే "పరమ సౌఖ్యంబైన భామల పొందు మరు గని వాని జన్మంబు జన్మంబె" (పు. 62) అనుటలో జన్మ శబ్దము పునరు క్తమైనను తాత్పర్య భేదము గమనింపగలము.

యమకము : ఒక పదమును గాని, స్వరవ్యంజన సముదాయమును గాని అర్థభేదముతో అవృత్తి చేయుట. ఉదా : "గండమండలకాండ కాండ వేదండ దండధరోద్దండ దండ కోదండ దండదండన బాహుదండంబుచేత..." (పు. 53) ఇందు గండ, కాండ, దండ శబ్దములందలి స్వరవ్యంజన సముదా యము పునరావృత్తి గావింపబడినది. ఈ కావ్యమున నిట్టి శబ్దాలంకారము లను కవి అధికముగనే ప్రయోగించెను. ఇందు సర్వత్ర మాధుర్య గుణము నకు సంబంధించిన అనుప్రాస పాటింపబడినది.

***అర్థాలంకారములు*** : శబ్దాలంకారములు కావ్యమునకు శబ్దశో భను, అక్షర రమ్యతను కలిగింపగా, అర్థగౌరవమును, ఆత్మగౌరవమును నిలుపునవి అర్థాలంకారములే. చిన్నన్న ఈ రెంటిని సమానముగ ఆదరించెను.

ఉపమాలంకారమును చిన్నన్న పుంఖాను పుంఖముగనే ప్రయోగించెను. వానిలో పౌరాణికోపమలు కోకొల్లలు. ఆ ఉపమలతో పూర్వవృత్తాంతములను తడవుట విశేషము. ఉదా.: విప్రనారాయణ దేవదేవులను హరి కన్నులతో పోల్చుట.

ఉత్ప్రేక్ష : చిన్నన్న ఊహా వైశిష్ట్యము, భావనాపటుత్వము ఉత్ప్రేక్షాలంకార ప్రయోగమున కాంచవచ్చును

"నగి కోపమునఁ గాల నరసింహమూర్తి
గగన హిరణ్య వక్షము విదారింపఁ
దొరగెడు రక్తంబు నాఁదులఁగాంచు సరిజ
నరుణాంశు వల్లిక లలరె నప్రమున" (పు. 303)

ఇందు 'కాల నరసింహమూర్తి', 'గగన హిరణ్య వక్షము' అనుటలో రూపకము గలదు. కాలమను నరసింహస్వామి గగనమను హిరణ్యాక్షుని వక్షమును చీల్చగా దొరగు రక్తమా యనునట్లు సరోజయోరదలి ఎట్టని సూర్య కాంతి అలరారెనట. ఎంత చక్కని ఊహా ఇది! సౌందర్య వర్ణనమున కవి ప్రయోగించిన ఈ ఉత్ప్రేక్షలో నరసింహావతార సన్నివేశమును ప్రత్యక్ష పరచుట కవి ప్రత్యేకత.

రూపకము : ఒక్కొకచో చిన్నన్న అలంకార ప్రయోగమునందెంతయో గంభీరార్థముండును. ఉదా : "శ్రుతిలతాశిరంబునఁ జూపట్టు ఫలము గతి నంధకార తిరస్కారుఁడు భాస్కరుఁడు గనుపట్టె" (పు. 316) అనుటలో శ్రుతిలతాశిరములతో రూపకము గావించినాడు కవి. శ్రుతులనగా వేదములు. వాని శిరోంతములు (పూలు) ఉపనిషత్తులు. వాని ఫలము పరబ్రహ్మము. అతడెవరన శ్రీమన్నారాయణుడే. 'అంతరాదిత్యే విద్యలో' "హిరణ్మయః పురుషోదృశ్యతే....." ఇత్యాదిగ నారంభించిన వాక్యములలో సూర్యమండలాంతర్వర్తియైన శ్రీమన్నారాయణుని దివ్య ప్రభావము వర్ణింపబడినది. ఆ

ఫలము వలె నున్నాడట అంధకార తస్కరుడైన సూర్యుడు. అంధకారము అజ్ఞానమే. సూర్యుడు జ్ఞాన ఘనుడు. అంధకారమును తొలగించు సూర్యకాంతియే శ్రీమన్నారాయణుని తేజస్సని ఈ రూపకము ద్వారా తెలియబరచినాడు చిన్నన్న.

అర్థాంతరన్యాసము : "ఏ పీటి కనకాంగి యేపీటిమౌని యీ విధి వాటిల్లె నేమికారణమొ....ముదితల యెడనున్న ముని వర్యుఁడైన జడియక యెట్లుండుఁ జర్చింప వహ్ని కడనున్న యీ వెన్న కరుఁగ కేలుండు" (పు. 63) ఇందు సంయమియైన భార్గవముని కనకాంగి చూపులకు కరగుట విశేషము. ఇది అగ్ని కడనున్న వెన్న కరుగక మానద'ను సామాన్య ప్రకృత్యంశముచే సమర్థింపబడినది కావున అర్థాంతరన్యాసాలంకారము.

విరోధాభాసము : ఇందు విరోధము ఆభాసము మాత్రమే.

"శ్రుత్యంత దృష్టి కశోధ్యుడై యుండి
శ్రుత్యంత దృష్టికి చూపట్టెననుచు...." (పు. 163)

ఇందు శ్రుత్యంతము లనగా ఉపనిషత్తులు. వాని దృష్టికి అశోధ్యుడు= శోధింపరానివాడు. ఉపనిషత్తులకు గూడ అందరాని పరబ్రహ్మమైన నారాయణుడు శ్రుత్యంత దృష్టికి అనగా శ్రుతి + అంత=చెవుల వరకు గల విశాల నేత్ర దృష్టికి అనగా ప్రాకృత చర్మ చక్షువులకు సైతము చూపట్టెనుగదా ! అనుటచే విరోధము పరిష్కృతమై విరోధాభాసాలంకార మగుచున్నది. చిన్నన్న ఈ యలంకారము నీ కావ్యమునందు బహుధా ప్రయోగించెను.

ప్రతీపాలంకారము : ఉపమేయ వస్తువులుండ ఉపమాన వస్తువు అనవసరమనుట. "రమణి ! నీ యరుణాధరముఁ గ్రోలువాని కమృతంబుపై నేల యాసలు పుట్టు" (పు. 51) ఇందు ఉపమేయమైన అధరముండగ ఉపమానమైన అమృతమనవసరమని చెప్పబడినది.

వ్యాజనింద : నింద వలన నిందను స్ఫురింపజేసినచో వ్యాజనిందా లంకారము. వైష్ణవ నింద చేసిన మంత్రులను మందలించుచు కులశేఖరులు పలికిన మాటలు-

"కడు ఘోరమైన యీ కష్టవాక్యములు నుడువంగ మీకు దానోరెటులాడె శ్రీవైష్ణవుల నింద సేసిన దోషమే విధిఁ బాయు మీరేమి సేయుదురు కలుషాలవాల సంగత లతాజిహ్వాలలవరించిన బ్రహ్మవనుటయె గాక"
(పు. 214)

ఇందు వైష్ణవ నింద చేసిన మంత్రుల నాలుకలు సృష్టించిన బ్రహ్మను నిందింపవలెననుటలో నింద వలన నింద కలుగుచున్నది కనుక వ్యాజ నిందాలంకారము

ఉల్లేఖము : ఒకరే వివిధ విషయములందనేకులైనట్లు చెప్పుట. "కలిమి కిన్నరరాజుఁ గలికి చెల్వముల వలరాజు దానంబు వలన రేరాజు. నిరత భోగంబుల నిర్జరరాజు వరవిక్రమంబుల వనరాశిరాజు, తేజంబు కలిమిని దినరాజు నగుచు రాజిల్లు చుండెడి రాజరాజు...." (పు. 181) ఇందు కులశేఖరుడను రాజు - కలిమిలో కుబేరుడు, కలికి చెలువములకు మన్మథుడు, నిరత భోగములందు దేవేంద్రుడు, పరాక్రమమునందు మృగరాజు (సింహము). తేజమునందు దినరాజు (సూర్యుడు) అని ఒకడే అనేక విధముల ఉల్లేఖింపబడుటచే నిది ఉల్లేఖాలంకారము.

అతిశయోక్తి : "....అచ్చటి మేడలందుఁ జరించు, నేణలోచనల ముఖేందు బింబంబు లేణాంక బింబంబు నెదురు తాకైన, దమపతి యితఁడంచు దలపంగ లేక భ్రమసి తారాళి యేర్పఱపరాకుండు (పు. 353) మేడలలో చరించు పడతుల ముఖచంద్రబింబములు చంద్రబింబమున కెదురు తాకైనవట. అనగా అచటి మేడలు చంద్రమండలమంత ఎత్తుగలవని అతిశయోక్తి - ఇట్లైనను తాకగుటచే తారలు తమ పతిని గుర్తించుటలో భ్రమసినట్లు చెప్పుటలో భ్రాంతి మదలంకారము గూడ తోడైనది-

ఈ కావ్యమున కవి ఇంకను సందేహ, దృష్టాంత, విషమ, అప హ్నుతి. అన్యోన్య శ్లేషాద్యలంకారము లెన్నింటినో నేర్పుతో ప్రయోగిం చెను. చిన్నన్న అలంకార శాస్త్రపాండిత్యమునకు ప్రయోగ దక్షతకు ఈ కావ్యము నికషోపల నిదర్శనము.

**చమత్కారములు :**

"ఏకేన కేన చిదనర్ఘ్యమణి ప్రభేణ। కావ్యంచమత్కృతి పదేన వినాసువర్ణం
నిర్దోషలేశమపి రోహతి కస్యచిత్తే । లావణ్య హీనమివ యౌవన
మంగనానామ్॥

అని అలంకార శాస్త్రములందు చమత్కార విరహితమైన కావ్యము లావణ్య హీనమైన యౌవనవతి వంటిదనియు, అవయవ సౌష్ఠవాదులందెట్టి దోషము లేకున్నను ఆ యువతి చిత్తము నెట్లలరింప జాలదో చమత్కారము లేని కావ్యము మనసునకింపు నింపదని భావము. చమత్కారము చిత్త విస్తార రూపమని సాహిత్య దర్పణమున విశ్వనాథ కవిరాజు, "చమత్కారస్తు విదు షామానంద పరివాహకృత్ శద్దార్థా సచమత్కారా కావ్యమ్" అని చమత్కార చంద్రికయందు విశ్వేశ్వర కవిచంద్రుడు, తదితర జగన్నాథ పండిత రాయాది ఆలంకారికు లందరు చమత్కారము వలన కావ్యశోభ ఇనుమడించి, ఆనం దము కలుగుననియే చెప్పిరి. తాళ్ళపాక చిన్నన్న చమత్కార ప్రయోగము నందును చతురుడు.

"పసిఁడి నెత్తమ్మి గర్భముఁ బ్రవేశింప భాసిల్లఁనానాఁటఁ బ్రబలిచూపట్టఁ
గాసారలక్ష్మికి గర్భ చిహ్నములు గాటంపు తమ్మి మొగ్గలచన్ను మొనలఁ
దేఁటి కప్పొదవెఁబూఁదీవె నెమ్మేను పలుకఁ బాఱెను గనుపట్టె నంతటను
వల నొప్పనల్ల గల్వల బంతియారు తెలిదమ్మి నెమ్మోము తెలతెలఁబాఱె
నొలయు లేసురువు చిట్టుములు నిట్టయ్యెఁదరగలవళులు మంచంబులై తనరె
సరసమ్మృత్తికల వాసనలె యింపయ్యె నలఁగి తిన్నటి యంచనడలు
జాగయ్యె...."                                          (పు. 37)

ఇందు కాసారము నొక గర్భిణీ స్త్రీగ చిత్రించి వారి లక్షణముల నందు చొప్పించి వర్ణించిన తీరు చమత్కారావహము. ఇట్టి వర్ణన రామరాజ భూషణుడు వసుచరిత్ర యందు కావించెను. ఇందు 'కాసార లక్ష్మి' యను టచే అలంకారగతమైన చమత్కారము గలదు.

తృతీయాశ్వాసమున పరాంకుశయోగి అవతారమును గూర్చి చెప్పుచు "వనజాక్షుఁగన్న దేవకిరీతి" అను వాక్యముచే శ్రీకృష్ణ పరాంకుశులకు గల అవతార సాదృశ్యములను సూచించుట కథాకథనమునకు సంబంధించిన చమత్కారము.

పంచమాశ్వాసమున శ్రీరంగనాథుడు గోదాదేవికి సముద్రమును చూపుచు దానిని చమత్కారముగ నిట్లు వర్ణించెను—

"కంటివేయో తమ్మికంటి ! ముక్కంటి వంటిల్లు సురనాగవరు పుట్టినిల్లు
మామక శయన సద్మంబును జందమామ గన్నతఁడు మామానినీగురుని
మా మామ నీక్షింపుమా మహాంబుధిని...." (పు. 445)

ఇందు సముద్రము ఒకరికి వంటిల్లు (శివుడు) ఇంకొకరికి పుట్టినిల్లు (అనంతుడు), మరొకరికి పడకటిల్లుగ (శ్రీమన్నారాయణునకు) ఉల్లేఖించి చెప్పబడుటచే చమత్కారము అలంకారగతమైనది.

## భాష - శైలి

"శబ్దార్థౌ సహితౌ కావ్యమ్" అని భామహుని నిర్వచనము. ఈభావమునే- "శ్రావ్యమైన శబ్దం ద్వారా రమ్యమైన అర్థాన్ని హృద్యమైన అనుభూతిగా పరిణమింప జేసేది కవిత" అని ఆచార్య శ్రీ యస్వీ జోగారావు గారు నిర్వచించిరి. ఈ శబ్దార్థములుక వితా విహంగమునకు రెండు పక్షములు.

తాళ్ళపాక చిన్నన్న ఉద్దండుడైన కవి పండితుడు మాత్రమే కాదు భాషా తత్త్వమును సహితము జీర్ణించు కొనిన గొప్ప శబ్దశాస్త్ర పారంగతుడు.

బహుభాషావేత్త. సంప్రదాయ వేది. "సంప్రదాయాగత జ్ఞాన సహితుడైన మనుజు సత్కవితయు వేద మంత్రసమము" అని సంకీర్తన లక్షణమున చినతిరుమలాచార్యుడు చెప్పినట్లు వైష్ణవ సంప్రదాయ గ్రంథమైన యీ పరమయోగి విలాస కవిత్వము వేద మంత్రసమగుటయే కాక, భాషయు సంప్రదాయ పద బంధ విలసితమై పవిత్రతను పరిపుష్టిని సంతరించు కొన్నది అచ్చతెనుగు పదబంధముతో దేశీయ రచనము గావించుట చిన్నన్న భాషా లక్షణము. పరమయోగి విలాసమున చిన్నన్న అనేక అపూర్వపద ప్రయోగములు చేసెను. చిన్నన్న వాడిన పదప్రయోగములు, పారిభాషిక పదములు, తెలుగు పలుకుబడులు, నానుడులు, సామెతలు, న్యాయములు భాషా పరిశోధకుల కెంతైన పని కలిగించి తీరును. ఒక్క పరమయోగి విలాస మాధారముగ చిన్నన్న పదకోశము నొకదానిని తయారుచేయ వచ్చు ననుటలో అతిశయోక్తి లేదు. అంతటి భాషా సంపద ఈ కావ్యమున కానవచ్చును.

చిన్నన్న తన కాలము నాటి వ్యావహారి కాంధ్రమును అధికముగ నుపయోగించినట్లు తెలియు చున్నది. "ఇతని రచనము లందు ఆనాటి చిత్తూరు, కడప మొదలగు మండలము లందలి భాషా స్వరూపము సమగ్ర ముగ ప్రతిబింబించు చున్నదని" డా॥ వేటూరి ఆనందమూర్తి గారు చిన్నన్న భాషను గూర్చి తమ అభిప్రాయమును వెల్లడించిరి. పదునెరిగి పదప్రయోగము చేయుట, పాత్రోచిత భాషను వాడుట, రసానుగుణమైన రచనా విన్యాసము, ధ్వన్యనుకరణ పదప్రయోగము చిన్నన్న భాషకు విలక్షణతను కల్పించినవి. వ్యాకరణాలంకార ప్రయోగములందు చిన్నన్న స్వతంత్రుడు. ముఖ్యముగ శబ్దాలంకార శోభితమైన ఇతని భాష వీనులకు విందొనరించును.

*పదప్రయోగములు* : పరమయోగి విలాసమున చిన్నన్న గావించిన ఈ క్రింది పదప్రయోగములను పరికింపుడు- 1. అచ్చనలాడు.

(బాలికా క్రీడా విశేషము) - సైరింప లేక అచ్చనలాడు తమిని. 2. అదవద
ఞెందు - కలత చెందు. ముదుకదై యిట్లు కాముకబుద్ధితోడ నదవదఁ జెందు
యయాతి చందమున. 3. అటిముటి = సంభ్రమము - అమానిఁజేరంగ
నటిముటివచ్చి. 4 ఈచవోయిన కాళ్లు. 5. ఉసిపోయు - ఉడివోసి పెను
మంటలుడువీధి గెంట. 6. ఉవ్వాబు - ఉవ్వాయి రూపాంతరము కావచ్చు
(వికాసము) - ఉవ్వాబుగా నూర్పులోసరింపుచును 7. ఎగపోతకాఁడు -
సొలయు నీచలిగాలి సోమరిపోతు ఎలయించు విలుఁడన్న నెగ పోఁతకాఁడు.
8. ఒదికిలు - పంచ తిన్నెపై వొదికిలి - నిద్రించెనను అర్థమున ఒత్తిగిల్లెననుట
నేటికిని వ్యవహారమున గలదు. 9. బోఁగాములు - ఆదెసాశిలున్నార లోగా
ములకును 10. కుసిగింపు = శ్రమము. బాధ. - కొనిపోకుమని కుసిగింపుఁగా
వింప 11. కుళ్ళాయి గబ్బాయి - మేలు కుళ్ళాయి గబ్బాయిఁగొమ్మంచు
నొసఁగి 12. చచ్చన మాటలు - సటలు చూపకుము చచ్చన మాట లేల 13.
గామిడితొండ - మెదవట్టి ద్రొబ్బి గామిడి తొండ యనుచు 14. చుంగులువారు -
చుట్టిన కెంగులఁజుంగులు వాఱ 15. చెవిసోకు - సుదతి వాక్యము చెవి సోఁకె
16 జివ్వాదు - చిన్నారి కౌఁదీఁగ జివ్వాదు చుంద. 17. జోతాలు - హరికి
బెట్టుమీ జోతాలు 18. తంగేటిజున్ను - ధనధాన్య సంగతి తంగేటి జున్ను.
19. తమ్మచిట్టము - జీబు కొల్పుచుఁదమ్మ చిట్టంబు గట్టి. 20. తాళిగోణము -
కొమరు మించిన తాళిగోణంబు తోడ. 21. తూర్పెత్తు - గాలిగలనాదె తుర్పె
త్తగావలయు 22. తళ్కుకొను - మురిపెంబు నొయ్యారమును దళ్కుకొనఁగఁ
23. దివ్వార్ద బుప్పుల కోవి - ఇనుముఁ గన్నపుఁగత్తి యెద దట్టిలోన
దొసఁగిన దివ్వార్ద బువ్వుల కోవి. 24. ద్రిమ్మరిదిప్పకాయ - మలయ
మారుతము ద్రిమ్మరి దిప్పకాయ. 25. పాక్కపాక్కను - ఆలించి మార్జాల
మని సంశయించి పాక్కపాక్కని తమ భాషఁజెప్పుచును. (బహుశః మేదరులు
మాట్లడుకొను భాషలో పాక్కనగా 'పిల్లి' కావచ్చును) 26. హుంబాశెలు -
వెలఁది హుంబాశెలె వీచోపులుగను. (వీచు + చోపులు = వీచోపులనగా
వింజామరలు; హుంబాశెల కర్థము తెలియరాదు) 27. శుంఠకాయ - ఈరీతి

నేమిటికీశుంఠకాయ 28. తళిపెట్టు - దళముగా నందంద తళిపెట్టువారు, (అన్నముపెట్టుటకావచ్చు) 29. మాళిగలు-మాడుగు, మాడువుల రూపాంతరము (హర్మ్యములు), మలయ మారుతముల మలయు మాళిగల (పు. 34) 30. సోడుముట్టి=బ్రహ్మ రంధ్రము లేక మాదవట్టు; కమ్మవల్పులు సోడుముట్ట. (పు 105) 31. బోడుకలు=సేవకులు కావచ్చు. బోడుకలు కొంగువట్టి (పు 461)

ఇట్లింకను కక్కసమగు, కసిమసఁజేయు, చిడిముడి, చపచప, చిమ్మచీఁకటి, చెల్లిచీటి, సుద్దులు చెప్పు, సొళగించు, ససులొత్తు, నందు గొందులు, వేలు విత్తులు, వెల్లవోవు, వెరజుకొను, మోదరలాడు, బొమ్మరవోవు, పొరుపత్తెము, పసిఁడి మొల్లాము, నుగ్గు నూచము, నీరాళగొంది, తెరవాటు గొట్టు, తెప్పదేలు, పులికళాసము, వావురము (వారువమునకు మారురూపము)=గుఱ్ఱము; చెన్నొందు మరుని రాచిలుక వావురమొ (పు. 104) దీనికి 'చిలుకొ హావురమొ' అని పాఠాంతరము. తరవణి=తరవాణి రూపాంతరము కావచ్చు= పుల్లనీళ్లు. ముప్పిడి హడపము విన్నాణమైన ముప్పిడి హడపంబు కన్నుల కల్కి యొక్కతె దాల్చి యొప్ప; మూడు + పిడి= ముప్పిడి=బాఁకు. అడపము యొక్క రూపాంతరము హడపము=వక్కలాలాకులతిత్తి; సింగిణీ తరకసములు=విల్లు, అమ్ములపొది; (పు. 228); పడవాళ్ళు = సేనాధిపతులు (పు. 241) ముడాసులు, డొల్లు బొంగులు, రింబెములు, కాంతాళము (ఈర్ష్య); సోరణము (గవాక్షము) ఇత్యాది దేశీయ పదములు చిన్నన్న భాషలో కోకొల్లలుగ గోచరించును.

వైష్ణవ పదములు : ఆళువార్, ఆళువందార్, ఉడయవరు, చూడుకుడుతనాచారి, నంబి, నమ్మాళిగ తొండ, జియ్యరు వంటి ద్రావిడ వైష్ణవ నామములను చిన్నన్న యథాతథముగనే ప్రయోగించెను.

అపూర్వపద ప్రయోగములు : పరమయోగి విలాసమున చిన్నన్న కొన్ని అపూర్వ పదములను ప్రయోగించెను. అందు కొన్నిటి అర్థము నేడు

స్పష్టముగ గోచరింపదు. ఊహాగానము చేయవలసినదే. అట్టి పద ప్రయోగ ములు కొన్నింటిని డా॥ ఆనందమూర్తిగారు తాళ్ళపాక కవుల పదకవితలు– భాషాప్రయోగ విశేషములు'ను గ్రంథమున పేర్కొనిరి. అందు కొన్ని–

రేకబడు – 'బలువు కొండలు రేకబడు నింతమలచి' అని చిన్నన్న. రేకబడు అనగా 'గీటుపడు' అను భావమును శ్రీవేటూరి వారు తెల్పిరి. శిల్పులు వలసిన ఆకృతికి డాతిపై గీట్లు గీచికొని శిలలను మలచుట పరిపాటియని, పెద్ద పెద్ద కొండరాళ్ళను రేకబడునట్లుగ జేసి మలచిరని వారి వివరణము.

కావి కట్టణములు : దీనికి కాషాయ వస్త్రమని అర్థము చెప్పిరి శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు "గాండీవికిని మేలు కట్టణంబు లమర్చి స్వర్ణపేటికలందు సంతరించి" అనుచు 'కానుక' అను నర్థమున జైమిని భారతము, "ఉక్కుటులుల రాకట్టణపు బెడుల్ గైకొని నఱకు" అను దాని యందు బంధనమను నర్థములో హరివంశము నందును ప్రయోగములు కన్పించుచున్నవి. చిన్నన్న ఈ పదమును వస్త్ర విశేషముగనే ప్రయోగించి నట్లు కనిపించును. "భృత్యులు నంబుల కావి కట్టణములొలిపించి" "రావించి సంబుల రాగిల్లఁ బలికి కావికట్టణములు గరిమమై నొసఁగి (పు. 327); ఉరుతర పీఠిపై నునిచి కట్టణము లిరువుర కొసఁగి" (పు. 439)

"తోదోపులాడుచుఁ దొలఁగకనంత"–అని చిన్నన్న ప్రయోగము తోపు+తోపు=తోదోపు అగును. 'త్రోపు' అనునది ఒప్పు. 'త్రోపులు త్రోసికొనుచు' అని కవులు ప్రయోగించిరి. త్రోయు అనుదానికి వ్యావహారిక రూపమైన 'తోపు'ను చిన్నన్న వాడెను.

దండాలు, జోతాలు వంటి వ్యావహారిక పదములీకావ్యమున అచ్చట చ్చట కనిపించును. 'సయించదు' అను పదమును 'నిలువ సయించదు విలు చున్నచోట' అను వాక్యమున ప్రయోగించెను. "అరయక దుర్భాషలాడితి

మిప్పుడవి యెల్ల నోర్చుకొమ్మని 'ఫళఫళవి' దవుడలు కరముల దాటించుకొనుచు. (పు. 138) తప్పు మన్నించమని చెంపలు వేసికొను ప్రక్రియను 'ఫళఫళమను ధ్వన్యనుకరణశబ్ద ప్రయోగముచే దెలుపుట విశేషము. ఇట్లే తెలుగువారి పలుకుబడికి తగినట్లు "బెళకక బెళుకు, నవ్వకనవ్వు, మెదలక మెదలు, తిట్టక తిట్టు, చిందక చిందు, సొలయక సొలయు" (పు. 102) అను పదములను సహజ సుందరముగ వాడినాడు చిన్నన్న. "ఏ రీతి లాగించితీపైఁడి గిన్నె" (పు. 329) "తొడిబడ మెడవట్టి ద్రొబ్బంగ నెంత (పు. 331) అనుటలో నాటి వ్యావహారికాంధ్రము మున్మూర్తుల తొంగి చూచుచున్నది.

నాటి సమాజమున ప్రజలుపయోగించు ముత్యములు పచ్చల పతకములు, కమ్మలు, మొగపుల తీవెలు, రాలపెండెములు, పసిడి యొడ్డాణములు, వజ్రాలు, కెంపుల కడియములు, పాదకటకములు, ఇనుప ఉంగరములు నెలవంక పులిగోరు, పాలపూసలు, బాహుపురులు, మకర కుండలములు, మణికంకణములు, రవల గజ్జియలు వంటి ఆభరణ సంబంధిత పదములనేకము ప్రయోగింపబడినవి. "వరసి యుగాది దిపావళులందు -" (పు. 197) లో పండుగలు ప్రస్తావింపబడినవి. బొమ్మరిండ్లాటలు, గుజ్జన గూళ్ళు (పు. 379) అచ్చన గండ్లు మున్నగు ఆటలకు సంబంధించిన పదజాలము గలదు. పనివారు దూలములెత్తుచున్నపుడు వారు పలుకు ఊతపదములవంటివి వాడబడెను. ఉదా : "లావునం గదిసి 'హేలల్ల' యనుచు, యెగదిగ రవముల 'హేలల్ల' యనుచు (పు. 561) ఇట్లే హసాదను పదము. 'అనిన భీతిలి 'హసా'దని మంత్రులెల్లె వెనుకకు వచ్చి' - (పు. 200) "పరిఘ గదాకుంత పట్టిసప్రాస పరశు తోమరాది (పు. 469) ఆయుధ సంబంధిత పదములు, కొంకకజీనిపై గోవర కంగులంక యయోధ్య మలాక యీడాము మొదలైన దీవులు (పు. 488); పెదపెద్ద ముడాసులు, డొల్లు బొంగుళ్ళు, పసిడి యిట్టికెలు, మున్నగు బేహార సంబంధిత పదము

ములను వాడి చిన్నన్న తన నాటి సమాజమును కావ్యమున ప్రతిబింబింప జేసినాడు.

అసలు నిఘంటువులందు చేరని పదములెన్నియో చిన్నన్న వాడిన భాషలో కనిపించుట విశేషము. శివకవులవలె చిన్నన్నయు కొన్ని తావుల వ్యాకరణోల్లంఘనము చేసెను. ఉదా : "ఏవూరి కనకాంగి ఏ వూరి మౌని" (పు. 53) 'ఏయూరి' అని యుండవలెను. ప్రాసస్థానమున నిట్లుండుట కృతకమని భావించి కాబోలు భాషా సౌలభ్యదృష్టితో 'ఏవూరి' అని ప్రయోగించెను. ఇతడు పోతన వలె 'ర-ఱ'లకు ప్రాసపాటించెను. ఉదా :-

"చెఱకు విండ్లను బిప్పి నేయు భ్రూలతలు
మురువు దమ్మిల నీట ముంచు కన్నులును."

ఇట్లు చిన్నన్న భాషాప్రయోగమున స్వతంత్రుడుగనే కనిపించును. చిన్నన్న భాషలో ఎన్నెన్నో పలుకుబడులు, జాతీయములు, సామెతలు, సహజాతి సహజములై కోకొల్లలుగ నొదిగిపోయినవి. పరమయోగి విలాసము నందు ప్రయోగింపబడిన వానిలో కొన్నింటిని పరికింపుడు :-

పలుకుబడులు : ఆకునలుములు దిను, కన్నుల కట్టినట్లు, కన్నుల పండువు, కయ్యమునకు కాలు ద్రవ్వు, కరతలామలకము, గుండె దిగులు, చిల్క-లేని పంజరము, తలతడి యార్చు చందము, ద్వాపరము నాటి ముసలి, మందె మేలము, మొల్ల పూచినరీతి, రాతికి ప్రాణంబు దెచ్చు, రెప్పార్పక, ఘూడుమాటలాడు తప్పులు మొ. వి.

జాతీయములు : కావు కావను, గొడ్డు పీగి, దేవుడో దయ్యమో, దేవుడా యనుచు, అల్లో నేరేళ్లు, ఆర్చెదవో తీర్చెదవో, నా మాట చెవి బెట్టవైతివి, ఎండ కన్ను నీడ కన్ను ఎఱుగవు, కుక్క-ను కొట్టినట్లు, కంఠగత జీవుడు, కడుపులోఁ గాళ్లుండగాను, కన్నులే చెవులుగా వినుచు ఇత్యాదులు.

సామెతలు : పెన్నిధి గన్నట్టి పేదచందమున, మిన్నలిచ్చినవాడె మీనకేతనుడు, వ్రతము దక్కిన సుఖము దక్కకపోయె, తల్లికి లేని ముద్దు దాదికా, ఈనగాచిన పిదప కుక్కల కిచ్చినట్లు, కడుపులో చెయి పెట్టి కలచినట్లు, తామరపాకులో నీరు, తేనియలో బడినట్టి యీగల చందాన, మాటొకటి చేతొకటి, తనుఁగట్టు త్రాడును దను దానె తెచ్చికొనువట్లు మొ. వి.

ఇట్టి నానుడులు, జాతీయములు, సామెతలచే పరమయోగి విలాసమున చిన్నన్న వాడిన భాష అచ్చమైన తెలుగుదనముతో గుబాళించినది. ఓహరి సాహరి, కుళ్ళాయి గబ్బాయి, గంతబొంత, జీతనాతములు, మన్ను పిన్ను, లంచ పంచములు, లెక్క పొక్కలు, వీడు జోడులు, వెచ్చ సచ్చములు వంటి జమిలి పద ప్రయోగము చిన్నన్న భాషకు గమక సౌందర్యమును సమకూర్చెను.

స్త్రీ పర్యాయపదములు : చిన్నన్న అందమైన స్త్రీ పర్యాయ పదజాలమెంతయో పరమయోగి విలాసమున ప్రయోగించెను. ఉదా : అరుణపల్లవపాద, ఇందు బింబానన, కలకంఠ కంఠి, కలహంస గమన, కోమలగాత్రి, చపలాక్షి, చిలుకల కొలికి, తన్వంగి, తమ్మికంటి, నీలాహివేణి పల్లవోష్ఠి, బింబోష్ఠి, మధుర చికుర, మృగశాబ నేత్ర, సారంగనయన, సైకత నిభశ్రోణి, హేమకలశ వక్షోజ వంటి సుందర శబ్ద ప్రయోగము చిన్నన్న భాషను సుందర తరమొనర్చెను. కాని విష్ణుచిత్తులచే కుమార్తె అయిన గోదాదేవిని "హేమకలశ వక్షోజ ; నగరాజుకుచ ;(పు. 402) అని సంబోధింప జేయించుటలో గల ఔచిత్యమును అలోచించినాడు కాదు చిన్నన్న. అందమైన స్త్రీ శబ్దజాలమును పర్యాయ వాచకములుగ ప్రయోగించుటయందే దృష్టి నిలిపి యుండవచ్చును.

ఇంకను చిన్నన్న భాషాపదప్రయోగ విశేషములను శ్రీమతి రామలక్ష్మి ఆరుద్రగారి సంపాదకీయమున వెలువడిన "తాళ్ళపాకవారి పలుకుబడు్ళ"

గ్రంథమున చూడుడు. చిన్నన్నకు తెలుగు భాషపై గల ప్రభుత్వమెట్టిదో తెలుసుకొనుటకీ పరమయోగి విలాస కావ్యమొక్కటి పఠించిన చాలును.

శైలి : చిన్నన్న కవితా శైలి సుందర సుకుమారమైనట్టిది. కృష్ణ దేవరాయల శైలి నారికేళపాకము కాగా, చిన్నన్న శైలి ద్రాక్షాపాకము.

"అరుణ బింబంబుదయాద్రిమై నిలిచెఁబలపల వేగి వీడ్వడ మబ్బులడఁగె
నలరుచుఁ బూదేనియల ఖోనగురిసెఁబాలించి కరుణ చొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి ! మేల్కొనవె.... (పు. 436)

ఇందు శ్రీరంగశాయిని మేల్కొలుపుటకు చిన్నన్న వాడిన లలితశబ్దజాలము నందలి శైలీమాధుర్యమును గమనింపవచ్చును. స్త్రీ వర్ణనములందు చిన్నన్న ఎంతయో శైలీ భేదమును ప్రదర్శించెను.

"కాము బాణములనంగావేఱ కలవె కామించి వీరల కన్నులే కాక
కనక సూనము లనంగా వేఱ కలవె నను పారు వీరల నాసలే కాక
ఘనమైన విరులనంగా వేఱకలవె కొనలు మించిన వీరి గుబ్బలే కాక
(- పు. 32)

ఇట్లు ప్రతిపాదమున 'వేఱకలవె' అని ప్రశ్నించుచు స్త్రీ అవయవముల ఆధిక్య మును రెండవ పాదమున చెప్పుచు పదిద్విపదల వరకుఇదే శైలిని నిర్వ హించినాడు చిన్నన్న. మరియొక సందర్భములో స్త్రీ వర్ణనము.

"కప్పులై యొప్పులై కళుకులై తేటి చొప్పులై గొప్పలై సొగయు
గొప్పులును
గళుకులై బెళుకులై కలువపూ సోగ ములుకులై తళుకులై మొనయు
కన్నులును
గావులై తావులై కండ చక్కెరల ప్రోవులై తీవులై పొలుచు మోవులును
గట్టులై గుట్టలై కాముని పసిఁడి జెట్టులై చెట్టులై చెలఁగుపాలిండ్లు...."
(- పు. 182)

ఇట్లు ఒకే వస్తువును వర్ణింపవలసి వచ్చినను కవి అలంకారమును మార్చి 'ఐ' కారగమక శైలీ విన్యాసముతో ఆకర్షణీయముగ రచించెను. ఇక, రసోచితమైన శైలి నుపయోగించుటలో చిన్నన్న సిద్ధహస్తుడు. ఈ క్రింది యుద్ధ వర్ణనము వందలి శైలిని చూడుడు-

"పడగలు చించి భూపతుల గాలించి
రథుల ఖండించి సారథుల తుండించి
రథముల నుగ్గాడి రథ్యాళిఁ జదిపి...." (పు. 468)

ఇందు క్త్వార్థక విధానములో పద్య పాదములను చించి, ఖండించి, నుగ్గాడి అనుచోట్ల త్రుంచి, పరకాలుని ఖడ్గమటు నిటు త్రిప్పు స్ఫూర్తిని కలిగించి వీర రసమును పోషించుటలో గల శైలీ నైపుణ్యమును దర్శింపవచ్చును.

"మిడుగులు ముడుగులు మెడలు లేదొడలు
దొడలును నొడలును దొనలు కన్గొనలు
హరులును గరులును నరులు ముంగరులు
సరులును బరులును జడలు జల్లెడలు...." (పు. 465)

ఇది చిన్నన్న యుద్ధ వర్ణనమున ప్రయోగించిన శైలి. యుద్ధ తీవ్రతను స్ఫురింపజేయు శాబ్దిక శైలీ విన్యాసమిది.

"రంజిత కిన్నరీ రత్నాంఘ్రి కంజ
మంజీర శింజిత మంజు ఝుంకార
చలదల మకరంద సంకీర్ణ విమల
నలిన కైరవ కోక నద పుండరీక
కలకంఠ చక్రవాక క్రౌంచ హంస
కుల కలరావ సంకులమైన కొలను" (పు. 450)

కొలను వర్ణనము నందింతటి సుదీర్ఘ గంభీర సంస్కృత సమాస శైలిని ప్రదర్శించుటలో కొలని గభీర గాంభీర్య వైశాల్యములను స్ఫురింపజేయు చున్నాడు కవి. ఈ కావ్యమున—

"పువ్వుల నెత్తావిఁ బొదలు తేనియల
తువ్వరవడు వెల తోటలో నిలిచి (పు. 508)

బలుముల పగదాయ పగటుల పచ్చ
చెలువంబునకు గొంగ జిగిచిచ్చుఁ గొలవి
నీటుల మిత్తి వన్నెల వేఱు విత్తు
పాటించి చూడ రూపము పాలిమాలి.... (పు. 101)

అను రీతిగల తెలుగు పద బంధము చిన్నన్న శైలికే వన్నె కూర్చినది. పరమయోగి విలాసములోని చిన్నన్న శైలి 'కమ్మెచ్చున వచ్చు తీగవలె, సాలెపురుగు కడుపులో నుండి వచ్చు నూలువలె, దొర్లిపడు కొండధారవలె' సహజ సుందరముగ వెలువడి సన్నుతి గాంచెననుట నిశ్చయము.

*తదుపరి అన్నమాచార్య చరిత్ర కావ్యసమీక్ష –*

# ౫. అన్నమాచార్య చరిత్రము సమీక్ష

తాళ్ళపాక చిన్నన్న సాహిత్య సృష్టిలో చివరి కావ్యము అన్నమాచార్య చరిత్రము. ఇది 550 ద్విపదలు మాత్రమే గల ఒక చిన్న చారిత్రక కథా కావ్యము. ఇది పిట్ట కొంచెము, కూతఘనము.

మన ప్రాచీన కవులకు స్వీయచరిత్రలుగాని, జీవిత చరిత్రలు గాని వ్రాయు అలవాటు అంతగ కానరాదు. కనుకనే మన కవుల చరిత్ర శంకాపంక కళంకితమై ఆయాకవుల దేశకాల నిర్ణయాదులు పరిశోధకులకు చిక్కు ప్రశ్నలై వారిలో భిన్నాభిప్రాయములను రేకెత్తించుచున్నవి. వారి వాగ్వివాద ఝంఝూ ప్రభంజనములో అసలు కవిచరిత్రయే కొట్టుకుపోయెడి ప్రమాదస్థితి ఏర్పడుచున్నది.

తాళ్ళపాక అనమాచార్యుల జీవిత చరిత్రయు నిట్టిస్థితి యందున్న తరుణములో చిన్నన్న రచించిన ఈ 'అన్నమాచార్య చరిత్ర' కృతి పండిత పరిశోధకజన పరమోపకృతిగ లభించినది. దీని ప్రామాణికతను పరీక్షించి అందు చిన్నన్న పేర్కొనిన చారిత్రకాంశములకు సాక్ష్యముగ అన్నమాచార్యాది కవుల సంకీర్తనములను చూపుచు 138 పుటలతో విపులమగు పీఠికను సంతరించి 1949 సంవత్సరమున తొలుతగ నీయసూర్యంపశ్యకు వెలుగు ప్రసాదించినవారు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. ఆ ప్రభాకర కరస్పర్శతో తాళ్ళపాక సాహిత్యము చైతన్యవంతమై జ్ఞానజీవన వాయువులను ప్రసరించుట ప్రారంభించినది.

అన్నమయ సాహిత్యము నందలి విలువైన రహస్యములనేకము నేడు బయటపడుచున్నవి. నిజమునకు వేలాది సంకీర్తన సుమములతో వేంకటేశ్వరస్వామి పాదారవిందములను అర్చించిన పదసాహితీ పురోహితుడైన అన్నమయ జీవితమే ఒక మహాకావ్యము. రససిద్ధుడైన అన్నమయ ప్రముఖ వాగ్గేయకారుడేకాదు, మహాభక్తుడుకూడ. ఆ మహానుభావుని జీవిత

చరిత్రను కృతిగ మలచిన సుకృతి చిన్నన్న ఎవరోకాదు సాక్షాత్తు అన్నమా చార్యులకు మనుమడే. కనుకనే ఈ కావ్యము చారిత్రకముగ మరింత ప్రామాణికమనుటలో సంశయములేదు.

రామానుజ మతము వంటి మతము, వేంకటేశుని వంటిదైవము, అన్నమాచార్యుని వంటి ఉత్తమ గురువు లేరని చిన్నన్న విశ్వాసము. తమకు వేంకటేశుని గురించి చెప్పి ఆయన పాలివారిగా తమను నియమించి, చేసిన మహోపకారమునకు పొంగిన మనసుతో అన్నమయ జీవిత చరిత్రను కొనియాడుట ఒప్పుగ భావించి తానీకావ్యమును రచించుచునట్లు అవతారికలో చిన్నన్న తెల్పెను. తాతగారి చరిత్రను మనుమడే కీర్తించుట అనుచితమని లోకమెక్కడ భావించునో అని సంశయించి, వేంకటేశ్వర అన్నమయలకు గల పితాపుత్ర సంబంధమును, అభేదమును దెల్పి తనకావ్య నాయకుడు సామాన్యుడు కాడని, దైవాంశ సంభూతుడని చెప్పి అట్టి మహనీయుని చరిత్రను తాను కావ్యముగ రచించుటలోగల ఔచిత్యమును నిరూపించెను అతడిట్లు చెప్పెను—

"నందను సద్వర్తనము తండ్రి ప్రియము
నొందఁగీర్తించుట యుచితంబుగనుక
అరలేక యీ యన్నమాచార్య చరిత
వెఱవక నీకునే విన్నవించెదను" —(అ. చ. పు. 2)

ఇందు 'వెఱవక' అనుటలో లోకులు కాకుల కనుక ఆలోకమునకు వెఱవక అనియే భావము.తండ్రి కొడుకుల అభేద తత్త్వమును దృష్టి యందుంచుకొని, వేంకటపతి అన్నమయల అభేదమును దెల్పుచు—

"వేంకటపతివి నీవే మాకు ....
నీవలిగిన నల్గు నీలవర్ణుండు
నీవు మెచ్చిన మెచ్చు నీరజోదరుడు" (అ. చ. పు. 40)

అని వరసింహరాయలపాత్రముఖమున చిన్నన్న స్పష్టము చేసెను. అట్టి దైవస్వరూపుడు, మానవోత్తముడైన అన్నమాచార్యుడే చిన్నన్న కథా నాయకుడు కనుక ఆమహోత్తముని చరిత్రను కీర్తించిన తన యీ కావ్యమును ఉత్తమమైనదే అని కవి సూచనము. రామానుజ మతమును, వేంకటేశుని వంటి దైవతమును తనవంటి వారికి కరతలామలకము గావించిన ఒక మహోదారుని చరిత్రయే కాని ఇది కేవలము తన తాతగారి సామాన్య సాంఘిక జీవిత చరిత్ర మాత్రము కాదని చిన్నన్న స్పష్టము చేసెను.

"మణివలనఁగంకణమును, గంకణము వలన
మణియును, ప్రకాశమగునట్లు, మదిఁదలంప
సుకవి వలన నాయఁకుడు, నాయకుని వలన
సుకవియుఁ బ్రసిద్ధిఁగాంతురు, సకల దిశల"

అని అప్పకవి చెప్పినట్లు, అన్నమాచార్యుని వంటి నాయకుని వలన చిన్నన్నయు, చిన్నన్నవంటి సుకవి వలన అన్నమాచార్యుడును ప్రసిద్ధిని పొందిరి.

ఈ కావ్యమునందు చిన్నన్న జరిగిన విషయములనే రచించినట్లు తోచును. పండిత వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో- "ఇది మతపాండిత్య కవితా ప్రఖ్యాతి గన్న మహనీయుని చరిత్రమై చాలగా జరగిన విషయములనే సంతరించుచున్నదిగ నిరూపణకెక్కినదని" తెల్పిరి. చిన్నన్న ఈ అన్నమాచార్య చరిత్రమును శ్రీయలమేలుమంగా వేంకటేశ్వరులకే అంకితము చేసి తాతగారి ఋణమును తీర్చుకొనెను. ఈ కావ్యము వలననే అన్నమాచార్యుల వారి జీవిత విశేషములు, తాళ్ళపాక కవుల కీర్తిప్రతిష్ఠలు వెలుగునకు వచ్చినవనిన అతిశయోక్తిలేదు.

కావ్యరూపమున జీవిత చరిత్రను (పండితారాధ్యచరిత్రమ) రచించుటలో పాల్కురికి సోమన తరువాత చిన్నన్నను పేర్కొనవచ్చును.

**ఇతవృత్త పరిచయము :** అన్నమాచార్యుని తండ్రి తాతముత్తాతలు పొత్తపినాటిలోని తాళ్ళపాక గ్రామము నందు నివసించుటచే వారి ఇంటి పేరు తాళ్ళపాక అయినది. తాళ్ళపాక నేటి కడపజిల్లా రాజంపేట తాలుకాలో గలదు. వీరునందవర వైదిక బ్రాహ్మణులు, ఋగ్వేదులు, ఆశ్వలాయన సూత్రులు, భారద్వాజస గోత్రులు. తాళ్ళపాక వంశమున నారాయణసూరికిని లక్కమాంబకును వేంకటేశ్వరస్వామి వరప్రసాదమున జన్మించిన సుపుత్రుడే అన్నమాచార్యులు ఇతడు పేయాళ్వారులవలె స్వామి నందకాంశమున జన్మించినట్లు ప్రసిద్ధి. "చక్కనిగ్రహము లుచ్చమున మూఁడలర అనుపమ లగ్నంబునందు వైశాఖమున విశాఖను జగంబున నుల్లసిల్ల జనియించె నన్నమాచార్యుండు" (అ. చ. పు. 9). అని చిన్నన్న అన్నమయ జననమును గూర్చి తెల్పెను. దీనిని బట్టి అన్నమయ వైశాఖ మాసమున జన్మించినట్లు తెలియుచున్నది. నారాయణసూరి పుత్రునకు ఆగమోక్త ప్రకారమున జాతకర్మముచేసి పరబ్రహ్మ వాచకముగ 'అన్నమయ్య' అని నామకరణము చేసెను. "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" అని తైత్తరీయము. ఆ బిడ్డని అందరు అన్నయ్య, అన్నప్ప, అన్నమాచార్య అను పేరులతో పిలచు చుండిరి. పసితనమున ఆబిడ్డడు తిరుమలప్పని ప్రసాదమని చెప్పిన గాని ఉగ్గునైతము త్రాగెడివాడు కాదట. జోలపాట యందు వేంకటపతి పేరు వినిపించిననే కాని పోరు మానెడివాడు కాదట. ఆ కుఱ్ఱనికి తండ్రి ఐదవ యేటనే ఉపనయనము చేసెను. ఆదిశంకరులకును ఐదవయేటనే ఉపనయనము జరిగినది. "ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః" అనునట్లు విద్యాభ్యాస కాలము నందే అన్నమయకు వెన్నుని వరమున సకల విద్యలు తమంత తాము వచ్చి జిహ్వారంగమున నర్తనమాడ దొడగెనట. అంతనత డాడిన మాటెల్ల అమృత కావ్యము, పాడిన పాటెల్ల పరమ గానము అయినది.

అన్నమయ మనస్తత్వమునకు విరుద్ధముగ బాల్యమున అతని అన్న వదినలు, తలిదండ్రులు ఇంటి చాకిరి, పొలము పనులు చెప్పి నొప్పింప

సాగిరి. ఒకనాడు అన్నమయ "పాపవల్లరుల శ్రీపతి నామహేతి నేపార దఱుగు యోగీంద్రు చందమున" పసులకు గడ్డి కోయుచుండ అతని కడ వ్రేలు తెగి నెత్తురు కారజొచ్చినది. అది చూచి వైరాగ్యమును పొంది తన బంధువులను రోసి ఆ శేషాద్రినాథుడే తనకు తల్లి తండ్రి గురువు దైవ మని భావించి తిరుమల కేగుచున్న భక్తబృందములతో కలసి తాళ్ళపాకను వదలి తిరుపతికి ప్రయాణమయ్యెను. నాటికి అన్నమయకు 16 సంవత్సరము లుండి యుండవచ్చునని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు భావించిరి. ఈ యాత్రలో అన్నమయ్య తిరుపతికి సమీపమున గల గంగమ్మ అను గ్రామ దేవతకు మ్రొక్కి, ఆళిపురి సింగరికి నమస్కరించి, త్రోవలో తలయేరు గుండును దర్శించి, అటనుండి పెద్ద ఎక్కుడు ఎక్కి, పిదప కపురంపు కాలు వను గడచి ఆ మహాచల మార్గమునందు గల పుణ్యభూములను, భూజము లను, జనులను, వనులను సేవించుకొనుచు సప్తగిరుల నెక్కుచుండ మోకాలి పర్వత సమీపమున ఎండకు బడలి ఆకలికి తూలి ఒక బండ రాతిపై పడి నిద్రించెను. ఆ నిర్మానుష్య ప్రదేశమున ఆ పసివాని ఆకలి జగన్మాతకు తప్ప మరెవ్వరికి తెలియ గలదు ? అలమేలు మంగమ్మ పెద్దముత్తైదువయై ఆ బాలునికి ప్రసాదాన్నము లిచ్చి ఆకలి తీర్చి స్వామి దర్శనమునకు మార్గము చూపి దీవించి పంపెను. ఆ పద్మావతీ మాత పెట్టిన ప్రసాదాన్న ప్రభావమున అన్నమయ సకల సారస్వత పారీణుడై ఆమెపై ఆశువుగ నొక శతకమును చెప్పెను. ఈ క్రింది పద్యమా శతకము నందలి దిగ గుర్తించిరి.

> "అమ్మకుఁ దాళ్ళపాక ఘనుఁడన్నఁడు పద్యశతంబు చెప్పె ! గో
> కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలుమంగకున్
> నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మ కల్పముల్
> సమ్మదమంది వర్థిలుము జవ్వని లీలల వేంకటేశ్వరా"

కొండ నెక్కునపుడు అన్నమయ త్రోవలో బ్రహ్మపాదమును, కురువ నంబిని, వాకిట భాష్యకారులను దర్శించెను. స్వామి సన్నిధిని చేరువరకు

ధరించిన ప్రతిజ్ఞపై అన్నమయ్య బాలుడుగ సంకీర్తనములు చెప్పెనట. రాగి రేకులలోని వ్రాతలను బట్టియు అన్నమయ్యకు 16వ ఏటనే స్వామి సాక్షాత్కరించి సంకీర్తన రచనానుగ్రహము గావించినట్లు తెలియుచున్నది.

కొండపై స్వామి పుష్కరిణిని, ఆదివరాహుని, పెద్దగోపురమును, నీడ తిరుగని చింత చెట్టును, గరుడ గంభమును, చంపకపు ప్రదక్షిణమును, శ్రీవారి ప్రసాదము లిచ్చు ప్రదేశములను సేవించుకొనుచు నడ గోపురమును దాటి, శ్రీనివాసునకు నమస్కరించి, భాష్యకారులను పొగడి, నరసింహునికి, జనార్ధనునికి, అలమేలుమంగకు నమస్కరించి యాగశాలను, ఆనంద నిలయమును, స్వామివారి కళ్యాణ మంటపమును, బంగారు గరుడని, శేషుని గొలిచి, శ్రీభండారమును, బంగారు గాదెలను, సమీపమునగల పసిడి వాకిలిని దర్శించి లోనికేగి వేంకటేశ్వరస్వామిని కన్నుల కరవుదీర సేవించి కీర్తించెను. ఇట అన్నమయ దర్శించిన స్వామి దివ్య మంగళ విగ్రహమును చిన్నన్న తన్మయుడై అత్యద్భుతముగ వర్ణించెను. ఇంకను అన్నమయ ఆకాశగంగ, పాండవ తీర్థములందు స్నానము చేసి, రాతిపై ఆరబెట్టిన తన కట్టిన వస్త్రము ఆరెడినంతలోనే స్వరూపమున వేంకటపతికి నిమిత వృత్తములు కలిగిన శతకమొకటి వినిపించినాడట. ఆ నవ్య కావ్యమును స్వామి ఆలయమున విన్నవింపగా గర్భాలయపు తాళములు తమంత తాము వీడి తలుపులు ఠక్కున తెరచుకొనినవట. అన్నమయ కవిత్వమున కంతటి శక్తి గలదన్నమాట.

ఒక నాటి రాత్రి వేంకటేశ్వరస్వామి విష్ణుదాస ముని కలలో కనుపించి నా భక్తుడైన అన్నమయకు ముద్రాధారణము గావింపుమని చెప్పెను. ఆ యతి స్వామి ఆజ్ఞానుసారము అన్నమయను గుర్తించి చక్రాంకితుని చేసి పంచసంస్కారములు గావించెను. పిమ్మట వైష్ణవులు ఆ బాలుని తమ బంతి నిడుకొని భుజించిరి. నాటినుండి అన్నమయ వంశీయులు వైష్ణవులైరి.

అన్నమయ తాళ్ళపాక చేరి తిరుమలమ్మ, అక్కలమ్మలను ఇరువురు కన్యలను వివాహమాడి గార్హస్థ్యమును గడుపసాగెను. ఈ కాలముననే అతడు తిరుమల, అహోబలాది పుణ్యక్షేత్రములను దర్శించుచు వేంకటేశ్వరునిపై అనేక శృంగార సంకీర్తనములు రచించెను. వేదాంత దేశికుల సంప్రదాయమున ప్రవర్తించుచున్న శఠకోపముని వద్ద వేదాంత పఠనము చేసి, మంచి ప్రాయముననే వాల్మీకి రామాయణ మంతయు సంకీర్తనల రూపమున రచించి తుంబురుడో, నారదుడో, గంధర్వుడో అనునట్లు గానము చేసెను.

సాళువ నరసింహరాయలను రాజు క్రీ. శ. 1450 ప్రాంతమున టంగుటూరును పరిపాలించు చున్నట్లు తెలియుచున్నది. ఇతడు అన్నమాచార్యుల సంకీర్తన పద్ధతిని, ప్రఖ్యాతిని విని, ఆనందించి అన్నమయను దర్శించి- "మీ సహాయము నాకు గలుగ నేలుదు ధరయెల్ల నేక చక్రముగ" (అ. చ. పు. 31) అని పలికి టంగుటూరున కాహ్వానించెను. అన్నమయ ఆశీస్సులతో రాయలు పెనుగొండను జయించెను. రాయలు అన్నమయను పెనుగొండకు రప్పించుకొని కీర్తనలు పాడించుకొని విని బహువిధాభరణాంబరము లిచ్చి సత్కరించెను.

ఒకనాడు నరసింహరాయలు, వేంకటేశ్వరునిపై అన్నమాచార్యులు రచించిన శృంగార సంకీర్తనము నందలి (ఏమొకో చిగురు టధరమున యెడనెడఁగస్తురి నిండెను భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు కదా!*)- అను కీర్తనలోని-

"చెలులార ! వేంకట శిఖరి నాయకుని
కలికికిఁ గడగంటఁ గనుపట్టు నెఱుపు
చెలువ మేగతి మంచెఁ జెప్పరే యనిన

* అన్నమాచార్య శృంగార సంకీర్తన రేకు 14

నలువునఁ బ్రాణేశు నాటిన చూపు
విలువునఁ బేఱుక నూవిన శోణితంబు
తలపోయఁ గాదు గదా.... (అ. చ. పు. 37)

అనుపదమును పలుమారులు పాడించుకొని, ఇది కవిత్వమని మెచ్చు కొని అట్టిది తనపై గూడ రచింపుమని అన్నమయను గర్వాంధుడై కోరెను. "హరి హరీ" అని అన్నమయ చెవులు మూసికొని "హరి ముకుందునిఁ గొని యాడు నాజిహ్వ నినుఁ గొనియాడంగ నేరదెంతైన" (పు 37) అని తిరస్కరించి, ఇట్టి నీచపు పలుకులు పలికిన నీవంటివాని పొందుగూడ నొల్ల నని తిగ్గనలేచి వెళ్ళబోయెను. నరసింహరాయ డాగ్రహోదగ్రుడై రాజ తిరస్కార నేరమున అన్నమయను బంధించి మూఢ రాయర గండమను సంకెల వేయించి చెరసాల నెట్టించెను.

"సంకెల లిడువేళఁ జంపెడువేళ
నంకిలి ఋణదాతలాఁగెడువేళ
వదలక వేంకటేశ్వరుని నామంబె
విదలింప గతిగాని వేఱొండులేదు" (అ. చ. పు. 38)

అను భర్మమిచ్చు సంకీర్తనను పాడి వేంకటేశుని ప్రార్థింపగా అ సంకెలలు షుల్లున తమంత తాము వీడిపోయినవట. "ఆకటివేళల నలపైన వేళలను తేకువ హరినామమే దిక్కు మరిలేదు"* అనునదే యీ సంకీర్తనమని పండి తులు గుర్తించిరి.

సంకెలలు తెగుట స్వయముగ చూచిన రాయలు భయభ్రాంతుడై అన్నమయకు మ్రొక్కి శరణువేడెను. అతని పాదములను పన్నీటితో కడిగి పసిడి పళ్లకి నెక్కించి దానిని తన మూపున మోసి ఊరేగించెను. అన్నమయ

* ఆధ్యాత్మిక సంకీర్తనలు - రేకు 26 (ముఖారి రాగం)

సంతసించి హరినామ సంకీర్తనము చేయువారిని అతిక్రమించుగ నెంచుటని హితబోధచేసి రాజు సన్నిధిని విడచి తిరుమలస్వామి సన్నిధిని చేరి కాలము గడపుచు మంజరీచ్ఛందమున శృంగార మంజరిని రచించెను.* శేషాద్రివాసుడు దీనిని స్వీకరించుచు-

"జగతి నీ శృంగార సంకీర్తనముల
కగపడి మంచి ప్రాయపువాఁడనయితి" (అ. చ. పు. 41)

నని పలికి మన్నించెను. ఈ విధముగా అన్నమయ స్వామిని మెప్పించుచు, ఏటేటా స్వామికి జరుగు బ్రహ్మోత్సవములను తిలకించుచు తిరుమలలో స్వామి సన్నిధిని గృహాది వసతు లేర్పరచుకొని నివసించెను. ఈ సమయముననే తిరుమలలో సంకీర్తన భండారము గూడ నెలకొల్ప బడినట్లు తెలియుచున్నది.

అన్నమయ గొప్పశక్తి సంపన్నుడని, మహిమోపేతుడని ఈ కావ్యమును బట్టి తెలియుచున్నది. అతడు బాధతో కోపించినను, సంతసమున దీవించినను దాని ప్రభావము వెంటనే అగుపించు చుండెడిదట. మండెము గ్రామము నందొక పుల్లమామిడిచెట్టు పండ్లను స్వామిని ప్రార్థించి పంచదార వంటి తియ్యని ఫలములు గలదానినిగ మార్చెను. ఒక గాయకుని దీవించి అతని పెండ్లికి కోరిన ధనము సమకూరునట్లనుగ్రహించెను. జనులీ వార్తలు విని 'అన్నమయగురు శ్రీపాదరక్ష' తలనిడి తమ ఆపదలు పోగొట్టుకొను చుండెడి వారట.

సుప్రసిద్ధ కన్నడ పదకవియైన పురందరదాసు అన్నమాచార్యకీర్తనల మహిమా విశేషములను విని అన్నమయను దర్శించి విష్ణుస్వరూపునిగ భావించి స్తుతించెను. పురందరదాసు పాండురంగ విఠలుని భక్తుడు గనుక అన్నమ

* శృంగార మంజరి ముద్రితము - తా॥ రచనలు. వాల్యూం 1

యయు పురందరుని విఠలునిగనే దలచి యాదరించెను. వీరిరువురి కలయిక చారిత్రక ప్రాముఖ్యము నొందినది. వీరి నడుమ 30 లేక 40 సంవత్సరములు వ్యత్యాస ముండి యుండ వచ్చునని చారిత్రకుల భావన. పురందరదాసు కీర్తనలపై అన్నమాచార్యుని ప్రభావము ప్రసరించినట్లు పరిశీలకులు గుర్తించిరి.

అన్నమాచార్యులు అధ్యాత్మ శృంగార సంకీర్తనలు మొత్తము ముప్పదిరెండువేలు (32,000) రచించినట్లు చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్రము వలన దెలియుచున్నది.

"యోగ మార్గంబున నొక కొన్నిబుధులు రాగిల్ల శృంగార రసరీతిఁగొన్ని వైరాగ్య రచనతో వాసింపఁగొన్ని సారస నేత్రుపై సంకీర్తనములు సరసత్వమునఁ దాళసముఖముల్గాఁగ పరమ తంత్రములు ముప్పది రెండు వేలు." —(అ. చ. పు. 45.)

ఇవిగాక నవ్యరీతిని ద్విపద ప్రబంధముగ రామాయణము, సంస్కృతమున వెంకటాద్రి మహాత్మ్యము, పంద్రెండు శతకములు. ఇంకను సకల భాషలలో అనేక ప్రబంధములను. సంస్కృతమున సంకీర్తన లక్షణము, తెలుగున శృంగార మంజరియు అన్నమయ రచించినట్లు చిన్నన్న పేర్కొనెను. ఇందు చాల వరకు నేడు అలభ్యములు.

అన్నమాచార్యులకు వేంకటేశ్వర స్వామి వరముచే నరసింహాచార్యులు, తిరుమాలాచార్యులను ఇరువురు పుత్రులు కలిగిరి. స్వామి కృపచే వారును అన్నమాచార్యునంతటివారై, ధీవిశారదులై, భక్తులై వేంకటేశ్వరుని సేవించిరి.

ఇది తాళ్ళపాక అన్నమాచార్యులవారి జీవితచరిత్రము. మనసున కపటముమాని భక్తితో ఆమహాత్ముని జీవితగాథను వినిన వ్రాసిన పేర్కొనిన

చదివిన జనులకు ఇష్టార్థ సౌఖ్యములు సమకూరునని కృత్యంతమున చిన్నన్న తెల్పెను.

ఇతివృత్త నిర్వహణము : అన్నమయ జీవిత కథను దెల్పు ఈ కావ్యమున ఆశ్వాస విభజనము లేదు. ఒకే ఆశ్వాసముగ భావింప వచ్చును. ఇందు జీవితచరిత్ర కావ్యరూపము దాల్చెను గనుక కావ్యలక్షణము లిందు పాటింపబడినవి. "శ్రీయలమేల్మంగఁ జిరకృపాపాంగ...." యనుచు కావ్యము శ్రీకారముతో ప్రారంభింపబడినది. అవతారిక యందు ఇష్టదేవతా స్తుతి, గురుస్తుతి, కృతి రచనా సముద్దేశము, కృతి సమర్పణము మొ. గు అంశములు గలవు కావ్యాంతమున ఫలశ్రుతి. కవి ప్రతిభాదులు తెల్పబడి నవి. అష్టాదశ వర్ణనలు సంపూర్ణముగ లేవు. శైలి వర్ణనాత్మకము. కావ్య నాయకుడగు అన్నమాచార్యు నాశ్రయించియే కథ ప్రధానముగ సాగినది. సాళువ నరసింహరాయలు, పురందరదాసు వంటి యితర పాత్రలు చారిత్రక సంబంధము గలట్టివి. పురవర్ణనతో కావ్యమును ప్రారంభించి తొలుత అన్నమాచార్య వంశ్యులను, తుదిని అన్నమాచార్య సంతతిని పేర్కొనుటలో చిన్నన్న ఔచిత్యమును పాటించెను. కావ్యాంతమున అన్నమాచార్య దివ్యలీల విషయమును ప్రస్తావించక సంతతిని మాత్రమే పేర్కొని ముగించుటలో 'మంగళాంతాని' అను కావ్యలక్షణము పాటించినట్లయినది. ఇది చరిత్రను కావ్యముగ మలచుటలో చిన్నన్న అనుసరించిన ఒక విలక్షణ మార్గము. "ఆత్మావై పుత్ర నామాసి" అను చొప్పున తండ్రియే పుత్రాకృతిని వితానము చెందును కనుక అన్నమయ పుత్రులను తుదిని పేర్కొని ముగించుటలో చిన్నన్న విజ్ఞత వెల్లడి యగుచున్నది.

ఈ కావ్యమున ప్రకరణ విభాగము లేదు కాని యిందుగల అన్నమయ జీవితమును త్రిదశలుగ మనము భావింపవచ్చును. అన్నమయ్య వంశము, జననము, బాల్యము, విద్యలు, తిరుమల యాత్ర, స్వామి సందర్శనము, వైష్ణవ మత స్వీకారము వరకు గల కథాభాగము మొదటి దశ.

అన్నమయవివాహము, సాళువ నరసింగరాయ ప్రభువులతో పొత్తు, శృంఖలా యోగము, వైరాగ్య ప్రాప్తి ఇత్యాదులు రెండవదశ. అన్నమయ మహిమలు, రచనలు చివరి ఘట్టము. ఇది జీవిత చరిత్ర కావ్యమైనందున చిన్నన్న బాల్య యౌవన పరిపక్వ దశలను చెప్పక చెప్పెను. ఇందు వివాహానంతరము పేర్కొనవలసిన 'సంతతి'ని కావ్యాంతమున దెల్పుటలో చిన్నన్న అనుస రించిన ధర్మ సూక్ష్మమును పైన గ్రహించి యుంటిమి.

అన్నమాచార్య చరిత్రను చిన్నన్న వసంతఋతు వర్ణనతో ప్రారం భించెను. వసంత కోకిలను వర్ణించెను. ఇట్లు వర్ణించుటకు కారణము కావ్య నాయకుడగు అన్నమయ ప్రధానముగ గాయకుడగుటయే. గాన సౌభాగ్యము కలిగిన ఒకే ఒక ఋతువు వసంతము. కావున కావ్య నాయకునితో సాజా త్యము గల కోకిల ప్రస్తావనముతో నాయకుని జీవలక్షణమైన రాగసంపదను ప్రస్తావించినాడు చిన్నన్న. సప్తస్వర సమ్మిళిత రాగము ప్రాకృతికము గనుక చైత్ర వైశాఖముల ప్రకృతి శోభా వర్ణనముతో కథారంభమును గావించి తల్లక్ష్మి కళను పూలతో పండ్లతో రంగరించి అందించినాడు కవి. ఇచట 'వైశాఖము' అన్నమాచార్యుల జనన మాసమగుటయు గమనింప దగినది. నిజమునకు అన్నమయ జననము వసంత కాలముననే జరుగుట యాదృచ్ఛిక సాదృశ్యమే కావచ్చును. కాని కవి దీనిని తన కావ్యారంభ మున నిబద్ధించి "కావ్యస్యాత్మా ధ్వనిః" అను ఆనందవర్ధనాచార్యుని నిర్వచనము నకు ఉదాహరణము గావించుట యందే ప్రతిభ ద్యోతకమగుచున్నది.

ఈ అన్నమాచార్య చరిత్రము నందలి వర్ణనలు నాతి దీర్ఘములు, నాతి హ్రస్వములై కథా కథనము చురుకుగ సాగినది. అన్నమాచార్యుల వివాహము వరకు సామాన్యముగ సాగిన కథ సాళువ నరసింహరాయల పాత్ర ప్రవేశముతో మలుపుతిరిగినది. నరసింహరాయల సత్కారము, అన్నమయ తిరస్కారము, రాయల ఆగ్రహము, అన్నమయకు శృంఖలా యోగము ఇత్యాదిగ సామాన్యముగ సాగుచున్న కథ యందు అనూహ్య

వాతావరణ పూర్వక మహాసంఘటనము జరిగి కథ ఏమగునో అన్నమా చార్యుడేమగునో అను ఔత్సుక్యము బయలు దేరును. అన్నమయకు సంకెలలు వేయించి చెఱసాలలో బంధించినాడు రాజు.

ఇచట సాత్త్విక రాజస ప్రవృత్తులకు, భక్తి-వీరములకు సంఘర్షణ మేర్పడినది. అన్నమయ్య మనశ్శక్తికి రాయలు నశించునో, రాయల క్రోధాగ్నికి అన్నమయ బలియగునో అను విచికిత్స పాఠకునకు కలుగక మానదు. కావ్యమునందు కథ ఇచట సంభాషణాత్మకముగ రసస్థాయికి చేరి ఉపసంహారమునకై పతాక సన్నివేశము నలంకరించినది. భరతుని నాట్య శాస్త్రానుసారము చూచినచో అన్నమయ శృంఖలా వృత్తాంత ఘట్టము ఈ కావ్యమునకు నాటక గర్భసంధివలె తన్పట్టుచున్నది. ఏతాదృశ లక్షణ మును అరితేరిన కవిమాత్రమే ప్రదర్శింపగలడు.

అన్నమయ జీవిత విశేషములు జన బాహుళ్యమున మిక్కిలి ప్రచా రము పొందవలెనను సదాశయముతో చిన్నన్న అన్నమాచార్య చరిత్రను గానయోగ్యమగు ద్విపదలో రచించినట్లు భావింపవచ్చును. చిన్నన్న ఆశ యము నెరవేరినది.

ఇట్టి కావ్యములు రచించుట యందు కవికి కావ్యనాయకునిపై గౌర వమే కాదు, ఆస్తిక్యముపై అపారమైన విశ్వాస ముండుటయు ప్రధానము. ఇట్టి లక్షణములతోనే చిన్నన్న అన్నమాచార్య చరిత్రను రచించెను. కావున ఇది భక్త చరిత్రయే కాదు భక్తిరస ప్రచార వాహనము గూడ అగుచున్నది.

## పాత్ర చిత్రణము

**అన్నమాచార్యులు :** "జో అచ్యుతానంద! జోజో ముకుందా!" అనుచు ఆ దేవదేవుని, ఈ ఆంధ్రజాతిని కూడ జోకొట్టిన మృదు మధుర సంకీర్తనాచార్యుడు అన్నమయ. "చందమామ రావె! జాబిల్లి రావె" అని

తీయని తెలుగుతేట పసిడి పసిగుబ్బెలలో పండు వెన్నెలలు విరియించిన పద కవితా పితామహుడు, ప్రథమ వాగ్గేయకారుడు అన్నమయ. ఇతడు రాజీవ నయను వరప్రసాదమున నందకాంశతో కారణజన్మునిగ అవతరించినట్లు చిన్నన్న తెల్పెను. అన్నమయ - స్వామి 'నందకాంశ' అగుట, భూమిపై 'నందవర' వంశమున జన్మించుట గమనార్హము. నంద శబ్దముచే అన్నమయ చరిత్రము 'ఆనంద' దాయకమనియు సూచనము. ఇతని జనన మును గూర్చి తెల్పుచు కవి-

"జనియించె నన్నమాచార్యుండు శక్తి
మునికిఁ బరాశరముని పుట్టినట్లు" (పు. 9)

అని చెప్పెను. పరాశరుడు ధర్మశాస్త్రమైన స్మృతి నిర్మాత. అన్నమా చార్యుడు స్వరశాస్త్రమైన శ్రుతి నిర్ణేత. అన్నమయ పదములలో అతని ధర్మశాస్త్ర పాండిత్యము చూడగలము. ఏతాదృశ సంస్కార బంధమును, వ్యక్తి లక్షణమును పై ఉపమానము ద్వారా ధ్వనింప జేసినాడు చిన్నన్న.

ఆత్మోద్ధరణమునకు సంబంధించిన జ్ఞానమును ప్రసాదించుటయే నిజమైన ఉపకారము. శ్రీరామానుజ మతమును, వేంకటేశుని వంటి దైవమును కరతలామలకము చేసి తమకట్టి ఉపకారము చేసిన అన్నమయను చిన్నన్న కృతజ్ఞతతో తలచినాడు. బాల్యమున ఇంటిపనులు గెంటనాడక చేయు స్వభావము కలవాడనుటలో అన్నమయ వినయము, గడ్డికోయు నపుడు వ్రేలు తెగి నెత్తురు కారిన సందర్భమున అతని అహింసా ప్రవృత్తి వ్యక్తమగుచున్నవి. కొడవలిచే తెగి గాయమగుటవలన తాను హింసకు గురి యయ్యెను. మరి తాను గడ్డి కుత్తుక ఉత్తరించుటయు హింసయేకదా! "హరి చరాచరదేహి యని పెద్దలనఁగ నితవొంద చెట్లుగోయ నిటు నేయఁదగునె" (పు. 12) అనుచు కొడవలిని గ్రక్కున నేలబాఱ పైచుట ఎంతటి ఆశ్చర్యము! సకల చరాచరముల యందు హరిని దర్శింప

గల్గి యౌగికమనన్న ఆ పిన్నవయస్సునందే అన్నమయ్యకు సంక్రమించిన దన్నమాట. ఈ సంఘటనయే అన్నమయలో వైరాగ్యభావ బీజారోపణము గావించి స్వామి సాక్షాత్కార భాగ్యమును కలిగించెను తన యీ రక్తతర్పణముతో హరి తత్త్వమును గ్రహించిన అన్నమయలో వేదాంత దృష్టికి అంకురార్పణము జరిగినది. ఈ విషయమును చిన్నన్న పాత్రల ద్వారా చెప్పింపక ఒక సంఘటనము ద్వారా ప్రదర్శించి పోషించుట విశేషము. భక్తి జ్ఞాన వైరాగ్య సంపన్నుడు అన్నమయ.

"దయా క్షమాఽనసూయాచ శౌచమాయా సదూరతా
మాంగల్యాఽకృపణత్వేఽస్పృహాష్టావాత్మగుణాః స్మృతాః"

అను మనుస్మృతి వచనములోని ఆత్మగుణములను అన్నమయ పాత్రలో ప్రకాశింపజేసినాడు చిన్నన్న. ద్వేషియైనను ఆపన్నుని రక్షించుట దయ. తనకు సంకెలలువేసి చెఱసాలలో నెట్టించిన రాజును ద్వేషింపక 'సదయుడై' దీవించుటలో అన్నమయ దయాగుణము వెల్లడియైనది. దుఃఖము కలిగింపబడినప్పటికిని కోపము లేకుండుట క్షాంతి. "బాహ్యేఽభ్యంతరే వాపరేణ దుఃఖే ఉత్పాదితేఽపి కోపాభావః" అని నిర్వచనము. గద్దికోత వంటి నచ్చని పనులు పురమాయించి తనకు దుఃఖము కలిగించిన బంధువులపై గాని, తనను శృంఖలాబద్ధుని గావించిన రాజుపై గాని కోపింపకుండుటలో క్షాంతి గుణము పోషింపబడినది. అట్లని ఆత్మ స్థైర్యము, ఆత్మాభిమానము లేనివాడు కాడు అన్నమయ. తనపై శృంగార పదమును చెప్పుమని కోరిన ప్రభువుమ—

"హరి ముకుందునిఁగొనియాడు నా జిహ్వ
నినుఁగొనియాడంగ నేరదెంతైన"

అని నిర్మొగమాటముగ తిరస్కరించి— "నిను నొల్ల నిటువంటి నీ పొందు నొల్లఁ జవియెడు వేంకటేశ్వరుఁగొల్వ నేను" అని యెదిరించి దిగ్గన లేచి

పోవుటలో అన్నమయ ధైర్యము, నరస్తుతి విముఖత్వము, భగవద్విశ్వాస ములు ప్రకటితమైనవి. ఇట్టి మహాగుణములే అన్నమాచార్యుల జీవితము నకు విశిష్టతను సంతరించినవి.

ఇంకను ఈ కావ్యమున పుల్లమామిడి పండ్లు పంచదారల వంటి ఫలములుగ మార్చుట, తన ఆశీర్వాదనముచే గాయకునకు పెండ్లికి వలయు ధనమును సమకూర్చుట వంటి మహిమలను దెలుపు కథా భాగమున అన్నమాచార్యుల 'వాచాశుద్ధి'; రచనలను దెల్పు సందర్భమున ఆయన కవితామూర్తి ప్రదర్శింపబడినవి. అలమేలు మంగమ్మ ఇడిన ప్రసాద ప్రభావమున లభించిన అన్నమయ కవిత్వమెట్లున్నదో చిన్నన్న యిట్లు తెల్పుచున్నాడు-

"తేనెలపై తేట తిన్నవి చెఱకు
పానకముల నేరు పఱచిన మేలు
దక్కెరలో తీపు చల్లదెమ్మెరలు
చిక్కని కపురంపు జీవరత్నములు
కలయమృతంబు మీఁగడ మీది చవులు
చిలుకుచుఁ గవులెల్లఁ జేమెత్తి మ్రొక్క" — (అ.చ.పు. 33)

అన్నమయకిట్టి కవిత్వము లభించుటకు కారణమును, బాల్యముననే అతనికి "వెన్నుని వరముచే విద్యలన్నియును తమయంతనే వచ్చి వర్తనమాడఁ దొడఁగె" (పు. 11)నని కవి కావ్యాదియందే చెప్పియుండెను. కావున అన్నమయ కవిత్వము దైవదత్తమైనదని, దైవీభావ సంబంధమైనదని తెలియుచున్నది. అన్నమయ మహాగాయకుడుగ ఈ కావ్యమున చిత్రింప బడినాడు-

"రాగంబుతో ననురాగంబుతోడ బాగుగా గంధర్వ బాగుగాఁజదివి
పాటలన్నియుఁబనపాట పిమ్మటన పాట పాటనె పాటపాడి చూపగను

తుంబురుండో నారదుఁడొ కాక యీ విధంబునఁదిరుగు గంధర్వుఁడో కాక
మనుజుఁడో యీ యన్నమయయని సర్వజనులును గొనియాడ"

అని నరసింహరాయల పాత్రముఖమున అన్నమయ గాన మాధుర్యమును వివరించి- "వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్య భిధీయతే, వాచం గేయంచ కురుతే యః సవాగ్గేయకారః" అని సంగీతరత్నాకరమున శార్ఙ్గదేవుడు చెప్పిన వాగ్గేయకార లక్షణమును అన్నమయపాత్రలో చిన్నన్న పరిచయము చేసెను. సాక్షాత్తు వేంకటేశ్వరస్వామియే స్వయముగ- "జగతి నీ శృంగార సంకీర్తనములు విని మంచి ప్రాయపువాదనయితి"నని ప్రశంసించినట్లుండుటచే అన్నమయ సంగీత సాహిత్యములకు ఇతర ప్రశంసల అవసరమేమి?

అన్నమయ మధురభక్తి సంప్రదాయమునకు చెందినవాడని అన్నమాచార్య చరిత్రమునుబట్టి తెలియుచున్నది. తనయందు స్త్రీత్వమారోపించుకొని పరమాత్ముని జగత్పతిగ భావించుటయే మధురభక్తి. రాయలు తనపై శృంగార పదమును చెప్పుమనినపుడు అన్నమయ- "హరి హరీ యనుచు పరమపతివ్రతా భావంబు పూని" దిగ్గున లేచిపోయెననుటలో 'సాధ్వీనైజ విభుమ్' అని ఆది శంకరులు చెప్పిన పతివ్రతా భావము నిరూపింపబడినది.

ఇక ఈ కావ్యమున అన్నమయను పరమ వైష్ణవునిగ చిత్రించినాడు చిన్నన్న. తిరుమలలో అన్నమయ వైష్ణవయతిచే చక్రాంకితుడై వైష్ణవుడై వైష్ణవుల సహపంక్తిని భుజించెను. రామానుజ మతము ననుసరించెను. సత్త్వ గుణము వైష్ణవ లక్షణము. ఇది అన్నమయలో మూర్తీభవించినది. ఊర్ధ్వపుండ్రములు, తిరుమణి పదములు, పట్టు కుళ్ళాయిల ధారణము, ఇదీ అన్నమయ శ్రీవైష్ణవ రూపము. నరసింహరాయల వద్దకేగి పల్లకి దిగినపుడు వైష్ణవుని చెయ్యాది లోపికరుగుట, రాజును చూచినపుడు- "శ్రీనివాసో రక్షత"నుచు చేతిలోని తిరుమణి పిచ్చుట అన్నమయ

వైష్ణవత్వమును, గురుస్థానమును విరూపించుచున్నవి. త్రికరణములందు వేంకటేశ్వరస్వామిని అధిష్ఠింపజేసికొనిన పవిత్రమూర్తి అన్నమాచార్యుని జీవిత చరిత్రము 'అనఘ'మైనదని విశ్వసించిన చిన్నన్న దానిని వినిన వ్రాసిన జనులకు ఇష్టార్థము లొదవునని కావ్యాంతమున నొక్కివక్కాణించెను.

*సాళువ నరసింహరాయలు* : అన్నమాచార్య చరిత్రమునందలి ప్రధాన పాత్రలలో నరసింహరాయల పాత్ర ఒకటి. ఇతడు చారిత్రక వ్యక్తి. టంగుటూరు పాలకుడని, నాశిక బాంధవాన్వయుడని ఈ కావ్యము వలన దెలియుచున్నది. కాని ఇతడు చంద్రవంశపు రాజని శాసనములందు కలదు. విజయనగరపు ప్రథమ రాజవంశ్యుడగు విరూపాక్షరాయల తరువాత ఆవంశము నుత్సారించి ఆరాజ్యము నాక్రమించు కొనినాడనియు అతడు తొలుత దండనాథుఁడుగా విద్యానగర రాజుల క్రింద నుండి ఆరాజుల దౌర్బ ల్యముచే సన్నపన్నగ పెంపొందిన్ తుదకు విద్యానగరాధీశ్వరు డయినాడనియు, కీ॥శే॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠిక యందు వివరించిరి (పు. 42). ఇతడు విద్యానగరాధిపుడు కాకపూర్వము క్రీ. శ. 1450 ప్రాంతమున పొత్తపినాటిలోని టంగుటూరుకు దండనాథుడై యుండి నట్లు తెలియుచున్నది.

నరసింహరాయలు అన్నమాచార్యుని సంకీర్తన పద్ధతిని విని ఆకర్షితుడై అన్నమయమ్మ స్వయముగ దర్శించి కానుకలొసగి సత్క రించెను. ఒక గాయకుడు, భక్తుడయిన వ్యక్తి వద్ద కేగి ఆశీస్సులు పొంద వలెనను అభిలాషలో నితని సుసంస్కారము వెల్లడియగుచున్నది. అన్న మయ్యను సంపదలలో తన యంతవానిని చేసిన సహృదయు స్నేహశీలి యితడు. ఇతడు గొప్ప వైష్ణవ భక్తుడగుట వలననే అన్నమాచార్యుఁడు ఇతనితో పొత్తున కంగీకరించినాడు.

రాయలు అన్నమాచార్యునకు దాసుడై భృత్యప్రాయుడగుటయందే రాయల వైష్ణవమతప్రీతి వ్యక్తమగుచున్నది. ఇతడు అన్నమాచార్యుని

ఆశీర్బలముతో పరాక్రమించి అజేయుడై రాజ్యమును విస్తరింపజేసి రాజ ధానిని పెనుగొండకు మార్చెను. చిన్నన్న ఇతనిని "రాచమూకలలో పరా క్రమశాలిగ అభివర్ణించెను. ఇది రాయల వీరత్వమునకుఁ దార్కాణ.

నరసింహరాయలు రసహృదయము గల పండితుడు. కనుకనే అన్న మయను ఆహ్వానించి, ఆదరించి, తన నగరమున నిలిపి ప్రతిదినమాతనిచే సంకీర్తనములు పాడించుకొని విని ఆనంద వార్ధిన్ోలలాడు చుండెడివాడు. ఒకనాడు రసములుట్టిపడునట్లు వేంకటేశ్వరునిపై అల్లిన శృంగార సంకీర్తన ములను అన్నమాచార్యులు గానము చేయగా విని ఆనందించి-

"........ కాళిదాసాదులైన
కవులందుఁ జిక్కిన కవులందు నిట్టి
కవితయు నిట్టి శృంగార భావంబు
వివరింపఁ గంటిమే వింటిమే మున్ను" - (అ. చ. పు. 34)

అనుచు ఆశ్చర్యము నొంది 'అన్నయార్యుని కీర్తనలు మోహనమూర్తు' లనుచు బహుధా ప్రశంసించినాడు. మరియు 'పచ్చల కడియాలు బంగారు వ్రాఁత పచ్చడంబులును కెంబట్టు కుళ్లాయి యంగదంబులు నుభయాత పత్ర ములు రంగైన వింజామరల జోడు మంచి యుదిరి చేసిన గిండియును గళా చికయు మొ॥గు కనుకలనేకము అన్నమయ కొసగి ఘన సన్మానము గావించినాడు. ఇందు రాయల శృంగార రసజ్ఞతతో బాటు, అతనికిగల కావ్య పరిజ్ఞానము, దాతృ శీలము, కవి పండిత పోషణము వ్యక్తమగుచున్నవి.

"ఏమొకో చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను...." అను అన్నమాచార్యుని శృంగార సంకీర్తనమును విని తన్మయుడై పలుమారులు పాడించుకొని 'ఇది ! కవిత్వం'బని పరవశించి పలుకుటలో రాయల కవిత్వాభి మానము పరాకాష్ఠకు చేరినది. ఇన్ని మంచి గుణములు గల నరసింహరాయ లలో క్షత్రియోచితమైన రాజ్యకాంక్ష, రాజసప్రవృత్తి పరిపూర్ణముగ తొణి కిసలాడినవి. ప్రథమ దర్శనమునందే యితడు అన్నమయను పూజించి -

"శ్రీకృష్ణు మన్ననఁ గ్రీడి భూచక్రమేక చక్రంబుగా నేలిన పగిది నాలాగు మీ సహాయము నాకు గలుగ నేలుదు ధరయెల్ల నేక చక్రముగ."

అని పలుకుటయందే యితని రాజ్య కాంక్ష వ్యక్తమైనది. ఇతనికి రాజ్యపాలనమొక క్రీడ. కనుకనే చిన్నన్న ఇతనిని క్రీడితో పోల్చి ఈ విషయమును ధ్వనింపజేసినాడు. రాజ్యవిస్తరణమునకే అన్నమయసహాయమునితఁడర్థించెను. అర్థించిన దానిని పొందెను. ఇందులకు కృతజ్ఞతగా అన్నమయను గురువుగ పూజించి సంపదల యందు తనయంత వానిని చేసి అనేకాగ్రహారము లొసగెను. ఇది రాయల కృతజ్ఞతా లక్షణమునకు నిదర్శనము. తన సంపదలు సమస్తము అన్నమయవే అను భావము కలిగి భక్తితో అన్నమయకు భృత్యుడై రాజ్యము నేలెను.

"రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గ సముద్భవమ్
తన్నిబధ్నాతి కౌన్తేయ । కర్మ సఙ్గేన దేహినమ్"
"కామ ఏషక్రోధ ఏష రజోగుణ సముద్భవః"
- గీత, అధ్యా. 14, శ్లో. 5, 6.

రాయలు రజో లక్షణము గలవాడు. కనుకనే వేంకటేశ్వరునిపై అన్నమయ రచించిన శృంగార సంకీర్తనము వంటిది తనపై గూడ చెప్పించుకొని ఆనందింపవలెనను తృష్ణ కలిగినది. అతని ఈ కామన రజోగుణ సముద్భవమైనట్టిదియే. అది ఇతని ప్రకృతి (స్వభావము). "సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః" అని గీత. ఇది యాతనికి దురతిక్రమమైనది కనుకనే నరసింహరాయలు - "అనుపమంబైన ద్రోణాచార్య మహిమ గనియుఁ ద్రౌపది తండ్రి గర్వించినటుల నన్నమాచార్యు మహత్త్వ మంతయును గన్నారఁ గనియును గర్వాంధుఁడగుచు" - తనపై గూడ నొక పదమును చెప్పుమని అన్నమయను ఆజ్ఞాపించెను. తెలిసియు మానవులు దేని ప్రేరణచే పాపము చేయుచున్నారని అర్జునుడు ప్రశ్నింప రాజస తామసములే

కారణమని కృష్ణుడు గీతలో సమాధానము చెప్పెను. రాజు కోరిక అనుచిత మని గ్రహించిన అన్నమయ తిరస్కరించెను. కారణము తన కవిత్వము దైవాంకితమగుటయే. కామనాభంగము వలన రాజునకు క్రోధము కలిగినది. 'క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః స్మృతి భ్రంశాత్ బుద్ధినాశో' అని గీతలో చెప్పబడినట్లు క్రోధ వివశుడైన రాజునకు బుద్ధి నశించినది. గర్వాంధుడై కనుగవ ఎఱ్ఱనై నిప్పులు కురియుచుండ అన్నమా చార్యులను చెఱసాలలో వేయించెను. సత్త్వగుణ సంపన్నుడైన అన్నమా చార్యులు రాజుగుణము నెరిగినవాడు కనుకనే వాని నహార్థము చేసికొనక వేంకటేశ్వరుని ప్రార్థించి సంకెలలు తెగిపడ బంధన విముక్తుడయ్యెను. ఈ ప్రహసనమును రాజు ప్రత్యక్షముగ చూచినగాని నమ్మలేదు. ఇది యాతని మనః ప్రవృత్తికి విదర్శనము.

నరసింహరాయలు ఇంతవరకు సామ్రాజ్యమునకై బాహ్య శత్రువు లను జయించెను గాని కామక్రోధాది అంతశ్శత్రువులను జయింపలేదు. అన్న మయ మహిమను కనులార గాంచిన పిదప క్రోధము పటాపంచలయ్యెను. అతనిలో వివేకము, జ్ఞానోదయము, పశ్చాత్తాపము కలిగినవి.

"అపరాధి నపరాధి నన్నమాచార్య
కృపఁ జూడు నను నీవు కృపణశరణ్య
యెఱుఁగని పసిబిడ్డఁ దేమైనఁజేయ
నరుడైన తల్లికి నలుగంగఁ దగునె" – (అ. చ. పు. 39)

అనుచు కన్నీరుగార్చి అన్నమయను శరణు జొచ్చెను. పశ్చాత్తాపముతో తప్పును దిద్దుకొనుటయందే రాయల సౌజన్యము వెల్లడియగుచున్నది. అన్నమయను వేంకటపతిగనే భావించి పూజించి యతని పల్లకిని మోసి ఊరేగించుటలో రాయల వైష్ణవసేవ వెల్లడియైనది. పెద్దన మను చరిత్రము నందుకొనువేళ శ్రీకృష్ణదేవరాయలిట్లే పల్లకిని తనకేల పట్టినట్లు తెలియుచు

న్నది. ఇది రాయల వంశీయుల సద్గుణసాహిత్యాభిమానములకు నిదర్శనము. సంకెలలు వేయించిన ఘట్టమున నరసింహరాయలు తాత్కాలికముగ ప్రతినాయకునివలె కనిపించినను అన్నమయకు అనుకూలుడే కాని ప్రతికూలుడు కాడు. రజో లక్షణమైన క్రోధముచే అట్లయినాడు కాని అన్నమయ వేంకటేశ్వరుల యందు భక్తి ప్రపత్తులు కలవాడే. ఇతని మనసు తెలిసినవాడు కనుకనే అన్నమాచార్యు డితనిని హృదయపూర్వకముగ మన్నించి ఆశీర్వదించెను.

ఈ కావ్యమున రాయల పాత్ర ద్వారా ప్రభుశక్తి కన్న దైవశక్తి గొప్పదని నిరూపితమైనది. దైవశక్తికి రాయలు తలవంచినాడు.

***ఇతర పాత్రలు :*** అన్నమయ పితామహుడైన నారాయణుని పాత్ర తాళ్ళపాక కేశవస్వామి మహిమను నిరూపించుటలో సాఫల్యమందినది. నారాయణుడు బాల్యమున చదువు రాలేదను చింతతో చింతలమ్మ గుడి కేగి అచటి త్రాచుపాము పుట్టలో చేయి పెట్టగా అతని బాధను గ్రహించి ఆ దేవి ప్రత్యక్షమై తాళ్ళపాక కేశవుని మ్రొక్కినచో నీకు సకల విద్యలు కలుగుననియు, మూడవ తరములో శౌరి వరమున మీ వంశములో వదలని కీర్తితో పరమ భాగవతుడు ప్రభవించునని అన్నమయ భావి జననమును గూర్చి తెల్పెను. కేశవుని ప్రార్థించి నారాయణుడు వేదవేదాంగాది సకల శాస్త్రపారంగతుడై సర్వజ్ఞుడయ్యెను. ఏ అభ్యాసము లేకుండ దైవశక్తితో విద్యలు సాధించు అతీంద్రియశక్తి ఇతని పాత్రలో ప్రదర్శితమైనది. ఇట్టిది కాళిదాసునకు లభించినట్లు జనశ్రుతి. దీని ప్రభావమేమైన చిన్నన్నపై ప్రసరించినదేమో !

లక్కమాంబ నారాయణసూరి దైవభక్తులు. వీరికి చాలకాలము సంతతి లేదు. - "అడిగిన యపుడె యిష్టార్థంబులెల్ల నెడపకచేసేత నియ్య నోపు వేల్పు గలఁడె లోకమున వేంకటభర్త దక్క" అని నిశ్చయించుకొని స్వామి సన్నిధికేగి గారుడస్తంభము దండ దండము లిడి తలముద్ధరించు

అన్నమయ వంటి కొడుకును పొంది వీరు అదృష్టవంతులైరి. వీరి భక్తిభావ వైశిష్ట్య మీ కావ్యమున నిరూపింపబడెను.

తిరుమల యాత్రలో ఆకలితో సొలసి నిద్రించిన బాలుడైన అన్నమయను కరుణించి ప్రసాదమిడిన అలమేలుమంగాదేవిలో జగన్మాతృత్వమును ప్రతిపాదించినాడు చిన్నన్న. ఆమె "చన్నుగవ తుద పాలు చిప్పిలగ' పెద్ద ముత్తైదువ వలె ఆ బాలుని సాకెనని చిన్నన్న కథనము. ఈమె పెట్టిన విద్యా వరప్రసాదము వలననే అన్నమయ సారస్వత పారీణుడై, సరస కవిత్వవాచాప్రౌఢి మెఱసినట్లు తెలియుచున్నది. అన్నమయ జీవితము నొకమలుపు ద్రిప్పినది అలమేలు మంగాదేవియే. కావుననే అన్నమయ- "యోగ్యత లేని కష్టుఁడ నయోగ్యుఁడ నన్నిటఁజూడ గర్వ నిర్భాగ్యుఁడ నీకృపామతికిఁ బ్రాప్తుఁడనో యలమేలు మంగ నా భాగ్యము నీకృపా గరిమఁ బ్రాప్యము...." అనుచు అలమేలు మంగాదేవి శతకమున విన్నవించుకొనినాడు. అన్నమయనాటినుండి తాళ్ళపాక కవులందరకు అలమేలుమంగా వేంకటేశ్వరులే ఇలువేల్పులైరి. చిన్నన్న అన్నమాచార్య చరిత్రను అలమేలుమంగాదేవికే అంకితము చేసి యతని ఆత్మకు శాంతిని, సంతృప్తిని కలిగించినాడనుట సమంజసము.

ఇక ఈ కావ్యము నందలి అతి చిన్న పాత్రలలో పురందరదాసు ఒకటి. ఇతడు కన్నడ మహాకవి. కర్ణాటక సంగీత పితామహుడు. కన్నడ వాగ్గేయకార చక్రవర్తి, పండితుడు. కన్నడమున దాదాపు లక్షవరకు సంకీర్తనములు (దాసర హాడుగళు) రచించి ద్రావిడాంధ్ర మహారాష్ట్రములలో పేరు పొందినవాడు. ఇతని ప్రభావమును డా॥ వి. రాఘవన్‌గారు తమ "The Great Integrators-The Saint Singers of India" అను గ్రంథమున ప్రశంసించిరి. అన్నమయ విఠలువిగ దలచి సంభావించుటలో పురందరదాసు దైవాంశ సంభూతుడని తెలియనగును. అన్నమయ జీవితమున ఎందరొ మహానుభావుని కోరి దర్శించి యుందరు? పురందరదాసు కలయిక

అన్నమయ జీవితములో పేర్కొనదగిన ముఖ్యాంశమై యుండును. సమాన గుణములు కలిగిన అన్నమయపురందరుల చెలిమి కలిమికి నిదర్శనముగ చిన్నన్న ఇతని పాత్రను ప్రస్తావించినట్లు తోచును.

## రస పోషణము

కవి తాను స్వీకరించిన వస్తువును కవితా శిల్పముచే రమణీయ మొనర్చి రస ప్రచురము చేసిన గాని అది కావ్యమనిపించుకొనదు. కావ్యమునకు రసము ఆత్మ అనియు, వర్ణనాలంకారాదులు రసపుష్టికి దోహదము చేయునని ఆలంకారికుల అభిప్రాయము. రసము వాచ్యము కారాదు. అది అనుభవైకవేద్యము. రసస్థాయి కలుగుసరికి ఇంద్రియములున్మత్తములగును.

సామాన్యముగ కావ్యములందు శృంగార వీర రసములందొకటి ప్రధానమై తక్కినవి అంగరసములుగ పోషింపబడుచుండును. అన్నమాచార్య చరిత్రమున అద్భుతము ప్రధాన రసముగ పోషింపబడెను. అన్నమయ చరిత్ర మహిమాన్వితమగుటయే యిందులకు కారణము కావచ్చును. అబాల గోపాలము నాకర్షించి వారిని ఆశ్చర్యాఘాతమున ముంచి ఆనందమున దేల్చి, సంఘటనమును చిరస్మరణీయము గావించు శక్తి అద్భుత రసమునకు గలదు. పామరజనులు సహితము పదికాలములపాటు గుర్తునం దుంచుకొను సంఘటనలు అద్భుత రసావేశముతో నిర్వహింపబడుట సామాన్య విషయమే. ఇతిహాస పురాణములందు సహితము ఇట్టి అమానుష చర్యలు, అద్భుత లీలలు మనకు కోకొల్లలుగ కనిపించును. కాకున్నచో హనుమంతుడు సముద్రమును దాటుట, అగస్త్యుడు సముద్రమును త్రావుట వంటి అమానుష చర్యల అర్థాంతర న్యాసములకు వారెంతటి మహాత్ములైనను సన్న్యాసమే కలిగింపవలసి వచ్చును. ఇట్టి సంఘటనలు అద్భుతరస ప్రధానములై పాఠకుల నాకర్షించును.

చిన్నన్న అన్నమాచార్యుని జీవిత చరిత్రమును అజరామరము చేయుటకై ఏతత్కావ్య నిర్వహణమున అద్భుతమును అంగిరసము గావించి

నట్లు తోచును. అద్భుత రసమునకు స్థాయి ఆశ్చర్యము. ఇట్టి సంఘటన ఈకావ్యమునందాద్యంతము కనిపించును. కనుకనే చిన్నన్న- "అన్నమాచార్య వర్యు చర్యకు మిగుల నాశ్చర్యంబుఁజెంద" (పు. 1) తానీ కావ్యమును రచించుచున్నట్లు అవతారికయందే స్పష్టము గావించెను. దైవములు మానవులకు స్వప్నములందు కనిపించుటయే గాక వారితో మాటలాడుట, అన్నమయ సంకీర్తనల మహిమకు సంకెలలూడిపడుట, భగవదనుగ్రహముచే సకల విద్యలు అనభ్యాసముగ ప్రాప్తించుట వంటి సంఘటనల పరముగ చూచినచో ఈ కావ్యమునందు అద్భుతమే ప్రధానరసము. కాని అన్నమయ నొక సామాన్య వ్యక్తిగ భావించి ఆలోచించినచో అతనిలోని భక్తి రసమునకు పట్టము గట్టవలసి యున్నది.

ఎంత నేర్పినను చదువురాని నారాయణుడు చింతలమ్మను శక్తిగుడి కేగి అచటి కాలసర్పము పుట్టలో చేయి పెట్టుట, దేవి సాక్షాత్కరించుట, నారాయణుని జిహ్వపై మాధవస్వామి కృపచే సరస్వతీ దేవి పాడుకొనగా అతడు క్రమ శిఖ జట వర్ణక్రమ సరణితో వేద పాఠమును చెప్పి తోటి వారలను, గురువును ఆశ్చర్యపరచుట అద్భుత రస పరిపోషకములు. కావ్యాదిని నారాయణుడు పాము పుట్టలో వేలుపెట్టిన సంఘటనము నందే చిన్నన్న అద్భుత రస నిర్వహణమునకు బీజారోపము గావించి, "బీజవద్బీజం" అను భరతుని నాట్య శాస్త్ర నిర్వచనానుసారము ఈ బీజ విస్తరణము కావ్యమందంతటను వ్యాపింపజేసినాడు.

మాడుపూరు మాధవస్వామి లక్కమాంబతో మాటలాడుచుండుట, లక్కమాంబ దంపతులకు వేంకటేశ్వరస్వామి తన బిరుదు గజ్జియలు, ముప్పిడి కఠారము నొసగుట, వేంకటేశ్వరుడు వైష్ణవయతి కలలో కనిపించి అన్నమయను చక్రాంకితుని చేయుమనియు, అన్నమయ బంధువులకు కలలో కనుపించి తన భక్తుడైన అన్నమయకు కన్యలనిచ్చి వివాహము గావింపుమని చెప్పిన కథా సందర్భములలో అద్భుత రసమే పోషింపబడెను.

చిన్నన్న పేర్కొనిన అన్నమయ మహిమలు అద్భుత రస పోషణమునకు ఉదాహరణములు. ఈ కావ్యమున కవియే- 'ఆశ్చర్యంబు జెంది, నివ్వెఱ గంది, అక్కజమంది, విస్మయము నొంది, అచ్చెరువొంది, వెఱగంది' వంటి స్థాయిపద ప్రయోగముచే అద్భుత రసమును వాచ్యము చేయుట గమనింపగలము.

సాళువ నరసింహరాయల రాజస ప్రవృత్తిని ప్రదర్శించు సందర్భమున కవి వీర రసమును పోషించెను. భక్తుల జీవిత చరిత్రలో వీరరస పోషణమున కవకాశము లేదు. రాజుల యొక్క రాచరికము యొక్క జోక్యమువలన మాత్రమే సాధ్యపడును. తన కోరికను తిరస్కరించిన అన్నమాచార్యుని మీదకు రాజు వీరవేశముతో- "వడి సింహాసనము డిగ్గ నుఱికి పగగొన్న బెబ్బులి పగిదినేతెంచె"నాడట. (పు. 38) ఇందు రాజు సింహాసనముపై కూర్చొన్నను కవి అతనిని సింహముతో పోల్చక, బెబ్బులితోపోల్చుట విశేషము. పులిక్రూర జంతువు. సత్త్వగుణ సంపన్నుడు, భక్తుడైన అన్నమయ పైకి దుముకుట క్రూర కర్మము. రాజు క్రౌర్యము నిట్లు వీరరసముతో రంగరించి విచిత్రముగ ప్రదర్శించుట విశేషము.

పశ్చాత్తప్తుడైన రాయలు అన్నమయ- "చరణాబ్జములఁ జక్కసాగిలి మ్రొక్కి కన్నీరు గదుర గద్గద కంఠుఁడగుచు పన్నిన దైన్యమేర్పడ" తన అపరాధమును మన్నింప వేడుకొనిన సందర్భములో కరుణ రసము పోషింపబడెను. కన్నీరు, గద్గదకంఠము, దైన్యములు స్థాయియగు శోకముగ కరుణ ముత్పన్నమైనది.

రసవత్తరముగ కథ నడచునపుడు రసభంగమగు చేష్ట జరిగినచో హాస్యము పుట్టును. శృంఖలాబద్ధుడైన అన్నమయ సంకీర్తనము గానము చేయగా సంకెలలు తెగిపడినవి. ఇది నమ్మని రాజు మరలవచ్చి - "ఒద్దనె యుండి యానిగళంబు తనకి చేనెత్తి యిద్దఱు దేర మగుడ నెకసక్కెమునకు

వేయించిన, గురుఁడు వగి తొంటి సంకీర్తనము సేయుటయును" (పు.39). సంకెలలూడిపడుటయు జరిగెను. రాజు 'ఎగెసక్కెమునకు' సంకెల వేయించుట రాజోచిత ప్రవర్తనము కాదు. అన్నమయ మహిమ తెలిసినవాడయ్యు అనుమాన ప్రవృత్తిగల ఈ రాజ ప్రవర్తనమునకు అన్నమయకు నవ్వు వచ్చినది. ఈ యెగసక్కెపు చేష్టయందు హాస్యము లాస్యము చేసినది.

నవరసములందు భక్తి పేర్కొనబడలేదు కాని అనంతర కాలమున భక్తిరస ప్రధానములైన కావ్యము లనేకము వెలసినవి. ఈ యన్నమాచార్య చరిత్ర కావ్యమున భక్తి అంగరసమే. సంకెలలు వేసిన సందర్భమున అన్నమయ కావించిన వేంకటేశ్వరస్వామి ప్రార్థనలో భక్తిరసము, శరణాగతి తత్త్వము ప్రతిపాదింపబడినవి. పరమసాత్త్వికుడు తాత్త్వికుడయిన అన్నమయ పాత్రలో శాంతము సంగమించినది.

## వర్ణనలు

చిన్నన్న అష్టమహిషీ కళ్యాణము నందు తన ప్రతిభను దెలుపును "దినములోననె వేయి ద్విపద లింపొంద వినుత వర్ణనలతో విరచించువాఁడ" నని చెప్పెను. అయినచో కేవలము 550 ద్విపదలుగల ఈ అన్నమాచార్య చరిత్రము నతడొక్కపూటలో రచించియుండుననుకొన్నచో ఆశ్చర్యములేదు.

అసలు 'వర్ణన అనగా రసభావన ప్రాంగణ రంగవల్లిక' అని ఆచార్య శ్రీ యస్వీ జోగారావుగారు కచ్ఛపీశ్రుతుల సంపాదకీయమున తెల్పిరి. అన్నమయ జీవిత చరిత్రను రసవంతమైన కావ్యముగ రచింప దలచిన చిన్నన్న కావ్యత్వసిద్ధికి వర్ణనలు చొప్పింపకుండునా? వస్తువు ననుసరించి వర్ణన, వర్ణనానుకూలమైన వాక్య నిర్మాణము, వాక్యగతమైన పదముల పొందికల నిందు ప్రదర్శించెను. ఇది అష్టాదశ వర్ణనలతో కూడిన ప్రబంధము కాకపోయినను, సహృదయ హృదయావర్జకమైన వర్ణనలు లేకపోలేదు.

వసంత ఋతు వర్ణనతో కవి కావ్యారంభము చేసెను. "బాలనే పెరిగిన పసిఁడి టెంకాయ పాళెల నెడనీరు పట్టి పెట్టినను అనఁటి పండులు మేసి యలసి పైదప్పి గొవివచ్చి కోయిలల్ గ్రోలవచ్చుటను...."(పు. 3) ఇత్యాదిగ సాగిన వర్ణనలో పొంపారు క్రొవ్విరులు, గొజ్జంగిపూఁదొదలు, గణుపు గణుపున బాలుగారు రసదాళి చెఱకు తోరపు తుంటలు, మిసిమిగల ముంత మామిడిపండు, ముక్కారుపండు రాజనపు పైరులు మొ॥గు వానిని వర్ణించుచు అన్నమాచార్యుని గాయకత్వమును సూచించుటకా యనునట్లు కోకిలను ప్రస్తావించి వసంత శోభ నినుమడింప జేసెను. ఇందు కోయిలలో అన్నమయను ధ్వనింపజేయుట విశేషము. తాళ్ళపాక 'సిరులకు పట్టుగొమ్మ' యని చెప్పి అందలి తులసీ వనములను, వైష్ణవులను వర్ణించుటలో చిన్నన్న తన వైష్ణవాభిమానమును గనబరచుటయేగాక, కావ్యమును పుర వర్ణనముతో ప్రారంభించు ప్రాచీన సంప్రదాయమును పాటించినట్లయినది. అంతేకాదు, 'తులసీ-వైష్ణవుల ప్రస్తావనముచే తాళ్ళపాక పుర పావిత్ర్య మును, కావ్యనాయకుడు, వైష్ణవుడైన అన్నమయ భావి అవతరణమును సూచించినట్లయినది.

అలమేలుమంగ అన్నమయకు సకలసాల గ్రామమయమైన మహా పర్వతమును చెప్పుకాళ్ళతో నెక్కరాదని దెలుపు సందర్భమున గిరివర్ణనము కలదు. కథాగతమైన ఈ వర్ణనలో సాలగ్రామములందు విష్ణుమాహాత్మ్య మును వివరించినాడు కవి. తటాక వర్ణనము: చిన్నన్న సందర్భోచితముగ తిరుమలలోని స్వామి పుష్కరిణి సోయగమునిట్లు వర్ణించెను-

> "సేవంతి పూనీటి సెలయేటి వఱుత తావితామరల నిద్దంపుఁ బుప్పొళ్ళ ముగ్గుల పరుసల మురిపెంబుచేత నగ్గలంబై పొంగు నంబుపూరములా పెనుసోబనాలు చూపెడు సోబనాలు గనుపట్టు స్వామి పుష్కరిణి...."
> (పు. 18)

సాంధ్య వర్ణనము : "ప్రాయ మెక్కుచు విష్ణుపద పల్లవంబు
చాయ చాయల నెఱసంజ చూపెబై" - (పు. 23)

ఇందు నెఱసంజచాయ విష్ణుపద పల్లవపు చాయను పోలియున్నదని కవి భావన. స్వామి దర్శనానంతరము బాలుడైన అన్నమయకు విష్ణుపద భక్తి పల్లవించినదని, అది పుష్పించి ఫలింపనున్నదని సూచనము. ఈ వర్ణనమున విష్ణుప్రస్తావనము గావించి కవి తన సహజ వైష్ణవభక్తిని ప్రకటించుకొనెను. ఈ ధోరణిలోనే సాగిన చంద్రోదయ వర్ణనమును దిలకింపుడు.

"అల కలానిధి భక్తి కారాత్రి మేను
పులకించెనన మింటఁ బొడమెఁ దారకలు
గగనాచ్యుతుఁడు సుధాకలశంబు గొన్న
పగిదిఁ జందురుఁడు చూపట్టె నెంతయును" (అ. చ. పు. 23)

ఇందు చంద్రుని భక్తి చూచి రాత్రి యను శరీరమునకు కలిగిన పులకలవలె నక్షత్రములు పొడమినవట. గగనమను శ్రీమహా విష్ణుని చేతిలోని అమృత కలశమువలె చంద్రుడు చూపట్టెనట. ఈ తారాశశాంకుల వర్ణనలోని చిన్నన్న ప్రతిభ అద్వితీయము. ఊహాపాటవము ప్రశంసనీయము. అమృత కిరణుడు చంద్రుడు. అతనిని సుధాకలశముతో పోల్చుట సామాన్యమే. కాని అచ్యుతుని గగనముతో పోల్చుట విశేషము. "విష్ణుర్వ్యాపన శీలః" అను సర్వవ్యాపక సువిశాల విష్ణుతత్త్వమును పై వర్ణనలో ధ్వనింపజేసినాడు చిన్నన్న. కనుకనే చిన్నన్న వర్ణనలు వినుతమైనట్టివి.

*స్వరూప వర్ణనలు - అన్నమయ :* ఈ కావ్యమున చిన్నన్న అన్నమయ రూపమును రెండు తావుల వర్ణించెను. వైష్ణవయతి కలలో వేంకటేశ్వరస్వామి కనిపించి సంభాషించిన సందర్భమున-

"........శాల్యపాకాన్నమయ నామకుండైన మద్భృత్యుఁడొకఁడు
వడుగు నల్లని చిన్నవాఁడు నన్నెపుడు నడుగక సంకీర్తనము సేయునెపుడు
ముద్దుగారెడువాఁడు మోహనంబైన మద్దికాయలవాడు మనవాడెవాఁడు
గుదిగొన్న నునుపట్టుకుచ్చుల దండెముదమున నిజభుజంబున వించువాడు"
(అ. చ. పు 27)

అని కవి అన్నమయ రూపమును వర్ణించెను. నేటి అన్నమాచార్యుని ఛాయాచిత్రము పై వర్ణనమునకు ముమ్మూర్తుల సరిపడుచున్నది. సాళువ నరసింహరాయలు సంకీర్తనము పాడించుకొనుటకు పిలిపించిన సందర్భమున చిన్నన్న వర్ణించిన అన్నమయ రూపమిట్లున్నది-

"కవకాంబరుని గుణగణమణుల్ శ్రుతులు గని చిక్కగొనురీతి గను కపోలములు
నత్తఱిమదిలోన హరికీర్తి మొలకలొత్తినగతినున్న యూర్ధ్వపుండ్రములు
లాలితాచ్యుత భక్తి లలన వరించు మాలికగతి తిరుమణి పదంబులును
తలనిడు విష్ణుపాదపుదమ్మి పువ్వు మెఱపైన కెంబట్టు మేలు కుళ్లాయి
నరవిందనయను కృపామృతధార కరణిఁజూపట్టెడు కంఠమాలికయు
నరహరికై కంకణము గట్టియున్న సరణిఁజూపట్టు పచ్చల కడియములు
ధవళనేత్రుని శారదావిలాసంబు నివసించు నట్టున్న నిలువు పేరణము
వాసుదేవుని యాజ్ఞవడిఁ జుట్టుకొన్న యా సత్త్వగుణమన నలరు
దుప్పటము".... (అ. చ. పు. 35)

పై వర్ణనమున అన్నమాచార్యుని వైష్ణవ రూపము, సత్త్వస్వరూపము ప్రదర్శింపబడెను. హరిదాసుడైన అన్నమయ యొక్క ఒకింత వృద్ధ వైష్ణవ రూపము నిందు చూడవచ్చును. ఇందలి ఉపమాన వస్తువులన్నియు విష్ణు సంబంధితములగుట గమనార్హము. చిన్నన్న చేసిన పై రూప వర్ణనమును బట్టి చిత్రకారులు వయసు మీరిన అన్నమయ తైలవర్ణ చిత్రమును లిఖింపవచ్చును. పై రెండు తావుల వర్ణించిన అన్నమయ రూపములో కవి ఎంతయో వైవిధ్యమును ప్రదర్శించెను. దీనిని పాత్రోచిత వర్ణనమన వచ్చును.

*వరాహస్వామి వర్ణన :* అన్నమయ సేవించిన ఆది వరాహమూర్తి రూపమును కన్నులకు గట్టునట్లు చిన్నన్న పరమ రమణీయముగ వర్ణించినాడు-

"ఉరగేంద్రు శిరసుపై నొకపాదమూఁది చరణమొక్కటి రసాస్థలి మోవఁజాఁచి
దాకేలు పుడమి పడంతుక నలమి యాకేలు కటినూఁది యనురక్తిఁజక్కఁ
బంట వలంతి గుబ్బల తావిమోవి పంటి తేనియలొకపరియాను తమిని
మోము దామరఁజాచి మొగసిరి కేలి తామరలను శ్రుతిద్వయము నిక్కించి
నంకు చక్రముల హస్తముల రెంటఁబొంకించి కరుణచూపుల జొబ్బిలంగ
నాదరిఁబెంపొందు నాదివరాహం...." (అ. చ. పు. 19)

ఇట్లు వర్ణితమైన రూపము గల వరాహమూర్తిని నేటికిని తిరుమల లోని స్వామి పుష్కరిణి చెంతగల వరాహస్వామి ఆలయమున దర్శింప వచ్చును. 'మోముదామర జూచి. శ్రుతి ద్వయము నిక్కించి'యని వర్ణించు టలో వరాహరూపము మన కనుల ఎదుట కనిపించును.

*వేంకటేశ్వస్వామి వర్ణన :* అన్నమయ దర్శించిన వేంకటపతిని చిన్నన్న భక్తి పరవశుడై యీ క్రింది విధముగ వర్ణించెను-

"ధళదళల్ తులకించుదర చక్రహస్తములు బొడ్డుమానికమును గతారమును
మంజీర కింకిణీ మంజులపాద కంజ ద్వయంబును గాంచనాంబరము .
కటిమీఁదఁజేర్చిన కరపంకజంబు తటుకున వరమిచ్చు తమ్మికెంగేలు
తులికెదు మణిమయకుండలద్యుతులు కలకలనగుముద్దుగారు నెమ్మొగము
మంచి ముత్యాల నామంబుపైఁగానుపించు రత్నాంశు దీపిత కిరీటంబు
తట్టుపునుంగు పూఁతయుఁగిరీటాది చుట్టిన చెంగల్వ చొళ్ళెంపుదండ
వనమాలికయును శ్రీవత్సకౌస్తుభము అనుపమదివ్యభూషాది వైఖరులు"
— [అ.చ.పు. 22]

ఇట్లు వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమును తన వర్ణనా చాతుర్య ముచే మన కనుల ఎదుట బెట్టినాడు చిన్నన్న. ఇతడే రచించిన పరమయోగి విలాసము నందీ వర్ణన మింకను సుదీర్ఘముగ కలదు. "పసిఁడి గజ్జెలు

నందిఘల్ కనకాంబరంబు,... మెఱుఁగు ము_త్తియపు నామము గలిగి" బంగారు గజ్జెలుఁబసిఁడి యందెలు.... మణిమయంబగు కిరీటంబు". (ప.మో.వి. 8 ఆశ్వా: పు 630) ఇత్యాదిగ సాగిన వేంకటేశుని వర్ణన లందు చిన్నన్న తన్మయ భక్తి ప్రకటితమయ్యెను.

***ఇతర వర్ణనలు*** : చిన్నన్న ప్రతి చిన్న విషయమును విశితముగ పరిశీలించి వర్ణించును. గడ్డి పరకల వర్ణనము నుండి వేంకటేశుని రూప వర్ణనము వరకు దేనిని పరికించినను హృదయంగమమై కావ్యమును చదివించి కావ్య గౌరవమును పెంచునేగాని విసువు కలిగింపదు. ఈ కావ్యము నందింకను నరసింహరాయల సభా వర్ణనము, తిరుమల యాత్రకేగు భక్త బృందముల రూపవర్ణనము, చంపక ప్రదక్షిణ, ప్రసాద వర్ణనలు, రాయల క్రోధము, జీడిమామిడి పండ్లు వర్ణింపబడినవి. ఇందలి వర్ణనలు నాతిదీర్ఘములు గాక ఇతివృత్తమునకు వన్నె కలిగించినవి. ఇందు అన్నమయ వేంకటేశులను చిన్నన్న పారవశ్యముతో వర్ణించినట్లు తోచును. సాంధ్య చంద్రోదయాది వర్ణనలందలి కల్పనలు 'అన్నమాచార్య చరిత్రకు' కావ్యత్వమును కల్పించి వన్నె కూర్చినవి.

## అలంకారములు

అన్నమాచార్య చరిత్రమున చిన్నన్న ఉపమ రూపక ఉత్ప్రేక్షాది సుప్రసిద్ధాలంకారములను ప్రయోగించెను. పలుతావులలో ఉపమాలంకారమును వాడెను. అందు కొన్ని కథాపరములు, మరికొన్ని గుణసంబధితములు. కొడవలితో గడ్డికోయుచున్న అన్నమయను "పాపవల్లరుల శ్రీపతి నామ హేతి నేపారఁదఱుగు యోగీంద్రు చందమున" అని యోగితో పోల్చి ఉపమించుటలో అన్నమయ యౌగిక ప్రవృత్తిని సూచించినారు కవి. "దినుసైన లేపువ్వుఁ దీగ కైవడిని" - "మినుకారు క్రొక్కారు మెఱుగు చందమున" - "రాచిల్కఁభాతి" అను రీతి అలమేలుమంగాదేవిని వర్ణించు

టలో చిన్నన్న ఉపమాలంకారమును పరంపరగ ప్రయోగించెను. "శ్రీకృష్ణ మన్ననఁగ్రీడి భూచక్ర మేకచక్రంబుగా నేలిన పగిది"(పు 31); "అనుపమంబైన ద్రోణాచార్య మహిమ గనియు ద్రౌపది తండ్రి గర్వించి నటుల" (పు. 36) "మునుపు ప్రహ్లాదుండు మురవైరిఁ దలఁచి దనుజ బాధలఁ గాలఁదన్నిన కరణి" (పు. 36) ఇత్యాదిగ ఈ కావ్యమునందుగల ఉపమాలంకారములలో భారత భాగవతాది ఇతిహాస పురాణ కథా సందర్భము లను ఉపమాన వస్తువులుగ వాడి తన పూర్వకావ్య పాండితిని చవి చూపించి నాడు చిన్నన్న. మరియు - "వడి సింహాసనము డిగ్గ నుఱికి పగగొన్న బెబ్బులి పగిది నేతెంచి" (పు. 38); "కపట మానసుల యాకారంబు పోలె నపుడెంతొ దృష్ట ప్రియంబులై యున్న" (పు. 43), అను ఉపమలలో నర సింహరాయల యొక్కయు, పుల్లమామిడిపళ్ల యొక్క గుణరూపములను దెలిపి చిన్నన్న అలంకార ప్రయోగమున నైపుణ్యమును ప్రదర్శించెను.

'నందవరాన్వయ సుధాకరుడు' (పు. 4), 'పాపవల్లరుల శ్రీపతి నామహేతి దరుగు' (పు. 12) అను ద్విపద వాక్యములలో నందవర వంశ మునకు సముద్రమునకు, శ్రీపతి నామమునకు హేతికి అభేదము చెప్పి రూపకాలంకారమును ప్రయోగించినాడు కవి. ఈ కవి ఉత్ప్రేక్షాలంకారమును ప్రయోగించుటలో సిద్ధహస్తుడు. ఈ క్రింది వాక్యములు చూడుడు.

> "కమ్మని గణుపు చెంగటవాటమైన తుమ్మెద తొళ్ల సందుల చల్లగాలి
> రాణదూరగ వింతరాగంబు పొసఁగ వేణునాదము సేయు వెన్నుఁడో
> యనఁగ పరువంపుఁదలిరు జొంపములఁ బెంపొలయు.... (పు. 15)

ఇందు ఉపమేయమైన వెదురు గణుపుల సందుల నుండి వచ్చు చల్లని గాలి వింతరాగములతో వేణునాదము సేయుచున్న వెన్నుడా (కృష్ణుడా) యనునట్లున్నదని ఉత్ప్రేక్షించుటయే గాక, ఉపమానము వెన్ను కొనుటలో సహితము తన సహజ వైష్ణవాభిమానమును కనబరచినాడు కవి. ఇది అలంకార ప్రయోగమున చిన్నన్నకు గల ప్రత్యేక ధోరణి.

ఈ కావ్యమున చిన్నన్న నారాయణుని పాత్రముఖమున చదువురాని బాలకుల మాంద్యమును స్వాభావికముగ వర్ణించెను. అట్టి బాలునకు గురు విట్లు పాఠము చెప్పుచుండెను-

"చదివెడు పదుచుల చందంబు చూపి సామంబు చేతనె చదివించి చూచి యామీఁద గొన్నాళ్ళదలించి చూచి మఱికొన్ని దినములు మైనొత్తిచెప్పి వెలపారఁదఱటున వేయించి చూచి నూఱు మాటలు చెప్పి నులిపెట్టి చెక్కు నూఱిపోసినఁగాని.... (అచ. పు. 5, 6)

ఇందు గురువు అవస్థ, చదువురాని శిష్యుని దైన్యస్థితి సులభశైలిలో స్వభావోక్తి సుందరముగవర్ణింపబడెను. ఇట్లే ఆదివరాహమూర్తి స్వరూప వర్ణనమున గూడ కవి స్వభావోక్తిఅలంకారమును అందముగ ప్రయోగించెను.

"బాలక! కాల సర్పము సొచ్చుపుట్టనేల కేలిడితివి?" (పు. 6) అను వాక్యమున శ్లేషాలంకారము గలదు. కాలసర్పమనగా నల్లని సర్పమనియు (నల్లత్రాచు), ఆయుర్దాయమును కాటువేయు సర్పము వంటి కాలమనియు రెండర్థములు స్ఫురించుటచే అలంకారము శ్లేషఅయినది.

"కారుమించులకును గలరీతి ముద్దుగారు పువ్వులు నొత్తుగాఁబడిరాల రమణ బ్రహ్మాండ కరండమంతయును ఘుమఘుమ తావులు గులికి వాసింపఁగనుపట్టునా చంపకపు బ్రదక్షిణము.... (పు. 19)

అను చంపక ప్రదక్షిణ వర్ణనమున ఒత్తుగా రాలిన పువ్వుల తావి ఘుమ ఘుమలు బ్రహ్మాండ కరండమంతయు వ్యాపించెననుటలో అతిశయోక్త్య లంకారము పరిమళించినది.

ఇట్లు అర్థాలంకారములనే గాక వృత్త్యనుప్రాస, అంత్యానుప్రాసాది శబ్దాలంకార మాధుర్యమును గూడ జోడించి చక్కెరతీపి, చెఱకు పానకపు

తియ్యదనములతో అన్నమాచార్య చరిత్రమును అందముగ అలంకరించినాడు చిన్నన్న.

## భాష - శైలి

"కవిత్వమునందు రెండు లక్షణములుండును. మొదటిది శబ్దములు, బిగింపు, గడుసుదనము, పటుబడి, ఒకశైలి యిటువంటిది. రెండవది భావము, కల్పన, అలంకారములు సమకూర్చుట, కథనము చెప్పెడి నేర్పు మొదలైనవి" అని ఎమెస్కోవారు ప్రచురించిన ఆముక్తమాల్యద పీఠికలో కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తెల్పిరి. ఈ లక్షణములు చిన్నన్న రచనలో గలవు. అసలు చిన్నన్న కావ్య భాషను జాను తెనుగన వచ్చును.

> "సరళముగాఁగ భావములు జాను తెనుంగున నింపు సొంపుతో
> బిరిగొన వర్ణనల్ ఫణితి పేర్కొన వర్ణము లొత్తిగిల్ల బం
> ధురముగ ప్రాణముల్ మృదు మధుత్వ రసమ్ముఁలు కందళింప, న
> క్షరములు పూక్తులార్యులకుఁ గర్ణరసాయన లీలఁగ్రాలఁగన్"

అని కుమారసంభవ కావ్యమున నన్నెచోడ కవి పేర్కొనిన జాను తెనుగు స్వభావము. పై పద్యమునగల తదితర లక్షణములు చిన్నన్న భాషలో ప్రవేశించినట్లు తోచును. జాను తెనుగనగా అందమైన, స్పష్టమైన తెనుగని కొందరు అర్థము చెప్పిరి. దీనికి అచ్చతెనుగని మాత్రమే అర్థము కాదని, జాను అనునది చదును - చతుర శబ్దములకు వికృతి యని చిలుకూరి నారాయణరావుగారు పండితారాధ్య చరిత్ర పీఠికలో వివరించిరి. జానుతెనుగనగా సంస్కృత స్పర్శలేని తెలుగు కాదని 'ఆరు యుగాల ఆంధ్ర కవిత' గ్రంథమున శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు. ఇట్టి జాను తెనుగు రచనకు గద్య పద్యముల కంటె ద్విపదయే తగిన ఛందమని పాల్కురికి సోమన తెల్పెను.

అన్నమాచార్య చరిత్రమున 'వెన్నగాచిన నేయి', 'ఎంత పచ్చళ్ళు', 'కెంబట్టు కుళ్ళాయి', 'కళాచి' వంటి జానుతెనుగు పద ప్రయోగము అధికముగనే కనిపించును.

"కోలగగ్గెరఁ ద్రోసి గుంజిళ్ళఁబెట్టి
పైలావు దొరుగంగ బడి పెట్టుపెట్టి" (అ. చ. పు. 6)

"కాలి సంకెల చిటికన వ్రేలి పలుము
చీలలు వీడి చెచ్చెర సూదపడిన" (అ. చ. పు. 39)

అను రీతిగల రచనమున చిన్నన్న అచ్చతెనుగు భాషాపదములను పోహళించెను. ఇచట అచ్చతెనుగు కూడ జానుతెనుగే. మరియు వరాహమూర్తి, వేంకటేశ్వరస్వామి వర్ణనలందుగల సంస్కృత స్పర్శగలిగిన రచన కూడ జానుతెనుగే అని గ్రహింపనగును.

శైలి : అన్నమాచార్య చరిత్రమున చిన్నన్న భావోచిత శైలీ విన్యాసమును ప్రదర్శించెను. ఈ కవి శైలి మధురమై, ప్రధానముగ వర్ణనాత్మకమై అలరారును. అచ్చటచ్చట భాగవతశైలి ఛాయామాత్రమున గోచరించును.

"కలయొ యాందోళమొ కాక విక్రమంబొ
కలవళంబో దీని కరణి యేకరణి...."

అను రచనమున - "కలయో వైష్ణవమాయయో...." అనెడి భాగవత సరణి స్ఫురింపక మానదు. అలమేలుమంగాదేవి అన్నమయకు 'ప్రసాదాన్నము'లు పెట్టు కథా సందర్భమున కవి రచనమును 'ప్రసాదగుణ' భూయిష్ఠము గావించి భావానుగుణ శైలీ నిర్వహణమున చతురత చూపెను. తిరుమల కేగుచున్న భక్త బృందముల నాట్య విన్యాసములను వర్ణించుచు—

"దినుసైన కంచుటందియలు సారెకును
ఘల్లు ఘల్లనఁ బాతకముల గుండియలు
ఝల్లు ఝల్లను విలాసములు మెఱయ...." (అ. చ. పు. 14)

అని రచించుటలో ఘల్లు ఘల్లను పదప్రయోగముచే నాట్యానుగుణమైన అందెల రవళిని కర్ణరంధ్రముల సోకించినాడు. మరియు "అవ్వేల్పు తళ్ళుల క్రింద" (పు. 20) వంటి కొన్ని వాక్యములలో చిన్నన్న స్వల్పముగ మణిప్రవాళశైలి నుపయోగించెను. వివిధ భాషాపదముల నుపయోగించి రచించుట మణిప్రవాళము.

అన్నమయ వేంకటేశ్వరస్వామిని దర్శించిన సందర్భమున – "తడబడ చుట్టిన తన పంచకొంగు కడనున్నదొక కాను కానుక వెట్టి" అనుచు తొలుత తెలుగు పదశైలితో ప్రారంభించిన చిన్నన్న, వాకిటను అన్నమయకు స్వామి కనుపింపగనే –

"ధళధళల్ తులకించు దర చక్రహస్తములు....
మంజీర కింకిణీ మంజుల పాద
కంజద్వయంబును గాంచనాంబరము," (అ. చ. పు. 22)

అనుచు ధారాప్రవాహముగ సంస్కృత సమాస శైలిని ప్రయోగించి, స్వామి దర్శనానందానుభూతి ప్రవాహ సూచకమా అనునట్లు శైలీ భేదమును ప్రదర్శించెను. మరియు, 'కోనేటి దానేటికొన్న', 'కమ్మగా వాసనల్ క్రమ్మగా', 'హరిబింబమో యన హరిబింబములరె' 'శతకంబు కుతుకంబు' వంటి అనుప్రాసిక శైలి మనకీ కావ్యమున ద్రాక్షాగుచ్ఛమువలె చవులూరించును.

ఇక తరువాతి ప్రకరణమున బహుముఖీనమైన చిన్నన్న మూర్తిమత్వమును పరికింతము.

# 6. చిన్నన్న మూర్తిమత్త్వము

ఏభాష యందైనను ఏ కవికి సంబంధించినదైనను కవిత్వమునకు వ్యక్తిత్వమునకు అవినాభావ సంబంధము గలదు. ప్రతి మనిషికిని వ్యక్తిత్వముండును. అట్లని వ్యక్తిత్వముగల ప్రతిమనిషి యందును కవిత్వముండి తీరవలెనను నియమములేదు. ఒక్కొక్కనిలో కవితామయమైన భావము లుండవచ్చును. కాని వాని నతడు వ్యక్తపరుపలేడు. అసలు లోకమున వ్యక్తిత్వమనునది మనిషి నుండి మనిషిని వేరు చేసి చూపించును. అట్లే ఒక కవి కృతులలో కనిపించు వ్యక్తిత్వము ఆ కవిని ఇతర కవుల నుండి వేరు చేసి చూపించును.

సామాన్యముగ స్వతంత్ర కావ్యములయినచో కవి తన వ్యక్తిత్వమును ప్రదర్శించుకొనుట తేలిక. కాని అనుసరణ రూపములైన ఆంధ్రీకరణ కావ్యములలో కవి తన వ్యక్తిత్వమును స్వతంత్రగతిలో పాఠకులచే ప్రశంసలందుకొను రీతిలో ప్రదర్శించుట అంత సులభముకాదు. ఇట్టి తరహాలో తన కృతులలో స్వీయ వ్యక్తిత్వమును చాటుకొనిన ప్రాచీనాంధ్ర ద్విపద కవులలో తాళ్ళపాక చిన్నన్న ఎన్నదగినవాడు.

చిన్నన్న మూర్తిమత్త్వము ప్రశంసావహమైనట్టిది. అతడెంతటి కవియో అంతటి పండితుడు. ఎంతటి పండితుడో అంతటి భక్తుడు. ఆత్మజ్ఞాని. వైష్ణవమతాభిమాని, సంప్రదాయజ్ఞుడు. బహుభాషావేత్త, మనస్తత్వశాస్త్రవేత్త. నిజమున కతడెంతటి తత్త్వజ్ఞుడో అంతటి లోకజ్ఞుడు. ఎంతటి లోకజ్ఞుడో అంతటి యోగి. బహుముఖీనమైన ఇంతటి విశ్వరూపముతో చిన్నన్న మూర్తి అతని కావ్యములలో మనకు దర్శనమిచ్చును.

కవిత్వముపై చిన్నన్నకు నిశ్చితాభిప్రాయములు కలవు. 'కులికి కస్తూరి పీఱ గోసిన కరణి దెలికప్పురపుగ్రోవి దెఱచిన నరణి విరవాది పొట్లము విడిచిన మాడ్కి బరిమళించుచు కవులు బళి బళి యనునట్లు' కవిత్వముండవలెనని చిన్నన్న అభిప్రాయము. ఇంకను—

"పలికిన పలుకెల్లఁబన్నీరు చెంబు గులికిన చందానఁ గ్రొన్నెల సోఁగ
వాలసినరీతి కర్పూరంబులప్పలొలుకు కైవడిమించులుడుగక మెఱయు
ననువునఁజల్లఁగా నమృతంపు సోన చినుకు సోయగమున జీవరత్నములు
మెలఁగెడు జాడఁద్రామినుకు వజ్రములు తులగింప జలజలఁదూర్పెత్తినట్టి
మెలుపున వలపుఁదెమ్మెరలు వేడించు నలువునఁ గ్రొత్తకట్టాణి
ముత్యములు
డాలించు సరణి బిటారంబులొకట గీలించు కరణిఁ జక్కెరలుప్పతిలఁగ"

కవిత్వముండవలెనని పరమయోగి విలాసమున (పు. 170) చెవుల కింపు లుదయింప కవిత్వముపై కవిత్వము చెప్పినాడు చిన్నన్న. కేవలము కత చెప్పినటువలెగాక ప్రత్యక్షముగ చూచుచున్నట్లే వర్ణించుచు, రసరీతులుప్పొంగు చుండ భావవ్యంగ్యముఖ్య పరిపూర్ణ శుభశబ్దబంధురముగ కావ్యములుండ వలెనని ఇతడభిప్రాయపడినాడు. ఇట్లు రచింపగలిగిన కవికి ఆత్మ విశ్వాసము మెండుగ నుండును. కనుకనే చిన్నన్న "దినములోననె వేయి ద్విపద లింపొంద వినుత వర్ణనలతో విరచించువాడ"నని, "కవి శిరః కంపయోగ్య ప్రతిద్విపద నవబిరుదాంకుడనని" ధైర్యముగ చెప్పగలిగినాడు. అట్టి రచనా సామర్థ్యమును, కవితా కామనీయకమును చిన్నన్న కావ్య సమీక్షల అవాంతర ప్రకరణములందు చూడవచ్చును. కవిగా చిన్నన్న ఎన్నదగినవాడు.

**శాస్త్ర వైదుష్యము :** చిన్నన్న కవి మాత్రుడే కాదు సంగీతనాట్య యోగాలంకార ఛందశ్శాస్త్రాది బహుముఖ పాండితీ ప్రతిభా సంపన్నుడు, ఇంతటి పాండిత్యముతో బాటు పదలాలిత్యము, అర్థగాంభీర్యము, శబ్దాలంకారాది విశేషములు అతని కవితలో ప్రకాశించు చుండును. కనుకనే చిన్నన్న విద్వత్కవి. అతని పాండిత్యమును పరిశీలింతము.

***సంగీత పరిజ్ఞానము :*** అష్టమహిషీ కళ్యాణమున శ్రీకృష్ణుని వేణుగాన రవళిని వర్ణించు సందర్భముననూ, పరమయోగి విలాసమున

తిరుప్పాణి ఆళ్వారు చరిత్ర యందును సంగీత శాస్త్రసంబంధిత సాంకేతిక పదజాలముతో తచ్ఛాస్త్ర వైశిష్ట్యమును వివరించి, తన సంగీత పాండితీ నైపుణిని చిన్నన్న చాటుకొనెను. ఉదా : "మాయురే యనమంద్ర మధ్య తారములు నాయతంబొనరించి....వివిధంబులగు నేకవిశంతి శ్రుతుల జవకట్టి నట్టి యా సప్తస్వరముల కులమేర్పరించి....రూపించి గ్రామ గారోహావరోహ నైపుణ్య వివిధ వర్ణములు చూపుచును సమశుద్ధ సాళగ సంకీర్ణ గతులు క్రమమున నెదుట రాగములు నర్తింప" (అ. మ. క. పు. 88); "సరిగమ పదనిస సనిదప మగరిస....మంకించి శుద్ధంబు లలర మీటుచును" (ఉ.క.పు. 21); "పాడరేయొక పెండ్లి పాట సొంపార .... ఘుమ్మని పల్లవుల్ గూడి పాడంగ" (ఉ. క. పు. 89); "హస్తముల వీణియఁగీలు కొలిపి కలయంగ తంత్రులొక్కట పాదుపఱచి కొనవేల శ్రుతి తంత్రి గూడంగ మీటి మును మంద్ర మధ్యమములు దారకమును ....స్వరలయగ్రామ మూర్ఛల సంచులె ఱిగి, ఘనశుద్ధమును సాళగమును సంకీర్ణమును తేటపడ" (ప.యో. వి.252) ఇట్లింకను స్త్రీలు 'ధవళములు' పాడిరనియు, తాళమానితముగ ప్రబంధనివ హము నావృత్తి చేసినట్లును చెప్పబడిన తావులలో చిన్నన్న సంగీత శాస్త్ర పరిజ్ఞానము వ్యక్తమగుచున్నది. పరమయోగి విలాసము పంచమాశ్వాసమున "పాలించి కరుణచొప్పడ యోగనిద్ర చాలించి శ్రీరంగశాయి మేల్కనవె.." అనుచు ముప్పది ద్విపదలను గాన యోగ్యముగ రచించుట యందే చిన్నన్న సంగీత పరిజ్ఞాన మెట్టిదో గ్రహింపవచ్చును.

ఈ విషయమున ప్రముఖ సినీ నేపథ్య గాయకులు, కవులు, సంగీత శాస్త్రవేత్తలైన పద్మశ్రీ డా॥ పి. బి. శ్రీనివాస్ (మద్రాసు) గారి అభి ప్రాయమిది—

"పరమయోగి విలాసమునందు చిన్నన్న రచించిన ప్రాబోధకీ స్తుతి మేలుకొలుపునకు సంబంధించిన ద్విపద కవిత యగుటచే ఉదయరాగములైన రేగుప్తి, భౌళి, భూపాలరాగములలో కడు రంజకమైన ఆరోహణావరోహణ స్వరాలను కలిగిన (సరి¹గంపధ¹ససధ¹పగరి¹స) ఔడవరాగములో పాడదగి

యున్నది. పై విద్యాభిలాషులు ఈ మూడు రాగములలోను జనరంజకముగ ఈ మేలు కొలుపు ద్విపదలను పాడవచ్చును." కనుక చిన్నన్న కీర్తనలు లేవను లోటును ఈ పాటలు తీర్చగలవు. పై అంశములను పరిశీలించినచో చిన్నన్న సంగీతజ్ఞుడు, గాయకుడు కాదని చెప్పుట కవకాశములేదు.

***నాట్యశాస్త్ర పాండితి :*** అష్టమహిషీ కళ్యాణమున శ్రీకృష్ణుని కాళియఫణిఫణాన ర్తన సన్నివేశము నందును (పు. 63); ఉషాకళ్యాణమున - కృష్ణుని యెదుట బాణుడు నృత్యము చేసినట్లు వర్ణించు ఘట్టమున- "పలుమారు నంది సంభ్రమము రెట్టింప తతత త్త జకికిణా తతికుడిద్ధిమికు తతతోంగిణనుచు" (పు. 85) మొ.గు వాక్యములందు చిన్నన్న నాట్యశాస్త్ర పాండిత్యము వ్యక్తమగుచున్నది. అందు నాట్యమునకు సంబంధించిన పారిభాషిక పదములను ప్రయోగించుటయే నిదర్శనము.

***చిత్రకళా పరిజ్ఞానము :*** ఉషా కళ్యాణమున చిత్రలేఖ చిత్ర పటమును లిఖించినదను చెప్పు కథా సందర్భమున- "కొలదిగా వన్నియల్ గూర్చి బంగారు చిప్పలలో నుంచి....రూపు రేఖలు వ్రాసి" (పు. 28) అను ద్విపద పంక్తులలో చిన్నన్న చిత్రలేఖనకళా పరిజ్ఞానమును దిలకింపవచ్చును.

***అలంకార శాస్త్ర వైదుష్యము :*** వర్ణనావసరములలో వర్ణ్య వస్తు స్వరూపమును పాఠకుల మనస్సున కెక్కునట్లు చేయుటకై పునరుక్తి ధోరణిలో కాక వివిధ శబ్దార్థాలంకారములను ప్రయోగించినాడు చిన్నన్న. "తెలివపేచను దెంచి తెలివపే గదియ"— "గోదా సతీ వాఁదెగోదానవారి"- "కని కరములు మోడ్చి కవికరంబొదవ" (ప.యో.వి.పు లు. 309, 400, 476) అనురీతిలో సాగిన ఇతని శాబ్దికమైన చమత్కార రచనము పాఠకుల నాకర్షించి రంజింపజేయును. 'అలంకారభాసితమైన కావ్యము శీఘ్రముగ సహృదయ హృదయంగమమగునని' ధ్వన్యాలోకమున ఆనందవర్ధనుడు చెప్పెను.

చిన్నన్న అలంకార ప్రయోగ సామర్థ్యము సోదాహరణ రూపమున ఆయా కావ్య సమీక్షల అలంకార ప్రకరణములందు చూడనగును.

*ఛందశ్శాస్త్ర పాండిత్యము :* ఈ విషయమున చిన్నన్న ద్విపదయే ప్రముఖముగ పేర్కొనదగినది. ద్విపద ఛందము చిన్నన్నకు ఒదిగినట్లు మరియొకరికి ఒదుగలేదనుట అత్యుక్తికాదు. చిన్నన్న తన కావ్యములందు భావానుకూలముగ ద్విపద రచనలో ఎన్నెన్నో గమకములను ప్రదర్శించెను. ద్విపద ఛందమున చిత్రకవిత్వము రచించెను. నవరసములను పోషించెను. అష్టమహిషీ కళ్యాణములోని గోమూత్రికాబంధ, భ్రమక రచనము లితని చిత్ర కవితా నైపుణికి నిదర్శనములు-

గోమూత్రికాబంధము : "కమలేశ నరహరి ఖగరాజగమన....
కరుణా కటాక్ష శ్రీ కలితోరువక్ష
పరమ యోగీశ హృత్పద్మదినేశ
యపరాధి నపరాధిననిపొక్కి స్రుక్కి-
(అ.మ.క.పు 223)

ఇందొక పాదము శిథిలమైనది. "గోవు (ఎద్దు) నడుచుచు విడుచునప్పుడు మూత్ర మిరుప్రక్కల వంకరగా మూలలుదేలి యాకారమేర్పడును. అట్టి యాకారములో పద్యాక్షరములు లిఖింపబడి కన్పడుటయే గోమూత్రికాబంధ" మని డా॥ గాదె ధర్మేశ్వరరావుగారు తెలుగులో చిత్రకవిత్వమను గ్రంథమున (పు. 254) దెలిపిరి.

భ్రమకము : "వరకు తాల నవనవ నలతా కురవ
కరక సారస కనక సరసా కరక
కలదర వీరక కరవీర దలక
కలకద వాసి కకసి వాసిదలక" (అ.మ.క.పు. 243)

ఈ ద్విపద పాదములు కుడి యెడమలనుండి ఎటు చదివినను ఒకే మాదిరిగ నుండును. ద్విపదలో నిట్టి రచనా విన్యాసము చిన్నన్న ఛందశ్శాస్త్ర వైదు

ష్యమును దెలుపును. సంభాషణములందు, కథాకథనమునందు సులభ సుభగమైన పదబంధ రచనము, వర్ణనలలో ఒక్కొకచో సుదీర్ఘ సమాసబంధము, మరియొకచో ప్రకృష్ట సంస్కృత పదబంధము కనిపించును.

పరమయోగి విలాసమున నాటి సాంఘిక జీవన విశేషాదులు ప్రస్తావించబడిన తావులందు, దొంగతనములు- దొంగలను పట్టుకొనుట, రాజసభలో విచారణలు, తీర్పులు, శిక్షలు వేయుట మున్నగు అంశములందు చిన్నన్న *నీతి శాస్త్రపాండిత్యము*, కులశేఖరుల వృత్తాంతమునందు *రాజనీతి శాస్త్ర పాండిత్యము*, "పలుకులు మృదువులు భావముల్మిలలు .... మదిలోన నొక్కటి మాటాడు టొకటి మదిరాక్షులకు నియమంబు సంశయము (ఉ.క. పు. 61) ఇత్యాది వాక్యములలో, వేశ్యమాతపాత్రలో స్త్రీ చిత్తవృత్తుల చిత్రీకరణముద్వారా *మనస్తత్వ పరిశీలనా పరిజ్ఞానము* వ్యక్తమగుచున్నవి.

"పొసగెడు రసములఁ బోసి శోధించి రసపంచకమును బరము లెన్మిది యునుభాసిల్లి ధృతిబీజ పక్వరత్నముల గ్రాసంబులొసఁగి సాంగంబు గావించి పదియు నెన్మిదియునై పరగుసంస్కృతులఁ బదిలంబుగాఁగ నీ పగిది నొనర్చ" (ప. యో. వి. 85) అను వాక్యములలో *లోహమును* కుందనము చేయు పరుసవేదిని తయారుచేయు తీరు వివరించుటను బట్టి చిన్నన్న *రసాయనశాస్త్ర పాండిత్యము* బహిర్గతమగుచున్నది.

***బహు భాషా పాండిత్యము :*** చిన్నన్న సంస్కృత భాషా పాండిత్యమునకు సంస్కృత హరివంశాంధ్రీకరణమైన ఉషా కళ్యాణము, తమిళభాషా పాండితికి ద్రవిడప్రబంధాంధ్రీకరణమైన పరమయోగి విలాసములే ప్రబలోదాహరణములు. కారణము మూల గ్రంథములందు పాండిత్యములేవిదే అనువదించుట సాధ్యము కాదుగనుక. "వర్షార్థమష్టౌ...." వంటి పెక్కు సంస్కృత శ్లోకములు ద్విపదలలో యథాతథముగ ఉటంకించబడినవి. పాషాణ తృణజదప్రాయమైన ఎట్టి పరభాషయైనను నిజ

స్వరూపముతో చిన్నన్న ద్విపద యందొదిగి చెన్నొందినది. ఉదాహరణము నకు అష్టమహిషీ కళ్యాణమునందు శ్రీకృష్ణుడు రుక్మిణిని తీసికొని వచ్చుట కేగుచుండ, వివిధ దేశముల వీరభటులు తమ తమ భాషలలో కృష్ణుని స్తుతించిన తీరు పరికింపుడు- (పు. 191).

"బార్తై యలో తమ్మబందను కృష్ణ
తారొయా హరిగె సాధనమాడ బేకు"....(కన్నడము)
"అయిత్త మాపు వందలి మున్ని బన్ని
అయుధం గొండు నియంగెవాయసుచు.... (తమిళము)
"అసా అడె అగె హరి జగన్నాథ
దాసు హేబలు ఖండదారురే యటంచు...." (కాళింగము)

పై ద్విపదలలో చిన్నన్న బహు భాషా పాండిత్యము సువ్యక్తము.

***యోగశాస్త్ర పాండిత్యము*** : పరమయోగి విలాసమున చూపిన చిన్నన్న యోగశాస్త్ర పాండిత్యము ఎంతటి వారినైన ఆశ్చర్య సముద్రమున ముంచి వేయును. భక్తిసారయోగి చరిత్రలోని ఈ క్రింది ద్విపదలను చిత్తగింపుడు.

— "యమనియమ ప్రముఖాష్టాంగ పూర్తులమరంగ విహిత పద్మాస
మ్ముండగుచు
భాతిగా నస్తి కపాలభాతియును ధౌతినీతియు నౌళితాటనంబనఁగఁ
బొలుపొందు షట్కర్మముల నాచరించి సలలితోడ్డీయాణ జాలంధరములు
మొదలైన దశమహాముద్ర లంజక్కఁగదియించి యిడయుఁబింగళయు
సుషుమ్న
యాపూరణము మొదలై యెన్నఁదగిన లోపదునాల్గు నాళుల వివేకించి
శీతల భ్రమరి భస్త్రిక మూర్ఛ కేవలాతత రవి భేదనాది నామములు
గల యష్టవిధ కుంభకముల నేర్పుమిచి కలకేవలపు కుంభకమునఁ
గుంభించి

లీలమై నాసనలింగ హృన్నాభి తాలుమూలల లాట తలములయందు
నాధారమణి పూరకాది నామముల సాధారణంబులై సరవిఁదేర్కొనఁగఁ
బదిలమై నాల్గాఱు పది పది రెండు పదియాఱు రెండునై పరఁగుపత్రముల
ననువొందు చుండెడు నారు దామరల ననిలుని చేతనొయ్యన మేలుకొలిపి
నాభిపంకజము క్రిందటను ముమ్మూల శోభిల్లు బాహ్యంద శోభితంబైన
గంభీరనాళికా కందంబులోనఁ గుంభించి వాయువుఁగొని దానిచేత
నాధార కమలమధ్య త్రికోణాంతరాధీన రేఫాక్షరాంతర వహ్ని
వెలుఁగొందఁ జేసి పర్విన గాలితోడ మిళితంబుచేసి యెన్మిదివదనములఁ
బలువుగా నాక్రింది పశ్చిమనాళి తలక్రిందుగాఁజుట్టి తలకని ఘజగి
వదనగహ్వరము చువ్వనదాఁదఁజేసి చెదరని కడఁకఁ బశ్చిమనాళిఁజొనిపి
వెనకఁ జొప్పడు నేకవింశతిమణుల బెనఁగొని సంతతాభేద్యమై తనరి
జలజాసనేశ కంజదళాక్ష నామములు గల్గి పత్రంబు మురువున నున్న
యామీఁది గ్రంధిత్రయంబు భేదించి యామీఁది యూర్ధ్వ
ముఖాంబుజాతంబు
తలక్రిందు సేసి యందలి సుధారసము నలరెడు హృదయ
తోయజములో నించి
మండిత యోగసామ్రాజ్య సౌభాగ్య మందసుందగుచు...."

(ప. యో. వి. ద్వి. అ. పు. 72, 73, 74)

ఇందు అహింసా సత్య మస్తేయ బ్రహ్మచర్యా పరిగ్రహములను యమములు, శరీరక శౌచలక్షణమలైన స్నాన ఆహార నిద్రాది నియమములు, పద్మాసనము, అస్తి (ఎముకలు) కపాలభాతి (పుర్రెల) శోధనము, వస్త్రమును లోనికి పంపి శుభ్రము చేసి మరల బయటకు తెచ్చు ధౌతినీతి పద్ధతి, పొట్టను కదలించు నౌళి తాటనము, మొ॥గు షట్కర్మములు (యమ, నియమ, అసన, అస్తికపాలభాతి, ధౌతినీతి, నౌళితాటనములు); ఉడ్డీయాణము, జాలంధరాది దశమహాముద్రలు, ఇడ పింగళ సుషుమ్నాది 14 నాడులు; శీతల భ్రమరి భస్త్రిక మూర్ఛ కేవలాతత రవిభేదనాది నామములుగల అష్ట

విధకుంభకములు (గాలి విడచుట, నిలుపుట, పూరించుటలు – రేచక కుంభక పూరకములు), మూలాధార, స్వాధిష్టాన, అనాహత, మణిపూర, విశుద్ధ ఆజ్ఞాచక్రములను (ఆరుదామరలు) ప్రస్తావించి, వానిని అనిలునిచే మేలు కొలిపి అనగా ప్రాణాయామము ద్వారా కుండలినీ శక్తిని ఉద్బోధించి షట్చక్ర వికాసము కలిగించి గ్రంధిత్రయమును (బ్రహ్మ విష్ణు శివగ్రంధులు) భేదించి హృదయ సుధారసము నందించు యోగానంద రహస్యములను చిన్నన్న విపులీకరించినాడు. విశేష రహస్యములు యోగశాస్త్ర గురుని ముఖతః నేర్వదగినట్టివి. చిన్నన్న అందించిన ఈ యోగవిజ్ఞానము అసాధారణమై అసలు చిన్నన్న కవియా లేక యోగియా అను సందేహములో పాఠకుని పడవేయును.

"చిన్నన్నను కవిగా మాత్రమే యితరులు పొగడుట ప్రాధాన్యవ్యపదేశమంతే. అతడు యోగియని ఎవరును పేర్కొనినట్లు కానరాదు....ఇంక నేయే విద్యలలో ఎంతెంత అతని ప్రతిభ ప్రవహించెనో మనకేమి యెఱుక?" అనుచు చిన్నన్న శాస్త్రవైదుష్యమునకు అబ్బురపడినారు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు (శృంగార సంకీర్తనములు సం. 19 పు. 4)

ఇంకను చిన్నన్న కృతులలోని భారత భాగవత రామాయణాది ప్రాచీన కావ్య పరిజ్ఞానము, ఉభయవేదాంత, ఉభయమీమాంసాది శాస్త్రపాండిత్యము, వైష్ణవమత సంప్రదాయ గ్రంథపాండిత్యములు పాఠకునకు ఆశ్చర్యానందములు కలిగించితీరును.

చిన్నన్న *లోకజ్ఞత – సామాజిక స్పృహ :* చిన్నన్న ఎంతటి కవి, యోగి అయినను, లోకజ్ఞానము, వ్యవహార దక్షత, సమాజావగాహన లేనివాడు మాత్రము కాదు. ఇతని కవిత్వము, వేదాంతము నేల విడిచిన సాము కాదు. అతని లోకానుభవము చాల గొప్పది. సాహిత్యము సమకాలీన సామాజిక జీవిత దర్పణమనుటకు చిన్నన్న కావ్యముల నుదాహరణముగ పేర్కొనవచ్చును. అతడు తన కాలము నాటి ప్రజల వృత్తులు,

ప్రవృత్తులు, వివిధ వర్ణముల వారి వేష భాషలు, ఆచార వ్యవహారములు, సంప్రదాయములు, సంగీత చిత్రలేఖన కవిత్వాది కళలయందు వారి అభిరుచులు, ఆహార విహారములు, భక్ష్య భోజ్యములు, అలంకరణములు, వారుపయోగించు ఆయుధ విశేషములు, వాద్య విశేషములు, పరిశ్రమలు, దొంగతనములు, శిక్షలు, న్యాయ వ్యవస్థ, వివాహవ్యవస్థ మొదలగు అనేకాంశములు పరమయోగి విలాసమున కన్నులకు గట్టినట్లు చిత్రించినాడు. అంతే కాదు, సోల, తూము, ఇరుస, మానికె వంటి ధాన్యపు కొలతలు (పు.480); ఓడ రేవులలో జరుగు విదేశీ వర్తక వ్యాపారములు, బేరములు మొ.వి. (పు. 486, 488) పేర్కొనినాడు. కంసలి, కమ్మరి, కంచరి, కాసె, వడ్ల వారి వృత్తులను ప్రస్తావించినాడు. రెడ్లు, కాసె కులమువారు, కరణములు, మేదరి, భోగము స్త్రీలు మొ.గు. వివిధ వర్ణములవారి వేషభాలను వర్ణించెను. వైద్యులు, పరదేశముల సెట్ల వేషములు, చోరుల లక్షణములు (పు. 503, 526), విచారణలు, దొంగలకు వేయు శిక్షలు దెలిపి న్యాయవ్యవస్థను వివరించెను, (పు. 324, 340) నాటి సమాజమున ధనవంతులెట్టి దుస్తులు ఆభరణములు ధరించిరో (రెడ్ల వర్ణన) దాసి పనివారెట్టి వస్త్రాభరణములు దాల్చిరో (దాసివర్ణన) భోగము స్త్రీలెట్లలంకరించుకొనిరో, (దేవదేవి వర్ణన) ద్రవిడాంగనలెట్లుందురో మొ. గు. అనేకాంశములతోగూడిన నాటి సమాజమును పరమయోగి విలాసమున మన కనులముందు బెట్టినాడు చిన్నన్న. అష్టమహిషీ కళ్యాణ, ఉషా కళ్యాణములందు సాంప్రదాయకమైన వివాహ వ్యవస్థను, వివాహములలో నాటి దేశీయాచారములను ప్రతిబింబింప జేసినాడు. రుక్మిణీ కళ్యాణమున గర్గ్యుడు చూచిన 'గడియారము' చిన్నన్న కాలము నాటిదే.

"చిన్నన్న పరమ యోగి విలాసము నాటి సాంఘిక చరిత్ర నిర్మాణమునకు సాహాయ్య మొనరించు మిక్కిలి విలువగల కావ్యము." అని శ్రీ ఆర్వీయస్ సుందరంగారును, మన సాంఘిక చరిత్ర కిది చాల పనికివ

చ్చును. ఈ దృష్టితో వసుచరిత్ర, మనుచరిత్రాది బహుప్రబంధముల కన్న విది చాలమేలైనది" అని ఆంధ్రుల సాంఘిక చరిత్ర గ్రంథమున (పు 276) శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారును చెప్పిరి. పరమయోగి విలాసము నందలి సామాజిక జీవిత చిత్రణమును గురించి డా॥ ఏ. విద్యావతిగారు 'తాళ్ళపాక కవుల సాహిత్య సేవ' గ్రంథమున విపులముగ వివరించిరి. (పు. 211-227) ఇట మరల వ్రాయుట చర్విత చరణమే కాగలదు.

చిన్నన్న వ్యవహార దక్షత ఎట్టిదో పద్మసాలెలు చిన్నన్నకు వ్రాయించి యిచ్చిన తామ్రశాసనమును పరికించినచో తెలియగలదు* చిన్నన్న ఔదార్యము, దానశీలమతని ధర్మకైంకర్యములనుబట్టి తెలిసికొనవచ్చును. అతడొక కవిగ, బహుశాస్త్రపాండిత్యము గలవాడుగ, బహు భాషావేత్తగ, మనస్తత్వ పరిశీలకుడు, లోకజ్ఞుడు, వ్యవహారదక్షుడు, ఉదారుడు, దానశీలుడు, యోగి, భక్తుడు, ఆత్మజ్ఞాని, వైష్ణవమతాభిమాని, సంప్రదాయజ్ఞుడు, తాత్త్వికుడుగ అతని కావ్యములు, శాసనములనుబట్టి మనకు తెలియుచున్నది. చిన్నన్న విద్వత్కుటుంబమున జన్మించుట చేతను, అతని తాత తండ్రులు, బంధువులు మంచి కవులు పండితులు దాతలగుటచేతను, వారి వ్యక్తిత్వ ప్రభావము గూడ చిన్నన్నపై ప్రసరించి అసాధారణరీతిలో చిన్నన్న మూర్తిత్వమును సుసంపన్నము గావించి యుండవచ్చును. వీనితో బాటు చిన్నన్నకు దైవానుగ్రహము గలదు. లేనిచో ఒక్కనిలో ఇంతటి ప్రతిభా గుణములు దీపించుట అరుదు.

అనంతర ప్రకరణమున చిన్నన్న ఆధ్యాత్మిక దృక్పథమును పరిశీలింతము.

* తామ్రశాసనపు ఛాయాచిత్రములు అనుబంధప్రకరణమున చూడుడు.

# 7. చిన్నన్న ఆధ్యాత్మిక దృక్పథము

భారతదేశమునందనేక మతములు గలవు. అవి వైదికమతములు, అవైదికమతములని రెండు తెఱగులు ఇందు లోకాయతుడు, ఆర్హతుడు, బౌద్ధుడు, నైయాయికుడు, పాశుపతుడు, సాంఖ్యుడు అనువారు అవైదిక మతస్థులు అనగా వేదప్రామాణ్యము నంగీకరింపని వేదబాహ్యులు. భాట్ట ప్రభాకర, భాస్కర, యాదవ, ఏకాయనాది ద్వైతాద్వైత విశిష్టాద్వైతులు వైదిక మతస్థులు. వేదప్రామాణ్యమును వీరు అంగీకరించిరి. ఇందంతర్గత భేదములతో నున్న సిద్ధాంతములన్నింటి కంటె భిన్నమై విశిష్టమైనది విశిష్టాద్వైత సిద్ధాంతము.

***విశిష్టాద్వైతము :*** అద్వైతము జీవబ్రహ్మలకు ఐక్యము చెప్పుచుండ విశిష్టాద్వైతము భేదము చెప్పుచున్నది. జీవజగత్తులు బ్రహ్మాంశలను విషయమున ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతములు మూడును విభేదించినవి. "విశిష్టాద్వైత మతానుసారము జీవజగములు బ్రహ్మకు దేహము. బ్రహ్మదేహి — జీవుడు దేహము; బ్రహ్మదేహి—జగత్తు దేహము. దేహి దేహమట్లు జీవుడు బ్రహ్మాంశ. బ్రహ్మను దేహవిశిష్టుడనుట వలననే యిది విశిష్టాద్వైతము. భగవద్రామానుజులు జీవ - బ్రహ్మలకు దేహదేహి (శరీర శరీరి) సంబంధ మంగీకరించెను" అని 'అనుశ్రుత వైజ్ఞానిక' బ్రహ్మశ్రీ చల్లా కృష్ణమూర్తిశాస్త్రిగారు తమ వేదాంతమత సమీక్ష (పు.14-ప్రచురణ 1954) గ్రంథములో వివరించిరి.

విశిష్టాద్వైత సిద్ధాంతములో తత్త్వములు మూడు. చిత్ - అచిత్ - ఈశ్వరుడు. "భోక్తా భోగ్యం ప్రేరితారంచ మత్వా" అని శ్రుతి. ఇందు భోక్తా - చిత్ అనగా జీవుడు. భోగ్యమనగా అతనిచే అనుభవింపబడు 'అచిత్' అనగా ప్రకృతి. ప్రేరిత అనగా ఈశ్వరుడు. బ్రహ్మతత్త్వమును విచారించినచో జీవ - ప్రకృతుల స్వరూపము భిన్నముగ కనబడుచున్నది. కావుననే చిత్ - అచిత్ విశిష్టమైన తత్త్వము ఒక్కటియే అని సిద్ధాన్తము.

ఇందు 'చిత్' అనబడు జీవుడు నిత్యుడై, అణువై, జ్ఞానానంద లక్షణుడై, జ్ఞానగుణకుడై, ఏకరూపకుడై, శేషభూతుడై యున్నాడు. స్వభావముచే జ్ఞానానంద లక్షణుడైన జీవుడు కర్మవశమున ఏర్పడిన యీ ఉపాధిని (శరీరము) ఆశ్రయించుటనుబట్టి స్వస్వరూప జ్ఞానమును పోగొట్టుకొనియున్నాడు. ఆచార్యకృపచే మరల అర్థపంచక జ్ఞానమును పొందుచున్నాడు. 'అచిత్' అనునది గుణత్రయాత్మకమై, నిత్యమై, విభువై పరిణామమును పొందునదై యున్నది. ఇట్టి ప్రకృతి యందు భోగ్యతాబుద్ధి యుంచుట వలననే జీవునకు సంసారమేర్పడుచున్నది. ఈ బంధనమును విడిపించుకొనదలచిన జీవుడు "సంసార బంధస్థితి మోక్ష హేతుః" అని భగవంతు నాశ్రయింప వలసి యున్నది..'ఈశ్వరుడు' శ్రియఃపతియై, సమస్త కళ్యాణ గుణాత్మకుడై, అవాప్త సమస్తకాముడై, విభువై, చేతనాచేతనములు శరీరముగ గలవాడై వానిచే ఆశ్రయింపబడినవాడై యున్నాడు. అట్టి భగవదవతారములు పర-వ్యూహ-విభవ-అంతర్యామి - అర్చావతారములని 5 విధములు.

శ్రీవైకుంఠములో దివ్య మహిషీ పరిజన పరికారికా భక్త భాగవత సహితుడై యుండునది పరము. క్షీరసాగర శాయియై సృష్టిస్థితి కారణ నిర్వహణకై సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధాత్మకమైన మూర్తిత్రయాత్మకుడై యుండునది వ్యూహము. రామ కృష్ణాద్యవతారములు విభవావతారములు. సకల జీవ హృదయాంత రాళముల అంతర్యామిగ నుండునది అంతర్యామి. దేవాలయములలో శిలారూపమున వేంచేసియుండునది అర్చారూపము. ఇట్టి అర్చారూపమైన సర్వేశ్వరుని యందే 'ఈరు' పడి యున్న అనగా అనుభవమును పొందియున్న ఆళ్వారులు గానము చేసిన పాశురములు శ్రీమన్నారాయణుని అర్చావతార వైభవమునే కీర్తించినవి. విశిష్టాద్వైత దర్శనము నందు ఆళ్వారుల స్థానము ప్రముఖమైనది.

"కంటు లేనట్టి లక్ష్మణగురు మతము వంటి సన్మతము" లేదని అన్నమాచార్య చరిత్రలో చెప్పటను బట్టి చిన్నన్న రామానుజమతమైన

విశిష్టాద్వైతము ననుసరించెననుట స్పష్టము. ఇందుల కతడు ఆళ్వారుల చరిత్రలను పరమయోగి విలాసము పేర ఆంధ్రీకరించుటయే నిదర్శనము. ఆధ్యాత్మికముగ నితడు విశిష్టాద్వైత సంప్రదాయ దృక్పథము గలవాడు. ఇతనికి వేంకటేశ్వరుడే దైవము, అన్నమాచార్యుడే గురువు. వైష్ణవమత ప్రచారమునకే చిన్నన్న విష్ణు కథా సంబంధములైన కృష్ణలీలను దెల్పుటకు అష్టమహిషీ కళ్యాణమును, శైవ వైష్ణవ యుద్ధమున వైష్ణవ విజయమును స్థాపించుటకు ఉషా కళ్యాణమును, ద్రవిడ ప్రబంధమే అనదగిన పరమ యోగి విలాసమును రచించినట్లు తోచును. చిన్నన్న మనస్సంతయు విష్ణు మయమే. భావనలు, ఉపమానములు వైష్ణవములే. భక్తి ప్రపత్తులితని మార్గములే.

*భక్తి తత్త్వము :* "భక్త్యా వినా బ్రహ్మజ్ఞానం కదాఽపి నజాయతే; సర్వోపాయాన్ పరిత్యజ్య భక్తిమాశ్రయ; భక్తినిష్ఠో భవభక్త్యా సర్వే సిద్ధయః సిద్ధ్యంతి, భక్త్యా అసాధ్యం న కించిదస్తి" అని భక్తిమార్గ వైశిష్ట్యము నారాయణోపనిషత్తు నందు చెప్పబడినది. తాళ్ళపాక చిన్నన్న పోతన వలె భక్తిరస వైభవము ననుభవించి, భక్తి ప్రపత్తి మార్గముల ననుసరించెను.

"దేవ నేనేమి ప్రార్థించెదః మున్న
యీవ యీఁగల వెల్ల నిచ్చితి వరయ....
గావ నీపద భక్తిగల వారి మీఁద
నీమీద ననిశంబు నిశ్చల భక్తి
మామకబుద్ధి నేమఱకుండ నిమ్ము" — (ప.యో.వి.పు. 220)

అని కులశేఖరుల పాత్రముఖమున చిన్నన్న గావించిన ప్రార్థనమతని నిష్కామ వైష్ణవభక్తిని దెలుపుచున్నది. చిన్నన్న గొప్ప భక్తుడనుట కతని నాలుగు కావ్యములు భక్తి ప్రాధాన్యము గలవి అగుటయే నిదర్శనము.

భక్తి జగత్తునకు చాపుటా యెత్తిన మహాభక్తుల చరిత్రలే పరమయోగి విలాసము. అందు వైష్ణవ భక్తి తత్త్వము, అష్టమహిషీ కళ్యాణములో గోపికల మధురభక్తి, ఉషా కళ్యాణమున శ్రీకృష్ణుని శక్తి, అన్నమాచార్య చరిత్రలో అన్నమయ భక్తి, వేంకటేశ్వరుని దివ్య శక్తి నిరూపింప బడినవి. తన కావ్యములను దైవాంకితముగ అలమేలుమంగా వేంకటేశ్వరులకు సమర్పించుట యందే అతడెంతటి భక్తాగ్రేసరుడో తెలియుచున్నది. ఇష్టదైవ వర్ణనములందతని భక్తి తన్మయత్వములను దర్శింపవచ్చును. ఉదా : వేంకటేశ్వరస్వామి, అలమేలు మంగాదేవి, శ్రీకృష్ణుడు.

***వైష్ణవ మతాభిమానము - సంప్రదాయజ్ఞత :*** చిన్నన్న పారమార్థిక నిష్ఠ వైష్ణవమత సంబంధము గలది. ఇది యతనికి వంశ పారంపర్యముగ సంక్రమించిన సంపద. కనుకనే అతని రచనలన్నియు విష్ణు పారమ్య ప్రబోధకములైనవి. అసలు తనకు కవిత్వము శ్రీ వైష్ణవ పాదసంసేవనము వలననే లభించినట్లు పరమయోగి విలాసమున ప్రతి ఆశ్వాసాంత ద్విపదలలో చెప్పుకొనెను.

"సకల వైష్ణవపాద సంసేవకాబ్జ
సదనా వధూలబ్ధ సరస కవిత్వ
విదితమానస తిరువేంగళనాథ" (ప. యో. వి. 48)

శ్రీవైష్ణవమతములో భాగవత పూజ భగవంతునిపూజ కంటె అధికమని చెప్పుదురు. ఈ సిద్ధాంతమునే చిన్నన్న పరమయోగివిలాసమున కులశేఖరాళ్వారు, పరకాలయోగి, అన్నమాచార్య చరిత్రములందు నిరూపించెను. ఈ క్రింది వాక్యములు చూడుడు—

"ఆరయ హరిదాసులధికులుగాన వారలతోడ గర్వము పనిలేదు
హరిదాసులఖిల లోకైకపావనులు హరిదాసులపగతాహంకార మతులు
హరిదాసులగువారలధికుల కధిక లరయ వారలకంటె నధికులు లేరు"

"కావున హరిభక్తి గలిగినవారు భావింపఁ ద్రైలోక్యపావనాధికులు"

(పు. 128)

"హరిభక్తులలిగిన యది నివారింప హరహరబ్రహ్మాదులైన నోపుదురెః

(పు. 115)

"హరికన్న హరిభక్తులధికులే యనుట
యరయంగ నిపుడు తథ్యంబయ్యెనయ్య." (పు. 110)

"శ్రీవిహారుని నింద సేయు పాపంబు శ్రీవైష్ణవులనుతి సేసిన నుడుగు
శ్రీవైష్ణవుల నింద సేసిన దోషమే విధిఁబాయుః" (పు. 214)

"శ్రీవైష్ణవాపచారంబు నేరీతినైన మాయింపఁగా వశమేః" (పు.419)

"కమలలోచనుని కైంకర్యంబుకంటెఁ
గమలేశుభక్తు కైంకర్యంబు ఘనము" (పు. 537)

"వేసర కఱువది వేలేండ్లు భక్తి సేసేత హరిపూజ సేయుటకంటె
నొక భాగవతునకు నొకమాఱు పూజ యకలంకమతిఁజేయ
నదియమిక్కుటము" (పు. 537)

"హరిపూజకంటె శ్రీహరి భక్తపూజ పరికింప నధికమెన్నాటునన్నైన"

(పు. 560)

"ఏవెఱవునన్నైన నిసుమంత తడవు శ్రీవైష్ణవులపంచఁ జేరంగఁ గలుగు
నని యున్నవాఁడు గదా వైష్ణవుండు; పాటించి వైష్ణవులపంచ నున్నట్టి
కీటంబునులు ముక్తికిం బోవునంద్రు" (పు. 190)

"కావున నెన్నిసంగతుల భాగవతసేవ సేసినవాఁడె శ్రీవైష్ణవుండు"

(పు. 560)

"సహజవైష్ణవభక్తి సలిపెడువాని సహవాసమైన దోసములేదు"

(అ. చ. 31)

"నరహరి సంకీర్తనము సేయువారిఁ బరసమానులుగాగఁ బరికింపవలదు"

(అ. చ. పు. 41)

ఇత్యాది వాక్యముల వలన చిన్నన్న కెంతటి ప్రగాఢమైన శ్రీవైష్ణవాభిమానము గలదో గ్రహింపవచ్చును. ఎట్టివాడు వైష్ణవుడో, అతని లక్షణము లెట్టివో యిందు తెల్పుటయే కాక వైష్ణవ పద జాలముతోనే వైష్ణవ సంప్రదాయములను చెప్పును. తిరునామములు, తిరుమణి వడములు, తిరుచూర్ణములు, ధవళోర్ధ్వ పుండ్రములు, సన్నిధి, కైంకర్యము, ఆళువందారు, తిరునాళ్లు; చరమ శ్లోకము, ఉభయ విభూతులు, తళిఘ ఇత్యాది వైష్ణవపద ప్రయోగమిందుల కుదాహరణము. "వైష్ణవుని చరణాబ్జముల చక్కఁజాగిలి వ్రాలి" (ప.యో.వి.పు. 509) దాసోహమిడుట వైష్ణవ సంప్రదాయము. వర్ణనలందు, అలంకారములందు చిన్నన్న తరచుగ విష్ణుపరమైన ఉపమానములను ప్రయోగించుట గమనార్హము. వైష్ణవులు ధరించు తిరునామములను పలు రీతులలో చిన్నన్న వర్ణించిన తీరు అశ్చర్యమును కలిగించును. పరమయోగి విలాస సమీక్ష వర్ణనలలో చూడుడు. ఒక్కమాటలో చిన్నన్న వైష్ణవాభిమానము సాటిలేనిది.

**ఆధ్యాత్మిక వేత్త :** శ్రీమన్నారాయణుని తత్త్వమెరిగినవాడు చిన్నన్న. విశిష్టాద్వైతములోని శేషశేషి సంబంధమును విష్ణు చిత్తుని చరిత్రమున వివరించెను. బ్రహ్మ కర్మల స్వరూపములను విదితము గావించు వేద జాలములు, తదుపబృంహితములైన శాస్త్రములు శోధించి, సృష్టి స్థితి లయముల తత్త్వమెరిగి, సకలజీవాత్మకమగుచు, శ్రీవత్సముచే నొప్పు ఉరముగల పరమార్థమగు పరాత్పరుని భక్తి ప్రపత్తి మార్గములలో సేవించి తరించవలెనని పరమయోగి విలాస కావ్యము ద్వారా భక్తలోకమునకు చిన్నన్న అందించిన సందేశము. అసుర ప్రకృతి కలిగిన అజ్ఞానులకు ఆత్మజ్ఞానము ననుగ్రహించుటకు పరతత్త్వ భజనాను భవము కావలెననియు, ఆపరతత్త్వము శ్రీమన్నారాయణుడే అని స్పష్టముగజెప్పి తాను ఆరాధించి ప్రచారము గావించినవాడు చిన్నన్న. ఇట్టి తాత్త్విక రహస్యముల నతడు తన తాత తండ్రుల నుండి తెలిసికొని యుండవచ్చును. తానెరిగిన జీవేశ్వర తత్త్వములను తన కావ్యములలో నిక్షిప్తము గావించెను.

# చిన్నన్న కావ్యములు - తాత్త్వికత

**అష్టమహిషీ కళ్యాణము** : ఇందు శ్రీకృష్ణభగవానుడు ఎనమండుగురు స్త్రీలను వివాహమాడుట ప్రధానేతివృత్తము. నిష్కళుడగు వ్యాపక పరాత్పరుడు సకళుడై విశ్వమందు - "ఏకోఽహం బహుస్యాం .... "అను సంకల్పమును నెరవేర్చుకొనుటకు చేయు యానము (కళ-యానము) కళ్యాణమగును. ఈ విశ్వప్రకృతి 8 విధములు.

"భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధి రేవచ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా" - భగవద్గీత.

'ప్రకృతి స్త్రీ' అనుటనుబట్టి ఈ అష్టవిధ ప్రకృతులే శ్రీకృష్ణపరమాత్మని అష్టమహిషులని తాత్త్వికముగ తెలియదగును. "పురుషః పుష్కర పలాశ వన్ నిర్లేపః" అను వాక్యానుసారము పురుషుడు తామరాకుపై నీటిబిందువు వలె ప్రకృతితో గూడి యానము చేయును. ప్రకృతి పురుషుల సంయోగమే యీ మహాసృష్టి. భౌతికముగ శ్రీకృష్ణుడు అష్టమహిషులను వివాహమాడినట్లు ఐతిహాసిక కథనమైనను, ఆధాత్మికముగ కృష్ణాష్టమహిషుల కళ్యాణ రహస్యము నిట్లెరుంగవలెను.

**ఉషా కళ్యాణము** : ఇందలి కథ విచిత్రమైనది. ఏమీ లేని ఒక చిన్న విషయమునకు, దేవాసురులకు శివకేశవులకు భయంకరమైన మహా సంగ్రామము. తుదకు కయ్యము వియ్యమై నెయ్యముతో శాంతించుట. శృంగారము వలన ఆకర్షణమేమో కాని లేనిచో నిది తలనొప్పి కథయే. ఇట్టి కథలవలననే మన పురాణములందనేక సందేహములు బయలుదేరి వాని అస్తిత్వమునకే ముప్పు తెచ్చుచున్నవి. ఇట్టి సందేహములకు సమాధానము లిట్లు చెప్పుకొనవలయున్నది.

బాణుడు జన్మచే అసురుడు. దైవాసుర సంగ్రామములు సహజసిద్ధములు. జనన మరణ చక్రమునకు దైవాసుర భావములే కారణము. వీని ద్వారా

భగవంతుడు విచిత్రమైన జగన్నాటకము నాడించుచున్నాడు. శివుడు అసురులకు వరము లిచ్చును. అవసరమగుచో వారికి కావలి యుండి రక్షించును. ఎంతటి అసురులైనను ఈశ్వరానుగ్రహపాత్రులు కాగలరనుటకు బాణాసుర. రావణాసురుల పాత్రలే నిదర్శనము. వీరు మహా శక్తులను సంపాదించి దుష్ప్రవృత్తులై కలినాత్ములై కొందరి జీవితములనెట్లు బలితీసుకొనిరో వారి యుద్ధములచే నిరూపింపబడెను. అంతర్గతమైన మానసిక సంఘర్షణలను నిరూపించి భగవత్తత్త్వమును. విశ్వతత్త్వమును తెలుపునట్టివిగ పురాణకథలుండునని పండిత శ్రీ కె. వాసుదేవశాస్త్రిగారు రంగాజమ్మ రచించిన ఉషా కళ్యాణ పీఠికలో చెలిపిరి. ఉషాకళ్యాణ తత్త్వమును పరిశీలింతము.

జ్ఞానప్రకాశము, ఆత్మవికాసము గలది సురము. ప్రకాశము లేనిది అసురము (న + సురము). జ్ఞానములేదు కనుక ఇది తమోగుణప్రధానము. మొదటిది సూర్యసంబంధి, రెండవది వారుణము. వారుణ ప్రధానమైనది శరీరము. ఇందు ప్రవేశించు ఆత్మ — "సూర్య ఆత్మ" అను శ్రుతిననుసరించి సూర్యసంబంధము గలది. ఈ శరీరాత్మలు కలసి ఒకచోటనే కాపురము చేయవలెను. విడిపోయిన పోయినట్లే. శరీరమును వైదికపరిభాషలో వాక్ (matter) అందురు. బాణము — వాణము — వాక్. ఈ వాగ్బాణము వలననే ఆత్మ తన లక్ష్యమును సాధించును. సూర్యకిరణమువలె ఈ ఆత్మ తత్త్వమునకు రుంధనము (అడ్డు) లేదు. అనిరుద్ధమైన (అడ్డగింపబడని) తత్త్వము గలవాడే అనిరుద్ధుడు. ఆత్లెవరైన అడ్డుపడినచో భగవంతుడే స్వయముగ వచ్చియైన ఆ అడ్డు తొలగించును.

ఇక శరీరదృష్టి కలిగిన బాణుడు జ్ఞానహీనుడై, అనిరుద్ధుని అడ్డగించినాడు. అంతేకాదు నాగపాశములతో (కామనా వాసనా సంస్కారములను మహాశక్తితో అనిరుద్ధుని) బంధించినాడు. ఇతడెంతటి మూర్ఖుడో ఉషాకళ్యాణ సమీక్ష యందితనిపాత్ర చిత్రణమున నిరూపింపబడెను. వాక్తత్త్వ రతత్త్వ) ప్రధానుడు బాణుడు. అసురమైన శరీరము 'పాంచ భౌతిక'

మైనది కనుక 'భూతపతి' శివుడు బాణాసురునకు వరములిచ్చి రక్షించుచుండెను. ఆత్మదృష్టిలేని బాణుని శివుడు హెచ్చరించినను వినక భూతపతి వరములను దుర్వినియోగపరచి ముప్పు కొనితెచ్చుకొనెను. ఉషానిరుద్ధుల కళ్యాణమున కితడు కల్పించిన అడ్డును కృష్ణుడు తొలగించెను.

బాణుని కుమార్తె ఉష. 'ఉ'=ప్రాణవాచకము; 'ష'=కూడినది-ఉష. అనగా ఈమె ప్రాణ సంబంధమైన తత్త్వము. ప్రాణాత్మలు కలసి యుండవలెను గనుక ఉష అనిరుద్ధుని వరించినది. "ఉషస్తాపే" అను నిర్వచనమునుబట్టి తాపము ప్రాణమునకు సంబంధించినదే. ప్రాణము యొక్క తపనయే ఉష. ఈ తపన అంతయు ఆత్మను పొందుటకే. ఉషానిరుద్ధుల పరిణయముతో అది నెరవేరినది. ఇదంతయు పరమేశ్వరునకు తెలియును గనుకనే మొదటనే బాణుని మందలించి- "నిను గెల్చు నను గెల్చు విభిలంబు గెల్చు మనుతోడ కయ్యంబు కలుగు" అని హెచ్చరించినాడు. దైవాసుర యుద్ధములు తాత్త్వికముగ అంతస్స్ంఘర్షణములే. మన పౌరాణికేతివృత్తము లిట్టి తత్త్వ రహస్యములంతర్వాహినిగ వెలసినట్టివి కనుక దేహదృష్టితో సందేహములు కలిగినపుడు అంతర్దృష్టితో వానిని 'లోనారసి' అర్థము చేసికొనవలసి యున్నది.

***పరమయోగి విలాసము :*** "యోగశ్చిత్తవృత్తి నిరోధకః" అని యోగ శబ్ద నిర్వచనము, చిత్తవృత్తులను నిరోధించి బ్రహ్మానందానుభూతిని పొందువాడు యోగి. విశిష్టార్థసూచకమైన 'పరమ' శబ్దము బ్రహ్మను దెలుపును. ఈ బ్రహ్మ క్షర-అక్షర-అవ్యయ భేదమున మూడు విధములు. క్షరబ్రహ్మకు విశేషణము లేదు. "క్షర స్సర్వాణి భూతాని" అని గీత. అక్షరుడు పరమ బ్రహ్మ- "అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మ ముచ్యతే" (గీత). అవ్యయుడు పరబ్రహ్మ- "పర అభివ్యాప్తౌ" అను నిర్వచనమును బట్టి క్షరాక్షరులను అభివ్యాపించి యుండువాడు. ఇతడు పరముకు కంటె పరుడు. దేహము-జీవుడు-ఈశ్వరుడు కూడియుండుటయే

విశిష్టము. జీవేశ్వరులకు దేహదేహి సంబంధము. జీవుడు భక్తుడు. అనగా భగవంతునిలో భాగము (అంశ). భక్తి అనగా భాగమనియే అర్థము. కావున ఆళ్వారులందరును భగవంతుని అంశలతో అవతరించినవారే. జ్ఞాన కర్మల ఏకీకరణమే భక్తి అని బ్రహ్మశ్రీ చల్లా కృష్ణమూర్తిశాస్త్రిగారు తమ వైజ్ఞానిక శాస్త్ర గ్రంథములందు తెల్పిరి. భక్తులై జ్ఞానులై భగవంతుని దర్శించి తద్గుణానుభవమున నోలలాడినవారే ఆళ్వారులు భక్తి ప్రధానమైన విశిష్టాద్వైత దర్శనమునకు వీరే మూల స్తంభములు. జ్ఞానమార్గమున కర్మను 'ఆచరించినవారు' కాన వీరు 'ఆచార్యు'లైరి. వీరు దివ్యజ్ఞాన సంపన్నులైనను వీరిదృష్టిలో భక్తియోగమే యోగము. "తస్మాత్ యోగీ భవార్జున" అని గీతలో జ్ఞానముకన్న భక్తియే గొప్పదని చెప్పబడినది. ఈ యోగులు భక్తికే అధిక ప్రాధాన్యము నిచ్చిరి. భక్తి ప్రధానముగా గల విశిష్టాద్వైతమునకు రామానుజులు ప్రచారమును కల్పించిరి. ఈ మహాత్ముల చరిత్రలే పరమ యోగి విలాసము. ఈ గ్రంథత్రయ మౌలిక తత్త్వ రహస్యము లెరిగినచో ఆధ్యాత్మికముగ తరింపవచ్చును.

ఇట్టి మహోత్కృష్టములైన ఇతివృత్తములు గల కావ్యములను సంతరించిన చిన్నన్న ధన్యుడు. భగవత్సంకీర్తనము భక్తి లక్షణము. కనుక కీర్తనానుకూలమై, గానయోగ్యమైన ద్విపద ఛందము నితడెంచుకొనుట సమంజసముగ నున్నది. భక్తిమార్గమువలె ద్విపద సామాన్యుల కందుబాటు నందుండు ఛందము కనుక తన భగవత్సంకీర్తనోద్దేశమును కవి ఈ ఛందము ద్వారా సాధించినాడు. ఇతని ద్విపద ఐహికాముష్మికములను సాధించినది. ఇది చిన్నన్న ద్విపద నెన్నుకొనుటలో గల ప్రయోజనము.

ఇక చివరిగ తెలుగు ద్విపద కవులలో చిన్నన్న స్థానమెట్టిదో పరిశీలింతము.

—o—

# 8. తెలుగుద్విపదకవులలో చిన్నన్న స్థానము

**ద్విపద చ్ఛందస్సు - పుట్టుపూర్వోత్తరములు :** ద్విపద రెండు పాదములు గల ఒక ప్రత్యేక ఛందము. దీనికి ప్రతిపాదమున మూడింద్ర గణములు, ఒకసూర్య గణముండవలెను. మూడవ గణము మొదటి అక్షరము యతిమైత్రి స్థానము. ప్రాసనియమము గలదు. ప్రాస నియమములేని ద్విపదను మంజరీ ద్విపద అందురు. తెలుగు పద్యకావ్యము లందు మధ్య మధ్య ఒక్కొక్క ద్విపద పద్యమును వ్రాయు సంప్రదాయ మును తెలుగు కవులు పాటించి యుండలేదు. కాని కొందరు కవులు ప్రత్యే కముగ ద్విపద కావ్యములనే సృష్టించియుండిరి. అయినను ద్విపద యెప్పుడు ప్రారంభమైనదో ఖచ్చితముగ చెప్పుట కష్టమే.

ఆ ద్విపద పుట్టుపూర్వోత్తరములు, స్వరూప స్వభావములు, తొట్ట తొలుత తమ ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రమున ప్రాచార్యులు డా॥ శ్రీ యస్వీ జోగారావుగారు ఆవిష్కరించిరి. అదే అనంతర తెలుగు ద్విపద వాఙ్మయ పరిశోధకులు పలువురకు మార్గదర్శకమైనది. ద్విపద అత్యంత ప్రాచీనమైన ఛందస్సు అనియు, దేశిచ్ఛందము కాదనియు కొందరు పండితులు అభిప్రాయపడిరి. ద్విపద శబ్దమును వేదములందును, ప్రాకృత నిఘంటువులందును చూపి అది సంస్కృత ప్రాకృత భాషల నుండి తెలుగు నకు వచ్చినదని ద్విపద పరిశోధకులు పేర్కొనిరి.

డా॥ శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు ద్విపద చ్ఛందస్సునకున్న దేశితత్వము నిట్లు ఖండించిరి. "మనవారనుకొనునట్లు ద్విపద దేశిచ్ఛందము గాదు. అది ప్రాకృతము నుండి యెరవు తెచ్చుకొన్నది. ద్విపదికయే ద్విపదయైనది". (దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము. పు. 87) దీనిని డా॥ జి. నాగయ్యగారిట్లు ఖండించిరి. "ఈ అభిప్రాయము సమంజసమైనది కాదు. సంగీత రత్నాకరమున శుద్ధ ద్విపదికకు చెప్పబడిన లక్షణమిది.

"పాదేభః పంచ భాగోన్తే జౌప్తౌః షష్ఠ ద్వితీయకౌ
చతుర్భిరీదృశైః పాదైః శుద్ధాద్విపదికోచ్యతే"
- సంగీతరత్నాకరము - 4వ అధ్యాయము - 114 సూ.

శుద్ధ ద్విపదికకు నాల్గు పాదములుండును. ప్రతిపాదము నందును మొదట 6 మాత్రల గణము ('భగ' లేక 'మ' గణములు) 5 భగణములు. అంత మందు గురువు, నడుమ రెండవ, ఆరవ గణములు జగణములు కల్గియుం డును. అనగా శుద్ధ ద్విపదిక ప్రతిపాదమునందు.

(1) (2)(3)(4)(5)(6)(7)(8)(9)
6 మాత్రల గణము, జ, భ, భ, భ, జ, భ, భ, గ-గణములు గలవు. శుద్ధ ద్విపదిక యొక్క పాదమున చాల గణము లుండుటయు, అందును జ గణమునకు ప్రసక్తి యుండుటయు, అంత్యమున గురువుండు టయు - కారణములుగ తెలుగు ద్విపదకు దీనికి చాల భేదము కలదు. నాల్గు పాదములుగల ద్విపదిక నుండి రెండు పాదములుగల ద్విపద పుట్టినదనుట ఛందస్సంప్రదాయ విరుద్ధము." (ద్విపద వాఙ్మయము - పు. 28,29).

ఏ సాహిత్యము నందైనను పద కవిత్వమే పద్య కవిత్వముకంటె ముందు పుట్టును. ఈ దృష్టితో ద్విపద ప్రాచీనమైన దేశీయచ్ఛందస్సు అన వచ్చును. ప్రాఙ్నన్నయ యుగమున లభించిన మొట్టమొదటి పద్యమయ శాసనము పండరంగని అద్దంకి శాసనము. ఇది క్రీ. శ. 848 నాటిది. ఇందు తరువోజ పద్యము గలదు. ద్విపద పాదమును రెట్టింపు చేసినచో ఒక తరు వోజ పాదమగును. అట్లయిన తరువోజ నుండియే ద్విపద పాదములు పుట్టె ననవచ్చును గదా అనినచో చిన్నచిన్న పాదములే ప్రారంభదశలో నుండి క్రమముగ పెద్దపాదము లేర్పడుట మన సాహిత్య సంప్రదాయము. కనుక ద్విపద నుండియే తరువోజ యేర్పడినదని చెప్పవచ్చును. నన్నయ తన భారతమున ద్విపద వాడలేదు గాని, తరువోజ వృత్తమును వాడెను.

అసలు "తెలుగు కవిత ఏకపదమై, ద్విపదమై, త్రిపదమై, చతుష్పదమై పరిణతి చెందునట్లు కావచ్చుచున్నదని"ని శ్రీనిడుదవోలు వెంకట్రావుగారు తమ ఉదాహరణ వాఙ్మయ చరిత్ర (పు. 8)లో పేర్కొనిరి. ద్విపద తరువోజగ మారిన తరువాతనే సీస పద్యముగ పరిణామము చెంది యుండునని శ్రీ రావూరి దొరస్వామి శర్మగారు తెలుగు ఛందోవికాసము (పు. 34)లో తెలియజేసిరి. మధ్యాక్కర కూడ ద్విపద నుండి యేర్పడిన వృత్తమే. ద్విపదలోని రెండింద్ర గణములును, ఒక్క సూర్య గణమును రెట్టింపు చేసినచో ఒక మధ్యాక్కర పాద మేర్పడును. తరువోజ, మధ్యాక్కరలు తెలుగున శుద్ధ దేశీయ ఛ్ఛందస్సులు. వీని పుట్టుకకు ద్విపద మూలము కావున ద్విపద కూడ శుద్ధ దేశీయమైన ఛందస్సు. అంతేగాక ఆశు మధుర చిత్ర విస్తర భేదములతో నాలుగు విధములైన తెలుగు కవిత్వమున ద్విపద మధుర కవితా శాఖకు చెందినదని డా॥ టి. సుశీలగారు ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్రమున తెలిపిరి.

మొదట గేయ రూపములో నున్న దేశీయమైన ఈద్విపద ఛందము తెలుగు సాహిత్యమున మొట్ట మొదటిసారిగ శైవ మత ప్రచారమునకు గొప్ప వాహికయై కావ్యోపయోగి యైనది. ద్విపదలోని రెండు పాదములు కవుల భావనలో ఐహికాముష్మిక సంకేతములు. యక్ష గానములలో ద్విపద కథాకథనమునకే కాక, నంది ద్విపద (పాత్ర ప్రశంస), తెరద్విపద (పాత్ర స్వీయోదంతము) మున్నగు అనేక రూపములలో ప్రయుక్తమైనదని ఆచార్య శ్రీ యస్వీ జోగారావు గారు ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రలో (పు. 257)లో చెప్పిరి. తెలుగు సాహిత్యమున ద్విపద పటుగద్య పద్య ప్రబంధ సామ్యముగ కావ్యకళా ప్రౌఢితో అనంత వైవిధ్యముతో విరాజిల్లినది. తెలుగు వాఙ్మయమున ద్విపద కావ్య పరిణామమును శైవ వైష్ణవ ఆధునికయుగాది నాలుగు ఘట్టములుగ విభజించిరి. (చూ. ద్విపద వాఙ్మయము- డా॥ జి. నాగయ్య) వారు పేర్కొనిన ఈ నాలుగు ఘట్టము

లలో క్రీ.శ. 1160 నుండి నేటి వరకు సుమారు 245 ద్విపద కావ్యములు వెలువడినవి.

ఈ విధమైన ద్విపద కావ్యపరంపర ఎంత వెలసినను చిన్నన్న స్థానము చిన్నన్నదే. అసలు తాళ్ళపాక వారిదే ప్రఖ్యాతమైన కవి కుటుంబము. ద్విపద వాఙ్మయప్రపంచము నందును వారిదే అగ్రతాంబూలము. ఆ తాళ్ళపాక కవులలో గూడ 'చిన్నన్నకు గణనీయమైన స్థానము గలదని విమర్శకుల అభిప్రాయము. అన్నమాచార్య, పెదతిరుమలాచార్య, తిమ్మక్కల ద్విపద,మంజరీ ద్విపదలతో గూడిన కావ్య నిర్మాణములు చిన్నన్నను నిర్దుష్ట ద్విపద కవిగ తీర్చిదిద్ది యుండవచ్చును.

కాని తెలుగు ద్విపద కవులలో చిన్నన్నకెట్టి స్థానము గలదో ఇంత వరకు పరామర్శింపబడకపోవుట విచార్యము. ఆ దృష్టితో చూడవలెనన్నచో ద్విపద వాఙ్మయమునందు యుగకర్తలుగ చెప్పదగిన పాల్కురికి సోమనాథుడు, గోనబుద్ధారెడ్డి, గౌరన కవుల ద్విపద కావ్యరచనా విధానములతో చిన్నన్న కావ్యరచనా రీతులను పోల్చి పరిశీలింపవలెను. ప్రధానముగ ద్విపదచ్ఛందస్సు, కావ్యేతివృత్తము, పాత్రపోషణము, రసపోషణము, వర్ణనలు, అలంకారములు, దేశీయమైన తెలుగుభాష – పలుకుబడి అను అంశములను స్థూలముగనైన దృష్టియందుంచుకొని పరిశీలింపవలెను. ఏ కవి స్థానమును గూర్చియైనను పరామర్శించునపుడు ఆ రచనల కవిపై పూర్వ కవుల ప్రభావము, అనంతర కవులపై ఆ కవి ప్రభావము, ఆ కవి రచన లోని ప్రత్యేకత అను విషయములను దృష్టిలో నుంచుకొనవలసియున్నది. ఆ దృష్టితో తెలుగు ద్విపద కవులలో చిన్నన్న స్థానమును నిర్ణయించుట ఈ ప్రకరణోద్దేశ్యము.

**మొదట ఛందో విషయము :** "పాఠ్యేగేయేచ మధురమ్" అని చెప్పదగిన తెలుగు దేశీయ ఛందస్సు ద్విపదయే. కనుకనే పాల్కురికి సోమ

నాథుడు శైవమత ప్రచారమునకు ద్విపదనే ప్రధాన సాధనముగ ఎన్నుకొని నాడు. అంతేకాదు. వచనముకంటె నిదియే శ్రేష్ఠమైనదను అభిప్రాయమును వ్యక్తీకరించినాడు. "ఉరుతర గద్యపద్యోక్తుల కంటె సరసమై పరగిన జాను తెనుంగు చర్చింపగా సర్వసామాన్యమగుట గూర్చెద ద్విపదలు కోర్కెదై వార" అనుచు కోరికతో ద్విపద రచన గావించినాడు. ఐహికాముష్మిక హేతువు ద్విపద అని చెప్పి ఆ ఛందస్సునకు వేదతుల్య ప్రతిపత్తిని సమ కూర్చి, నాలుగు పాదములుగల వృత్తములవలె ద్విపదను దిద్దితీర్చి అనేక ద్విపద గ్రంథములను రచించి, ఆంధ్ర ద్విపద సాహిత్యమున పాల్కురికి సోమనాథుడు ఆది కవి యని చెప్పదగినంతగ పేరుపొందినాడు.

ద్విపద చ్ఛందస్సును అభిమానించు విషయములో తాళ్ళపాక చిన్నన్న కూడ సోమనాథునకు తుల్యుడనియే చెప్పవలెను. ఈ విషయమును డా॥ జి. నాగయ్య గారిట్లు పేర్కొనిరి. "అంతటి ద్విపదాభిమాని పాల్కు రికి సోమనాథుని తర్వాత చిన్నన్నయే" (ద్విపద వాఙ్మయము, పు. 88) 'ద్విపద కావ్య చరిత్రలో ద్విపద పేరును సార్థక పరచినవారు శివకవియుగ ములో పాల్కురికి సోమనాథుడు, కృష్ణరాయయుగములో తాళ్ళపాక చిన్నన్న'. పాల్కురికి సోమనాథునితో సమానముగ ద్విపద రచనాధికారము గలవాడు ఈ చిన్నన్న. ద్విపద ఛందస్సు మీద సోమనతో సదృశముగ భక్తి (Deovtion) మరియు అంకిత భావము (Dedication) గలిగినవాడు చిన్నన్న. కనుకనే "చిన్నన్న ద్విపద కెఱుగును". అను సూక్తి యేర్పడినది. ద్విపదకు చిన్నన్న ఎఱిగినాడు. అనగా నమస్కరించినాడు. 'దినములోపల వేయి ద్విపదలింపొంద చెప్పగలంతటి అంకిత భావముతో ద్విపదను పురస్కరించినాడు. అంతేకాదు ద్విపద కూడ చిన్నన్నకు ఒదిగి నది. అతడు చెప్పిన రీతి ఎన్నెన్నో ఒయ్యారములను సంతరించుకొనినది. ఎన్నో గమక వైవిధ్యములను నవరసోదంచితముగ ప్రదర్శించినది. ప్రథ మాంధ్ర ద్విపద కవిగ పేరు పొందిన పాల్కురికి సోమన తన రచనలన్ని

టిని కేవలము ద్విపదలోనే వ్రాయలేదు. రగడ సీసకందాది వృందములందు గూడ గ్రంథములను రచించెను. కాని తాళ్ళపాక చిన్నన్న అట్లు కాదు. తన కావ్యము లన్నింటిని ద్విపద ఛందస్సునందు మాత్రమే రచించెనుగాని మరొక ఛందస్సును వాడలేదు. ద్విపద వాఙ్మయ చరిత్రలో అంతటి ద్విపదాభిమానము గలవాడు ఒక్క చిన్నన్నయే.

పాల్కురికి సోమనాథుడు ద్విపదకు లక్షణము చెప్పినాడు. చిన్నన్నయు ద్విపదకు లక్షణము చెప్పినాడు. ద్విపదయందు ప్రాసయతిని వాడ వచ్చునని సోమన ఇట్లు నిర్ణయించెను- "ప్రాసమైనను యతిపై వడి యైన దేశిగాదిలిపి యాద్విప్రాస వియతి తప్పకుండగ ద్విపదలు వచియింతు" (పండితారాధ్య చరిత్రము)నని చెప్పి తన రచనలలో ప్రాసయతిని వాడెను. కాని ఇది అతనికి ముందున్న ద్విపదలక్షణ సంప్రదాయమునకు విరుద్ధమైనది. అనంతుడు ఛందోదర్పణమున ద్విపదకు ప్రాసయతిని అంగీకరించెనే కాని కవి జనాశ్రయ కావ్యాలంకార చూడామణి మొ.గు లక్షణగ్రంథములలో నిది కానరాదు. ఈ ప్రాసయతిని తాళ్ళపాక చిన్నన్న ఇట్లు నిషేధించెను-

"యతులలోపలఁబ్రాస యతి దక్క సకల
యతులు చెల్లును ప్రయోగానుసారమున". (అ.మ.క.)

చిన్నన్న తన అష్టమహిషీ కళ్యాణమునందు ద్విపద లక్షణములను సమగ్రముగ నిర్వచించి అందులకు తగిన లక్ష్యముగ కావ్యములు రచించెను. అనంతర కాలములోని ద్విపద కవులందరు చిన్నన్న చెప్పిన ద్విపద లక్షణములనే శిరసా వహించిరి.

ఇతివృత్త *కథా కథన పరముగ* చూచినచో పాల్కురికి సోమనాథుడు శైవమత గ్రంథమన దగిన బసవ పురాణ పండితారాధ్య చరిత్రలను రచించెను. అట్లే చిన్నన్నయు వైష్ణవమత ప్రీతితో అనేక భక్త్యాచార వ్యవహారములను సశాస్త్రీయముగ వెల్లడించురీతిలో వరమయోగివిలాస

మును రచించెను. కాని పాల్కురికి సోమనాథుని ద్విపద కావ్యములలో బ్రాహ్మణనింద; అన్యమత దూషణము, స్వమతోత్కర్ష ప్రస్ఫుటముగ కానవచ్చును. ఇవి ద్విపద కావ్య గౌరవమును తగ్గించునట్టి అవగుణములు. ఇట్టి లక్షణములు చిన్నన్న కృతులలో మచ్చునకైన కానరావు. రచనలో అంతటి సంయమనమును పాటించినాడు చిన్నన్న. దీనిని బట్టి చిన్నన్నకు ద్విపద కవులలో ఒక ప్రత్యేక స్థానము కలదని తెలియనగును.

పాల్కురికి సోమనాథునకు వస్తు సందర్భనములకు కావలసిన ప్రతిభ, పురాణాగమాది శాస్త్రపాండిత్యము, కవితావేశము సమృద్ధిగ గలవు. చిన్నన్నకును సోమనాథునికివలె ప్రతిభ, పాండిత్యము, శక్తి కలవు గాని సోమనాథుడు ప్రదర్శించినంత వెఱ్ఱి ఆవేశమును ప్రదర్శించలేదు. చిన్నన్న పాండిత్య ప్రతిభలు పరమయోగి విలాసమునందు వ్యక్తము కాగలవు. ఇది "పాండిత్యములో పాల్కురికి సోమనాథుని కన్న, గౌరన కన్న తక్కువదే యగును. కాని మనసాంఘిక చరిత్ర కిది చాల పనికివచ్చును" అని శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు తమ ఆంధ్రుల సాంఘిక చరిత్ర (పు. 276) లో నొక అభిప్రాయము వ్యక్తము చేసిరి. చిన్నన్న బహుముఖీన వైదుష్య మెంతటిదో 'చిన్నన్న మూర్తిమత్త్వము' అను ఆరవ ప్రకరణమువందు చూడుడు. పాండిత్యమునను చిన్నన్న సోమనతో సమానుడనియే తోచును.

సోమనాథుని వర్ణనలలోను, పాత్రల ఆవేశమును తెలియ జెప్పుటలోను తనివితీరవితన మొకటి కనిపించును. రుద్రపశుపతి శివుడు విషము మ్రింగెనని' విని యుల్కిపడి పీపు విఱిగి హాచెడితినని వేలబడిపొర్లి యక్కటా! విన్న వెఱ్ఱి చేసిరిగాక! విశ్వేశ! యెట్టి వెఱ్ఱివారైన విషము ద్రావుదురె?* అని పరితపించు రీతి పాల్కురికి సోమనాథుడు హృదయము ద్రవించునట్లు తనివితీర వర్ణించెను. మరియొకచో నొక భక్తురాలు శివునకు తల్లి లేదని బాధపడు సన్నివేశమునుకూడ ఇట్లే చిత్రీకరించెను.

---

* బసవపురాణము - ఆశ్వాసము 3 - పు. 146, 147.

చిన్నన్న కూడ పరమయోగి విలాసము తృతీయాశ్వాసమునందు శఠకోప చరిత్రలో పసిబిడ్డను చింతచెట్టుక్రింద దిగవిడిచిపోవ కాళ్ళాడక దుఃఖించు మాతృశోకమును హృదయ విదారకముగ వర్ణించెను. "కలఁగి మిక్కిలి కన్నకడుపు గావునను గన్నీటి వెలయేటి కాలువలుబ్బి చన్ను గొండలమీఁద జాలువారంగ హా! కుమారక! యంచునతనిపై వ్రాలె."*
ఇంకను తనివి తీరవి ఆ తల్లి 'వావి కన్నులఁజూచి వచ్చెదననుచు నొడఁ బడఁజెప్పి యయ్యెవిడకెంగేలు విడిపించుకొనుచు' మరీ వచ్చినదట. ఇది అద్భుతమైన మాతృమనస్తత్వ వర్ణనము.

దీనినిబట్టి పాత్రపోషణ విషయములోనే కాక వర్ణనల విషయము నందును చిన్నన్న రచనలలో గూడ నిట్టి తనివితీరనితనము కనిపించును. ఇందులకు అన్నమాచార్య చరిత్ర, పరమయోగివిలాస కృతులందలి శ్రీవెంక టేశ్వరస్వామి వర్ణనము, అష్టమహిషీకళ్యాణ, ఉషాకళ్యాణము లందలి శ్రీకృష్ణస్వరూప వర్ణనము విదర్శనముగ చెప్పవచ్చును. ఈ తనివి తీరని తనమువలన వస్తువు పునరుక్తమైనను ప్రదర్శనమునందు వైవిధ్యము, నవ్య త్వము గోచరించుట విశేషము. ఇందులకు ఆయా కావ్యసమీక్షలలోని వర్ణనలు పరికింపుడు.

పాల్కురికి సోమనాథుని కృతులలోని వర్ణనలు సహజసుందరములై అమృతభావ స్రవంతివలె విసర్గమనోహరముగ సాగును. అంతేకాదు సోమ నాథుని కొన్ని వర్ణనలు సాంకేతికపద ప్రయోగాత్మకములు. పరికరములను తెలుపుటలో గొల్లలవ్యవహారములోని పదజాలమునే గ్రహించినాడు. దీనివ లన వర్ణనకొక సహజత్వమేర్పడును. అంతేకాక దీనిచే సోమనాథుని భాషా పదపరిశీలనము కూడ సువ్యక్తము.

ఇట్లే చిన్నన్నయు అష్టమహిషీకళ్యాణమున గొల్లలపరిభాషయు, పరమయోగివిలాసమునందు కరణములను, రెడ్లను, వైద్యులను, పరదేశి

* ప. యో. వి. – తృతీయాశ్వాసము – పు. 157–160

వెట్లను, కానెవారిని, మేదరులను, దాసీలను అతిస్వాభావికముగ అయత్న పూర్వకముగ వర్ణించెను. విప్రనారాయణుని చరిత్రమునందు చిన్నన్న వేశ్యలను, ఆ వాతావరణమును, వేశ్యస్వభావములను వర్ణించునపుడు వారివ్యవహారము నందలి పదజాలమును, తిట్లను వాడెను. (చతుర్థాశ్వాసము పు. 298–302)

'బసవపురాణములోని సిరియాళ చరిత్రము శ్రీనాథుని హరవిలాసములోని చిఱుతొండనంబి కథకు ప్రతిబింబము. ధూర్జటి శ్రీకాళహస్తి మహాత్మ్యములోని తిన్ననికథ బసవపురాణములోని కన్నప్పకథ ననుసరించినదే' అట్లే చిన్నన్న ఉషాకళ్యాణమును చంపువుగ దామెర్ల అంకభూపాలుడు (1600 - 30 A. D.), కైపా మాయనకవి (1800 A. D.) రచించిరి. పరమయోగివిలాసములోని విప్రనారాయణ చరిత్రను చదలువాడ మల్లన, సారంగు తమ్మయలు పద్యకావ్యములుగ సంతరించిరి. స్థూలముగ పైన పేర్కొనిన విషయములనుబట్టి పరిశీలించినచో శైవ కవులలో పాల్కురికి సోమనకు ఎట్టి స్థానము కలదో, వైష్ణవ ద్విపద కవులలో చిన్నన్నకు అట్టి స్థానము గలదని నిర్ణయింపవచ్చును.

***గోనబుద్ధ భూపాలుడు :*** "తెలుగు వాఙ్మయమున పాల్కురికి సోమనాథుడు ద్విపదకు సృష్టికర్త కాగా తన్మహనీయస్థితికి మూలమై నిలిచినవాడు గోనబుద్ధ భూపాలుడు. సోమనాథుని రచనలోగల పరమత నింద, లక్షణోల్లంఘనము చేయనివాడు బుద్ధ భూపాలుడు. తన రచన రంగనాథ రామాయణము పరమ స్వతంత్రము కాకపోయినను అడుగడుగున అనువాద స్వాతంత్ర్యమును పాటించెను" అని డా॥ జి. నాగయ్యగారు తమ సిద్ధాంత గ్రంథమున పేర్కొనిరి. చిన్నన్నయు హరివంశము, ద్రవిడ ప్రబంధముల విషయమున అనువాద స్వాతంత్ర్యమును పండిత ప్రశంస లందుకొను రీతిని పాటించెను. రంగనాథ రామాయణము నందు వలెనే చిన్నన్న వర్ణనలు చాలవరకు కథాగతిని పెనవేసుకొనియే యుండును.

అష్టమహిషీ కళ్యాణమున చిన్నన్న కంసవధను సూచించు రీతిలో నక్షత్ర వర్ణనము గావించుట చూడవచ్చును. అంతేగాక రామాయణ భారత భాగవతాది కథా సన్నివేశములను పోలికలుగ అనగా ఉపమాలంకారములుగ వాడుచు వర్ణించు ధోరణి చిన్నన్న రచనలో విశేషముగ కనిపించి అతని పౌరాణిక పాండిత్యమును చాటి చెప్పును. ప.యో.వి. నందలి ఈ ఉదాహరణలు చూడుడు.

"ఇనకులుండడవికి నేగుచోఁ బౌర జనులెల్లనతని పజ్జను బోవునట్లు" (పు. 114)"ముదుకఁడై యిట్లు కాముక బుద్ధితోఁడ నదవదఁజెందు యయాతి చందమున" (పు. 106) ఘన పాంచజన్య సంగంబున ధ్రువున కనుపమ సకల విద్యలు వచ్చినట్టు- (పు. 363) 'రంగనాథ రామాయణము రసోద్బోధకములగు పదజాలముతో, కావ్యమునకు గుండెవంటి ఔచిత్యముతో కన్నులకు గట్టినట్లు చిత్రించు పాత్రల మనోభావవ్యక్తీకరణతో రమ్యముగ నొప్పినది'. అట్లే చిన్నన్న రచనలలో రసోచిత పదబంధము గోచరించును. "రంగనాథ రామాయణములోని ద్విపద రచన యొక్కొక్కడుప్పుడు శరత్కాల స్రవంతివలె మందగమనముతో పోవుచు, ఒక్కొక్కప్పు వర్షాకాలపు నదీ ప్రవాహము వలె పరువులు వారుచు నుఱకలు వెట్టుచు, సుళ్లు తిరుగుచు రస భావానుకూలముగ వివిధ గతులతో వివిధ రీతులతో నర్తనము చేయుచు నడచినది" అని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు రంగనాథ రామాయణమును గూర్చి చెప్పిన అభిప్రాయములోని ప్రత్యక్షర లక్షణము చిన్నన్న ద్విపద రచనారీతికిని పూర్తిగ అన్వయించును.

*గౌరన :* హరిశ్చంద్రుని నిత్యసత్యవ్రతము నాబాలగోపాలము సంభావించు సరణిలో సర్వతంత్ర స్వతంత్ర మార్గమున హరిశ్చంద్రోపాఖ్యానమును రచించి ద్విపదకు కావ్యత్వ గౌరవమును సమకూర్చి గౌరవ ద్విపద కవులలో గౌరవ స్థానమును పొందెను. చిన్నన్నయు చరిత్రకు అనగా జరిగిన కథకు (అన్నమాచార్యుని చరిత్రకు, ఆళ్వారుల చరిత్రకు)

కావ్యత్వ గౌరవమును సరసమైన రీతిలో సమకూర్చి ద్విపద కేర్పడిన కావ్యత్వ గౌరవము ఇనుమడింప జేసెను.

చిన్నన్న అష్టమహిషీ కళ్యాణమునందు బాలకృష్ణుని శైశవలీలా సన్నివేశ వివరణము నందును, పరమయోగి విలాసములో ఆళ్వారుల చరిత్రలను తీర్చిదిద్దు విషయములోను కథాకౌశలము కనిపించును. వ్యక్తి స్వరూపస్వభావ వర్ణనములలో రామణీయకము దర్శనమిచ్చును. సజీవపాత్ర నిర్మాణ శిల్ప చాతురికి చిన్నన్న కృతులందలి శ్రీకృష్ణుడు, రుక్మిణి, అగ్ని ద్యోతనుడు, ఉషాకన్య, చిత్రలేఖ, బాణుడు, విప్రనారాయణుడు, దేవదేవి, విటకంటకి, యామునుడు, గోదాదేవి మున్నగు పాత్రలు నిదర్శనములు. తెలుగు నుడికారపు మెరుగులు వర్ణనావసరములలో స్పష్టము. చిన్నన్న రచనము నాతి కఠినము.

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానము గూడ ఇట్లే కథాకౌశలము, వర్ణన రామణీయకము, సజీవపాత్ర చిత్రణముగల రసవత్ప్రబంధము. ఇందు అనుప్రాస పూర్వకమైన శబ్దచమత్కారము చాల తక్కువ. చిన్నన్న రచనలో ఎక్కువ. అతని వర్ణనములందీ లక్షణము కనిపించును. పరమయోగివిలాసమున 'గప్పునై యొప్పునై చొప్పునై' ఇత్యాది శబ్దములతో స్త్రీ సౌందర్యమును వర్ణించెను. రసానుభవశూన్యమైన ఇట్టి శబ్దపటాటోపము, పాల్కురికి సోమనాథ, బుద్ధభూపాల, గౌరన కృతులందెచ్చటను కనిపించవు. శబ్ద చమత్కృతికన్న అర్థగౌరవము గొప్పది. చిన్నన్న కృతులందు అర్థగౌరవమున్నను, ప్రతిపాదింపనెంచిన వస్తుసౌందర్యము పాఠకుల మనస్సులకు లెస్సగ హత్తుకొనునట్లు చేయుటకై చిన్నన్న ఈ శాబ్దిక విన్యాసమును పాటించినట్లుతోచును. అయినను ఈ దృష్టితో పరిశీంప చిన్నన్నకు ద్విపద కవులలో పై ముప్వురికంటె తరువాతి స్థానము లభించును.

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమునందు వలెనే భావానుగుణ పద ప్రయోగరచనా వైశిష్ట్యము చిన్నన్న రచనము నందును గోచరించును.

ఉదా : "ఘుమఘుమయని వార్ధిఘూర్ణిల్లి కలఁగ ధమ ధమ యనిమ్రోయ దమరువుద్రిప్పి పెటపెటయని శైలబృందముల్ పగుల గిటగిటయని పండ్లు గీంటుచు గనలి. " (ఉ. క.) ఇత్యాది ధ్వన్యనుకరణ పదప్రయోగముచే బాణుని కోపాటోపమును శబ్దపటాటోపముతో ప్రదర్శించినాడు. ఇది కేవల శబ్దాటోపముకాదు భావానుకూల పదప్రయోగము. గౌరన కవిత్వమునందుగల వాస్తవికత (Realism), స్వభావోన్మీలన చాతుర్యము చిన్నన్న రచనము నందును కనుపట్టును. 'కాలకౌశికుడు అప్పుతెగవేయు పద్ధతులను తెలుపు సందర్భమునను, కలహకంఠి కలహవృత్తిని, గయ్యాళితనమును చిత్రించు నపుడును, లోహితునికై చంద్రమతి విలపించు సన్నివేశములందును గౌరన వాస్తవికత నేవిధముగ పాటించెనో అట్లే చిన్నన్నయు పరమయోగివిలాస మున విప్రనారాయణ చరిత్రలో వేశ్యమాత పాత్రను చిత్రీకరించునపుడు, ఆ వేశ్యావాతావ రణమును స్ఫురింపజేయురీతిలో వాస్తవికతను ప్రదర్శిం చెను. (చూ. ప. యో. వి. కావ్యసమీక్ష విటకంటకిపాత్ర).

పదప్రయోగ నైపుణియందును, నాటకోచిత రచనమునందును భావౌన్నత్యము నందును, మానవ మానసిక తత్త్వ వివరణము నందును గౌరన తన ప్రజ్ఞనెట్లు ప్రదర్శించినాడో అట్లే చిన్నన్నయు పరయోగి విలాస కృతిలో విటకంటకి, దేవదేవి విప్రనారాయణుల సంభాషణములలో నాట కోచిత ధోరణిని, మానసిక తత్త్వ వివరణమును ప్రదర్శించి "ద్విపద కావ్యంబు ముదిలంజ దిట్టకంత" అను అపప్రథను పోగొట్టినాడు.

***అనంతర కవులపై చిన్నన్న ప్రభావము :*** చిన్నన్న ఉషా కళ్యాణమును దామెర్ల అంక భూపాలుడు, కైపామాయన కవి పద్యీకరిం చిరి. పరమయోగి విలాసమును సిద్ధిరాజు తిమ్మభూపతి అదే పేరుతో పద్య కావ్యముగ రచించెను. ఇట్లే విప్రనారాయణ చరిత్రను చదలువాడ మల్లన, సారంగు తమ్మయలు ప్రత్యేక పద్య ప్రబంధములుగ మలచిరి.

చిన్నన్న తిమ్మభూపతుల పరమయోగి విలాసములను గూర్చి-"ఈ రెంటను కథా వస్తువు ఒకటే అయినను కథోన్మీలనమున మాత్రము భేదము గలదు.... చిన్నన్న రచనలోని ఆశ్వాస విభజనము కథాగతిని చక్కగా వ్యక్తీకరించును. గ్రంథాశ్వాస విభజనమున తిమ్మభూపతి చిన్నన్నను అనుసరించలేదు. చిన్నన్న రచన వర్ణనాత్మకమై, వైష్ణవాచార విధేయముగ నుండగ, తిమ్మభూపతి రచన సంగ్రహముగ, కథా కథన పద్ధతివి భక్తి ప్రధానమై యున్నది" అని ఈ రెండు కావ్యములను తుల నాత్మకముగ పరిశీలించి డా॥ జి. నాగయ్యగారు ద్విపద వాఙ్మయము (పు. 475-480)లో తెల్పిరి. పరమయోగి విలాసము సప్తమాశ్వాసము నందు చిన్నన్న తెలిపిన చౌర్యసాధనములు శిక్షలు తిమ్మభూపతి పరమ యోగి విలాసమునందును గలవు. ఇంటి కప్పుపై కన్నము వేసి ఇంటిలోని వస్తువులు పైకిలాగుటకు చీరచివర ముడివేసి దానికి కొక్కెర లేదా కొండిని తగిలించి, ఆ కొండికి ములుబంతిని కూడ తగిలించి ఉపయోగించెడివారని చిన్నన్న (ప.యో.వి. 525)లో చెప్పెను. ఈ చౌర్యసాధనములను తిమ్మ భూపతియు ఇట్లు పేర్కొనెను-

"బలపము, కన్నపు గత్తియు
తలముళ్ళను చొక్కనీలిదట్టి యనుము, చీ
మల క్రోలు, గ్రద్దగోరును,
ములుబంతియు కత్తెరయును మొదలగు వానిన్" (పు. 135)

చిన్నన్న-ఉషాకళ్యాణ కృతియందు వీనినిట్లు పేర్కొనెను.

"కవకంపుగత్తి భృంగంబుల క్రోవి చిన్నారి నెలగోల చిప్ప చేయమ్మ
తిలకంపు నిసుము కత్తెర సొక్కమందు, బలపంపు బలముళ్ళ బంతి
కొంకియును"

చిన్నన్న రచనము తిమ్మభూపతికిట మార్గదర్శకమనుట నిర్వివాదము. చిన్నన్న-తరువాతి ద్విపద కవులకు మార్గదర్శకుడైనాడు. అందులకీ క్రింది పద్యము సాక్ష్యము.

"ఎన్నఁదెనుఁ గునకు రాజను
గ్రన్నన యతిరాజునకును రమణయకును నేఁ
జిన్నను, ద్విపద నొనర్పను
చిన్నన్నను, బిరుదుగద్య చెప్పిన ఘనుడన్॥"-

గణపవరపు వేంకట కవి, ప్రబంధరాజము.

*చిన్నన్న రచనలోని ప్రత్యేకత :* చిన్నన్న రచనలో మధుర భక్తి సంప్రదాయము, వ్యక్తి స్వరూప వర్ణనాధోరణి, శాబ్దిక చమత్కృతి, సామాజిక జీవిత చిత్రణము ప్రత్యేకముగ కనిపించును. ఇతివృత్తమును నిర్వహించుటకై ఆశ్వాసాది విభజనము చేసి వివరించు రీతిలో తాను రచించిన నాలుగు కావ్యములలోను వైవిధ్యమును చిన్నన్న ప్రదర్శించెను. ద్విపద రచనలో బహుభాషా ప్రదర్శనము, పాదభ్రమక గోమూత్రికా బంధాది చిత్ర బంధ కవితా ప్రదర్శన ధోరణి చిన్నన్న రచనలోని ప్రత్యేకతగ భావించవలెను.

"దినములోననె వేయి ద్విపద లింపొంద
వినుత వర్ణనలతో విరచించువాఁడ
గవి శిరఃకంప యోగ్య ప్రతి ద్విపద
నవ బిరుదాంకుండ"

అనిఅష్టమహిషీ కళ్యాణములో చిన్నన్న చెప్పిన దానినిబట్టి వినుత వర్ణనలతో రోజునకు వేయి ద్విపదలు రచింప గలుగుట, వ్రాసిన ద్విపద కవి శిరః కంప యోగ్యమగుట చిన్నన్న ద్విపదరచనా సామర్థ్యమును, ప్రత్యేకతను తెలియజెప్పుచున్నవి.

ఇక చిన్నన్న స్థానమును గూర్చి : "ప్రబంధములను ద్విపద రూపమున వెలయించిన వారిలో బహుశః చిన్నన్నయే ప్రథముడు" అని డా॥ ఏ. విద్యావతిగారు "తాళ్ళపాక కవుల సాహిత్య సేవ" (పు. 339)లో చిన్నన్నకు గౌరవ స్థానము నిచ్చి పురస్కరించగా డా॥ వేటూరి ఆనంద మూర్తిగారు "తాళ్ళపాక కవులు-వివిధ సాహితీ ప్రక్రియలు" గ్రంథమున "ద్విపద కవితలో నతనితో సాటి చెప్పఁదగిన కవి యింకొకఁడు లేఁడనియే చెప్పవచ్చును" అని చిన్నన్నకు అద్వితీయ స్థానమునే సమకూర్చిరి. (పు. 156).

ఏది ఏమైనను పాల్కురి సోమనాథుడు, గోనబుద్ధ భూపతి, గౌరన వంటి ద్విపద వాఙ్మయ యుగకర్తలనదగిన మహా కవులతో పోలిక చెప్ప దగిన వాడు చిన్నన్న. నిజమునకు ద్విపదను ఏకాగ్రతతో కొలిచినవాడు చిన్నన్న. కనుకనే ద్విపద కవులెందరు వెలసినా ఇతని స్థానమితనిదే. ఇతి వృత్త నిర్వహణము, పాత్ర పోషణము, రసపోషణము, వర్ణనలు, అలం కారములు, భాష, శైలి, మున్నగు కవితా విషయము లన్నింటి యందును తెలుగు ద్విపద వాఙ్మయమున ప్రాగ్రసరులైన పాల్కురికి సోమన, గోన బుద్ధభూపతి, గౌరన అను గంధగజేంద్రముల పజ్జన పరువెత్త గలిగిన ఆజానేయము తాళ్ళపాక చిన్నన్న. వందలాది తెలుగు ద్విపద కవులలో చిన్నన్న ఆమువ్వురి తరువాత చతుర్థ స్థానీయుడనియే నిర్ణయింపనగును.

మరి జనసామాన్య లోకమున చిన్నన్న ద్విపద రచనలు పాల్కురికి సోమనాథుని ద్విపదల వలె ఏల బహుళ ప్రచారము లోనికి రాలేదని ప్రశ్నించు కొనినచో సమాధానము మృగ్యము. ఈ సందర్భమున శ్రీ నిడుదవోలు వేంకటరావుగారుగారి అభిప్రాయములోని వాక్యములిట స్మర ణీయములు :

"పాల్కురికి సోమనాథుని బసవ పురాణ పండితారాధ్య చరిత్రలు సుపరిష్కృతములై విపుల పీఠికలతో వెలయుట చేత సోమనాథుని ద్విపద కవితా వైదుష్యము మనము గ్రహింపగలిగినాము. కాని చిన్నన్న కృతులు ముద్రితములైనను, అవి సంస్కృత ముద్రణములు గాక పీఠికా రహితము లగుటచే చిన్నన్న ద్విపద రచనా పాటవము మనము గ్రహింపలేదు."


— [తాళ్ళపాక కవులు-వివిధ సాహితీ ప్రక్రియలు పు. XIII]

ఈ కారణము చేతనే చిన్నన్న ద్విపద రచనా పాటవమును సామాన్యలోకము గ్రహించి యుండదని భావింపవచ్చును. కావున సుసంస్కృత పీఠికా సహితముగ తాళ్ళపాక చిన్నన్న కృతుల నవశ్యము పునర్ముద్రించుట అభిలషణీయము.

చిన్నన్న కావ్యములు జన బాహుళ్యమున ప్రకాశించునట్లను గ్రహింప శ్రీ మదలమేలు మంగా వేంకటరమణులను మనసా ప్రార్థింతును.

అ సు.

తాళ్ళపాక చిన్నన్నకు పద్మసాలెలు వ్రాయించి
ఇచ్చిన తామ్రశాసనము క్రీ. శ. 1541
రేకుల ఛాయా చిత్రము.



# 9. అనుబంధములు

## దానపత్రము (తామ్రశాసనము)

క్రీ. శ. 1541 లో తాళ్ళపాక చిన్నన్నకు సంబంధించి పద్మసాలె వారు వ్రాసి యిచ్చిన 'దానపత్రము' నకలు "మెకంజిదొర కైఫియత్తు"లో కానవగుచున్నది. ఈశాసనము రాగిరేకుల ఛాయాచిత్రములోని విషయమిది.

| | | |
|---|---|---|
| చక్రం | నామం | శంఖం |

శ్రీమదలుమేలుమంగా మనోహర శ్రీవేంకటరమణ బహుంపరాకు.

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు ౧౪౬౩ అగు నేటి శుభకృతు నామ సంవత్సర మాఘ శు .... గురువారం శ్రీమతే రామానుజాయనమః । శ్రీ మద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య ఉభయ వేదాంత ప్రవర్తకులైన తాళ్ళపాక అన్నమాచార్య పుత్ర తిమ్మార్య నందన, రత్న మకరకుండల యుగ్మ మండితకర్ణ, సకల వైష్ణవపాద సంసేవకాబ్జ సదనా వధూలబ్ధ పరస కవిత్వ విదితమానస తిరువెంగళనాథయ్య దివ్య శ్రీపాద పద్మముల సన్నిధికి అన్నమాచార్యులవారి పౌత్రులయిన తిమ్మాచార్యుల వారి పుత్రులైన తాళ్ళపాక చిన్నన్నగారికి ఛప్పన్న యాభైయారు దేశం బులంగల పద్మసాలెకుల సంభవులు వ్రాయించి యిచ్చిన వరుషాశన తామ్ర శాసన క్రమ మెట్లన్నను శ్రీమన్నారాయణుని నాభికమలంబున చతుర్దశ భువన విఖ్యాత సకల భూత చరాచర ప్రపంచోత్పత్తి హేతుభూతుండైన చతుర్ముఖుండైన బ్రహ్మదేవుడుద్భవిల్లె. ఆ బ్రహ్మకు మానసపుత్రుండైన భృగుమహామునీంద్రుడుద్భవిల్లె. ఆ భృగువునకు మృకండుడను మహా మునీంద్రుడుద్భవిల్లె. మృకండునకు మార్కండేయుడుద్భవిల్లె. ఆ మార్కం డేయుకు అయోనిసంభవుండైన తద్వేదాగ్ని కుంభ మధ్యంబున పంచమహా

ఋషి. భావమహాఋషులను యిరువురు పుత్రులుద్భవించిరి. జ్యేష్ఠ పుత్రుండైన పంచమహాఋషి యంశంబున దేశం వారుద్భవించిరి. ద్వితీయ పుత్రుండైన భావఋషి యంశంబున సకల సురాసుర మనుష్య గుహ్యకాభిమాన రక్షకులైన శ్రీపద్మసాలెసెట్లు పెక్కుంద్రులున్ను, బండార పాద కులాచార ప్రతిపాలకులున్ను పులియజంగమల వరగండరులున్ను, వ్యాఘ్రగహ గంధర్వ శాప విమోచనులున్ను మూలకాసుర సంహారులున్ను కాల్వాసేన శిరః ఖండలున్ను, కార్పాతంతు వస్త్ర నిర్మాణులున్ను శ్రీమన్నారాయణుని నాభికమలంబున తంతుకైకొని శృంగారపరుండైన నారాయణునకు పీతాంబరమున్ను, లక్ష్మీదేవికి లక్ష్మీనారాయణంచు పుట్టమున్ను ఈశ్వరునికి పులివన్నె పుట్టమున్ను. పార్వతికి గవాక్షుల పుట్టమున్ను, బ్రహ్మకు పొప్పలివన్నె పుట్టమున్ను, సరస్వతికి సన్నవోలు పుట్టమున్ను, మన్మథ రతీదేవులకు లతా విచిత్రములైన పుట్టములున్ను, విఘ్నేశ్వరునకు గరుడవన్నె పుట్టమున్ను భైరవునకు బద్దెల పుట్టమున్ను, ఋషులకు, మునులకు కాషాయ వస్త్రములున్ను....యిత్రింశత్కోటిదేవతలకు యోగ్యంబులయిన పుట్టంబులు నిర్మించి యొసంగిన అపుడు బ్రహ్మవిష్ణు మహేశ్వరులు మెచ్చి యిచ్చిన బిరుదావళ్లు కనకదండె, అందలి, కాళంగి, ఆదపం, వింజామరలు, పంచమహావాద్యంబులు అక్షయ తూణీరాలు, పులిపెక్కములు, గరుడధ్వజంబులు స్వర్ణాల గరిగె, ముత్యాల గొడుగులు, కుంచె కాళంజి, అయిరావతంబులగు భద్రగజంబులు, ఉచ్చైశ్రవంబులగు అశ్వంబులున్ను, కనకజందెము, కాలుదివ్వెలు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల చేత గైకొన్న సాహస వీరులున్ను కోరమీసంబులు గల కొదమ సింహంబులున్ను రూప కందర్పులున్ను, ఆడితప్పని వారున్ను పలికి బొంకనివారున్ను శ్రీ కాంచి క్షేత్ర వీర పుంగవులును నూట ఎనిమిది దివ్యతిరుపతుల యందు ధ్వజపటారోహణ రాజవీధి మంటప. తలబ్రాలు మంటప మంగళసూత్ర దివ్యాభరణవస్త్ర కైంకర్య పరులున్ను అనవేమారెడ్డి సాన్నిధ్యాన కుల వ్యవహార.... విజయులున్ను, భావనా ఋషి భద్రావతీ కన్యాగర్భ

పూర్ణోదయ చంద్రులున్ను హరికి అత్తవారున్ను లక్ష్మీదేవి పుట్టింటి వారున్ను, మాతృ వంశంబున సూర్యునికి మనుమలున్ను పితృవంశంబున బ్రహ్మకు మనుమలున్ను ఉపనయన సంధ్యా గాయత్రీ మంత్ర ప్రవీణులున్ను మార్కండేయ గోత్రోద్భవులున్ను హరి హర బ్రహ్మదేవతలచేత బిరుదావళులు పుచ్చుకొన్న పద్మసాలె కుల సంభవులు అయోధ్య మధురా మాయా కాశి కాంచీ అవంతికాపురి ద్వారావతి మొదలైన తిరుపతి, చంద్రగిరి, శ్రీరంగం, తిరుచునాపల్లి, రామేశ్వరం, కంచి, కాళహస్తి, వెంకటగిరి, వేలూరు, నెల్లూరు, ప్రళయ కావేరి, చెన్నపట్టం, పొదిలి, కందుకూరు, ఉదయగిరి, పెనుకొండ, వినుకొండ, చీరాల, పేరాల, మంగళగిరి, కంభం, కందనవోలు, జగన్నాథం, ఢిల్లీ, అవరంగాబాదు, రాయదుర్గం, గుర్రంకొండ, అవుకు, శ్రీరంగపట్నం, బెంగుళూరు, కడప, సిద్ధవటం, రాజమహేంద్రవరము, మొదలయిన యేనూరుకోట్ల భూమండంలోగల యాభైయారు దేశాల పద్మసాలెసెట్లు (వారి పేర్లు గలవు) లక్ష్మీదేవి దక్షిణముఖమంటపమందు వ్రాయించి యిచ్చిన దర్మ శాసనం క్రమమెట్లన్నను: దేవరవారు మాకు గురువులు కనుక దేవరవారికి మేము ప్రియ శిష్యులు గనుక జాంబ్ర వారున్ను మేమున్ను, వివాదపడి లక్ష్మీదేవి పుట్టింటివారు తామని జాంబ్రవారున్ను మా జాతివారున్ను వివాదపడి మీ సముఖానకు వస్తిమి గనుక అపుడు లక్ష్మీదేవి పుట్టింటివారని మమ్ములనిర్ణయం చేసి పురుషోత్తమ రాయల వారిని గురువుల తిరుమల తాతాచార్యుల వారిని జాంబ్ర వారిని మమ్ములను అలమేలు మంగాపురానకు వెంటబెట్టుక పోయి అపుడు పురుషోత్తమ రాయలుతో.... సకలమైన ప్రజలు వింటూ వుండగా అలమేలు మంగమ్మచేత తన పుట్టింటివారు పద్మసాలెవారు అని అలమేలు మంగచేత పలుకరించి మా కార్యం నిర్వాహకంచేసి మాకులం ఉద్ధరిస్తిరి గనుక అపుడు పురుషోత్తమ రాయలచేత మాకు బిరుదులు, గండపెండరం, సింహతలాటం వింజామరలు యిప్పించి అపుడు భట్టులచేత కైవారం చేయిస్తిరి గనుక, అపుడు దేవర వారికి పదివేలు వరహాలు పాదకానుక యిస్తిమి గనుక దేవర

వారి భండారాన పదివేలు వరహాలు తెప్పించి ఉభయం యిరువై వేల వరహాలు పురుషోత్తమరాయలకు యిచ్చి, చంద్రగిరి తూర్పు భాగమందు.... ఆళ్ళగట్టు క్రయసిద్ధి చేసి తీసికొని యీ గట్టురాయి యెవరు దేవస్థళాలు కట్టినా వారికి పాలు భాగం ధర్మం, దేవస్థళాలు కట్టిన వారికి పాలుభాగం ధర్మం యీ ప్రకారం శిలా శాసనం వేయిస్తిరి గనుక, అపుడు అలమేలు మంగమ్మ సాన్నిధ్యమందు రంగమంటపంలో దానపత్రం వ్రాయించియిచ్చిన క్రమమెట్లున్నను: మీ తిరుమాళిగె ధర్మ వెచ్చానకు సంవత్సరం ౧కి మగ్గం ౧.కిల్ ౧ లెక్కను పెండ్లి౧ కిల్ ౧ లెక్కను యీ ప్రకారం వ్రాసి యిస్తిమి గనుక మా పద్మసాలె వంశం చతుస్సముద్రములకు లోగల వారు నడిపించగలవారం. ఇందుకు మా జాతివారు యెవరు యివ్వక యెగవేసిన కాశిలో మణి కర్ణికా ఘట్టమందు స్త్రీహత్య, శిశు హత్య, గోహత్య, బ్రహ్మ హత్యాదులు చేసిన పాపాన పోదురు. భావనా ఋషి భద్రావతీ కన్యకకు.... వారలగుదురు. ఇటని మా రాజీన ఆకాశవాణి భూదేవి సూర్య చంద్రాదులు అలిమేలు మంగమ్మ వీరల సాక్షిన మా ఋద్దు రాజీన వ్రాసి యిచ్చిన దాన పత్రిక".

— (ఈ శాసన రచయిత తాళ్ళపాక చిన్నన్నయే).

## చిన్నన్న కృతులు - అనర్ఘ రత్నములు

*అష్టమహిషీ కల్యాణము నుండి :* పుట సంఖ్య

కొంకక తను నోరి కొలది బలుకు మంకుఁ బోతులకు గ్రామ్యంబుసామ్యంబు 8
మానమేరికి సమానంబు 71
పొదివి పాలిండ్లు వీఁపున వెదలంగనదిమె కృష్ణుని మోవినానెనొక్కర్తు 103
జగతిమాతా పితృచరణాబ్జ పూజ గావించు పుత్రుడు గాంచు ధర్మముల 145
కలికి రేరాజు నక్షత్రమాలికకుఁగొలికి పూసనఁగ వేగురుచుక్క పొడిచె 220

*ఉషా కల్యాణము నుండి :* పంక్తి సంఖ్య

వేషంబు సాత్త్విక వేషంబుగాని దోషాకరుడు గురుద్రోహిరేగాము 564
వనితలు చాపల్య వర్తనలు 1075

*పరమయోగి విలాసము నుండి :* పుట సంఖ్య

చివురు బోఁడులు తపస్విల వృత్తులకు వివరింపగా వేరువిత్తులు గారె?
మదిలోన నొక్కటి మాటాడు నొకటి మదిరాక్షులకు నియమంబు
సంశయము 61
అవిరళంబగు సహస్రాపరాధములు సవరించి తుదివచ్చి శరణుజొచ్చినను
ఘనులైనవారలా కరటి నేరములు మనమునఁబెట్టక మన్నింతురెపుడు 118
ఘనబలోత్కటమైన గంధ సింధురము కినిసి కుక్కలు మొఱిగిన
లెక్కగొనునె 137
ఇలఁ బుట్టు పుట్టువులందు నాఁడు పుట్టువు హీనము 286
వారవనితల వలపు పసిఁడి తొడిద కాదె 287
వయమనం గడియింపవలయుఁగాకరుగ వయసురమ్మనినను వచ్చునే
మగుడి ? 289
రవిదీప్తి నంధకారము పోఁకుపెట్లు ? 306
తనయుని పెగ్గెంబు తండ్రిది గాదె 308
తల్లి బిడ్డలకు నైతము రాదెవాదు ? 310

మును వచ్చు వార్ధకమునకునై నరుఁడు తన యౌవనమున యత్నము
వేయవలయు
భాజనీయంబైన పరకారణంబు నీ జననము వందె యెఱుంగవలయు 335
అరయ ధనాతురుండగు మానవునకు గురువు బంధువులు నెక్కుడువారు
గలరె? 474
కల్లలాడుట నరకము త్రోవ 474
దేహంబులెన్న నిత్యములె ? 605
అరయంగఁ బ్రతికూలయగు భార్య విడుచుటిరవొందగా శాస్త్రహితమే
తలంప 608
క్షితిగురు తోడ బొంకినవానికరయ గతియెద్ది తుదినరకమెకాక. 620

*అన్నమాచార్య చరిత్రము నుండి :*

కడపట వేవురు గలుగంగనేమి కొడుకొక్కరుండైనఁ గులముద్ధరించు 8
ఎటువంటిగొంటైన నాచారముల దాసరయ్యను జూచి యేగతిఁ
బడుచులనిచ్చు ? 29
సహజ వైష్ణవభక్తి సలిపెడువాని సహవాసమైన దోసములేదు 31
సంకెలలిడువేళఁ జంపెడువేళ నంకిలి ఋణదాతలాఁగెడు వేళ
వదలక వేంకటేశ్వరుని నామంబె విదలింపగతి గాని వేఱొండులేదు 38
ఎఱుఁగని పసిబిడ్డఁడేమైనఁజేయ నరుదైన తల్లికి నలుగంగఁదగునె 39

## గ్రంథ పాతములు

చిన్నన్న కావ్యములలో మొత్తము 79 తావులందు ఒక్కొకకచోట కాలదిగను, కొన్ని తావుల పాదములు సైతము గ్రంథ పాతములు కాన వచ్చుచున్నవి. ఒక్క అష్టమహిషీ కళ్యాణమునందే 67 తావుల శైథిల్యము గలదు. పరికింపుడు:-

| అష్టమహిషీ కళ్యాణము నుండి : | ఆశ్వాసము | పుట సంఖ్య |
|---|---|---|
| జలచర జాలముల్ సైన్యముల్గాగ....పికధ్వనులు | (ప్ర. ఆ.) | 11 |
| రామయో కమ....రామాభిరామ | " | 54 |
| దొండపండౌనవాతోడీని మోవి....సతతంబు | (ద్వి. ఆ.) | 96 |
| భావముల్గరఁగ కుంభ....ల్లీవస్తు | " | 109 |
| పసిబిడ్డ పాపని పనిబూని.... | " | 116 |
| యుల్లసమారంగ .... | " | 122 |
| బృంద సొత్తెంచి; పోదరి .... | " | " |
| భ్రమసిరి సిరితేని ప .... | " | 123 |
| సమధికామృతరస .... | " | 124 |
| చండకరాభ కాంచన కవాటముల .... | (తృ. ఆ) | 131 |
| కొప్పుఱను....(మూలపత్రములు నిరిగినవి) | " | 133 |
| ఊర్ధ్వభువనంబు లెగసి.... (రెండు పాదములు లేవు) | " | 136 |
| చిరచిరగనలి.... (ఒక పాదము లేదు) | " | 137 |
| వెలదుల పేమ.... " | " | 155 |
| గోచరము; .... " | " | " |
| యొకపూటఁ బెడిగి; .... " | (చ. ఆ) | 173 |
| యేతెంతుననుచు; .... " | " | 181 |
| నవ్విభుడు; .... " | " | 196 |
| సూడుబంటయ్యె .... " | " | 199 |
| తలిరుల తమ్మిలో .... | " | 204 |
| .... మొఱయక యుండు | " | " |
| పాదంబులఁజూచి; .... (ఒక పాదము లేదు) | " | 205 |
| .... శగించు దర్పణాననము | " | " |
| .... రసటకుఁ బోనిచ్చి | " | " |

| | | | |
|---|---|---|---|
| .... రథము | | (చ. అ) | 205 |
| అద్భుతు గాక .... | | " | 206 |
| .... మురల్ సైన్యములలోఁగూడ | | " | " |
| వడివంటు దాతి; .... (ఒక పాదము లేదు) | | " | " |
| .... శత్రులఁ జిక్కించి | | " | " |
| .... బ్రహ్మాండాంతకు | | " | 207 |
| గూడు.... మన | | " | " |
| అగరాజ్ఞగమన.... | (ఒక పాదము లేదు) | (పం. అ) | 223 |
| చయ్యన నెక్కి.... | " | " | 232 |
| మీఁగడ పెరుగులును.... | " | " | 243 |
| చటుల ఘట్టనల.... | " | " | 275 |

**ఉషాకళ్యాణము నుండి :** ద్విపద పంక్తి

| | |
|---|---|
| ....దు కరవాల బాణాగ్ర | 916 |
| వారి....ంచి....వడినార్చి | 921 |
| గ్రమ్మచు చేతుల....దిరువ్వగుచు ? | 1355 |
| ఖావజుదామ....మార్పుపరచు | 1919 |
| ....నైతకును యేర్పడియొక్క.... | 1920 |
| మృదువులై ఘోదివి పరి.... | 1942 |
| పొటిక శిరుల....దొడలు | 1945 |
| కేలుకై....చిక్కిన భూతిమెదిచి | 1448 |
| ఘడవలై....మకుటముల్పుట్టి | 1452 |
| తొల్లైటిక....దెగవ్రేయ నుంకించె | 1556 |

**శోభనగిరి విలాసము నుండి :** పుట సంఖ్య

| | |
|---|---|
| తలపుఁ చేకూరెనో తరళాక్షికిపుడు.... (ఒక పాదము లేదు) | 239 |

**అన్నమాచార్య చరిత్రము నుండి :**

| | |
|---|---|
| దులగుచు .... (ఇట గ్రంథపాతము గలదు) | 28 |

## జాతీయములు – సామెతలు - పలుకుబడులు

అల్పాక్షరముల అనల్పార్థరచనము, భావవై శారద్యము, సందర్భ ఘటితస్ఫూర్తి, అందమైన పదముల పొందిక సొత్తుగా గలవి సామెతలు. "తరతరముల నొకజాతి జనసామాన్యము జిహ్వాంచలములనాడు నిరాడంబర భావనిర్భర కవితా జీవిత కలమంత్రములు సామెతలు" అని ఆచార్య శ్రీ యస్వీ జోగారావుగారు తమ ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రలో నిర్వచించిరి. తెలుగుజాతి పలుకుతీరు, తెలుగుభాష మాటసౌరు, తెలుగుదనపు తీరుతెన్ను ప్రత్యక్షరమునందు నింపుకొనిన ఈ జాతీయములు, సామెతలు, పలుకుబడులు తెలుగుభాషలో కోకొల్లలు. ఇవి తెలుగుభాష తెలుగుజాతి జీవనాడినిపట్టి యిచ్చు ముఖ్యాంశములు. వీనిని తాళ్ళపాక చిన్నన్న తన ద్విపద కావ్యములలో పుష్కలముగ ప్రయోగించెను. అందు కొన్నింటిని పరికింపుడు.

*అష్టమహిషీ కళ్యాణము నుండి :* పులివాతపడి తప్పిపోవు చందమున; ఏటివంకలు దిద్దవశమా; ఇరుగింటిలో పని యెరుగవేమియును పొరుగింటిపని దీర్పఁబోయెదు; నివురు గప్పినయట్టి నిప్పుక పోల్కి; దంతి మెసంగు వెలగకాయలగతి; అడఁబోయిన తీర్థమదియెదురై నజాడ; కడుపు లోపలి చల్లఁగదలకయుండ; తలలకు నీదు పాదములకు లంకె; కనుదుదఁ బాఱనవ్వి; నేతిబీరనెడి చందమున; గోరఁబోవుట కల్ల గొడ్డలియేల?; పిలువకవచ్చిన పేరంటమునకు బొలియక చెప్పక పోవుటే లెస్స; చుట్టంబు గతి వచ్చి సూడుబంటయ్యె; ఆకువంటిది జన్మ! ముక్కుమోమెరుగక మోమోట పడక మొ. వి., *పలుకుబడులు - పదప్రయోగములు :* అచ్చుకట్టు, అల్లిబిల్లి, కనుమాయ, కయ్యమునకు కాలుదువ్వు, కాకుపోకిళ్లు, కిచకొట్టజేసి, కొఱకొఱమాటలు, గచ్చులాడుటెకాక, గింజియాడు, చిందరకొట్టు, చిలుకొట్టు, తకుమాఱుసేయు, తుటుములువెట్టు, వయుగారిమాటలు, నుగ్గునూచంబు, మిటిమిటిపడు, మీసలుదిద్దుకొనుచు, వెన్నతోబెట్టు, కతకారిబిడ్డ మొ. వి.

**ఉషా కళ్యాణము నుండి :** వంటయింటిలో మెలఁగు కుందేటి కరణి; ఒడిసి కాలోకఁడు కేలొకఁడుగాబట్టి కొనిపోయి; అంచుముట్టు. ఊఁతెత్తు. కేకిసల్గొట్టుచు. గుక్కుమిక్కనుచు దగ్గుత్తి కల్వడగ. కలువవైరి చుక్కలమూకవిప్పు. తీపువిల్లు. మీసాలు విఫురుచు. గబ్బుగబ్బున ద్రేచు. కుడిచి కక్కిన కక్కు, మొ. వి.

**పరమయోగివిలాసము నుండి :** ఇధ్మములు దేవిచ్చిన కత్తిఁ గొని యాలతోఁకలు గోసినరీతి; పనియధికంబు నల్పము కూలి; విత్యులు ము క్తులునిగమ సంతతులు నెలమిఁ జంకల జేతులిడి కొల్చుచుండ; కదలిలో నుప్పునడవిలో మసిరికాయయుఁ గూడినట్టు; మూడు మాటలాఱు తప్పులు; తనుఁగట్టు త్రాడును దనుదానె తెచ్చికొనునట్లు; వహ్నికడనున్న వెన్న కరుగ కేలుండు ? ; చెఱకు తీపని వేళ్ళతోఁ దెరలింపఁదగునె?; చెవ్వులఁబుడుకలు విఱచి; నోరిలోపలఁ గాళ్ళువెడలెననఁగ; కన్నులే చెవులుగా వినుచు; ముది సివ గొరయౌనె ముంజెలంజియును; తాము చంపము తాడుచంపె; చిల్కలేపి పంజరంబును బోలె; మీకును దిక్కుఁ గలిగిన వారికిని జెప్పికొండు; రెప్పా ర్పకచూచి; మందునకు వెదకిన లేదయ్యె; నేయిచల్లిన యనలంబు కరణి, కొండ తల నెత్తుకొన నీకుఁదరమె?; తాళ్ళకుఁదలబంటి యెంపటి చెట్లకునిఁక నెంతబంటి; చెవులలో నమృతము చిలికినట్లు; త్రొక్కినచోటెల్ల దున్నక పండు; పట్టెనామంబులు పాలభాగమునఁ బెట్టినవచ్చునే పెద్దటికంబు మొ.వి; **పలుకుబడులు-నానుడులు :** రక్కసులమిత్తి; చచ్చుఱకన్ను; కండ గర్వము-పొట్టక్రొవ్వు; ముడుత కుళ్ళాయి; అక్కటక్క; చుప్పనాతి; మొగవా శము; ద్రిమ్మరిగబ్బితొత్తు; బోడకుల్లాలు; రిక్కలతేజి; హేలల్లయటంచు, మొ. వి. ఇట్టివి పరమయోగివిలాసము నందసంఖ్యాకముగ నున్నవి.

**అన్నమాచార్య చరిత్రము నుండి :** పాలనే పెరిగిన పసిఁడి టెంకాయ; కానుకపెట్టు; కాసువీసము; గుంజిళ్ళబెట్టు; చెయ్యాది యాలోని కరిగె; జామెక్కు; బిడ్డుపెట్టు; తెప్పదేలు; బిడాకించు; వెన్నగాచిన నేయి; కెంబట్టు కుళ్ళాయి, కళాచి, వేల్పు తళిష, మొ. వి.

**భక్ష్య విశేషములు :** (అ. మ. క. నుండి)- సొజ్జి బూరెలు, తునుగులు, పాయసము, బేడలు=కాయధాన్యముల పప్పు; చేరు=మిరియము లోనగు సంబారములతో కాచిన చింతపండు రసము- "మరిచ జీరక కొత్తు మరి మిరియముల మెఱయుచు రుచులచే మించు చేరులను" (అ.మ.క. 6300); సజ్జ పరమాన్నములు (ఒకానొక బియ్యముతో వండిన పరమాన్నము; కజ్జాయములు- "ఇరవైన చవినోట నిడినంత లోన కరుఁగు నోయన నొప్పు కజ్జాయములును (అ.మ.క. 6307): పప్పు బూరెలు (ఉ.క ); పడిదము ద్రవ రూపమగు వ్యంజన విశేషము (ఉ.క.); ముంజ్ల ములి చింతకూర=ఒక మనోహర శాకము (ప.యో.వి); ఊరగాయ (ప.యో.వి.); వెన్నగాచిన నేయి, వింతపచ్చళ్ళు, దధ్యోదనము, వడలు, అప్పాలు, దధి వడలు=పెరుగు ఆవడలు; తెంకాయ రొట్టె. (అ.చ. 25). మొదలగునవి.

**ఆయుధములు :** (అ.మ.క. నుండి)- ఒడసెండ్లు, చొవడము, తరిశటము, తలకోలలు, ములువాడికత్తి, సగము జాబిల్లియమ్ము, సెలకట్టియలు; (ఉ.క. నుండి)- పలకు తోమర పరిఘ నారాచములు, శూలము, ముద్గరచంద్రహాస, పట్టిసము, కత్తెర, త్రిశూలము, బంతికొంకి, సెలగోల; (ప.యో.వి. నుండి)- వలయపు కత్తి, ఇనుము కన్నపు కత్తి, పదనుగల కత్తెర, గద, బంతి కత్తెర, ఏకాంగికత్తి మొ. వి.

**స్థల నామములు :** (అ.మ.క. నుండి)- సాల్వ, పౌండ్ర, కోసల, (ఉ.క. నుండి)- ఆంధ్ర కర్ణాట కాంభోజ, కురు, కేకయ, కేరళ, కొంకణ, గాంధార, గౌళ, చోళ, నేపాళ, పంచాల, బర్బర, భోజ, మగధ, మత్స్య, మహారాష్ట్ర, మాళవ, సింధు, సూరసేన, సౌవార, నాగపట్టణ ములు, (ప.యో.వి. నుండి)- 5వ ఆశ్వాసములో పు. 387-402 వరకు గల పుటలలో దక్షిణ భారత దేశము నందలి 108 దివ్య తిరుపతుల స్థల నామములు పేర్కొనబడెను. (అ.చ. నుండి)- టంగుటూరు, తాళ్ళపాక,

పొ త్తపినాడు, పెనుగొండ, ఊటుకూరు, మాడుపూరు, మరులుంకు అగ్ర హారములు. మొ.వి.

*క్రీడలు :* (అ.మ.క. నుండి)- అలంకి యప్పలములు. పారి గంతులు, బంతులాట, మల్ల యుద్ధములు, అల్లో నేరేళ్లు, బొమ్మరిండ్లాటలు, గుజ్జన గూళ్ళు (ప.యో.వి.); అచ్చనలాట (ప.యో.వి.) మొ.వి.

**ఉడుపులు :** (ప.యో.వి. నుండి) తోపు పచ్చడము, కెంబట్టు కుళ్ళాయి, గొంగడి, తలపాగ, గుండురుమాల, బోదకుల్లాలు=చిన్నటోపీలు, కుప్పసములు, అంగిలు, దోవతి, పట్టుచీర, ఉత్తరీయము, నీరుకావిశాలె, కోక; మొ.వి.

**ఆభరణములు :** (ప.యో.వి. నుండి) గుండ్ల దండ, పవడంపు మొలనూలు, పసిడి జంగెలు=ఒక విధమైన బంగారు దినుసు గజ్జెలు; పట్టు తలాటము=పికిలి పిట్ట ఱెక్కలు లోనగువానిచే నేర్పఱచిన తురాయి; పచ్చల బణ్ణసరము=పచ్చలు గ్రుచ్చిన హారము; వాదు పెండేరము, పుంజాలదండ, తాయతులు, నల్ల పూసల పేరు, గురిగింజ తావడములు, నల్ల ముతక గాజులు, తెల్లని తగరంపు ముక్కెర సీసపు టుంగరము, కంచు మట్టియలు, మకర కుండలములు, మణికంకణములు, రవల గజ్జియలు, రావిరేక, కమ్మలు= స్త్రీల కర్ణభూషణములు; పసిడి యొడ్డాణము, కేలి కంకణములు, ఇనుప యుంగరము మొ॥వి.

**తిట్లు :** (ప.యో.వి. నుండి) ఎగవోతకాడు, కొండికాడు, ఉంత కాయ, గామిడితొండ, చుప్పనాతి, సోమరిపోతు, ద్రిమ్మరి దిప్పకాయ, మంతు దిమ్మరి మొ॥వి.

**కులములు-జాతులు :** ఏనాదులు (అ.మ.క. 5633); రెడ్లు, కరణాలు, మేదరలు, సెట్లు, కానెకులమువారు, భోగము సానులు. మొ॥వి.

**వాద్యములు** : (అ.మ.క. నుండి)- పటహ భేరీతూర్య పణవములు, కనక తప్పెటలు, ఢక్కా హుడుక్కాలు. (ఉ.క. నుండి)- కాహళి, దమరువు, ఆవజము, కిన్నెర, (ప.యో.వి. నుండి) పంచలోహతాళములు; (అ.చ. నుండి)- తిపిరి దండె, దండె, మద్దెలలు, వాద్య దండె మొ.వి.

**గృహోపకరణములు** : కొప్పెర=వెడల్పు గల పెద్ద పాత్ర (ఉ.క.); పుల్లెలు=విస్తరాకులు (ఉ.క.); దువ్వెన (ప.యో.వి.) బిందె (ప.యో.వి.); తాళము (అ.చ.) మొ.వి.

**న్యాయములు** : కాకతాళ న్యాయము- "కాకతాళన్యాయ గరిమ వర్తించు సురపతి పతియంచుఁజూతురుగాని" (అ.మ.క. 1991); క్షీరోదక న్యాయము- "గరిమమై క్షీరోదక న్యాయమొసఁగ నిరువురు నుండి రనేక కాలంబు". (ప.యో.వి. 2-851)

# ఆధార గ్రంథములు [BIBLIOGRAPHY]

**సమీక్షించిన చిన్నన్న కృతుల ప్రతులు :**

అష్టమహిషీ కళ్యాణము టి.టి.డి. ప్రచురణ, 1937
ఉషా కళ్యాణము - టి.టి.డి. ప్రచురణ 1938
పరమయోగి విలాసము - శ్రీ శ్రీ మహారాజారావు వేంకట కుమార సూర్యరావుగారు ప్రచురించిన ప్రతి - 1928

**తెలుగు గ్రంథములు :**

అన్నమాచార్య చరిత్ర పీఠిక — శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి
అన్నమాచార్య సాహితీ కౌముది — డా॥ ముట్నూరి సంగమేశం
ఆంధ్రకవి తరంగిణి 8, 9 సంపుటములు — శ్రీ చాగంటి శేషయ్య
ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర — శ్రీ యస్వీ జోగారావు
ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర — శ్రీ బాలాంత్రపుర రజనీకాంతరావు
ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర — డా॥ టి. సుశీల
ఆంధ్రుల సాంఘిక చరిత్ర — శ్రీ సురవరం ప్రతాపరెడ్డి
కన్నడ సాహిత్య చరిత్ర — శ్రీ గడియారం రామకృష్ణశర్మ
కవితాకళ — డా॥ ఆచార్య తిరుమల
తమిళ విందు — డా॥ చల్లా రాధాకృష్ణశర్మ
తాళ్ళపాక కవులు-వివిధ సాహిత్య ప్రక్రియలు — డా॥ వేటూరి ఆనందమూర్తి
" - పదకవితలు-భాషాప్రయోగములు — "
తాళ్ళపాక కవులు — శ్రీ పెనుమాదు వెంకట శేషయ్య
తాళ్ళపాక కవుల సాహిత్య సేవ — డా॥ ఏ. విద్యావతి
తొలి సంకీర్తన కవులు — డా॥ వేటూరి ఆనందమూర్తి
ద్విపద వాఙ్మయము — డా॥ జి. నాగయ్య
వాగ్గేయ కారులు — శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

విజ్ఞాన సర్వస్వము (4, 6 సంపుటములు) తెలుగుభాషా సమితి ప్రచురణ
వేదాంత మత సమీక్ష శ్రీ చల్లా కృష్ణమూర్తిశాస్త్రి
శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష శ్రీమాన్ S.T.V. శ్రీనివాసాచార్యులు
సమగ్రాంధ్ర సాహిత్యము (Vol 7) ఆరుద్ర
సంగీత సంప్రదాయ ప్రదర్శిని (Vol I) శ్రీ సుబ్బరామదీక్షితులు

*సంస్కృత గ్రంథములు :*

కావ్యాదర్శము: కావ్య ప్రకాశిక, ప్రశ్నోపనిషత్తు
భగవద్గీత, మనుస్మృతి, సంగీత రత్నాకరము

*ఆంగ్ల గ్రంథములు :*

**Alvaras of South** **Sri K. C. Varadachari**
**Grains of Gold** **Sri R. S. Desikan**

*వైష్ణవమత గ్రంథములు :*

ఆచార్య సూక్తిముక్తావళి - 1875 ప్రచురణ శ్రీమాన్ కేశవాచార్యుడు
ఆళ్వారులు - దివ్య వైభవము శ్రీ తిరువాయిపాటి రాఘవయ్య
గురుపరంపరా ప్రభావము (తమిళ గ్రంథము)
పిన్నళకియ పెరుమాళ్ జీయర్
ద్వాదశ సూరి చరిత్రము కె.టి.యల్. నరసింహాచార్య
దివ్యసూరి చరిత్రము - 1855 ప్రచురణ గరుడవాహన పండితుడు
ప్రపన్నామృతము (సంస్కృతము) శ్రీ అనంతాచార్య పండితుడు
భగవద్రామానుజ వైభవం శ్రీ కొమాండూరి కృష్ణమాచార్య
శ్రీరామానుజకీర్తి కౌముది (1,2,3,4 సంపుటములు)
శ్రీమాన్ ధనకుదరం వరదాచార్య (సంపాదకులు)
సచిత్ర రామానుజ చరిత్రము శ్రీమాన్ గోపాలాచార్యస్వామి
శ్రీ వైష్ణవ ఆచారనిర్ణయము-ప్రచురణ 1974 శ్రీ తి.ప. రామానుజస్వామి

**పత్రికలు :**

భారతి (సాహిత్యమాస పత్రిక) డిసెంబరు 1951
ఆంధ్ర వైష్ణవ వాఙ్మయము .కర్త : శ్రీ నిడదవోలు వెంకటరావు

సప్తగిరి (తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక ఫిబ్రవరి 1977
తామ్ర శాసన విషయం. సేకరణ కుమారి షడ్దర్శనం విజయలక్ష్మి

సమాలోచన సాహిత్య పక్ష పత్రిక; డిసెంబరు 1980, మార్చి 1981
తాళ్ళపాక కవులు-వైష్ణవ సాహిత్య సేవ, శ్రీ ఎడ్లబాల కృష్ణారెడ్డి

తెలుగు వైజ్ఞానిక మాస పత్రిక - మార్చి 1987
మధ్య యుగాంధ్ర దేశంలో, చౌర్యం-శిక్షలు-వ్యాసము
రచయిత : శ్రీ దేవినేని ప్రసాదరావు



# అభినందన లేఖా మాలిక

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి | JET
శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారు | సీతానగరం
వేద విశ్వ విద్యాలయ వ్యవస్థాపకులు | 18-3-90

శ్రీమతే రామానుజాయ నమః

ప్రియ శ్రీమాన్! అనేక మంగళా శాసనములు. శ్రీ వైష్ణవ సంప్రదాయానికి తెలుగున గానరూపంలో విశిష్ట సేవలందించిన తాళ్ళపాక వారి సాహిత్యానికి సరైన సమన్వయం చేసి వెలికి తెచ్చేవారు లేరు. చేస్తున్న వారేదోరకంగా చేస్తున్నారు. ఆ రంగంలో ప్రవేశించిన మీరు, వారి సాహిత్యంలోని మధురిమను ఈ డాక్టరేటు ద్వారా మరింత వెలుగులోకి తెచ్చే ఒక సదవకాశాన్ని తిరువేంకటపతి మీకు అందిస్తూ యిచ్చిన పిలుపే డాక్టరేటు, దానిని జాగ్రత్తగ వినియోగపరచుకుంటారని ఆశిస్తున్నాను. మీకనేక మంగళాశాసనములు.

*  *  *

మీరు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పి.హెచ్.డి. డిగ్రీ పొందినందుకు సంతోషంగా ఉంది, ఈ అనుభవంతో మీరు తెలుగు సాహితిలోని మరికొన్ని మణులను గురించి పరిశోధిస్తారని ఆశిస్తూ శుభాకాంక్షలు అందిస్తున్నాను.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రొఫెసర్,
పద్మశ్రీ ***డా॥ సినారాయణరెడ్డి***
వైస్-ఛాన్సలర్, ఆం॥ప్ర॥ ఓపెన్ యూనివర్శిటీ

శ్రీ తాళ్ళపాక చిన్నన్న సాహిత్య సమీక్ష పరిశోధన నిబంధనం ప్రకటింపబడగలదని మీ పరిశోధనా ప్రతిభ ప్రజామోదం పొందగలదని భావిస్తున్నాను.

***'కళాప్రపూర్ణ' వేదుల సూర్యనారాయణశర్మ***
హైదరాబాద్

*Dear Sri Rajagopalacharyulu garu: I I am extremely happy to hear that you have been awarded the Ph. D. on Chinnanna's Sahitya sameeksha. You rightly deserve the Honour and we are all proud of you. As a person associated with Annamacharya Sahitya Propogation, it is a very satisfying news to me. with Regards -*

**P. V. R. K. PRASAD, I A S**
**Chairman, Port Trust**
**VISAKHAPATNAM**

"ఆంధ్ర విశ్వకళాపరిషత్తు" వారు మిమ్ము 'డాక్టరేట్' విచ్చి గుర్తించి నందుకు ఎంతో ఆనందంగా ఉన్నది. మీరు ఇంకా ముందు ముందు ఎంతగానో సాహిత్య సరస్వతిని సమారాధించాలనీ, ఇంకా ఎన్నో అవార్డులు అందుకోవాలనీ అభిలషిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను.

'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రి
గుంటూరు

"తాళ్ళపాక చిన్నన్న సాహిత్య సమీక్ష" గ్రంథము నిమిత్తము ఆంధ్ర విశ్వవిద్యాలయము వారిచే పి. హెచ్. డి. పట్టమును చేపట్టినవార్త ఆనేచనకమైనది. చేసిన కృషి సఫలమగుట భగవదనుగ్రహసిద్ధి. ఈ సందర్భమున హార్దమైన అభినందనములు, శుభాశంసనములు.

'కళాప్రపూర్ణ' మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి
రాజమండ్రి

ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి పి. హెచ్. డి. పట్టం పొందిన సందర్భంగా హార్దికమైన అభినందనలు. "భద్రం భద్రాభిలాషిణామ్".

ప్రొఫెసర్ తూమాటి దోణప్ప
హైదరాబాద్

నా శిష్యులలో Ph. D. కష్టపడి సంపాదించిన వారిలో అగ్రేసరుడవు నీవే. నిన్ను సందర్భమున సముచితముగా సత్కరించిన వ్యక్తులను, సంస్థలను నేనభినందించుచున్నాను.

*డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు*
రాజమండ్రి

"తాళ్ళపాక చిన్నన్న సిద్ధాన్త కృతికి డాక్టరేటు బిరుదమును దంబుమీఱ నందిన తరుణమందు నేనందఁజేయు నాశిషములివి "వర్ధిలుమా! సతంబు"

*డా॥ వేబోలు చిన్మయ బ్రహ్మకవి*
రాజమండ్రి

డాక్టరేట్ అందుకొన్నారు. మాకు గర్వకారణం. నాన్నగారి ఆశీర్వలానికి తోడుగా మీ కృషి ఉన్నది. అందుకే ఫలించింది. అభినందనలు.

మధుర (సినీ) *కవి రసరాజు - తణుకు*

'తాళ్ళపాక చిన్నన్న సాహిత్య సమీక్ష' అనే పరిశోధనా వ్యాసమునకు ఆంధ్ర విశ్వ విద్యాలయమువారు 'డాక్టరేటు' ప్రదానము చేయనున్నారను వార్త పత్రికలలో చూచి చాల సంతసించినాము. మీరు పలు గ్రంథకర్తలు, వినయ సంపన్నులు. పై పురస్కారమునకు మీరెంతయు తగియున్నారు. శుభాకాంక్షలు. భవిష్యత్తులో మీరు సాహిత్య సేవలో ఇంకను ఉన్నత శిఖరాల నందుకోవాలని, అందుకు తోడ్పడవలసినదిగా భగవంతుని ప్రార్థిస్తూ-

*గరిమెళ్ళ అమృతరామారావు*
అధ్యక్షులు : తెలుగు సాహితీ సమాఖ్య
తాడేపల్లిగూడెం

50579
TIRUPATI



మీరు వి[illegible]క్షేత్రంలో కృషిచేసి పరిశోధించి పండించిన ఒక వ్యాసానికి విశ్వవిద్యాలయంవారు డాక్టరేట్ ఇచ్చుట సరస్వతిని గౌరవించ డమే. మీ ప్రతిభకు గౌరవం లభించింది. మీ వంటి పండితుల వలన భీమవరం ప్రతిష్ఠ మరింత పెరిగింది. ఆపరాత్పరుడు మీకు ఆయురారోగ్యా లను సాహితీ సంపత్తిని ఇవ్వాలని కోరుచున్నాను.

'అభినవ భోజ' *గన్నాబత్తుల పెదతాత*

అధ్యక్షులు : రామరాజభూషణ సాహిత్య పరిషత్, భీమవరం

మీరు భీమవరం సాహిత్య సభలలో పాల్గొని రంజింప చేయటం చూసాను. అలాగే మీరు ఇది వరకు వ్రాసిన గ్రంథాలు చదివి ఆనందించాను. ఇప్పుడు పి.హెచ్.డి. డిగ్రీ పొందాలంటే మరింత సంతోషంగా ఉంది. మీకు వేంకటేశ్వరస్వామి ఆయురారోగ్యములిచ్చుగాక! అని ప్రార్థిస్తున్నాను

*బొండా నాగేశ్వరరావు*

అధ్యక్షులు : కళా స్రవంతి, భీమవరం

మీకు పి. హెచ్. డి. వచ్చినందుకు ఎంతగానో ఆనందించాను. తెలివైనవారు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటారే తప్ప వాటికోసం ఎదురు చూసి ప్రాకులాడరు. అదేవిధంగా మీరు అవకాశాన్ని వినియోగించు కొని స్వయం శక్తితో Ph. D. సాధించారు. అభినందనలు.

*తటవర్తి వెంకటరత్నం* (ముత్తాత)

**Ex. Treasurer : D. N. R. College Associotion,**

భీమవరం.

తాళ్ళపాక చిన్నన్నను గురించి పరిశోధించిన అన్నన్నా- తెలుగు జాతికి మీ పరిశోధన ద్వారా అమూల్యమైన కానుక నందించారు. పరిశోధనా ప్రభాకరులు కావాలని ఆకాంక్ష. మీ అభ్యుదయం మాకు ఆనందం.

*వెలుకువాడ వెంక(టా)మయ్య*

విస్సాకోడేరు.